సరస్వతీ గ్రంథమండలి :

చివరకు మిగిలేది

(ఆరెకరాల ఎనిమిదికుంటలు)

అనువాదకులు

పురిపండా అప్పలస్వామి

ఒడియా భాషలో ఆధునాతనమైన నవలా రచయిత శ్రీ మోహాపాత్ర. ఆయన బాంబుకంటె బారుణమైన ఈయన కొట్టిన దెబ్బకి తిరుగు లేదు.

యూరోపు అమెరికా సంస్కారాల నాటి ఒడియా దేశమూ, ఒడియా ఆచారమూ కళ్ళకి కట్టినట్లు చూపుతుంది చదివి చూసి ఆనందించండి. ఇందులోని ఏ పాత్రనయినా ఒకసారి పలకరించి చూడండి - ఎన్నటికీ మరచిపోలేమీను.....

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. _____ *Acc. No.* _____

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

20 MAR 88 7/3/88

సరస్వతీ గ్రంథమండలి :

వీరభారతం

1857 భారతీయ స్వాతంత్ర్యసమరం

పురిపండా అప్పలస్వామి

పబ్లిషర్స్ : అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

అన్ని హక్కులూ
ప్రకాశకులవి



T
954 0317
A 48V

ప్రథమ ముద్రణం 1957
వెల : ఆరు రూపాయలు

రాజమహేంద్రవరం
అద్దేపల్లి నాగేశ్వరరావుచే సరస్వతీ పవర్ ప్రెస్సులో ముద్రింపబడి,
అద్దేపల్లి అండు కో వారిచే ప్రకటింపబడింది.
ఆర్డరు నెం. 583/1957

భారతదేశచరిత్రలో బ్రిటిషువాళ్ళ పరిపాలకు లయినపుట్టం విచిత్రమైంది. దొంగ దాయలతోక్కి ఇక్కడ దొరలయారు వాళ్ళు. అంతకిముందు పైదేశస్థులు లిక్కడ రాచరికం చేశారంటే, వాళ్ళు ఈదేశంలోనే స్థిరపడిపోయారు; భారతీయులే అయి పోయారు. మరోదేశానికి ఈదేశం చానిసదేశంగా తయారుచేయలేదు వాళ్లు. బ్రిటిషువాళ్లు అలా కాదు, తమదేశంకోసమే మనదేశం వినియోగించుకున్నారు. ఇది వ్యక్తం కావడంతోనే భారతజాతి బద్దకుంది; ఫరంగిజాతిని పారదోలడానికి కంకణం కట్టుకుంది. ఆదిగో దాని పరిణామమే 1857 మహావిప్లవం.

స్వరాజ్యం కోసమే, స్వధర్మంకోసమే ఆపోరాటం జరిగింది. ధనికులూ దరిద్రులూ జమీందారులూ రైతులూ, రాజులూ ప్రజలూ, హిందువులూ మహమ్మదీయులూ యావన్మంది ఆ రణయజ్ఞంలో పాల్గొన్నారు; త్యాగాలు చేశారు; ప్రాణాలు బలి పెట్టారు. అయితే చాలామంది బ్రిటిషువాళ్లు ఈచరిత్రకి మసిపూశారు; నిజం కప్పి పుచ్చడానికే ప్రయత్నించారు. దేశవ్యాప్తంగా సాగిన అసమానం పోట్లిసిపాయిల పితూరీ అన్నారు. స్వార్థపరుల కుట్ర అన్నారు. ఎన్నవేమన్నా భారతీయుల ప్రథమ స్వాతంత్ర్యసమరమే అది. నిస్సందేహమైన సత్యమది. వీరభారతం చదవండి, ఈసత్యమే వ్యక్తమవుతుంది. వీరభారతం నేను రాయడానికి కారకులు భూపాపోషకులూ, సహృదయులూ అయిన శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావుగారు. వారిప్రోత్సాహమే లేకపోతే ఇది రాయగలిగేవాణ్ణి కాను. అవసరమయిన గ్రంథసామగ్రికోసం వ్యయంకూడా వారే భరించారు. వారికోసమే ఇది రాశాను. ఈరచనకు నాకుతోడ్పడ్డ గ్రంథాలు ఇంకోచోట వివరించాను. అవేకాను, ఇంకా కొన్ని చరిత్రగ్రంథాలూ, పత్రికలూ, వ్యాసాలూకూడా ఉపకరించాయి. వీటి రచయితల కందరికీ నేను ఋణపడుతున్నాను.

కవితా సమితి
విశాఖపట్నం
10 — 5 — 57

పురిపండా అప్పలస్వామి

ప్రకాశకుల విజ్ఞప్తి

ప్రథమ భారతీయస్వాతంత్ర్యసమరం జరిగి వందసంవత్సరాలయింది. స్వతంత్రభారత దేశం దాని శతవార్షికమహోత్సవం జరుపుకుంటున్న దిప్పుడు. చారిత్రికమయిన ఈ పవిత్రసమయంలో ఆ సమరచరిత్ర 'వీరభారతం' ప్రచురించి ఆంధ్రసోదరుల కందించగలిగినందుకు సంతోషంగా వుంది. వీరభారతం రచయిత శ్రీ పురిపండా అప్పలస్వామిగారు సుప్రసిద్ధాంధ్రరచయితలు. ద్వితీయస్వాతంత్ర్యసమరం సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్న జాతీయవాదులు; దేశారాధకులు. మేము కోరడంతోనే ఈ చరిత్రగ్రంథం మాగ్రంథమాలకిచ్చారు.

మేమెరిగినంతవరకూ 1857 స్వాతంత్ర్యసమరచరిత్ర ఇంత సమగ్రమైనది ఇంతవరకూ తెలుగులో రాలేదు. పాఠకమహాశయులకు దీని ప్రాశస్త్యం ప్రతీపుటలోనూ కనిపిస్తుంది. స్వాతంత్ర్యప్రియులయిన ఆంధ్రసోదరులూ సోదరీమణులూ వీరభారతం యథోచితంగా ఆదరించి మమ్మల్నిప్రోత్సహిస్తారని ఆశిస్తాము.

రాజమహేంద్రవరం
30—7—57

అద్దేపల్లి నాగేశ్వరరావు
ప్రకాశకులు

విషయ సూచిక

తొలి పర్వం 1 – 95

సబ్‌లాల్ హోజాయగా	1	హైదరాబాదు	42
కావలిసినన్ని కారణాలు	4	అయోధ్య	43
పంజాబుమీద ఎర్రరంగు	7	ఢిల్లీపాదుషా	51
పెగూ కబళించడం	11	నానాసాహెబు	57
దత్తత నిషేధం	13	కిరస్తానం	61
సతారా	15	సిపాయిలు	72
నాగపురం	22	అజీముల్లాఖాను	77
ఝాన్సీ	28	తుఫానుకి ముందు	81
సంబలపురం	37	నానాసాహెబు తీర్థయాత్ర	88
తంజావూరు	38	ఎర్రపద్మమూ—చపాతీ	90
ఆర్కాటు నవాబు	40	కొవ్వుతూటాలు	92

మలి పర్వం 96 – 341

మంగలపాండే	96	కాన్పూరు రక్తాభిషేకం	193
అగ్ని! అగ్ని!!	100	హైదరాబాదు	209
మారో ఫరంగీకో!	102	ఢిల్లీ కురుక్షేత్రం	213
ఆకుపచ్చజెండా	108	కాన్పూరు ముట్టడి	220
కుంపినీ దండయాత్ర	123	అజనాలా చీకటికొట్టు	229
విప్లవం ప్రజ్వరిల్లింది	129	లావలకు తిరోగమనం	233
రోహిలాఖండం	129	బహదూరుషాని బంధించారు	237
కాశీ	138	ఢిల్లీలో రాక్షసరాజ్యం	249
అలహాబాదు	144	లక్నో రణరంగం	254
అయోధ్య	149	గ్రేట్ హెడ్	269
ఝాన్సీ	158	తాంతియాటోపే	271
గ్వాలియరు	162	ఫతేగడం	277
నీమచి	163	లక్నో పడిపోయింది	280
ఇందూరు	164	కుమారసింహుడు	289
ఆగ్రా	164	అమరసింహుడు	298
బంగడేశం	165	ఆహమదుషా	301
బీహారు	167	అహమదుషా హత్య తరవాత	309
పంజాబు	173	ఝాన్సీరాణి లక్ష్మీబాయి	312
నీలుదొర ఘోరాలు	183		

తుది పర్వం 342 – 368

దామోదరరావు	342	తాంతియాటోపే పురి	352
కుంపినీ ఏలుబడి కూలిపోయింది	345	ఆశ్వాసాంతం	365

కొన్ని తారీకులు 369

ప్రకాశకుల విజ్ఞప్తి

ప్రథమ భారతీయస్వాతంత్ర్యసమరం జరిగి వందసంవత్సరాలయింది. స్వతంత్రభారత దేశం దాని శతవార్షికమహోత్సవం జరుపుకుంటున్న దిప్పుడు. చారిత్రికమయిన ఈ పవిత్రసమయంలో ఆ సమరచరిత్ర 'వీరభారతం' ప్రచురించి ఆంధ్రసోదరుల కందించగలిగినందుకు సంతోషంగా వుంది. వీరభారతం రచయిత శ్రీ పురిపండా అప్పలస్వామిగారు సుప్రసిద్ధాంధ్రరచయితలు. ద్వితీయస్వాతంత్ర్యసమరం సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్న జాతీయవాదులు; దేశారాధకులు. మేము కోరడం తోనే ఈ చరిత్రగ్రంథం మాగ్రంథమాలకిచ్చారు.

మేమెరిగినంతవరకూ 1857 స్వాతంత్ర్యసమరచరిత్ర ఇంత సమగ్రమైనది ఇంతవరకూ తెలుగులో రాలేదు. పాఠకమహాశయులకు దీని ప్రాశస్త్యం ప్రతీపుటలోనూ కనిపిస్తుంది. స్వాతంత్ర్యప్రియులయిన ఆంధ్రసోదరులూ సోదరీమణులూ వీరభారతం యథోచితంగా ఆదరించి మమ్మల్నిప్రోత్సహిస్తారని ఆశిస్తాము.

రాజమహేంద్రవరం
30—7—57

అద్దేపల్లి నాగేశ్వరరావు
ప్రకాశకులు

విషయ సూచిక

తొలి పర్వం 1 – 95

సబ్‌లాల్ హోజాయగా	1	హైదరాబాదు	42
కావలిసినన్ని కారణాలు	4	అయోధ్య	43
పంజాబుమీద ఎర్రరంగు	7	ఢిల్లీపాదుషా	51
పెగూ కబళించడం	11	నానాసాహెబు	57
దత్తత నిషేధం	13	కిరస్తానం	61
సతారా	15	సిపాయిలు	72
నాగపురం	22	అజీముల్లాఖాను	77
ఝాన్సీ	28	తుఫానుకి ముందు	81
సంబలపురం	37	నానాసాహెబు తీర్థయాత్ర	88
తంజావూరు	38	ఎర్రపద్మమూ—చపాతీ	90
ఆర్కాటు నవాబు	40	కొవ్వుతూటాలు	92

మలి పర్వం 96 – 341

మంగలపాండే	96	కాన్పూరు రక్తాభిషేకం	193
అగ్ని! అగ్ని!!	100	హైదరాబాదు	209
మారో ఫరంగీకో!	102	ఢిల్లీ కురుక్షేత్రం	213
ఆకుపచ్చజెండా	108	కాన్పూరు ముట్టడి	220
కుంపినీ దండయాత్ర	123	అజనాలా చీకటికొట్టు	229
విప్లవం విజృంభించింది	129	హావలకు తిరోగమనం	233
రోహిలాఖండం	129	బహదూరుషాని బంధించారు	237
కాళీ	138	ఢిల్లీలో రాక్షసరాజ్యం	249
అలహాబాదు	144	లక్నో రణరంగం	254
అయోధ్య	149	గ్రేట్ హెడ్	269
ఝాన్సీ	158	తాంతియాటోపే	271
గ్వాలియరు	162	ఫతేగడం	277
నీమచి	163	లక్నో పడిపోయింది	280
ఇందూరు	164	కుమారసింహుడు	289
ఆగ్రా	164	అమరసింహుడు	298
వంగదేశం	165	అహమదుషా	301
బీహారు	167	అహమదుషా హత్య తరవాత	309
పంజాబు	173	ఝాన్సీరాణి లక్ష్మీబాయి	312
నీలుదొర ఘోరాలు	183		

తుది పర్వం 342 – 368

దామోదరరావు	342	తాంతియాటోపే వురి	352
కుంపినీ ఏలుబడి కూలిపోయింది	345	అశ్వాసాంతం	365

కొన్నితారీకులు 369

చిత్రసూచిక

1. మహారాజు గంగాధరరావు (రాణీ లక్ష్మీబాయి భర్త)
2. ఝాన్సీరాణి కోట
3. బితూరు దుర్గం
4. నానాసాహేబు
5. ఆసరబుల్ హోవలకు, సర్వసేనాని సర్ కాలిను కాంబెలు, గవర్నరు జనరలు కానింగు, జనరలు హ్యూట్రాము, సర్ జాన్ లారెన్సు
6. కుమారసింహుడు
7. గ్వాలియర్ దుర్గం
8. కాశ్మీరు దర్వాజా
9. పాదుషా బహదూరుషాని బంధించిన హుమాయూన్ సమాధి
10 పాదుషా బహదూరుషా (బర్మాలో చివరిదినాలు)
11. బీగము జన్నతుమహలు (బర్మాలో చివరిదినాలు)
12. తాంతియాటోపే
13. తాంతియాటోపే కాలపీ యుద్ధం
14. కైజరుబాగు
15. మియామీరు కవాతు మైదానం
16. రాణీ లక్ష్మీబాయి
17. ఇంగ్లీషుసేన చీల్చుకుంటూ రాణీ లక్ష్మీబాయి ఝాన్సీ వొదిలిపెట్టింది

సహాయపడిన గ్రంథాలు

Empire in Asia : How We Came By It : W. M. Torrens
An Advanced History of India (Part III) Majumdar, Rayachaudari & Kalikinkar Datta

Discovery of India : Jawaharlal Nehru.
Story of Satara : Major B. D. Basu.
Consolidation of the Christian Power in India : Major B. D. Basu.
A History of the Sepoy War in India : Sir John William Kaye.
The Sepoy Revolt : Henry Mead.
The Indian War of Independence 1857 : V. D. Savarkar.
1857 The Great Rebellion : Asoka Mehta.

जगत शेठ - पारसनाथ सिंह
ओडिसा इतिहास - (ओडिआ) डा. हरेकृष्ण महताब
सिपाही - युद्धेर इतिहास (बंगाली) - रजनीकांत गुप्त
सन् ५७ का विप्लव - बेनीप्रसाद बाजपेयी
सन् १८५७ का ग़दर
देहली का किला
महरानी झाँसी

నేటి భారతదేశం – రజనీ పామీదత్తు (విద్వాన్ విశ్వం)
బ్రిటిషు మహాయుగం – బి. డి. బసు (మానికొండ)

వీరభారతం

వీరభారతం

1857
భారతీయ స్వాతంత్ర్య సమరం
తొలిపర్వం

సబ్ లాల్ హోజాయగా

సబ్ లాల్ హోజాయగా! – భారతదేశపటంలో ఇంగ్లీషువాళ్ళు ఆక్రమించిన భాగాల ఎర్రరంగు చూసి రంజిత్సింగు అన్న మాట లివి. భారతదేశం యావత్తూ ఇంగ్లీషువాళ్లు ఆక్రమించేస్తారని అతడి భావం. భారత స్వాతంత్ర్య సమరం సాగించిన సిపాయిలు ఆమాటలే తమ విప్లవానికి సాంకేతికంగా చెప్పుకుని సైగలు చేసుకున్నారు. అంటే– ఇంగ్లీషువాళ్ళ రక్తంతో భారతదేశం యావత్తూ ఎర్రవడి పోతుం దని వాళ్ళ భావం. రెండూ నిజమే చేసింది చరిత్ర.

ప్లాసీయుద్ధంతో బ్రిటిషుసామ్రాజ్యానికి పునాదిరాయి వేశాడు క్లయివు. అది 1757 లోని మాట. ఆపునాదిలోనే 1857 మహావిప్ల వానికి బీజాలున్నూ అతడే నాటాడు. నిజానికి ప్లాసీయుద్ధ మొక యుద్ధం కాదు. విజయం సాధించినవాడు క్లయివున్నూ కాదు. జగత్సేటు మహతాబురాయీ, అమీచందూ, మీర్జాఫరూ, రాజా దుర్లభ రాయీ మొదలయినవాళ్ళ కుట్రా, క్లయివు చేసిన ఫోర్జరీ – ఇవే ఆగెలుపుకి కారణాలు. ప్లాసీయుద్ధం పరిణామం వెంటవెంటనే బంగాళా దేశంలో ప్రత్యక్షమయింది. పేరుకిమాత్రం నవాబు కాని "క్లయివు

గారి గాడిద" గా తయారయాడు మిార్జాఫరు. కుంపినీ దొంగవ ర్తకం దోపిడీకింద మారింది. బంగాళమూ, బీహారూ, ఒడిశా దేశాల దివానుగిరీ కుంపినీ చేతికి వచ్చింది. అయిదేళ్ళు దాటాయో లేదో, కాటకాల పెద్దమ్మ తలవిప్పుకు ప్రళయతాండవం చేసింది. ఆకాటకంలో కూటికి లేక కోటిమంది మరణించారు. రోగాలపాలబడ్డవాళ్ళు లెక్కా- జమా లేదు. దేశం వల్లకాడయింది. లండనుతో సమానమైందని క్లయివు వర్ణించిన మూర్షిదాబాదు నిర్మానుష్య మయింది. ఢాకాపట్నం జన సంఖ్య లక్షాయాభై వేలనించి నలభై వేలకి దిగిపోయింది. పరిశ్రమలు పాడయాయి. పంటలు మంట కలిశాయి. పన్నులభారం దుర్భర మయింది. భారతదేశం మోడయింది. ఇంగ్లాండు కలకలలాడింది. కొత్తపరిశ్రమలూ, కొత్తయంత్రాలూ అక్కడ చిగుళ్ళు తొడిగాయి.

"ప్లాసీయుద్ధం అయిన వెంటనే బెంగాలులో కొల్లగొట్టిన డబ్బు లండను ప్రవహించింది. ప్లాసీయుద్ధం 1757 లో జరిగింది. 1760 లో పొగబండి వచ్చింది. 1764 లో హార్‌గ్రీవ్సు వడుకుయంత్రం కనిపెట్టాడు. 1768 లో వాట్సు మంచి ఆవిరియంత్రం చేశాడు. 1776 లో క్రాంప్టను వడుకుయంత్రం తయారుచేశాడు. 1785 లో కార్డ్‌రైటు మరమగ్గం నిర్మించాడు. ప్రపంచం పుట్టినప్పటినించీ, భారతదేశం దోపిడివల్లవచ్చి నంతలాభం ఏపెట్టుబడీ, ఎక్కడా సంపాదించి వుండదు"*

క్లయివు తరవాత వారనుహేస్టింగ్సు తెరమీదికి వచ్చాడు. క్లయివే ఇతడికి ఎారవడి. ఇద్దరూ మొదట కుంపినీలో గుమాస్తాలే. క్లయివు ఇంగ్లాండులో పోకిరీగా ఉండి, కుంపినీ గుమాస్తాగా మద్రాసు వచ్చాడు. కలం పారేసి కత్తి పుచ్చుకున్నాడు. ప్లాసీయుద్ధంతో

* Brooke Adams: 'The Law of Civilization and Decay' పామిదత్తు 'నేటి భారతదేశం' నించి.

గొప్ప వీరుడయి పోయాడు. తుదకి ప్రభుకోటిలో చేరిపోయాడు. క్లయివు కలకత్తాలో ఉన్నప్పుడు హేస్టింగ్సు కలకత్తాలోనే కుంపినీ గుమాస్తాగా వుండేవాడు. నెలకి నలభై రూపాయలు జీతం. ఇంటికి వెళ్ళిపోయి తిరిగి గవర్నరుగా వచ్చాడు. గవర్నరుజనరలూ అయాడు. ఈ ఇద్దరు కుంపినీ గుమాస్తాలూ పెద్దలయి సుమారు ఇరవయ్యేళ్ళ పాటు భారతదేశం భాగ్యనిర్ణేత లయారు.

ప్లాసీయుద్ధంతో దేశీయుల హృదయాల్లో క్లయివు నిప్పులు పోశాడు. అవి ఆరిపోకండా హేస్టింగ్సు వూదరగొట్టాడు. ఇతడు ఇండియాలో చేసిన ఘోరాలికి ఇతడిమీద పార్లమెంటులో ఏడేళ్ళు నడిచిన కేసే ఒక పెద్ద నిదర్శనం. కాశీ, రోహిలాఖండమూ, అయోధ్యల్లో హేస్టింగ్సు ఆరనిచిచ్చుపెట్టాడు. తరవాత వచ్చిన వెలస్లీ మైసూరూ, మహారాష్ట్రమూ, ఉత్తరహిందూస్థానాల్లో మంటలు పెట్టాడు.

వర్తకానికని ప్రాధేయపడుతూ వచ్చిన బ్రిటిషు బేహారులు ఇక్కడ ముందు చిన్నచిన్న స్థలాలు సంపాదించుకున్నారు. ఇల్లుదూరి వాసాలు లెక్కపెట్టారు. తల్లిపాలుతాగి తల్లిరొమ్ము గుద్దారు. దేశీయ రాజులలో పొరపొచ్చాలు పెట్టారు. వాళ్ళలో ఐక్యమత్యం లేకపోవడం వినియోగించుకున్నారు. వాళ్ళ యుద్ధాల్లో చేతులు దూర్చారు. తప్పుడు పత్రాలు పుట్టించారు. కల్లోలాలు రేపెట్టారు. పటాలాలు పంపి అరదండాలు వేశారు. చీటీముక్కలతో పట్టణాలు ముట్టడించారు. బాకీ మిషపెట్టి సింహాసనాలు కూలదీశారు. ఒకచేత్తో రాజాధికారమూ, వొకచేత్తో దొంగతనమూ చేశారు. దేశం కొల్లగొట్టారు. ఇండియా తయారీసరుకులు ఇంగ్లాండుకి రాకూడదన్నారు. నేతపనివాళ్ళ ఎముకలు మైదానాల్లో చలవచేయించారు. జనాకీర్ణమైన ప్రదేశాలు కీకారణ్యాలు చేశారు.

సరుకులకోసం ఫ్యాక్టరీలు కట్టారు. ఫ్యాక్టరీలు కోటలయాయి. కోటలల్లా దుర్గా లయాయి. సరుకులు కాపలాకి జవాన్లు తయారయారు. జవాన్లు సిపాయిలగుంపు లయారు. సిపాయిల గుంపులు పటాలా లయాయి. సరుకుల కాపలాలు దండయాత్ర లయాయి. దండయాత్రలు దేశా లాక్రమించడా లయాయి.

ప్లాసీయుద్ధం జరిగిన తొంభై సంవత్సరాలనాటికి భారతదేశం బానిసదేశమే అయిపోయింది. పెద్దపెద్ద సంస్థానాలు కూలిపోయాయి. నవాబులు ఫకీర్లయారు. రాజులు జోగు లయారు. ప్రజలు అన్నమో రామచంద్రా అంటూ అల్లాడిపోయారు. డిల్లీ పాదుషా రెక్కలూడిన పక్షి అయిపోయాడు. దేశంలో పంచాయితీలు నశించాయి. శాశ్వత మయిన సెటిలుమెంటువల్ల రైతుల అవస్థ తారుమారయింది. సురాజుద్దౌలానాడు బెంగాలులో పన్ను 817,000 పౌనులుంటే, ఈపర్మనెంటు సెటిలుమెంటులో 3,400,000 పౌనులికి పెరిగింది. ఎక్కడ ఎని మిదిలక్షలు, ఎక్కడ ముప్ఫయినాలుగులక్షలు!

తెల్లవాళ్ళంటే రాక్షసులని భయపడ్డారు జనం. ప్రతీచోటా అసంతృప్తి ప్రబలింది. ద్వేషం రాజ్యంచేసింది. ఈ తెల్లపీడ ఎప్పుడు విరుగుతుందిరా బాబూ అంటూ ప్రజలు నెత్తిమీద చేతులు పెట్టుకు కూచున్నారు. చివరికి అంతా ఎర్రవడిపోతుం దన్న రజత్సింగు రాజ్యం మీదకూడా గాఢమయిన ఎర్రరంగు అలుముకుంది. మరిప దేళ్లు దాటకండా బ్రహ్మాండమయిన స్వాతంత్ర్యయుద్ధం ప్రళయంలా ముంచుకువచ్చింది. భారతదేశం రక్తం నదులతో ఎర్రవడిపోయింది.

కావలిసిన్ని కారణాలు

1857 స్వాతంత్ర్యసమరానికి కారణా లేమిటి? పెద్దపెద్ద చరిత్ర కారులే వేసుకున్నా రీప్రశ్న. ఎంతోమంది ఎన్నో కారణాలు చెప్పారు.

గవర్నరుజనరలు డల్హౌసీ దత్తతస్వీకారనిరోధం ప్రవేశపెట్టి యొక్కొక్క దేశీయరాజ్యమూ కబళించడమే ఈమహావిప్లవానికి కారణమన్నారు కొందరు. డిల్లీచక్రవర్తిని గద్దెదించేసి అవస్థలు పెట్టడమే కారణమన్నారు కొందరు. హిందువుల్నీ మహమ్మదీయుల్నీ కిరస్తానంలో కలపడానికి ప్రయత్నం చెయ్యడమే దీనంతటికీ కారణమన్నారు మరి కొందరు. "ఇది యొకి సిపాయిల తిరుగుబాటు. సిపాయిల అసంతృప్తే దీనికి కారణం. ఆవుకొవ్వూ, పందికొవ్వూ పూసిన తూటాలే దీనంత టికీ మూలం" అన్నాడు ఆదినాళ్లో పంజాబు చీఫ్‌కమీషనరుగా వున్న సర్ జాను లారెన్సు.

"పనీపాటూ లేని పొగరుబోతు సిపాయిలే ఈవిప్లవానికి కారణం" అన్నాడు షాడ్డుబరీ.

"కుంపినీప్రభుత్వం కూలదొయ్యడానికి భారీఎత్తుమీద మహమ్మదీయులు పన్నిన కుట్రే దీనికి కారణం" అన్నాడు జేమ్సు అవుట్రాము.

"అవును ఈ విప్లవానికి హిందువులు కారణం కాదు. మహమ్మదీయులే కారణం. ఇదంతా వాళ్ళ కుట్రే. హిందువులు వాళ్ళచేతి కీలు బొమ్మలు" అన్నాడు హెన్రీ హామింగ్టను, థామసు.

"నమ్మినవాళ్ళని ఇంగ్లీషువాళ్లు చెరచడమే ఈవిప్లవానికికారణం" అని యొక్కముక్కలో చెప్పాడు కర్నలు మాల్సను.

అసలు ప్లాసీయుద్ధంనాటినుంచీ ఈ నూరేళ్ళూ – ఇంకా ఆమాటకి వస్తే తెల్లవాళ్ళు భారతభూమిమీద అడుగుపెట్టిన దగ్గిరనించీ ఇక్కడ చేసిన ఘోరాలే భారతీయ స్వాతంత్ర్య సమరానికి కావలిసినన్ని కారణాలు. అవన్నీ ఏకరువుపెడితే భారతం కాదు మహాభారతం అవుతుంది. ఇంతా జరిగాక ఏ దేశంలోఅన్నా విప్లవం లేవలేదూ

అంటే ఆ దేశంప్రజల్లో చైతన్యం లేదన్నమాట! ఆదేశం ధేళమంటే మనుషులు కాదు, మట్టి అన్నమాట!

స్వాతంత్ర్యం ప్రతీప్రాణికీ జన్మహక్కు. ప్రాణంకంటే స్వాతంత్ర్యం ప్రియమైంది. ఒకజాతి స్వాతంత్ర్యం మరొకజాతి హరించినప్పుడు, ఆజాతి సమరం చెయ్యడం సహజం.

1688 లో ఇంగ్లాండులో రక్తరహితవిప్లవం జరిగింది. 1775 లో అమెరికాలో స్వాతంత్ర్యసమరం జరిగింది. 1789 లో ఫ్రెంచివిప్లవం జరిగింది. 1917 లో రష్యాలో సామ్యవాదవిప్లవం జరిగింది. అలాగే భారతదేశంలో 1857 లో మహావిప్లవం జరిగింది. అంతేకాదు, అంతకి ముందునించీకూడా భారతదేశంలో విప్లవాలు జరిగాయి. 1824 లో బరన్‌పురంలోనూ; 1826-27 లో ఉమాజీ నాయకత్వంకింద పూనాలోనూ విప్లవాలు రేగాయి. 1831-33 లో బీహారులో జరిగిన విప్లవంలో ఎంతో జననష్ట మయింది. 5,000 చదరపుమైళ్ళ ప్రదేశం ధ్వంసమయింది. 1844 లో సావంతవాడి విప్లవం అవుట్రాము పదివేల మందిని ప్రయోగించినా 1857 వరకూ ఆగలేదు. 1848 లో కాంగ్రా జిస్వార దాతారపురం రాజులు గురునానకు వంశానికి చెందిన చౌడీ విక్రమసింగు నాయకత్వం కింద తిరుగుబాటు చేశారు. ఒడిశాలో ఖుర్దాసిపాయిలూ, ఘుంసూరు భంజులూ విప్లవం చేశారు.

స్వరాజ్యం కోసం, స్వధర్మం కోసం భారతీయుల్లో కలిగిన మహా చైతన్యమే 1857 స్వాతంత్ర్యసమరానికి ముఖ్యకారణం. స్థూలంగా కనపడే ఇతరకారణా లన్నీ దానికి అంగాలు. అంగాలే కాదు దానికి దోహదాలు కూడా. అందుకని వాటిని అవగాహన చేసుకోడం చరిత్రదృష్ట్యా ఎంతయినా అవసరం.

1848 లో డల్హౌసీ గవర్నరు జనరలుగా దిగాడు. ఇండియా దేశపటం చూశాడు. ఎర్రరంగు హెచ్చుగానే వుంది. అయినా అక్కడా అక్కడా బొల్లిబొల్లిగా అవుపిస్తోంది. అవి స్వదేశసంస్థానాలు. "వాటికి కూడా ఎర్రరంగు పులిమేస్తే - అంతా ఎర్రగా ఎంచక్కా అవుపిస్తుంది!" అనుకున్నాడతడు. ఆపని కాస్తా తాను చేసేస్తే బ్రిటిషు సామ్రాజ్య స్థాపకుల్లో తనపేరు బంగారం అక్షరాల్లో అక్షరంగా వుండిపోతుంది! అందుకని రాజ్యదాహం పట్టుకుం దతడికి. ఆరాజ్యదాహమే 1857 మహావిప్లవానికి పెద్దకారణమయింది. భారత దేశపటం మీద ఎర్రరంగు పూసినవాళ్ళలో డల్హౌసీయే చిట్టచివరి వాడు. అతడి తరవాత మిగిలిన వాటికి ఎరుపు తగలలేదు.

వెల్లస్లీ ప్రవేశపెట్టిన సహకార పద్ధతి (Subsidiary Alliances Scheme) వల్ల అడ్డెసేనలు గుదిబండ లయీ, రెసిడెంట్లు వచ్చి తిష్ఠ వేసి, రాజ్యంలో రెచ్చగొడుతున్న అంతఃకలహాల వల్ల అశాంతి ప్రబలీ, బలవంతంగా రుద్దిన వొడంబడికలు కక్కుకలకళ్ళా లయీ అప్పటికే అంతంతగా వున్నారు సంస్థానాధిపతులు. ఎదిరించి నిభాయించగల శక్తి వాళ్ళలో అంతరించింది. అంచేత అనాయాసంగా వాళ్ళ రాజ్యాలు ఆపోశనం పట్టెయ్యవచ్చు. అందుకోసమే సీమదొరలు ఎన్నాళ్ళయో కనిపెట్టుకు కూచున్నారు. ఇక కార్యం కానియ్యమని డల్హౌసీకి ఇసారా ఇచ్చారు. డల్హౌసీ ప్రారంభించాడు.

పంజాబు మీద ఎర్రరంగు

రంజిత్సింగు కాలం నించీ కుంపినీవాళ్ళు పంజాబుమీద కన్ను వేశారు. అతడిదగ్గిర వున్న ధనరాసులూ, కొహినూరు వజ్రమూ వాళ్ళ కన్నుకుడుతూ వుండేది. పైకిమాత్ర మతడితో స్నేహం కట్టారు. చెరిచేముందు స్నేహంకట్టడం బ్రిటిషునీతి. 1839 లో

రంజిత్సింగు కాలంచేశాడు. 1846 లో ఎలెనుబరో గవర్నరుజనరలుగా వచ్చాడు. పంజాబులో అంతఃకలహాలు రేపెట్టాడు. అరాజకం పుట్టించాడు. పంజాబు కబళించడానికి అన్ని ఏర్పాట్లూ చేశాడు. ఇంతలో అతణ్ణి సీమమంత్రులు తొలిగించేశారు. హార్డింజిని గవర్నరు జనరలుగా పంపించారు. ఈహార్డింజి ఎలెనుబరో అడుగుజాడల్లోనే నడుచుకున్నాడు. సిక్కులతో యుద్ధంచేసిన కీర్తి ఇతడికే దక్కింది.

రంజిత్సింగు కాలం చేశాక అతడి కుమారుడు దిలీపసింగు రాజ్యానికి వచ్చాడు. అయితే అతడికి మైనారిటీ వెళ్ళలేదు. రంజిత్సింగు రాణీ ఝిందా రాజ్యమేలుతూ వుండేది. ప్రధానమంత్రి లాలుసింగు ఈమెకి చోదకుడు. లాలుసింగూ, సేనాధిపతి తేజసింగూ, జమ్మూ రాష్ట్రాధిపతి గులాబుసింగూ, - ఈముగ్గిరిమీదా రాణీరాజ్యం నడుస్తూ వుండేది. ఈముగ్గురికీ పెద్దపెద్ద ఆశలుపెట్టారు కుంపినీవాళ్ళు. తమ వల్లో వేసుకున్నారు. ఈముగ్గురు ద్రోహంవల్లే పంజాబు పతనమయి పోయింది.

1809 లో కుంపినీవాళ్ళు రంజిత్సింగుతో స్నేహంకట్టారు; ఎంతో ఎడంబడిక చేసుకున్నారు. దానిప్రకారం సత్లజునది కుడితట్టు రాజ్యం సిక్కులది. ఎడమతట్టురాజ్యం కుంపినీది. తమ భాగంలో ఫిరోజపురం, లూధియానా, అంబాలా, మీరటులలో పెద్ద పెద్ద సైన్యాలు పెట్టుకుని, యుద్ధానికి మిషవెదుకుతూ కూచున్నారు ఇంగ్లీషు వాళ్ళు. సత్లజుమీద కూడా యుద్ధనావలు సిద్ధంచేశారు. తుదకి లాలుసింగు తేజసింగుల కుట్రవల్ల సాకు దొరికింది. యుద్ధం జరిగింది. సేనాధిపతి ద్రోహంవల్ల శిక్కులు ఓడిపోయారు. 1846 మార్చిలో మొదటిసంధి జరిగింది. ద్రోహానికి ఫలితంగా గులాబుసింగుకి కాశ్మీరం లభించింది. ఇతడివంశంవాళ్లే కాశ్మీరంలో చివరివరకూ రాజులు.

డిసెంబరులో మరొకసంధి జరిగింది. దీనినే భైరవలాలుసంధి అంటారు. ఈసంధిపత్రం ప్రకారం దిలీపసింగు ప్రయోజకు డయే వరకూ పంజాబురాజ్యం కుంపినీ పాలనకింద వుంటుంది. రాజ్యంలో వొక రెసిడెంటు వుంటాడు. అతడు సర్వాధికారి. ఎనమండుగురు సర్దార్లతో వొక సలహాసంఘం వుంటుంది. అది రెసిడెంటు చెప్పు చేతల్లో వుంటుంది. రాణీ ఝిందా రాజ్యవ్యవహారాల్లో జోక్యం కలిగించుకో కూడదు. ఆమెకి సాలీనా లక్షా యాభై వేలు మనోవర్తి ఇస్తారు. సత్లజునదికి అవతల పదివేల కుంపినీసైన్యం వుంటుంది. ఈసైన్యం ఎందుకట! బాలరాజు దిలీపసింగు రక్షణకి!

ఒడంబడిక ప్రకారం వొక రెసిడెంటు వచ్చి లాహోరులో తిష్ఠవేశాడు. ఒక రాజ్యంలో రెసిడెంటు పెట్టడమంటే, ఆరాజ్యం దిగమింగడానికి విస్తరిపరిచి పరిషించడ మన్నమాట!

ఇంతలో డల్హౌసీ గవర్నరు జనరలుగా వచ్చాడు. మరి మూడు మాసాల్లో ఫెడ్రికు కర్రీ పంజాబు రెసిడెంటయాడు. పంజాబు పాడు చెయ్యడానికి ఎన్నివిధాల పనిచెయ్యాలో అన్నివిధాలా పనిచేశాడు కర్రీ. రాణీ ఝిందాని కొడుకు దిలీపసింగునించి విడదీశాడు. శేఖపురం కోటలో అట్టేపెట్టాడు. ఆమె భరణం నలభై వేలకి తగ్గించేశాడు. సిక్కుల జీవనోపాధులు నశించాయి. ఉద్యోగాలన్నీ ఇంగ్లీషువాళ్ళాక్రమించుకున్నారు. సామాన్యుడయిన ప్రతీ ఇంగ్లీషువాడూ శిక్కుసర్దార్లని అవమానించడం ఆరంభించాడు. రాజ్యమంతటా అశాంతి తాండవమాడింది.

ఇంతలో ముల్తాను శిక్కుగవర్నరుమూల్రాజుతో కుంపినీవాళ్ళకి తగాయిదా వచ్చింది. దాంతో ముల్తానులో తిరుగుబాటు లేచింది. ఈతిరుగుబాటులో రాణీఝిందాకి సంబంధ ముందని అభాండంవేశాడు

రెసిడెంటు కర్రీ. ఆమెని నిర్బంధించి కాశీ పట్టుకు పోయాడు. నజర్బందీలో పెట్టాడు. ఆమె నగలూ అవీ లాక్కున్నాడు. ఆమె మనోవర్తి పన్నెండువేలకి తగ్గించేశాడు. లక్నాయూభై వే లెక్కడ! పన్నెండు వేలెక్కడ! అప్పటికే శిక్కులలో అశాంతి రాజుతూ వుంది. తమ రాణిని నిర్బంధించి ప్రవాసం పట్టుకుపోయా రనగానే వాళ్ళలో క్రోధాగ్ని భగ్గుమంది. దాంతో రెండో శిక్కుయుద్ధం సిద్ధ మయింది. కుంపినీవాళ్ళు కోరుతున్న దే అది.

హజారా శిక్కుగవర్నరు ఛత్రసింగు కుమారుడు శేర్సింగు నాయకత్వంకింద శిక్కులు పెద్దఎత్తున యుద్ధంచేశారు. ఈయుద్ధంలో శేర్సింగు అద్భుతమయిన సరాక్రమంతో పోరాడాడు. ఇంగ్లీషు వాళ్ళని త్రాహిత్రాహి మనిపించాడు. తుదకి శిక్కులు ఓడి పోయారు. శిక్కుసర్దారులు లొంగిపోయారు.

దిలీపసింగు పంజాబురాజ్యం డల్హౌసీ కుంపినీరాజ్యంలో కలిపే శాడు. లాహోరుకోటమీద బ్రిటిషుపతాకం స్థాపించాడు. సర్ జాను లారెన్సుని పంజాబు చీఫ్ కమిషనరుగా నియమించాడు.

ఎవరు యుద్ధంచేశారు? ఎవరి రాజ్యం లాక్కున్నారు? సర్దారులు యుద్ధంచేశారు. దిలీపసింగు రాజ్యం లాక్కున్నారు! దిలీపసింగు యుద్ధం చెయ్యలేదు. అతడి మైనారిటీ వెళ్ళలేదు. అంత వరకూ అతడు కుంపినీరక్షణకిందే వున్నాడు. లాహోరులో జరిగిన భైరవలాలు వొడంబడికప్రకారం దిలీపసింగుకి పదాలు గేళ్ళువచ్చాక అతడిరాజ్యం అతడికి అప్పగించాలి. కాని అదంతాతోసిరా జన్నాడు డల్హౌసీ. రక్షిస్తా మని వచ్చి భక్షించారు కుంపినీవాళ్లు!

అంతతో ఆగలేదు. బాలరాజు దిలీపసింగు దగ్గిరనించి కోహినూరువజ్రం కూడా లాక్కున్నాడు డల్హౌసీ. దిలీపసింగు తండ్రి

సంపాదించిపెట్టిన వజ్రమది. అదే ఈనాడు బ్రిటిషు రాజమకుటంలో ధగధగా మెరుస్తూవుంది. పంజాబులో బ్రిటిషువాళ్ళుచేసిన ఘోరం ప్రపంచానికి ఉజ్వలంగా చాటుతూ వుంది. దిలీపసింగుకి సాలీనా అయిదు లక్షలు పెన్షను ఏర్పాటుచేశారు. తనతల్లినీ అన్నల్నీ లండను పంపించారు. దిలీపసింగుని కిరస్తానంలో కలిపారు. రాణీఝిందా లండనులోనే కాలంచేసింది. కొన్నాళ్ళయాక దిలీపసింగు జన్మభూమికి తిరిగివచ్చాడు. పోయిన మతమేమో దొరికింది. పోయిన రాజ్యం మాత్రం దొరకలేదు.

అంతా ఎర్రవడిపోతుం దన్నాడు రంజిత్సింగు. అతడు కాలంచేసి పట్టుమని పదేళ్లు తిరగలేదు. తన రాజ్యం పంజాబుమొత్తం ఎర్రరంగు పడిపోయింది! అంతేనా శిక్కుజాతి మళ్ళీ తలయెత్తకండా చేసేశారు ఇంగ్లీషువాళ్లు. వేలకివేలు శిక్కుల్ని సైన్యంలో చేర్చేశారు. వాళ్ళకి రాజభక్తి నూరిపోశారు. పంజాబునించి వైకి పంపించేశారు. తెల్లఛాజుతో పంజాబు నింపేశారు. 1857 విప్లవంలో శిక్కులు చేతులు కలపకండా మత్తుమందు చల్లారు. స్వాతంత్ర్య యుద్ధంలో వాళ్ళనే ఎదురొడ్డారు.

పెగూ కబళించడం

డల్హౌసీ యుద్ధంచేసి కబళించిన మరోరాజ్యం బర్మాలో పెగూ రాష్ట్రం. ఇదే కుంపినీవాళ్లు యుద్ధంచేసి కబళించిన ఆఖరిరాజ్యం. అప్పుడు బర్మాలో పగాను రాజుగా వున్నాడు. అతడి తండ్రి థర్రావాడీ కాలంనించీ బర్మావాళ్ళకీ కుంపినీవాళ్ళకీ కలతలుండేవి. మొదటి బర్మాయుద్ధంలో తన తండ్రికీ కుంపినీవాళ్లకీ యాండాంబులో జరిగిన వొడంబడిక అంగీకరించడానికి థర్రావాడీ సమ్మతించలేదు. బర్మా రాజ్యాంగ చట్టం ప్రకారం వొకరాజు మరణించడంతోనే అప్పటికి అమలులోవున్న వొడంబడికలూ అవీ కొత్తరాజు అంగీకరిస్తేనే కాని

చెల్లవు. అంచేత ఏదైనా గిల్లికజ్జా వస్తే చాలు బర్మామీద విరుచుకుపడాలని చూస్తూ వుండేవాళ్లు కుంపినీవాళ్లు.

ఇంతలో 1851 జూనులో మార్కు అని వొక ఇంగ్లీషు వోడ మోల్మెయి నుంచి రంగం వచ్చింది. హాజీ మని వొకడు తన తమ్ముణ్ణి వోడ కెప్తాను పెప్పర్డు నడిసముద్రంలో తోసి చంపాడని బర్మాగవర్నరు దగ్గిర కేసుచేశాడు. దివాను ఆలీ అని మరియొకడుకూడా తన తమ్ముడి దగ్గిర అయిదువందల రూపాయలు అపహరించాడని దావా తెచ్చాడు. ఆగస్టులో ఛాంపియను అని మరొక ఇంగీషువోడ మారిసు నుంచి రంగంవచ్చింది. ఈవోడకెప్తాను మీద కూడా వోడలోని బంగాలీ కూలీలు వొక ఖూనీకేసు తెచ్చారు. బర్మాగవర్నరు ఈ కేసులు విచారించాడు. కెప్తాను లిద్దరికీ తగినవిధంగా జరీమానాలు విధించాడు.

ఇంకేముంది ? కుంపినీవాళ్లకి మిష దొరికింది. 1826 యాండాబు వొడంబడికకి ఇది విరుద్ధమంటూ డల్హౌసీ బర్మామీద దండయాత్ర సాగించాడు. మొగ్లీనించి నక్కా (Fox) పామూ (Serpent) అని రెండు యుద్ధనౌకలు వేసుకుని 1851 నవంబరులో రంగంచేరి హంగామా ప్రారంభించాడు. మరుచటి సంవత్సరం ఏప్రెలులో మరింత సేన బర్మాచేరింది. బ్రహ్మాండమైన ముట్టడి జరిగింది. తుదకి బర్మా రాజు లొంగిపోయాడు. నష్టపరిహారంకింద పెగూరాష్ట్రం డల్హౌసీ లాక్కున్నాడు. కుంపినీరాజ్యంలో కలిపేసుకున్నాడు. మేజరు అర్థరు పేరీని అక్కడ కమీషనరుగా నియమించాడు. డల్హౌసీ సాగించిన ఈదండయాత్ర ఎంత అక్రమ మైందో కాంబ్డెను ఆరోజుల్లోనే తన How wars are got up in India గ్రంథంలో రాశాడు. ఇది అక్రమ మని ఆనాటి ఇంగ్లాండు పత్రికలుకూడా రాశాయి. " కారణం

లేకండా జరిగిన యీ దండయాత్ర బ్రిటీషువాళ్ల కీర్తికి కళంకం తెచ్చిపెట్టింది" అన్నాడు టూరెన్సు.

ఏమయితే నేం, బంగారంలాంటి పెగూరాష్ట్రం కుంపినీరాజ్యంలో కలిసిపోయింది. పెగూ, పంజాబురాజ్యాలు కలవడమంటే, బ్రహ్మాండమైన భూభాగం కలవడమన్నమాట. ఒక్కపంజాబురాజ్యమే యూరపులో వేల చదరపుమైళ్ళప్రదేశం! ఇంతరాజ్యం కబళించినా డల్హౌసీ రాజ్యదాహం మాత్రం తీరలేదు. అయితే ఈసారి తుపాకులూ ఫిరంగులూ ఉపయోగించలే దతడు. మరో చిత్రమైన బ్రహ్మాస్త్రం పుచ్చుకున్నాడు. అదిగో అదే 'లాప్సు' పద్ధతి.

దత్తతనిషేధం

లాప్సుపద్ధతి ప్రకారం పురుషసంతానంలేనివారి ఆస్తిపాస్తులూ రాజ్యాలూ బ్రిటిషువాళ్ళకి సంక్రమిస్తాయి. సంతతిలేనివాళ్ళకి దత్తత చేసుకునే అధికారం వుండదు. ఈపద్ధతి 1834 లోనే కుంపినీ డైరెక్టర్లు సృష్టించారు. ఒడుపునుబట్టి అమలులో పెడుతూ వచ్చారు. 1839 లో మాండవీలోనూ, 1840 లో కొలాబా, జిలానులలోనూ, 1842 లో సూరతులోనూ, 1843 లో సైతూరులోనూ ప్రయోగించారు. అయితే దానిని భారీఎత్తుమీద ప్రయోగించి పెద్దపెద్దరాజ్యాలు చవాయించిన వాడు డల్హౌసీ.

సర్ జాను కే తన "సిపాయియుద్ధం" గ్రంథంలో ఇలా రాశాడు: "'లాప్సు' అన్నమాట 'యుద్ధం' అన్న దానికంటే గుండెలుతీసిన మాట. కర్ణకఠోరమయిన మాట. కత్తులికి కంఠార్పించడం భారతీయులికి తెలుసు. అడ్డులేదు దానికి. పైనించి శత్రువులు తమ దేశంమీద దాడిచెయ్యడం, జయించడం కూడా వాళ్ళెరుగుదురు. 'ఇది మన అదృష్టం; ఏంచేస్తాం! అని వూరు

కుంటారు దానికి. 'బలంకలవాడిదే రాజ్యం' అని సమాధాన పడతారు. శక్తిమంతుడు తమ భౌతికసంపదమాత్రం తీసుకుంటాడు. అంతే. కాని ఆదిభౌతికసంపదకిమాత్రం హాని కలిగించడు. తమ ధర్మం భంగపుచ్చడు. అంచేత వాళ్లమనస్సు అంత బాధపడదు. కాని తమ ధర్మానికి హాని కలిగినప్పుడు భారతీయులు భరించలేరు. తాము హరీ అన్నాక, తమ శాంతికోసం, తమ ఆత్మముక్తికోసం ఇన్ని తిలోదకా లిచ్చే కుమారుడికోసం భారతీయు లెంతో బాధపడతారు. అంచేత కుమార్తెలేనివాళ్ళు దత్తత చేసుకుంటారు. కనక, సంస్థానాల రాజులు దత్తత చేసుకోకూడ దనీ, వాళ్ళరాజ్యాలికి కుంపినీవాళ్ళే వారసు లనీ డల్హౌసీ ప్రకటించగానే భారతీయులికి పిడుగుపడి నట్టయింది. ఈలాప్సుపద్ధతి భారతీయుల భౌతికసంపదలే కాదు, వాళ్ల ఆదిభౌతిక సంపదలు కూడా తుడిచిపెట్టేసింది."

అంతకిముందు కుంపినీవాళ్లు ఈరాజులతో చేసుకున్న వొడం బడికలూ, చేసిన వాగ్దానాలూ యావత్తూ ఈలాప్సుపద్ధతి సున్నా చుట్టేసింది. దత్తత చేసుకునేహక్కు భారతీయుల జన్మహక్కు. అనాదిసిద్ధమైంది. ధర్మసమ్మతమైంది. ఒక్కహిందువులకే కాదు, మహమ్మదీయులికీ ఇది ధర్మసమ్మతమైన హక్కు. దీనిని నిషేధించడానికి కుంపినీవాళ్ళకి ఏరాజ్యాంగం ప్రకారం, ఏధర్మసూత్రం ప్రకారం అధికారం లభించిందో ఏరాజ్యాంగవేత్తా ఇంతవరకూ నిరూపించలేదు. అందుకనే టాసెన్సు ఇలా రాశాడు :

"భారతీయుల అనాదిసిద్ధంగా వున్న దత్తాధికారం నిషేధించడం దారుణం. ఇంతకంటే వెకిలితనం మరొకటి వుండదు. దత్తాధికారం లే దనడం భారతీయుల సనాతనధర్మం అవమానించడమే. కేవలం ఆస్తికోసమే హిందువులు దత్తతచేసుకోరు. తమకింత

పిండోదకాలిచ్చి తమకి ముక్తికలిగిస్తారన్న నమ్మకంతోనే వాళ్లు దత్తతచేసుకుంటారు. సంతానంలేని రాజులరాజ్యం కుంపినీలో కలిసిపోవాలన్న ఈపాడునిర్ణయంకంటే తెలివితక్కువ మరొకటి వుండదు. ఈనిర్ణయం భారతీయుల యావన్మంది హృదయాలూ నొప్పికలిగిస్తుంది; అవమానం కలిగిస్తుంది." *

ఈలాప్సుసిద్ధతి పుచ్చుకుని గవర్నరుజనరలు డల్హౌసీ సతారా, నాగపురం, ఝాన్సీ, సంబలపురం మొదలయిన రాజ్యాలు అపహరించాడు. కుంపినీవాళ్ళ పాపాలకుండ పూర్తిచేశాడు. 1857 విప్లవాగ్నికి ఆజ్యధారపోశాడు. అతడి మొదటికబళం సతారా అయింది.

సతారా

శివాజీ మహారాజు స్థాపించిన మహారాష్ట్రసామ్రాజ్యానికి మూలపీఠం సతారా. శివాజీ కాలంచేశాక అతడి పెద్దకుమారుడు శంభాజీ సతారాలోనూ, చిన్నకుమారుడు రాజారాము కొల్హాపురంలోనూ గద్దెలేర్పరుచుకున్నారు. శంభాజీని ఔరంగజేబు చంపేశాడు. శంభాజీ కుమారుడు సాహూ ఔరంగజేబు కోటలో జేబున్నీసా పెంపకం కింద పెరిగాడు. ఔరంగజేబు మరణించాక అతడు విడుదల పొందాడు. 1708 సతారా గద్దెమీద కూచున్నాడు. అతడికాలం నించే మహారాష్ట్రసామ్రాజ్యచక్రం పీష్వాలచేతికి వచ్చింది. పేరుకిమాత్రం సతారాలో రాజసింహాసన ముండేది. పరిపాలన యావత్తూ పీష్వాల చేతుల్లో పూనాలో జరిగేది.

సాహూకి కుమార్తెలేరు. కొల్హాపురంనించి రాజారాము మనవణ్ణి రామరాజుని పెంచుకున్నాడతడు. సాహూ 1779 లో కాలంచేశాడు.

* Empire in Asia.

రామరాజుకి కూడా కుమార్లు లేరు. వాపీ నించి త్ర్యంబకజీ బాన్సలే కుమారుణ్ణి అబ్బాసాహేబుని దత్తత చేసుకున్నాడతడు. మరచటి సంవత్సరం అబ్బాసాహేబు గద్దె ఎక్కాడు. 1808 లో కాలంచేశాడు. అతడికి ముగ్గురు కుమార్లు. పెద్దకుమారుడు ప్రతాపసింగు 1808 లో గద్దెమీద కూచున్నాడు.

ప్రతాపసింగు గద్దెమీదికి వచ్చేసరికి మైనారిటీ తీరని కుర్రాడు. అప్పుడు పూనాలో బాజీరావు పేష్వాగా వున్నాడు. కుంపినీవాళ్లు మహారాష్ట్రం కబళించేప్రయత్నంలో వున్నారు. పేష్వాకీ కుంపినీవాళ్లకీ యుద్ధాలు జరిగాయి. ఒకయుద్ధంలో పేష్వా పారిపోయాడు. అప్పుడతడి విడిదిలో తల్లితోనూ, సోదరులతోనూ ప్రతాపసింగు కూడా వున్నాడు. బాజీరావు లేకుండాచూచి కుంపినీవాళ్లు ప్రతాపసింగుని వల్లో వేసుకున్నారు. "మహారాష్ట్రసామ్రాజ్యమంతా నీదే. బాజీరావు నీసేవకుడు. అతడు నిన్ను బందీలా వుంచి నాటకమాడుతున్నాడు. నీకోసమే బాజీరావుతో మేము యుద్ధంచేశాం" అంటూ యువకుడయిన ప్రతాపసింగుని బులవేశారు. బాజీరావునించి విడదీసి తమపక్షం తిప్పుకున్నారు. దీనికి కారణం బాజీరావుని జయించినా మహారాష్ట్రం ప్రజలుమాత్రం కుంపెనీవాళ్ళకి లొంగుబాటు కాకపోవడమే. అందుకనే ప్రతాపసింగుని తమచేతి కీలుబొమ్మగా పెట్టుకుని క్రమంగా మహారాష్ట్రం కబళించాలని వాళ్ళ వూహ. కుంపినీవాళ్లు అనేకచోట్ల ఇదే నీతి ప్రయోగించారు. మైసూరులో, వెలస్లీ ప్రయోగించిన నీతే మహారాష్ట్రంలో బొంబాయి గవర్నరు ఎలిఫిన్‌స్టను ప్రయోగించాడు.

ఇంగ్లీషువాళ్ళ మాటలన్నీ నమ్మాడు ప్రతాపసింగు. మనస్ఫూర్తిగా వాళ్ళతో స్నేహం కట్టాడు. వాళ్ళు రాసిఇచ్చిన వొడంబడిక

శాశ్వత మనుకున్నాడు. తరవాత జరిగిన యుద్ధాల్లో పేష్వాబాజీరావు ఓడిపోయాడు. మనోవర్తి తీసుకుంటూ బితూరులో చివరిదినాలుగడిపాడు. మైనారిటీవెళ్ళని ప్రతాపసింగుని చేతిలోపెట్టుకుని కుంపినీవాళ్లు ఆడవలసిన నాటకమంతా ఆడారు. అతణ్ణి సతారా పట్టుకువెళ్లి పెద్ద ఉత్సవంచేశారు. పేష్వా చెరనించి ప్రతాపసింగుని విడిపించామన్నారు. ఈఉత్సవం ప్రతాపసింగు "పునరభిషేకం" అన్నారు. అయితే ప్రతాపసింగు మాత్రం ఈమాట లంగీకరించలేదు.

అంతతో వూరుకోలేదు బొంబాయి గవర్నరు ఎలిఫిన్‌స్టను. ప్రతాపసింగు మైనారిటీ వెళ్ళేదాకాఅంటూ గ్రాండుడఫ్‌ని సతారాలో రెసిడెంటుగా పెట్టాడు. ఈడఫ్‌దొరే మహారాష్ట్రచరిత్ర రాశాడు.

ప్రతాపసింగు ప్రయోజకు డయాడు. సతారారాజ్యం రామరాజ్యంలా పాలించాడు. శివాజీమహారాజు తరవాత ప్రతాపసింగు వంటి మహారాజు సతారాగద్దెమీద కూచోలేదు. అతడి పరిపాలన దొరలుకూడా మెచ్చుకున్నారు. అతడి పరిపాలనకి మెచ్చి కుంపినీ డైరెక్టర్లు 1835 లో మూడువేల పౌనుల రత్నాలకత్తి, వొకఉత్తరమూ, అతడికి బహూకరించమని బొంబాయిగవర్నరుకి పంపించారు. ఇన్ని చేసినా సంధిపత్రంప్రకారం ప్రతాపసింగుకి రావలిసిన పెద్ద పెద్ద జాగీరులుమాత్రం అతడికి ఇవ్వడం మానేశారు. తనజాగీరులు తనకి దఖలు పరచవలసిందంటూ కోరాడు ప్రతాపసింగు. దాంతో తగాయిదా ముదురుతూ వచ్చింది.

అప్పుడు రాబర్ట్‌గ్రాంటు బొంబాయి గవర్నరుగా వుండేవాడు. అతణ్ణి స్వయంగా ప్రతాపసింగు కలుసుకున్నాడు. ఈవిషయం డైరెక్టర్లకి తెలియచేస్తా నన్నాడు గ్రాంటు. కాని అలాంటి దేమీ చేయలేదు. డైరెక్టర్లు పంపిన కత్తికూడా ప్రతాపసింగు కివ్వలేదు.

తుదకి జాగీర్లవిషయం తానే డైరెక్టర్లకి తెలుపుకుందికి సయ్యదు మీరు అని ఒక బొంబాయి వకీలుని లండను పంపడానికి నిశ్చయించాడు ప్రతాపసింగు. దాంతో ఇక్కడ సతారాలో వుండే రెసిడెంటుకీ, అక్కడ బొంబాయిలో గవర్నరు గ్రాంటుకీ చుర్రుమంది. దీంతో డైరెక్టర్లు పంపిన కత్తివిషయంకూడా బైటపడవచ్చు. తన ఉద్యోగానికే భంగంకలగవచ్చు అనికూడా భయపడ్డాడు గ్రాంటు. దాంతో ప్రతాపసింగు మీద పెద్దకుట్రపన్నాడతడు. మహారాష్ట్ర బ్రాహ్మడు బాలాజీపంతు నాటూ కూడా ఈకుట్రలో కలిశాడు. ప్రతాపసింగూ అతడి దివాను గోవిందరావూ సిందియాతోనూ, హైదరాబాదు నిజాముతోనూ కలిసి కుంపినీరాజ్యం కూలదొయ్యడానికి కుట్రపన్నుతున్నారని దొంగకేసు బనాయించారు. దొంగ సాక్ష్యాలు పుట్టించారు. దివాను గోవిందరావుని నిర్బంధించి అష్ట కష్టాలూ పెట్టారు.

ఇంగ్లీషువాళ్ళని ఇండియానించి తరిమెయ్యడానికి ప్రతాపసింగు పోర్చుగీసులతో కుట్రపన్నుతున్నాడనీ, గద్దెదించేసిన నాగపురంరాజుని రష్యా, టర్కీల సహాయంతోరమని ప్రోత్సాహిస్తున్నాడనీ అభాండాలు కల్పించారు. దీని రుజువుకోసం ఫోర్జరీకాగితాలు సృష్టించారు. గోవాలో పోర్చుగీసులదగ్గిర కొన్ని కాగితాలూ, నాలుగువందల రూపాయిలూ దొరికాయన్నారు. అదంతా పచ్చి అబద్ధమని గోవా గవర్నరు ప్రకటించాడు.

తనమీద వేసిన అభాండానికి న్యాయవిచారణ జరిగించవలసిందంటూ ప్రతాపసింగు బొంబాయి అధికార్లదగ్గిరికీ, కలకత్తా గవర్నరు జనరలు దగ్గిరికీ, ఇంగ్లాండుమంత్రులదగ్గిరికీ రాయబారాలు పంపాడు. రంగోబాపూజీ మరికొందరూ ఇంగ్లాండువెళ్ళారు. రంగోబాపూజీ

సతారారాజ్యంకోసం పదాన్నలుగుసంవత్సరాలు ఇంగ్లాండులో వుండి పడరానిపాట్లు పడ్డాడు. ఈలోగా ఇక్కడ బొంబాయి గవర్నరు రాబర్టు గ్రాంటు 560 పేజీలగ్రంథం ప్రతాపసింగుడికి వ్యతిరేకంగా తయారుచేశాడు. ప్రతాపసింగు హిందూపదపాదుషాహి అని చెప్పుకున్నాడట! అంచేత అతణ్ణి శిక్షించాలన్నాడు. ఎంత చెయ్యాలో అంతాచేసి రాబర్టుగ్రాంటు దాపురీలో చచ్చిపోయాడు.* జేమ్సు రివెట్ కార్నాకు బొంబాయి గవర్నరుగా వచ్చాడు. కొన్నిషరతులతో వొకపత్రం పట్టుకుని కార్నాకు సతారా వచ్చాడు. ప్రతాపసింగుని సంతకం చెయ్యమన్నాడు. అవమానకరమయిన ఆషరతులు ప్రతాపసింగు అంగీకరించలేదు.

అద్దరాత్రి. ప్రతాపసింగు నిద్రలో వున్నాడు. కుంపినీ సిపాయిలు వచ్చి అతణ్ణి అరస్టుచేశారు. ఖైదీగా కాశీ పట్టుకుపోయారు. అతడి తమ్ముడు అప్పాసాహెబు సకలగుణాభిరాముడు అతణ్ణి గద్దెమీద కూచోబెట్టారు. కాశీపట్టుకుపోయేముందు కొన్నాళ్లు ప్రతాపసింగుని సతారాకి ఏడుమైళ్ళదూరాన నీంబుగ్రామంలో వుంచారు.

ప్రతాపసింగుతో అతడిసేనాపతి బాలాసాహెబునికూడా కాశీ పయనంకట్టించారు రెసిడెంటు మీవన్సు. బాలాసాహెబు కాయలాగా వుండి ప్రయాణంచెయ్యలేని స్థితిలో వున్నాడు. అతడి భార్య• పురిటి

---

* దాపురీలో వొక దెయ్యం ఉపద్రవంచేస్తూవుండేది. దానిగురించి జేమ్సు డగ్లసు తన Bombay and Western India లో ఇలారాశాడు:—

"Sir Robert Grant, Governor of Bombay, died at Dapuri July 9th 1838.....; and the fact suggests to us that it must be his ghost..... if it is anybody's ghost, it must be that of Sir Robert Grant, the treacherous Governor of Bombay who encompassed the ruin of the innocent and virtuous Raja Pratap, Singh of Satara."

నొప్పులుపడుతూవుంది. అయినా ఆగనివ్వలేదు వోవన్ను. బాలా సాహెబు దారిలోనే చచ్చిపోయాడు. అతడిభార్య రోడ్డుపక్క వొక మగశిశువు ప్రసవించింది. ఈశిశువునే ప్రతాపసింగు దత్తతచేసుకున్నాడు. ప్రతాపసింగుకి పుత్రసంతానం లేదు. ఇద్దరురాణులూ వొక కూతురూమాత్రముండేవాళ్లు. 1847 లో ప్రతాపసింగు కాలంచేశాడు. కాలంచేసేముందు తన దత్తపుత్రుడే తన రాజ్యానికి వారసుడని వీలునామా రాశాడు. దత్తతమూలంగానేకాక బంధురీత్యాకూడా ప్రతాపసింగుపెంచుకున్న బాలాసాహెబు కుమారుడు సతారాసింహాసనానికి వారసుడే.

మరుచటిసంవత్సరం అప్పాసాహెబు కాలంచేశాడు. అతడికిన్నీ కుమార్లు లేరు. కాలంచేసేముందు వొకకుర్రాణ్ణి పెంచుకున్నాడు. అతడికి వెంకూజీ రాజు అని పేరుపెట్టాడు.

ప్రతాపసింగూ అప్పాసాహెబూ ఇద్దరూ కాలంచేశారు. సతారా రాజ్యానికి వారసులెవరు? ప్రతాపసింగు దత్తపుత్రుడో అప్పాసాహెబు దత్తపుత్రుడో కావాలి. పసిపిల్లడు కూడా చెప్పుతా డీమాట. కాని మేమేవారసుల మన్నాడు డల్హౌసీ. ఎక్కడి రక్తసంబంధమంటారా! ఏమో, అది డల్హౌసీకే తెలియాలి! అప్పటి సతారా రెసిడెంటుడల్హౌసీకి ఇలా రాశాడు:

"ఈదత్తపుత్రులిద్దరిలో వొకరికే సతారామీద హక్కువుంటుంది. సన్నిహితులయిన జ్ఞాతులెవరికీ వీళ్ళకంటే హక్కుండదు. ఇదే రాజబంధువులందరూ అనుకుంటున్నారు. ఈదత్తతలు న్యాయమైనవని వాళ్ళు అంగీకరిస్తున్నారు. అలాకాకపోయివుంటే వీళ్ళందరూ తమ వారసత్వంకోసం విరగబడేవాళ్ళే. మన మీ దత్తతలు నిషేధించామన్నసంగతి వాళ్ళువింటే మేమంటే మే మని ఎగబడతారు.

వాళ్ళవారసత్వం వాళ్ళు ఏ న్యాయస్థానంలో అయినా స్థిరపరుచుకోగలరు. నాదగ్గిరవున్న కాగితాల్లో దానికి తగినరుజువులు కనిపిస్తున్నాయి. కుమాళ్ళులేనివారిరాజ్యాలు మారాజ్యంలో కలిసిపోవాలి అని మనం పట్టుకున్న లాప్సు పద్ధతి తప్పిస్తే, మన సంధిపత్రాలప్రకారం సతారా లాక్కోడానికి మనకి అధికారం కనిపించదు."

ఏం లాభం? ఎంతట సతారా కబళించేద్దామా అంటూ సీమ మంత్రులదగ్గిరనించీ కనిపెట్టుకునేవున్నారు కుంపినీవాళ్లు. అసలు ప్రతాపసింగుని గద్దెదించేసినప్పుడే ఆపని చెయ్యవలసింది. కాని ఆఫ్గను దండయాత్ర కొంత అడ్డువచ్చినట్టుంది. ప్రతాపసింగు కాలంచెయ్యగానే సీమమంత్రి డల్హౌసీకి ఇలారాశాడు. ఇతడు డల్హౌసీకి పినతండ్రి.

"పాతరాజు మంచిసమయంలో చచ్చాడు. ఇప్పుడు గద్దెమీద వున్న రాజు కూడా కాయిలాగా వున్నాడని వింటున్నాను. అంచేత ఈరాజ్యం ఏంచెయ్యాలోఇప్పుడే వేగంగా తేల్చుకోవాలి. ఈరాజుకి కొడుకులు లేరు కదా! దత్తత మనం ఒప్పుకోకూడదు. ఇతడు కళ్లు మూశాక ఈరాజ్యం బ్రిటిషుసామ్రాజ్యంలో కలిసిపోవాలి."*

ఇంకేముంది! దత్తత చెల్ల దంటూ తోసేశాడు గవర్నరుజనరలు డల్హౌసీ. సతారారాజ్యం కుంపినీ రాజ్యంలోకలిసిపోయింది. ఛత్రపతి

* The death of the ex-Raja of Satara certainly comes at a very opportune moment. The reigning Raja is, I here, in very bad health, and it is not at all impossible we may soon have to decide upon the fate of his territory. I have a very strong opinion that on the death of the present prince withont a son, and no adoption should be permitted, this petty principality should be merged in the British Empire; and if the question is dicided in my day, day of "Sextonship", I shall leave no stone unturned to bring about that result....."—Hobhouse.

శివాజీ స్థాపించిన సతారాసింహాసనం ఆనాటితో అస్తమించిపోయింది. అప్పటికే రంగోబాపూజీ ఇంగ్లాండులో వున్నాడు. మరో అయిదేళ్లు సతారా గద్దెకోసం పోరాడాడు. ప్రభువులకర్జీలు రాశాడు. వకీళ్ళచేత వాదింపించాడు. బహిరంగసభల్లో ఉపన్యాసాలు చేశాడు. పత్రికల్లో వ్యాఖ్యానాలు రాయించాడు. లక్షలులక్షలు వ్యయంచేశాడు. 'సతారాకి న్యాయం చేయండి' అంటూ ఇంగ్లాండంతా ప్రతిధ్వనింపజేశాడు. అవమానాలు భరించాడు. తిరగరాని కొంపలు తిరిగాడు. పట్టరాని వాళ్ళ కాళ్లుపట్టాడు. అంతా అరణ్యరోదనమయింది. చెవిటివాళ్ళ ముందు శంఖధ్వానమయింది. తనపద్నాలుగేళ్ళప్రవాసం పూర్తయాక, తిరిగిరావడానికి చేతిలో పైసాలేక కుంపినీఇచ్చినపాసుమీద తుదకి 1853 లో అతడు మాతృభూమికి తిరిగివచ్చేశాడు.

ఇంగ్లీషువాళ్ళని ఇండియానించి వెళ్ళగొట్టందే ముక్తిలేదని రంగోబాపూజీ ఇంగ్లాండులోనే నిశ్చయించుకున్నాడు. ఇండియావచ్చి విప్లవ ప్రచారంచేశాడు. 1857 స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్నాడు. కుంపినీ వాళ్ళకి అయిపులేకండా మాయమయాడు. సతారా రాజ్యం కలుపు కోడంతో బ్రిటిషు చరిత్రలో మొక ప్రధానఘట్టం జరిగింది.

నాగపురం

నాగపురం పేష్వాలరాజ్యంకింద సామంతరాజ్యం. ఇక్కడ పత్తి పంట విస్తారం. లాంకషైరు వర్తకులికి పత్తిప్రాణం. అందుకని ఎంత కాలంనించో నాగపురం కాజెయ్యడంకోసం కనిపెట్టుకుని వుండేవాళ్ళు కుంపినీవాళ్ళు. రెండోమహారాష్ట్రయుద్ధ మయాక రెసిడెంటుని పెట్టి రాజ్యంలో కుట్రలుపన్నుతూ వుండేవాళ్ళు. అప్పుడు రెండో రఘోజీ భాన్సలే నాగపురం రాజుగా వుండేవాడు. అతడిమెడకి అద్దెసేన లంట గట్టడంకోసం విశ్వప్రయత్నాలు చేశారు.

రెండో రఘోజీభాన్సలే 1816 లో కాలంచేశాడు. అతడి కొడుకు పుర్సాజీ పిచ్చివాడు. అందుకని రఘోజీ తమ్ముడికొడుకు రాజ్యవ్యవహారాలు చూస్తూవుండేవాడు. రఘోజీ జీవితకాలంలోకూడా ఇతణ్ణి ఇంగ్లీషువాళ్ళు దువ్వుతూ వుండేవాళ్లు. రఘోజీ కాలంచెయ్యడంతోనే అప్పాసాహెబుని వల్లోవేసుకుని నాగపురానికి అద్దెసేన లంటగట్టారు. అదే నాగపురం పతనానికి ఆరంభం. ఈఅద్దెసేనల వొడంబడికే నాగపుర రాజ్యం సామంతరాజ్యంగా మార్చేసింది. ఈ వొడంబడిక జరిగిందనగానే అప్పటి గవర్నరు జనరలు మాయిరా ఇలా రాసుకున్నాడు

"నాగపురరాజ్యం ఇవాళనించే మన సామంతరాజ్య మయిపోయింది. పన్నెండు సంవత్సరాలనించీ అవస్థపడుతూ వుంటే ఇన్నాళ్లకి నాగపురంలో చిన్నకీలకంవల్ల ఇది సాధ్యమయింది. కాలంచేసిన రఘోజీకి వొక్కగాక వొక్క కొడుకున్నాడు. వాడు పిచ్చాడు. గుడ్డాడు. పరిపాలన యావత్తూ అప్పాసాహెబుచేతిలో వుంది. పిచ్చివాడు దత్తత చేసుకుంటే చెల్లదని అప్పాసాహెబుకి ధైర్యం చెప్పాం. అతడు మనతో నేస్తంకట్టేటట్టుచేశాం."

ఈఅద్దెసేనలవల్ల సాలీనా వొక పాతికలక్షలు పైగా అప్పాసాహెబు అచ్చుకోవలసి వచ్చింది. అంటే రాజ్యంరాబడిలో మూడోవం తన్న మాట. అందుకని అప్పాసాహెబుకి యమయాతనగా వుండేది.

1817 ఫిబ్రవరిలో పుర్సాజీని ఎవరో అద్దరాత్రి మంచంమీద చంపేశారు. అప్పాసాహెబు రాజయాడు. నవంబరులో పట్టాభిషేకం జరిగింది. పట్టాభిషేకం సమయంలో అప్పాసాహెబుకి పేష్వా వొక అంగీ పంపించాడు. సామంతరాజు పట్టాభిషేకం జరిగినప్పుడు వొక అంగీపంపడం పేష్వాల ఆచారం. దానికి ఖిల్లతు అంటారు. పట్టాభిషేకంలో ఆ అంగీ వేసుకోవడం సామంతరాజుకి సన్మానం.

"పేష్వాకీమాకూ విరోధంగా వుంది. నువ్వు పేష్వాపంపిన ఖిల్లతు వేసుకోకూడదు." అంటూ నాగపురం రెసిడెంటు, జెంకిన్సను, అప్పా సాహెబుకి కబురంపాడు. "పేష్వాదగ్గిరవున్న రెసిడెంటు సమ్మతిమీదే ఈఖిల్లతు వచ్చింది. అంచేత మీరు అడ్డుచెప్పవద్దు" అన్నాడు అప్పాసాహెబు. పేష్వాపంపిన అంగీ పట్టాభిషేకంలో వేసుకున్నాడు. ఇంకేముంది! రెసిడెంటుకి మొళ్ళుమండింది. విరోధానికి మిషదొరికింది. "అంతేకాకండా అద్దెసేనలుకూడా తగ్గించమంటున్నాడు. అప్పాసాహెబు! ఇది విరోధంకాకపోతే మరేమిటి?" అంటూ అప్పాసాహెబుమీద దండయాత్ర ప్రారంభించాడు జెంకిన్సుదొర.

ఉభయసేనలికీ యుద్ధంజరిగింది. అప్పాసాహెబు ఓడిపోయాడు. ఒకమొడంబడిక జరిగింది. దాంతో నాగపురం సగంభాగం కుంపినీ అధికారంకిందికి వచ్చేసింది. కాని మాయిరా దొర అప్పాసాహెబుని అంతతోపోనివ్వలేదు. పేష్వాబాజీరావుతో కలిసి కుంపినీప్రభుత్వం కూలదొయ్యడాని కతడు కుట్రపన్నాడని అభాండం వేశాడు. 1818 మార్చిపదిహేనున ఏదోమిషమీద రెసిడెంటు అప్పాసాహెబుని తనబసకి పిలిపించాడు. అతడు రాగానే "సంవత్సరంకింద పుర్సాజీని నువ్వే చంపావు" అంటూ అరస్టుచేశాడు. మొదటినించీ అప్పాసాహెబు ఇంగ్లీషువాళ్ళనే నమ్ముకున్నాడు. కల్లాకపటం లేకండా నేస్తంకట్టాడు. అద్దెసేనలు నెత్తినిపెట్టుకున్నాడు. తుదకి నేస్తాల చేతిలో ఖైదీగా చిక్కిపోయాడు!

అప్పాసాహెబుని ఖైదుచేసి, రెండో రఘూజీభాన్సలేమనవణ్ణి - వొకకుర్రాణ్ణితెచ్చి గద్దెమీదపెట్టాడు కమీషనరు జెంకిన్సను. ఇతడి పేరు మూడో రఘూజీ భాన్సలే.

అప్పాసాహెబుని నాగపురంనించి అలహాబాదు పట్టుకుపోతున్నారు. దారిలో సిపాయిల సహాయంతో అద్దరాత్రి కొంతపరివారం వెంట పెట్టుకుని సిపాయివేషంలో పారిపోయాడు. అతణ్ణి పట్టిఇస్తే బహుమతి ఇస్తామని గవర్నరుజనరలు ప్రకటించాడు.

అలాపారిపోయి అప్పాసాహెబు కొన్నాళ్ళకి చౌరాఘరుకోటలో ప్రవేశించాడు. అక్కడినించి కొండల్లోకి పారిపోయి పిండారీలమధ్య తలదాచుకున్నాడు. పిండారీలనాయకుడు చీటూ అతణ్ణి కంటికిరెప్పలా కాపాడాడు. ఇంతలో ఒకనాడు చీటూని పెద్దపులి ఎత్తుకుపోయింది. ఇంగ్లీషుపౌజు అప్పాసాహెబుని వెదుకుతూ వేటాడింది. అప్పా సాహెబు అస్సీఘరు కోటలో దాక్కున్నాడు. ఇంగ్లీషుపౌజు కోట పట్టుకుందికి బయలుదేరింది. అప్పాసాహెబు ఫకీరు వేషంలో లాహోరు పారిపోయాడు. రంజిత్సింగు ఆశ్రయంలో కొన్నాళ్లున్నాడు. అక్కడినించి హిమాలయాలకి పారిపోయాడు. అక్కడ మండీ రాజ్యంలో కొన్నాళ్లు తలదాచుకున్నాడు. అక్కడినించి జోధపురం వచ్చేశాడు. జోధపురంలో మహామందిరం దేవాలయంలో తలదాచు కున్నాడు. అప్పాసాహెబుని అప్పగించమని కుంపినీవాళ్లు జోధపురం రాజుని కోరారు. "దేవాలయంలో తలదాచుకున్న వాణ్ణి పట్టిఇవ్వడం పాపం" అన్నాడు జోధపురంరాజు మానసింగు.

మహామందిరంలోనే అప్పాసాహెబు అంతిమదినాలు గడిపాడు. 1840లో అక్కడే కాలంచేశాడు. మూడో రఘూజీభాన్సలే 1853లో హఠాత్తుగా కాలంచేశాడు. అతడికి పుత్రసంతానం లేదు. దత్త పుత్రుడు జస్వంతఅహిరావు మాత్ర మున్నాడు. అహిరావే తండ్రికి ఉత్తరక్రియలుచేశాడు. లాంచనయుక్తంగా నాగపురం సింహాసనం మీద కూచున్నాడు. పట్టాభిషేకమున్నూ వైభవంగా జరిగిపోయింది.

ఇదంతా జరుగుతూ వున్నప్పుడు అప్పటి రెసిడెంటు మాన్సెలు చూస్తూనే వున్నాడు.

ఇక్కడ నాగపురంలో కొత్తరాజు పట్టాభిషేకం గూజరుతూవుంది. అక్కడ కలకత్తాలో డల్హౌసీ నాగపురం మింగెయ్యడానికి నాలిక చాస్తున్నాడు. "దత్తత మేం అంగీకరించం. నాగపురానికి మేమే వారసులం. లాప్సుప్రకారం నాగపురం కుంపినీరాజ్యంలో కలిపేసుకున్నాం" అంటూ 1854 జనవరిలో హుకుం జారీ చేశాడు. 1857 విప్లవానికి మరో సమిధ పడేశాడు. ఇంతటితో ఈవిషాద కథనం ముగియలేదు.

ఒకనాడు కుంపినీసిపాయిలు వచ్చారు. హఠాత్తుగా నాగపురంకోట ఫిరాయించారు. అంతఃపురం రాజపరివారాన్నీ, రాణుల్నీ నిర్బంధంలో పెట్టారు. తమని ఎందుకు నిర్బంధించారో కూడా పాపం, అర్థంకాలేదు వాళ్ళకి. ఇదంతా అక్రమం అంటూ రాజమాత బంకూబాయి మొత్తుకుంది. "కోటలోనివస్తువులు దోచుకుంటే చూడలేను. కోటకి నిప్పంటించేస్తా"నంటూ గోలుగోలుమంది. ఆమె రోదనం అరణ్యరోదనమే అయింది. ఆమె సహాయంకోసం బయలుదేరిన షాహు కార్లనూ, కర్నలుజోసీనీ నిర్బంధించారు. అనుమానించిన ప్రతీ వ్యక్తినీ అరస్టుచేశారు. రాజ్యంమీద హక్కు వొదులు కున్నట్టు రాసి ఇమ్మని రాణీని బలవంతపెట్టారు. రాజ్యానికి వారసులయినవాళ్లకి మళ్ళీ వొకరు రాసి ఇవ్వడ మెందుకో! రాజ్యమంతటా కుంపినీసేనలు కాపలావేశారు. దేశంలోని ఘరానామనుషు లందరివెనకా గూఢచారులు నియమించారు.

రాజమాత బంకూబాయీ, మహారాణీ అన్నపూర్ణా బండెడంత దుఃఖంతో మొర్రోమొర్రో మంటున్నారు. కోటతలుపులు తెరచుకొని

ఇంగ్లీషుసిపాయిలు లోపలచొరబడ్డారు. కోటలోని యావదాస్తీ - గుర్రాలూ, ఏనుగులూ, గొడ్డూగోదా దోచుకున్నారు. వాటిని వీధుల్లో వేలాంవేశారు. ఏనుగులు వండేసిరూపాయిలకి అమ్మారు. "డల్హౌసీ తిన్న తిండికంటే విలువయిన దానా తినే గుర్రాలు ఇరవై రూపాయల కమ్మారు." స్వయంగా భోస్లే సవారీచేసిన గుర్రాల జత అయిదురూపాయలకి వేలంలో కొట్టేశారు. రాణివాసం రాణుల పడకగదులు పాతుడుధనంకోసం గడ్డపారలతో తవ్వేశారు. రాణుల కోటిరూపాయల నగలు లాక్కున్నారు. ఏనుగులూ, గుర్రాలూ, లొటిసిటలూ, ఎడ్లూఅవీ మొత్తం అయిదారువందల పశువులు పద మూడువేలరూపాయలికి అమ్మేశారు. ఈ అన్యాయంపేరు "కోట దోపిడీ" (Spoilation of the palace) అన్నాడు లే. *

అవమానంతోనూ క్రోధంతోనూ వుక్కిరిబిక్కిరయి దివానుమరణిం చాడు. దుఃఖంతోనూ, అవమానంతోనూ కుంగిపోతూ మహారాణి అన్నపూర్ణ బాయి ప్రాణం విడిచిపెట్టింది. బంకూబాయి సీమకి రాయ బారం పంపి అడియాసతో కాలంగడిపింది.

డల్హౌసీ దోచుకున్న నాగపురం నగలు - వజ్రాలూ, ముత్యాల హారాలూ, పచ్చలహారాలూ, నవరత్నాలదుద్దులూ, శిరోభూష ణాలూ, తోడాలూ, పచ్చలూ, ముత్యాలూ వజ్రాలూచెక్కిన కోట్లూ, వాలాదాలూ, జీనులూ, మేనాలూ, రత్నాలుచెక్కిన అంకు శాలూ, రత్నాలబొకులూ, బంగారం పాన్దానులూ, పన్నీరుబుడ్లూ, రత్నాలు తాపిన హుక్కాలూ, బంగారం మురుగులూ, దండకడి యాలూ, గొలుసులూ, లోహకవచాలూ, ఈటెలూ, గండ్రగొడ్డళ్లూ, కత్తులూ, డాళ్ళూ, వందమంది భోజనానికి సరిపోయే భోజనంపాత్రలూ-

* Sepoy war.

ఒకటేమిటి పల్లుకుట్టుకున్న పుల్లనించీ పల్లకీదాకా యావత్తూ కలకత్తా హామిల్టను కంపెనీ కిచ్చి పబ్లీకువేలం వేయించారు. "ఇనాళ్ళూ తమతో సమానంగా బతికిన ఒకరాజు తాలూకు గిన్నే తప్పేలా ఇండియారాజధాని కలకత్తా వీధుల్లో ఇంగ్లీషువాళ్ళు వేలంవేయడం చూసి, మిగిలినరాజుల హృదయాల్లో ఎలాంటి భావాలు రేగి వుంటాయి? దారిపోయే ప్రతీభారతీయుడూ తెల్లవాళ్ళని పడదిట్టడంటే వింతేమిటి? ప్రతిఅంతఃపురంలోనూ స్త్రీజనసంశాపనాకారాలు పెట్టారంటే చిత్రమేముంది? అయిపోయింది. నాగపురంరాజ్యం ఎర్ర రంగులో మునిగిపోయింది. వృద్ధరాణి బంకూబాయి దెబ్బతిన్న నల్ల తాచులా స్వాతంత్ర్యసమరంలో తెల్లవాళ్ళమీద గరళం కక్కింది.

ఝాన్సీ

ఝాన్సీ బుందేలుఖండంలో పేష్వాలకింద వున్న సామంతరాజ్యం. అక్బరుచక్రవర్తికాలంలో ఈప్రాంతం ఓరచ్ఛారాజు వీరసింహుడి పాలనకింద వుండేది. సుప్రసిద్ధమైన ఝాన్సీదుర్గం వీరసింహుడే నిర్మించాడు. ఝాన్సీ తరవాత ఛత్రసాలుపాలనకిందికి వచ్చింది. అతడు తనకి యుద్ధంలో సహాయంచేసిన పేష్వా బాజీరావు I కిచ్చాడు. బాజీరావు తన సేనాపతుల్లో ఒకడైన రఘునాథహరి నివాల్కరు కిచ్చాడు. ఆనాటినించీ 1857 వరకూ నివాల్కరు వంశంవాళ్లే ఝాన్సీ రాజ్యం పాలిస్తూవచ్చారు.

నివాల్కరు పూర్వులు బొంబాయి రత్నగిరిజిల్లా రాజపురం దగ్గిర పావసు గ్రామంనించి పూనా వచ్చారు. పేష్వా సేనలో సర్దారులుగా చేరారు. రఘునాథనివాల్కరుకి సంతానం లేదు. వార్ధక్యంలో అతడు తనతమ్ముడు శివరావుకి రాజ్యమిచ్చేసి కాశీ వెళ్ళిపోయాడు. అక్కడే 1796 లో కాలంచేశాడు.

కుంపినీవాళ్ళు మహారాష్ట్రం తమగుప్పెట్లో పెట్టుకోవాలని పాకులాడుతున్న దినాలవి. మెల్లిగా శివరావుతో నేస్తంకట్టారు. పరస్పరం స్నేహితులమని వొప్పందం రాసుకున్నారు.

శివరావుకి కృష్ణారావూ, రఘునాథరావూ, గంగాధరరావూ అని ముగ్గురు కుమాళ్ళు. కృష్ణారావు తండ్రి ముందు కాలంచేశాడు. అవిచారంతో శివరావు రాజ్యం వొదిలి బ్రహ్మావర్తం (బిహారు) వెళ్ళిపోయాడు. కుమారుడు రామచంద్రరావుని గద్దెమీదపెట్టి కృష్ణారావు భార్య సుఖోబాయి రాజ్యభారం వహించింది. రామచంద్రరావు మైనరుగావున్నప్పుడు 1817 లో కుంపినీకీ ఝాన్సీకి మరో వొడంబడిక జరిగింది. ఇందులో ఝాన్సీరాజుల వంశపారంపర్యంహక్కులు కుంపినీ ధృవపరిచింది.

రామచంద్రరావు ప్రయోజకుడయాడు. ఇంగ్లీషు వాళ్ళకి యుద్ధాల్లో మనసారా సహాయంచేశాడు. అందుకని 1832 లో అప్పటి గవర్నరుజనరలు బెంటింగు "మహారాజాధిరాజు," "ఫిదవీబాదుషా జాన్ - జానే - ఇంగ్లిస్తాను" అని బిరుదు లిచ్చాడు. అది జరిగిన మూడేళ్ళకి రామచంద్రరావు కీర్తిశేషుడయాడు. అతడికి కుమాళ్ళు లేరు. కృష్ణారావని వొక దత్తపుత్రుడు మాత్రముండేవాడు. అయితే సరిగా జరగలేదన్న కారణంచేత ఆదత్తతచెల్లలేదు. అతడి తమ్ముడు రఘునాథరావు గద్దెఎక్కాడు. కాని మూడేళ్ళలో అతడునూ కళ్ళుమూశాడు. అతడికిన్నీ కుమాళ్ళులేరు. మేమంటే మేమని నలుగురు వారసులు బయలుదేరారు.

రఘునాథరావు తమ్ముడు గంగాధరరావూ, రామచంద్రరావు దత్తపుత్రుడు కృష్ణారావూ, రఘునాథరావు వుంపుడుకత్తె బాందీగరజా కొడుకు ఆలీబహదూరూ, రఘునాథరావురాణీ - ఈనలుగురూ ఝాన్సీ

రాజ్యానికి ఉత్తరాధికార్లు మన్నారు. వీళ్ళ హక్కులు విచారించడానికి ఒక కమీషను ఏర్పడింది. గంగాధరరావుని వారసుడుగా నిర్ణయించింది. గంగాధరరావు సింహాసన మధిష్ఠించాడు. ఈయన వంశపారంపర్యమైన హక్కులు కుంపినీ, అంగీకరించింది. ఈగంగాధర రావే మహారాణీ లక్ష్మీభాయి భర్త.

1818 లో రాజ్యంపొదులుకుని పేష్వా బాజీరావు బిఠూరు వెళ్ళిపోయినప్పుడు, అతడి తమ్ముడు చీమాజీ కాశీ వెళ్ళిపోయాడు. అతడితో లక్ష్మీబాయి తండ్రి మోరోపంతు కూడా కాశీ వెళ్ళిపోయాడు. అక్కడే 1835 నవంబరు పదమూడున లక్ష్మీబాయి జన్మించింది. మణికర్ణిక అని తల్లిదండ్రులు నామకరణం చేశారు. ఆపేరు ముద్దుగా మనోబాయి అయింది.

చీమాజీ మరణించాక మోరోపంతు బాజీరావు దగ్గిరికి బిఠూరు వచ్చేశాడు. అక్కడ కొన్నాళ్ళకి మనోబాయితల్లి భాగీరథీదేవి కాలంచేసింది.

బాజీరావు దత్తపుత్రులు నానాసాహెబూ, రావుసాహెబూ, మనోబాయీ ఒక్కదగ్గిర ఆడుకుని ఒక్కదగ్గిర పెరిగారు. వారితో కలిసి ఆమె గుర్రపుస్వారీ, కత్తిసామూ మొదలయిన యుద్ధ విద్యలు నేర్చుకుంది. బాల్యంనించీ ఆమె భయమన్న దెరగదు. నానాసాహెబు ఆమెని 'ఛబీలీ' అని పిలిచేవాడు. విచిత్రమైన ఈబాల్యసంయోగమే లక్ష్మీబాయిని వీరాంగనగా తయారుచేసింది; నానాసాహెబుతోపాటు 1857 మహావిప్లవంలో నాయకత్వం ప్రసాదించింది.

ఒకనాడు నానాసాహెబు ఏనుగెక్కి వెళ్ళిపోతూ ఛబీలీని ఒదిలిపెట్టేశాడు. మొహం బుంగలాపెట్టుకుని "ఒక్కేమిటి, పదిఏనుగులు

వస్తాయి నాకు" అందామె. ఆ బాలికవాక్యం నిజమే అయింది. ఝాన్సీమహారాజు గంగాధరరావు 1842 లో ఆమెని వివాహంచేసుకున్నాడు. మన్నో బాయి మహారాణి లక్ష్మీబాయి అయింది.

గంగాధరరావు ఝాన్సీరాజ్యం నిత్యకల్యాణం పచ్చతోరణంగా పరిపాలించాడు. సాటిరాజు లతణ్ణి కాకాసాహెబు అని పిలిచేవాళ్లు. అత డెంత సమ్రతకలమహారాజో అంత రాచఠీవికలవాడు. పిసరంత అవమానం సహించేవాడు కాడు. అతడికాలంలో కుంపినీవాళ్లు ఝాన్సీలో కొంత అడ్డెపటాలం పెట్టారు. దానికి సాలీనా 2,27,458 రూపాయలు ఖర్చయేవి. ఈఅడ్డెసేనకి వొడంబడిక జరిగినప్పుడు, దసరానాడు ఈకుంపినీపటాలం మహారాజుకి వందనం తెలపాలని వొప్పందంజరిగింది. ఒకసంవత్సరం దసరానాడు ఆదివారం వచ్చింది. ఆదివారం సెలవు. అంచేత అవాళ పటాలం వందనం చెయ్యలేదని పటాలం కెప్టెను మహారాజుకి కబురంపాడు. అది వినడంతోనే గంగాధరరావు మండిపడ్డాడు. తన సంస్థానం పటాలంవేసుకుని కుంపినీ పటాలందగ్గిరికి వచ్చిపడ్డాడు. కెప్టెనుని పిలిచి ఈఅవిధేయతకి సంజాయిషీ చెప్పమన్నాడు. కెప్టెను సవినయంగా క్షమాపణ వేడుకున్నాడు. బుద్ధిమంతుడిలాగ పటాలంపట్టుకుని మహారాజుదర్బారుకి వెళ్ళాడు. వందనంచేసి వచ్చాడు.

గంగాధరరావు మంచి రాజపుత్రయువకులతో వొకపదాతికదళ మేర్పరిచాడు. ఒకగుర్రపుదళమూ, రెండువేల మందితో వొక పోలీసుదళమూ నిర్మించాడు. వందమంది మెరికల్లాంటి సిపాయిలతో వొక అంగరక్షకదళమున్నూ నియమించుకున్నాడు. ఫిరంగులున్నూ అధికంచేశాడు. ఝాన్సీలోని "శత్రుసంహార", "నల్దారు" ఫిరంగులు సుప్రసిద్ధమైనవి.

1851 లో మహారాణీ లక్ష్మీబాయికి ఒక కుమారుడు కలిగాడు. మహారాజు ఆనందానికి అంతం లేకపోయింది. రాజ్య మంతటా ఉత్సవాలు జరిగాయి. కానిపాపం, మూడుమాసాలునిండ కండానే రాకుమారుడికి నూరేళ్ళునిండిపోయాయి. ఆనందం దుఃఖం కింద పరిణమించింది. గంగాధరరావు మంచంపట్టాడు. మళ్ళీకోలుకో లేదు. మళ్ళనిరోగంతో అతడి జీవితాశ నశించింది. వంశాంకురం లేకపోయిందే అని మరింతబాధకలిగింది. 1853 లో తనబంధువర్గం లోంచి ఆనందరా వని అయిదేళ్ళకుర్రాణ్ణి దత్తత చేసుకున్నాడతడు. ఆనందరావుకి దామోదరరావని నామకరణం చేశారు.

సంస్థానపండితుడు వినాయకరావు శాస్త్రోక్తంగా దత్తత జరిగించాడు. ఝాన్సీలోను పేరుబడ్డ పౌరులూ, ప్రధానమంత్రి నరసింగరావూ, మామగారు మోరోపంతూ, లాలా లాహిరీమల్లూ మొదలయిన యావన్మందీ ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈఉదంతం కుంపినీ వాళ్ళకి గంగాధరరా వొక ఉత్తరం రాశాడు: "బుందేలుఖండంలో ఇంగ్లీషురాజ్యం కాలుపెట్టకముందే నాపూర్వులు ఇంగ్లీషువాళ్ళతో ఎలా నమ్మకంగా నడుచుకున్నదీ సీమలోకూడా తెలుసు. నేనున్నూ సర్కారువారి ప్రతీఅజ్ఞాపాలిస్తూ నేవచ్చాను.

"ఇప్పుడు నే నొక అసాధ్యమైన రోగంతో బాధపడుతున్నాను, నా అనంతరం నా వంశం అంతరించిపోతుం దన్న విచారం నన్ను బాధిస్తూవుంది. ఈ సమయంలో, లోగడ నా పూర్వులికి సర్కారు వారు రాసియిచ్చిన సంధిపత్రం జ్ఞాపకం చేస్తున్నాను. ఆ సంధిప్రకారం అయిదేళ్ళ ఆనందరావుని నేను దత్తత చేసుకున్నాను. అతడిపేరు దామోదరరా వనిపెట్టాను. ఈ కుర్రాడు నా రక్తబంధువు. నాకు మనవడవుతాడు. దేవుడి దయా, సర్కారువారి అనుగ్రహమూ వుండి,

మహారాజు గంగాధరరావు

(రాణీ లక్ష్మీబాయి భర్త)



సుభాస్ చంద్రబోస్

బిహార్ సుర్గం : ప్రధాన విస్ఫోటకేంద్రం
నానానాహేబు, రాణీ లక్ష్మీబాయి, తాంతియా టోపేలు
బాలసైనికులూ, యువవిద్యలూ ఇక్కడే జరిగాయి.

నేను త్వరలో ఆరోగ్యం పొందుతావని ఆశిస్తున్నాను. నా వయస్సు బట్టిచూస్తే నాకు భవిష్యత్తులో సంతానం కలగదని నిరాశకూడా లేదు. అలా అయినప్పుడు ఆలోచించుకోవచ్చు. దురదృష్టంవల్ల నేను రోగంనించి కోలుకోకపోవడమే జరిగినప్పుడు మాత్రం, నామీద ఇంతవరకూ సర్కారువారు ఏదయ చూపుతూ వచ్చారో, ఈబాలుడి మీద కూడా అదే దయ చూపించవలసిం దని కోరుతున్నాను. నా జీవితకాలంలో వుండినట్టుగానే నాభార్య లక్ష్మీబాయినే ఝాన్సీ మహారాణిగానూ, దామోదరరావు తాలూకు తల్లిగానూ, గార్డియనుగానూ భావించగోరుతాను. రాజ్యం సర్వాధికారాలూ ఆమె చేతిలోనే వుండాలి. ఆమెకి ఎవ్విధమైన ఇబ్బందీ కలగకూడదు."

ఈ ఉత్తరం కన్నీళ్ళతో, ఝాన్సీ అసిస్టంటు పొలిటికలు ఏజంటు మేజరు ఏలీసుచేతిలోపెట్టా డతడు. కుంపినీ తనకి రాసి యిచ్చిన వొడం బడికపత్రంలోని రెండో షరతునూ చూపించాడు. ఝాన్సీరాజులు, దత్తత చేసుకోవచ్చని స్పష్టంగా అందులో రాసి వుంది.

మహారాజు ఉత్తరమూ తన సిఫారసూ పొలిటికలు ఏజంటు మేజరు మాల్కమ్‌కి పంపించాడు.

తాను నమ్ముకున్న స్నేహితులు ఇంగ్లీషువాళ్లు తన న్యాయమైన కోరిక కాస్తా నెరవేరుస్తారన్న నమ్మకంతోనే మహారాజు గంగాధర రావు 1853 నవంబరు ఇరవైవొకటో తేదీని కాలంచేశాడు.

గంగాధరరావు కాలం చెయ్యడంతోనే ఝాన్సీ ఖజానాకొట్టు సీళ్లు వేశాడు మేజరు ఏలీసు. ఝాన్సీదుర్గం కాపలా వేయించాడు. పొలిటికలు ఏజంటు మాల్కమ్‌హేలీ ఝాన్సీరాజ్యం కుంపినీరాజ్యంలో కలిపేసుకుందా మని గవర్నరు జనరలుకి నివేదించాడు. ఇతడి నివేదన మవసరం లేకండానే డల్హౌసీ సిద్ధంగా వున్నాడు. అతడు లక్నో

యాత్రనించి తిరిగి రాగానే 1854 ఫిబ్రవరి పదిహేడున ఝాన్సీ ఇంగ్లీషురాజ్యంలో కలిపేసుకుందికి నివేదిక తయారుచేశాడు.

"మహారాణి లక్ష్మీబాయి పేరుచెప్పితేచాలు, ఝాన్సీప్రజలు చేతులు జోడించేవాళ్ళు. పొలిటికలు ఏజంటు ఆమెని లోగడ దేవీమూర్తి అని వర్ణించాడు. కుంపినీ ప్రభుత్వనిర్ణయం ఆమె విందిం రోషకంఠంతో అంది – 'నాభర్త ఇంగ్లీషుప్రభుత్వానికి నమ్మినబంటుగా వుండేవాడు! వాళ్ళ క్షేమమే కోరేవాడు!!' తన భర్తచేసినమేళ్ళు లోగడ ప్రభుత్వం ఎంతో మెచ్చుకుంది. అవన్నీ ఆమె జ్ఞాపకంచేసింది. ఒడంబడిక పత్రాలు చూపించింది. ఆ పత్రాలప్రకారమూ, ఆదినించీ ఝాన్సీరాజవంశంలో వున్న సంప్రదాయం ప్రకారమూ, దత్తతాధికారమున్నదని ఆమె రుజువుచేసింది. ఇంతకిముందు కొన్ని దేశీయ రాజ్యాలు దత్తత చేసుకున్నాయి. వాటిని కుంపినీ అంగీకరించింది. వాటి ఉదాహరణకూడా ఆమె ఎత్తిచూపింది. ఇవన్నీచూపి, తమ దత్తను అంగీకరించమని, ప్రార్థించింది. కాని ఆమె ప్రార్థనలన్నీ అడివి రోదన లయాయి. ఆమె ప్రయత్నాలన్నీ వ్యర్థమయిపోయాయి. కుంపినీ తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళని వాదించింది. దాని నిర్ణయానికి తిరుగులేకపోయింది. పైగా కుంపినీరాజ్యం మేలుకోసమే కాక, ఝాన్సీప్రజల క్షేమంకోసమే ఝాన్సీరాజ్యం కలిపేసుకున్నామని ప్రకటించారు.

"'ఈ దేశీయరాజ్యం ఇంగ్లీషుజిల్లాల నడిబొడ్డులోవుంది. ఇది మా చేతికి వచ్చేస్తే బుందేలుఖండం యావత్తూ మా రాజ్యమయిపోతుంది. దాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరచడానికి వీలవుతుంది' అంటూ తన చర్య సమర్థించుకున్నాడు డల్హౌసీ. ఈ కలిపేసుకోడంవల్ల ఝాన్సీ ప్రజలికి ఏమేమిమేళ్లు కలిగిందీ తరవాతిపరిణామం రుజువు చేస్తుంది.

కాని అది ప్రజల కెంతవరకూ నచ్చిందో, అదిమాత్రం కార్యరూపేణా వాళ్లు కనపరిచారు. అదునురాగానే ఇంగ్లీషుపరిపాలనకి వ్యతిరేకంగా విప్లవం లేవదీశారు." *

1854 వొకనాటి సుభముహూర్తంలో గవర్నరు జనరలు డల్హౌసీ ఝాన్సీప్రజలికి హుకుము జారీచేశాడు: "ఝాన్సీరాజ్యంలోని యావన్మంది ప్రజలికీ ఇంగ్లీషుసర్కారువారు తెలియజేసిందేమిటంటే -- ఝాన్సీ ఆఖరి పరిపాలకుడు గంగాధరరావు మహారాజు 1853 నవంబరు ఇరవై వొకటిని స్వర్గస్థు డయాడు. ఈ మహారాజు ఇంగ్లీషువారి ప్రతినిధిగా ఇంతవరకూ ఝాన్సీరాజ్యం పరిపాలించాడు. ఈయన ఎన్నడూ స్వతంత్రుడు కాడు. స్వాధీనుడయిన్ని వుండలేదు. ఈయన పూర్వులికి పేష్వాదగ్గిరనించి ఝాన్సీ సుబేదారీ లభించింది. పేష్వాఅధీనంలో వాళ్ళు సుబేదార్లుగా వుండేవాళ్ళు. 1817 లో పేష్వా ఇంగ్లీషు వాళ్ళతో సంధిచేసుకున్నాడు. అందులో ఆయన ఝాన్సీరాజ్యంమీద తనకి వుండుకున్న హక్కులు యావత్తూ ఇంగ్లీషుప్రభుత్వానికి ఇచ్చేశాడు. అవాళనించీ ఝాన్సీరాజ్యంమీద ఇంగ్లీషుప్రభుత్వానిదే అధికారం. ఝాన్సీగద్దెమీద మహారాజు కూచున్నాడంటే, అతడు ఇంగ్లీషువాళ్ల ప్రతినిధిగానే, వాళ్ళ అధీనంలో వుండే కూచున్నాడు. తమ అధీనంలో వుండే ఏరాజుకీ దత్తత చేసుకునే అధికారం ఇంగ్లీషు ప్రభుత్వం ఇచ్చి వుండలేదు. అలాంటిమరతు ఏదిన్ని అంగీకరించలేదు.

గంగాధరరావు మహారాజు బొరసపుత్రు లెవరూ లేకండా కాలం చేశాడు. ఆయన చేసుకున్న దత్తత గవర్నరుజనరలుగారు అంగీకరించలేదు. ఇంగ్లీషుసర్కారువారు 7-3-1854 న జారీ చేసిన ఆర్డరుప్రకారం

* కేను - 1857 విప్లవనచిత్ర.

ఝాన్సీరాజ్యం యావత్తూ బుందేలుఖండం అసిస్టంటు పొలిటికలు ఏజంటు మేజరు ఏలెసుగారిఅధీనం చెయ్యడమయింది.

"ఇవాళనించీ రాజ్యమంతటా ఇంగ్లీషుసర్కారువారి శాసనమే అమలుజరుగుతుంది. ప్రజలు యావన్మందీ ఇంగ్లీషుసర్కారువారి అధీనంలోనే వుంటారు. అంచేత ఇకనించీ పన్నులూ అవీ మేజరు ఏలెసుగారి పరంగానే చెల్లించాలి." ఈ ప్రకటనతో ఝాన్సీ ఇంగ్లీషు రాజ్యంలో కలిసిపోయింది. మహారాణి అర్జీలు బుట్టదాఖలా అయాయి. లండనులో కోర్టాఫ్డైరెక్టర్లదగ్గిర అపీలు దాఖలుచెయ్యడానికి నిశ్చయించింది దామె. ఉమేశచంద్ర బెనర్జీ అని వొక బెంగాలీ వకీలునీ, వొక ఇంగ్లీషువకీలునీ అరవై వేలు రూపాయలిచ్చి ఇంగ్లాండు పంపించింది. ఈ ఇద్దరు తగుమనుషులూ అరవై వేలూ జేబులో వేసుకున్నారు. నాటికీ నేటికీ అయిపులేకండా అయిపోయారు.

1854 ఆగస్టు నాలుగున కోర్టాఫ్డైరెక్టర్లు ఝాన్సీ కుంపినీ కలి వేసుకున్న నిర్ణయం ధృవపరుస్తూ ప్రకటించారు. మేజరు స్కీను ఝాన్సీ కమీషనరయి కూచున్నాడు. మహారాణి లక్ష్మీబాయికి నెలకి అయిదు వేలు ముండభరణ మేర్పరిచారు. రాణివాసం దాటి ఆమె బైటికి వెళ్ళరాదని నిషేధించారు. అప్పటికి మహారాణి వయస్సు పందొమ్మిది దేళ్ళు.

డల్హౌసీ లక్ష్మీబాయిరాజ్యం ఇంగ్లీషురాజ్యంలో కలిపేసుకుని ఘన కార్యం చేశానని కులికాడు. కాని నల్లతాచు తోక తొక్కానని కల్లోకూడా కానలేకపోయాడు. ఝాన్సీరాణి కన్యాకారాగతమృత్యువని గ్రహించలేకపోయాడు. "నాఝాన్సీ నే నివ్వను" అంటూ ఉరిమి ఆవీరాంగన స్వాతంత్ర్యరణరంగంలో వురికి, ఇంగ్లీషురక్తం వరదలు కట్టించిన వీరచరిత్ర ముందు పర్వాల్లో పరికిస్తాం.

"సతారా, నాగపురం, ఝాన్సీ రాజ్యాలు అంతం చెయ్యడమే ఈ (1857) విప్లవానికి ముఖ్యమైన మొదటి కారణమైంది. గవర్నరు జనరలు చేసినపని దేశీయరాజుల్లో అడలు పుట్టించింది. తామిక ఎన్నటికీ తలఎత్తకండా ఇంగ్లీషుప్రభుత్వం వొక కేంద్రపరిపాలన దేశమంతటా స్థాపించబోతున్నదని వాళ్ళకి దిగులు పట్టుకుంది. హిందూ ధర్మశాస్త్రంలో దత్తతపద్ధతి సర్వోత్తమమైంది. దానిని కూకటి వేళ్ళతో పెల్లగించి డల్హౌసీదొర భారతీయుల హృదయాల్లో విప్లవాగ్ని రగులుకొలిపాడు.*"

సంబలపురం

సంబలపురం ఒడిశా రాజ్యంలోది. సంబలపురంరాజు నారాయణ సింహదేవు 1850 లో మరణించాడు. అతడికి కుమార్లులేరు. ఆరాజ్యం కూడా లాప్సుపద్ధతి మీద డల్హౌసీ కలిపేసుకున్నాడు. నారాయణ సింహదేవుతమ్ముడు సురేంద్రసాహి అప్పటికి హజారీబాగుజెయిల్లో ఖైదీగావున్నాడు. 1856 లో అక్కడ సిపాయిలు తిరగబడ్డారు. జెయిలు పగలగొట్టారు. సురేంద్రసాహిని విడిపించుకు వచ్చేశారు. సురేంద్ర సాహి సంబలపురం వచ్చి రాజసింహాసనంకోసం ప్రయత్నించాడు. ఇంగ్లీషువాళ్ళ ఇనపపిడికిలి సడలలేదు. దాంతో సురేంద్రసాహి విప్లవం లేవదీశాడు. చుట్టుపక్కల భూస్వాములున్నూ సురేంద్రసాహితో చేతులుకలిపారు. కటకంనించి ఇంగ్లీషుసైన్యం వెళ్ళింది. విప్లవకారులు అరణ్యాలే దుర్గాలుగా పెట్టుకున్నారు. కుంపినీసేనలు గెలుపు సాధించ లేకపోయాయి.

సురేంద్రసాహి 1857 లోనే కాదు, 1861 వరకూ విప్లవం సాగించాడు. కుంపినీవాళ్ళని ముప్పుతిప్పలూ పెట్టాడు. మూడుచెరు

* Dalhausie's Administration of British India.

వులనీళ్ళూ తాగించాడు. విప్లవకారుల్ని క్షమించామని రాణీప్రభుత్వం ప్రకటించాక 1862 మే లో సురేంద్రసాహి ఆత్మసమర్పణం చేశాడు. అయితే ప్రభుత్వంమాత్రం క్షమించలేదు. అతణ్ణి అరస్టు చేసింది, చాందాజైల్లో ఖైదీగాపెట్టింది. సురేంద్రసాహి జైల్లోనే ఖైదీగా కాలంచేశాడు. ఈయనవంశంవాళ్లు ఇవాళకూడా సంబలపురంలో వున్నారు.

సురేంద్రసాహిలాగే సింహభూమిరాజు అర్జునసింహదేవు 1857 స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్నాడు. సింహభూమిప్రాంతంలో ప్రబలమయిన విప్లవం లేవదీశాడు. ఒక ఏడాదిపాటు కుంపినీని గజగజ లాడించాడు. అర్జునసింహుడిజ్ఞాతి షడయికళ కుమారసాహెబూ. ఖరసువాఁ తాకూరుసాహెబూ ఇంగ్లీషువాళ్ళకి సహాయంచేశారు. అర్జునసింహదేవుని ఓడగొట్టారు. *

తంజావూరు

తంజావూరు రాజ్యంకూడా ఈలాప్సుపద్ధతిప్రకారం డల్హౌసీ కలిపేసుకున్నాడు. తంజావూరు రాజు తన ఇద్దరు కుమార్తెలనీ పదహారుగురు రాణుల్నీ వొదిలిపెట్టి 1855 లో మరణించాడు. తన రాజ్యం అక్రమంగా కలిపేసుకున్నారని తంజావూరురాణీ కామాక్షీబాయి మద్రాసు గవర్నమెంటుమీద సుప్రీముకోర్టులో దావావేసింది. సుప్రీముకోర్టు ఆమెపక్షం తీర్పుచెప్పింది. దానిమీద మద్రాసుప్రభుత్వం ప్రీవీకౌన్సిలుకి అపీలుచేశారు. మద్రాసు ప్రభుత్వం రాజ్యంగచట్టం (An act of State) ప్రకారం తంజావూరు రాజ్యం కలుపుకున్నారు. అంచేత సుప్రీముకోర్టు తీర్పుచెప్పడానికి అధికారంలేదు అంటూ తీర్పుచెప్పారు. ప్రీవీకౌన్సిలులో వొక న్యాయమూర్తి మాత్రం తంజావూరురాజ్యం

* ओडिसा इतिहास (ओडिआ) - ङ हरेकृष्ण महताब।

కుంపినీ కలుపుకోడం అన్యాయమని వాదించాడు. "తంజావూరు స్వతంత్రరాజ్యం. కుంపినీ చేసుకున్న వొడంబడికలలో దీనిని లాక్కోడానికి కుంపినీకి అధికారం లేదు" అన్నా డతడు. దక్షిణదేశంలో కళల కాటపట్టయిన తంజావూరు సంస్థానం డల్హౌసీ కబళంలో పడిపోయింది.

ఇలాగే లాప్సు బ్రహ్మాస్త్రం ప్రయోగించి బ్రిటిషుసామ్రాజ్య మహా నిర్మాత డల్హౌసీ ఉదయపురం, జైతపురం, బఘాతురాజ్యాలు కుంపినీ రాజ్యంలో కలిపేశాడు. ఉదయపురం బఘాతురాజ్యాలు తిరిగి ఇచ్చెయ్యడానికి తరవాతవచ్చిన కానింగు ప్రయత్నించాడు. కాని సీమదేవుళ్ళు కుంపినీ డైరెక్టర్లుమాత్రం అంగీకరించలేదు.

"లడ్‌లో అనేఅతడు British India Vol. 11 P 190 లో ఇలారాశాడు: 'మగసంతానంలేని రాజులరాజ్యాలు లాక్కుంటామని గవర్నరుజనరలు ప్రకటించినప్పటినించీ, అదేం చిత్రమోకాని, రాజులు నిస్సంతుగా చావడం తరుచయింది.'

ఎదటివాళ్ళ తలలు తరిగి తెచ్చినవాళ్ళకి 10, 15 వేల రూపాయలు బహుమతి ఇస్తామని కుంపినీవాళ్లు ఆఫ్గనిస్థానంలో ప్రకటించిన సంగతి మనం చూశాం. రాజ్యతృష్ణాపరులు ఎంతటి పాపకార్యాలయినా చెయ్యడానికి జంకరు. మృతసమ్మతంగా రాజ్యాలు వేసుకోవాలని ఎదురు చూస్తూవున్న కుంపినీవాళ్ళు దేశీయరాజుల్ని నిస్సంతుగా పరలోకానికి పంపడానికి ఎలాంటి రహస్యమైన కపటోపాయాలు చేశారో ఎవరి కెరుక? ఏం విషాలు పెట్టించారో, ఏం సంతాననిరోధమందులు పెట్టించారో, ఏం కూనీలు చేయించారో ఎవళ్ళు చెప్పగలరు? రాజుల్ని ఇంద్రియలోలత్వానికి దింపి, వాళ్ళని నిర్వీర్యుల్ని చేసి, నిస్సంతుగా చెయ్యడానికి, వాళ్ళ కెంతమంది కులటలని తార్పించారో ఎవరికి తెలుసు? అలాకాకపోతే, మృతసమ్మతాలు వేసుకుంటామని గవర్నరుజనరలు చెప్ప

గానే, రాజులందరూ నిస్సంతుగా చావాలా? ఇదేం చిత్రం! ఇది కేవలం కాకతాళీయమని చెప్పడానికి వీలా?" *

ఆర్కాటు నవాబు

లాప్సుపద్ధతిప్రకారం రాజ్యాలేకాదు రాజులూ, నవాబులూ బిరుదులూ అవీకూడా వూడపీకాడు డల్హౌసీ. వాళ్ళ మనోవర్తులికికూడా నీళ్లు పోశాడు. ఆర్కాటు (కర్ణాటక) నవాబు కాలంచేశాక, అతడి కుమారుడు నవాబుబిరుదు వుంచుకోకూడదన్నాడు.† అసలు మలబారు కోస్తాలో ఇంగ్లీషువాళ్ళకి ఆస్కారమిచ్చినవాడు ఆర్కాటునవాబు. గిడ్డంగులు కట్టుకుందికి ఇంతచోటిచ్చి ఆదుకున్నవాడతడు. రక్షించిన వాణ్ణి భక్షించరా అన్నట్టు తుదకి అతడి కర్ణాటకరాజ్యంమీదే కన్ను వేశారు బ్రిటిషువాళ్ళు. నవాబు మహమ్మదాలీ వాలాజాహ (1749—1795) తో నేస్తం కట్టి, 1792 లో వొడంబడిక రాసుకున్నారు. ఇంగ్లాండురాజూ, యువరాజూ స్వహస్తాలతో ఇతడికి ఉత్తరాలు రాసేవాళ్ళు. ఇతడి అనంతరం ఇతడి కుమారుడు ఓదమతుల్ వుమ్రా (1795—1801) నవాబయ్యాడు. టిప్పుసుల్తాను మీద దండయాత్ర చేసినప్పుడు కర్ణాటరాజ్యం తమపరం చెయ్యమని ఓదమతుల్ వుమ్రాకి వెలస్లీ ఉత్తరం రాశాడు. ఉమ్రా అంగీకరించలేదు. టిప్పు

* బ్రిటిషుమహాయుగం. 1102, 1103 పు.

† The Principle of laps was also applied to sweep away the titles and pensions of the rulers of some states, on the ground that "appearances without the reality of authority were sure to shake Native confidence" in the "good faith" of the Company. Thus on the death of the Nawab of the Carnatic in 1853, Lord Dalhousie decided not to recognise any one as his successor. He wanted also to abolish the title of the nominal Delhi Emperor, in which, however, he was not supported by the Court of Directors.
—An Advanced History of India. Part III.

సుల్తాను కుమార్ళ్ని కుంపినీవాళ్లు తాకట్టుపెట్టుకున్నప్పుడు, ఆకుర్రాళ్ళ దగ్గిరవున్న నౌకర్లిద్దరితో కలిసి కర్ణాటకనవాబు కుంపినీమీద కుట్ర పన్నాడని వెలస్లీ వొక అభూతకల్పన కల్పించాడు. ఇది పచ్చిఅబద్ధమని మిల్లూ మొదలయిన చరిత్రకారులే ఘంటాపథంగా చెప్పారు. ఓదమతుల్ వుమ్రా చీపాకుభవనంలో 1801 ని కాలంచేశాడు. తండ్రి కుట్రతో సంబంధముందంటూ వుమ్రాకుమారుడు ఆలీహుసేనుని తప్పించి నవాబు మేనల్లుడు అజీముద్దౌలాను తెచ్చి కుంపినీవాళ్ళు గద్దెమీద పెట్టారు. అతడితో కొత్తఒడంబడిక రాయించుకున్నారు. కర్ణాటరాజ్యం యావత్తూ కుంపినీపాలనకింద వుండేట్టూ, రాజ్యం ఆదాయంలో అయిదోవంతుమాత్రం నవాబుకి శాశ్వతంగా కుంపినీ ఇచ్చేట్టూ వొడంబడిక జరిగింది. ఈ శాశ్వత మన్నమాట శాశ్వతంగానే వుంటుందని ఆశపడ్డాడు నవాబు. తన వంశీకులు శాశ్వతంగా నవాబు లనిపించుకుంటారనే అనుకున్నాడు. డల్హౌసీ వచ్చాక, ఆ "శాశ్వతం" అశాశ్వతమయిపోయింది.

మద్రాసూ, పూనమల్లీ, కడలూరూ, చంగల్పట్టూ మొదలయిన యావత్తుజిల్లాలూ ఇంగ్లీషువాళ్ళ చేతిలోనే వున్నాయి. అయితే 1801 వొడంబడికప్రకారం రాజ్యమేమో నవాబుదనీ, అతడిస్థానే కుంపినీ పాలిస్తున్నదనీ, అందుకనే అయిదోవంతు రాబడి అతడికిస్తున్నారనీ అర్థం. లాఫ్లుప్రకారం ఆ వొడంబడిక సున్నాచుట్టాడు డల్హౌసీ. సార్వభౌమాధికారంలో వున్న ప్రభుత్వం వొడంబడికలకి బద్ధంకానక్కరలే దన్నాడు. నవాబుకిచ్చే అయిదోవంతు ఆదాయం ఆపేశాడు. ఏదో ఇంత మనోవర్తి ఏర్పరిచాడు. నవాబు మహమ్మదు గౌజు 1853 లో చచ్చిపోగానే అతడికుమారుడు ఆజిముద్దూని నవాబు బిరుదు తీసేశామని ఫర్మానా పంపాడు.

హైదరాబాదు

డల్హౌసీ ఇండియా వదిలి వెళ్ళేలోపున ఇటు హైదరాబాదూ, అటు అయోధ్యా – "ఈ పెద్ద మహమ్మదీయరాజ్యాలు రెండూ కలిపేసుకోవాలనే నిశ్చయించుకున్నాడు. అయితే పంజాబూ, బర్మాయుద్ధాల వల్ల అది కొంచెం ఆలస్యమయింది. తీరుబడి కావడమే తడువు, అయోధ్యా, హైదరాబాదునించి, సారవంతమైన కొంతభాగమూ కలిపేసుకునే వెళ్ళాడు."

వెలస్లీ రాజనీతిఫలితంగా 1798 లో హైదరాబాదు నిజాముమీద అద్దెసేనలు తిష్ఠవేశాయి. ఈ ఘనకార్యం సాధించినందుకు కుంపినీ అధికార్లు వెలస్లీకి ఇరవై సంవత్సరాలపాటు ఏటా అయిదు లక్షలు ఇనాం ఏర్పాటుచేశారు. ఈ అద్దెసేనలు భరించలేక నవాబు అప్పుల పాలయిపోయాడు. 1854 నాటికి కుంపినీవాళ్ళకి డబ్బయిఅయిదులక్షలు బకాయిపడ్డాడు. అదేమిషగా తీసుకున్నాడు డల్హౌసీ. "నీ రాజ్యం ఏమీ బావుండలేదు. మరికొంత అద్దెసేన నీకు పంపిస్తాం" అంటూ నవాబుకి జాబు రాశాడు. "అంతేకాదు, మాబాకీయావత్తూ మాకు చెల్లించు. లేదా, బీరారురాష్ట్రం మాదగ్గిర కుదువపెట్టు. దీంతో నీబాకీ తీరిపోతుంది. ఇకముందున్నూ సులువుగావుంటుంది" అన్నాడు. బీరారురాష్ట్ర మంటే అప్పటి హైదరాబాదురాజ్యంలో మూడోవంతన్నమాట. ఇది తుంగభద్రా, కృష్ణానదులమధ్య ప్రదేశం. పత్తీ, సల్లమందూ ఇక్కడ దివ్యంగా పండుతుంది. అంతేకాక, అప్పుడు బొంబాయిలో బట్టలమిల్లు లారంభమయాయట! బీరారు పత్తి ఆ మిల్లులికి పోయిందో, సీమకినష్టం రావచ్చట! అంచేతకూడా డల్హౌసీ ముందు బీరారు తీసుకోవాలని సంకల్పించాడట!

నవాబు కొంచెం వ్యవధి ఇమ్మంటూ ప్రాథేయపడ్డాడు. లాభం లేకపోయింది. బీరారు ఇంగ్లీషువాళ్ళచేతికి వచ్చేసింది. ఆవూపుని హైదరాబాదు యావత్తూ ఎలాగో డల్హౌసీ కలుపుకునేవాడే. కాని హైదరాబాదు ప్రధానమంత్రి సామర్థ్యంవల్ల అది సాధ్యపడలేదు. అయితే ఈ సాలారు జంగు 1857 స్వాతంత్ర్యసమరం హైదరాబాదులో విజృంభించకండాచేసి కుంపినీవాళ్ళకే తోడ్పడ్డాడు.

అయోధ్య

డల్హౌసీ ఆఖరికబళం అయోధ్య. అయోధ్యలో ఆదినించీ కుంపినీ వాళ్లుచేసిన అన్యాయాలే 1857 లో అయోధ్యయావత్తూ రక్తనదులు ప్రవహించడానికి కారణమయింది. అందుకనే విప్లవానికి అతిముఖ్య మైనకారణాల్లో అయోధ్యవొకటి అన్నారు చరిత్రకారులు. అయోధ్య అందమైనదేశం. పాడిపంటలదేశం. సైభవమైనదేశం. బలిష్ఠమైన వెదుళ్ళవనాలతోనూ, దట్టమైన చల్లని మామిడితోటలతోనూ, పచ్చటి మైదానాలతోనూ, పంటచేలతోనూ కలకలలాడుతూన్న దేశం. వారనుహేస్టింగ్సు నాటినించీ ఇంగ్లీషువాళ్ళదృష్టి అయోధ్యమీద పడింది. కుంపినీకి అయోధ్య దాదివంటి దన్నాడు సర్ హెన్రీ లారెన్సు. విప్లవంనాటికి కుంపినీపటాలంలో దేశమంతటా వున్న సిపాయిల్లో అయోధ్యనించివచ్చిన సిపాయిలే మెరికల్లాంటివాళ్ళు. బెంగాలు పటాలంలో మూడువంతులుమంది అయోధ్య సిపాయిలే.

బెంగాలూ, హైదరాబాదుల మల్లేనే అయోధ్య మొగలు సామ్రాజ్యంనించి విడిపోయిన నవాబురాజ్యం. నవాబు సఫ్దరుజంగు (1739—1754) ని డిల్లీపాదుసా వజీరుపదవిఇచ్చాడు. అది అయోధ్య నవాబులకి వంశపారంపర్యంగా నిలిచిపోయింది. అంచేత అయోధ్య నవాబుల్ని వజీర్లనికూడా అంటారు.

కుంపినీవాళ్ళు ఓంప్రథమంగా 1765 లో అయోధ్యనవాబు సుజా ఉద్దౌలా (1754—1775) తో నేస్తం కట్టారు. అతడిరాజ్యంలో అద్దెసేన పెట్టారు. సాలీనా పదహారులక్షలు ఇచ్చుకోమన్నారు.

సుజాఉద్దౌలా కాలంచేశాక, అతడికుమారుడు అసఫుద్దౌలా (1775—1797) గద్దె ఎక్కాడు. రోహిలాల నాశనానికి ఇతణ్ణే వారనుహేస్టింగ్సు వినియోగించాడు. కాశీరాజు చైతసింగు కుట్రలో కలిశారని మిషపెట్టి ఇతడి ముసిలితల్లినీ, నాయనమ్మనీ హింసించి, వాళ్ళ కోటీ ఇరవైలక్షుల నగలు దోచుకున్నాడు. "వారన్‌హేస్టింగ్సు ఇండియాఖండిలి వెళ్ళేసరికి అయోధ్య కుంపినీవాళ్ళ ఆశ్రిత రాజ్యంగా తయారయింది." అద్దెసేనల కిచ్చుకోవలసిన మొత్తం సాలీనా డబ్బయి నాలుగులక్షలికి పెరిగింది. కారనువాలీసుకాలంలో 1788 న నవాబు మంత్రి హైదరుబేగు కృషివల్ల ఈమొత్తం యాభైలక్షలికి తగ్గింది. కాని తరవాతవచ్చిన సర్ జాను షోరు ఈ మొత్తం క్రమేపీ హెచ్చిస్తూ వచ్చాడు. దాంతోనే నవాబు బాధపడుతూవుంటే మళ్ళీ 1797 లో మరిరెండు గుర్రపుదళాలు తెచ్చిపెట్టాడు. వాటికని అయిదున్నర లక్షలు సాలీనా అదనంగా ఇచ్చుకోమన్నాడు. నవాబు నాతరంకాదన్నాడు. దాంతో అతడిమంత్రిని మహారాజ జలాలుని ఖైదులో పెట్టాడు. తుదకి విధిలేక వొడంబడికమీద నవాబు సంతకంపెట్టాడు. ఆవిచారంతోనే మంచంపట్టి అతడు ఆసంవత్సరమే కాలంచేశాడు.

అసఫుద్దౌలా కాలంచేశాక, అతడికుమారుడు వజీరాలీ గద్దె ఎక్కాడు. కొన్నాళ్ళయాక కుంపినీవాళ్ళు వజీరాలీ అసఫుద్దౌలా బోరస పుత్రుడు కాడని పుట్టించారు. అసఫుద్దౌలా సోదరుణ్ణి సాదతాలీని (1798—1814) తెచ్చి గద్దెఎక్కించారు. అతడితో వొక కొత్త వొడంబడిక రాసుకున్నారు. అసలు ఆ కొత్తవొడంబడికకోసమే సాదతాలీని గద్దెఎక్కించారు.

"పాతబాకీ యావత్తూ నవాబు తీర్చెయ్యాలి. అలహాబాదుకోట కుంపినీ కిచ్చెయ్యాలి. దాని మరమ్మత్తులకోసం నవాబు ఎనిమిదిలక్ష లచ్చుకోవాలి. తనకి గద్దె యిచ్చినందుకుగ్నూ మరిపన్నెండు లక్షలత డిచ్చుకోవాలి. వజీరాలీకి సాలీనా లక్షాయాభై వేలు మనోవర్తి ఇవ్వాలి. సేనలకని అంతవరకూ నవాబు కుంపినీకి చెల్లిస్తూవున్న కప్పం యాభై ఆరులక్షలనించి సాలీనా డబ్భయిలక్ష లివ్వాలి" – ఇదీ ఈ వొడంబడిక సారాంశం. అన్నిటికీ తలవూపాడు సాదతాలీ.

గద్దెదించేసిన వజీరాలిని అయోధ్యనించి పట్టుకుపోయి కాశీలో పెట్టారు. అక్కడ అతడు కుంపినీరాజ్యం కూలదొయ్యడంకోసం పెద్ద ఎత్తుని విప్లవం లేవదియ్యాలని ప్రయత్నించాడు. బ్రిటిషురెసిడెంటు చెర్రీని, మరికొంతమంది ఇంగ్లీషువాళ్ళని చంపేసి పారిపోయాడు. బెంగాలూ, బీహార్లనించికూడా కొంతసహాయం సంపాదించాడు. పెద్ద గుంపుచేర్చుకుని అయోధ్యలో వీలయినచోట్ల కొల్లగొట్టాడు. కాబూలు జమానుషా సహాయంకూడా కోరాడు. కాని అంతలోనే బ్రిటిషువాళ్ళతణ్ణి పట్టేశారు. కలకత్తాకు పట్టుకుపోయారు. విలియం కోటలోనిర్బంధించారు. అక్కడే అతడు 1817 లో కీర్తిశేషుడయాడు.

సాదతాలీ గద్దెనెక్కిన సంవత్సరమే వెలస్లీ రంగంమీదికి వచ్చాడు. అప్పటికే అయోధ్యరాజ్యం అధ్వాన్నంగావుంది. మరి కొన్నాళ్ళకి మరింత పాడయింది. నవాబు బకాయిపడ్డాడు.

అయోధ్య బాగుచేస్తా నంటూ వెలస్లీ నవాబు సాదతాలీతో బేరం ప్రారంభించాడు. 1801 లో బలవంతంగా వొక వొడంబడిక రాయించుకున్నాడు. ఆ వొడంబడిక ప్రకారం గంగా యమునలమధ్య భూఖండం అలహాబాదూ మొదలయిన దోబుపరగణా, రోహిలాఖండమూ అద్దె సేనలకని నవాబు కుంపినీకి చెల్లిస్తూవున్న డబ్భయిఆరులక్షలకి బదు

లుగా లాక్కున్నాడు. ఈ రెండు పరగణాల ఆదాయం సాలుకి కోటీ ముప్ఫయిఆరు లక్షలు. అంటే అంతవరకూ కుంపినీ సాలీనా పుచ్చుకుంటూవున్నదానికంటే మరి యాభై లక్షలు అధికమన్నమాట! అదీ వెలస్లీ అయోధ్య భాగుచెయ్యడం!

ఇలా అక్రమంగా అయోధ్యనించి కొంతరాజ్యం అపహరించడం క్రిమినలు నేరమని పార్లమెంటులో వెలస్లీని దుయ్యబట్టారు. కాని ఫలితంమాత్రం శూన్యమయింది.

అయితే ఈ 1801 వొడంబడికలో మిగతా అయోధ్యరాజ్యం వంశపారంపర్యంగా నవాబు అనుభవించవచ్చన్నారు. ఎన్నడూ నవాబు పాలనలో కుంపినీ జోక్యం కలిగించుకోదన్నారు. ఇతర్లు అయోధ్య మీదికివస్తే కుంపినీ సహాయం చేస్తుందన్నారు. అయినా అడపా దడపా తమకిఅవసరం వచ్చినప్పుడల్లా ఈ'దాది' నించి కోట్లుకోట్లు పిండుకున్నారు. చిన్నచిన్న వ్యవహారాల్లోకూడా రెసిడెంటు కలగజేసుకున్నాడు. "అయోధ్యరాష్ట్రంలో బ్రిటిషువాళ్ళు కలగజేసుకోడం ఇంగ్లీషువాళ్ళకీర్తికెంత కళంకమయిందో, అయోధ్యదర్బారుకీ, ప్రజలికీ అంత నాశనహేతు వయింది. అయోధ్యగురించి రాసిన ప్రతీరచయిత రచనా ఇదే రుజువుచేసింది."*

ఇటు రాజ్యంలో అడుగడుక్కీ కలగజేసుకుంటూనే అటు డిల్లీ పాదుషాసించి నవాబుని విడదియ్యడానికి ప్రయత్నిస్తూవుండేవాళ్ళు. మాయిరాదొర నవాబు గాజీఉద్దీను హైదరుకి (1814—1827) "అయోధ్యపాదుషా" అని బిరుదిచ్చాడు. అయితే అయోధ్య

* The facts furnished by every writer on Oudh affairs, all testify to the same point, that British interference with that province has been as prejudicial to its court and people as it has been disgraceful to the British name". — Sir Henry Lawrence.

మొగలుదర్బారునించి ఎంత దూరమవుతూవుంటే, కుంపినీసంకెళ్లు అంత బిగిసిపోతూవుండేవి.

1837 లో నవాబు ఆలీషా (1837—1842) తో గవర్నరుజనరలు అర్లండు వొకవొడంబడిక చేసుకున్నాడు. అయోధ్యమీద కుంపినీ మరింత పలుకుబడి సంపాదించుకుంది. అయితే ఇందులోని షరతులన్ని టికీ కుంపినీడై రెక్టర్లు సమ్మతించలేదు. అయోధ్య కలిపేసుకునేముందు ఆమాటకాస్తా నవాబు చెవిలో వేశారు.

1847 లో వజీదాలీ అయోధ్యగద్దెమీదికి వచ్చాడు. ఇతడు అయోధ్య అభివృద్ధికి అన్నివిధాలా ప్రయత్నించాడు. గద్దెమీదికి రాగానే ముందు తనసైన్యం మంచిపద్ధతులమీద సంఘటితపరిచాడు. కట్టుదిట్టమైన నియమా లేర్పరిచాడు. లక్నోలోవున్న పటాలాలు యావత్తూ సూర్యోదయానికిముందు కవాతుమైదానంలో హాజరు కావాలి. తనముందు కవాతుచెయ్యాలి. ఏదయినా పటాలం ఆలస్యంగా వచ్చిందో, రెండువేలు జరిమానా ఇచ్చుకోవాలి. "వజీదాలీ తననియమాలు ఎంతవిధిగా పాలించేవాడంటే, ఏ కారణంచేతనయినా తాను ఆలస్యంగా వచ్చినాసరే జరిమానా ఇచ్చుకోవలసిందే. అయితే ఒక్కనాడూకూడా తాను ఆలస్యంకాలేదు. ఉదయంనించీ మధ్యాహ్నందాకా పటాలాలన్నీ కవాతుచేసేవి. తానలా గుర్రంమీద నుంచునే వుండేవాడు." *

వజీదాలీ అమలులో అయోధ్య వెనకటి వైభవానికి వచ్చేసూచనలు కనిపించాయి. దాంతో కుంపినీవాళ్ళ కళ్ళుకుట్టాయి. "ఇదుగో ఇలాంటిపను లేవీ నువ్వు చెయ్యకూడదు. పటాలం కవాతూ అదీ పనికిరాదు" అంటూ నవాబుకి ఫర్మానా పంపారు. పాపం, నవాబు

* Metcalf.

తలవొంచుకు వూరుకున్నాడు. పటాలంమైదానం మొహమే చూడడం మానేశాడు.

ఇంతలో డల్హౌసీ గవర్నరుజనరలుగా వచ్చాడు. అన్నిటితోపాటు అయోధ్యమీదా అతడి దృష్టిపారింది. అయితే లాప్సుబాణం ప్రయోగించడానికిఅయోధ్యలో వీలులేకపోయింది. వజీదాలీ గత నవాబు అంజాదలీషా (1842—1847) ఔరసపుత్రుడు కాదనడానికి వొడుపు చిక్కలేదు. వజిదాలీకికూడా ఇంటిల్లిపాదీపిల్లలు కలకలలాడుతున్నారు. పోనీ తనపూర్వులు చేసుకున్న వొడంబడికలయినా ఉల్లంఘిస్తున్నాడా అంటే అదీలేదు; అక్షరాలా పాలిస్తున్నాడు. ఏమిటి సాధనం? తాను వెళ్ళిపోయేముందు అయోధ్య కలిపేసుకోవాలనే డల్హౌసీ తపన. అంచేత అతడు మరో ఎత్తుఎత్తాడు. అయోధ్యపరిపాలన బావుండలేదు కనక అది కలిపేసుకుంటా మన్నాడు. అంతకిముందు చేసుకున్న వొడంబడికలికి తిలోదకాలిచ్చాడు. దానికి కుంపినీ డైరెక్టర్లున్నూ సంయ్యే అన్నారు.

ఒకరాజునో నవాబునో గద్దెదించెయ్యాలంటే, అతడిమీద ఉన్నవీ లేనివీ కల్పించడమూ, అతడి నైతికజీవనం బావుండలేదనడమూ, కుంపినీవాళ్ళు మొదటినించీ చేస్తూవచ్చిన కుటిలోపాయాల్లో వొకటి. లోగడ సిరాజుద్దౌలామీదా, తరవాత మీర్జాఫరుమీదా, సతారారాజు ప్రతాపసింగుమీదా, ఝాన్సీలక్ష్మీబాయిమీదా, పేష్వాబాజీరావుమీదా ఎన్నోఅన్ని అబద్ధాలు సృష్టించారు. అలాగే నవాబు వజీదాలీమీదా అభాండాలు పుట్టించారు. గ్రంథాలు రాయించారు. The private life of an Eastern king అన్నగ్రంథం వాటిలో వొకటి. డల్హౌసీజీవితంరాసిన ఆర్నాల్డుకూడా ఇలాంటిదే వొకగ్రంథం రాశాడు. దానిలోని అబద్ధాలమీద ఆధారపడి నవలలూ తయార

యాయి. అయోధ్య కుంపినీవాళ్ళు లాక్కో-బోతున్నా రనగానే ప్రజల్లో కలవరం పుట్టింది. రాజ్యంలోని ప్రముఖులు రహస్యంగా సమావేశ మయారు. "స్వర్గానికీ నరకానికీ కత్తే ఆధారం" అంటూ వొక కరపత్రం ప్రకటించారు; రాజ్యమంతటా పంచిపెట్టారు; ప్రజల్లో ఉద్రేకం రెచ్చగొట్టారు. ఆకరపత్రం ప్రతులు వందలు వందలు పట్టుకుని కుంపినీవాళ్ళు తగలబెట్టారు.

1856 లో వొకనాడు అయోధ్యరెసిడెంటు ఔట్రాము నవాబు వజీదాలీదగ్గిరికి వచ్చాడు. "నేను నా అయోధ్యరాజ్యం వొదులుకుంటున్నాను. కుంపినీవాళ్ళ కిచ్చేస్తున్నాను" అని వొకకరపత్రం రాసి నవాబుని సంతకం చెయ్యమన్నాడు. నవాబు తెల్లబోయాడు. సంతకం పెట్టనన్నాడు. ఔట్రాము దబాయించాడు; గదమాయించాడు; మూడుదినాలు ప్రయత్నించాడు. నవాబు సంతకం పెట్టనన్నాడు.

మూడోదినం కుంపినీసిపాయిలు అయోధ్యకోట ముట్టడించారు. బలవంతంగా లోపలప్రవేశించారు. నవాబు జనానా దోచుకున్నారు. బేగములిన్ని అవమానపరిచారు. నవాబుని గద్దెమీంచి లాగేశారు. ఖైదుచేసి కలకత్తా పట్టుకుపోయారు. సాలీనా పన్నెండులక్షలు మనోవర్తి ఏర్పరిచారు.

లోగడ డల్హౌసీతండ్రి ఇండియాలో సర్వసేనాధిపతిగా వుండేవాడు. ఇంగ్లాండు వెళిపోనేముందు అతడు అయోధ్యనవాబు దర్శనానికి వచ్చాడు. నవాబు జనానాలో ఏదయినా మంచి బహుమానము లభిస్తుందన్న ఆశతో తనభార్యని లోపలికిపంపాడు. ఈదేశంలో లేని రివాజిది. ఈ ఆంగ్లపద్ధతి నవాబుకి అర్థంకాలేదు. తనభార్యని తనకి సేనాని తార్చి, డబ్బుదోచుకోవాలని ఇలా పంపాడని సందేహించాడతడు. "చాలు, ఆమె నటు తీసుకుపొండి" అంటూ నౌకర్లతో చెప్పాడు.

అదిగో ఆ పాశుపతవల్లే అయోధ్య నలా డల్హౌసీ చేశాడన్నాడు నేపియరు అనే యొక ఆంగ్లరచయిత. ఏమయితేనేం, అయోధ్యరాజ్యం డల్హౌసీ కుంపినీరాజ్యంలో కలిపేసుకున్నాడు.

నవాబుకింద పెద్దపెద్ద హిందూజమీందార్లూ, తాలూకాదార్లూ వుండేవాళ్ళు. కుంపినీరాగానే వాళ్ళలో ఎంతోమందిజమీలూ, తాలూకాలూ, భూములూ లాక్కున్నారు. వాళ్ళకోటలూ అవీ పడగొట్టారు. వాళ్ళని నానాఅవస్థలూ పెట్టారు.

"కుంపినీవాళ్లు ఏదయినా యొకరాజ్యం కలిపేసుకోగానే, అక్కడి రాజుని తొలిగించేసేవాళ్లు. అతడిస్థానే యొక ఇంగ్లీషువాణ్ణి కూచో బెట్టేవాళ్లు. అతడికి కమీషనరు అని పేరుపెట్టేవాళ్లు. రాజదర్బారు లోని మర్యాదస్తుల్నీ మంత్రుల్నీ వాళ్ళనీ యొక యాభై అరవై మందిని తొలిగించేసేవాళ్లు. వాళ్ళస్థానే కమీషనరు సలహాదార్లని ముగ్గురు సలుగుర్ని నియమించేవాళ్లు. రాజుగారి సైన్యం వేలువేలు తీసిపారేసేవాళ్లు. వాళ్ళస్థానే ఏదో వందమంది జవాన్లని పెట్టేవాళ్లు. పురాతనప్రసిద్ధమయిన రాజదర్బారు మచ్చుకన్నా లేకుండా అయిపోయేది. రాజ్యంలో వర్తకం క్షీణించిపోయేది. రాజధాని పాడయిపోయేది. ప్రజలు దరిద్రులయిపోయేవాళ్లు. ఇంగ్లీషువాళ్లు స్వాంజిల్లా దుక్కిదున్నేవాళ్ళు. గంగవొడ్డునించి ధనరాసులు మోసుకునచ్చి థేమ్సునొడ్డుని పొలనపోసేవాళ్లు."* అదిగో అయోధ్యలోనూ అలాగే జరిగింది.

నవాబు వజీదాలీ ప్రజారంజకుడుగా వుండేవాడు. అతడిఅవస్థ విని అయోధ్యరాజ్యమంతటా లక్షలాదిరైతులు కంటతడి పెట్టుకున్నారు. కుంపినీ పటాలాల్లో అయోధ్యవాళ్లే అధికం సిపాయిలుగా వుండేవాళ్లు.

* కొన్నిట నిజమే పాలీవాను.

అందుకని వాళ్ళలో విప్లవం రగలడానికి కుంపినీవాళ్లు అయోధ్యకలి పేసుకోడం ఎంతన్నా దోహదమిచ్చింది. అయోధ్య ఆఖరికబళం చేసుకుని డల్హౌసీ 1856 లో ఇంటికి వెళ్ళిపోయాడు. అతడు వెళ్లేసరికి ఇండియాలో అంతా ప్రశాంతంగావుం దన్నాడు. ఆ ప్రశాంతం తుఫానుముందువుండే ప్రశాంత మని కాసలేకపోయాడు. ఆ తుఫాను బీభత్సం విన్నాకే, అతడు 1860 లో శాశ్వతంగా కళ్లుమూశాడు.

ఢిల్లీపాదుషా

ఢిల్లీపాదుషా పాఆలం (1759—1806) వరకూ ఇండియాలో ఇంగ్లీషువాళ్ళు ఢిల్లీపాదుషావారి ప్రజలమనే చెప్పుకునేవాళ్ళు. అదే తమకిగౌరవమని భావించేవాళ్ళు. కుంపినీగవర్నరుజనరలు తనముద్రల్లో दिल्ली के बादशाह का फ़िदवीखास — "అంటే ఢిల్లీపాదుషావారి ముఖ్య సేవకుడు" అని వేయించుకునేవాడు. ఢిల్లీపాదుషాల నాశ్రయించే కలకత్తా, సూరత్తు మొదలయినచోట్ల ఇంగ్లీవాళ్ళు జాగీర్లు సంపాదించారు. కోటలుకట్టుకున్నారు. అందుకోసం పాదుషాకీ పన్నుకడుతూ వుండేవాళ్లు గవర్నరు జనరలు మొదలుకుని చిన్నఅధికారివరకూ పాదుషాకి నజరానాలు దాఖలుచేసేవాళ్ళు. దర్బారుకి వెళ్ళేటప్పుడు జోళ్ళూ అవీ తీసేసేవాళ్లు. ఎంగిలొంగి సలాములు చేసేవాళ్లు.

ఇండియాగడ్డమీద మొట్టమొదట 1608 లో కాలు పెట్టిన కెప్టెను హాకిన్సు ఆగ్రాలో జహంగీరుపాదుషా నాశ్రయించాడు. 1613 లో సర్ థామసురో పాదుషాదర్బారుకి మొదటిరాయబారిగా వచ్చాడు. పాదుషాదగ్గిర ఫర్మానాలు సంపాదించాడు. అలా కొంతకాలం కాలూనాక, వర్తకానికి త్రాసుతోపాటు కత్తిన్నీ పట్టాలనుకున్నారు. కుంపినీ

వాళ్ళు.* అలాగే బొంబాయీ ఆప్రాంతంలో కత్తిపుచ్చుకునే బయలుదేరారు. దాంతో అప్పటిపాదుషా ఔరంగజేబు సూరత్తునించి ఇంగ్లీషువాళ్ళని తరిమికొట్టాడు. బొంబాయి ముట్టడించాడు. ఇంగ్లీషు వాళ్ళు కాళ్ళావేళ్ళాపడి క్షమాపణ చెప్పుకున్నాక కనికరించి వొదిలి పెట్టాడు.

ఔరంగజేబు 1707 లో కాలం చేశాడు. సరిగ్గా అతడు కాలంచేసిన యాభై యేళ్ళకి సిరాజుద్దౌలానిచంపించి కుంపిసీవాళ్ళు సామ్రాజ్యానికి శ్రీకారంచుట్టారు. మరోఅర్ధశతాబ్దం దాటిందోలేదో, ఢిల్లీకోట లోనే పాగావేశారు. పాదుషాని బొనిసకింద మార్చారు. మరో యాభై సంవత్సరాలకి పాదుషాని ఖైదుచేసి బర్మాపట్టుకుపోయారు. అతడికుమార్ళని సహజాదాలని ఢిల్లీవీధుల్లో కాల్చి పారేశారు.

షాఆలంపాదుషా 1765 లో కంపిసీవాళ్ళకి బీహారు, బెంగాలు, ఒడిశాల దివాన్గిరి ప్రసాదించాడు. అనంతరం ఢిల్లీసింహాసనం దుర్బల మవుతూనచ్చింది. పాదుషామహారాష్ట్రుల ఆశ్రితుడుగా శయారయాడు. వారనుహేస్టింగ్సుకాలంలో అతడు మాధోరావు సింధియా అధీనమయి పోయాడు. సింధియా అధీనంలో పాదుషా సుఖంగానే వున్నాడు. సింధియా తన పుత్రుడనీ, తన హృదయమనీ పాదుషా రాసినపద్యమే దీనికి తారాక్ష్యం. అలంషా పాదుషా పార్శీలో కవి. **माधोजी सिंधिया फरजंद जिगरबंदेमन, हुस्त मसरूफ तलीफीए सितमगारी - ए - मा।** - ఇది అతడు సింధియామీద కట్టిన కవిత్వం. అయితే సింధియా పాదుషాని బాధ పెడుతున్నా డనే ఇంగ్లీషువాళ్ళు ప్రచారంచేశారు. అప్పటినించీ పాదు

* "The times now require you to manage your general commerce with the sword in your hands" — బొంబాయి గవర్నరు కోర్టాఫుడైరక్టర్లకి రాసిన లేఖ.

పాకి చెల్లిస్తూవున్న కప్పంకూడా కట్టడం మానేశారు. సింధియా ఎన్నోసార్లు అడుగుతూ వచ్చాడు. కాని పలుకూ ఉలుకూ లేకుండా వూరుకున్నారు. తుదికి కారనువాలీసు కాలంలో ఇవ్వం పొమ్మన్నారు.

మాధోరావుసింధియా 1794 లో కాలంచేశాడు. మరి నాలుగేళ్లకి వెలస్లీ ఇండియా వచ్చాడు. అవి రెండోమహారాష్ట్రయుద్ధం దినాలు. దౌలతరావు సింధియా (1794—1827) ప్రాబల్యం తగ్గించాలని కుంపినీవాళ్ళ ప్రయత్నం. పాదుషాని సింధియాచేతుల్లోంచి తప్పించి తమ కీలుబొమ్మగా పెట్టుకోవాలి. అందుకని వెలస్లీ పాదుషాకి ఏవేవో ఆశలుపెట్టాడు. అరిచేతిలో మోక్షం చూపించాడు. లేకు సేనానిని పాదుషాదగ్గిరికి పంపించాడు. పాదుషా వెలస్లీ వలలో పడిపోయాడు. పాతాలంని పూర్వవైభవంతో డిల్లీతక్తు మీద కూచోపెడతామనీ, మహారాష్ట్రులు తీసుకున్న రాజ్యభాగమంతా తిరిగి కట్టబెడతామనీ ఎన్నో షరతులు రాసి, లేకుసేనాని వొక ఖరారునామా పాదుషాచేతిలోపెట్టాడు. అమాయకుడు ఆలం అన్నీ విశ్వసించాడు. ఆ దినాల్లో కుంపినీవాళ్లు గుడిసేట్లనీ వాళ్లనీ వేగులవాళ్లగా ఉపయోగించేవాళ్లు. రెసిడెంట్లు బంగళాల్లో నానారకాలగుడిసేట్లూ వుండేవాళ్లు. వాళ్లని సవాబులా, రాజులా రాణివాసాల్లోకి పంపి రహస్యాలు లాగేవాళ్లు. ఎన్నో కార్యాలు సాధించేవాళ్లు. అలాగే అప్పటి డిల్లీ రెసిడెంటు ఈ గుడిసేట్లని పాదుషాజనానాలోకి పంపి, పాదుషా మెడలు వొంచాడు.

పాదుషా సహాయంతో వెలస్లీ 1804 లో డిల్లీలో మహారాష్ట్రుల ప్రాబల్యంలేకుండా చేశాడు. పాదుషాకి సాలీనా పన్నెండు లక్షలు గ్రాసవాసాలికి మనోవర్తి ఏర్పరిచాడు. తక్కిన అధికారం యావత్తూ తన చేతిలో పెట్టుకున్నాడు. లేకుసేనాని ఖరారునామా మాత్రం

ఎత్తలే దతడు. దీని గురించి 1848 లో పార్లమెంటులో పెద్ద చర్చ జరిగినప్పుడు అది కుంపినీకాగితాల్లో కనపడలేదన్నారు.

పాదుషాకి మనోవర్తి ఏర్పరిచాక, అంతవరకూ అతడికి చూపుతూ వున్న గౌరవ మర్యాదలుకూడా చూపడం మానేశారు. అతణ్ణి డిల్లీ కోటనించి తీసేసి, ముంగేరు పంపించెయ్యాలని ప్రయత్నించారు. ఈ ఆలంషా పాదుషా దగ్గిరే కుంపినీవాళ్లు దివానుగిరీ సంపాదించారు. ఇప్పు డీఆలంషా పాదుషానే తన తాత ముత్తాతల కోటవొదిలి పైకి పొమ్మన్నారు! అది వినడంతోనే ముసిలిపాదుషా మండిపడ్డాడు. డిల్లీ పౌరులున్నూ ఉద్రిక్తులయారు. ఆ ఉద్రేకమే తరవాతి విప్లవానికి దారితీసింది. తుదకి వెలస్లీ ఆ ప్రయత్నం వొదులుకున్నాడు.

షాఆలం పాదుషా 1806 లో కాలంచేశాడు. అక్బరుషా సింహాసనమెక్కాడు. 1813 లో మూయిరా గవర్నరుజనరలుగా వచ్చాడు. మెట్కాఫు డిల్లీ రెసిడెంటుగా దిగాడు. ఇతడు అక్బరుషాని అన్ని విధాలా అవమానపరిచాడు. ఎన్నెన్నో అనస్థలు పెట్టాడు. తన గోడు చెప్పుకుందికి, లేకుసేనాని ఖరారునామా అనులుచెయ్యమని అడిగిందికి మూయిరాదొరని డిల్లీ రమ్మని పాదుషా ఆహ్వానించాడు. అలావెళితే తమ సార్వభౌమాధికారానికి భంగం వస్తుందంటూ మూయిరా నిరాకరించాడు.

కాని 1827 లో అప్పటి గవర్నరుజనరలు అమ్హర్స్టు పాదుషా దర్బారుకి వచ్చాడు. అయితే పాదుషాకి చూపించవలిసినమర్యాదలు మాత్రం పాటించలేదు. అడిగినదానికి సరిగా సమాధానమున్నూ చెప్పలేదు. ఈ అవమానం మరింత బాధించింది పాదుషాని. తన ఆశలు అడియాసలయాయి. చాంతో రామమోహనరాయల్ని సీమ పంపించా డతడు. ఆనాటి భారతదేశంలోని మహాపురుషుల్లో సుప్ర

సిద్ధుడు రామమోహనరాయలు. రాయబారిగా పంపేముందు అతడికి పాదుషా "రాజా" అని బిరుదిచ్చాడు. రాజా రామమోహనరాయలు సీమవెళ్లాడు. ఎంతో అంత ప్రయత్నించాడు. అంతటివాడు ప్రయత్నించినా ఫలితమేమో శూన్యమయింది. సీమకి రాయబారం పంపినందుకు ఇక్కడి కుంపిని అధికార్లు కారాలూ మిరియాలూ, నూరారు. పాదుషాని మరింత న్యూనతగా చూశారు. అక్బరుషా 1837 లో కాలంచేశాడు. బహదూరుషా గద్దెమీదికి వచ్చాడు. బహదూరుషా పేరుమీదే 1857 మహావిప్లవం జరిగింది. అతడి పతాకమే దేశమంతటా విప్లవ పతాకమయింది.

బహదూరుషా గద్దెమీదికి వచ్చాక, లేకుసేనాని ఆలంపాకి రాసి ఇచ్చిన ఖరారునామా షరతులప్రకారం తన పెన్షను అధికం చెయ్యమంటూ కుంపినీకి రాశాడు. "పాదుషాగా నీకు వుండుకున్న హక్కులు యావత్తూ వంశపారంపర్యంగా వొదులుకుని మాకు రాసిఇచ్చేస్తే పెన్షను అధికంచేస్తాము" అన్నారు కుంపినీవాళ్లు. బహదూరుషా వొప్పుకోలేదు. లేకుసేనాని ఖరారునామా అలాగే సీళ్లుకారిపోయింది.

పాదుషా పుట్టినరోజు గవర్నరుజనరలూ, సర్వసేనానీ పాదుషా దర్బారుకి వచ్చేవాళ్లు. రాజభక్తిసూచకంగా నజరానాలిచ్చేవాళ్లు. లేదా రెసిడెంటు ద్వారా అందజేసేవాళ్లు. అలాగే ఈద్‌నాడూ, ఉర్సులోనూ పంపేవాళ్లు. కొత్తగా వచ్చే గవర్నరుజనరలు వందా వొగ్గి బంగారంమొహర్లు కానుకపంపేవాడు. 1842 వరకూ ఈ మర్యాద జరుగుతూనే వచ్చింది. ఆ సంవత్సరం ఎలెనుబరో గవర్నరు జనరలుగా వచ్చాడు. రాగానే అవన్నీ ఆపేశాడు.

పాదుషాకి పది పదకుండుమంది కుమార్లుండేవాళ్లు. యువరాజు దారాబఖ్షు 1839 లో మరణించాడు. దాంతో పాదుషా చిన్నబేగం

జిన్నతుమహలు తన కుమారుడు జవాఁబఖ్తు యువరాజు కావాలని కోరింది. పాదుషాఅంగీకరించాడు. జిన్నతుమహలు అందకత్తె. విదుషీమణి. రాచకార్యాలు ఆమెచేతులమీదే నడిచేవి. జవాఁబఖ్తు బుద్ధిమంతుడు. యువరాజు యోగ్యత కలవాడు. తల్లీ కొడుకు లిద్దరికీ ఇంగ్లీషు వాళ్లంటే పడేదికాదు. యువరాజుకావాలంటే ఇంగ్లీషువాళ్ల అనుమతి అవసరంగా వుండేది. జిన్నతుమహలు కోరిక ఇంగ్లీషు వాళ్లంగీకరించలేదు. అసలుపాదుషాగిరి అంతంచెయ్యడమే వాళ్ల సంకల్పంగా వుండేది. అందుకని పాదుషా రెండోకొడుకు మీర్జాఫఖురూని దువ్వారు. "నన్ను యువరాజుచేస్తే, నేను గద్దెమీదికి వచ్చాక, డిల్లీ కోట వొదిలేస్తాను. మీరు ఎక్కడ వుండమంటే అక్కడ వుంటాను" అని అతడిచేత వొక ఖరారునామా రాయించుకున్నారు. మీర్జాఫఖురూ యువరాజని ప్రకటించారు.

1854 లో మీర్జాఫఖురూ కూడా మరణించాడు. అవి డల్హౌసీ దినాలు. రెసిడెంటు మెట్కాఫు పాదుషా దర్బారులోకి వెళ్ళాడు. పాదుషా రెండుపత్రాలు— వొకటి జినతుమహలు కుమారుడు జవాఁబఖ్తు యువరాజు కావాలని పాదుషా రాసిందీ, వొకటి పాదుషా ఎనమండుగురు కుమార్లూ కలిసి జవాఁబఖ్తు యువరాజు కావడమే తమ కోరిక అని రాసిందీ – రెండూ రెసిడెంటు చేతిలో పెట్టాడు. ఇక తిరుగుండదనే అనుకున్నాడు పాదుషా. కాని మళ్లీ ఆ ఎనమండుగురు లోంచీ మిర్జాకోయసుని విడదీశారు కుంపినీవాళ్లు. అతడిచేత రహస్యంగా వొక వొడంబడిక చేసుకున్నారు. ఆ ప్రకారం అతణ్ణి యువరాజని ప్రకటించారు.

మీర్జాకోయసుతో చేసుకున్న వొడంబడికలో ఇకముందునించి పాదుషాపదవి రద్దుచేయడమూ, దానికి బదులుగా సహజాదా అని

మాత్ర ముంచడమూ, డిల్లీకోట ఖాలీచెయ్యడమూ, నెలకి లక్ష రూపాయలకి బదులుగా పదిహేనువేలుమాత్రం మనోవర్తి ఇవ్వడమూ ముఖ్యమైనవి.

ఈ యొడంబడిక పాదుషా హృదయంలో ప్రళయం పుట్టించింది. డిల్లీప్రజల్లో అగ్నిహోత్రం రగిలించింది. మరుచటి సంవత్సరం బ్రహ్మాండమైన విప్లవంగా పరిణమించింది.

నానాసాహెబు

మన స్వాతంత్ర్యరణరంగంలో నానాసాహెబు మహా నాయకుడు. స్వరాజ్యంకోసం, స్వధర్మంకోసం హోరాహోరి పోరాడి, శత్రువుకి చిక్కకండా స్వేచ్ఛాపథం తొక్కిన సింహపరాక్రముడు. భారతీయులకు తరతరాలా ప్రాతస్మరణీయుడు.

నానాసాహెబు పేష్వాబాజీరావు దత్తపుత్రుడు. కుంపినీవా ళ్లత డికి చేసిన అన్యాయమే అతడిలో ప్రళయాగ్ని పుట్టించింది.

పేష్వాబాజీరావునించి ఇంగ్లీషువాళ్లు ప్రతాపసింహుణ్ణి విడదీసిన వైనం సతారాకథలో చూశాం. తరవాత జరిగిన యుద్ధాల్లో బాజీ రావు ఓడిపోయాడు. రాజ్యం కుంపినీపరంచేసి, సాలీనా ఎనిమిదిలక్షల మనోవర్తితో బిఠూరు జాగీరులో చివరిదినాలు గడిపాడు. అనేక కుటుంబాలు ఆడామగా ఎనిమిదివేలమంది అతడి ఆశ్రయంలో వుండే వాళ్లు. ఆ ఎనిమిదిలక్షలూ వీళ్లందరి గ్రాసవాసాలికి వినియోగ పడేవి. అలా ముప్ఫయిరెండు సంవత్సరాలు బిఠూరులో గడిపాడతడు. అతడికి సంతానంలేదు. బాలాజీ విశ్వనాథుడి వంశం తనతో అంత రించకండా అతడు దత్తత చేసుకున్నాడు.

చేరు గ్రామంలో మాధవరావు నారాయణభట్టని వొక దరిద్ర బ్రాహ్మడుండేవాడు. అతడి భార్య గంగాబాయి. 1824 లో ఆవేద బ్రాహ్మలికి వొక కుమారుడు కలిగాడు. అతడికి డుంధుపంతు అని నామకరణం చేశారు. అదిగో ఆ డుంధుపంతే మన నానాసాహెబు.

కడుపు జరక్క- నారాయణభట్టు భార్యాపిల్లలతో బితూరు వచ్చేశాడు. బాజీరావు నాశ్రయించాడు. అప్పటికి నానాసాహెబు వయస్సు రెండున్నర సంవత్సరాలు. అతడి మొహంలో రాచకళలు కలకల లాడుతూ వుండేవి. బాజీరావన్నీ చూశాడు. తన హృదయంలో పుత్రప్రేమ తొణికిసలాడింది. చాంతో శాస్త్రోక్తంగా ఆ చిన్ని బాలుణ్ణి 1827 లో దత్తతచేసుకున్నాడతడు.

బాల్యంనించీ నానాసాహెబులో ప్రత్యేకత గోచరించేది. గుర్రపు స్వారీ, కత్తిసాము, యుద్ధవిద్యా, చదువుసంధ్యలూ– అన్నిటిలోనూ అతడు అందెవేసినచేయిగా వుండేవాడు. శాంతమూ, శాంతంతో సమమయిన పౌరుషమూ రెండూ అతడిలో నిండివుండేవి. బితూరు దుర్గంలో యావన్మంది అతడంటే ప్రాణంపెట్టేవాళ్లు. ఆటపాటల్లోనూ, చదువుసంధ్యల్లోనూ, అస్త్రవిద్యలోనూ, గుర్రపుస్వారీలోనూ లక్ష్మీబాయి అతడితో బాల్యంలోనే పోల్గొనేది. తాంతియాటోనే, అజీముల్లాలు స్నేహితులుగా వుండేవాళ్లు. ఈ వీరభారత సంతానానికి బితూరుదుర్గం క్రీడారంగంగా వుండేది.

నానాసాహెబే తన ఉత్తరాధికారి అని బాజీరావు ప్రకటించాడు. తన జీవితకాలంలోనే పేష్వాపదవీ, తన ఎనిమిదిలక్షల వార్షికమూ నానాపరం చెయ్యవలసిందంటూ కుంపినీకిరాశాడతడు. "ఈ విషయంలో విచారం పెట్టుకోవద్దు" అంటూ కుంపినీవాళ్లు హామీ

ఇచ్చారు. "నీ అనంతరం నీజాగీరూ, నీ పరివారం పరిపోషణా దివ్యంగా వుండేట్లు ప్రభుత్వం చూస్తుంది" అంటూ రాశాడు.

పేష్వాబాజీరావు 1839 లో ఓక వీలునామా రాశాడు. నానా సాహెబే తన ఉత్తరాధికారి అని రాశాడు. కుంపినీకికూడా తెలియజేశాడు.

పేష్వాబాజీరావు తన డబ్బయిఏడోఏట 1851 లో కాలంచేశాడు. వంశపారంపర్యంగా అతడి కిస్తామన్న మనోవర్తి కుంపినీవాళ్లు ఆపేశారు. సూర్యచంద్రులున్నంతకాలం ఈ వొడంబడిక లుటాయంటూ కుంపినీ వాళ్లు లోగడ రాసియిచ్చిన వొడంబడిక లన్నిటికీ ఏంజరిగిందో బాజీరావు మనోవర్తి వొడంబడికకీ అదే జరిగింది.* బాజీరావు కాలం చేసేనరికి డల్హౌసీ గవర్నరు జనరలుగా వున్నాడు. అతడి సర్వభక్షక నీతి అడ్డులేంది. 'పేష్వా' అన్న మాటే తుడిచెయ్యాలని అతడి సంకల్పం. బాజీరావు కాలంచెయ్యడమేతడువు, అతడి మనోవర్తి ఎనిమిది లక్షలూ ఎగబెట్టా డతడు. అప్పటికి బాకీవున్న అర్వైరెండువేలూ ఇవ్వనన్నాడు. బిఠూరు జాగీరు కూడా తీసుకుంటా మని నానాసాహెబుకి నోటీసిచ్చాడు.

బాజీరావు దగ్గిర సుబేదారు రామచంద్రరావు అని వొకాయన వుండేవాడు. పేష్వాపరివారం తాలూకు మంచీచెడ్డా యావత్తూ అతడే చూసేవాడు. బాజీరావు మనోవర్తి నానాసాహెబు కిప్పించడం కోసం అతడెంతో పాటుపడ్డాడు. కాని లాభం లేకపోయింది.

---

* "The treaty was to last 'while sun and moon endurth.' The day was soon come when these eternal vows were to be poohpoohed as mere dead flowers of oriental rhetoric. But the original of the treaty stands in the handwriting of the Governor General. Peshwa and Satara have passed away but these words of his will not pass away. —Torrens—Empire in Asia

"ఇన్నాళ్లూ ఏడాదికి ఎనిమిదేసిలక్షలు బాజీరావు పుచ్చుకున్నాడు. కంపినీ దయతలిచి అతడికి బిఠూరు జాగీరుకూడా వొదిలిపెట్టింది. పెన్సనే ఇప్పటికి రెండుకోట్లు పైగా అయింది. అతడి ఖర్చుమాత్ర మేముందని! తేరగా అంత పెన్సను దొరికిం దతడికి! అతడికి బొరస పుత్రులున్నూ ఎవరూలేరు. లక్షలులక్షలు వెనకేసి కళ్లుమూశా డతడు.

అతడి పరివారమున్నూ చెదురుమదురయిపోయింది. నిజమయిన వారసులున్నూ ఎవరూ లేరు. ఈ పరిస్థితిలో పెన్సను కోరడమంటే, కంపెనీని వెర్రాళ్లకింద కట్టడమే. ఇప్పుడున్న పరివారానికి బాజీరావు వొదిలిపెట్టిపోయిన ధనం ఎక్కీతొక్కీ సరిపోతుంది." అంటూ డల్హౌసీ రాశాడు.

నానాసాహెబు అంతవరకూ ఇంగ్లీషువాళ్లకి ఏ అపకారమూ చేసిన పాపానపోలేదు. "అతడు శాంతమూర్తి. ఆడంబరమెరగని యువ కుడు. ఇంగ్లీషుకమీషనరు చెప్పింది అతడు ఎన్నడూ కాదనలేదు." కాన్పూరు దొరలూ, దొరసానులూ అతడికోటకి ఎప్పుడూ వస్తూ పోతూ వుండేవాళ్లు. అతడి గుర్రాలూ, ఏనుగులూ సొంతంలా వాడు కునేవాళ్లు. నానా వాళ్లకి విందులు కుడిపేవాడు. విలువయిన బహు మతు లిచ్చేవాడు. ఇంగ్లీషువాళ్లమీద కత్తికట్టి, వాళ్ల రక్తంతో తర్పణం చెయ్యవలిసివస్తుందని ఆ పరశురాము డెన్నడూ భావించిన పాపాన పోలేదు.

డల్హౌసీకి నానాసాహెబు రాసుకున్న విన్నపాలు అరణ్యరోదన లయాయి. ఇక్కడ నిరాశ చేసుకుని సీమకి రాయబారమంపా డతడు. తన సచివుడు, స్నేహితుడు అజీముల్లాఖానుణ్ణి ఇంగ్లాండు పంపాడు. అక్కడా ఫలితం శూన్యమయింది. ఉదారుడయిన నానాసాహెబు

హృదయం కుతకుతలాడింది. విప్లవజ్వాలలు రేకెత్తాయి. అయితే, అతడు సాగరగంభీరుడు. ధైర్యహిమాచలుడు. బైటికి కనపడనివ్వ లేదు. పల్లెత్తి కటువయిన మాటాడలేదు. అందుకనే చివరివరకూ ఇంగ్లీషువా ళ్లతణ్ణి తమ మిత్రకోటిలోనే వేసుకున్నారు. విప్లవం ఆరం భంలో అతడి సలహాకూడా పుచ్చుకున్నారు. కాన్పూరు ఖజనాకి అతణ్ణి కాపలా పెట్టారు.

నానాసాహెబు దేశంలోని భోగట్టాలన్నీ సంగ్రహించేవాడు. ప్రతీదినమూ పత్రికలు చదివేవాడు. రాజకీయాలు చర్చించేవాడు. ఇంగ్లీషుమిత్రుల దగ్గిర విదేశరాజకీయాలు తెలుసుకునేవాడు.

కిరస్తానం

హిందూ మహమ్మదీయ మతాలు రెండూ రూపుమాపేసి, భారత దేశం కిరస్తానంలో కలిపెయ్యాలని ఇంగ్లీషువాళ్లు చేసిన ఓహూయిత్యం కూడా దేశవ్యాప్తంగా విప్లవాగ్ని రగుల్కోడానికి వొక గట్టికారణ మయింది.

"భారతదేశంలో ఈ చివరనించి ఆ చివరవరకూ ఏసుక్రీస్తు విజయ పతాకం ఎగరవెయ్యడంకోసమే భగవంతుడు విశాలమైన భారతసా మ్రాజ్యం మన చేతిలో పెట్టాడు. అంచేత భారతదేశం యావత్తూ కిర స్తానంలో కలిపెయ్యడంకోసం మన సర్వశక్తులూ వినియోగించాలి. ఇందులో ఏమాత్రం అశ్రద్ధ చెయ్యకూడదు." ఈస్టిండియాకంపెనీ అధ్యక్షుడు మాంగల్స్ లండను పార్లమెంటులో 1857 లో అన్న మాట లివి. పాపం, వెర్రిబాగులదొర తరతరాలవరకూ తన అవివేకా నికి లోకం నవ్వుతుందని కాసలేకపోయాడు. ఆనాడు ప్రముఖులయిన ఇంగ్లీషువాళ్ల అనేకమంది వ్యూహాలు ఇలాగేవుండేవి. భారతీయులు—

హిందువులయితేనేం, మహమ్మదీయులయితేనేం- అంతా ఒకటి అడివి మనుషులే అని వాళ్ల అభిప్రాయం. హిందువుల్ని వాళ్లు "హీథెను" లని హీనంగా చూసేవాళ్లు. అందుకనే సర్ వీపెల్ గ్రిఫ్ఫు బహిరంగంగా అననూ అనేశాడు, "మేం భారతీయులికి ఈ శ్వంస్థానంలో వున్నాం" అని! ఎంత పొగురుమోతుతనం! మరో ప్రబుద్ధుడు రివరెండు కెనడే ఏమన్నాడో వినండి: "భారతదేశం మనసామ్రాజ్యం. అంచేత మనమీద ఎన్ని ఆపదలు వచ్చిపడ్డా సరే, భారతదేశంలో క్రీస్తుమతం వ్యాపింపచెయ్యడమే మన కర్తవ్యం. ఇది మనం మరిచిపోకూడదు. కన్యాకుమారినించి హిమాలయందాకా భారతదేశం యావత్తూ క్రీస్తుమతం పుచ్చుకునేదాకా, హిందూ మహమ్మదీయ మతాల్ని నిందించి వొదిలిపెట్టేదాకా మనం నిద్రపోకూడదు. ఈపని కోసం మనం చెయ్యవలిసిం దంతా చెయ్యాలి. మనచేతిలో వున్న అధికారం, మన పలుకుబడి అంతా వినియోగించాలి."

మాంగల్సేమో 1857 లో అన్నాడు. కాని అప్పటికే ఎంతో కాలం ముందే ఆపని సాగిస్తూ వున్నారు ఇంగ్లీషువాళ్లు. మిషనరీలు హిందువుల్నీ మహమ్మదీయుల్నీ నిందిస్తూనే వున్నారు. ఎన్నో ఆశలు చూపించీ, బలాత్కరించీ మతంలో కలుపుకుంటూనే వున్నారు. అదంతా కుంపినీప్రభుత్వంవాళ్లు ప్రోత్సహిస్తూనే వున్నారు. 1806 లో విలియం బెంటింకు మద్రాసు గవర్నరుగా వుండేవాడు. సర్ జాన్ క్రీడక్కు కమాండరుగా వుండేవాడు. ఈ ఇద్దరూ హిందూదేశంలో క్రీస్తుపతాకం ఎగరవెయ్యాలని పిచ్చిపట్టినవాళ్లే. మద్రాసుప్రాంతం వీళ్ల ప్రచారానికి అనువయిన ప్రదేశంగా కుదిరింది. బెంటింకుదొర దేశీయుల్ని కిరస్తానంలో కలిపెయ్యడానికి చేసిన ప్రయత్నాలే వేలూరులో సిపాయిల తిరుగుబాటుకి కారణమయాయి. 1806 వేలూరు సిపాయిల తిరుగుబాటు 1857 విప్లవానికి రిహర్సల్సు వంటి దన్నాడు సావర్కరు.

పటాలంలో క్రీస్తుమతం ప్రవేశపెట్టడం సులువుగా అవుపించింది బెంటింకుకి. సిపాయిలెవ్వరూ మొహంమీద బొట్టూగిట్టూ పెట్టుకోకూడదని ఆజ్ఞాపించాడు. చెవులికి పోగులూ అవీ వుండకూడదన్నాడు. ఎవ్వరూ గెడ్డాలుకూడ వుంచకూడదన్నాడు. దాంతో సిపాయిల్లో విస్ఫనం పుట్టింది. ఈ బెంటింకుదొరే తిరిగి గవర్నరు జనరలుగా వచ్చాడు. హిందువుల్లో సమిష్టికుటుంబంలో వున్నవాళ్లు తమ మతం వొదిలేసి ఇంకోమతం పుచ్చుకుంటే సమిష్టికుటుంబం ఆస్తిలో వాళ్లకి హక్కుభుక్తా లుండేవికావు. కిరస్తానంలో కలవాలన్నవాళ్లకి అది అడ్డంకిగా వుండేది. అందుకని బెంటింకు వొక రిగ్యులేషను చేశాడు. దాంతో సమిష్టికుటుంబంలో ఏ వ్యక్తయినా కిరస్తానం పుచ్చుకుంటే సమిష్టిఆస్తిలో అతడిహక్కు భంగపడకుండా కాయసడింది. మిషనరీల ప్రచారాని కది దోహదమిచ్చింది.

బెంటింకుతోపాటు మెకాలేకూడా క్రైస్తవమత వ్యాప్తికి బాగా పాటుపడ్డాడు. క్రైస్తవమతానికి దోహదకారిగా వుండే ఆంగ్లవిద్యా ప్రణాళిక ప్రవేశపెట్టాడతడు. "ఇంగ్లీషువిద్య భారతీయుణ్ణి ఇంగ్లీషు వాణ్ణిగా మార్చేస్తుంది. రంగులో, రక్తంలో, ఊహలో ఈ విద్య భారతీయుణ్ణి ఇంగ్లీషువాణ్ణే చేసేస్తుంది." అంటూ అతడు గొంతెత్తి చాటాడు. ఇండియానించి తను ఇంటికి రాసిన ఉత్తరంలో స్పష్టంగా ఇలా రాశాడు :

"భారతీయుల్లో ఈ విద్య ఎంతో మార్పు కలిగిస్తుంది. ఇంగ్లీషు చదివిన భారతీయు డెవ్వడూ తనమతంమీద నమ్మకం పెట్టుకోడు. కొందరు అటూఇటూ పొందనివాళ్లు తయారవుతారు. కొందరు భ్రష్టులవుతారు. కొందరు బహిరంగంగా కిరస్తానం పుచ్చుకుంటారు. నేను ప్రవేశపెట్టిన ఈ విద్యావిధానం కొనసాగితే, ముప్ఫయిసంవత్సరా

లయేసరికి బెంగాలులో విగ్రహారాధకుణ్ణి వొక్కణ్ణీ చూడమని నా దృఢనమ్మకం." *

ఎంత దారుణం! ఈ మెకాలేదొరే మన పురాణాలూ ఇతిహాసాలూ తూలనాడాడు. అయితే ఇదంతా తమ మతంకోసమేచేశారా ఈ దొరలు? కాదు. దేశీయుల్లో స్వధర్మమూ, స్వమతమూ, స్వదేశమూ — వీటిమీద అభిమానం పోగొట్టి, తమ కాలికింద చిరకాలం భారతదేశం బానిసగా తొక్కిపెట్టడానికే ఈ తాపత్రయం. అందుకనే విప్లవదినాల్లో ఇక్కడ పనిచేసిన విలియం ఎడ్వర్డ్స్ ఇలా రాశాడు. "క్రైస్తవమత ప్రచారం తగ్గుముకూ బెణుకూ లేకండా జరుగుతుంది. క్రైస్తవ సంఘాలు మన ప్రభుత్వానికి పెట్టనికోటలయి వుంటాయి. దేశంలో విగ్రహారాధకులూ, మహమ్మదీయులూ వున్నంత కాలం క్రైస్తవులు మనపక్షాన్నే వుండితీరుతారు."

ఇదిగో, ఈ పరమలక్ష్యంతోనే, హిందూదేశంలో ఇంగ్లీషువాళ్లు క్రీస్తుమతం ప్రచారం చేశారు. ఇప్పుడున్నూ చేస్తున్నారు. కుంపినీ వాళ్లకి ఈ దేశంలో రాజ్యాధికారం రావడంతోనే పురాతనమైన దేవాలయాల తాలూకూ, మసీదుల తాలూకూ ఇనాంభూములు లాక్కున్నారు. జైళ్లలో ఖైదీలు మతధర్మాలు పాటించడానికి వీలు లేకండా చేశారు. హిందువులూ, మహమ్మదీయులూ మత సంప్రదాయాలూ, ఆచార వ్యవహారాలూ న్యూసపరిచారు. "ఇండియా క్రైస్తవదేశంగా చేసెయ్యాలి," "దేశభాషలు తోసిరాజుచేసి, ఇంగ్లీషు భాష వ్యాప్తిచెయ్యాలి" అంటూ ఇంగ్లాండు ప్రజలు నినాదాలు చేశారు.

---

*It is my firm belief that, if our plan of education is followed up, there would not be a single. idolator in Bengal 30 years hence".—Macaulay's letter to his mother, Oct. 12, 1836.

మహమ్మదీయులంటే మరీ మంటగావుండేది కొందరికి. ఇస్లాంమతం వొదిలిపెట్టి, వాళ్లు కిరస్తానం పుచ్చుకోకపోవడమే దీనికి కారణం. అందుకనే హెన్రీ హేరింగ్టను థామసు ఇలా రాశాడు, "మిషనరీలు మహమ్మదీయుల్ని ఎప్పుడూ వొప్పించలేరు. వాళ్లకంటే హిందువులు మెత్తనివాళ్లు. మిషనరీల మాటలు శాంతంగా వింటారు, లోబడతారు."

1857 విప్లవానికంతా మహమ్మదీయులే కారణమంటూ ఈ థామసే ఇలా రాశాడు. "ఈ విప్లవానికి హిందువులు కారణంకాదు, కారణమున్నూ కాదు. ఈ కుట్ర మన మూహించిన దానికంటే ముందునించీ జరుగుతూనేవుంది. కొన్ని కారణాలవల్ల తిరుగుబాటుదారులనుకున్నదానికంటే ముందే ఇది బైటపడిపోయింది. దేశంలోవున్న క్రైస్తవుల్ని యావన్మందినీ స్త్రీలనీ, పురుషుల్నీ, పిల్లల్నీ ఘోరంగా నరికిపారెయ్యడానికి పూనుకున్న ఈ విప్లవానికి పునాదులువేసినవాళ్లెవరు? హిందువులు కనీసంతటతాము ఇలాంటి ఘోరాలు చెయ్యరు. ఈ దారుణమైన విప్లవానికి మూలకారణం హిందువులలో కాదు, మహమ్మదీయులలో వెదకాలి. మనల్ని మొదలంటా తుడిచిపెట్టెయ్యాలని పన్నిన ఈ కుట్ర అర్థం చేసుకోవాలంటే, మహమ్మదీయుల స్వభావమూ, వాళ్ల సిద్ధాంతాలూ తెలుసుకోవాలి. వాళ్లస్వభావం కలీఫాలనాడెలావుందో ఈనాడూ అలాగేవుంది. పరమతం ద్వేషించడమూ, క్రౌర్యమూ, వల్లమాలినగర్వమూ, మూర్ఖత్వమూ ఇవే వాళ్ల ప్రధానగుణాలు. క్రైస్తవులంటే వాళ్లకి కడుపుమంట. ముస్లిం రాజ్యం నిలబెట్టడానికి ఎలాంటి దుర్మార్గానికయినా వాళ్లు వెనకాడరు. పరాయి ప్రభుత్వానికిచెందిన ఏ ప్రభుత్వమయినా సరే, దానిని పడగొట్టడానికేవాళ్లు గోతులు తవ్వుతారు. కురాను ఆజ్ఞాసూత్రాలు పర

ప్రభుత్వాన్ని సహింపవు. మహమ్మదీయుడుకానిరాజు ఎవడైనాసరే. అతడికింద వుండడమంటే మహమ్మదీయులు భరించలేరు. వీళ్లని ఎంత అభిమానంతో అయినా చూడండి, లాభంలేదు. తృప్తి అన్నది వుండదు వీళ్లకి. అవకాశం దొరికిందాకా లొంగినట్టే నటించడంలో వీళ్ళకివీళ్లేసాటి. ఉన్నట్టేవుండి వీలుచిక్కగానే నిజస్వరూపంతో బైటికివస్తారు.

"ఇండియాలో మనమంటే వాళ్లకి పగపుట్టడానికి కొన్ని ప్రత్యేక కారణాలున్నా వున్నాయి. అక్కడ ఎంతోకాలం వాళ్లు రాజరికం చేశారు. ఇంగ్లీషుప్రభుత్వం పడగొడితే మళ్లీ తమరాజరికం తమకి వచ్చేస్తుందని వాళ్ల నమ్మకం. సిపాయిలలో వున్న అశాంతి అవకాశంగా తీసుకుని కుట్రపన్ని, మహమ్మదీయులే ఈ విప్లవం రేపెట్టారు, హిందువుల సహాయంలేందే గెలవలేమని వాళ్లకి బాగా తెలుసు. అందుకనే హిందూసిపాయిలనికూడా కూడగట్టుకున్నారు. 'మీ మతం ప్రమాదస్థితిలో వుంది' అంటూ వాళ్లని బెదరగొట్టారు. 'దొరతనం మీ అందరినీ కిరస్తానంలో కలిపేస్తారు' అంటూ బ్రాహ్మలలో ప్రచారం చేశారు. అమాయకపు బ్రాహ్మలు అది నిజమని నమ్మారు. తమవాళ్లలో అదే ప్రచారంచేశారు.

"నిజంగా హిందువులకంటె మహమ్మదీయులు బుద్ధిమంతులు. వాళ్లు చాకచక్యమూ, తెలివితేటలూ చూసి, ప్రభుత్వం వాళ్లనే ఉద్యోగాలలో పెట్టింది. దాంతో మన గుట్టుమట్టులన్నీ వాళ్లకి తెలిసిపోయాయి.

"ఈ కుట్రయావత్తూ మహమ్మదీయులే పన్నారు. వాళ్లే నడిపించారు. వాళ్ల ఆధిపత్యంకోసమే ఈ విప్లవం జరిగింది. ఈ కుట్రలో

వంగదేశం హిందూసిపాయిలు మహమ్మదీయు లెలానడిపిస్తే అలా నడిచారు."*

ఎలెనుబరో గవర్నరు జనరలుగా వచ్చాక, మహమ్మదీయుల్ని తొక్కిపెట్టడమే తన మొదటిపని అంటూ ప్రకటించాడు. ఇతడే సింధుదేశం అమిర్లని అవమానించాడు. వాళ్ళ రాజ్యం ఇంగ్లీషు రాజ్యంలో కలిపేసుకున్నాడు. మహమ్మదీయుల్ని న్యూనతపరచడం కోసమే సోమనాథ దేవాలయం తలుపులని ఏవో తలుపులు ఆఫ్గను స్థానంనించి పటాటోపంతో పట్టించుకువచ్చాడు. అవి ఆగ్రా కోటలో ఈనాటికీ భద్రంగా వున్నాయి. మహమ్మదీయులంటే ఇతడింత ప్రత్యేక ద్వేషానికి కారణం ఇతడిభార్య డమాస్కసులో వొక అరబ్బీ నాయకుడితో లేచిపోవడమట! †

క్రైస్తవమత ప్రచారంకోసం గవర్నరు జనరలు కానింగు లక్ష రూపాయ లిచ్చాడు. అయినా పాట్నా డిప్యూటీ కమీషనరు పని వొక మహమ్మదీయుడి కిచ్చాడని యూరోపియను లతణ్ణి దుయ్య బట్టారు.

టాలెన్సు తన గ్రంథంలో ఇలా రాశాడు.

"మహమ్మదీయులు నలుగురిలో తలెత్తలేనిపనులే మనం చేశాం. అక్రమమయిన రాజసీతే మనం అవలంబించాం. మొదట్లో మొగలాయి చక్రవర్తిదగ్గిర దొంగగౌరవం నటించాం. లంచాలిచ్చీ, మోసంచేసీ, దబాయించీ ఆయనతో నేస్తంకట్టాం. తరవాత ముసుగు తీసేసుకుని మేమే చక్రవర్తులమని ప్రకటించుకున్నాక కూడా మనవక్రబుద్ధి వొదులుకోలేదు.

---

* The Late Rebillion in India and Our Future Policy.

† Life of Sir Rechard Burton.

"ఇనాంకమిూషను పెట్టి, మహమ్మదీయులికి పాదుషా నిచ్చిన ఇనాంలు సున్నాచుట్టాం. కాజీల మతాధికారం తీసిపారేశాం. విద్యాభివృద్ధికోసం ఉదారులయిన మహమ్మదీయులు పూర్వ మెన్నడో యిచ్చిన ధర్మాదాయాలు లాగేసుకున్నాం. మసీదుల కిచ్చిన దేవాదాయాలు వూడపెరికేశాం. ఆసొమ్మంతా మన ఇష్టంవచ్చినట్టు దుర్వినియోగపరిచాం.

"మహమ్మదీయశాస్త్రాలూ, మహమ్మదీయభాషలూ నేర్చుకున్న వాళ్లకి ప్రభుత్వోద్యోగాలులేవు. వాళ్లలో పండితులునశిస్తున్నారు."*

క్రైస్తవమిషనరీలు ఎక్కడపడితే అక్కడ హిందువుల రామున్నీ, ముస్లిముల మహమ్మదునీ చెడామడా తిట్టిపోసేవాళ్లు. ముస్లిముల మూలపురుషుడు నరకంలో వున్నాడనీ, అతణ్ణి కొలిచేవాళ్లు నరకానికి వెళతారనేవాళ్లు. ఇంగ్లీషువాళ్లు బుద్ధిపూర్వకంగా ఇవన్నీ చెయ్యాలనే చేసేవాళ్లు.

1849 లో పంజాబు కుంపినీ అధికారం కిందికి వచ్చాక, దాన్ని ఆదర్శమయిన క్రైస్తవప్రదేశంగా చెయ్యాలని సంకల్పించారు. వీర క్రైస్తవులందరూ కుంపినీఅధికారులై అక్కడే చేరారు.

"కాలేజీల్లోనూ, స్కూళ్లలోనూ బైబిలు బోధించాలి. విగ్రహారాధనా, నమాజులూ సహించకూడదు. దేశీయులపండుగులూ, పబ్బాలూ సెలవుదినాలుగా వుంచకూడదు. క్రిమినలు, సివిలు విషయాల్లో హిందువుల ధర్మశాస్త్రాలు కానీ, మహమ్మదీయుల న్యాయశాస్త్రాలుకానీ ప్రమాణంగా వొప్పుకోకూడదు. హిందువుల ఉత్సవాలూ, మహమ్మదీయుల పండుగులూ బహిరంగంగా జరగనివ్వకూడదు" అంటూ పంజాబునించి కల్నలు హెర్బర్టు ఎడ్వర్డ్సు పార్లమెంటుకొక మెమరాండం

* Empire in Asia.

రాసిపంపాడు. దేశం కిరస్తానంలో ముంచడానికి ఇంగ్లీషువాళ్లు తల పెట్టారనడానికి ఇంతకంటే నిదర్శనమేంకావాలి?

కిరస్తానం ప్రవేశపెట్టడానికి పటాలం అనువయిన ప్రదేశమని ఇంగ్లీషువాళ్లు మొదటినించీ భావించారు. దమ్మిడీ ఖర్చులేకుండా ఇది జరిగిపోతుంది. అమ్మకిచిక్కిన మేకల్లాగ వొక్కదగ్గిర దొరుకుతారు సిపాయిలు. యుద్ధాలూఅవీ లేనప్పుడు తీరికగావుంటారు. మహమ్మదీయుడయినా హిందువయినా అక్కడ కిక్కురుమనలేడు. ఈ ఆలోచనలతో పాదిరీలు పటాలంలో చొరబడ్డారు. అదే కొంపదీసిందంటూ 1857 ఆగస్టులో "కాజస్ ఆఫ్ ది ఇండియన్ రివోల్టు"లో వొకవిలేఖరి ఇలా రాశాడు.

"ఈ సంవత్సరారంభంలో చాలామంది సేనాపతులు సిపాయిలని కిరస్తానంలో కలపాలని పూనుకున్నారు. వీళ్లకి శ్రద్ధవుంటే వుండవచ్చు, కాని బుద్ధిమాత్రం లేదు. కాలేజీలలోనూ స్కూళ్లలోనూ పాదిరీలు చేసే మతబోధచాలదని వీళ్లు పటాలంలో చొరబడ్డట్టుంది! అసలు వీళ్లలో చాలమంది గడనకోసమనికాని, పటాలం పనిలో అభిలాష వుండికాని ఈ ఉద్యోగానికి రాలేదు. కేవలం సిపాయీలని కిరస్తానంలో కలిపెయ్యాలన్న పిచ్చితోనే ఈ నౌకరీలో వాళ్లు ప్రవేశించారు. తమ పనికి పటాలమే తగిన క్షేత్రమని ఎంచుకోడంలో కారణంలేకపోలేదు. ఊరూరూ తిరిగి గొంతుచించుకో అక్కరలేదు. ఒక్కదగ్గిరే గొర్రెల మందలా 'హీథెనులు' దొరుకుతారు. కావలిసినంత తీరుబాటూ వుంటుంది. వీళ్లలో చల్లితేనే క్రీస్తుమతబోధలు మొలకలై, కొనలు సాగుతాయి.

"ముందూవెనకా చూడకండా, పిసరంత బుద్ధిలేకండా, తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లని ఈవీరక్రైస్తవులు మతబోధలు ప్రారం

భించారు. హిందూసిపాయీలలోనూ, ఆఫీసర్లలోనూ, మహమ్మదీయులలోనూ ప్రచారం మొదలెట్టారు. క్రైస్తవగ్రంథాలు దేశభాషల్లో తర్జుమాచేసి పంచిపెట్టారు. హిందూమతం, మహమ్మదీయమతం నిందిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఇదంతా మొదట ఏదో కొత్తగా వుండేది. అంతగా పట్టించుకోలేదు సిపాయిలు. పెడచెవిని పెట్టేవాళ్లు. మొహం చిట్లించుకునేవాళ్లు. పోనీలేఅని వూరుకునేవాళ్లు; కాని రానురాను శ్రుతిమించి రాగానాపడింది. భరించడం కష్టమయింది. ఊరుకోడం తమధర్మానికీ, దేశానికీ అవమానపరచడమే అని అవగతమయింది. దాంతో రాత్రుళ్లు రహస్యంగా సభలు ప్రారంభించారు సిపాయిలు.

"మిషనరీకల్నలులూ, పాదిరీలెఫ్టినెంటులూ, అనిపించుకునే వింతఆఫీసర్లు ఆగలేదు. సిపాయిల మోరిమిచూసి మరింత ఎగబడ్డారు. వాళ్ల ఉత్సాహం గట్లుదాటింది. హిందూమతాన్నీ, ఇస్లాం ధర్మాన్నీ దుమ్మెత్తిపోయడం మొదలెట్టారు. ముక్కోటిదేవతలూ వికార స్వరూపులని వెక్కిరించారు. వాళ్లని వొదిలిపెట్టండని ప్రబోధించారు. దేవుడికుమారుడయిన ఏసుప్రభువునే సేవించమన్నారు. రాముడూ, మహమ్మదూ పనికిమాలిన మనుషులేకాదు, మోసగాళ్లన్నారు. దుర్మార్గులన్నారు.

"రానురాను మతప్రచారకులయిన ఈ కల్నలు దొరలు సిపాయిలకి లంచాలిచ్చి మతంలో కలుపుకోడం మొదలెట్టారు. ప్రమోషనులూ, ఇనాములూ ఎరపెట్టారు. ఈ నీచప్పనికి సిగ్గూ లజ్జా వొదిలేశారు. వాళ్ల ఉద్యోగాధికారం వినియోగించారు. కిరస్తానంలో కలిసే సిపాయీలని హవల్దారు చేస్తామన్నారు. హవల్దారుని సుబేదారు మేజరు చేస్తామన్నారు."

పైన చెప్పిన "కాజస్ ఆఫ్ది ఇండియన్ రివోల్టు" లండనులో ప్రకటితమయింది. దీని సంపాదకుడు మాల్కమ్ లుయిను సంపాదకీయంలో ఇలా రాశాడు.

"ఇండియాలో దేశీయుల జీవనానికి అవసరమయిన ప్రతీవస్తువూ మన అధికారంలోకి తెచ్చేసుకున్నాం. సంఘంలో వాళ్లని పైకి తీసుకురాగల ప్రతీదీ బలవంతంగా ప్రజలనించి లాగేసుకున్నాం. వాళ్లని జాతిభ్రష్టుల్నిచేశాం. వాళ్ల వారసత్వంహక్కులు పూడ్చగొట్టాం. వాళ్ల వివాహంపద్ధతులు మార్చేశాం. మతధర్మాలు తోసిరాజన్నాం. దేవాలయాలూ, ధర్మసంస్థలూ ఆస్తులు అపహరించాం. మనప్రభుత్వం రికార్డుల్లో వాళ్లని 'హీథెను' లని హీనపరిచాం. దేశీయరాజుల రాజ్యాలు కబళించాం. జమీందారులూ, భూస్వాములూ భూములు దిగమింగాం. దోపిడీచేసీ, జబర్దస్తీచేసీ ప్రజల ధనధాన్యాలు కాజేశాం. ఎన్నివిధాల వాళ్లని క్షోభపెట్టాలో అన్నివిధాలా క్షోభపెట్టాం. ప్రపంచంలోకల్లా ప్రాచీనమయినజాతి భారతజాతి. సభ్యమైనజాతి. దాన్ని సమూలంగా పడగొట్టి, కాళ్లకి రాసెయ్యాలని ప్రయత్నించాం. అయినా మనకి తృప్తిలేకుండా వుంది."

ఇంకా ఇలా రాశాడు లుయిను:

"మన పత్రికలన్నీ ఇండియామీద మతయుద్ధం రెచ్చగొడుతున్నాయి. క్రైస్తవ మతప్రచారానికి పురిగొల్పుతున్నాయి. ఇదంతా చూస్తే, నామనస్సు దుఃఖపడిపోతూవుంది. భారతీయుల సభ్యత వేలాది సంవత్సరాలనాటిది. ఇంగ్లాండుపేరు లోకానికి తెలియడానికి పూర్వమే భారతీయ నాగరికత సర్వాంగ పూర్ణంగా వుండేది. వాళ్ల కళాకౌశలానికి వాళ్ల దేవాలయాలే నిదర్శనం. భారతీయుల శాంత

ప్రవర్తన మనకి చిరపరిచితం. నడవడికి వాళ్లది పెట్టింది పేరు. అలాంటి భారతీయమతం, భారతీయసంస్కృతి సమూలంగా పెల్లగించడమంటే, అది మన తలకి మించినపని కాదా? ఇంగ్లాండు తన యావచ్ఛక్తి ప్రయోగించినా అది సాధ్యంకాదు."

లుయిను చెప్పిన జ్యోష్యం కాలమే రుజువుచేసింది.

సిపాయిలు

ప్రథమ స్వాతంత్ర్యరణయజ్ఞానికి సిపాయిలే ఇంధనం. ఈ మహా విప్లవానికి వాళ్లే వెన్నముక. దేశీయులు తుపాకులయితే సిపాయిలు తూటాలు. దేశీయులు డాళ్లయితే సిపాయిలు కత్తులు. ప్రజలు ధనుస్సులయితే సిపాయిలు బాణాలు.

నేటివుల్ని సిపాయిల్లో చేర్చుకుని, పాశ్చాత్యపద్ధతులమీద తర్బీదు చేసి వినియోగించుకోడం మొదట ఫ్రెంచి గవర్నరు డూప్లే ప్రారంభించాడు. అతణ్ణిచూసి ఈస్టిండియా కంపెనీవాళ్లుకూడా మొదలు పెట్టారు. ఈ నేటివుసిపాయిల సహాయంతోనే ఇక్కడ సామ్రాజ్యం ఏర్పరుచుకున్నారు. నేటివుసిపాయిల సహాయంలేందే ఏయుద్ధమూ గెలవలేదువాళ్లు. తుదకి 1857 స్వాతంత్ర్య సమరంలో కూడా ఈ నేటివు సిపాయిలలో కొందరి సహాయంతోనే వాళ్లకి గెలుపులభించింది. మొదటినించీ ఈ నేటివులు చూపిన శక్తిసామర్థ్యాలూ, భక్తివిశ్వాసాలూ ఎందరో ఇంగ్లీషువాళ్లు పొగిడారు. అనేకఘట్టాల్లో తాము గంజితాగి ఇంగ్లీషువాళ్లకి అన్నంపెట్టిన నిదర్శనాలున్నాయి. అయితే ఎంతప్రాణంపెట్టి పనిచేసినా గొర్రెకి తోక బెత్తెడే అన్నట్టుండేది నేటివు సిపాయిల బతుకు. ఎన్నడూ అధికార్లు వీళ్లని ఆదరించి దగ్గిర చేర్చిన పాపానపోలేదు. కుంపినీ బతికివున్న వందసంవత్సరాలలోనూ

నేటివుసిపాయిలు ఎన్నడూ బాగుపడలేదు. హెచ్చుజీతాలూ, మంచి దుస్తులూ, చక్కని వసతులూ, అధికారాలూ అన్నీ తెల్లసిపాయిలకే అమర్చిపెట్టేవాళ్లు.

కష్టమయినపనులేమో నేటీవుసిపాయిలవి. భోగాలనుభవించడమేమో తెల్లసిపాయిలవి. నిజంగా చూస్తే నేటివులు ఏవిషయంలోనూ తెల్లసిపాయిలకి తీసిపోయేవాళ్లుకారు.

నేటివుసిపాయి సుబేదారు పనిచేస్తే వందాడబ్బయినాలుగు రాళ్లిచ్చేవాళ్లు. కాని కొత్తగాచేరిన ఇంగ్లీషు సామాన్యసిపాయికి అంతకంటే హెచ్చు ముట్టేది. ఈ వ్యత్యాసం కుంపినీ బుద్ధిపూర్వకంగానే ఏర్పరిచింది. నేటివుసిపాయిలంటే ఇంగ్లీషువాళ్లు హీనంగా చూసేవాళ్లు. అడుగడుగునా అవమానపరిచేవాళ్లు. కవాతుమైదానాల్లో నానాబూతులూ తిట్టేవాళ్లు. ప్రమోషనులూ, అదనపు బత్తాలూ ఇచ్చేవాళ్లుకారు. తెల్లసిపాయిలు ఎంత తప్పుచేసినా అడిగేవాళ్లుకారు. నల్లసిపాయిలు రవంత తప్పుచేస్తే చాలు దెబ్బలూ, ఎొక్కొక్కప్పుడు ప్రాణదండనా విధించేవాళ్లు. తెల్లసిపాయిలు ఎక్కడవుంటేఅక్కడ పశువుల్లా ప్రవర్తించేవాళ్లు. వీళ్ల ఉపద్రవంవల్ల మర్యాదస్తుల స్త్రీలూ, బాలికలూ బైటికిరావడానికే భయపడేవాళ్లు. తెల్లసిపాయిలు వీధిలో కనపడితే చాలు, స్త్రీలు తలుపులువేసుకుని ప్రాణాలు చేతోపట్టుకు కూచునేవాళ్లు. ఎదురుగుండా దేశీయులెవరయినా గుర్రంమీదరావడం చూశారో ఈతెల్లసిపాయిలు దింపేసి అవమానపరిచి ఎొదిలేవాళ్లు.

"ఇంగ్లాండులో సిపాయిగాచేరడం ఎవ్వరూ గౌరవమనుకోరు. దేనికీ పనికిరానివాళ్లూ పరపతిలేనివాళ్లూ మాత్రమే పటాలంలో చేరతారు. గోడలమీది అబద్ధపు ప్రకటనలూ, సారాదుకాణాలలో

ఏజంట్లుచేసిన కల్లబొల్లిప్రచారాలూ — వీటికి మోసపోయినవాళ్ళే సిపాయిపనికోసం వెళతారు. సార్జెంట్ల రంగుదుస్తులూ, ఘాటయిన సారా వాళ్లని ఆకర్షిస్తాయి. తరుచు వాళ్లు పెళ్లాంతో పోట్లాడినవాళ్లో, అంతవరకూ తాను పనిచేస్తున్న యజమానిని నగాచేసినవాళ్లో అయివుంటారు. కాని ఇండియాలో అలాకాదు. గౌరవంకలవాళ్లూ మంచికుటుంబాలికి చెందినవాళ్లూ ఇండియాలో పటాలంలో చేరతారు. అది గౌరవంగానే భావిస్తారు."*

దీనివల్ల తెలుస్తున్న దేమిటి? తెల్లసిపాయిలకంటే నేటివుసిపాయిలు గౌరవనీయులన్న మాట! అయినా వాళ్లని హీనంగా చూడడంచేత వాళ్లలో అగ్నిపర్వతం బద్దలయిందంటే ఆశ్చర్యమేముంది!

అందుకనే చార్లెసు బాలు ఏమన్నాడో చూడండి: "ఇండియాలో ఉన్నతవంశాలికిచెందిన నేటివుపటాలాలు ఏర్పాటుచేశాం. కాని మనప్రభుత్వం బలపడుతూవున్నకొద్దీ నేటివుసిపాయిలని కించపరుస్తూవచ్చాం. పెద్దపెద్ద అధికారాలుయావత్తూ మనచేతుల్లోవుంచుకున్నాం. వాళ్లని గులాములుగానే అట్టేపెట్టాం. మన జాతికి తగినపనులే మనం చేశాం. ఎన్నోసార్లు నేటివులు తమ శక్తిసామర్థ్యాలు వ్యక్తపరిచారు. ఉన్నతపదవులకి తమకున్నఅర్హత రుజువు చేశారు. అయినావాళ్లని మనం తోసిరాజన్నాం. అన్నిఅధికారపదవులూ మనమే ఆక్రమించాం. నేటివుపటాలాలు మనకి నీడలుగా మాత్రమే తయారుచేశాం. దాంతో ఇండియాసిపాయిలబతుకే తారుమారయిపోయింది. ఆమాత్రమిమామాత్రం గౌరవంకలవాడికి పటాలంలోవుండడమే దుర్భరమయిపోయింది."†

---

* Sir gohn kaye – History of the Sepoy war.

† Charles Ball – History of the Indian Mutiny.

ఇలా నేటివుసిపాయిల కష్టాలు రానురాను విపరీతమైనతరం వచ్చాయి. అశాంతి లోపల్లోపల కుములుతూవుండేది. ఈఅశాంతి పైకుబికి ఎన్నోసార్లు విషమపరిస్థితులు సృష్టించింది. 1857 కి ముందు పదమూడేళ్లలో నాలుగుసార్లు పటాలంలో తిరుగుబాట్లు జరిగాయి. 1844 లో ముష్ఠయినాలుగో పటాలం తిరగబడింది. 1849 లో ఇరవై రెండో పటాలం తిరగబడింది. 1850 లో అరవై ఆరోపటాలమూ, 1852 లో ముష్ఠయి ఎనిమిదో పటాలమూ తిరగబడ్డాయి.

1824 లో మొదటి బర్మాయుద్ధమప్పుడు తమ మతధర్మాలకి విరుద్ధంగా సముద్రప్రయాణం చెయ్యమన్నందుకు నలభై ఏడో నేటివు పటాలం సిపాయిలమీద ఫిరంగులు పేల్చారు. "ఫిరంగులు సిపాయిల వీపులమీద అగ్నిగోళాలు కురిపించాయి. సిపాయిలు యారన్నుండీ కంగారుపడిపోయారు. తమ తుపాకులు పారేశారు. వీపుమీది మూటలు విసిరేశారు. నది తట్టు పరిగెత్తారు. ఎంతోమంది గుళ్లుతగిలి చచ్చిపోయారు. ఎంతోమంది నదిలో మునిగిపోయారు. ఒక్కడూ ఎదురు తిరగలేదు. అసలు ఎదిరించే అభిప్రాయమే వాళ్లకిలే దప్పుడు. వాళ్ల తుపాకుల్లో తూటాలుకూడా లేవు." * అవాళనించీ నలభై ఏడో పటాలమే లేకండా అయిపోయింది. రెండో బర్మాయుద్ధంలోకూడా మళ్లీ అదే ప్రశ్న ప్రత్యక్షమయింది. ఓడప్రయాణం సిపాయిలు నిరాకరించారు. అందుకని 1856 లో "జనరలు సర్వీసు ఎన్లిస్టుమెంటు చట్టం" గవర్నరు జనరలు తయారుచేశాడు. దానిప్రకారం పటాలంలోని ప్రతీసిపాయీ ఏ విదేశాలకయినా ఓడప్రయాణం చెయ్యవలిసిందే. అది తమ జాతి, మతధర్మాలకి విరుద్ధమని భావించారు సిపాయిలు. వాళ్లలో అశాంతి అపరిమితమయింది. కుంపినీ తమధర్మం మంటకలుపుతుందన్న నమ్మకం దృఢపడిపోయింది. విప్లవకాంక్ష రేకె

* Kaye.

త్తింది. దాంతో రాత్రుళ్లు రహస్య సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లో గట్టిగొంతుకవాళ్లు మాట్లాడేటప్పుడు దూరం వినపడకండా మొహంమీద గుడ్డకప్పుకునేవాళ్లు. వీలయినప్పుడల్లా ప్రజలు వీళ్లలో విప్లవ బీజాలు చల్లేవాళ్లు "మీరు తలుచుకుంటే తెల్లసిపాయిలు సముద్రంలో కాకిరెట్ట" అని హెచ్చరించే వాళ్లు. అదంతా కలిసి చివరికి మహావిప్లవంగా ప్రళయరూపందాల్చింది.

డల్హౌసీదొర ఇండియావొదలి వెళ్లేసరికి ఇక్కడ కుంపినీ పటాలం ఈ కింది విధంగా వుంది:

నేటివు సిపాయిలు: 233,000. తెల్లసిపాయిలు: 45,322.

	బెంగాలు	మద్రాసు	బొంబాయి	మొత్తం
తెల్లగుర్రపుదళం (రెజిమెంట్లు)	2	1	1	4
తెల్ల కాల్బలం (బెటాలియనులు)	15	3	4	22
కాయ్, తెల్లకాల్బలం (,,)	3	3	3	9
తుపాకులకాల్బలం (,,)	12	7	5	24
నేటివు కాల్బలం (,,)	74	52	29	155
నేటివుగుర్రపుదళం (రెజిమెంట్లు)	10	8	3	21

నేటివు బెటాలియనులలో బెంగాలులో 1100 మందీ, మద్రాసు బొంబాయిలలో 900 మందీ వుండేవాళ్లు. తెల్లబెటాలియనులు ఎక్కడయినా సరే, వొక్కవిధంగా 1000 మంది వుండేవాళ్లు.

వంగదేశం పటాలం ఇలావుండేది:

నేటివులు: రెగ్యులరు పటాలం

కాల్బలం	74	బెటాలియనులు
లైటుగుర్రపుదళం	11	రెజిమెంట్లు
ఆయుధాల గుర్రపుదళం	4	రెజిమెంట్లు
తుపాకుల కాల్బలం	2	బెటాలియనులు

నేటివు ఇర్రిగ్యులరు పటాలం

గుర్రపుదళాలు	23	రెజిమెంట్లు
సిక్కు కాల్బలం	7	బెటాలియన్లు

తెల్లపటాలం

కాల్బలం	16	బెటాలియనులు
గుర్రపుదళాలు	2	రెజిమెంట్లు
తుపాకుల గుర్రపుదళాలు	2	రెజిమెంట్లు
తుపాకుల కాల్బలం	6	బెటాలియనులు

తుపాకులు కాల్చేవాళ్లలో 12,000 కి పైగా నేటీవులే వుండేవాళ్లు. తెల్లవాళ్లు 6,500 మాత్రం. తెల్లపటాలంలో చాలాభాగం అటుబర్మాలోనూ, ఇటు పంజాబులోనూ వుండేది. పంజాబులో రమారమీ 20,000 మంది తెల్లసిపాయి లుండేవాళ్లు. బెంగాలు నేటీవుపటాలంలో 24,849 మంది బ్రాహ్మలు. 27,993 మంది రాజపుత్రులు. 13,920 మంది ఇతరజాతి హిందువులు. 12,416 మంది మహమ్మదీయులు. 1,076 మంది క్రైస్తవులు.

సిపాయిల తిరుగుబాటుకి ఇవన్నీ అనుకూలంగా వుండేవి. నేటివు సిపాయిలలో తెల్లసిపాయిలు నిజంగా సముద్రంలో కాకిరెట్టలా వుండేవాళ్లు.

అజీముల్లాఖాను

నానాసాహెబురాయబారిగా అజీముల్లాఖాను ఇంగ్లాండువెళ్లాడని వెనక తెలుసుకున్నాం. స్వాతంత్ర్యసమరంలో అజీముల్లాఖాను నిర్వహించినపాత్ర మరవరానిది. ఇతడిచరిత్రే అసలు చిత్రమైంది. అజీముల్లాఖాను ఎొక నిరుపేదకుటుంబంలో పుట్టాడు. బాల్యంలోనే తల్లీ, తండ్రీపోయారు. అనాథుడయిన అజీముల్లాఖానుకి వేరేఆధారం

లేకపోయింది. తిండికే కరువయినప్పుడు చదువుసంధ్యలకి అవకాశ మెక్కడుంది? అయినా అతడిప్రూహలుమాత్రం ఆకాశందాటుతూ వుండేవి. ఇంగ్లీషు నేర్చుకోవాలన్న ఆకాంక్షతోవొక దొరగారి ఇంట్లో వంటపుట్టీగా కుదిరా డతడు. కొద్దికాలంలోనే ఇంగ్లీషూ, బ్రెంచీ కష్టంగా మాట్లాడడం నేర్చుకున్నాడు. తరవాత ఆనౌకరీ వొదిలేశాడు. కాన్పూరులో వొకస్కూల్లో విద్యార్థిగా చేరాడు. కష్టపడిచదివి ఉత్తీర్ణుడయాడు. తుదకి ఆస్కూల్లోనే మేష్టరుగా చేరాడు. మేష్టరు అజీముల్లాఖానుప్రతిభ క్రమంగా వికసించింది. కాన్పూరులో అతడిపేరుసలుగడలా వ్యాపించింది. ఆనోటా ఈనోటా పాకి బిఠూరుదర్బారులోనూ అతడిప్రతిభ వినిపించింది. అతడి సద్గుణాలూ, తెలివితేటలూ నానాసాహెబు నాకర్షించాయి. మాస్టరుపని మానిపించేసి, తనదగ్గిరి కక్షణ్ణి తెచ్చేసుకున్నాడు నానా. అవాళనించీ నానా అజీముల్లాఖానులకి అవినాభావసంబంధ మేర్పడింది. నానా స్నేహితుడిగా, మంత్రిగా, తోడునీడగా వ్యవహరించాడు అజీముల్లాఖాను. అజీముల్లాతో సంప్రదించందే ఏదీ చేసేవాడుకాడు నానా. అందుకనే డల్హౌసీ పెన్షను నిలిపేస్తే అజీముల్లానే ఇంగ్లాండు పంపాడతడు.

అజీముల్లాఖాను 1854 లో ఇంగ్లాండు వెళ్లాడు. నానాకోసం ఇంగ్లాండులో చెయ్యవలసిందంతా చేశా డతడు. కుంపినీడైరెక్టర్ల ముందు ఎంతోవాదించాడు. ఎన్నో ఉపన్యాసా లిచ్చాడు.

అజీముల్లాఖాను అందమైనవాడు. అతడికంఠం కిన్నెరలు మోగేది. పాశ్చాత్యమర్యాద లన్నీ అతడికి తెలుసు. ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడేవాడు. మర్యాదతో కూడిన అతడి మృదువర్తనా, సరళ సంభాషణా చూసి, ఇంగ్లాండులో మెచ్చుకోనివాడు లేడు. అతణ్ణి చూడడంకోసం లండను పార్కుల్లోనూ, బ్రిటను సముద్రపొడ్డునా గుంపులు కూడేవారు జనం.

కొద్ది దినాల్లోనే అజీముల్లాఖాను లండను దొరసానుల్ని ఆకర్షించాడు. ఎంతోమంది ఇంగ్లీషుఅమ్మాయిలు అతణ్ణి ప్రేమించారు. లండను దొరసాను లతణ్ణి 'రాజా' అని పిలిచేవాళ్ళు. రాజు కాకపోతే నేంగాక, అజీముల్లా రాజులాగే వుండేవాడు. అతడెప్పుడూ భారతీయవేషంలోనే వుండేవాడు. అతణ్ణి లండనులో ప్రేమించిన ఇంగ్లీషుపడుచులు కొందరు అతడు ఇండియావచ్చేశాక అతడికి ప్రేమలేఖలు రాసేవాళ్ళు. విప్లవంలో కుంపినీవాళ్ళు బిఠూరుకోట ఆక్రమించినప్పుడు అజీముల్లాకివచ్చిన ఉత్తరాలు ఇంగ్లీషుసేనాని హావలకు చేతిలో పడ్డాయి. అందులో ఇంగ్లాండులోని ఘరానా కుటుంబాలికి చెందిన దొరసానులు అజీముల్లాఖానుకిరాసిన ప్రేమలేఖలున్నూ దొరికాయి. ప్రతీలేఖా "ప్రియుడా, అజీముల్లా!" అనే వుండేది.

అజీముల్లా రాయబారం ఫలించలేదు. అతడు చెయ్యవలిసినంతా చేశాడు. చూపవలిసిన కాగితాలన్నీ చూపించాడు. పేష్వా బాజీరావుతో కుంపినీచేసుకున్న వొడంబడికలూ, వాగ్దానాలూ వివరించాడు. న్యాయం నానా పక్షంలోనే వుంది. క్లైవిలియను, సర్ జాన్ కే, చార్లెసుబాలు, మార్టినుటంటి ప్రసిద్ధచరిత్రకారులున్నూ అది అంగీకరించారు. కాని కుంపినీ డైరెక్టర్లుమాత్రం కళ్లుమూసుకున్నారు. ముందే నిశ్చయించుకున్నవాళ్లకి న్యాయంతో పనేముంది? నానాసాహెబు వారసత్వమే అంగీకరించలేదు వాళ్లు. తిప్పితిప్పి అజీముల్లాతో స్పష్టంగా చెప్పేశారు – "గవర్నరుజనరలు చేసింది పూర్తిగా అంగీకరిస్తున్నాము. బాజీరావుపెన్షనులో నానాసాహెబుకి ఏమాత్రంమూ హక్కులేదు" అని.

అజీముల్లాఖానుహృదయం ఎంతక్షోభపడాలో అంతక్షోభపడింది. సామమూ, దానమూ, భేదమూ పిసరంత పనిచెయ్యలేదు. ఇక మిగిలిందేమిటి?

సతారారాయబారి రంగోబాపూజీ అష్టకష్టాలూపడుతూ అప్పటికింకా ఇంగ్లాండులోనే వున్నాడు. అజీముల్లా అతణ్ణి కలుసుకున్నాడు. ఇద్దరూ ఎన్నోవిషయాలు కలబోసుకున్నారు. చిత్రం! ఒకరు హిందూపదపాదుషాహి రాయబారి. ఒకరు మహామంత్రి పేష్వారాయబారి. శివాజీవంశస్థులు సతారారాజులకీ పేష్వాలకీ అనినాభావసంబంధం. మహారాష్ట్రసామ్రాజ్యానికి వీళ్లే మూలవిరాట్టులు. ఈ ఉభయుల రాయబారులూ సీమలో కలుసుకున్నారు. సీమలో తమఉపాయాలేవీ ఫలించలేదు. ఇక మిగిలిందేమిటి?

ఇంగ్లాండులోనే రంగోబాపూజీ, అజీముల్లాఖానులు స్వాతంత్ర్య సమరానికి ముసాయిదాలు తయారుచేశారు. రంగోబాపూజీ లండను నించి తిన్నగా ఇండియా వచ్చేశాడు. దక్షిణాదిని విప్లవప్రచారం ప్రారంభించాడు. కాని, అజీముల్లాఖాను ఫ్రాన్సు, ఇటలీ, టర్కీ, ఈజిప్టు, రష్యా మొదలైనదేశాలు సంచారంచేసిమరీ వచ్చాడు. యూరపులో ఇంగ్లీషువాళ్ల బలాబలాలు పరిశీలించాడు. ఆయా దేశాల సహాయమూ, సహానుభూతికోసం ప్రయత్నించాడు. ఇండియాలో ఇంగ్లీషువాళ్ల అక్రమాలు వాళ్ల కెరిగించాడు. ఇలా ఇంగ్లీషువాళ్లు ఇండియాలోచేస్తున్న దురంతాలు యూరపుఖండాలకి మొదట చాటిన తొలిప్రచారకుడు అజీముల్లాఖాను. రష్యా ఇంగ్లాండులమధ్య యుద్ధం జరుగుతూవున్న దినాలవి. సెలస్తపోలుయుద్ధంలో రష్యా ఇంగ్లాండుని ఓడగొట్టింది. రష్యావాళ్లయుద్ధం చూడడంకోసం యుద్ధరంగానికే వెళ్లాడు అజీముల్లాఖాను. లండనుకైమ్సు విలేఖరి రస్సెలు గుడారంలో ఓకరాత్రి గడిపాడు. ఈరస్సెలు తరవాత 1857 స్వాతంత్ర్యసమరం జరిగినప్పుడు కైమ్సువిలేఖరిగా ఇండియా వచ్చాడు.

అజీముల్లా పరిశీలనగా రష్యావాళ్లయుద్ధం పరికిస్తున్నాడు. ఇంతలో ఓక ఫిరంగిగుండువచ్చి, అతడి పాదాలముందు పడింది. పిసరంతా

జంకలేదతడు. అలాగే కదలకండా నుంచున్నాడు. అతడి ధైర్యానికి రస్సెలు ముక్కుమీద వేలుపెట్టుకున్నాడు. తన డైరీలో ఈఉదంతం రాసుకున్నాడు.

రష్యా జారుచక్రవర్తితో నానాసాహెబుపక్షంగా సంధికుదుర్చుకుందికే అజీముల్లాఖాను రష్యావెళ్లాడన్నారు కొందరు చరిత్రకారులు. అతడు ఇటలీవెళ్లి గారిబాల్డిని ఆహ్వానించాడనీ కొందరు రాశారు. దీనికనుగుణ్యంగా విప్లవం దినాల్లో "ఇదిగో, రష్యావాళ్లు దిగుతున్నారు" అనీ, "గారిబాల్డీ రావాలని సిద్ధపడుతుండగా ఇండియాలో విప్లవం చల్లారిపోయింది, ఆగిపోయాము" అనీ పుకార్లు పుట్టాయి.

ఏమయినా అజీముల్లాఖాను విదేశాల సహాయంపొందడంకోసం ఎంతో ప్రయత్నంచేశాడు. ఇదిమాత్రం నిజం. టర్కీసుల్తానుదగ్గిరా, ఉమరుపాషాదగ్గిరా అజీముల్లాఖాను ఉత్తరాలు చూసినట్టు రాబర్ట్సన తన "ఇండియాలో నలభై ఏళ్లు" గ్రంథంలో రాశాడు.

బిఠూరుదుర్గం కళావిహీనంగావుంది. నానాసాహెబు ఆశలు అడియాసలయాయి.

అజీముల్లాఖాను వచ్చేశాడు.

ఏంతెచ్చాడు? ఏమిటది?

అంతా రహస్యం. అతిరహస్యం.

కృష్ణరాయబారం విఫలమయింది.

బిఠూరుదుర్గం ఉపప్లావ్యమయింది.

తరవాత? తరవాత? విప్లవం దేశమంతటా రణోద్యోగం.

తుఫానుకి ముందు

అవి 1856 మధ్యదినాలు. భారతదేశంలో ఎక్కడచూస్తే అక్కడ రహస్యసంఘాలు. సంస్థానాల్లో, పటాలాల్లో, వూరూరా, వాడవాడా,

ఇంటింటా రహస్య ప్రచారాలు. వీధుల్లో, రచ్చచావిళ్ళలో, ధర్మశాలల్లో, దేవాలయాల్లో, మసీదుల్లో, మఠాల్లో, తీర్థాల్లో, ఉత్సవాల్లో రహస్యప్రబోధాలు. కవులూ, పండితులూ, ముల్లాలూ, సన్యాసులూ, ఫకీర్లూ రహస్య ప్రచారకులు; రాయబారులు.

"హిందూమహమ్మదీయులు ఏకంకావాలి. డిల్లీపాదుషా జెండాకింద స్వాతంత్ర్యసమరం సాగించాలి. ఒక్కనాడు, ఒక్కసారి దేశమంతా లేవాలి. తెల్లపురుగులు ఏరెయ్యాలి. ఫరంగిమ్లేచ్ఛుల్ని చంపెయ్యాలి. భారతమాత చెరవిడిపించాలి. సోదరులారా, ఏకంకండి. నడుములు కట్టండి. స్వధర్మం కోసం, స్వరాజ్యంకోస యుద్ధం చెయ్యండి. ఈ యుద్ధంలో మరణిస్తే స్వర్గం. పిరికిపందలయి దాగుంటే నరకం." – ఇదీ రహస్యప్రచారం. ఇదీ రహస్యప్రబోధం.

ఈ రహస్యోద్యమానికి ఆదిపీఠం బిఠూరుదుర్గం. నానాసాహెబూ, అజీముల్లాఖానులు ప్రవక్తలు.

బిఠూరు దుర్గంలో మంతనాలారంభమయాయి. నానా అజీముల్లాలు అద్భుతమయిన రహస్యప్రణాళికలు తయారుచేశారు. దేశంలోని సంస్థానాలన్నిటికీ రహస్యంగా రాయబారాలు పంపారు. ప్రతీ రాజుకీ రహస్యలేఖలు రాశారు. వాటిల్లో చిత్రమైన పరిభాష ఉపయోగించారు. ఆ ఉత్తరాల్లో ఒకటి మైసూరులో కుంపినీవాళ్ళ చేతిలోనూ పడింది. అయితే దాని అంతుమాత్రం చిక్కలేదు.

డిల్లీకోటకూడా ఒక రహస్యకేంద్ర మయింది. పట్నంలో రహస్యసంఘాలేర్పడ్డాయి. కోటలోని సహజాదాలు రహస్యసంఘంలో చేరారు. కోటలోని బీబీలు ఫూసులాడుకున్నారు – "సిపాయిలు యుద్ధంచేస్తారు. కుంపినీరాజ్యం కూలిపోతుంది." ఈఅవకాశం ఎవాదల కూడదని జిన్నతుమహలు ప్రతిజ్ఞపట్టింది. బహదూరుషాని ప్రోత్సహించింది. బహదూరుషా పర్షియాకి రహస్యంగా రాయబార మంపాడు.

జుమ్మామసీదు గోడలమీద కిందిప్రకటన ప్రత్యక్షమయింది : "పర్షియా పటాలం వస్తోంది. ఫరంగీలని పారదోలి భారత దేశం విడిపిస్తుంది. భారతీయులు యావన్మందీ చిన్నా పెద్దా ఏకంకండి. ఫరంగీలని పారదోలండి." ఈప్రకటనకి పత్రికలున్నూ ప్రాముఖ్యమిచ్చాయి.

నానాసాహెబు రాయబారం రాజులందరికీ అందింది. ఆదిలో వాళ్ళలో కదలిక కనపళ్లేదు. కాని డల్హౌసీ అయోధ్య కలిపేసుకున్నాక, వందలువందలు జవాబులు వచ్చాయి. అదునులో అయోధ్య అపహరణ జరిగింది. విప్లవకేదారాలకి నీరుపట్టినట్టయింది. "ఇవాళ అయోధ్య, రేపు మనవంతు" అంటూ ప్రతీరాజూ కలనరపడ్డాడు, తటపటాయిస్తున్న వాళ్ళంతా విన్లవానికి తలవూపారు.

రాజ్యంపోయిన అయోధ్యనవాబు వజీదాలీ, అతడిమంత్రి నఖీఖానూ, ఉపాధులుపోయిన అయోధ్య తాలూకాదారులూ, జమిందారులూ. ప్రజలూ యావన్మందీ రహస్యోద్యమంలో చేరారు. శపథం చేశారు. వజీదాలీ బేగం హజరతుమహలూ, నఖీఖానూ స్వాతంత్ర్య సమరంలో ప్రముఖపాత్ర వహించారు. నఖీఖాను కలకత్తాలో కూచుని రహస్యోద్యమం సాగించాడు. పైకిమాత్ర మేదో జల్సావెలిగిస్తూ, కాలక్షేపం చేస్తున్నట్టుండేవాడు. ఫకీర్ల వేషంలోనూ,సన్యాసుల వేషంలోనూ రహస్య ప్రచారకుల్ని ఉత్తరభారతం పటాలాలలోకి పంపించాడు. ఆ పటాలాల నేటివుఆఫీసర్లతో రహస్యలేఖలు నడిపించాడు. బెంగాలు సిపాయిల్లో అధికం అయోధ్యవాళ్ళు. కుంపినీ తమ నవాబుకి చేసిన అన్యాయాలూ. బేగములిన్ని పెట్టిన అగచాటూ జాలిపుట్టేటట్టు వాళ్ళకి రానేవాడు, సిపాయిలు చదివేవాళ్ళు; ఏడ్చేసేవాళ్లు; ఉద్రేకపడేవాళ్ళు; పిడికిలి బిగించేవాళ్లు; వొణికిపోయేవాళ్ళు. హిందువులు గంగాజలంపట్టి ప్రమాణం చేసేవాళ్లు. మహమ్మదీయులు కురానుపట్టి శపథంచేసే వాళ్లు – "ఇంగ్లీషువాళ్ళని హతవారుస్తాం."

కలకత్తా విలియంకోటలోకూడా సఖిఖాను రహస్యప్రచారకులు పనిచేశారు.

బేగం హజరతుమహలు అయోధ్యప్రజల్లో అగ్నిహోత్రం రగిలించింది. ధనవంతులు మొదలుకుని దరిద్రులదాకా స్వాతంత్ర్య సమరానికి సిద్ధంచేసింది.

సతారాలో రంగోబాపూజీ అవిరామంగా రహస్యప్రచారం సాగించాడు. దక్షిణభారతంలో విప్లవబీజాలు చల్లాడు.

ఇలా బిహారు, డిల్లీ, లక్నో, కలకత్తా, సతారాలు ముఖ్యకేంద్రాలయాయి. దేశమంతటా వెయ్యిముఖాలా రహస్యప్రచారం సాగించాయి. ఉద్యమానికి ధనలోపం లేకపోయింది. వేలువేలు ధనవంతులూ, సాహుకార్లూ ధనరాసులు తెచ్చి, ఉద్యమ నాయకుల ముందు కుమ్మరించారు. పండితులూ, మౌల్వీలూ, ఫకీర్లూ, సన్యాసులూ రహస్యప్రచారకులయి దేశమంతా బయలుదేరారు. వీళ్ళకి ఏనుగులుండేవి; గుర్రాలుండేవి; రక్షకభటులుండేవాళ్ళు. సిబ్బందీవుండేది. దేశం ఈకొసనించి ఆకొసదాకా వీళ్ళు ప్రచారం చేసేవాళ్ళు.

ముష్టివాళ్ల వేషంలో స్వేచ్ఛాసేవకులు బయలుదేరారు. ఇంటింటా బిచ్చమెత్తుతూ విప్లవప్రచారం చేసేవాళ్లు. స్వధర్మం, స్వరాజ్యం — తారకమంత్రం వినిపించేవాళ్లు. ఉద్రేకపరిచేవాళ్లు.

ఇదంతా తెల్లదొరలకి ఆచోకీ అందకండా, చడీచప్పుడూ లేకండా చాపకిందనీరులా జరుగుతూవుండేది. పైకిమాత్రం అంతా ప్రశాంతంగా వుండేది. ఈప్రశాంత మెలాంటిది? తుఫానుకిముందు వాతావరణ మెలావుంటుంది, అదిగో అలాంటిది.

విప్లవప్రచారకులయిన ముల్లాలూ, పండితులూ పటాలాల్లో ప్రవేశించారు. రాత్రుళ్లు రహస్యసమావేశాలుజరిపి, సిపాయిల్లో విప్లవం

నూరిపోశారు. బారకుపురంనించి మీరటువరకూ, అంబాలా పెషావర్లలోనూ పటాలాలలో రహస్యసంఘం లేర్పరిచారు. పల్లెలలోనూ, పట్నాలలోనూ ఎడతెరిపిలేని ప్రచారం సాగించారు. తీర్థపుదేవుల్లోనూ, దేవాలయాల్లోనూ, మశీదుల్లోనూ, ధర్మశాలల్లోనూ, బజార్లలోనూ – ఎక్కడపడితేఅక్కడ ధర్మయుద్ధంకోసం, స్వాతంత్ర్య సమరంకోసం ఉద్రేకమయిన ఉపన్యాసాలు చేశారు.

కవులు జాతీయగీతాలు రాశారు. గాయకులు వీరగేయాలు పాడారు. జాతీయగేయం "అల్లాఉదాల్" గేయం లక్షలాది ప్రజల్ని ఉద్రోతలూపింది. దర్బారుకవిరాసిన జాతీయగేయం ప్రతీసభలో వేశంలో పాడాలని పాదుషా బహదూరుషా ఆదేశించాడు.

"ఇంగ్లీషురాజ్యం ధ్వంసమైపోతుంది. ఫరంగిజులును అంతమవుతుంది. స్వరాజ్యం, స్వాతంత్ర్యం వచ్చేస్తుంది" – ఎక్కడ పడితే అక్కడ ఇవే గుసగుసలు. దాంతో దొరలనౌకర్లలో వొక నిర్లక్ష్యభావ మేర్పడింది. చీటికీమాటికీ ఆయాలు అలిగి కూచునేవాళ్లు. చెప్పకండా వెళ్లిపోయేవాళ్లు. అర్ధరాత్రంగా వున్న, దొరసానమ్మ దగ్గిరికి వంటవాడు బుద్ధిపూర్వకంగా వచ్చి నుంచునేవాడు. విప్లవం జనసామాన్యంలో పాకడానికి అనువయిన ప్రతీసాధనమూ విప్లవనాయకులు ఉపయోగించారు. రాత్రిళ్లు బొమ్మలాటలద్వారా ప్రచారంచేసేవాళ్లు. ఇంటింటా ఆడంగులలో ప్రచారాని కొక చిత్రమైనమార్గం కనిపెట్టారు. సోదిచెప్పే గిప్సీస్త్రీలని వందలు వందలు నియమించారు. ఈ ఎరుకలపడుచులు ఇంటింటికీ వెళ్లేవాళ్లు. అమ్మలక్కలముందు దేశం గురించి సోదిచెప్పేవాళ్లు. త్వరలోనే ఇంగ్లీషువాళ్లు నాశనమవుతారని జోస్యం చెప్పేవాళ్లు. ఫరంగిదొరల అన్యాయాలూ, ఘోరాలూ నూరిపోసేవాళ్లు. ప్రజలకర్తవ్యం బోధించేవాళ్లు. విప్లవబీజాలు వెదచల్లేవాళ్లు.

"ప్లాసీయుద్ధానికి నూరేళ్లు నిండిననాడు కుంపినీరాజ్యం కూలిపోతుంది." అంటూ గ్రహబలాలుకట్టి జ్యోతిష్కులు జోస్యంచెప్పారు. దేశమంతటా విద్యుత్తులా వ్యాపించిందీ జోస్యం. పత్రికలూ దీనికి ప్రాముఖ్యమిచ్చాయి. ఈ నమ్మకంతో వొక కొత్త ఉత్సాహం దేశంలో గుబగుబ లాడింది. చిత్రం! ఈ జోస్యం నిజమే అయింది. 1857 తో ప్లాసీయుద్ధానికి నూరేళ్లు నిండాయి. ఇండియాలో కుంపినీ రాజ్యం అంతరించింది. రాణీరాజ్యం వచ్చింది. అయితే ఇంగ్లీషురాజ్యం అంతరించడానికిమాత్రం మరో అన్నేళ్లు పట్టింది.

రహస్య సంఘాలు దేశమంతటా సాలెపట్టులా అల్లుకున్నాయి. ఎంతోమంది నాయకులు తయారయారు. లక్నోనించి ఆగ్రావరకూ మౌల్వీ అహమ్మద్షా బ్రహ్మాండమైన చైతన్యం కలిగించాడు. అహమ్మద్షా అద్భుతమైన వ్యక్తి. అతడి ఉపన్యాసాలలో అగ్నిహోత్రం వర్షించేది. పాట్నాలో వొక పుస్తకాలవర్తకుడు పీరుఆలీ నాయకత్వం వహించాడు. నగరం యావత్తూ విప్లవసంఘంగా తయారయింది. బీహారులో మహావీరుడు కుమారసింహుడు వృద్ధాప్యంలో జూలుదులిపిన సింహంలా లేచాడు. బెంగాల్లో నఖీఖాను సిపాయిలని తుపాకుల్లో తూటాల్లా తయారు చేశాడు. హైదరాబాదు మహమ్మదీయులు రహస్య సమావేశాలు జరిపారు. జోధాపురంరాజు ఉదికంబౌనికి సిద్ధపడ్డాడు. కొల్హాపురం చుట్టూ విప్లవమేఘాలు ముసురుకున్నాయి. సంగిలి నానాసాహెబు మామగారు తుపాకి భుజానవేశాడు.

మద్రాసులోకూడా రహస్యసంఘం పనిచేసింది. పట్నంగోడల మీద విప్లవప్రకటన ప్రత్యక్షమయింది:

"దేశీయులారా! మతంమీద నమ్మకమున్న సోదరులారా! లేవండి. యావన్మందీ లేవండి. ఈఫరంగికాఫర్లని తరుముదాం లేవండి! ఫరంగీలు న్యాయంతొక్కేశారు. మన స్వరాజ్యం లాక్కున్నారు.

మనదేశం బుగ్గిపాలుచేయడానికి పూనుకున్నారు. ఈషరంగీలచేతుల్లోంచి, ఈ మ్లేచ్ఛులచేతుల్లోంచి భారతదేశం విడిపించడానికి వొక్క-టేవుంది సాధనం – యుద్ధం. ఈ యుద్ధం ధర్మయుద్ధం. స్వాతంత్ర్యయుద్ధం. పవిత్రయుద్ధం. ఈయుద్ధంలో మరణించినవాళ్లు దేశం సహీదులు. జాతీయధర్మం వొదిలేసి, వెనకంజవేసిన పిరికిపంద లకి మండుతూన్న నరకమే గతి. దేశీయులారా, ఈరెండింటిలో ఏది మీరెంచుకుంటారో ఎంచుకోండి. ఇప్పుడయినా మించిపోలేదు.''

ఇంతజరుగుతూవున్నా ఈ విప్లవసంఘాల రహస్యంప్రభుత్వానికి అంతుచిక్కేదికాదు. ''అద్భుతమైన చాకచక్యంతో ఈ 'కుట్ర' సాగింది. ఈఉద్యమంలో పనిచేసేవాళ్లకి ఎవళ్లకి ఎంతఅవసరమో అంతమాత్రమే భోగట్టా అందేది. అంతకిమించి పిసరంతరహస్యం బైటికివచ్చేదికాదు.'' రహస్యసంఘాలు ఉపయోగించే ఉత్తరాల్లో 'కాభాష' లాంటి వొకచిత్రమైన సాంకేతికభాష ఉపయోగించే వాళ్లు. కొన్నిఉత్తరాల్లో సున్నాలూ అడ్డగీతలూ మాత్రమే వుండేవి. వాటిఅర్థం సంఘంలోవాళ్లకితప్ప తక్కినవాళ్లకి అర్థమయేదికాదు.

రష్యా విప్లవంమళ్లే ఈవిప్లవసంఘాల్లో పోలీసులుకూడా చేరారు. చాలాచోట్ల పోలీసుస్టేషనులే రహస్యకేంద్రాలుగా వుండేవి. వీధుల్లో అంటించేప్రకటనలు తరుచు పోలీసులే అంటించేవాళ్లు. అంచేత ఈకాగితాలంటించేవాళ్లని పట్టుకోడం తమతరంకాదని అధికార్లకి తెలిపేవాళ్లు.

ఇలా దేశంలో ఎంతప్రబోధంజరగాలో అంతా జరిగింది. ధర్మం కోసం, దేశంకోసం భారతీయులు ప్రాణాలర్పించడానికి ఉవ్విళ్లూరారు. పెళ్లికిసిద్ధపడట్లు సిద్ధపడ్డారు. ఆసుముహూర్త మెప్పుడెప్పుడని సిపాయిలు ఎదురుచూశారు. పటాలాల్లో ప్రతీరోజూ రాత్రిసమావేశాలు జరిగేవి. నేటీవుసుబేదార్ల ఇళ్లల్లో రహస్యసమాలోచనలు సాగేవి.

సమావేశాలకి వచ్చేవాళ్లు మొహాలకి బురఖాలు వేసుకువచ్చేవాళ్లు. బైటికి కళ్లుమాత్ర మవుపించేవి. రహస్యమెవరయినా వెల్లడిచేశారే ఉత్తరక్షణంలో వాడి తల తెగి కిందపడేది. తిరుగులేదు.

దేశద్రోహికి నరకం.

దేశభక్తుడికి స్వర్గం.

నానాసాహెబు తీర్థయాత్ర

1857 మార్చినెలలో నానాసాహెబూ, అజీముల్లాఖానులు తీర్థయాత్రకి బయలుదేరారు. చిత్రం! ఒకహిందువూ, వొకమహమ్మదీయుడూ కలిసి తీర్థయాత్ర! తీర్థయాత్రా? రణయాత్రా ఇది? వీళ్ళతో నానాసోదరుడు బాలాసాహెబుకూడా బయల్దేరాడు.

బిఠూరునించి బయలుదేరి నానాసాహెబు డిల్లీచేరాడు. ప్రథమ తీర్థస్థలం యమునవొడ్డుని ఎర్రకోట. దివాన్-ఇ-ఖాసులోబహదూరుషా, జిన్నతుమహలూ, నానాసాహెబూ, అజీముల్లాఖానూ ఇతర ముఖ్య నాయకులూ కలుసుకున్నారు. రహస్య మంతనాలు, సాగించారు. వాళ్ళేమి మంతనాలు జరిపిందీ ఫరంగిప్రభుత్వానికే కాదు, చరిత్రకే ఆచోకీ అందలేదు.

డిల్లీలో చేయవలసినఏర్పాట్లన్నీచేసి, చూడవలిసిన నాయకుల్ని చూసి నానాసాహెబు అంబాలా వెళ్ళాడు. దారికడాకూ చూడవలిసిన స్థలాలు చూశాడు. అంబాలానించి పద్దెనిమిదో తేదీని లక్నో చేరాడు. అవాళే చీఫుకమీషనరు లారెన్సుబగ్గీమీద లక్నోప్రజలు రాళ్ళు రువ్వారు. బురద కొట్టారు. నానాసాహెబు రావడంతోనే లక్నో పట్నంలో బ్రహ్మాండమైన ఉత్సాహం చెలరేగింది. పురవీధుల్లో పెద్ద ఉత్సవంతో అతణ్ణి వూరేగించారు. లక్నోనించి అతడు కాల్పీ వెళ్ళాడు.

నానా సాహేబు



1. జనరల్ హావలక్ 2. సర్ హెన్రీ లారెన్స్ 3. గవర్నర్ జనరల్ కానింగ్ 4. జాన్ లారెన్స్ 5. సర్ జాన్ లారెన్స్

ఏర్పాటులుచివరని బిఠూరు వచ్చేశాడు. అంబాలానించి నానా అజీముల్లాలు సిమ్లాకెళదామనుకున్నారు. కాని చలిఅని ఆప్రయత్నం మానేశారు. *

ఈతీర్థయాత్రలో నానా అజీముల్లాలు ఎన్నోపటాలాల కేంద్రాలు చూశారు. రహస్యకేంద్రాలు వొక్కతాటిమీదికి తీసుకువచ్చారు. ప్రతీచోటా విప్లవోద్యమనాయకులతో సంప్రదించారు. ఈయాత్రలో నానా జగత్పురం కుమారసింహుణ్ణి కలుసుకున్నాడు. ఇంతమందితోనూ సంప్రదించి భవిష్యత్తుకార్యక్రమం నిశ్చయించాడు. అయితే ప్రభుత్వానికి పిసరంత ఉప్పందకండా ప్రవర్తించాడు. విప్లవానికి రహస్య రక్షణే పెద్దబలం.

అతడు వెళ్ళినప్రతీచోటా ఇంగ్లీషు ఆఫీసర్లని కలుసుకునేవాడు. వాళ్ళ కేవిధమయిన అనుమానమూ లేకండా నడుచుకునేవాడు. డిల్లీలో ఆగ్రాజజ్జి మెరేలు నానాని చూడవచ్చాడు. ఎంతోఅంత ఆదరంతో నానా అతడికి స్వాగతమిచ్చాడు. లక్నోలో తనంతట తాను కోరి లారెన్సుని కలుసుకున్నాడు. ఊరికే దాన్లో లక్నోపట్నం చూసి పోదామని వచ్చాననన్నాడు. తన పరివారమంతటితోనూకలిసి లారెన్సు నానాని గౌరవించాడు.

నానా అజీముల్లాల తీర్థయాత్ర ముగిసింది. స్వాతంత్ర్య సమరారంభానికి సుముహూర్తం నిశ్చయమయింది. ఎలాఆరంభించాలో, ఎప్పుడారంభించాలో, ఎప్పుడు; ఎక్కడ ఏంచెయ్యాలో అంతా నిశ్చయమయింది.

* Afterwards, the worthy Couple (Nana and Azimulla), on the pretence of a pilgrimage to the hills, visited the military stations all along the main trunk road and went so far as Umballa. It has been suggested that their object in going to Simla was to tamper with the Gurkha regiments stationed on the hills. But finding, on their arrival at Umballa, a portion of the regiment were in Cantonments, they were unable to effect their purpose with these men and desisted from their proposed journey, on the plea of the cold weather. – Russell's Dairy.

1957 మే ముప్ఫయివొకటి ఆదివారం సుముహూర్తం. అవాళే దేశమంతా వొక్కసారి లేవాలి. వొకేసారి రణడిండిమ మోగించాలి. ఎక్కడి ఇంగ్లీషువాళ్ళ నక్కడ నరికిపారెయ్యాలి. వాళ్ళ బంగళాలు కాల్చెయ్యాలి. జైళ్ళు పడగొట్టాలి. ఖైదీలని విడిపించాలి. ఖజానాలు దోచుకోవాలి.

ప్లాసీయుద్ధానికి నూరేళ్లు నిండుతాయి. కుంపినీరాజ్యానికి నూరేళ్లు నిండించాలి. అవాళ ఆదివారం. దొరలందరికీ తీరుబాటు. యావన్మందీ, ఆడామగా గుళ్లలో మందలుమందలు దొరుకుతారు. ఎక్కడి సిపాయి లక్కడ, ఎక్కడిజనమక్కడ దొరలమందలమీద వొక్కసారి విరుచుకుపడాలి. నరికెయ్యాలి. కాల్చెయ్యాలి. నెత్తురువరదలు పారించాలి. ఒకరికొకరు వొకరి కందకూడదు. తెల్లపురుగన్నది వొదలకూడదు. హరోంహర! దీన్‌దీన్!!

ఎర్రపద్మమూ – చపాతీ

1857 స్వాతంత్ర్యసమరానికి సాంకేతికచిహ్నాలు ఎర్రపద్మమూ, చపాతీ! ఎంతగంభీరమయిన సాంకేతికాలివి! ఏవిప్లవరుషి కల్పన ఇది! గ్రామాలికిచపాతీ, పటాలాలకి ఎర్రపద్మం!

ఉన్నట్టుండి వొకవూళ్లోకి చపాతీ వచ్చేది. ఊరిచౌకీదారుచేతి కందేది. అతడొక చిన్నముక్క కొరికేవాడు. ఊళ్లోవాళ్లకి ప్రసాదం పంచిపెట్టేవాడు. తరవాత పక్కవూరికి చపాతీ అందించేవాడు. ఈ చపాతీ వచ్చిందంటే చాలు, వూరు వూరంతా గుప్పుమనేది. చపాతీ తిన్న వూరు స్వాతంత్ర్య సమరాహ్వానం అంగీకరించిం దన్నమాట. దేశంకోసం, ధర్మంకోసం ప్రాణాలర్పించడానికి సిద్ధపడిం దన్నమాట! శపథంచేసిందన్నమాట! ఫరంగిపురుగులు హతంవార్చి, తల్లిసంకెళ్ళు విడిపించడానికి నడుంకట్టిం దన్నమాట!

ఈచపాతీ ఎలావచ్చేదో, ఎక్కడినించి వచ్చేదో – అంతా అద్భుతంగా వుండేది. కొద్దిరోజుల్లో ఈచపాతీలు దేశందేశమంతా – ఈచివరనించి ఆచివరవరకూ, ఈపక్కనించి ఆపక్కవరకూ వేలవేల పల్లెలు నిండిపోయాయి. కోట్లాదిప్రజల కందాయి. స్వాతంత్ర్య సందేశం, విప్లవసందేశం – ధర్మం, తారకమంత్రం ఉపదేశించాయి. దేశమంతా గుబగుబలాడించాయి. హాలాహలం పుట్టించాయి. ఏముంది? ఏముం దీచపాతీలో? ఏమిటీ ఇంద్రజాలం? ఏమో!

చపాతీల ప్రయాణానికి అడవులూ, కొండలూ అడ్డురాలేదు. నదీనదాలు అడ్డంకి కాలేదు. అద్దరాత్రుళ్ళు అడ్డుపడలేదు. చపాతీలు. చపాతీలు. ఎక్కడచూసినా, ఏపల్లెచూసినా, ఎవరిచేతిలోచూసినా – రహస్యంగా, అతిభద్రంగా, అతిపవిత్రంగా – చపాతీలు, చపాతీలు!

కుంపినీ అధికార్లు అక్కడక్కడ చపాతీలు పట్టుకున్నారు. వాటిలో ఏముందో అని వాళ్ల జిజ్ఞాస! ముక్కలు ముక్కలు చేసి చూశారు. గుండపిండిచేసి వెదికారు! వెర్రిదొరలు! వాళ్లతో చపాతీలు మాటాడలేదు. అందులో వొక అక్షరంకాని, వొక సాంకేతిక చిహ్నంకాని వాళ్లకి కనపడలేదు. తెల్ల మొహం వేశారు తెల్లదొరలు. వాళ్ల కేమో వుత్తిదే చపాతీ. కాని భారతీయులికి – హిందువులయినా సరే, ముస్లిములయినా సరే, – అది విప్లవసందేశం; సమరాహ్వానం; రణదుందుభి; పాంచజన్యం; దేవదత్తం. గ్రామాలకి చపాతీ, పటాలాలకి ఎర్రపద్మం! వైదిక యుగం నించీ భారతదేశసంస్కృతికి చిహ్నం ఎర్రపద్మం. ఇదీ స్వాతంత్ర్యసమరంలో సిపాయిలకి సాంకేతికం.

ఒకసిపాయిచేతిలో హఠాత్తుగా ఎర్రపద్మం అవుపించేది. అతడి వొళ్లు పులకరించేది. అతడది వాసన చూసేవాడు. అతడిమొహం ఎర్రపడేది. కళ్లు కెంపెక్కేవి. ఒళ్లు కంపించేది. పక్కసిపాయి కందిచ్చేవాడు. మొదటిసిపాయిలాగే అతడి వొళ్ళూ పులకరించేది. అతడది

వాసనచూసేవాడు. మొహం ఎర్రపడేది. కళ్ళు కెంపెక్కేవి. ఒళ్ళు కంపించేది. తన పక్కసిపాయి కది అందిచ్చేవాడు.

ఇలా పటాలమంతా సిపాయిలందరిచేతా ఎర్రపద్మం తిరిగిపోయేది. పటాలమంతా నిషా ఎక్కినట్ట యేది. చిట్టచివర ఏ సిపాయిచేతికి ఎర్ర పద్మంవస్తే ఆ సిపాయి దాన్ని పక్కపటాలానికి పట్టుకు వెళ్లేవాడు; అందించేవాడు. ఆ పటాలంలో అలాగే కొద్దిక్షణాల్లో నిషా ఎక్కినట్ట యేది. ఏమిటిది? ఎర్రపద్మంలో ఏముంది? ఏముందేమిటి? అంతా వుంది. ఏంలేదు? ఎర్రపద్మంలో ఏం లేదు?

ఎర్రపద్మం వాసనచూసిన సిపాయి రణదీక్ష పూనా డన్నమాట! దేశంకోసం, ధర్మంకోసం ప్రాణంబలిపెట్టడానికి శపథం చేశా డన్న మాట! పటాలమంతా పూర్తయేసరికి పటాలం యావత్తూ ఈదీక్ష, ఈశపథం పూనిం దన్నమాట!

రక్తపద్మం చూడడంతోనే సిపాయీలకి వీరభారతం కళ్ళముందు కనపడేది. తమ ఎర్రటిపెదవుల్లో చిరునవ్వు మెరిసేది. హృదయాల్లో వురుము లురిమేవి. ఎర్రపద్మం! ఎర్రపద్మం —

సబ్ లాల్ హోజాయగా!
సబ్ లాల్ హోజాయగా!!

కొవ్వు తూటాలు

డమ్‌డమ్‌లో ఆకస్మికంగా వొకసంఘటన జరిగింది. ఒక సిపాయి చెంబుతో నీళ్ళు పట్టుకు వెళుతున్నాడు. ఒక తోటీవాడు ఎదురుగుండా వచ్చాడు. తాగిందికి నీళ్ళు చెంబడిగాడు. సిపాయి బ్రాహ్మడు. తోటీ వాడు ముట్టుకుంటే చెంబు మైలపడిపోతుం దంటూ ఇవ్వను పొమ్మన్నాడు. తోటీవాడి మనస్సు చివుక్కుమంది. "జాతిజాతి అంటూ మహా డాబుచేస్తున్నావు. ఆవుకొవ్వూ, పందికొవ్వూ పూసిన తూటాలు

కొరికినప్పుడు జాతిపోదులే! కొత్తతూటా లేమిటో తెలుసా? పుయ్యాలనే వాటికి పందికొవ్వూ, గొడ్డుకొవ్వూ పూస్తున్నారు" అన్నాడు.

సిపాయిబ్రాహ్మడికి మతిపోయింది. ఆవేశమెత్తింది. ఆవూపుని పటాలంలోకి పరిగెత్తాడు. ఇంకేముంది! ఉత్తరక్షణంలో పటాలం పటాలం కుతకుతలాడిపోయింది. సిపాయిలు ఇంగ్లీషుఅధికార్లదగ్గిరికి పరిగెత్తారు. "అబ్బే, అదంతా వొఠి అబద్ధం" పొమ్మన్నారు అధికార్లు. సిపాయిలకి నమ్మకం కుదరలేదు. తూటాల కార్ఖానాకివెళ్లారు. కార్ఖానాకూలీలని కనుక్కున్నారు. తోటి చెప్పినమాట అక్షరాలా నిజమని తేలిపోయింది.

1853లో కొత్తరకంతుపాకులు వచ్చాయి. వాటిని "ఎన్‌ఫీల్డు రైఫిల్సు" అనీ, "బ్రేన్‌గన్సు" అనీ అనేవాళ్ళు. అప్పట్లో అవే గొప్పతుపాకులు. అంతకిముందున్న తుపాకులన్నిటికంటే ఈతుపాకుల గుళ్ళు దూరం వెళ్లేవి. వీటికోసం వొక కొత్తరకంతూటాలు అవసరమయాయి. వాటికి ఆవుకొవ్వూ, పందికొవ్వూ పూసేవాళ్ళు. సిపాయిలు వొకచేత్తో తుపాకి పట్టుకుని, రెండోచేత్తోతూటా పంటితో కొరికి ఉపయోగించవలసివచ్చేది. ముందుముం దివి ఇంగ్లీషుసిపాయిలకిచ్చారు. తరవాత తరవాత నేటీవుసిపాయిలనికూడా వాడమన్నారు. 1857 లో పైసంఘటన జరిగేదాకా సిపాయీలకి ఈకొవ్వుసంగతి తెలియదు.

డమ్‌డమ్‌లో కొవ్వుతూటాలసంగతి తెలియగానే సిపాయిలఉద్రేకం పట్టశక్యం కాలేదు. కిరస్తానం ప్రచారంవల్లే సిపాయిలకి మండుతూవుండేది. ఇప్పుడు తమజాతి చెడగొట్టడానికే కొవ్వుతూటాలు తెచ్చిపెట్టారని భావించారు వాళ్ళు. ఆవుకొవ్వూ పందికొవ్వూ హిందువులకీ, ముస్లిములకీ ధర్మవిరుద్ధమైంది. ప్రాణంకంటే ధర్మం ప్రియమైంది. వెంటనే తిరగబడదా మన్నారు సైనికులు. పెట్టినముహూర్తం – మే ముప్పయి

ఒకటి వరకూ ఓపికపట్టమన్నారు నాయకులు. ఏమయినాసరే, కొవ్వుతూటాలు వాడమని శపథంపట్టారు సిపాయిలు.

కొవ్వుతూటాలమాట ఇతరపటాలాలకీ పాకిపోయింది. బారకు పురంనించి పెషావరువరకూ వందలు వందలు ఉత్తరాలు పరిగెత్తాయి. అంతటా అగ్నిహోత్రం అంటుకుంది. ఎక్కడన్నా ఇద్దరుసిపాయిలు కలుసుకుంటే చాలు, కొవ్వుతూటాలమాటే చెప్పుకున్నారు.

అప్పటి కుంపినీఅధికార్లు యావన్మందీ ఈ కొవ్వుతూటాలమాట అబద్ధమన్నారు. గవర్నరుజనరలు కానింగు కూడా పత్రికల్లో ప్రకటించాడు. ఐతే, సిపాయిలే పొరపడ్డా రందామా? కాదు.

"తూటాలకి ఆవుకొవ్వు ఉపయోగించారనడంలో పిసరంతా సందేహంలేదు. ఆవుకొవ్వూ, పందికొవ్వూ రెండూపూశా"రని 1853 లోనే కల్నలు టక్కరు స్పష్టంగా రాశాడు. *

బారకుపురం తూటాలకార్ఖానాలో కంట్రాక్టరు తన కంట్రాక్టు పత్రంలో "రూపాయకి నాలుగుసేర్లు రేటుని ఆవుకొవ్వు సప్లయి చేస్తాను" అని రాసియిచ్చాడు.

"పారెస్టు ఇండియాప్రభుత్వం కాగితాలు పరిశీలించాడు. ఆ తూటాలకి ఉపయోగించిన జారుడు పదార్థంలో ఆవుకొవ్వూ, పందికొవ్వూ ఉపయోగించినమాట నిజమేఅని ఆకాగితాలవల్ల రుజువయింది."

సిపాయిలలో కలవరం పుట్టిన కొద్దిదినాల్లోనే ప్రభుత్వం ఒక ప్రకటనచేసింది.—"కొవ్వుతూటా ఒకటీకూడా పటాలాలకి పంపలేదు" అని. కాని అంబాలానించి ఇరవై రెండువేలతూటాలూ, సియాల్కోటనించి పదాన్నాలుగు వేల తూటాలూ పటాలాలకి సరఫరా చేశారు.

---

* Kaye's Indian Mutinv.

† Roberts.

కొత్తతూటాలు వాడాలంటూ ఆఫీసర్లు సిపాయీలని గద్దించడమూ ప్రారంభించారు. ఇదంతా ఎండినమందుగుండు మీద అగ్గినిప్పు పడ్డట్టయింది. అదే పెట్టిన గడువుకి ముందు విప్లవమారంభం కావడానికి కారణమయింది. ఈ కొవ్వుతూటాలే విప్లవానికి కారణమన్నారు కొందరు. కాని ఈ కొవ్వుతూటాలే విప్లవం విఫలం కావడాని కొక కారణమయా యన్నది మాత్రం పాక్షికంగా అయినా నిజం.

1857 ఫిబ్రవరి బారకుపురం పందొమ్మిదో పటాలం సిపాయిలని కొత్తతూటాలు వాడమన్నారు. అంతకి ముందే శపథం చేసుకున్నారు సిపాయిలు. అంచేత కొవ్వుతూటాలు ముట్టమని నిరాకరించారు. వాళ్ల తుపాకులూ అవీ లాక్కుని వాళ్లని ఇంటికి పంపించెయ్యాలని నిశ్చయించారు అధికార్లు. సిపాయిలు తిరగబడేటట్టు కనిపించారు. వంగదేశమంతటిలోనూ తెల్లపటాలం లేదప్పుడు. అందుకని బర్మా నించి తెల్లపటాలం తెప్పించారు. మార్చి మొదటివారంలో బర్మా నించి ఇంగ్లీషుఫౌజు కలకత్తాకి దిగింది. ఈవార్త బారకుపురం సిపాయిల్లో కలవరం రేపింది.

"నేలకింద ఎన్నోదినాలయి తయారవుతూవున్న మందుగుండుకి కొవ్వుతూటాలు వచ్చి అగ్గిపుల్ల అంటించేశాయి." *

వీరభారతంలో

ఇది

తొలిపర్వం

---

* J. G. Medley — A year's Campaigning in India from March 1857 to March 1858.

వీరభారతం

1857

భారతీయ స్వాతంత్ర్య సమరం

మలిపర్వం

"రండి! సోదరులారా, రండి!! ఆలోచనకి అవకాశం లేదు. మీ ధర్మంమీద వొట్టుపెడుతున్నాను. ఉరకండి! తెల్లదొరల్ని నరకండి!"

అవాళ ఆదివారం. మార్చి ఇరవైతొమ్మిదో తేది. ఉదయం బారకుపురం కవాతుమైదానంలో సిపాయి మంగలపాండే సింహగర్జన వినపడింది.

మంగలపాండే బ్రాహ్మడు. మంచి యవ్వనంలో వున్నజవాను. దృఢకాయుడు. అతడి స్వభావం మచ్చలేనిది. పటాలంలోని సిపాయిలు యావన్మందీ అతడంటే స్నేహంగా చూసేవాళ్ళు. దేశమన్నా, ధర్మమన్నా అతడు వొళ్ళుమరిచిపోయేవాడు. కొవ్వుతూటాల వ్యవహారమతడు సహించలేకపోయాడు. మే ముప్ఫయివొకటిదాకా ఆగడమంటే అతడికి అసంభవమనిపించింది. ఇప్పుడే తిరగబడదా మన్నాడతడు. పటాలంలోని విప్లవనాయకులు వోపికపట్టమన్నారు. ఇతర పటాలాలతో కలబోసుకుందికి వొక్కనెలయినా ఆగుదామన్నారు. ఆవిధంగా తక్కినపటాలాలకి జాబులున్నూ రాశారు. అయితే మంగల పాండే వుడుకురక్తం ఆగలేదు. అందుకని అమాంతంగా అతడు రంగానికి వురికేశాడు. ఒకచేత్తో తూటాలునింపిన తుపాకి. రెండోచేత్తో

ఖడ్గం. వీరావేశంతో కవాతుమైదానంలో సింహనాదంచేసి, తోడి సిపాయీలని ఆహ్వానించాడు మంగలపాండే.

మంగలపాండే సమరాహ్వానం బారకుపురంమైదానమంతా ప్రతిధ్వనించింది. ఇంగ్లీషుఆఫీసరు సార్జంటుమేజరు హ్యూసను పాండేవీరావేశం చూశాడు. "పట్టుకోండి పాండేని" అంటూ తక్కిన సిపాయీలకి హుకుంచేశాడు. కాని చిత్రం, పాండేని పట్టుకుందికి వొక్కడూ ముందుకిరాలేదు. ఇంతలో మంగలపాండే తన తుపాకి సార్జంటుమేజరు మీదికి గురిపెట్టాడు. తుపాకి ధ్వని మంది. సార్జంటు మేజరుహ్యూసను కారుమనిపోయాడు. ఇంతలో ఇంకో ఇంగ్లీషు ఆఫీసరు లెఫ్టినెంటుబాఫ్ గుర్రంమీద టకాటక పరిగెత్తుకువచ్చాడు. గుర్రం అల్లంతదూరంలో వుంది. మంగలపాండే తుపాకి గుభీమంది. గుర్రం కూలిపోయింది. బాఫ్ కింద పడిపోయాడు. మూడోగుండు తుపాకీలో నింపుతున్నాడు పాండే. బాఫ్ లేచి పిస్తోలు గురిపెట్టాడు. పిస్తోలు పేలింది. గురితప్పింది. పాండేకి దెబ్బ తగలలేదు. బాఫ్ మెరుపులా మెరిశాడు. కత్తితీశాడు. ఇంతలో మరోదొరా వచ్చి కలిశాడు. ఇటు వొక్కడే మంగలపాండే. అటు ఇద్దరు ఇంగ్లీషువాళ్ళు.

ఉత్తరక్షణంలో ఖడ్గంతీశాడు పాండే. సింహంలా వురికాడు. కత్తియుద్ధంలో అసమానుడు పాండే. బాఫ్‌దొరని నరికిపారేశాడు. ఇంతలో షేక్ పట్టా అని వొకసిపాయి పాండేచెయ్యి పట్టేశాడు. రెండో దొర పారిపోయాడు.

కొద్దిక్షణాల్లో కల్నలు వ్హీలరు వచ్చాడు. "పాండేని పట్టెయ్యండి" అంటూ ఆజ్ఞాపించాడు. "ఊహూఁ, వీల్లేదు" – నిరాకరించాయి సిపాయిలు. వ్హీలరుకి మతిపోయింది. ఫుంజాలు తెంపుకు పరిగెత్తాడు. జనరలు హేర్సేబంగళాలో దూరిపోయాడు.

మంగలపాండే గర్జిస్తూనే వున్నాడు – "రండీ, సోదరులారా, రండీ!–"

జనరలు హేర్సే జరిగిందంతా విన్నాడు. కొంతమంది తెల్లసిపాయిలని వెంటవేసుకున్నాడు. పాండేమీదికి వచ్చాడు. పాండే చూశాడు. బొందిలో ప్రాణముండగా శత్రువుచేతిలో చిక్కనన్నాడు. తుపాకి తనగుండెలమీద గురిపెట్టుకున్నాడు. ఇంగ్లీషుసిపాయిలు వచ్చేస్తున్నారు. పాండే తుపాకిమీట నొక్కాడు. తుపాకి పేలింది. గుండు గుండెలు గీసుకుపోయింది, పాండే కిందపడిపోయాడు. రక్తం మడుగులుకట్టింది. ప్రాణంపోలేదు. తెల్లసిపాయిలు మీదపడ్డారు. చావు బతుకుల్లోవున్న పాండేని చప్పున పట్టేశారు. ఆస్పత్రికి తీసుకుపోయారు.

కోర్టుమార్షలు జరిగింది. విచారణలో కుట్రదార్ల పేర్లు చెప్పమని ఎంతో వేధించారు. కాని పాండేదగ్గిర పిసరంత రహస్యం లాగలేక పోయారు. తాను చంపినఇంగ్లీషువాళ్లమీద వ్యక్తిద్వేషం లేదన్నాడు పాండే. నిజమే దేశంకోసం, ధర్మంకోసం కత్తికట్టాడు మంగలపాండే. వ్యక్తులతో అతడికి ద్వేషమేముంది!

మంగలపాండేకి వురిశిక్ష చెప్పారు. గుండుదెబ్బనించి పాండే ఇంకా కోలుకోలేదు. అయినా వురిఅంటే అతడు చలించలేదు. బానిసగా బతకడంకంటే వురికంబమే నయమన్నాడతడు. ఏప్రెలు ఎనిమిదిని పాండేని వురితియ్యాలన్నారు. ఐతే బారకుపుర మంతటా పాండేని వురితియ్యడానికి వొక్కతలారి దొరకలేదు. ఆ పవిత్రదేశభక్తుణ్ణి వురితియ్యమంటే ప్రతీవాడూ నిరాకరించాడు. విధిలేక కలకత్తానించి నలుగురు తలార్లని తీసుకువచ్చారు ఇంగ్లీషువాళ్ళు.

ఏప్రెలు ఎనిమిది వచ్చింది. ఎప్పటిలాగే ఆవేళా తెల్లవారింది. ఉదయమయింది. మంగలపాండేని వురికొయ్యదగ్గిరికి లాక్కువచ్చారు. దేశభక్తుల బలివేదిక వురికొయ్య. జంకూకొంకూ లేకండా వురితాటిలో శిరస్సునుదూర్చాడు మంగలపాండే. తలారికి ఇసారా అందింది – అయి

పోయింది. మంగలపాండే మృతశరీరం వురికొయ్యని వేలాడింది. మంగలపాండే భౌతిక దేహం నశించింది. అతడి కీర్తికాయం దేశ మంతటా ప్రజ్వలించింది. ప్రతీభారతీయుడిలోనూ అత డావేశించాడు. స్వాతంత్ర్యరణయజ్ఞంలో మొదటిఆహుతి మంగలపాండే. తొలి సహీదు మంగలపాండే.

మంగలపాండే మరణించాడా? లేదు. తెల్లదొరల నల్లగుండెల్లో నిద్రపోయాడు. 1857 స్వాతంత్ర్యయుద్ధంలో పాల్గొన్న ప్రతీసిపాయినీ ఇంగ్లీషువాళ్ళు "పాండే" అనే అనేవాళ్ళు.* ప్రతీ సిపాయిలోనూ వాళ్ళకి పాండే ప్రత్యక్షమయేవాడు!

మంగలపాండే వురితో ఈకథ ఆగిపోలేదు. అతడు ఇంగ్లీషువాళ్ళని చంపుతూవున్నప్పుడు నాలుగువందలమంది సిపాయిలు చూస్తూ నుంచు న్నారు. మరోఇరవై మందీ, వొక సుబేదారూ పహారాలో వున్నారు. వీళ్ళెవళ్ళూ పాండేని పట్టుకోలేదు. వీళ్ళంతా తిరుగుబాటు చెయ్యడా నికే కుట్రపన్నుతున్నారన్నారు అధికార్లు. పందొమ్మిదోపటాలమూ, ముప్ఫయినాలుగో పటాలమూ బర్తరుపుచేసేశారు. తెల్లపొజు చుట్టూ పెట్టి ఈసిపాయిల తుపాకులూ అవీ కిందపెట్టించారు. దుస్తులు వొలి పించారు. ఇళ్ళకి పొమ్మన్నారు. అంతవరకూ ఇలాంటిశిక్ష నేటివు సిపాయిలకి తలకొట్టేసినట్టుండేది. అవమానంతో కుంగిపోయేవాళ్ళు. అందుకని, మంచిశిక్షే చేశామంటూ తలపంకించారు ఆఫీసర్లు. కాని అదే తమకి మహాగౌరవమని భావించారు సిపాయిలు. ఆదినాళ్లో సిపా యిలు తమటోపీలు సొంతడబ్బుతో కొనుక్కునేవాళ్ళు. అంచేత దుస్తు లతోపాటు ఈటోపీలు తీసుకోలేదు ఆఫీసర్లు. అయితే ఆభానిసచిహ్నం

* "The name has become a recognised distinction for the rebellious Sepoys throughout India." – Charles Ball.

అక్కడపెట్టుకోలేదు సిపాయిలు. చించేసి, గాలిలోకి వందలు వందలు విసిరిపారేశారు. నదిలోమునిగి తలకడుక్కున్నారు.

ముప్పయినాలుగోపటాలం సుబేదారుని అధికార్లు కోర్టుమార్షలు చేశారు. రహస్యంగా కుట్రపన్నాడని నేరంమోపారు. ఉరితీసేశారు.

ఇళ్ళకి పంపేసిన సిపాయిలు చాలామంది అయోధ్యరాజ్యంవాళ్ళు. నఖీఖాను రహస్యప్రబోధం బాగాతలకెక్కినవాళ్లు. వీళ్ళంతా తమ గ్రామాలకి వచ్చేశారు. ప్రజల్లో విప్లవాగ్ని రగులుకొలిపారు.

అగ్గి! అగ్గి!!

మంగలపాండేని పట్టుకున్నరాత్రి బారకుపురం కెలిగ్రాఫుఆఫీసు నిప్పంటుకుంది. పెద్దపెద్దమంటలు భయంకరంగా లేచాయి. కొద్దిసేపట్లో అంతా మసయిపూరుకుంది. మర్నాడురాత్రి వొక ఇంగ్లీషుసేనాధిపతి బంగళా ముట్టుకుంది. పెద్దపెద్దమంటలు భయంకరంగా లేచాయి. కొద్దిసేపట్లో అంతా మసయి పూరుకుంది.

మరి రెండుమూడునెలలయాక, మరో ఇంగ్లీషుసేనాధిపతికొంప అంటుకుంది. మసయి పూరుకుంది. ఇలా వొకదానితరవాత వొకటి హఠాత్తుగా అద్దరాత్రి పరశురామప్రీతిఅయిపోతూ వచ్చాయి.

బారకుపురంలో ఇంగ్లీషుసేనాధిపతుల బంగళాలు అధికంగా వుండేవి. ఇవన్నీ పురికొంపలు. ఈపురికొంపలు ఎండాకాలం చల్లగా వుండేవి. చలికాలం వెచ్చగావుండేవి. అంచేత ఇంగ్లీషువాళ్లు ఈపురి కొంపలే ఇష్టపడేవాళ్లు. ఈపురికొంపలు తగలబెట్టాలంటే కిరసనాయిలూ, పెట్రోలూ అవసరమయేదికాదు. అప్పుడు మనదేశంలో కిరసనాయిలూ, పెట్రోలూ వాడుకలోకూడా లేవు.

బారకుపురంలోలాగే రాణీగంజిలో ఇంగ్లీషుసేనాపతుల బంగళాలుండేవి. అక్కడా ఇలాగే రాత్రిళ్లు నిప్పంటుకుండేది. అందంగా

అమిర్చి పెట్టిన దొరలబంగళాలు నిమిషాలమీద కాలి బుగ్గయి పోయేవి.

బాహరంపురంలోనూ వొకపటాలముండేది. కాని ఇంగ్లీషు సేనాపతుల బంగళా లక్కడలేవు. అంచేత అగ్నిహోత్రుడక్కడ అడుగు పెట్టలేదు. అయితేనేం అక్కడి సిపాయిల ఆయుధాలు లాక్కుందికని కళ్ళలు మిచెలు అక్కడినించి వందమైళ్ళు నడిపించి వాళ్ళని బారకుపురం పట్టుకువచ్చాడు.

క్రమంగా ఈ పరశురామప్రీతి ఇతరచోట్లకీ పాకింది. అంబాలాలో ఏప్రెలు నెలంతా ఇది సాగుతూనేవుంది. రోజూ రాత్రి ఏదోవొక దొర బంగళా కాలిపోతూనే వుండేది. సామాను గోదాంలూ, ఆస్పత్రులూ, డేరాలూ తగలబడిపోయేవి. తెల్లవాడన్న ప్రతీవాడికీ రాత్రిళ్ళు ఈ అగ్నిప్రళయం నిద్రలేకండా చేసేది. వాళ్లెంతో ప్రయత్నించారు. వెయ్యికళ్లతో కనిపెట్టారు. తుపాకులు కాపలా వేశారు. కాని అగ్ని ఎలాపుట్టుకువస్తోందో, ఎవరు ముట్టిస్తున్నారో అంతుచిక్కలేదు. ఉన్నట్టుండి హఠాత్తుగా నిప్పు గుప్పుమనేది. పిట్టమనిషి కనపడేవాడు కాడు. లక్నో, మీరటూ మొదలయినచోట్ల కూడా ఈ ప్రళయం ముంచుకువచ్చింది. దొరలబంగళాలు తగలబడిపోతూ వుండేవి. నిప్పురాటించే వాళ్లని పట్టుకోడం అసాధ్యమైపోయింది. పట్టియిచ్చిన వాళ్లకి వేలువేలు బహుమతులిస్తామన్నారు. ఫలితంమాత్రం శూన్యమయింది. అంబాలానించి కమాండరిన్ చీఫు ఆస్సను గవర్నరు జనరలుకి రాశాడు — "నిప్పంటించేవాళ్ల అంతుచిక్కలేదు. నిజంగా ఇది ఆశ్చర్యమయిన విషయం! అందరమూ వెయ్యికళ్లతో చూస్తున్నాం. కాని రహస్యం కానలేకపోతున్నాం."

దీనినిబట్టి ఈ దొరబంగళాల లంకాదహనం ఎంతరహస్యంగా, ఎంత చిత్రంగా సాగిందీ ఊహించవచ్చు. నానాసాహెబు తీర్థయాత్రకిముండే

ఈ అగ్ని ప్రళయ మారంభించారు సిపాయిలు. అగ్గి ముట్టించడంలో చిత్రమైన పద్ధతి అవలంబించారు వాళ్ళు. దగ్గిరికివెళ్లి ముట్టిస్తే దొరికిపోవచ్చు. అంచేత దూరంగా వుండే ఈ పనిచేసేవాళ్ళు. దూరంగా చీకటి మాటున ఎొక వ్యక్తి విల్లూ, అమ్ములూ పట్టుకుని పొంచివుండేవాడు. బాణం కొసకి నూనెలో ముంచిన గుడ్డపీలిక చుట్టిపెట్టే వాడు. నిప్పం టించి బాణం ఎొదిలిపెట్టేవాడు. రివ్వునవచ్చి, బంగళామీద పడేది బాణం. ఫురికప్పు గుప్పుమని అంటుకునేది. బాణంకొట్టిన మనిషి మాయమైపోయేవాడు. అతణ్ణి పట్టుకుందికి కాపలా కాస్తూవున్న పోలీసులూ ఈ విప్లవసంఘంవాళ్లే అయివుండేవాళ్ళు. అంచేతనే ఈ రహస్యం అంతుచిక్కేది కాదు. చివరికి అగ్నిహోత్రుడు కూడా ఈ రహస్యసంఘంలో కలిసిపోయాడా అనిపించేది.

"మారో ఫరంగీకో"

మే మాసం వచ్చేసింది. ముప్ఫయివొకటి ఆదివారం ఎంతట వస్తుందా అని చూస్తోంది దేశం. ప్రజలూ, సిపాయిలూ, హిందువులూ, మహమ్మదీయులూ గుబగుబలాడిపోతున్నారు. రాత్రిళ్ళు రహస్యసమావేశాలు జరుగుతున్నాయి. ఆవేశకరమయిన ప్రసంగాలు జరుగుతున్నాయి. దొరలబంగళాలు తగలబడుతున్న మంటలు మరింత వేడి కలిగిస్తున్నాయి. పందెపుగుర్రాల్లాగ ఆగలేకపోతున్నారు సిపాయిలు. అబ్బ, ముప్ఫయివొకటి ఆదివారం – ఎంతదూరం!

మే మూడోతేదీని లక్నో ఏడోపటాలంలో ఆగలేని ఏడుగురు సిపాయిలు లెఫ్టినెంటు మీకం గుడారంలో చొరబడ్డారు. "ఇదిగో, వ్యక్తిగతంగా మీమీద మాకేమీ కావేషీలేదు. కాని ఫరంగీ రావడంచేత మీరు చచ్చితీరాలి" అంటూ కలబడ్డారు. లెఫ్టినెంటు

అడలె త్తిపోయాడు. ప్రాణభిక్ష వేడుతూ బతిమాలాడు. "చంపెయ్యాలంటే లిస్టులో చంపెయ్యవచ్చు నన్ను. అంతమాత్రాన మీకేమిటి లాభం? నాస్థానే మరొకడు వస్తాడు. తప్పేమో ప్రభుత్వంపద్ధతిలో వుంది. నన్ను వొదిలిపెట్టండి" అంటూ కాళ్లావేళ్లాపడ్డాడు. మొత్త బడిపోయారు సిపాయిలు. మీకందొరని వొదిలేశారు. ఈవార్త అధికార్ల చెవిలోపడింది. ఆసిపాయిలున్న రెజిమెంటు నంతటినీ ఆయుధాలు లాక్కుని తగిలేశారు.

మే ఆరో తేదీని మరోసంఘటన జరిగింది. మీరటులో తెల్లసిపాయిలూ, నల్లసిపాయిలూ భారీగా వుండేవాళ్ళు. ఫిరంగిదళమూ, గుర్రపుసేనా, పదాతిదళమూ వుండేవి. కొత్తరకం తూటాలకార్ట్రాను కూడావుండేది. రెండుమైళ్లపొడవునా సిపాయిల వసతిగృహాలుండేవి. మనచరిత్రనాటికి 1,853 రు తెల్లసిపాయిలూ, 2,922 రు నల్లసిపాయిలూవుండేవాళ్ళు. ఆఫ్గనిస్థానం యుద్ధంనించి తిరిగివచ్చిన రెండో గుర్రపుదళము ఇక్కడేవుండేది. ఇందులో చాలామంది వొకటోరకం సిపాయిలుండేవాళ్ళు.

కొత్తరకం తూటాలు ఇక్కడి గుర్రపుకాతుల కిచ్చి, పరీక్షించాలని బుద్ధిపుట్టింది అధికార్లకి. ఈపని సిపాయిలని రెచ్చగొడుతుందంటూ అడ్డుచెప్పాడు హవల్దారు హీరాసింగు. కాని లాభం లేకపోయింది. అవాళసాయంకాలం కల్నలు స్మయిత్ కవాతుమైదానంలో గుర్రపుదళం సమావేశపరిచాడు. ఈదళంలో తొంభయిమంది కాతులున్నారు. వాళ్ళందరినీ కొవ్వుతూటాలు ఉపయోగించమన్నాడు కల్నలు. తొంభయిమందిలో హవల్దారు హీరాసింగుతో కలిపి అయిదుగురుతప్ప మిగిలిన ఎనభై అయిదుగురూ, తూటాలు ఉపయోగించడమంటుంచి, ముట్టడానికే వొప్పుకోలేదు. కల్నలునూటా వినకండా బస్తలికి వెళ్ళిపోయాడు.

ఈవార్త జనరలు హ్యూయేటుకి తెలిసింది. ఎన్‌థైె అయిదుగురినీ కోర్టుమార్షలు జరిపా డతడు. ఎనిమిదినించి పదేళ్ళదాకా కఠిన నరకం విధించాడు.

మే తొమ్మిదిని ఎన్‌థైె అయిదుగురినీ మైదానంలో నిలబెట్టారు. చుట్టూ తెల్లసిపాయిలు గార్డువేశారు. ఎదురుగుండా ఫిరంగులు గురి పెట్టారు. పటాలంలోని తక్కిన సిపాయిలందరినీ ఈదృశ్యం చూచిం దికి పిలిపించారు. "మాఆజ్ఞ ఉల్లంఘిస్తే మీకూ ఇదేగతిపడుతుంద"ని చూపడమేమో అది!

వాళ్ళకి విధించిన శిక్ష అందరికీ వినిపించారు. ఎన్‌థైె అయిదుగుర దుస్తులూ వొలిపించారు. వాళ్ళచేతులికీ కాళ్ళకీ నిలువుబేడీలూ, అడ్డ బేడీలూ తగిలించారు. ఈడ్చుకుంటూ జైలులోకి లాక్కుపోయారు.

"వాళ్ళ తప్పు ఎంతటిదయితే ఏంగాక, మీరటులో ఇంగ్లీషువాళ్లు చేసినపని చెప్పరానంత చెడ్డది. దీనివల్ల సిపాయిలకి భయంకలగలేదు, బాధేకలిగింది. వాళ్ళ ఉద్రేకం మరింత అధికమయింది." *

ఇదంతా అవాళ ఉదయం జరిగింది. సాయంకాలం కొందరు సిపా యిలు మీరటు పట్నంలోకి వెళ్లారు. బజారులో వాళ్ళని చూసి పట్నంస్త్రీలు ధిక్కారంచేశారు – "మీసోదరులు ఖైదులో మగ్గుతూ వుంటే మీరిక్కడ షికార్లు కొడుతున్నారు! మీమగతనం ఏడిసినట్లే వుంది! ఛీ!"

మీరటుస్త్రీల ఈఎత్తిపొడుపులు వూరికేపోలేదు. 1857 స్వాతంత్ర్య సమరం చరిత్రనే అవి తారుమారు చేసేశాయి. "నిజానికి మీరటు స్త్రీలు నిశ్చితసమయానికిముందే సిపాయిలని రెచ్చగొట్టి, ఇంగ్లీషు రాజ్యం ఇండియాలో వూడిపోకండావుండిందికి కారకులయారు." †

---

* Forest.

† J. C. Wilson.

అవాళరాత్రి సిపాయిల అవసరసమావేశం జరిగింది - ఇంకో ఇరవై రోజులపాటు ముప్పయివొకటివరకూ చేతులుకట్టుకు కూచోడమా? అంతవరకూ తోడిసోదరులు జైల్లో పగ్గవలసిందేనా? వీధినిపోయే ఆడాళ్ళున్నా హీనంగా ఈసడిస్తున్నారు! ఇంతకంటే చావో రేవో ఇప్పుడే తేల్చుకోడం నయంకాదూ? — తీవ్రమయిన చర్చలు జరిగాయి. మర్నాడే విప్లవం నిశ్చయమయింది.

మర్నాడే విప్లవం — కొలిగ్రాఫుతీగెలు పీకెయ్యడం. ట్రైలు మార్గాలు నిరోధించడం. జైలుగోడలు పడగొట్టడం. ఖైదీలని విడిపించడం. ఇంగ్లీషువాళ్ళ బంగళాలూ ఆఫీసులూ కాల్చెయ్యడం. గుడిలో ఇంగ్లీషువాళ్ళని చంపెయ్యడం. కనపడ్డ తెల్లవాణ్ణల్లా కాల్చెయ్యడం. ఇదంతాఅయాక, ఢిల్లీ వెళ్ళిపోయి నాయకుల్ని కలుసుకోడం — ఇదీ నిశ్చయమైన కార్యక్రమం.

రాత్రికిరాత్రి ఢిల్లీనాయకులదగ్గరికి బేగీరావుల్ని పరిగెత్తించారు. "మేము పదకుండునో, పన్నెండునో వచ్చేస్తున్నాం. మీరు సిద్ధంగా వుండండి" అంటూ కబురుపంపారు. ఇదంతా అతిరహస్యంగా జరిగింది. ఇంగ్లీషువాళ్ళకి సిసరంతా కబురందలేదు.

మే పది. ఆదివారం. మీరట్టుపట్టానికి మహాపురాని ఆదివారమది. తెల్లవారింది. దొరల ఇంటినౌకర్లు కొందరు చెప్పకుండా చెయ్యకుండా పనులుమానేశారు. వీధుల్లో జనం గుంపులు గుంపులు కూడుతున్నారు. పల్లెటూళ్ళనించీ జనం జట్లుజట్లు వస్తున్నారు. ప్రతీ వాళ్ళచేతిలోనూ ఏదోవొక ఆయుధం అవుపిస్తూనేవుంది. నేటివు సిపాయిలు కత్తులూ, కటార్లూ నూరుతున్నారు. ఆదివారం దొరలకి విశ్రాంతి. వేడుక. గుళ్ళకి మామ్మూలుగా బయలుదేరారు. గుడి గంటలుమ్రోగుతున్నాయి. బగ్గీలూఆఫీసు నడుస్తున్నాయి. చిన్నాపెద్దా, ఆడామగా ముస్తాబుల్తె వెళుతున్నారు. ఆఖరిగుడిగంటలు గణగణా

గాలిలో వినిపిస్తున్నాయి. పటాలంలో ఒక్కసారి హాహాకారాలు – "మాకో ఫరంగీకో!" "మారో ఫరంగీకో!!"

కొంతమంది గుర్రపుదొంతులు జైలుతట్టు పరిగెత్తారు. వాళ్ళున్నూ అవే కేకలు – "మారో ఫరంగీకో!" జైలుదగ్గిర జైలరున్నూ అరిచాడు – "మారో, మారోఫరంగీకో!" ఇంతమంది కలిసి జైలు గోడలు పడగొట్టారు. ఖైదీలుగావున్న తమ సోదరుల సంకెళ్ళు విడగొట్టారు. ఒకళ్ళనొకళ్లు కౌగిలించుకున్నారు. కూలిపోయిన జైలు ఆవరణ యావత్తూ భూమీ ఆకాశం పగిలేట్టు ఒక్కటే కేకలు-"మారో ఫరంగీకో!" హిందువులూ మహమ్మదీయులూ అందరూ ఒకటే నినాదం – "మారో, మారో ఫరంగీకో!"

జైలునించి ఇంతమందీ గుడితట్టు పరిగెత్తారు. గుడిలో ఇంగ్లీషు వాళ్ళు ఒక్కడగ్గిర దొరుకుతారు. చిత్రవధకి సులువయిన మార్గమది. ఇంతలో తక్కిన గుర్రపుదొంతులూ, కాల్బలమూ, ఫిరంగిదళమూ – యావన్మంది బయల్దేరి పోయారు. పదకుండోపటాలం కల్నలు ఫిన్నిసు గుర్రమ్మీద పరిగెత్తుకువచ్చాడు. సామాన్యులు ప్రకారం బెదిరించడం ప్రారంభించాడు. అతడి నోట్లోమాట నోట్లోనే వుంది. ఇరవయ్యోపటాలం సిపాయి తుపాకి గురిపెట్టాడు. దెబ్బతో గుర్రమూ ఫిన్నిసూ కూలిపోయారు. విలవిలా తన్నుకు ప్రాణాలు వొదిలేశారు.

ప్రాణాలమీద ఈవార్త పట్టణంలో గుప్పుమంది. మీరటు ప్రజలు హిందువులూ, మహమ్మదీయులూ వచ్చి సిపాయీలతో ఏకమయారు. కర్రలూ, కత్తులూ – చేతికి ఏదిదొరికితే అది లంకించుకున్నారు. కనపడ్డ ఇంగ్లీషువాణ్ణల్లా హతవార్చడ మారంభించారు. ఎక్కడ విన్నా "మారో ఫరంగీకో!" అన్న కేకలే. "దీన్ దీన్" శబ్దాలే. "హరిహర మహాదేవ" నినాదాలే.

విప్లవమారంభించడమే తడువు సిపాయిలు కులిగ్రాహ్యతిగెలు తుంచేశారు. రైలుమార్గం కాపలాకాసేశాము. దాంతో నార్లలు పైకివెళ్లడం కాని, ఇంగ్లీషువాళ్ళు పారిపోడానికికాని వీలుచిక్కలేదు. ఇంగ్లీషువాళ్ళ ఇళ్లూబంగళాలూ, కార్యాలయాలూ, హుంటుళ్లూనగలబెట్టేశారు. ఆసుంటుల్లోనూ, పొగల్లోనూ వొక్కటే కేకలూ-"మారో, మారో స్వరంగీకో!"

ఆరాత్రి మీరటు ఇంగ్లీషువాళ్ళకి కాళరాత్రి. ఎంతోమంది ఇంగ్లీషువాళ్ళు చిత్రవధ అయిపోయారు. ఎంతోమంది గుర్రపుసాలల్లో తలదాచుకున్నారు. ఎంతోమంది మేడమ్ముల్లో దూరారు. కొంతమంది వ్యవసాయదార్లలా వేషాలువేసుకు పారిపోయారు. కొంతమంది తమ బట్టర్ల కాళ్ళబూద పడ్డారు.

చెయ్యవలసిందంతా చేసి సిపాయిలు ఢిల్లీ మార్గం పట్టారు. మిగిలిన పని పట్నంప్రజలు పూర్తిచేశారు. తగలబెట్టడానికి వీలులేని దొరల కొంపలు పడగొట్టారు. కమీషనరు బంగళాముట్టడించారు. కమీషనరు బట్లరుకాళ్ళబూద పడ్డాడు. సూపువేషంతో తప్పించుకుపోయాడు. ఛాంబర్సు దొరసానిని ప్రజలు బైటికి ఈడ్చుకు వచ్చేశారు. కత్తులు పొడిచి చంపేశారు. డాక్టరు క్రిష్టీనీ, వెటర్నరీ సర్జను ఫిలిప్సునీ కర్రలతో బాది చంపేశారు. కెప్టెను కెయిలుసీ, కెప్టెను మాక్డొనాల్డునీ, లెఫ్టినెంటు హాండర్సనునీ వెంటదరిమి చంపేశారు. కెప్టెను క్రెయిజీ సకుటుంబంగా మారువేషంలో రాత్రంతా వొక పాడుగుడిసెలో తల దాచుకున్నాడు. ఎంతోమందిదొరసానులూ, దొరపిల్లలూ బంగాళాల్లో కాలిపోయి చచ్చిపోయారు. ఇంగ్లీషువాళ్ళ శవాలతోనూ రక్తంతోనూ మీరటువీధులు భయంకరంగా తయారయ్యాయి. ఇంగ్లీషు శవాలు ప్రజలు తన్నుకుంటూ పోయారు.

మీరటులో అప్పుడు ఆఫీసర్లూ వాళ్ళూ కలిసి జనరలు హెలీటు కింద రెండువేలు పైచిలుకు తెల్లఫౌజు వుంది. ప్రయత్నించివుంటే

ఏమాత్రమయినా ఈ విప్లవం ఎదిరించేవాళ్ళు వాళ్ళు. కాని హఠాత్తుగా వచ్చిన ఈ ప్రళయం వాళ్ళని భయభ్రాంతుల్ని చేసింది. విప్లవం అనగానే నేటివు గుర్రపుదళం కళ్ళాలు స్మిత్తు పలాయనం చిత్తగించాడు.

మీరటునించి ఢిల్లీ సుమారు ముప్ఫయి రెండుమైళ్ళు. మే పదకుండు ఉదయానికి మీరటు గుర్రపుదళం ఢిల్లీపట్నం చేరుకుంది.

ఆకుపచ్చ జెండా

మే పదకుండున కనకనలాడుతూ వున్న సూర్యకిరణాల్లో ఢిల్లీ ఎర్రకోటమీద ఇంగ్లీషు జెండా దిగిపోయింది. బహదూరుషా ఆకుపచ్చ జెండా బంగారం నెలవంకతో మిలమిలలాడింది. 1857 స్వాతంత్ర్యసమరంలో ఈ ఆకుపచ్చపతాకమే జాతీయపతాకం. కోటానుకోట్లు భారతీయులు-హిందూవులూ, మహమ్మదీయులూ ఈ జెండాకింద ఒక్కటై నుంచున్నారు. ధర్మంకోసం, దేశంకోసం ప్రాణాలర్పించారు. ఉరికంబాలెక్కారు. ఫిరంగుల ముందు శిరస్సులు ఒడ్డారు. అవాళ ఉదయం ఎనిమిదిగంటలయింది. మీరటు గుర్రపుదళం ఢిల్లీలో యమునవొడ్డున ప్రత్యక్షమయింది. యమున మీద పడవలవంతెన దాటింది. పట్నం గోడల దగ్గిరికి వచ్చేసింది. ఢిల్లీ విప్లవ సంఘానికి ఇది ముందే తెలుసు. ఇంగ్లీషువాళ్ళకిమాత్రం అంతవరకూ ఏమీ తెలియదు. మీరటుగుర్రపు దాతులు యమునదాటి వచ్చేశారని పట్నంలో గుప్పుమంది.

అప్పుడు ఢిల్లీలో ఇంగ్లీషుఫౌజు లేదు. ముప్ఫయిఎనిమిదీ, యాభై నాలుగూ, డబ్బయినాలుగూ నేటివు పటాలాలుమాత్ర మున్నాయి. మొత్తం మూడువేల అయిదువందలమంది సిపాయిలూ, వందా అరవైమంది ఫిరంగులవాళ్ళూ వున్నారు. వీళ్ళమీద అధికార్లు యాభై ఇద్దరు ఇంగ్లీషువాళ్ళున్నారు. ముప్ఫయి ఎనిమిదో పటాలం సిపాయిలు ఎర్రకోట కాపాడుతూ వుండేవాళ్ళు.

మీరటు కాతులు, పట్నంలోకి వచ్చేస్తున్నారని వినడంతోనే కల్నలు రిప్లే తన యాభై నాలుగో నేటివు పటాలం కవాతుమైదానంలో సమావేశపరిచాడు. మీరటు సిపాయిల నెదిరించడానికి బయలుదేరమన్నాడు.

"అసలు వాళ్ళని మాకు చూపించండి, ఏంచేస్తామో చూద్దురు కాని" అన్నారు ఢిల్లీసిపాయిలు. "సెబాష్, అది గదీమాట" అంటూ పటాలం నడిపించుకువచ్చాడు కల్నలు రిప్లే.

ఢిల్లీసిపాయిలని చూశారు మీరటు కాతులు. "ఇంగ్లీషురాజ్యం నశించాలి" అంటూ వొక్కసారి అరిచారు. ఢిల్లీ యాభై నాలుగో పటాలం దానికి జవాబు చెప్పింది – "ఇంగ్లీషురాజ్యం నశించాలి." మీరటు సిపాయిలు అరిచారు – "బహదూరుషా జిందాబాద్!" ఢిల్లీ సిపాయిలు జవాబుచెప్పారు – "బహదూరుషా జిందాబాద్!"

కల్నలు రిప్లే కంగారుపడిపోయాడు. గావుకేకలు వేశాడు. ఉత్తర క్షణంలో తుపాకులు పేలాయి. రిప్లే శవం రక్తసిక్తమై కింద పొర్లాడింది. ఢిల్లీసేనా, మీరటుసేనా వొకదానొకటి కౌగిలించుకొన్నాయి. ఒక్కటైపోయాయి. జయ జయ ధ్వనులు చేస్తూ పట్నంలో ప్రవేశించాయి.

ఆ దినాల్లో పాతఢిల్లీ పట్నంచుట్టూ ఎర్రరాతి ప్రాకారముండేది. యమున దిక్కువున్న ఎర్రకోట తట్టుతప్ప పట్నంచుట్టూ ఎనిమిది దర్వాజాలుండేవి.

కాశ్మీరు దర్వాజాలో నగరరక్షకులూ, పటాలం సిపాయిలూ కాపలావుండేవాళ్లు. మీరటు గుర్రపుకాతులు కాశ్మీరు దర్వాజాలోంచే పట్నంలో ప్రవేశించారు. కోటదగ్గిరికివచ్చి జయ జయ ధ్వనులు చేశారు. "మీరటులో ఇంగ్లీషువాళ్లని చంపేశాం. 'జిహాద్' కోసం ఢిల్లీవచ్చాం" అంటూ కేకలువేశారు. కోటకాపలాసేన కెట్టెను

డగ్లసు కిందకివెళ్లి విప్లవకారుల్ని బోధపరిచి తగిలేస్తా నన్నాడు. బహా దూరుపా వొప్పుకోలేదు. డగ్లసు ముథమ్మను బురుజు కిటికీలో నుంచుని విప్లవకారుల్ని చూశాడు. "మీ తిరుగుబాటు పాదుషాకి ఇష్టంలేదు. వెళ్లిపోండి" అంటూ అరిచాడు. కానీ వినేవాళ్లెవరు?

ఎర్రకోట కాపాడుతూ వున్న ముప్ఫయి ఎనిమిదో పటాలం సిపాయిలు విప్లవకారుల్ని జలదర్వాజాలోంచి కోటలోపలికి వొదిలేశారు. మరికొంత మీరటు సైన్యం "దీన్ దీన్" మంటూ కలకత్తా దర్వాజాలోంచి చొరబడింది. కెప్టెను డగ్లసు కొంతమంది ఆఫీసర్లతో విప్లవకార్ల నెదిరించడానికి కలకత్తా దర్వాజాతట్టు బైలుదేరాడు. అప్పటికే జలదర్వాజాలోంచి విప్లవకారులు లోపలప్రవేశించారు. దాంతో అతడు లాహోరుదర్వాజా తట్టు మళ్లవలిసి వచ్చింది. కోటకాపలా ముప్ఫయిఎనిమిదో పటాలం సిపాయిలు విప్లవకారులమీద తుపాకులు కాల్చడానికి అంగీకరించలేదు. వాళ్లని చెడా మడా తిట్టేసి శత్రీకమీషనరు సయిమను ఛేజరు కెప్టెను డగ్లసు మేడమీదికి వెళ్లిపోబోయారు. తొలిమెట్టుమీద కాలుపెట్టాడోలేదో కారలికుబేగూ, ముగలుబేగూ అని ఇద్దరు అతణ్ణి నరికిపారేశారు.* డగ్లసు అరిచేతిలో ప్రాణంపెట్టుకు పరిగెత్తాడు. కోటఅగడ్తలో పడిపోయాడు. కాలుగుత్తమీద గట్టిదెబ్బ తగిలింది. స్మృతి తప్పిపోయింది. ఎవరో బంట్రోతు లతణ్ణి బైటికి తీశారు. తన మేడగదిలో చేర్చారు. తెలివి రాగానే గదితలుపులూ, కిటికీలూ మూసెయ్యమన్నాడతడు. అతడిగదిలో అప్పుడు ఫాదిరీ జేనింగ్సూ, అతడి స్నేహితుడూ, ఇద్దరు దొరసానులూవున్నారు. ఇద్దరు అమ్మాయిలు మిస్ జేనింగ్సూ, మిస్ క్లిఫర్డూ అంతకిముందే రక్షణకోసం బేగం మహాలుకి వెళ్లిపోయారు.

---

* ఛేజరుని నరికినవాడు హాజీ అని వొకరత్నాలవర్తకుడంటూ ముక్కు రాశారు. — **देहली का क़िला।**

విప్లవకారులు డగ్లసుగదితలుపులు పగలగొట్టారు. లోపల వొక్కరినీ బతకనివ్వలేదు. నరికిపారేశారు. ఎర్రకోట విప్లవకారుల్తో నిండిపోయింది. రాత్రంతా నడిచివచ్చినసిపాయిలు దివానీఖాసులో మకాం వేశారు.

కలకత్తాదర్వాజాలోంచి చొరబడ్డ సిపాయిలు దరియాగంజితట్టు నడిచారు. దరియాగంజిలో ఇంగ్లీషుదొరల బంగళా లున్నాయి. అప్పటికే అవన్నీ భగభగా మండుతున్నాయి. మంటలు తప్పించుకు పారిపోతున్న ఇంగ్లీషువాళ్ళు విప్లవకారుల కన్నులకి ఎరయిపోయారు. దగ్గిరేవున్న ఆస్పత్రిలో కొందరు తలదాచుకున్నారు. దానినికూడా విప్లవకారులు ముట్టడించారు. అగ్గిపెట్టేశారు. దొరలకోసం ఇల్లిల్లూ వేటాడారు. కనపడ్డదొరనల్లా నరికేశారు. కాల్చేశారు.

విప్లవకారులు పట్నంప్రవేశించగానే ఢిల్లీప్రజలు హృదయపూర్వకమైన స్వాగతమిచ్చారు. చల్లనిపానీయాలూ, పళ్ళరసమూ తాగించారు. వేలకొద్దీజనం వాళ్ళతోకలిశారు. చేతికందిన ఆయుధం పుచ్చుకు బయలుదేరారు. మట్టమధ్యాహ్నమయేసరికి దరియాగంజి దొరలందరినీ చంపేశారు. ఢిల్లీబ్యాంకు స్వాధీనపరుచుకున్నారు. బ్యాంకుమేనేజరు బెర్నుహోర్డ్ముని సకుటుంబంగా చంపేశారు. అక్కడినించి ఢిల్లీగెజటు కార్యాలయంమీద పడ్డారు. అప్పుడే మీరటు వార్తలు అచ్చొత్తడానికి సిద్ధపడుతున్నారు పనివాళ్లు. విప్లవకారుల నినాదాలు విని తుళ్ళిపడ్డారు. క్షణంలో అచ్చాఫీసు విప్లవకారులు చిందరవందర చేసేశారు. అక్కడినించి క్రైస్తవగుడిమీద పడ్డారు.

కోటలో బహదూరుషా, జిన్నతుమహలూ విప్లవనాయకులతో అవసరసమావేశం జరిపారు. ఇప్పుడు ఏం చెయ్యాలి? ముప్ఫయివొకటి దాకా ఇంకా ఆగవలిసిందేనా? మీరటుసిపాయిలూ, ఢిల్లీప్రజలూ ఎర్రకోట బద్దలైనట్టు "పాదుషా బహదూరుషాకీ జయ్" అంటూ

అరుస్తున్నారు. ఇంతలో మీరటు ఫిరంగిదళమూ ఢిల్లీ వచ్చేసింది. కోటలో ప్రవేశించడంతోనే పాదుషాగౌరవార్థం ఇరవై ఒక్క ఫిరంగులు పేల్చింది. ఢిల్లీపట్నం మారుమోగిపోయింది. దాంతో బహదూరుషా కర్తవ్యమూ నిశ్చయమయిపోయింది. ఇంతయాక ముప్ఫయివొకటి దాకా ఆగడం అవివేకం!

సిపాయిలనాయకులు ఇద్దరును బేడాస్లు ముందుకివచ్చారు. రక్తం కత్తులు పాదుషా పాదాలముందు పెట్టారు. మీరటువిజయం విన్న వించారు. ఢిల్లీస్వాధీనమయిన ఉదంతం వర్ణించారు. దేశంలోని సిపాయిలు యావన్మంది పాదుషాఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఈస్వాతంత్ర్యసమరానికి నాయకత్వం వహించి నడిపించమన్నారు. బహదూరుషా పాదాలముందు తిరిగీ భారతసామ్రాజ్యం వొరిగినట్లయింది. అసలు నానాసాహెబు మొదలయిననాయకులు బహదూరుషా నాయకత్వంకిందే విప్లవం సాగించడానికి లోగడ ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు. స్వయంగావచ్చి బహదూరుషాతో మాట్లాడిన్ని వెళ్ళారు. అందుకని నాయకత్వంవహించడానికి బహదూరుషా వెనకాడలేదు. అంగీకరిస్తూనే అతడన్నాడు — "బావుంది, కాని నాఖజానాలో ధనం లేదు. మీయావన్మందికీ జీతా లెలా ఇచ్చేది?"

"దేశమంతటా మేం ఇంగ్లీషువాళ్ళధనం దోచుకువస్తాం. మీ పాదాలముందు కుప్పపోస్తాం" అన్నారు సిపాయిలు.* హర్షధ్వనులు మిన్నుముట్టాయి. ఎర్రకోటమీద బ్రిటిషుపతాకం చించిపారేశారు. ఆకుపచ్చజెండా ప్రతిష్ఠించారు.

యూరోపియనాలుగోపటాలం విప్లవకారులతో చేరిపోయాక, మేజరు పీటర్సను ఫిరంగులు తీసుకుని కాశ్మీరుదర్వాజాకి వచ్చాడు. అప్పటికే

* C. T. Metcalfe — Two Native Narratives of the Mutiny in Delhi.

మీరటు సిపాయిలు పట్నంలో చొరబడిపోయారు. తనతోడి ఇంగ్లీషు వాళ్ళశవాలుమాత్ర మక్కడ పడివున్నాయి.

కాశ్మీరుదర్వాజాదగ్గిర లోపలిభాగంలో పెద్దభవన మొకటుండేది. దాన్ని 'మెయినుగార్డు' అనేవాళ్లు. అందులోనే కెప్టెను వాలేసు కొంతమందిసిపాయిలతో వుండేవాడు. రిస్లే మొదలయిన వాళ్ళ శవాలు తీసుకుని పేటర్సను మేనుగార్డులోకి వచ్చాడు. విప్లవకారులు వస్తే, యుద్ధంకోసం సిద్ధంగా కూచున్నాడు. ఫిరంగిదళం అధ్యక్షుడు కెప్టెను డి. టీసియరూ, డబ్బయినాలుగోపటాలం సేనాపతి మేజరు ఐవటూ నచ్చికలిశారు. ఇంతమందీ ఫిరంగులూఆవీ పెట్టుకుని ఎదురుచూశారు. కాని మూడుగంటలదాకా అక్కడ పిట్టమనిషి కనపడలేదు. పట్నంలో విప్లవం మేనుగార్డుకి కబురులేదు.

సాయంకాలం కావస్తోంది. సూర్యుడు పడమట వాలిపోతున్నాడు. హఠాత్తుగా బ్రహ్మాండంబద్దలై నంత ధ్వనియింది. ఫిరంగులమోతా, పెద్దపెద్దమంటలూ, పొగలూ ఆకాశంఎత్తున ఘోరంగా అవుపించాయి. అంతమందీ తెల్లపోయి చూస్తున్నారు. ఇద్దరు తెల్లదొరలు పడుతూ లేస్తూ పరిగెత్తుకువచ్చారు. పొగలో మసిబారిపోయి వాళ్ళిద్దరూ సల్లగా నీగ్రోల్లా అవుపిస్తున్నారు. వాళ్లు చెప్పడంవల్ల మేనుగార్డులో వాళ్ళ కర్థమయింది, ఢిల్లీఆయుధాగారం ముట్టుకుం టిని.

ఢిల్లీఆయుధాగారం పట్నంలో ఎర్రకోటకి కొంతదూరంలో వుండేది. ఫిరంగులూ, తుపాకులూ, తూటాలూ, మందుగుండూ – పెద్దయుద్ధా నికి సరిపోయినంత నిలవవుండేది. 900,000 తూటాలూ, ఎనిమిదినించి పదివేలువరకూ తుపాకులూ, పదివేలుపీపాల తుపాకిమందూ, ఎన్నో ఫిరంగులూవుండేవి. లెఫ్టినెంటు జార్జి విలోబీ వానికి పెద్ద. అతడికింద మరి ఎనమండుగురు ఇంగ్లీషువాళ్లుమాత్రమున్నారు. తక్కినవాళ్ళం దరూ నేటివుసిపాయిలు.

అనాళ్ళ ఉదయం విలోబీ ఆయుధాగారం పరికిస్తున్నాడు. ఇంతలో ఫల్గీరెసిడెంటు మెట్కాఫ్ వచ్చి, మీరటుసిపాయిలు యమున వంతెన దాటుతున్నారని చెప్పాడు. వాళ్ళని అడ్డుకుందికి రెండు ఫిరంగులున్నా అడిగి పట్టుకెళ్లాడు. కాని అంతకు వెళ్ళేసరికి విప్లవకారులు వంతెన దాటి వచ్చేశారు.

విలోబీ ఆయుధాగారం వెయ్యికళ్ళతో కాపాడుతున్నాడు. ఏమయినాసరే, విప్లవకారులు వచ్చి ఆయుధాలు దోచుకోకూడదని అతడి అభిప్రాయం. మీరటునించి తెల్లఫౌజు వస్తేనేతప్ప ఆయుధాగారం రక్షించడం అసాధ్యం. నేటివుసిపాయిలమీద రవంతా నమ్మకంలేదు. అంచేత ఎనమండుగురు ఇంగ్లీషువాళ్ళమీదే రక్షణభారమంతా పెట్టాడతను. తను బొందిలో ప్రాణముండగా ఆయుధాగారం వొదలకూడదని శపథం పట్టారు వాళ్లు. ఫిరంగులన్నీ మందుగుండుతో దట్టించారు. వాటినిత్తులు తమచేతిలో పెట్టుకున్నారు. మందుకొట్టూ, ఆయుధాలకొట్టువాకిలీ తుపాకిమందు పరిచిపెట్టారు. అక్కడ వొక ఇంగ్లీషువ్యక్తి పహారానుంచున్నాడు. మరికొంచెందూరంలో మరొకఇంగ్లీషువాడు నుంచున్నాడు. విప్లవకారులు ఆక్రమించగానే ఆయుధాగారానికి నిప్పంటించడమే మేజరు విలోబీ నిశ్చయం. మించిరాగానే రెండోవ్యక్తి సంకేతం తెలియచెయ్యాలి. ఉత్తరక్షణంలో పహారావ్యక్తి నిప్పంటించెయ్యాలి. సంకేతంతెలపడానికి అవకాశంచిక్కకపోతే టోపీపూపితెచాలు, అదే సంకేతంగా గ్రహించాలి — ఇదీ ఏర్పాటు.

అనుకున్నట్టుగానే విప్లవకారులు ఆయుధాగారం చుట్టుముట్టారు. తలుపులు తెరిచి ఆయుధాగారం అప్పగించ వలిసిండని బహదూరుషా ఆజ్ఞగా తెలియచేశారు. విలోబీ సమ్మతించలేదు. ఈలోగా ఎర్రకోట మీద ఆకుపచ్చజెండా చూసి ఆయుధాగారంలోని నేటీవుసిపాయిలు గోడదాటి విప్లవకారుల్లో కలిసిపోయారు. అది తెలియగానే విలోబీ

విప్లవకారులమీద తుపాకులు కాల్చాడు. విప్లవకారులున్నూ తుపాకులు కాల్చారు. విప్లవకారులు సముద్రంకెరటాల్లా వున్నారు. వాళ్లి ముందు తొమ్మండుగురు ఇంగ్లీషువాళ్ళు ఏమాత్రం! సముద్రంలో కాకిరెట్ట! అరచేత పహరాకాస్తున్న ఇంగ్లీషు వ్యక్తి ఇసారా అందిగానే నిప్పంటించేశాడు. వెయ్యిఫిరంగులు పేలిన శబ్దమయింది. భూకంపం వచ్చినట్టు ఢిల్లీపట్నం జవజవలాడిపోయింది. ఇంగ్లీషువాళ్ళు తొమ్మండుగురూ ఛిన్నాభిన్నమై ఎగిరిపోయారు. పాతికమంది నేటివుసిపాయిలూ, మూడువందలమందికిపైగా చుట్టుపట్లజనమూ మచ్చుకిలేకుండా తునాతునకలయిపోయారు. మంచుగుండేమో భస్మమయిపోయింది. తుపాకులు మాత్రం విప్లవకారులచేతిలో వున్నాయి. తళతళా నాలుగేసి తుపాకులు దొరికాయి.

సాయింత్రమయేసరికి మెయినుగార్డుభవనాన్ని విప్లవకారులు గుళ్ళవర్షం కురిపించారు. ముగ్గురు ఇంగ్లీషుఆఫీసర్లూ కాల్చివేయబడ్డారు. మిగిలిన వాళ్ళు ప్రాణాల్తో బైటపడాలని ప్రయత్నించారు. మెయినుగార్డు ద్వారం తెరుచుకుని వెళ్ళడమంటే మృత్యువు వాతపడడమే. ఏమంటే ద్వారానికి ఎదురుగుండానే విప్లవకారులు గుళ్ళవర్షంకురిపిస్తున్నారు. ఇంక ఏందారి? మెయినుగార్డుభవనంలో ఫిరంగులుపెట్టడానికి ఏర్పరచిన సందులగుండా అగడ్తలోకిదిగడం ఒక్కటే ఉపాయముంది. పైనించి ముష్ఠయిఅడుగుల కిందవుంది కందకం. ఎలాఅయినా ఆమార్గంలో దిగడానికే సిద్ధపడ్డారు దొరలు. అదివినడం తోనే అక్కడవున్న దొరసానులు గొల్లుమన్నారు. వాళ్ళని విడిచి వెళ్ళలేకపోయారు దొరలు. దాంతో నడుంపటకాలువిప్పి ముడిపెట్టారు. వాటితో ఒక్కొక్కరినీ అగడ్తలోకి పైనించి దించారు. అలాకొంతమంది కిందికి దిగాక, దొరసానుల్నీ, పిల్లల్నీ దించారు. అగడ్తకి అవతల అడివి. అంచేత ఆదారిని తప్పించుకుపోవడానికి అవకాశంచిక్కింది

వాళ్ళకి. యూపస్మందీ ఎంతోకష్టంమీద అగడ్తలోంచి బైటికిపడ్డారు. అడివిలోపడి తప్పించుకుపోయారు.

ఢిల్లీపట్నానికీ పటాలంమైదానానికీ మధ్యగా గుట్టమీద గుండ్రని బొక్క పెద్దభవనముంది. ఇంగ్లీషువాళ్లు దానిని 'స్లాగ్ స్టాఫ్‌టవరు' అనేవాళ్లు. ఎంతోమంది ఇంగ్లీషువాళ్లు తలదాచుకున్నా రక్కడ. బ్రిగేడియరు బ్రేబ్సు ఇక్కడే వుండేవాడు. ఈబ్రేబ్సు చివరినరకూ ఢిల్లీ కాపాడతాననే డాబులుకొట్టాడు. రెండుఫిరంగులూ, కొంతపటాలమూ కాపలాపెట్టాడు. పటాలంఆఫీసర్లు కాక మరి పందొమ్మండుగురు దొరలూ, ఎంతోమంది దొరసానులూ, పిల్లలూ ఇక్కడ వున్నారు. వీళ్ళంతా ఆయుధాగారం తగలబడడం స్పష్టంగా చూశారు. తమ సహాయంకోసం మీరటు నుంచి తొల్లి ఫౌజు వస్తుందని వీళ్ళంతా ఆశపెట్టుకున్నారు. సాయంకాలంవరకూ ఆశతోనే వున్నారు. సాయంకాలమయాక నిరాశచేసుకున్నారు. చివరికి హిందీ బాగామాట్లాడగలిగిన ఒక ఇంగ్లీషుఆఫీసరుని సన్యాసివేషంవేసి, మీరటు పంపడానికి నిశ్చయించారు. ఈదొంగసన్నాసి యమునదగ్గిరికి వచ్చి చూసేసరికి వంతెన లేదు. దాంతో అతడొక పడవమీద యమున దాటబోయాడు. సిపాయిలు పసికట్టేశారు. తుపాకులు కాల్చారు. పల్లెజనం అతణ్ణి పట్టుకున్నారు. బట్టలూడదీసి వెంటతరిమారు.

విప్లవకారుల ఉపద్రవం హెచ్చింది. స్లాగ్ స్టాఫ్‌టవరులోని ఇంగ్లీషువాళ్లు భయభ్రాంతులయారు. మెయినుగార్డులో ఆఫీసర్లు మరణించారనీ, విప్లవకారులు ముఖ్యస్థలాలు ఆక్రమించారనీ విని అక్కడినించి రాత్రికిరాత్రి పారిపోయారు. దొరసానులు ముందు బైటికిరావడానికి సమ్మతించలేదు. వాళ్ళభర్తలు ఉదయమని బైటికి వెళ్లారు. తిరిగి రాలేదు. మాభర్తలు వచ్చేవరకూ మేం కదలమని కూచున్నారు. కాని తుదకి కెప్టెను టాయిట్లరు చెప్పాక, వాళ్లుకూడా పారిపోయారు.

పట్నంబైట వుండిపోయిన ఇద్దరు టెలిగ్రాఫుసిగ్నలర్లు ఈవార్త పంజాబు అధికార్లకి అందజేశారు.

మంచుగుంపుకొట్టు సాయంత్రం నాలుగుగంటలకి తగలబడింది. అంతవరకూ కంటోన్మెంటుసిపాయిలు తటస్థంగానే వున్నారు. ఆది తగలబడడమే తడవు, వాళ్ళంతా ఒక్కసారి విరుచుకుపడ్డారు. కంటోన్మెంటులోని ఇంగ్లీషువాళ్ళని చిత్రవధ చేశారు. వాళ్ళఇళ్ళూ ఆవీ తగలబెట్టేశారు.

ఇలా సదకుంచునించి పదహారుపరకూ సంహారక్రీడ సాగింది. ఎంతోమంది ఇంగ్లీషువాళ్ళు మారువేషాలు వేసుకు పారిపోయారు. కొందరు మొహాలకి నల్లరంగు పూసుకున్నారు. కొందరు బావాజీలవేషం వేసుకున్నారు. కొందరు ఫకీర్లలా తయారయారు. దారిలో ఎండలోపడి చచ్చిపోయారు కొందరు. దారిపక్కలా, పల్లెల్లోనూ దొరికిపోయారు కొందరు. ఏకొద్దిమందో మీరటులోని ఇంగ్లీషుడేరాలు చేరుకున్నారు. కిమన్‌గడంరాజు తాలూకు నేలమాలెల్లో కొందరు దాగున్నారు. రెండు దినాలయాక, వాళ్ళలో కొందరిని పట్టుకుని, సిపాయిలు ఎర్రకోటకి పట్టుకువచ్చారు. డగ్లసు, ట్రేజర్లశవాలు వెదికి పాతిపెట్టించండన్నాడు బహదూరుషా. తక్కినవాళ్ళశవాలు యమునలో తోయించాడు. భయభ్రాంతులయిన పట్నంప్రజలకి ధైర్యం చెప్పడంకోసం బాదుషా ఏనుగుమీద పట్నంలో తిరిగాడు. మూసేసిన దుకాణాలూ ఆవీ తెరిపించాడు. స్మశానంలాగ నిర్మానుష్యమయిపోయిన చాందినీచౌకు మళ్ళీ తెరిపించాడు. వర్తకప్రముఖుల్ని సమావేశపరిచాడు. విప్లవకారులకి తోడ్పడమని ప్రబోధించాడు. విప్లవకారుల భోజనాదికాలు ఇరవై రోజులవరకూ వర్తకులు భరిస్తామన్నారు. సిపాయిలు సమ్మతించలేదు. చివరికి గుర్రపురౌతులకి దినానికి తలా ఒకరూపాయీ, సిపాయిలకి తలానాలుగణాలూ ఏర్పాటయింది. దరియా

గంజి బజారు విప్లవకారుల నివాసమయింది. ఢిల్లీపరిసరాల్లో ఇంగ్లీషు వాళ్ళ నీడకూడా కనపడకండా అయిపోయింది.

మే పదహారున సిపాయిలువచ్చి పాదుషా దగ్గిర కేకలువేశారు. బేగ మహాలులో కొందరు ఇంగ్లీషువాళ్ళు దాగున్నారు. వాళ్లని ఇచ్చెయ్యండంటూ గోలచేశారు. నిజంగా కొందరు ఇంగ్లీషువాళ్ళు బేగంమహాలులో దాగున్నారు. కనికరించిన బేగములు వాళ్ళకి రక్షణ యిచ్చారు. వాళ్ళని సిపాయిలకప్పగించక తీరిందికాదు. చివరికి నల్ల భై తొమ్మండుగురిని పైకి పట్టుకువచ్చారు. అందులో అయిదారుగురు మాత్రం దొరలు. తక్కినవాళ్ళు దొరసానులు. నౌబతుఖానా దగ్గిర చౌకు మధ్య చెరువు దగ్గిర ఈ నల్లభై తొమ్మండుగురినీ సిపాయిలు నరికి పారేశారు. ఇది ఆయుధాగారానికి బదిలీ అంటూ అరిచారు.

ఇంతా జరిగింది నిజమే. ఇంగ్లీషుస్త్రీలకి మానభంగంమాత్రంజరగ లేదు. అయితే, ఇంగ్లాండులో మిషనరీలు మాత్రం నోట వచింపరాని అసత్యాలు ప్రచారంచేశారు. దొరసానుల బట్టలువిప్పేసి, దిసమొల లతో వాళ్ళని ఢిల్లీవీధుల్లో తిప్పారన్నారు. వాళ్ళని బహిరంగంగా మానభంగం చేశారన్నారు. వయస్సురాని బాలికలని కూడా చెరిచారన్నారు. దొరసానుల స్తనాలు తెగగోశారన్నారు. అయితే ఇవన్నీ బుద్ధిపూర్వకంగా చెప్పిన పచ్చి అబద్ధాలు. *

ఢిల్లీస్వాధీనమయింది. ఎర్రకోటమీద ఆకుపచ్చజెండా ఎగిరింది. పాదుషా బహదూరుషా రోజూ దర్బారుచేయడం మొదలు పెట్టాడు. దర్బారులోకి విప్లవకారులూ, ఢిల్లీప్రముఖులూ, నాయకులూ హాజరయేవాళ్లు. విప్లవసైనికుల పర్యాట్లూ అవీ చర్చించేవాళ్ళు. స్వాతంత్ర్య

* "However much of cruelty and bloodshed there was, the tales which gained currency of dishonour to ladies were, so far as my observation and enquiries went, devoid of any satisfactory proof"—Hon. Sir Wm. Muir, Head of the Intelligence Dept.

సమరంలో పాల్గొనమని ప్రముఖులకి ఉత్తరాలు రాసేవాళ్ళు. శత్రువుల గూఢచారుల్ని విచారించి శిక్షించేవాళ్లు. ఒకనాడు హిందూజ్యోతిష్యుడి వేషంలో పంచాంగం చెంకని పెట్టుకు తిరుగుతూవున్న ఒక గూఢ చారిని సిపాయిలు పట్టుకువచ్చారు. వెంటనే అతడి తల నరికేశారు. సిపా యిలు సరాసరి లోపలికి వచ్చేసేవాళ్ళు. "నాదిర్షాకానీ, అహమద్షా కానీ, ఇంగ్లీషు గవర్నరుజనరలు కానీ వెళ్లనిచోట్లకి కూడా సిపాయిలు గుర్రాలమీద వెళ్లిపోయేవాళ్ళు."

ఢిల్లీ స్వాధీన మయిందన్న వార్త దేశమంతటా మెరుపులా పాకి పోయింది. అనేకచోట్ల విప్లవనాయకులు వుద్భూతులుగారు. ముప్ఫయి వొకటిదాకా ఆగడమూ, రంగంలోకి వురకడమూ? ఇదే ప్రశ్నగా వుండేది వాళ్ళకి. అయినా ఆపక్షంరోజులూ ఎక్కడోవొకదగ్గిర విప్లవం భగ్గుమంటూనే వుండేది.

మే ఇరవయిని ఆలీగడం తొమ్మిదో నేటీవుపటాలం సిపాయిలు విప్లవం చేశారు. అలీగడం పటాలానికికేంద్రమయినా ఈతొమ్మిదో పటాలం కొంతకొంత మైనాపురం, ఇటావా, బులందరుపట్నాల్లోవుండేది. ఈ పటాలమంటే చెప్పలేనంత నమ్మకంగావుండేది దొరలకి. దేశంలో పటాలాలన్నీ తిరగబడినా ఇదిమాత్రం తిరగబడదని వాళ్ళ నమ్మకం. అందుకని ఎలాఅయినా ఈపటాలం తమదిక్కు తిప్పుకోవాలని విప్లవ సంఘం ప్రయత్నిస్తూవుండేది. చివరికి బులందరు రహస్యసంఘం మొక ప్రయత్నంచేసింది. ఒక బ్రాహ్మణప్రచారకుణ్ణి బులందరు పటాలం లోకి పంపింది. విప్లవసందేశం పుచ్చుకుని బ్రాహ్మడు పటాలంలో ప్రవేశించాడు. అతడి ఉపదేశం సిపాయిలు శ్రద్ధతో వింటున్నారు. ఇంతలో ముగ్గురుసిపాయిలు అధికార్ల కీవిషయం చెప్పేశారు. అధికార్లు చప్పున వచ్చారు. బ్రాహ్మణ్ణి పట్టేశారు. అరదండాలువేసి అలీగడం

పట్టుకుపోయారు. అలీగడం అధికార్లు బ్రాహ్మణ్ణి విచారించారు. ఊరి శిక్ష చెప్పారు. మే ఇరవై ని ఉరి.

ఈలోగా బులందరుసిపాయిల్లో విప్లవాగ్ని రగులుకుంది. కూపీ ఇచ్చిన ముగ్గురునీ చెడామడా తిట్టారు. మొహమ్మాదు ఉమేద్ఖాను. సిపాయిలు యావన్మందీ అధికార్లకి చెప్పకండా అలీగడం వచ్చేశారు.

మే ఇరవై బుధవారం. సాయంకాలమయింది. బహిరంగంగా సిపాయిలఎదట బులందరు బ్రాహ్మణప్రచారకుణ్ణి ఉరికంబానికి వేలాడదీశారు. దాంతో సిపాయిలరక్తం కుతకుతలాడింది. ఆపుకోలేని వొకసిపాయి వొరలోంచి కత్తి బైటికిలాగాడు. ఉరికిఁబందికు-చూపిస్తూ వురిమాడు - "సోదరులారా, ఈసహీదు మనకోసమే రక్త స్నానంచేశాడు!" సిపాయి లందరిహృదయాల్లోనూ ఈమాటలే ప్రతిధ్వనించాయి. ఇంకేముంది, పటాలంపటాలం వొక్కసారి తిరగబడింది.

అయితే ఈసిపాయిలు దార్జన్యానికిమాత్రం పూనుకోలేదు. శాంత మార్గమే అవలంబించారు. "మీబతుకుమీద ఆశవుంటే వెంటనే అలీగడం వొదిలిపొండి" అంటూ ఇంగ్లీషువాళ్ళకి తెలియజేశారు. రాత్రికిరాత్రి ఇంగ్లీషువాళ్ళు పిల్లాజెల్లా తీసుకుని అలీగడంనించి పారిపోయారు. పట్నం సిపాయిల స్వాధీనమైపోయింది. అవాళ అగ్ని రాత్రికిముందే ఆకుపచ్చజెండా అలీగడం ముక్తాకాశంకింద తలఎత్తుకు నుంచుంది. ఖజానాకొట్టులోంచి ధనమూ, ఆయుధాగారంనించి ఆయుధాలూ పుచ్చుకుని సిపాయిలు ఢిల్లీనవచ్చేశారు.

మే ఇరవై రెండుని మైనాపురంసిపాయిలు తిరగబడ్డారు. మీరటులో తిరగబడ్డసిపాయిల్లో రాజానాథసింగు అని వొకసిపాయి మైనాపురం దగ్గిర జీవంతిగ్రామం వచ్చాడు. అది మైనాపురం అధికార్లకి తెలిసింది. వెంటనే అతణ్ణి పట్టుకుందికి కొంతమందిసిపాయిలని జీవంతి పంపారు. పట్టితేవడానికిబదులు ఈసిపాయిలు రాజానాథసింగుని భద్రంగా జీవంతి

దాటించేసి వచ్చారు. ఆపేరుగలవ్యక్తే అక్కడ లేడన్నారు. అలాగే రామదిసిపాయిని, ఆజ్ఞోల్లంఘనంచేసిన నేరానికి అర దండాలువేసి, అధికార్లు ఆలీగడం పంపించారు. సగందారిలో అతడి అరదండాలు విరిచేసి వొదిలేశారు సిపాయిలు.

ఆలీగడం స్వాధీనమయినవార్త ఇరవై రెండున మైనాపురం చేరింది. ఇక్కడకూడా సిపాయిలు ఇంగ్లీషువాళ్ళని పట్నం వొదిలిపొమన్నారు. అందరినీ తగిలేశారు. తుపాకులూ, మందుగుండుసామానూ అదీ వొంకొలమీద వేసుకుని; ఇరవై మూడున ఫిల్లీ ప్రయాణం కట్టారు. మైనాపురంలో ఆకుపచ్చజెండా ఎగిరింది.

మే ఇరవై మూడున ఇటావా సిపాయిలు లేచారు. ఇటావాలో ఏ. ఓ. హ్యూమ్ కలెక్టరుగా వుండేవాడు. మీరటులిచ్చ్లవం వినడంతోనే, కొంతపటాలంవేసుకొని ఇటావాచుట్టుపట్ల కాపలాకాశాడు. పందొమ్మిదిని కొంతమంది మీరటుసిపాయిలు ఇటావాదగ్గిరగా వొక కోవిలలో వున్నారని తెలిసింది. కలెక్టరూ, అసిస్టెంటుకలెక్టరు డేనియలూ కొంతమంది సిపాయిలు తీసుకుని అక్కడికి వెళ్లారు. సిపాయిలేమో వెంటవెళ్లారు. కాని కలెక్టర్లమాట వినలేదు; తిరగబడ్డారు. డేనియలు మృత్యువువాతపడ్డాడు. హ్యూమ్ చావుతప్పి, కన్నులొట్టపోయి బైట పడ్డాడు. అవాళే ఇటావాపటాలం లేవవలిసింది. కాని ఆలీగడకేంద్రం ఆదేశంకోసం ఆగిపోయింది. ఇరవై రెండున ఆలీగడం తిరుగుబాటు వార్తా, మైనాపురంవార్తా అందడంతోనే ఇటావాసిపాయిలు వొక్కసారి లేచారు. ఒకచేత్తో కత్తీ, వొకచేత్తో కాగడా పుచ్చుకున్నారు. దొరల బంగళాలకి పరిగెత్తారు. "ప్రాణంమీద ఆశవుంటే, పట్నం విడిచి పారిపొండి" అంటూ హెచ్చరించారు. జైలుతలుపులు విరగ్గొట్టారు. ఖైదీల బేడీలు విడగొట్టారు. కోశాగారం దోచుకున్నారు.

ఇంగ్లీషువాళ్లు మూటాముల్లే వొదిలేసి, పెళ్లాంపిల్లలుపట్టుకుని పారిపోయారు. కలెక్టరు వొకహిందూస్త్రీవేషంలో పలాయన మయాడు.

"ఇటూవాపట్నం స్వాధీనమయిపోయింది" అంటూ విప్లవకారులు పట్నంలో దండోరావేశారు. ఆకుపచ్చజెండా కచేరీలమీద ప్రతిష్ఠించారు. ఖజానా, ఆయుధాలూ ఫుచ్చుకుని ఢిల్లీకి బైల్దేరారు. పట్నం రక్షించేభారం ప్రజలు వహించారు.

ఇలా బులందరుబ్రాహ్మడి వురిఫలితంగా ఆలీగడంజిల్లా అంతటా ఇంగ్లీషువాళ్లు లేకండా అయిపోయింది. నమ్ముకున్న పటాలం విప్లవం చేసి, ఎదురుతిరిగింది.

మే ఇరవై ఎనిమిదిని నాసిరాబాదులో పచ్చజెండా ఎగిరింది.

నాసిరాబాదు అజ్మీరుచేరువగావున్న చిన్నపట్నం. అక్కడ ముప్ఫయ్యో నేటీవుపటాలమూ, కొంతమంది ఇంగ్లీషుసిపాయిలూ, వొక ఫిరంగిదళమూ వుండేవి. మీరటు రహస్యసంఘం పంపిన వెయ్యిమంది ప్రచారకులు దేశమంతటా వ్యాపించారు. కొంతమంది నాసిరాబాదు కూడా వచ్చారు. వీళ్ళప్రచారఫలితంగా ఇరవై ఎనిమిదిని నేటివుపటాలం లేచింది. ఇంగ్లీషు సిపాయిలకీ నేటివు సిపాయిలకీ యుద్ధం జరిగింది. ఎంతోమంది ఇంగ్లీషువాళ్లు హతులైపోయారు. కళ్లులు పెన్నీ, కెప్టెను స్పాటిసువుండే మొదలయిన ఆఫీసర్లు మరణించారు. న్యూబరీదొరశరీరం ఫిరంగిదెబ్బతో తుత్తునియ లయిపోయింది. మిగిలిన ఇంగ్లీషువాళ్లు పట్నంవొదిలి పారిపోయారు. సిపాయిలు ఖజానాకొట్టు స్వాధీనపరుచుకున్నారు. తమలో వొకణ్ణి సేనానిగా ఎంచుకున్నారు. అతడు సిపాయిలకి బహదూరుషావేర బహుమతులు పంచిపెట్టాడు. దొరలబంగళాలు తగలబెట్టేసి సిపాయిలు ఢిల్లీవచ్చేశారు. నాసిరాబాదు ప్రజలు పచ్చజెండాకింద జయజయధ్వనులు చేశారు.

కుంపినీ దండయాత్ర

మీరటు, ఢిల్లీలవార్త కలకత్తాచేరింది. గవర్నరుజనరలుకానింగు దిగ్భ్రాంతుడయాడు. ఇంగ్లీషువాళ్లు ఇండియాలో కాలుపెట్టినప్పటి నించీ ఈనాటివరకూ ఇలాంటిదురవస్థ వొకనాడూ తటస్థపడలేదు. ఇప్పుడేమిటి కర్తవ్యం? బారకుపురంనించీ అగ్రావరకూవొక్కటయినా ఇంగ్లీషుపటాలం లేదు. దానాపురంలోమాత్ర మొకపటాలముంది. కలకత్తానించి దానాపురం నాలుగువందలమైళ్లు దూరం. కలకత్తా రాజధాని. దానిరక్షణ ఎంతయినా అవసరం. విలియంకోటలో పెద్ద ఆయుధాగారముంది. కాశీపురంలో తుపాకులూ, ఫిరంగులూ తయారుచేసే కార్ఖానావుంది. ఇచ్చాపురంలో మందుగుండుతయారుచేసే శిక్షణాలయముంది. కోటకి కొంచెం దూరంలో ఆలీపురం జైలుంది. అందులో ప్రమాదకరమైన ఖైదీలెంతోమంది వున్నారు. బ్యాంకులో ఎంతోధనం నిలవవుంది. ఇవన్నీ కాపాడాలంటే, తెల్లపటాలం ఎంతయినా అవసరం. నేటివుసిపాయిలని నమ్మడం మొళ్లో ఆపదపెట్టుకోడమే పంజాబులో కొన్ని తెల్లపటాలాలున్నాయి. కాని అవి అక్కడ వుండడం అవసరం. పంజాబుచెయిజారి పోయిందో కొంపమునుగుతుంది. ఏమిటిసాధనం? దూరదూరాలవున్న తెల్లపటాలాలు వొక్కదగ్గిర చేర్చడంవొక్కటే సాధనం అని తోచింది కానింగుకి. ఈవిషయమే అతడు బోర్డాఫుకంట్రోలు ప్రెసిడెంటుకి రాశాడు. వెంటనే ఇంగ్లీషు పటాలాలు కలకత్తా రావలిసిందిగా బొంబాయీ, మద్రాసూ, రంగమూ మొదలయిన-చోట్లకి తంతులుపంపాడు. సరిగ్గా అదేసమయానికి పర్షియాతో ఇంగ్లీషువాళ్ల యుద్ధం ముగిసింది. ఆపటాలాలు కూడా ఇండియాకి మళ్లవలిసిందని కానింగు తంతిపంపాడు. పర్షియా యుద్ధం ముగిసేసరికి చైనాతో జట్టీవచ్చింది. చైనామీదికి దాడివెళ్ళు

తున్న ఇంగ్లీషుపటాలం దారిలోనే ఆవేశాడతడు. ఇలా ఈనేసలన్నీ ఏకముఖంగా కలకత్తాకి బైలుదేరాయి.

తణుకూబెణుకూ లేకండా గవర్నరుజనరలు ఈ ప్రయత్నమంతా చేసుకుపోతున్నాడు. ఇదంతా మందకొడితనంగా కనిపించింది కలకత్తాలోని ఇంగ్లీషువాళ్లకి. ఇదిచెయ్యమనీ, అదిచెయ్యమనీ ఎన్నోవిధాల తొందరచేశారతణ్ణి. కాని ఏమాత్రమూ చలించలే దతడు.

ఈలోగా సిపాయిల కళ్లుతుడవడంకోసం వొక ప్రకటనచేశాడు కానింగు. "మీమతమూ, కులమూ అవమానపరచాలని ఏకోశానా మాకు లేదు. ఎన్నడూ అలాంటిజోక్యం కలిగించుకోము. మీఇష్టమయితే తూటాలూ మీచేతులతోనే తయారుచేయండి. అంతేకాని కుంపినీవుప్పు తింటూ కుంపినీమీద కత్తికట్టడం పాపం" – ఇదీ ఆప్రకటన సారాంశం. ఈప్రకటనచూస్తే కొవ్వుతూటాలే ఈవిప్లవానికి కారణమని కుంపినీభ్రమపడ్డట్టు స్పష్టమవుతుంది. తమదేశంకోసం, ధర్మంకోసం భారతీయులు సాగించిన బ్రహ్మాండమైన స్వాతంత్ర్యసమర మని పాపం, అర్థంకాలేదు వాళ్ళకి.

గవర్నరుజనరలుప్రకటన దేశమంతా ప్రకటించారు. కాని గడ్డిపరకంతవిలువయినా లేకపోయింది దానికి. ఆదినాల్లో కలకత్తాలో వొక వింతపుకారు పుట్టింది. "హిందువుల్ని జాతిభ్రష్టుల్ని చెయ్యడం కోసం కుంపినీవాళ్లు చెరువుల్లో, కోనేళ్ళలో గొడ్డుమాంసం కలపడానికి నిశ్చయించారు. విక్టోరియారాణి జన్మదినంనాడు హిందువులందరికీ గోమాంసం తినిపిస్తారు. అవాళ బజార్లో ఏవస్తువూ దొరకనివ్వరు. దుకాణాలన్నీ కట్టించేస్తారు" – ఇదీ ఆ పుకారు.

ఈ పుకారు ఖండిస్తూ గవర్నరుజనరలు మే ఇరవైని వొకపెద్ద ప్రకటనచేశాడు. రాణీ జన్మదినం నెమ్మదిగానే జరిగిపోయింది. ప్రభుత్వ భవనంలో ఉత్సవంజరిగింది. కాని ప్రజలుమాత్రం వెళ్ళడం మానేశారు.

ఇంతలో మరోపుకారు – "బారకుప్పుసిపాయిలు తిరుగుబాటు చేశారు. ఆయుధాలతోవచ్చి, కలకత్తాదొరలమీద విరుచుకుపడుతున్నారు." కలకత్తా ఇంగ్లీషువాళ్ళ ప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి. మూటాముల్లేకట్టి కొందరు కోటలోకి పరిగెత్తారు. పెళ్ళాం పిల్లలతో కొందరు వూరువొదిలి పారిపోయారు. కొందరు ఇంగ్లాండుకే పయనమయారు. కొందరు వోడలమీదే కాపరంపెట్టారు. కొందరు రాత్రింబగళ్ళు తుపాకులుపట్టుకునే తిరిగారు. ఆఫీసుల్లో పనీపాటూ మానేసి కొందరు మూలల్ని నక్కారు. అశ్రద్ధచేసి కొంపముంచుతున్నాడని కానింగుని చెడామడా తిట్టారు.

వాళ్ళంతా భూరికే వులికిపడుతున్నారని కానింగుకి తెలుసు. గంభీరముద్రవహించి, దండయాత్రకు అవసరమయిన ఏర్పాట్లన్నీ చేస్తూవచ్చాడతడు. ఢిల్లీపట్నం చెయిజారిపోయింది. విప్లవకారులకదే కేంద్రంగావుంది. బహదూరుషా విప్లవనాయకుడుగా వున్నాడు. అతడు ఆడిందే ఆటగావుంది. అంచేత ముందు ఢిల్లీపట్నం విడిపించాలి. ఢిల్లీ పడిపోతే విప్లవం పడిపోతుంది. ఇదీ కానింగు ఆలోచన. అందుకని అతడు కమాండర్ ఇన్ చీఫు ఆన్సనుకి తంతికొట్టాడు – "వెంటనే వెళ్ళి ఢిల్లీపట్నం పట్టుకోవలిసింది."

ఆన్సను సిమ్లాకొండలమీద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సంవత్సరం ఎండలు మండిపోతున్నాయి. మే మాసం ఎండ సిమ్లాలోనూ ఇంగ్లీషువాళ్లకి దుర్భరంగావుంది. కానింగు మళ్లేనే పంజాబు చీఫుకమీషనరు సర్ జాను లారెన్సు కూడా ఆన్సనుకి టెలిగ్రాం కొట్టాడు – "వెంటనే ఢిల్లీ పట్టుకోవలిసింది." పాపం, ఆన్సనుదొర సిమ్లాచల్లదనం వొదిలిపెట్టి అంబాలా పటాలంకేంద్రానికి వచ్చాడు.

ఇంతలో అంబాలాలో పెద్ద పుకారు పుట్టింది – "ముసోరీలోని ఘూర్ఖాపటాలం తిరగబడింది. అక్కడి ఇంగ్లీషువాళ్ళని దోచుకుంది.

ఇదిగో, ఘడియో క్షణమో సిమ్లా మీదికి వచ్చేస్తుంది." సిమ్లాలో ఈ ప్రకారం గుప్పుమంది. సిమ్లాలో చల్లదనం అనుభవించడానికి వచ్చిన దొరలికి తేళ్ళూ, జెర్రులూ పాకాయి. దొరలూ, దొరసానులూ కకావికలై పరిగెత్తారు.

అసలుకారణ మేమిటంటే, ఘూర్ఖా సిపాయిలకి కొన్నాళ్లయి జీతాలందలేదు. అందుకని వాళ్ళు ఏదో కొంత అలిగారు. అంతే. ఆ జీతంరాళ్ళు కాస్తా చేతిలో పడగానే వూరుకున్నారు. సిమ్లా ఆక్రమించాలని కానీ, ఇంగ్లీషువాళ్లని చంపాలని కానీ కలలో కూడా వాళ్ళు అనుకోలేదు. ఏమైతేనేం, సిమ్లాలో నాలుగువందలమంది ఇంగ్లీషువాళ్లూ "స్త్రీలూ, పురుషులూ ప్రాణాలు బిగబట్టుకు పరిగెత్తారు. బ్యాంకుభవనంలో తలదాచుకున్నారు. అక్కడ, రెండు ఫిరంగులున్నూ తీర్చిపెట్టారు. కాని ఘూర్ఖా లేరీ? ఒకరోజు గడిచింది. రెండురోజులు గడిచాయి. ఘూర్ఖాలూ గీర్ఖాలూ రాలేదు.

ఢిల్లీముట్టడికి సర్వసేనాని అస్సను సర్వప్రయత్నాలూ చేశాడు. అయితే అది అంత సులభసాధ్యంమాత్రం కాలేదు. అంబాలాచుట్టుపట్ల భారతీయులెవ్వరూ కలిసిరాలేదు. బ్యాంకర్లూ వర్తకులూ, కంట్రాక్టర్లూ - యవన్మందీ సహాయనిరాకరణంచేశారు. కూలీలూ, బండివాళ్లూ కూడా దొరకలేదు. అన్నితరగతులవాళ్లూ ఎటు తాసుమొగ్గుతుందో అంటూ ఎడంగావుంటూవచ్చారు. *

అంబాలానించి ఢిల్లీవరకూ దేశం ఇలాగేవుంటే ఢిల్లీముట్టడి ఇంకోలావుండేది. అంబాలా ఢిల్లీలమధ్యదారిలో పాటియాలా, నాభా,

* "...Natives of all classes held aloof, waiting and watching the issue of events. From the capitalists to the coolies, all shrank alike from rendering assistance to those whose power might be swept away in a day."—Kaye's Indian Mutiny.

ఝిందా - మూడుపెద్దపెద్ద పంజాబుసంస్థానా లున్నాయి. ఇవి కుంపినీకి సహాయం చెయ్యకపోయినా, అధమం తటస్థంగావూరుకున్నా కథ అడ్డంతిరిగేది. కాని అలా జరగలేదు.

ఈమూడుసంస్థానాలూ ఆన్సనుకి జనమూ, ధనమూకూడా ఇచ్చి తోడ్పడ్డాయి. పాటియాలారాజు తనపటాలమూ, ఫిరంగిదళమూ ఇచ్చి, తనతమ్ముణ్ణి పంపించాడు. విప్లవకారుల ముప్పురాకండా థానేశ్వరంరోడ్డు కాపలాకాయించాడు. ఝిందారాజు పానిపత్ దగ్గిర పెట్టనికోటలా నుంచున్నాడు. ఇదంతాఅయాక, నిరాఘాటంగా ఆన్సను సేనాని ఇంగ్లీషుఫౌజూ, సిక్కుసేనా వేసుకుని ఢిల్లీముట్టడికి మే ఇరవై అయిదున బయలుదేరివచ్చాడు. ఈసేనలో పాటియాలా, నాభా, ఝిందాసైనికులు అధికంగా కలిశారు.

అలా బయలుదేరిన రెండోనాడు ఆన్సను సర్వసేనాని కర్నాలు దగ్గిర మరణించాడు. అయితే సిపాయిలు మాత్ర మతణ్ణి చంపలేదు, కలరా కబళించింది అవాళ్ళే. సర్ హెన్రీ బర్నార్డు సర్వసేనానిపదవి పుచ్చుకున్నాడు. అంబాలానించి ఢిల్లీవస్తూ దారిలో ఈ ఇంగ్లీషు పటాలం చేసిన ఘోరాలు ఇన్నీఅన్నీ కావు. దారికడ్డుకూ కనపడ్డ ప్రతీవాణ్ణీ "పాండే" అంటూ పట్టుకున్నారు. చిత్రవధ చేశారు. వందలకొద్దీ వూళ్లు ధ్వంసంచేశారు. నిరపరాధులూ, నిరాయుధులూ అయిన గ్రామస్థుల్ని గుంపులు గుంపులుగా పట్టుకున్నారు. యమయాతనలుపెట్టి చంపేశారు. తలవెంట్రుకలు బలవంతంగా వూడపీకారు. ఒళ్లంతా కుళ్లుపోట్లుపొడిచారు. కత్తులతోనూ, సన్నీలతోనూ గోమాంసం నోట్లో కుక్కారు. చావుబతుకులతో వున్నవాళ్లని చెట్లకి వురితీశారు. అమాయకుల్ని పట్టుకుని సైనికశాసనంకింద విచారణ

చేశారు. నేరంచేసినా, చెయ్యకపోయినా సరే, వురిచెపుతామని శపథం చేశాకే విచారణకి కూచునేవాళ్లు. *

ఇలా రాక్షసకృత్యాలు సాగిస్తూ అంబాలానించి ఢిల్లీ వస్తున్న ఇంగ్లీషుపటాలాన్ని కలుసుకుందికి మీరటుఇంగ్లీషుపటాలం బైలుదేరింది. ఈ వార్త ఢిల్లీకి తెలిసింది. అంబాలా పటాలంతో కలియకముందే మీరటు తెల్లపటాలాన్ని ఎదిరించడానికి ఢిల్లీస్వతంత్రసేన బయలు దేరింది. మే ముప్ఫయిని హిందను దగ్గిర రెండు సేనలూ తారసిల్లాయి. ముఖాముఖి యుద్ధం జరిగింది. స్వతంత్రసేన దాపలిభాగం దుర్బల మైంది. అక్కడ అయిదుఫిరంగులు వొదిలేసి స్వతంత్రసేన వెనక్కి వెళ్లి పోయింది. అయితే వొకసిపాయి వూరికే అవి శత్రువుచేతిలో వొది లెయ్యడానికి ఇష్టపడలేదు. అందరూ వెళ్లిపోయినా తానుమాత్రం ఫిరంగులమాటున కూచున్నాడు. ఇంగ్లీషువాళ్లు ఫిరంగులకోసం దగ్గి రికి రాగానే మేగజీనుకు అగ్గిముట్టించేశాడు. కెప్టెను ఆండ్రూసూ, ఎంతోమంది దొరలూ మాడి, మసయి పోయారు. ఎంతోమంది గాయాలు పడ్డారు. అంతమందిని హతవార్చి ఆ సిపాయివీరుడు వీర స్వర్గం చూరగొన్నాడు. ఢిల్లీ ఆయుధాగారం ముట్టించి విలోభి చూపిన వీరత్వమే ఈసిపాయి చూపించాడు. తనదేశంకోసం, ధర్మంకోసం తన ధర్మం తాను నిర్వహించాడు.

---

* "Officers as they went to sit on the court-martial swore that they would hang their prisoners, guilty or innocent and, if any dared to lift up his voice against such indiscriminate vengeance, he was instantly silenced by the clamours of his angry comrades. Prisoners condemned to death after a hasty trial were mocked at and tortured by ignorant privates before their execution, while educated officers looked on and approved."— Holfes's History of the Sepoy war.

అతడిగురించి చరిత్రకారుడు కే అన్నమాటలు వినండి – "విప్లవ కారుల్లో తమ దేశంకోసం ప్రాణాలర్పించడానికి వెనకతియ్యని ఇలాంటి వీరులూ, సాహసవంతులూ వున్నారని మనకి స్పష్టమయింది." *

అయితే ఆసిపాయిపేరన్నా చరిత్ర కెక్కలేదు! ఆనాటి స్వాతంత్ర్య సమరంలో ఇలాంటి దేశభక్తులూ మహావీరులూ ఎంతోమంది వున్నారు. వాళ్లని స్మరించి, కృతజ్ఞతతో తలవొంచడంకంటే ఈనాటి భారతజాతి ఏమర్పించగలదు!

విప్లవం విజృంభించింది

రోహిలాఖండం

మే ముప్ఫయివొకటి వచ్చేసింది. ఎప్పుడెప్పుడని దేశమంతా నిరీక్షిస్తూవున్న దినమది!

అవాళ ఆదివారం. భళ్ళున తెల్లవారింది. రోహిలాఖండం బరేలీలో ఓంప్రథమంగా కాల్పుల ధ్వన్లో బంగళా నిప్పంటుకుంది.

ఆదివారపు పటాలంకవాతు చడీచప్పుళులేకుండా జరిగిపోయింది. ఇంగ్లీషువాళ్ళు గుళ్ళకినడిచారు. ప్రార్థనలు పూర్తయాయి. టంగు టంగున పదకుండుగంటలు కొట్టాయి. హఠాత్తుగా వొక ఫిరంగి పేలింది. విప్లవం ఆరంభానికి అదే సంకేతం!

దేశమంతటిలోకీ బరేలీపర్వాట్లు పగడ్బందీగా జరిగాయి. ఎప్పుడు ఏంచెయ్యాలో, ఎవ్వరు ఏదిచెయ్యాలో, ఏదొరని ఎవ్వరు ఎలాగ చంపాలో అంతాముందే చక్కగా ఏర్పాటయింది. పదకుండుగంటలకి ఫిరంగి పేలగానే అర్నైఎనిమిదోపటాలం సిపాయిలు కత్తులతోనూ,

* "It taught us that, among the mutineers, there were brave and desperate men who were ready to court instant death for the sake of the national cause! –Kaye's History of the Indian Mutiny.

తుపాకులతోనూ లేచారు. ఇంగ్లీషువాళ్ళమీద విరుచుకుపడ్డారు. వాళ్ళ బంగళాలు నిప్పంటించారు. దొరికినఇంగ్లీషువాణ్ణల్లా నరకడం మొదలెట్టారు. ఇంగ్లీషుఆఫీసర్లు గుర్రపుసిపాయిలతోట్లు పరిగెత్తారు.విప్లవకారుల్ని ఎదిరించమంటూ గుర్రపుదళానికి ఆజ్ఞాపించారు. ప్చ్! ఏంలాభం? గుర్రపుదళాధిపతి సల్లవాడు. అతడూ విప్లవకారుడే. మహమ్మదుషాపీ గుర్రమెక్కి విప్లవకారులదగ్గరికి పరిగెత్తాడు. "రండీ నావెంట" అంటూ రినీ రొప్పుకుపచ్చాడు. ఆకుపచ్చజెండాపట్టుకుని సిపాయిలు అతడి వెంటపడ్డారు. బ్రిగేడియరుసిబ్బాల్డు కెప్టెను కిర్స్చ్, లెఫ్టినెంటు థ్రాసరు, సార్జంటు వాల్టను, కల్నలు ట్రూఫు, కెప్టెను రాబర్టసన్ ఇంకాఇంకా ఎందరో ఆఫీసర్లు హతవారిపోయారు. తక్కినవాళ్లు వొక్కముప్పయి ఇద్దరుమాత్రం నైనితాలు పారిపోయి బతికిపోయారు. ఇంగ్లీషుజెండా బుగ్గిలో కలిసిపోయింది. ఆకుపచ్చాజెండా ఎగిరింది.

బరేలీ రోహిలాఖండానికి ముఖ్యపట్టణం. రోహిలాఖండంచుట్టూ కొండలుకలిగి సుభిక్షంగావుండినదేశం. 1774 వరకూ రోహిలా పఠానులు దీన్ని పాలిస్తూవుండేవాళ్ళు. వారనుహోస్టింగ్సు ధర్మమా అని ఆనాటినించీ దీనిస్వాతంత్ర్యం మాయమయింది. క్రమంగా కుంపినీవాళ్ళ కబళంలో పడిపోయింది. 1857 నాటికి ఈఖండంలో కుంపినీదే రాజరికం.

బరేలీలో అప్పటికి ఎనిమిదో ఇర్రిగ్యులరు గుర్రపుదళమూ, పద్దెనిమిదీ, ఇరవై నెంబర్ల కాల్బలమూ, కొంత ఫిరంగిదళమూ వుండేవి. పూర్వద్వేషం రోహిలాఖండం ప్రజల్లో మండుతూవుండేది. అంచేత రాష్ట్రమంతటా విప్లవప్రచారం రహస్యంగా ఎంతజరగాలో అంతా జరిగింది. చివరినవాబు హాఫిజురహమతు వారసుడు ఖానుబహాదూరుఖాను కుంపినీ జడ్జీగావుండేవాడు. జడ్జీగానూ, నవాబువారసుడుగానూ అతడికి పెన్షను ముడుతూవుండేది. అయితే ఖానుబహదూరుఖానే అక్కడ విప్లవనాయకుడుగా వుండేవాడు. రహస్యసంఘం నడుపుతూవుండేవాడు.

మీరటుతిరుగుబాటువార్త మే పదాన్నాలుగున బరేలీచేరింది. ఇంగ్లీషు వాళ్లు వెంటనే తమ పిల్లాజెల్లాన్నైనిటూలు పంపేశారు. గుర్రపుదళం సిద్ధంగా అట్టేపెట్టారు. గుర్రపుదళం కాతులంచకూ నేటీవులే. అయినా ఆఫీసర్లకి వాళ్లమీద నమ్మకంగావుండేది. అమర్చాము సేనాధిపతి కవాతు మైదానంలో రాజభక్తినూరిపోశాడు. కొత్తతూటాలు వాడ సక్కరలే దన్నాడు. పాతవే వాడవచ్చన్నాడు. కొత్తతూటాలు తానే మట్టిలోకలిపేస్తానన్నాడు.

ఈలోగా ఢిల్లీస్వాతంత్ర్యసేన సేనాధిపతినించి రోహిలాఖండం పటాలానికి ఆహ్వానపత్రం వచ్చింది –

"బరేలీ, మురాదాబాదు పటాలాల సేనాపతులకి ఢిల్లీ పటాలం సేనాధిపతి హృదయపూర్వకమయిన ఆలింగనాలు. సోదరులారా! ఢిల్లీలో ఇంగ్లీషువాళ్లతో యుద్ధం జరుగుతూవుంది. దేవుడిదయవల్ల మొదటిసారే వాళ్లు ఓడిపోయారు. పదిసార్లు ఓడిపోయినంత దెబ్బ తీసేశాము. లెక్కాజమా లేకుండా స్వదేశవీరులు రోజూ ఢిల్లీ వచ్చి పడుతున్నారు. కనక, ఈ సమయంలో మీరు అక్కడ భోజనం చేస్తూవుండకు, ఇక్కడ వచ్చి చేతులు కడగండి. రాజుల పాదసాక్షిగా సహోదరసాహా మన ఢిల్లీచక్రవర్తి మీకు స్వాగతం చెబుతున్నాడు. మీ పటాలాలకి బహూకరిస్తాడు. 'రోజేదార్లు' చెప్పులు 'అజాను' కేకకోసం ఎలా కనిపెట్టుకు వుంటారో అలా మీ సిరంగుల మోత కోసం మా చెవులు నిరీక్షిస్తున్నాయి. మీరు వచ్చేదారికేసి చాలా కాల్లా కనిపెట్టుకు చూస్తున్నాం. వచ్చెయ్యండి, సోదరులారా! వెంటనే వచ్చెయ్యండి. మాఇల్లు మీఇల్లు. వయచెయ్యండి. మీరు రాంజే లాభంలేదు. వసంతం రాంజే గులాబులు పూయవు. పాలు లేనిపాప బతకదు."

ఈ ఆహ్వానం రోహిలాఖండం సిపాయిలని తొందరపరిచిందనడానికి సందేహంలేదు. కాని అక్కడ విప్లవ నాయకుడు ఖానుబహదూరు ఖాను క్రమశిక్షణలో అందివేసినచెయ్యి. మొదటి నిశ్చయంప్రకారం మే ముప్ఫయివొకటి వరకూ ఆగవలిసిందే అని అతడి ఆదేశం. అతడి ఆజ్ఞ సుగ్రీవాజ్ఞలా సిపాయిలు పాలించారు. చివరివరకూ ఆఫీసర్లకి రవంత సందేహం కలగనివ్వలేదు. పటాలంసుబేదార్లు ఆఫీసర్ల దగ్గిరికి వెళ్లి "మీ కుటుంబాలు నైనిటాలునించి తీసుకురండి" అంటూ కోరారు. మే ముప్ఫయివొకటిని ఫిరంగిపేలేదాకా అంతబుద్ధిమంతుల్లా నడుచుకున్నారు వాళ్లు.

బ్రిటిషుజెండా చించేసి, ఆకుపచ్చజెండా ఎగరవేస్తూ, ఫిరంగిదళం సుబేదారు బక్తఖాను బరేలీ స్వాతంత్ర్యసైన్యానికి ప్రధానసేనానాయక పదవి పుచ్చుకున్నాడు. స్వరాజ్యంవచ్చాక, సిపాయిలు నడుచుకోవలిసిన విధులువివరిస్తూ ఉత్సాహకరమైన ఉపన్యాసమిచ్చాడతడు. తరవాత ఈస్వదేశీబ్రిగేడియరు బక్తఖాను,ఇంగ్లీషుబ్రిగేడియరుసిబ్బాల్డు బగ్గీమీద పురవీధుల్లో బయలుదేరాడు. అతడివెంట తక్కిన స్వదేశీ ఆఫీసర్లు వాళ్ళవాళ్ళ హోదాలప్రకారం వెనకటి ఇంగ్లీషుఆఫీసర్ల బగ్గీల మీదబయలుదేరారు. ఆకుపచ్చజెండా ముందునడిచింది. వీధుల్లోజనం విరగబడ్డారు. జయజయధ్వనులుచేశారు. ఢిల్లీపాదుషా సుబేదారుగా ఖానుబహదూరుఖాను రోహిలుఖండం పరిపాలకుడయాడు.

బరేలీ ఇంగ్లీషువాళ్ళ బంగళాలుయావత్తూ సిపాయిలు దగ్ధంచేశారు. వాళ్ళ ఆస్తులన్నీ లూటీచేశారు. చంపినంతమందినిచంపేసి, మిగిలిన వాళ్ళని ఖైదీలుగా పట్టుకున్నారు. సుబేదారు ఖానుబహదూరుఖాను ఎదటికి పట్టుకువచ్చారు. అలా పట్టుకువచ్చిన ఖైదీల్లో లెఫ్టినెంటు గవర్నరుగారి అల్లుడూ, గవర్నమెంటుకాలేజీ ప్రిన్సిపాలూ, జిల్లాజడ్జీ మొదలయినవాళ్ళున్నారు. ఖానుబహదూరుఖాను వాళ్ళని విచారణ

చేశాడు. నేరస్తులని నిర్ణయించాడు. ఉరిశిక్ష చెప్పాడు. రోహిలా ఖండం కమిషనరుమాత్రం పట్టువడలేదు; పారిపోయాడు. అతణ్ణి చంపేసికాని, ప్రాణంతోకాని పట్టితెచ్చినవాళ్ళకి వెయ్యిరూపాయలు బహుమానమిస్తామని ఖానుబహదూరుఖాను ప్రకటించాడు.

బరేలీలోమాత్రమే ఇది జరిగి ఆగిపోలేదు. రోహిలాఖండమంతటా ఒక్కసారే ప్రళయం రేగింది. బరేలీకి సరిహద్దైన మొరాదాబాదులో శాహజహాన్‌పుర ముంది. అక్కడ ఇరవై ఎనిమిదోపటాలం కాల్బల ముండేది. బరేలీలాగేఅక్కడా ముప్పయివొకటిని ఇంగ్లీషువారక్తంవరదలై పారింది. ఇంగ్లీషువాళ్ళంతా గుడిలోవున్నారు. సగంప్రార్థన లయాయి. ఇంతలో సిపాయిలు కత్తులతో పరిగెత్తారు. గుడి ఘిరాయించారు. ఈకోలాహలమేమిటని మతగురువు బైటికివచ్చాడు. అతడు బైటికి రావడమేతడవు, వొకసిపాయి అతడిచెయ్యి నరికేశాడు. ఆఉత్తర క్షణంలో ఇంగ్లీషువాళ్ళచిత్రవధ ఆరంభమైపోయింది. చేతికిదొరికిన దొర నల్లా నరికిపారేశారు. గుడిలోపలా గుడిబైటా రక్తం మడుగులుకట్టింది.

కొద్దిమందిసిపాయిలే గుడికేసి వచ్చారు. తక్కినవాళ్లు కంటో న్మెంటు దిక్కుకు పరిగెత్తారు. దొరల బంగళాలు తగల బెట్టారు. పారి పోబోయిన దొరల్ని నరికేశారు. జిల్లామేస్ట్రీటు పారిపోతూ గుడిదగ్గిరే కూలిపోయాడు. అసిస్టంటు మేస్ట్రీటు ఇంటి వరండాలో పరిగెడుతూ దొరికిపోయాడు. డాక్టరు బాలింగు సిపాయిలకి ధర్మబోధప్రారంభిం చాడు. సిపాయిలున్నా వింటూ నుంచున్నారు. ఉపన్యాసం మధ్య అతడు సిపాయిల నేదో తప్పుమాటన్నాడు. దానికి ప్రతిగా వొక సిపాయి తుపాకి పేలింది. బాలింగుతల దూసుకుపోయింది. రక్తం చిమ్ముతూ అతడిశవం కిందకూలింది.

కొందరుదొరలు పెళ్లాంపిల్లలతో దగ్గిరవున్న వొక జమీందారు బంగళాలో దూరారు. వాళ్లనిదాచడానికి జమీందారు నిరాకరిం

చాడు. దాంతో వాళ్లు మహమ్మదీ దిక్కు పారిపోయారు. కొందరు సిక్కు-సిపాయిలు వాళ్లకి సహాయంచేశారు. ఇలా సాయంకాల మయే సరికి శాహజహాంపురం స్వాధీన మయిపోయింది. ఆకుపచ్చజెండా అంబరచుంబితంగా రెపరెపలాడింది.

మురాదాబాదులోకూడా ఇదేగతి. మురాదాబాదు బరేలీకి పశ్చిమోత్తరంగా సుమారైదువందలమైళ్ళదూరంలో వుంది. అక్కడ ఇరవైతొమ్మిదోపదాతిదళమూ, కొంత శిక్షణగిడదళమూవుండేవి. ఇక్కడ సిపాయిలుకూడా మే ముప్ఫయివొకటివరకూ రహస్యసందేహం కలగకుండా మసులుకుంటూ వచ్చారు. తమ నటన బలపరచుకుంటానికి వాళ్ళకి మంచిదొక అవకాశంకూడా దొరికింది. మే పద్దెనిమిదిని మీరటుసిపాయిలు కొందరు వచ్చి మురాదాబాదు చేరిన అడివిలో మకాంవేశారని ఇంగ్లీషుఆఫీసర్లకి ఆచోటి తెలిసింది. అరాత్రి మీరటుసిపాయిలు నిద్రలో వుండగా వాళ్ళమీద దాడిచెయ్యవలిసిందని ఆఫీసర్లు ఇరవైతొమ్మిదో పటాలంసిపాయిలకి ఆజ్ఞాపించారు. విసరంతవెనకాడకుండా సిపాయిలు అదరాత్రివెళ్లి అడివిముట్టడించారు. దుపాకులు కాల్చారు. కాని వొక్కమీరటుసిపాయీదొరకలేదు. అరాత్రి అంధకారబంధురంగావుంది. విప్లవకారులు చీకటిలో పారిపోయారని ఊహించారుదొరలు. అయితే నిజమేమిటో తెలుసా? అరాత్రి అడివిలో చాడి జరిగినప్పుడు మీరటుసిపాయిలు మురాదాబాదుసిపాయిల ఇళ్ళలోనే హాయిగా నిద్రపోతున్నారు? ఏమయితేనేం, ఇరవైతొమ్మిదో పటాలం సిపాయిలు నమ్మినబంట్లని సమర్థులు ఇంగ్లీషువాళ్లు.

మే ముప్ఫయివొకటిని సిపాయిలు దమంతటతాము సమరావేశమయారు. అనుమతిలేంచే ఎందుకిలా మూగారని అడిగారు ఆఫీసర్లు.

"కుంపినీరాజ్యం కూలిపోయింది," ధాటీగా జవాబుచెప్పారు సిపాయిలు — "అంచేత మీరంతా మా దేశం వెంటనే వొదిలిపొండి.

లేదంటే మీప్రాణాలు మీకుదక్కవు. నుంచున్న పాటాన వెళ్ళలేమం టారా? రెండుగంటలు వ్యవధి తీసుకోండి. ఆ తరవాత మురాదా బాదులో ఒక్క ఇంగ్లీషువ్యక్తి అవుపించకూడదు'' అన్నారు. మురాదా బాదు పోలీసులు కూడా సిపాయిలతో చేరిపోయారు. ప్రజలూ పోలీ సులూ కలిసి ఇంగ్లీషువాళ్ళని పొమ్మన్నారు. ఇంక దిక్కేముంది! అరనిమిషం అగకండా ఇంగ్లీషువాళ్లు మురాదాబాదునించి మూటా ముల్లే కట్టుకు వెళ్ళిపోయారు. జడ్జీ, కలెక్టరూ, మేస్ట్రీటూ, సర్జనూ — వొక రేమిటి, ఇంగ్లీషువాడన్న ప్రతీవాడూ పెళ్ళాంపిల్లలతో పారిపోయాడు. కమీషనరు సాహెబూ మరికొందరూ మాత్రం పారిపోలేకపోయారు; మహమ్మదీయమతం పుచ్చుకున్నారు. పెట్టినగడువు రెండుగంటలు తర వాత మురాదాబాదులో కనపడ్డఇంగ్లీషువాడు ప్రాణాలతో దక్కలేదు. సిపాయిలు ట్రెజరీ స్వాధీనపరుచుకున్నారు. అటు పడమటని ఎర్రటి సూర్యబింబం వాలిపోతూవుంటే, ఇటు మురాదాబాదులో అకుపచ్చ జెండా గాలిలో రెపరెపలాడుతూ వేచింది.

మర్నాడు వొకటో తేదీని బదయూం జిల్లాకూడా ఇంగ్లీషువాళ్ళని తరిమేసింది. ఖానుబహదూరుఖాను పరిపాలనకిందికి వచ్చేసింది. బద యూంపట్నం బరేలీకి షాహాజహాంపురానికీ మధ్యగా వుంది. ఈజిల్లాలో చిరకాలంనాటి జమీందారులూ, ప్రజలూ కుంపినీ విధించిన పన్నుల భారంతో కుంగిపోతూ వుండేవాళ్లు. ఎంతట ఈపీడ వొదులుతుందా అని సమయంకోసం ఎదురుచూస్తూవుండేవాళ్లు. బరేలీ స్వాధీనమయిన వార్త అవాళఉదయమే బదయూం చేరింది. సాయంకాలమయేసరికి ప్రళయంమంచుకువచ్చింది. అక్కడ ప్రమాదంవస్తుందని ముందే పసి కట్టాడు జిల్లామేస్ట్రీటు ఎడ్వర్డ్సు. పటాలం సహాయం పంపవలసిందని బరేలీఅధికార్లకి రాశాడు. సహాయానికిబదులు దుర్వార్తే అతడి కందింది.

సాయంకాల మయింది. ప్రజలూ, పోలీసులూ, ట్రెజరీకాస్తున్న సిపాయిలూ వొక్కసారి లేచారు. "కుంపినీరాజ్యం కూలిపోయింది." అంటూ పట్టణమంతా దండోరా వేయించారు. సిపాయిలు ట్రెజరీ దోచుకున్నారు. ఢిల్లీ బయలుదేరారు.

ఇంగ్లీషు ఆఫీసర్లు యావన్మందీ కుటుంబాలతో అడవులికి పారిపోయారు. ఎంతోమంది అక్కడా ఇక్కడా పడి చచ్చిపోయారు. కొంత మంది జాలికల నేటివుల కొంపల్లో తలదాచుకున్నారు.

ఇలా వొక్క రెండుదినాల్లో రోహిలాఖండం యావత్తూ స్వాధీన మైపోయింది. ఖానుబహదూరుఖాను పాలనకిందికి వచ్చేసింది. సిపాయిలు బఖ్తఖాను నాయకత్వంకింద ఢిల్లీవచ్చేశారు. ఖానుబహదూరు ఖాను రాజ్యరక్షణకోసం ప్రజలతో కొత్తపటాలం ఏర్పాటుచేశాడు. ఆఫీసులూ, పోలీసు స్టేషనులూ, అన్నీ యథావిధిగా నడిచాయి. ఆఫీసర్లు మాత్రం ఇంగ్లీషువాళ్లకిబదులు నేటివులు. ప్రభుత్వకార్యాలయాలన్నిటిమీదా ఇంగ్లీషు జెండాలకి బదులు ఆకుపచ్చజెండాలు ఎగిరాయి. శాంతిరక్షణకి భంగంలేకుండా ఖానుబహదూరుఖాను రాజ్యమంతటా చక్కని ఏర్పాట్లు చేశాడు. పన్నులు ఢిల్లీపాదుషా పేర వసూలుచేయడం ప్రారంభించాడు. రోహిలాఖండం సవాబుగా అతడు చారిత్రకప్రసిద్ధమయిన వొక ప్రకటన చేశాడు:

"హిందూదేశ వాస్తవ్యులారా! చిరకాలంనించీ ఎదురుచూసిన పవిత్రస్వరాజ్యం వచ్చేసింది. ఇది మీరు స్వీకరిస్తారా? వొదిలేస్తారా? ఈ అవకాశం వినియోగించుకుంటారా? జారవిడుస్తారా? హిందూ మహమ్మదీయ సోదరులారా! మీరందరూ తెలుసుకోవాలి, ఇంగ్లీషు వాళ్లని ఈ దేశంలో వుండనిచ్చామో, మన యావన్మందినీ చిత్రవధ చేస్తారు. మనమతం సర్వనాశనంచేసి వొదిలిపెడతారు. భారతీయులు ఎంతకాలంనించో ఇంగ్లీషువాళ్లచేత దగా పడ్డారు. తమ కత్తులతోనే

తమ గొంతుకలు కోసుకున్నారు. ఈ దేశద్రోహానికి, ఈ పాపానికి ప్రాయశ్చిత్తం జరగాలి. ఇప్పుడుకూడా ఇంగ్లీషువాళ్లు తమ పాత మోసం ప్రయోగిస్తారు. హిందువులమీదికి మహమ్మదీయుల్ని ఉరి కొలుపుతారు. మహమ్మదీయులమీదికి హిందువుల్ని ఉసిగొలుపు తారు. కాని హిందూసోదరులారా! వాళ్లవలలో పడకండి. మీరు బుద్ధిమంతులు. ఇంగ్లీషువాళ్లు తమ వాగ్దానా లెన్నడూ నిలబెట్టుకో రని మీకు వేరే చెప్పనక్కరలేదు. సక్కజిత్తులలోనూ, దగా విద్య లోనూ వాళ్లు సిద్ధహస్తులు; ఆరితేరినవాళ్లు. తమ మతంతప్ప ప్రపం చంలోని తక్కినమతాలన్నీ దుంపనాశనం చెయ్యడమే వాళ్లసంకల్పం. దత్తతచేసుకునేహక్కు వాళ్లు రద్దుచెయ్యలేదా? మన రాజుల రాజ్యాలూ, దేశాలూ దిగమింగలేదా? నాగపుంరాజ్యం ఎవరు చవాయించారు? లక్నో రాజ్యం ఎవరు అపహరించారు? హిందువుల్ని, మహమ్మదీయుల్ని ఎవరు కాలికింద తొక్కిపెట్టారు? ముసల్మానులారా! మీరు ఖురాను గౌరవిస్తూవుంటే – హిందువులారా, మీరు గోమాతని గౌరవిస్తూవుంటే -- మీ చిన్నచిన్న విభేదాలు మీరు సరిచేసుకోండి. ఈ పవిత్రయుద్ధంలో చేతులు కలపండి. రణ రంగానికి పురకండి. ఒక్కజెండాకింద పోరాడండి. రక్తసిక్తులు పారిం చండి. ఇంగ్లీషువాళ్లపేరు హిందూదేశంలోంచి తుడిచిపారెయ్యండి. హిందువులు ఈ యుద్ధంలో మహమ్మదీయులతో బుజాలుకలిపితే, స్వరాజ్యంలో వాళ్లదేశభక్తికి బహూకరణంగా గోహత్య ఆగిపోతుంది. ఈ పవిత్రసమరంలో పోరాడినవాళ్లూ, లేదా ధనరూపంగా సహాయ పడినవాళ్లూ ఇహంలోనూ, పరంలోనూకూడా సుఖపడతారు. అలా కాక, వ్యతిరేకించినవాళ్లు తమతల తామే బద్దలుకొట్టుకున్న ఆత్మ హత్యా పాతకం అనుభవిస్తారు.''

కాశీ

మే ముప్ఫయివొకటిని కాశీ పటాలంబారక్సులో అగ్గి ముట్టుకుంది. ఇంగ్లీషుకంటోన్మెంటు పట్నానికి మూడుమైళ్లుదూరంలో సికరోలీ దగ్గర వుంది. పటాలమూ, కచేరీలూ, గుడీ, గవర్న మెంటు ఆస్పత్రీ, జైలూ, కాలేజీ — అన్నీ ఇక్కడే వున్నాయి. పటాలంలో ముప్ఫయిమూడో నేటీవుపదాతిదళమూ లూఫియానా సిక్కురెజిమెంటూ ఫిరంగిదళమూ వుండేవి. ఫిరంగిదళం ప్రత్యేకం తెల్లసిపాయిల చేతిలో వుండేది. నేటీవుపదాతి దళం సిపాయిలు రెండువేలమంది వుండేవాళ్లు. తెల్లసిపాయిలు ముప్ఫయిమంది.

కుంపినీవాళ్లు రాజ్యాలూ, జాగీరులూ అపహరించిన రాజకుటుంబాలు ఢిల్లీ, పూనా, నాగపురం మొదలైన చోట్లనించి వచ్చి, తమ చివరిజీవితం కాశీలో గడుపుతూ వుండేవాళ్లు. తెల్లనారితే వీళ్లు మసీదుల్లోనూ, దేవాలయాల్లోనూ, ఇంగ్లీషురాజ్యం అస్థమించాలంటూ ప్రార్థనలు చేసేవాళ్లు. రహస్య సంఘాలు ఏర్పడి ప్రజల్ని ప్రబోధిస్తూ వుండేవి. ఎంతోమంది విప్లవప్రచారకులు సిపాయిలని రెచ్చగొడుతూ వుండేవాళ్లు. మే మాసం రాగానే విప్లవప్రకటనలు పట్నం గోడలమీదా, బహిరంగస్థలాల్లోనూ — ఎక్కడపడితే అక్కడ ప్రత్యక్ష మయ్యాయి. మతగురువులు బహిరంగంగా ప్రార్థన సభలు జరిపి "కుంపినీరాజ్యం నశించిపోవాలి" అంటూ ప్రార్థనలు జరిపారు. గంగానదిలో తర్పణాలు విడిచారు. ప్రజలూ సిపాయిలూ ఎప్పుడంటే ఎప్పుడంటూ సమయంకోసం నిరీక్షించడం మొదలు పెట్టారు.

మీరట్‌లో ముందుగా అగ్నిపర్వతం బద్దలుకావడమూ, మరి మూడునాలుగు వారాలవరకూ దేశం ముందూ వెనకలాడడమూ — కుంపినీ

వాళ్లు జాగ్రత్తపడిందుకి అనేక చోట్ల అవకాశమిచ్చింది. కాశీలో అది బాగా ప్రత్యేక్షమయింది. మీరటువార్ అనడంతోనే కాశీలో ఆఫీసర్లు బాగా జల్లుకున్నారు. చీఫ్ కమీషనరు టక్కర్, జడ్జీ గిబ్బన్సూ, మేస్ట్రీటు లిండూ, కెప్టెను ఆల్ఫ్రెడ్సూ, కల్నలు గార్డనూ మొగల వంశ వాళ్లు ముందుగా తీసుకోవలిసిన జాగ్రత్తలన్నీ తీసుకున్నారు. సిక్కులూ, కొంతమంది ధనవంతులూ, చైతుసింగు ఉద్యోగాధికారి రాజ్యంలేని కాశీరాజూ నీళ్లకి మద్దతిచ్చారు. తమ రంజీత్‌సింగు రాజసీపడరానిపాట్లుపెట్టిన కుంపిసీ ప్రకారన్వం సిక్కులీయులు వదిచిపోతే బోతూరు, బారను హేస్టింగ్సును చైతుసింగును పెట్టిన అవస్థలూనూ పిసరంత గుర్తుకిరాలేదు కాశీరాజుకి! ఎవరేంచేసినా, ప్రజలూ సిపాయిలూ విప్లవానికి సిద్ధమవుతూనే వున్నారు. ఇంతలో ఆకలుగుడ్లు సించి మార్తవచ్చింది - అక్కడ విస్ఫోటం విజృంభించింది. ఎదమేటో నేటివుపటాలు సుకెక్కడ పుడతాడేది. మే మధ్యకాలం వొకటినించీ అక్కడ అలజడి ఆరంభమయింది.

అవాధ జూను మాసం. రాత్రి మొగల నిది. ఇంగ్లీషుఆఫీసర్లు అజముగడ్డ స్టబ్బులో భోజనాలుచేస్తున్నారు. పటాలం బారక్కులో తుపాకి ధ్వని మనిపేలింది. దొరలగుండెలు గుభిల్లుమన్నాయి. నిలబ్బ నించి దొరలూ, దొరసానులూ పిల్లలతోకూడా సిపోయిమక్కు పరిగెత్తారు. అక్కడ జిల్లామేస్ట్రీటు వీళ్లందరినీ నొక్కనగ్గిర చేర్చాడు. కాని ఎవళ్ళబొందెలోనూ ప్రాణాలు లేవు. ఇంతలో సిపాయిలు బెట్టెక్కెటు హచిన్సనునీ, క్వార్టర్లరుసార్జెంటు లెవీసునీ చంపేశారు. అంతే, అక్కడునీ తప్ప మరెవళ్ళనీ చంపలేదు. ఇంగ్లీషువాళ్ళ ధైర్యంచూసి నిబిడిరి చాపు వాళ్ళు. భద్రంగా వూళ్ళోంచి కాశీపంపించేశారు. బళ్లుగిళ్లూ కూడిచ్చిపెట్టారు. చేతచిక్కిన శత్రువునికూడా క్షమించగలరు భారతీయులని రుజువుచేశారు.

ఆ సమయంలో గోరఖపురంనించి అయిదులక్షల రూపాయలు కుంపినీధనం కాశీకిపట్టుకు బయలుదేరాడు లెఫ్టినెంటు పాలిసరు. ఆజముగడంవచ్చి, అక్కడినించి రెండులక్షలుచేర్చి, ఏడులక్షలూ కాశీచేర్చాలతడు. ఆజముగడం సిపాయిలకి తెలిసిందిది. ఆఏడులక్షలూ దోచుకున్నారు. ధనంపట్టుకు తిరిగివచ్చేసరికి ఆజముగడంలో ఇంగ్లీషువాడన్నవాడు అవుపడలేదు. సిపాయిలు ఆనందంతో జయజయధ్వనులు చేశారు. కచేరీలమీదా, జైలుమీదా ఆకుపచ్చజెండాలు కట్టారు. ఆరాత్రికిరాత్రే ఇదంతా జరిగిపోయింది. తెల్లవారాక సిపాయిలు పెద్దఉత్సవం తీశారు. ఏడులక్షలూపట్టుకుని ఫైజాబాదు పయనమయ్యారు. సిపాయిలతో పోలీసులున్నూ కలిశారు.

ఆజముగడంవార్త జూను నాలుగున కాశీచేరింది. అవాళే సికరోలీ నేటివుసిపాయిల ఆయుధాలు లాక్కోవాలని ఆఫీసర్లు నిశ్చయించారు. ముప్ఫయిఏడోపటాలంసేనాని మేజరు వాలెటు తన సిపాయిలంటే ప్రాణం పెట్టేవాడు. వాళ్ళఆయుధాలు లాక్కోడాని కతడు ఇష్టపడలేదు. కాని లాభం లేకపోయింది. ప్రధానసేనాపతిఆజ్ఞతప్పనిసరిఅయింది.

సాయంకాలమయింది. కవాతుమైదానంమీద తెల్లసిపాయిలూ, ఫిరంగులూ సిద్ధంచేశారు. నాలుగువందల డబ్భయినలుగురు నేటీవు సిపాయిలని తీసుకువచ్చినిలబెట్టారు. తుపాకులు కిందపెట్టమన్నారు. సిపాయిలు మొదట తుపాకులు పెట్టేశారు. కాని ఎదురుగుండా ఫిరంగులు చూసేసరికి అసలువిషయం బోధపడింది. తుపాకులు లాక్కుని, ఫిరంగులకి బలివేస్తారని గ్రహించారు. కిందపెట్టిన తుపాకులు వెంటనే పట్టుకున్నారు. ఆఫీసర్లమీద గురిపెట్టారు. గుళ్ళవర్షంకురిపించారు. ఇంతలో మిగిలినసిపాయిలున్నూ వచ్చికలిశారు.

ఇంగ్లీషుసిపాయిలకీ నేటీవుసిపాయిలకీ యుద్ధంజరిగింది. ఈలోగా మేజరు వాలెటుకి ప్రమాదంలేకుండా నేటీవుసిపాయిలే భద్రమైనచోటికి

చేర్చారు. శత్రుపక్షంలోవున్నాసరే, అతడి మంచితనం మరిచిపోలేదు వాళ్ళు. ఇంతలో సిక్కు-పటాలం రంగంమీద ప్రత్యక్షమయింది.

సిక్కు-సిపాయిలు ఇంగ్లీషువాళ్ళసహాయంకోసమే వచ్చారు. కాని ఎవరు శత్రువులో ఎవరు మిత్రులో ఇంగ్లీషువాళ్ళకి అర్థంకాలేదు. నేటివు సిపాయిలమీదా సిక్కు-సిపాయిలమీదా వాళ్ళు గుళ్ళవర్షం కురిపించారు. విధిలేక సిక్కు-లున్నూ ఇంగ్లీషువాళ్ళమీద తుపాకులుకాల్చారు. 1857 స్వాతంత్ర్యసమరంలో ఈవొక్కసారే సిక్కు-లు హిందువులతోనూ, మహమ్మదీయులతోనూ కలిసి ఇంగ్లీషువాళ్ళతో పోరాడారు.

ఇక్కడ ఇలా యుద్ధం జరుగుతూనే వుంది. అటు ఇంగ్లీషువాళ్లు పిల్లాపిచ్చికా పట్టుకుని చెట్లోపిట్టయి పరిగెత్తారు. పట్నంప్రజలువచ్చి విరుచుకుపడతారని భయం!

కుంపినీఖజానాలో లక్షలు లక్షలు రూపాయలున్నాయి. అంతే కాదు, లాహోరుకోటలో దోచుకున్నరంజిత్సింగుసంపత్తీ, రంజిత్సింగు రాణీ జవహరీకూడా అక్కడేవుంది. ఇవన్నీ విప్లవకారుల చేతిలో పడకండా కుంపినీకోసం ఎవరుకాపాడారో తెలుసా? ఇంగ్లీషువాళ్లు కాదు; సిక్కు-లు. సిక్కు-లే ఇంగ్లీషువాళ్ళకి పెట్టనికోటలా నిలబడ్డారు. భయభ్రాంతులవుతూవున్న ఇంగ్లీషువాళ్లకి ముసిలి సిక్కు-పీరుడు సర్దారు సూరతుసింగు ధైర్యం చెప్పాడు. ట్రెజరీ రక్షణభారం తనమీదపెట్టుకున్నాడు. రెండోసిక్కు-యుద్ధంలో రంజిత్సింగురాజ్యం డల్హౌసీ కలిపేసుకున్నాక, ఈ సూరత్సింగు కుంపినీవాళ్ల ఖైదీగా కాశీ వచ్చాడు. అయితేనేం, ముసిలికాలంలో అదంతా మరిచిపోయాడు. రాజభక్తుడై, కుంపినీకోసం తుపాకి భుజాన వేసుకున్నాడు! సిక్కు-ల సహాయంతో కాశీట్రెజరీలోని రూపాయలూ, రంజిత్సింగురాణీ రత్నరాసులూ ఇంగ్లీషువాళ్లు భద్రమైనచోటికి తీసుకుపోయారు. ఈ సమ

యంలో గోకులచంద్ అనివాడు కాశీసంస్థానమును కూడా ఇంగ్లీషువాళ్ళకి తోడ్పడ్డాడు. కాశీరాజు చెప్పనే అక్కరలేదు. వీరు సన్యాశక్తులూ ఇంగ్లీషువాళ్ళకోసమే నిలిచోగించారు. కాశీప్రజలుచూస్తారం విస్తన కాపులతోనే కలిశారు.

కాశీవిస్ఫోటం జేవమందరూ గుర్తుంచుకుంది. అక్కడసిపాయిలు జుల్లా అంతటా సర్దుకున్నారు; విస్తవాళ్ళని ముట్టడించారు. పరాన్నము దొరకపు రం లేచింది. దొరపురం కాశీకి పశ్చిమోత్తరంగా గోమతీనది వొడ్డుస ముప్పయి మైళ్ళు దూరంలో వుంది. 1775 లో ఇది ఇంబనీ వశమ యింది. ఇక్కడ పెద్ద దాతికోట వుంది. అందులో ఖజానాని పెట్టుకుని వుండేవాళ్ళు. అప్పుడు పరులాలలో ధన మూర్తిలాటికి సంబా అక్కనై వుంది లూధియానా సిక్కసిపాయి లుండేవాళ్ళు. వాళ్ళిటూ లెఫ్టి నెంటు మహారా ఆధీనములో వుండేవాడు.

అజముగడ్డం, కాశీసంగతాలు విస్తవులకి దొరపురం వచ్చింది. అంత వరకూ సిక్కసిపాయిలు చలను చేసిందే పున్నాగు. వాని కాశీలో సిక్కులమీద ఏదంగులు కూడబ్బినప్పటి వార్త వాళ్ళని ఉన్మత్తుల్ని చేసింది. ఇంతలో కాశీసిపాయిలు నిన్నూన్నారన్న వార్త వ్యాపించింది. ఇంగ్లీషు ఆధీనంకి వెళ్ళకుండా చేసినట్లు పుట్టుకువచ్చింది. సిక్కసిపాయిలకి రాజభక్తి బోధించడానికి పురాణకున్నారు వాళ్ళు. నిజంగా కాశీ గుర్రపు దొరలు పురాళ్ళోకి వచ్చేశారు. బాయంటు మేస్టర్లు కుప్పాజు ఉపన్యాసం ప్రారంభించాడు. ప్రొద్దేళ్లోంచి తుపాక ధ్వని వుంది. కుప్పాజు కూలిపోయాడు. సేనాపతి మహారా కచేరీ గుమ్మంలో నుంచున్నాడు. ఎక్కడినించో వొక గుండు గుభీమంది. మహారా గుండెలు చీకుపోయింది. ముసిలి డిప్టీకలెక్టరు వీధిలోకి పరిగెడుతున్నాడు. ఒక గుర్రపుదొరు అప్పుడే వెంబడించాడు. వీధిలోనే ఎవరో అడిచారు. — "ఆదమను మంచినాడు. వొంటి లెయ్యండి" అని.

"వీల్లేదు. వీడు ఇంగ్లీషువాడు." అన్నాడు కౌతు. అతడి నోట్లోమాట నోట్లోనేవుండి. ముసిలి కలెక్టరు శవం కింద మూలిగింది.

అంతతో ఈ వేట ఆగింది. మిగిలిన ఇంగ్లీషువాళ్ళని వూరువొదలి పొమ్మన్నారు సిపాయిలు. అంతవరకూ ఇంగ్లీషువాళ్ళు కచేరీలో దాగున్నారు. సిపాయిలు పొమ్మనడమే తడువు, మూటాముల్లే పట్టుకుని, ఎడ్లబళ్ళమీదా, కాలినడకనీ వెళ్ళి, గోమతీనదిదాటి కరారగ్రామం చేరుకున్నారు. దాన్లో మూడొంతులు చచ్చిపోయింది. కరార గ్రామంలో హిందుస్థానీలు అని వొక సంపన్నుడైన గృహస్థు వుండేవాడు. ధర్మాత్ముడూ, ఉత్తముడనీ కానడించేత ప్రజలంతా ఇతన్ని మన్నించే వాళ్లు. ప్రాణభయంతో పారిపోవచ్చిన ఇంగ్లీషువాళ్లని హిందుస్థానీలు తనయింట ఆశ్రయమిచ్చాడు. భోజనాదికాలు ఏర్పరిచాడు. సాయుధులయిన తనసేవకులు ఇంగ్లీషువాళ్ళమీద ఈగనాన్నా వాలకుండా కాపాడాడు. హిందుస్థానీలు నాథుణ్ణి గమనించి విప్లవకారులనూ ఆయన చేయిదాటి అనలేదు. తరవాత కాశీకమిషనరు తెల్లసిపాయిల సహాయంతో అక్కడి ఇంగ్లీషువాళ్ళని కాశీచేర్చాడు. తరవాత ఇంగ్లీషు వాళ్లు హిందుస్థానీలకి డిప్లొమేస్టీటు పదవిఇచ్చి గౌరవించారు. ఆయన జీవితపర్యంతమూ, అనంతరమూకూడా ఆయనకి సన్మానాలు చేశారు.

ఖజానాలో చిల్లిగవ్వలేదు. అన్నీ సిపాయిలు దోచుకున్నారు. ఖజానాలో అక్కడక్కడ జెండా ప్రతిష్ఠించారు.

ఇలా కాశీమండలం యావత్తూ విప్లవాగ్ని విజృంభించింది. విప్లవకారులు కలెక్టరీలు దోచుకున్నారు. కుటీరాభిమానులు తెగ గొట్టారు. జైలుఖైదీలు పూడిచేశారు. తెల్లదొరల ఉపకుర్చీలు మడుగులు కట్టించారు. వాళ్లకొంపలు తగలబెట్టారు. జమీందారులూ, సిపాయిలూ, పోలీసులూ – యావన్మందీ ఈ రణయజ్ఞంలో పాల్గొన్నారు.

కాశీలో కోటేశ్వర్ల గృహాలు సోదాచేసినప్పుడు వందలకొద్దీ కత్తులు బైలుపడ్డాయి. రహస్యసంఘం విప్లవనాయకుల ఉత్తరాలు దొరికాయి. ఈ ఉత్తరాలన్నిటిలోనూ "మహానాయకుడు" అని సంతకాలుండేవి. ఎవరీ మహానాయకుడు? ఉత్తరా లందుకున్న వాళ్లకిమాత్రమే అది తెలుసు. ఒక ఉత్తరంలో ఇలా వుంది – "కాశీప్రజలు వెంటనే విజృంభించాలి. గిబ్బన్నూ, లిండూ మొదలైన ఇంగ్లీషు వాళ్లని చంపెయ్యండి. ఈ పనికోసం అవసరమయిన ధనం ఫలానా బ్యాంకరు ఇస్తాము." ఈ బ్యాంకరు ఇంట్లో రెండువందల కత్తులు దొరికాయి.

కుంపినీరాజ్యం కూలదొయ్యడమే కాదు, విప్లవకారులు చేసిన పని, ఇంగ్లీషువాళ్లు దరిమిలా కూచోబెట్టిన జమిందార్లనీ వాళ్లు తొలిగించారు. వాళ్లస్థానే పాతజమిందార్ల వారసుల్ని గద్దె లెక్కించారు.

అలహాబాదు

అవాళ జూను ఆరో తేది. రాత్రి తొమ్మిదిగంటలయింది. ఇంగ్లీషు వాళ్లు భోజనాలు చేస్తున్నారు. హఠాత్తుగా వొక 'బిగులు' నిశ్శబ్దం చీల్చుకుంటూ వినపడింది. ఇంగ్లీషువాళ్ల గుండెల్లో సిపుగుపడింది. సిపాయిల విప్లవానికి సంకేత మాబిగులు.

అలహాబాదుపట్నం అనేకవిధాల ఢిల్లీ, పంజాబు, కలకత్తాలకి కీలకస్థానంలో వుంది. అన్నిమార్గాలూ ఇక్కడ కలుస్తాయి. గంగా యమునల సంగమస్థానంలో అక్బరు కట్టిన బ్రహ్మాండమైనకోట సుప్రసిద్ధమైంది. పురాణప్రసిద్ధమైన అక్షయవటం ఈకోటలోనే వుంది.

కోటకి నాలుగుమైళ్లదూరంలో పటాలంబారక్సు వుంది. జూను మాసారంభంలో ఇక్కడ ఆరో నేటీవుపటాలమూ, ఫిరంగిదళమూ, రెండువందలమంది ఫిరోజపురం శిక్కుసిపాయిలూ వుండేవాళ్లు. ఆరో నేటీవు పటాలంలో అయోధ్యా, బీహారుల సిపాయిలు అధికంగా

వుండేవాళ్లు. అనేకయుద్ధాల్లో ఇంగ్లీషువాళ్లకి విజయం తెచ్చిపెట్టిన సిపాయిలు వీళ్లు. అంచేత ఖజానాకాపలాకి వీళ్లనే నియమించారు. వీళ్లుకాక, అయోధ్యనించి వొక గుర్రపుదళంకూడా తీసుకువచ్చారు. ఆఫీసర్లు తప్పిస్తే, తెల్లసైనికులుమాత్రం ఎవ్వరూ లేరిక్కడ.

కోటలో ఎంతోఅంత మందుగుండుసామా నుంది. ఖజానాలో ముప్పయిలక్షల రూపాయ లున్నాయి. ఆదినించీ ఆలహాబాదులో విప్లవప్రచారం అమితంగా జరిగింది. మహమ్మదీయ మౌల్వీలూ, హిందూపండాలూ అవిరామంగా రహస్యప్రచారం చేశారు. చిన్నా పెద్దా సర్కారు ఉద్యోగులున్నూ విప్లవసంఘంలో చేరారు.

మీరటులో విప్లవ మారంభ మయినప్పటినించీ అలహాబాదు మండలమంతా అట్టుడికినట్లు లోపల్లోపల వుడికిపోతూ వుండేది. కాశీ కల్లోలంతో అది మరింత వుడుకుమీరింది. ఆదినాల్లోనే బజార్లో ప్రతీదీ రెండింతలు మూడింతలు ధర పెరిగిపోయింది. దీనంతటికీ కుంపినీ వాళ్లమహిమే అని భావించారు జనం. అంచేత వాళ్లు మరింత కోపోద్రిక్తులయారు. ప్రజలూ, సిపాయిలూ వొక్కసారి తిరగబడాలని సంకల్పించుకున్నారు. ఇంతలో కాశీవార్త దావాగ్నిలా వచ్చిపడింది. కాశీ సిపాయిలు అలహాబాదు వచ్చిపడుతున్నారని పుకార్లు పుట్టాయి. అలహాబాదు దొరల్లో అలజడికలిగింది. అయితో తేదీని ఇంగ్లీషువాళ్లు ఎంతోమంది కోటలోకి పారిపోవచ్చారు. రక్షణకోసం సిక్కుసిపాయిల్ని నియమించారు.

కాశీనించి అలహాబాదు రావాలంటే దారాగంజిదగ్గిర గంగానది మీద వొక పడవ వంతెనమాత్రముంది. కాశీ సిపాయిలు రాకండా ఈ వంతెనదగ్గిర రెండు ఫిరంగులు పెట్టారు అలహాబాదు ఆఫీసర్లు. ఆరోపటాలం సిపాయిలని కొందరిని అక్కడ కాపలావేశారు. వంతెనకీ పటాలంబారక్కుకీ మధ్య గుర్రపుదళం పెట్టారు.

ఆరోతేదీరాత్రి బిగులుమోగడంతోనే వంతెనదగ్గిర కాపలావున్న సిపాయిలే ఓంప్రథమంగా విప్లవ మారంభించారు. ఈ సిపాయిలే అవాళ ఉదయం ఆఫీసర్లు తమని చూసిందికి వచ్చినప్పుడు వాళ్లని గుండెలకద్దుకున్నారు. ఈ సిపాయిలే ఢిల్లీవిప్లవం విని, అధికార్ల దగ్గిరికి వెళ్లి, "మమ్మల్ని ఢిల్లీ పంపండి. విప్లవకారుల్ని చించి చెండాడ తాం" అన్నారు. ఈ సిపాయిలే ఇప్పుడు స్వరాజ్యంకోసం తెల్లి దొరల్ని మాతృభూమికి బలివెయ్యడానికి కత్తికట్టారు!

బిగులు మోగడంతోనే సిపాయిలు "హరోంహరా" అంటూ తుపాకులూ, కత్తులూ పట్టుకుని విరుచుకుపడ్డారు. వెన్నెల విప్లవకారు లికి మరింత తోడ్పడింది. తుపాకులూ, కేకలూ రాత్రిరాత్రంతా అలహాబాదుపట్నం గింగురుమనిపోయింది.

విప్లవకార్ల నెదిరించడానికి గుర్రపుదళం తీసుకుని ఇద్దరు ఆఫీసర్లు లెఫ్టినెంటు అలెగ్జాండరూ, లెఫ్టినెంటు హార్వార్డ్లూ బయలు దేరారు. ఆజ్ఞాపించడమేతడువుగా తుపాకులేసుకు సిద్ధమయ్యారు రౌతులు. విప్లవ కారులు ఎదురయారు. కొట్టండంటూ ఆజ్ఞాపించారు ఆఫీసర్లు. నోట్లో మాట నోట్లోనేవుంది. రివ్వుమని వొక తుపాకిగుండు వచ్చింది. అలె గ్జాండరు గుండెలు దూసుకుపోయింది. అతడు వొరిగాడోలేదో అతడి శరీరం ముక్కలు ముక్కలు చేసేశారు సిపాయిలు. "మారో ఫరం గీకో!" అంటే, "మారో ఫరంగీకో" అంటూ అరిచారు రౌతులు. ఇంకేముంది? కాల్బలమూ, గుర్రపుదళమూ వొకటే అయిపోయాయి. కనపడ్డ ఇంగ్లీషువాణ్ణల్లా కడతేర్చడం ప్రారంభించాయి.

ఆఫీసర్లు స్లంకెట్టూ, స్టివార్డ్లూ, హాలిసూ, ఫ్రింగిలూ, మర్రో, బిర్చీ, ఇన్ను – వొక్కొక్కడూ హతమైపోయాడు. కవాతు మైదానంలో బంగళాలూ, దొరలకొంపలూ పరశురామప్రీతి అయిపోయాయి. దారాగంజి వంతెనదగ్గిర పెట్టిన రెండు ఫిరంగులూ తమబారక్సు

దగ్గిరికి తెచ్చేసుకున్నారు సిపాయిలు. వాళ్ళ పటాలం సేనాని కల్నలు సిమ్సను విని వాళ్లని ప్రశ్నించాడు – "ఎవరి ఆజ్ఞమీద ఫిరంగులు తెచ్చారు?"

ఇద్దరు సిపాయిలు జవాబు చెప్పారు – నోటితోకాదు, తుపాకుల్తో. సిమ్సనుదొరకి దెబ్బేమో తగల్లేదు. అతడు గుర్రంమీద కోటలోకి అదే దాడు తీశాడు. అంతోనే మగోసిపాయి ధాం మనిపించాడు. ఈ సారి గుర్రానికిదెబ్బతగిలింది. అయితేనేం కోటద్వారం లోపలిదాకా యజమానిని మోసుకువెళ్ళి అక్కడ పడిపోయింది గుర్రం. సిమ్సను లోపల దూరిపోయాడు; బతికిపోయాడు.

కోటలో అరోహటాలంసిపాయిలు ఇంకా ఎంతోమంది వున్నారు. సిక్కుసిపాయిలూ వున్నారు. ఫిరంగులనిర్వహించేవాళ్ళు ఇంగ్లీషుఆఫీసర్లు సిద్ధంగా వున్నారు. లోపలికిరాగానే సిమ్సను సిక్కులమద్దత్తుతో నేటివుసిపాయిల ఆయుధాలు లాక్కోవడ మారంభించాడు. అటు ఫిరంగులూ, ఇటు సిక్కులూ – చేసేదిలేక, తుపాకులూఅవీ సిపాయిలు కింద పెట్టేశారు. తలవొంచుకుని కోటలోంచి బైటికి వచ్చేశారు. బైట తమ సోదర లతో కలిసివిప్లవంలో పాల్గొన్నారు.

సిక్కులే అప్పుడు తటస్థంగా వుంటే, అలహాబాదుకోట విప్లవ కార్ల స్వాధీన మయిపోయేది. కోటమించి యూనియనుజాకు దిగి పోయేది. ఆకుపచ్చజెండా ఎగిరివుండేది.

కోటమీదేమో బ్రిటిషుజెండా వుండిపోయింది. కోటలోని దొరలూ దొరసానులూ వుండిపోయారు. కాని పట్నంలోమాత్రం విప్లవం ప్రచండరూపంలో ప్రత్యక్షమయింది. ప్రజలూ, సిపాయిలూ వొక్కటైపోయారు. "హరహరమహాదేవ", "దీన్‌దీన్" కేకలు ఇన్నాళ్ళనూ ఏకంచేశాయి. ఆకలిస్ఫులుల్లాగ నూళ్ళో ఇంగ్లీషువాళ్ళ

మీద పడ్డారు. నెత్తురునదులు పారించారు. వాళ్ళ యావదాస్తులూ కొల్లగొట్టారు. వాళ్ళ బంగళాలు నిప్పంటించారు. క్రైస్తవులకొంపలూ, దుకాణాలూ దోచుకున్నారు; తగలబెట్టారు. జైలుతలుపులు విరగ్గొట్టారు. ఖైదీలని విడిపించారు. వాళ్ళ బేడీలు పగలగొట్టారు. కొలిగ్రాఫుతీగెలు తెగగొట్టారు. రైలుపట్టాలు వూడపెరికారు. రైలుఇంజనులు విరగ్గొట్టారు. పోలీసుస్టేషనుమీదా, కచేరీలమీదా ఆకుపచ్చ జెండా ప్రతిష్ఠించారు. ఏడో తేదీని పట్టపగలు ఖజానాకొట్టుతలుపులు పగలగొట్టారు. ముప్ఫయిలక్షలరూపాయిలూ ఎవరుమొయ్యగలిగినన్ని వాళ్లు మోసుకుపోయారు. వెయ్యేసిరూపాయిలసంచులు తలామూడేసి నాలుగేసి బుజాలమీద వేసుకుపోయారు. కోటలోతప్పిస్తే బైటవొక్క ఇంగ్లీషువ్యక్తి లేకండాచేశారు. ఉద్యోగాలనించి విశ్రాంతి తీసుకుంటూ వున్న ముసిలిపటాలంసిపాయిలు కూడా పండుమీసాలు మెలిపెట్టారు. విప్లవంలో వురికారు.

పట్నంలోనేకాదు, అలహాబాదుమండలం యావత్తూ విప్లవం భుగభుగలాడింది. తాలూకాదార్లూ, జమీందార్లూ, మార్వాడీలూ, వర్తకులూ – హిందువులూ, మహమ్మదీయులూ యావన్మందీ ప్యాగున్నారు. రైతులు నాగళ్ళుపారేసి ఆకుపచ్చజెండా పట్టుకున్నారు. చిన్నచిన్నపిల్లలూ జెండాలతో వూరేగారు.

గంగాయమునల మధ్యప్రదేశమంతటా ఆంగ్లప్రభుత్వం అస్తమించింది. చిన్నదీవిలాగ, వొక జైలులాగ కోటమాత్రం మిగిలిపోయింది. అలా నాలుగైదునాలు గడిచాయి. దేశంలో అరాజకం రాకండా ప్రజలు జల్దుకున్నారు. పట్నంలోనూ, చౌబీసిపరగణాల్లోనూ జనం యావన్మందీ కలిసి, లియాకతాలీ అని వొక మౌల్వీని అలహాబాదు సుబేదారుగా ఎంచుకున్నారు. మౌల్వీలియాకతాలీ వొక అసాధారణ వ్యక్తి. అతడి మంచినడవడికవల్ల అతడంటే ప్రజలికి భక్తిగావుండేది.

అతడు గంటలకొద్దీ ఉపన్యసిస్తూవుంటే జనం మంత్రముగ్ధుల్లా వినేవాళ్లు. మండలమంతటా అతడు అద్భుతమైన విప్లవప్రచారంచేశాడు.

పెద్ద ఉత్సవంజరిగింది. వేలువేలు జనం సమావేశమయారు. మౌల్వీ లియాకతాలీ ఢిల్లీపాదుషాప్రతినిధిగా అలహాబాదు అధికారం స్వీకరించాడు.

లియాకతాలీ ఖుస్రూబాగ్ తన కేంద్రంచేసుకున్నాడు. అక్కడినించి నివేదికలు ఢిల్లీపంపడం ప్రారంభించాడు. అన్నిటికంటె ముందు అలహాబాదుకోట పట్టుకోడం తన కర్తవ్యమని నిశ్చయించాడు. కోటలోని సిక్కుసిపాయిలని విప్లవంలో పాల్గొనమని ఆహ్వానించాడు. అయితే సిక్కుల రాజభక్తిమాత్రంలవలేశమూ చలించలేదు.

అ యో ధ్య

ఆదినించీ అశాంతితో కుంగిపోతూవుంది అయోధ్య. తాలూకాదార్లూ, పోలీసులూ, సిపాయిలూ, ప్రజలూ యావన్మందీ స్వాతంత్ర్య యుద్ధంకోసం నడుములుకట్టారు. వేలకొద్దీ మౌల్వీలూ, పండితులూ ప్రబోధించడమైనప్రచారంచేశారు. ఆరబెట్టిన మందుగుండు అగ్గినిప్పుపడే సరికి భగ్గుమనడానికి ఎలా సిద్ధంగావుంటుంది, అదిగో అలాగ సిద్ధంగావుంది అయోధ్య.

సర్ హెన్రీ లారెన్సు అయోధ్య చీఫ్‌కమిషనరు. పంజాబు చీఫ్‌కమిషనరు సర్ జాన్ లారెన్సు సోదరుడతడు. రాబోయే ఉపద్రవం ముందే కనిపెట్టాడు హెన్రీ లారెన్సు. మే పన్నెండున పెద్దదర్బారు చేశాడు. హిందుస్థానీలో సుదీర్ఘమైనఉపన్యాసంచేశాడు. రాజభక్తి ప్రబోధించాడు. రంజిత్‌సింగు మహమ్మదీయుల్ని మహామ్మాయిచేశాడన్నాడు. ఔరగంజేబు హిందువుల్ని హింసించాడన్నాడు. ఈఉభ

యుల్నీ రక్షించడానికి తెల్లవాళ్లు దిగారన్నాడు. అయితే, ఈఉపన్యాసం అంతర్యమేమిటో అయోధ్యప్రజలు అంతకిముందే గ్రహించారు.

మర్నాడే మీరటు శుభవార్త వచ్చింది. మర్నాడు ఢిల్లీకబురందింది. ఉన్నధైర్యం పూడింది లారెన్సుకి. ఆత్మరక్షణ ప్రయత్నమారంభించాడతడు. లక్నోలో అప్పుడు వేలకొద్దీ సిపాయిలున్నారు. ఇంగ్లీషుపటాలమున్నచోటు పట్నంనించి వొకటిన్నర మైళ్లు దూరం. గోమతీనదీతీరంలో వొక గుట్టమీద రెసిడెంటుభవన ముంది. అదే రాజమందిరం. ఇదికాక మరో రెసిడెన్సీభవన ముండేది. దానిపేరు మచ్ఛీభవనం. రాజభవనంప్రక్కగానే సర్కారు ఖజానాకొట్టు. ఖజానాలో లక్షలులక్షలు రూపాయలున్నాయి. దీనికి నేటీవుసిపాయిలే కాపలా వుండేవాళ్ళు. ప్రమాదమంటూవస్తే రాజభవనంలోనూ, మచ్ఛీభవనంలోనూ ఇంగ్లీషువాళ్ళు భార్యాబిడ్డలతో సురక్షితంగావుండే ఏర్పాటు చేశాడు లారెన్సు. ఖజానాకొట్టు ప్రహారా నేటివుసిపాయిలచేతిలోంచి తప్పించేశాడు. ఇంగ్లీషుపోజు కాపలావేశాడు. లక్నోలోని దొర లందరూ సైనికశిక్షణ పొందాలని ఆజ్ఞాపించాడు.

అయోధ్యా నేపాల రాజ్యాలు వొకదానొకటి అంటివున్నాయి. సైన్యంతో వచ్చి తమకి సహాయపడవలసిందని లారెన్సు నేపాలం జంగుబహదూరికి రాశాడు. ఇలాపడవలసిన జాగ్రత్తలన్నీ పడ్డాడతడు.

మే ముప్ఫయ్యోతేదీ. రాత్రి తొమ్మిదిగంటలయింది. లక్నో పటాలంలో ఫిరంగి గుభీలుమంది. తుపాకులూ, కేకలూ బ్రహ్మాండం బద్దలుచేశాయి. భోజనంబీబిలు దగ్గిరకూచున్న లారెన్సుగుండెలు గుభిల్లుమన్నాయి. డబ్బయివొకటోపటాలం సిపాయిలు విప్లవమారంభించారు. ఇంగ్లీషువాళ్ల బంగళాలు నిప్పంటించారు. దొరికిన దొరలనల్లా తెగనరికారు. రాత్రంతా అలా గడిచింది.

మర్నాడు తెల్లవారింది. తెల్లఫాజూ, ఏడో నేటివుగుర్రపుదళమూ వేసుకుని లారెన్సు విప్లవకారుల్ని ఎదిరించడానికి బయలుదేరాడు. లారెన్సు ఆఫ్గనుయుద్ధంలోనూ, సిక్కు-యుద్ధంలోనూ పోరాడిన వీరుడు. ఆ అనుభవమే అయోధ్యలో చూపించాడు. ఏడో నేటివుగుర్రపుదళం అంతవరకూ అణడితోనే వుంది. కాని సగందార్లో ఎదురుతిరిగింది. యూనియనుజాకు పారేసింది. పచ్చజెండా ఎగరవేసింది. లారెన్సు తెల్ల మొహంవేశాడు. తెల్లసిపాయిలతో నెనక్కి-నచ్చేశాడు. రెసిడెన్సీలో తలదాచుకున్నాడు.

ఆసాయంకాలం సల్బాయి ఎనిమిగో పటాలమూ, తక్కిన నేటివు సిపాయిలూ కూడా విప్లవకారుల్లో చేరిపోయారు.

లక్నో విప్లవవార్త అయోధ్యరాజ్యమంతటా అగ్నిహోత్రంలా అల్లుకుంది. రెండోనాడు ఖయరాబాదు సిపాయిలు లేచారు. ఇంగ్లీషు జనం వెళ్లి కమిషనరు బంగాళాలో దూరారు. బంగళాకి పోలీసులు కాపలావేశారు. అయితే ఉత్తరక్షణంలో పోలీసులున్నూ విప్లవకారుల్లో చేరిపోయారు. దొరలమీద విరుచుకుపడ్డారు. పిల్లా జెల్లా తీసుకుని ఇంగ్లీషువాళ్ళు నదిదిక్కు పారిపోయారు. నది చేరారో లేదో కమిషనరు సబాంధవంగా హతవైపోయాడు. ఎంతోమంది తుపాకులికి గుర్తై పోయారు. అదృష్టమున్న ఏకొద్దిమంది మాత్రమో బతికి పోయారు. అదిన్నీ జాలిపడ్డ నేటీవుల వల్ల.

ఖయరాబాదు ఇలాకా మోహంబదీలో జూను నాలుగున ప్రళయంలేచింది. సిపాయిలు కోశాగారం దోచుకున్నారు. జైలుతలుపులు పగులగొట్టారు. ఖైదీలని విడిపించేశారు. కెప్టెను ఆర్ మొదలైన ఇంగ్లీషువాళ్లు బళ్ళమీద బొరంగాబాదు పారిపోయారు. యమదూతల్లా సిపాయిలు వెంటపడ్డారు. దార్లో పట్టుకుని చంపేశారు. ఆర్ మాత్రం వొకసిపాయి దయవల్ల హతశేషుడై తప్పించుకున్నాడు.

జూను మూడున సీతాపురం సిపాయిలు లేచారు. కుంపినీజెండా చించిపారేశారు. ఆకుపచ్చజెండా ఎగరవేశారు. సీతాపురం లక్నో నించి పాతికక్రోసుల దూరంలో వుంది. అక్కడ 41,9,10 — మూడు నేటీవు పటాలాలుండేవి. మే ఇరవై ఏడున కొన్ని ఇంగ్లీషు బంగళాలు నిప్పంటుకున్నాయి. మే రెండున రొట్టెలకని ఇచ్చిన పిండిబస్తాల్లో ఎముకలపొడి వుందని సిపాయిలు తిరగ్గొట్టారు. చేసేదిలేక ఆఫీసర్లు వాటిని గంగలో పోశారు. ఆ సాయంకాలం సిపాయిలు ఇంగ్లీషువాళ్ల పళ్లతోటల్లో పడ్డారు. సుగ్రీవాజ్ఞగా వున్న టంతా దోచుకు తినేశారు. ఎంత దధిముఖులు ఎదిరించినా లాభంలేకపోయింది. మర్నాడు కొంతమంది సిపాయిలు బయల్దేరారు. ట్రెజరీ దోచుకున్నారు. కొంతమంది కమిషనరు ఇంటిమీద పడ్డారు. దారిలో కల్నలు బిర్చినీ, లెఫ్టినెంటు గ్రేవునీ చంపేశారు. కమిషనరు పెళ్లాం పిల్లలతో ఏటికేసి పరిగెత్తాడు. సిపాయిలు వెంటాడారు. చంపేశారు. అవ్వూపున వొక పాతికమంది దొరల్ని కాల్చేశారు. ఎంతోమంది దొరలూ, దొరసానులూ రామకోటా, మితావలీ మొదలయిన జమీందార్ల శరణ్ణు జొచ్చారు.

సీతాపురం స్వాధీనమయాక అక్కడి సిపాయిలు ఫర్రూఖాబాదు ప్రవేశించారు. ఫర్రూఖాబాదునవాబు తఫజుల్ హుసేనుఖాను తాలూకా కుంపినీ లాక్కుంది. ఫర్రూఖాబాదు కోటలో ఎంతోమంది ఇంగ్లీషు వాళ్ళు దాక్కున్నారు సిపాయిలు కోటముట్టడించారు. ఘోరంగా యుద్ధం జరిగింది. ఇంగ్లీషువాళ్ళు ఓడిపోయారు. సిపాయిలు కోట పట్టుకున్నారు. ఇంగ్లీషువాళ్ళ సందరినీ చంపేశారు. తఫజుల్ హుసేను ఖానుని గద్దెమీద కూచోబెట్టారు. ఫర్రూఖాబాదులో ఇంగ్లీషు పురుగు లేకండా చేసేశారు.

సీతాపురం వార్త విని మలానులోని ఇంగ్లీషువాళ్ళు ముందే గుర్రాల మీద వుడాయించారు. మలాను నలభై నాలుగుమైళ్ళ దూరంలో వుంది.

జూను అయిదున ఫైజాబాదులో అగ్గిపుట్టింది. ఫైజాబాదు అయోధ్యరాజ్యంలో వొక ముఖ్యనగరం. గోల్డ్‌ను దొర అక్కడ కమీషనరు. ఇక్కడి తాలూకాదార్లని కుంపినీ చేసిన అన్యాయం లారెన్సుకూడా అంగీకరించాడు. సుప్రసిద్ధవిప్లవనాయకుడు మౌల్వీఅహమద్షా ఈ తాలూకాదార్లలోనివాడే. విప్లవంకోసం ఈయన చేసిన ప్రబోధం ఇంతాఅంతా కాదు. ఆగ్రా, లక్నో మొదలయినచోట్ల సంచారం చేస్తూ ప్రబోధం కలిగించేవాడు. ఈయన ఉపన్యాసాలలో అగ్ని వర్షం కురిసేది. ఈయనంటే అయోధ్యప్రజలు ప్రాణంపెట్టేవాళ్ళు. ఈయనని అరస్టు చేయమని కుంపినీవాళ్ళు పోలీసుల్ని పంపారు. పోలీసులు నిరాకరించారు. అప్పుడు పటాలంసిపాయిలని తెచ్చి అతణ్ణి నిర్బంధించారు. నిర్బంధించాక అతణ్ణి బెత్తాలతో బాదారు. ఉరిశిక్ష చెప్పారు. ఉరికిముందు ఫైజాబాదుజైల్లోవుంచారు. దాంతో ఫైజాబాదంతా ప్రళయం ముంచుకు వచ్చింది.

ఫైజాబాదులో ఇరవై రెండూ, ఆరూ పటాలాలూ, కొంతగుర్రపుసేనా, కొంత ఫిరంగిదళమూ వుండేవి. కల్నలు వెన్నాక్సు అధికారిగా వుండేవాడు. ప్రజలూ, పోలీసులూ, ఈ సిపాయిలూ ఏకమయారు. ఆకుపచ్చపతాకం ఎగరవేశారు. "మా హిందూస్థానీ ఆఫీసర్ల మాటతప్ప మీ మాట వినం" అంటూ సిపాయిలు కవాతుమైదానంలో ఆఫీసర్ల మీద తిరగబడ్డారు. సుబేదారు దిలీపసింగు నాయకత్వం వహించాడు.

ఇంగ్లీషుఆఫీసర్ల నందరినీ అరస్టు చేశాడు. సిపాయిలు విప్లవనినాదాలతో విరగబడ్డారు. జైలు బద్దలుకొట్టారు. ఖైదీలని విడిపించేశారు. మౌల్వీ అహమద్షా బేడీలు విడగొట్టారు. అతణ్ణి నాయకుడుగా ఎన్నుకున్నారు. అహమద్షా బైటికిరాగానే, జైల్లో తనని హుకాకా వినియోగించ నిచ్చిన కల్నలు వెన్నాక్సుని థాంక్సుచేస్తూ కబురంపాడు. తరవాత, ఫైజాబాదులోని ఇంగ్లీషువాళ్ల నందరినీ కట్ట

గట్టి పడవల్లో పంపించేశాడు. శాంతిరక్షణకి అవసరమైన ఏర్పాట్లు, చేశాడు. అతడి ఆజ్ఞ వైవాజ్ఞగా మన్నించారు ప్రజలు.

ఫైజాబాదునించి పడవలమీద ఇంగ్లీషువాళ్లు నదిమీద సలభై మైళ్లు వచ్చారు. పదిహేడొందోపట్టాలం సిపాయిలకి ఎలాగో వుప్పందింది. హటాత్తుగావచ్చి, పడవలమీద పడ్డారు. కమీషనరు గోల్డెనూ, లెఫ్టినెంటు థామసూ, రీచీ, బిల్లూ, ఎడ్వర్డూ, కర్రీ మొదలైన దొరలు సిపాయిల తుపాకులకి బలి అయిపోయారు. కొందరు ఏటిపాలయి పోయారు. ఎనమండుగురు పారిపోతూ, మెహబూదా వుళ్లోపడగానే అక్కడ పోలీసులు వాళ్లనీ చంపేశారు. అందులో వొక్కడుమాత్రం ఎలాగో తప్పించుకు బతికిపోయాడు.

అనేకమంది దొరసానులూ, వాళ్లపిల్లలూ శాహగంజి తాలూకా దారు మానసింగు శరణుజొచ్చారు. ఆ మే మాసంలోనే శిస్తుల తగాదాలో ఇంగ్లీషువాళ్లు మానసింగుని అరస్టుచేశారు. విప్లవారం భంలో వొదిలిపెట్టారు. ఇప్పు డతడు విప్లవనాయకుల్లో వొకడు. అయినా ఇరవైతొమ్మండుగురు దొరసానుల్నీ, వాళ్లపిల్లల్నీ తన కోటలో ఆశ్రయమిచ్చి బతికించాడు. మౌల్వీ అహమద్షా కూడా ఫైజాబాదులో వొక్క ఇంగ్లీషువాణ్ణీ చంపనివ్వలేదు.

మహమూదీలోని ఇంగ్లీషువాళ్లు ముందే విప్లవం పసికట్టారు. తమ కుటుంబాలు మిథౌలీరాజు దగ్గిరికి పంపించి కాపాడమన్నారు. తన కోటలో వాళ్లని రక్షించలేనన్నాడు మిథౌలీరాజు. తన అడవుల్లో రహస్యంగా తలదాచుకోమన్నాడు. దొరసానుల్ని మిథౌలీ పంపేసి దొరలు మహమూదీకోటలో దాగున్నారు. తరవాత తమని రక్షించి పట్టుకుపోవలసిందని సీతాపురం కబురంపారు. అప్పటికి సీతాపురమింకా స్వతంత్రంకాలేదు. సీతాపురంనించి బళ్లతో సిపాయిలు వచ్చారు. ఇంగ్లీషువాళ్లని బళ్లమీద కూచోబెట్టారు. సగందూరం భద్రంగా

పట్టుకువెళ్లారు. అక్కడ హఠాత్తుగా బళ్లు దిగమన్నారు. అందరినీ నరికిపారేశారు.

జూను తొమ్మిదిని సుల్తానుభువం లేచింది. అదంతా ముందే పసి కిట్టాడు కల్నలు ఫిషరు. పెళ్లాం పిల్లల్నీ, అత్తగారినీ అలహాబాదు పంపేశాడు. అలా అతడు పంపేసిన మర్నాడే అక్కడ విప్లవం పుట్టింది. ఇంగ్లీషు కొంపలు తగలబడ్డాయి. వాళ్ల ఆస్తులు దోపిడీ అయిపోయాయి. ఇంగ్లీషువాళ్లు పికాసికాలై పారిపోయారు. కల్నలు ఫిషరూ, మరి కొందరూ గుప్పెడు బల్లలు తిని చచ్చిపోయారు.

దరియాబాదులో కల్నలు పరింత్ జాగ్రత్తపడ్డాడు. ప్రజలనీంచి రూపాయలు పట్టుకుపచ్చి, పటాలంలో పెట్టాడు. ఖైదుల్లోంచి ఖైదీలని కూడా పోన్చేశాడు; పటాలంలో చూచిపెట్టాడు. తన వైదుతనం మాత్రం వ్యక్తమయింది. సిపాయిలు పొలోమని వొక్కసారివిసుచుకు పడ్డారు. ఇంగ్లీషువాళ్లు బొజ్జోటయిపోయి, లక్నో పారిపోయారు. రూపాయలు సిపాయిలు దోచుకున్నారు. ఖైదీలని విడిపించేశారు.

సీతాపురంపక్కనే బహరాయచి అని వొక బిట్టావుంది. పింగుళ్లు ఇక్కడ కవిమానసము. బహరాయచి, సిక్రోలా, గోండా, మొలాపురమూ ఇక్కడ ముఖ్యనగరాలు. సిక్రోలాలో చెప్పో కాల్బలంపటాలమూ, కొంత ఫిరంగిదళమూ వుండేది. తొమ్మిదో తేదీని ఆ సిపాయిలు యావన్మంది "ఫరంగిరాజ్యం అస్తమించింది" అంటూ లేచారు. ఇంగ్లీషు ఆఫీసర్లు బలరాంపురంరాజుగారి శరణుజొచ్చారు. అంతకుముందే తమ పిల్లాజెల్లా లక్నో పంపేశారు.

సిక్రోలావార్త వినడంతోనే గోండా కూడా మేలుకుంది. బహరాయచి కూడా ఏమో తేదీని లేచింది. ఇంగ్లీషువాళ్ళు నేటివుల వేషాలు వేసుకుని బోట్లమీద లక్నో పారిపోయారు. బోట్లు గోగ్రానదిమీద

నెమ్మదిగా నడుస్తున్నాయి. హఠాత్తుగా ఎక్కడినించి వచ్చిపడ్డారో పడ్డారు సిపాయిలు. అందరినీ చంపేశారు.

జూను పదిని సలోనీ తిరగబడింది. ఇంగ్లీషువాళ్ళు పారిపోయారు. సలోనీ జమిందారు సర్దారు రుస్తుముషా, రాజా హనుమంతసింగూ వాళ్ళలో చాలామందికి ఆశ్రయమిచ్చారు. వీళ్ళిద్దరూ ఇంగ్లీషురాజ్యం పోతేనేకాని నిద్రపోమని శపథం పట్టినవాళ్ళు. అయినా కనికరించారు. ఇంగ్లీషువాళ్ళ ప్రాణాలకడ్డుపడ్డారు. అలా అని స్వధర్మంకోసం, తమ కర్తవ్యంమాత్రం మరిచిపోలేదు.

రాజా హనుమంతసింగుదగ్గిర సెలవుతీసుకుంటూ కెప్టెను బోరో అన్నాడు – "రాజాజీ, ఈవిప్లవం అణచడానికి సర్కారుకి మీరు సహాయంచేస్తారని ఆశిస్తాను. ఆమాట వినడంతోనే హనుమంతసింగు చప్పున నిలుచున్నాడు. ఏమన్నాడో తెలుసా ?

"దొరా, మీ దేశస్థులు మా దేశంలో ప్రవేశించారు. మా నవాబుని తరిమేశారు. మీరు మీఆఫీసర్లని మాజిల్లాలకి పంపారు. మా ఎస్టేట్ల పట్టాలు తనిఖీచేయించారు. నాకుటుంబం పురాతనకాలంనించీ అనుభవిస్తూన్న భూములన్నీ ఒక్కదెబ్బతో లాగేసుకున్నారు. నోరు మూసుకు కూచున్నాను నేను. హఠాత్తుగా మీమీద ఆపదవచ్చి పడింది. నాసర్వస్వమూ నాశనంచేసినమీరే నాదగ్గిరికి వచ్చారు. నేనే మిమ్మల్ని బతికించాను. అయిపోయింది. కాని ఇప్పుడో - ఇప్పుడు నాజనం యావన్మందినీ కూర్చుకుని లక్నో వెళుతున్నాను. మిమ్మల్ని మా దేశంనించి తరమడానికి ప్రయత్నంచేస్తాను." *

అయోధ్యరాజ్యమంతటా హిందువులూ, మహమ్మదీయులూ అనేక మంది హనుమంతసింగులాగే ఇంగ్లీషువాళ్ళ ప్రాణాలు రక్షించారు. పల్లెపల్లెలా తల్లులు తమచనుబాలిచ్చి ఇంగ్లీషు శిశువుల్ని కాపా

* Malleson's Indian Mutiny.

డారు. అయితే భయంతోకాదు, అభిమానంతోకాదు — జాలిచేత; శరణంటే రక్షించడం భారతీయుల ఆదర్శం కావడంచేత.

బుషరు అని ఒక ఇంగ్లీషువాడు తన అనుభవం ఇలా రాశాడు:

"నేను ఒక్కణ్ణేమిగిలాను. పరిగెత్తి పరిగెత్తి ఒకవూరు చేరాను. ముందుగా ఒకబ్రాహ్మడు కనిపించాడు. నేను మంచినీళ్ళడిగాను. అతడు నామీద జాలిపడ్డాడు.

బలీసింగు నన్ను వెంటాడుతూ వచ్చాడు. నే నొక సందులోకి పరిగెత్తాను. ఒక ముసిలమ్మ నాకొక పాక చూపింది. నేను వెళ్ళి గడ్డిలో దాగున్నాను. కొంచేపటిలో బలీసింగుమనుషులు వచ్చేశారు. కత్తులతో అంతటా పొడిచి, నన్ను పట్టేశారు. నాజుత్తుపట్టుకుని నన్ను పైకి లాక్కువచ్చారు. ఊళ్లో జనం ఫరంగీలని నానాతిట్లూ తిట్టారు. జనం మూకమధ్య బలీసింగు నన్ను విచారణచేశాడు. ఉరిశిక్ష చెప్పాడు. నావురి రోజూ వెనకపడుతూ వచ్చింది. నేను మొకరించి ప్రాణభిక్ష వేడుకున్నాను. నన్ను బలీసింగు తన ఇంటికి తీసుకుపోయాడు."

కల్నలు వెన్నాక్సు రాత చూడండి:

"మేం పరిగెత్తి పారిపోతున్నాం. నాజిము హుస్సేనుఖాను మనుషులు మమ్మల్ని పట్టుకున్నారు. ఒకడు తన రివ్వాలరు తీశాడు. మమ్మల్ని కాల్చెయ్యడానికి తన చేతులు తొందరపడుతున్నాయంటూ పళ్ళు కొరికాడు. మమ్మల్ని నాజిము దగ్గిరికి తీసుకువెళ్ళారు. నాజిము తన కచేరీలో బాలిసుకి చేరబడి కూచున్నాడు. మమ్మల్ని భయపడవద్దన్నాడు. షర్బత్తు పుచ్చుకోమన్నాడు. నేదదీర్చుకోమన్నాడు. మాబసల ప్రశ్నవచ్చింది. 'గుర్రాలసాల' అన్నాడు కళ్ళెర్రచేస్తూ ఒక నౌకరు. నాజిము అతణ్ణి గద్దించాడు. 'ఇదంతా ఎందుకూ? ఈఫరంగి కుక్కల్ని చంపే స్తేసరి,' అన్నాడు మరొకడు. వాళ్లందరినీ నాజిము గదమాయించాడు. మాకు అభయహస్త

మిచ్చాడు. విప్లవకారుల భయంలేకండా మమ్మల్ని ఆయన జనానా దగ్గిర దాచాడు. మంచి భోజనం పెట్టాడు. శుభ్రమైన బట్టలూ అవీ ఇచ్చాడు."

అలా వొక పది దినాల్లో అయోధ్యరాజ్యంలో కుంపినీరాజ్యం స్వప్నంలా వుడిపోయింది. బేగం హజరతుమహలు ఆధిపత్యంకింద ఆకుపచ్చజెండా ఎగిరింది.

ఫూ న్సీ

"ఫూన్సీ పటాలంసిపాయిలు శాంతప్రియులు. రాజభక్తులు. మీరటు, ఢిల్లీల సిపాయిలు చేసిన దుర్మార్గం వీరి వీళ్ళు అసహ్యించుకుంటున్నారు. ఇక్కడ ఉపద్రవం వుంటుదన్న భయం పిసరంతకూడా లేదు. ఇక్కడేకాదు, బుందేలుఖండంలోని చిన్నచిన్న రాజ్యాల్లోకూడా భయపడవలసిన పనిలేదు. ఏమంటే, ఇక్కడి పెద్దపెద్ద రాజ్యాలు ఓర్చా, ఛత్రపురం, అజయగడాల రాజులు మైనారిటీలో వున్నారు. అంచేత ఈ ప్రాంతంలో ప్రమాదం తలఎత్తదనే నాఅభిప్రాయం" — మే ఇరవై ఎనిమిదిని ఫూన్సీ కమీషనరు సీక్‌ను గవర్నరు జనరలు కానింగుకి రాసిన రిపోర్టు ఇది.

ముప్ఫయిసి మళ్ళీ రాశాడు — "ఫూన్సీ శాంతంగా వుంది. పటాలంలో రాజభక్తి తొణికిసలాడుతూవుంది."

జూను మూడుసకూడా అలాగే రాశాడు — "సంయుక్తప్రదేశంలో రాజుతూవున్న మంటలనించి ఫూన్సీ దూరంగా వుంటుంది. సర్కారుకి విరుద్ధంగా ఎన్నడూ ఇక్కడి ప్రజలు ప్రవర్తించరు."

మూడోతేదీని సీక్‌ను అలా రాశాడు. మర్నాడే ఫూన్సీలో విప్లవం అట్టహాసం చేసింది.

ఝాన్సీ కలిపేసుకున్నాక పురాతన ఝాన్సీ దుర్గం కుంపినీవాళ్ళు స్వాధీనపరుచుకున్నారు. మహారాజు గంగాధరరావు వొదిలిపోయిన నాలుగున్నరలక్షల నగలూ, రెండున్నరలక్షల నగదూ తీసుకున్నారు. గంగాధరరావు దత్తపుత్రుడు దామోదరరావు మైనారిటీ వెళ్ళాక అతడికి ఇస్తామన్నారు. రాణీ లక్ష్మీబాయిని రాజమహలు వొదిలి పోరాదని నిషేధించారు.

అప్పటికి ఝాన్సీలో కుంపినీ ఫిరంగిదళమొకటీ, పన్నెండో బెంగాలు నేటివ్‌పటాలమొకటీ, పద్నాలుగో గుర్రపుసేనా వుండేవి. కెప్టెను డన్లపు సైన్యాధిపతిగా వుండేవాడు. పట్నంబైట దుర్గానికి మైలుదూరంలో వొకచిన్న కోట వుండేది. దానిని 'స్టారుఫోర్టు' అనేవాళ్ళు. ఝాన్సీ ఆయుధాగారమూ, ఖజానా అందులోనే వుండేవి. అవాళ జూను నాలుగు. ఉన్నట్టుండి సిపాయిలు లేచారు "హరహరమహాదేవ" అంటూ వికటబడ్డారు. పన్నెండోపటాలం హవల్దారు గురుబక్ససింగు నాయకత్వంకింద స్టారుఫోర్టుకి పరిగెత్తారు. అక్కడసిపాయిలున్నూ వీళ్ళతో కలిశారు. స్టారుఫోర్టు స్వాధీనపరుచుకున్నారు.

కమీషనరు స్కీనూ, కెప్టెను గార్డ్‌నూ మొదలైన ఇంగ్లీషువాళ్ళు పిల్లాజెల్లా తీసుకుని దుర్గంలోకి పారిపోయారు. మర్నాడు కెప్టెను డన్లపూ, వేలరు అని ఇంకోదొరా కవాతుమైదానానికి వెళ్ళారు. సిపాయిలు వాళ్లని చుట్టుముట్టారు. రిసాల్దారు కాలీఖాను కాల్చి చంపేశాడు. తమకి సహాయపడమని రాణీలక్ష్మీబాయికి స్కీను ఉత్తరం రాసి పంపాడు. ఉత్తరం పట్టుకువెళ్లిన సాట్టునీ, పరసిలునీ దారిలోనే సిపాయిలు చంపేశారు.

రిసాల్దారు కాలేఖాను, తహసీలుదారు మహమ్మదు హుసేనుల నాయకత్వంతో సిపాయిలు దుర్గం ముట్టడించారు. ఎనిమిదిని గట్టి

యుద్ధం జరిగింది. కెప్టెను గార్డ్డును ఉత్తరద్వారంకేసి పైన వొకకిటికీ మాటున నుంచుని తుపాకి కాలుస్తున్నాడు. అవాళే సిపాయిలు వొక మంచి విలుకాణ్ణి తెచ్చారు. ఆ విలుకాడు వొక రాతిమాటునించి గార్డ్డునుమీద బాణం గురిపెట్టాడు. ఒక బాణం గార్డ్డును కుత్తుక దుసెల్లి పోయింది. గార్డ్డును కూలిపోయాడు. గార్డ్డునుచావుతో ఇంగ్లీషువాళ్ళు కుంగిపోయారు. లోపల ఆహారమూ, మందుగుండూ కూడా అయి పోయాయి. దాంతో స్కీన్ను లొంగిపోయాడు. దుర్గంమీద తెల్లజెండా ఎత్తేశాడు.

సిపాయిలతరఫున పట్నంలోని ప్రముఖవ్యక్తి హకీమునులేమానూ, ఇంగ్లీషువాళ్లతరఫున కమిషనరు స్కీనూమర్డద్వారందగ్గిర కలుసు కున్నారు. "దుర్గం వొదిలెయ్యడానికి సిద్ధంగావున్నాము. అయితే మాప్రాణాలకి అపాయంలేకుండావుంటే చాలు" అన్నాడు స్కీను "మీ మీదఈగన్నా వాలదు. కురానుసాక్షిగా చెపుతున్నాను" అన్నాడు సులేమాను. ఆయుధాలు అట్టేపెట్టేసి ఇంగ్లీషువాళ్ళు బైటికి వచ్చేశారు. వాళ్లని చూడడంతోనే సిపాయిలకి ఆవేశమెత్తింది. అది ఆపడమూ అసాధ్య మయింది. వాళ్లందరినీ బంధించి ఝాన్సీబాగుకి తీసుకుపోయారు. అక్కడ జైలుదారోగా బక్సీసుఆలీ ముందు స్కీను దొరని నరికేశాడు. స్కీనంటే అతడికి మంటగా వుండేది. లోగడ కుమార సాగరసింహుడు జైదులోంచి పారిపోయినందుకు స్కీను బక్సీసుఅలీని జోడుతో తన్నాడు. ఆక్రోధ మిప్పుడతడు తీర్చు కున్నాడు.

స్కీనుతల కిందపడడమే తడువు, తక్కినదొరల్నీ, దొరసానుల్నీ, పిల్లల్నీ – అందరినీ సిపాయిలు నరికేశారు. ఝాన్సీబాగు రక్తసిక్త మయింది. అలా నరికేసిన ఇంగ్లీషువాళ్లసంఖ్య తలా వొకలాగ రాశారు చరిత్రకారులు. ఇందూరులోని వొకదొరమాత్రం దొరలు

డబ్బయిఅయిదుగురూ, దొరసానులు పదహారుగురూ, పిల్లలు ఇరవై ఆరుగురూ అని రాశాడు.

ఈ హత్యల్లో మహారాణి లక్ష్మీబాయికి లవలేశమూ ప్రమేయం లేదు. అయినా ఆమెమీద రకరకాల నిందలువేశారు. రాబర్ట్స మాంటుగొమరీ తన ఇండియన్ ఎంపైరు గ్రంథంలో ఇలా రాశాడు.

"మహారాణి ఇంగ్లీషువాళ్లచేత నష్టపడింది. పైగా ఆమె 'హిఢెను' స్త్రీ. అంచేత ఆమెకి దయాదాక్షిణ్యాలు లేకండా పోయాయి. హిందువుల దత్తతవిధానం ప్రకారం ఆమెచేసుకున్న దత్తత ఇంగ్లీషువాళ్ళు సమ్మతించలేదు. అందుకని దయా, క్షమా ఆమె నారీహృదయంనించి తీసిపారేసింది. ఈ పాపానికి ప్రాయశ్చిత్త మనుభవించి తీరుతుంది." ఆమె 'హీఢెను' స్త్రీ అట! అందుకని ఆమెకి దయాదాక్షిణ్యాలు లేకపోయాయట! కాని చరిత్రకారుడు కే ఏమన్నాడో చూడండి – "నమ్మదగినభోగట్టా నాకు అందింది. ఈ హత్యలు జరిగినప్పుడు రాణీగారి నౌకర్లు ఎవ్వరూ అక్కడలేరు. మన పాతసిపాయిలే ఈపని చేశారు. మన గుర్రపుదళం సిపాయిలే ఊరక్తపాతం చేశారు."

ఇంతేకాదు, మరి ముప్పయిరెండేళ్ల తరవాత లక్ష్మీబాయి దత్త పుత్రుడు దామోదరరావుకి మార్టిను ఎక ఉత్తరంలో ఇలా రాశాడు – "నిర్దోషురాలయిన మీ తల్లిగారికి ఘోరమైన అన్యాయం జరిగింది. అసలుసంగతి నాకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. 1857 యూరోపియనులహత్యతో ఆమెకి ఏమీసంబంధంలేదు."

ఝాన్సీఖనుబాగులో ఇంగ్లీషువాళ్లని చంపేశాక, సిపాయిలు జయ జయధ్వానాలుచేస్తూ రాజమహలుదగ్గిరికి వచ్చారు. ఢిల్లీవెళతాం, మామలక్షలు కావాలంటూ రాణీలక్ష్మీబాయి నడిగారు. తన నగలు తీసి సిపాయిలచేతిలో పెట్టిం దామె. సిపాయిలు ఢిల్లీ పయన

మయారు. ఝాన్సీదుర్గంమీద ఇంగ్లీషుజెండా దిగిపోయింది. ఆకు పచ్చజెండా ఎగిరింది. రాజ్యమంతటా దండోరావేశారు –

खलक खुदाका,
मुलक बादशाह का,
हुकुम महरानी लक्ष्मीबाई का।
లోకం దేవుడిది,
దేశం పాదుషాది,
ఆజ్ఞ మహారాణీ లక్ష్మీబాయిది.

గ్వాలియరు

గ్వాలియరుసంస్థానం కుంపినీవాళ్ల మిత్రరాజ్యం. మహారాజు జయాజీరావు సింధియా ఇరవైమూడేళ్ల యువకుడు. ఇక్కడ ఎనిమిదివేలకి పైగా కుంపినీ సిపాయిలూ, ఇరవై ఆరు ఫిరంగులూ వుండేవి. ఇదికాక మహారాజు స్వంతసైన్యం పదివేలదాకా వుండేది. మహారాజు పటాలం కోటకిదగ్గిరగా వుండేది. కుంపినీ పటాలం ఆరుమైళ్ళ దూరంలో మురారులో వుండేది. సింధియా అటు విప్లవంతట్టూ, ఇటు కుంపినీకేసీ, వెనకాముందూ వూగులాడుతూ వుండేవాడు.

ఉన్నట్టుండి వొకనాడు ఫుకారు పుట్టింది – "సిపాయిలు తిరగబడతారు." బ్రిగేడియరు రాయసే మొదలయిన ఇంగ్లీషువాళ్లు సతమతమైపోయారు. కాని ఏమీ జరగలేదు. మేనెలంతా గడిచిపోయింది. మరి మూడు దినాలు గడిచిపోయాయి.

ఆవాళ ఆదివారం ఇంగ్లీషు కుర్రాడొకడు మరణించాడు. ఎంతో మంది ఇంగ్లీషువాళ్లు శవంవెంట స్మశానానికి వెళ్ళారు. ఎక్కడా ఏమీ అలజడి కలగలేదు. పగలంతా శాంతంగా వెళ్ళిపోయింది. పొద్దుగూకింది. రాత్రిపడిందో లేదో, సిపాయిలు లేచారు. ఇంగ్లీషు

వాళ్ళ బంగళాలు నిప్పంటించారు. ఆఫీసర్లని హతవార్చారు. ఆగంది కలో మేజరు బ్లేకుని వొక సిపాయి చంపేశాడు. బ్లేకు సిపాయిలకి ఇష్టుడుగా వుండేవాడు. అందుకని కొంతరభస జరిగింది. తుదకి బ్లేకు శవం సిపాయిలు సగౌరవంగా సమాధిచేశారు.

రెసిడెంటు మహారాజు కోటకి పరిగెత్తాడు. ఇంతజరిగినా ఇక్కడ సిపాయిలు వొక్క దొరసానిమీదా చెయిచేసుకోలేదు. చావగా బతికిన ఇంగ్లీషువాళ్ళు అగ్రా పారిపోయారు. సిపాయిలు వెంటాడారు. కొంతమందిని చంపేశారు. చంబలుదగ్గిర వాపల్లారు జహంగీరుఖానుకలిశాడు. ఇంతలో తాకురు బలదేవసింగు నాయకత్వంకింద కొంతమంది సిక్కుసిపాయిలు ఇంగ్లీషువాళ్ళ సహాయంకోసం వచ్చారు. ధోల్పూరు మహారాజు ఏనుగులమీద కొంతసేన సహాయం పంపాడు. అలా మిగిలిన ఇంగ్లీషువాళ్ళు బతికిపోయారు. గ్వాలియరులో మొత్తం ముప్ఫయిమంది దొరలుమాత్రం మరణించారు.

నీ మ చి

సీమచిలో వొకటో గుర్రపుదళంకొంతా, నాసిరాబాదు ఫిరంగిదళంకొంతా, వొక బొంబాయి కాల్బలమూ వుండేవి. మే ఇరవై ఎనిమిదినే ఇక్కడ ఫిరంగిదళం తిరగబడింది. వీళ్ళదగ్గిరనించి ఫిరంగులు లాక్కోమంటూ బొంబాయి పటాలానికి ఆఫీసర్లు ఆదేశించారు. అయితే ఆ ఆదేశం పాలించేవాళ్లుమాత్రం లేకపోయారు. బొంబాయి కాల్బలం సిపాయిలున్నూ విరగబడ్డారు. "మారో ఫరంగీకో" అంటే "మారో ఫరంగీకో" అంటూ కత్తులు దూశారు. ఇంగ్లీషువాళ్ల బంగళాలు కాల్చేశారు. వాళ్ల ఆస్తులూ అవీ దోచుకున్నారు. ఇద్దరు ఇంగ్లీషుఆఫీసర్లని నరికేశారు. మరి ఇద్దరిని చావుదెబ్బలుకొట్టి వొదిలిపెట్టారు.

ఇందూరు

గ్వాలియరులాగే ఇందూరులోకూడా జరిగింది. జూలై ఎొకటిని ఇందూరుసిపాయిలు ఇంగ్లీషు రెసిడెంటుభవనం ముట్టడించారు. అయితే ఎవరినీ చంపలేదు. అక్కడి ఇంగ్లీషువాళ్లు పారిపోయి భూపాలంలో తలదాచుకున్నారు. ఇందూరు మహారాజు హోల్కారు ఇంగ్లీషువాళ్ల నభిమానించాడో, విప్లవం ప్రోత్సహించాడో నాటికీనేటికీ అర్థం కాలేదు.

సరిగ్గా ఇదేస్థితి ఎన్నో దేశీయరాజ్యాల్లో జరిగింది. జయపురం, జోధపురం రాజులు ఇంగ్లీషువాళ్లకి సహాయపడండని తమసైనికుల కాదేశించారు. కాని "మా సోదరులమీద మేం తుపాకులు పేల్చం" అంటూ ముక్తకంఠంతో వాళ్లు నిరాకరించారు.

ఆగ్రా

జూలై అయిదున ఆగ్రాలో అగ్నిహోత్రం పుట్టింది. భరతపురం రాజు ఇంగ్లీషువాళ్లని వెనకవేసుకువచ్చాడు. తన పటాలం సిపాయిలని విప్లవకార్లు నెదిరించమన్నాడు. కాని సిపాయిలు నిరాకరించారు.

సంయుక్తరాష్ట్రాల లెఫ్టినెంటు గవర్నరు కోల్విను ఆగ్రాలో వుండేవాడు. మీరటువార్త విన్నాక, సిపాయిలకతడు ధర్మపన్నాలు ఏకరువుపెట్టాడు. నాసిరాబాదు మొదలైనచోట్లనించి విప్లవకారులయిన సిపాయిలు ఆగ్రా ప్రవేశించారు. ఇంగ్లీషు పటాలం వేసుకుని బ్రిగేడియరు పాల్వెలు వీళ్ల నెదిరించాడు. రెండుసేనలూ సాసియా దగ్గిర కలియబడ్డాయి. ఆదినమంతా హోరాహోరి యుద్ధంజరిగింది. ఇంగ్లీషువాళ్లు ఓడిపోయారు. సిపాయిలు వాళ్లని ఆగ్రావరకూ వెంటతరిమారు.

మర్నాడు ఆగ్రాపోలీసులున్నూ విప్లవకారులయిపోయారు. ఆగ్రా భవనాలమీద ఆకుపచ్చజెండాలు ప్రతిష్ఠించారు. ప్రజలూ, పోలీ

సులూ, మూల్వీలూ, పండితులూ – యావన్మందీ పెద్ద బెండా ఉత్స వం బైలుదేరదీశారు. కొత్వాలూ మొదలయిన పోలీసుఉద్యోగులు ముందునడిచారు. విజయనినాదాలు పురవీధుల్లో ప్రతిధ్వనించాయి. లెఫ్టినెంటు గవర్నరు కోల్విన్‌నూ, బ్రిగేడియరు పాల్వెలూ వాళ్లూ సిగ్గుతో కుంగిపోతూ ఆగ్రాకోటలో తలుపులు మూసుకున్నారు. ఆ సిగ్గు తోనే మరిమూడుదినాల్లో కోల్విను చచ్చిపోయాడు.

వ ం గ దే శ ం

కలకత్తాలో విప్లవం రాజుకోలేదు. నిజమే, కాని దేశంలోనిపరిస్థితులు ఇక్కడ వుక్కిరిబిక్కిరి చేస్తూ వుండేవి. ఎప్పుడు తమవంతువస్తుందో అని బితుకూ బితుకూ మంటూ వుండేవాళ్ళు ఇక్కడి ఇంగ్లీషువాళ్ళు. ఎప్పటికప్పుడు గవర్నరుజనరలు సింహాసనం గజగజలాడుతూ వుండేది. ఈమహాప్రళయానికంతా ముఖ్యకారకుడు డల్హౌసీ. అతడు నిప్పుపెట్టేసి వెళ్ళిపోయాడు. మంటలేమో కానింగుని కౌగిలించుకున్నాయి.

జూను పన్నెండుస కలకత్తాఇంగ్లీషువాళ్ళు వొక స్వేచ్ఛాసేవకదళం స్థాపించారు. దుకాణదార్లూ, గుమాస్తాలూ, ఉద్యోగులూ – అన్ని రకాల ఇంగ్లీషువాళ్ళూ వాలంటీర్లుగా చేరారు. కవాతూ, తుపాకులు కాల్చడమూ నేర్చుకున్నారు. ఈ వాలంటీరుదళం పట్నం కాపాడే భారం తమమీద వేసుకున్నారు.

మర్నాడు గవర్నరుజనరలు ప్రతికాశాసనం ప్రకటించాడు. ఆశాస నంప్రకారం అనుమతిలేందే ఎవరూ అచ్చాఫీసు పెట్టకూడదు. అవసర మైతే ఏపత్రికనయినా, ఏగ్రంథమయినా ప్రభుత్వం ఆపెయ్యవచ్చు.

పదిహేనున కలకత్తాపట్టణమంతటా పెద్దపితూరీపుట్టింది "బారకు పురం సిపాయిలు పట్నంమీదికి దండెత్తి వస్తున్నారు." ఇద్దరు మనుషులు కలిసినచోటల్లా ఇదే చెప్పుకున్నారు. ఈపుకారు ఇంగ్లీషు

వాళ్ళని ఎంతన్నా గాభరా పెట్టింది. వందలకొద్దీ విలియంకోటకి పరిగెత్తారు.

"మాకు కొత్తరైఫిలుతుపాకు లివ్వండి. ఢిల్లీ వెళతాం. పితూరీ దార్లని చంపేస్తాం" అంటూ బారకుపురంసిపాయిలు అధికార్ల నడిగారు. అధికార్లు సంధిగ్ధావస్థలో పడిపోయారు. ఇస్తే అవి తమమీదే ఉపయోగిస్తారేమో! నేటివుసిపాయిలని నమ్మడమెలాగ? కాని ఇవ్వకపోతే, నమ్మలేదని తిరగబడతారేమో! ఎలాఅయితేనేం, కొత్త తుపాకులు ఎన్నోలేవని సాకుచెప్పి తప్పించుకున్నారు. అంతేకాదు, వాళ్ళ ఆయుధాలు లాక్కోవడమే మంచిదని కూడా భావించారు. ఆప్రకారం పదాన్నలుగునే వాళ్ళ తుపాకులూ అవీ లాక్కున్నారు. డ్యూటీమీద కలకత్తా, డమ్‌డమ్‌లలో వున్న సిపాయిలవీ కూడా లాక్కున్నారు. అవాళ ఏమీ జరగలేదు. మర్నాడు మధ్యాహ్నం కలకత్తాలో పైపుకారు పుట్టింది. కాని ఏదీ? బారకుపురంనించి లాక్కున్న సిపాయీ కలకత్తా రాలేదు. అంతా నీలినీలార్ణవ! ఆమర్నాడు మరో పుకారుపుట్టింది – "నజఫుబంధీలోవున్న అయోధ్యనవాబు వజీదాలీ మనుషులు కోటకాపలావాళ్ళతో రాత్రిళ్ళుసచ్చి, రహస్యంగా కుట్ర పన్నుతున్నారు. అయోధ్య కాలా తాలూకాదారు వచ్చాడు. ఇంగ్లీషువాళ్ళని చంపేస్తాడు."

ఈపుకార్లతో ఇంగ్లీషువాళ్ళ నింపుప్రాణాలు నిలువునా ఎగిరి పోయాయి. ఎడ్మంట్సను నాయకత్వంకింద వొక తెల్లఫౌజు బయలు దేరింది. వజీదాలీని అరెస్టుచేసింది. ఫౌజు వెళ్లేసరికి నవాబు వజీదాలీ సమాజులో వున్నాడు. సమాజు ముగించుకునివచ్చి, మొర్రో నేనేమీ ఎరగనంటూ మొత్తుకున్నాడు. "నారాజ్యమూ, అంతస్సైన్యమూ నాదగ్గిరవున్నప్పుడే మీకు లొంగిపోయాను. ఇప్పుడేం చెయ్యగలను?" అంటూ మొత్తుకున్నాడు. లాభంలేకపోయింది. అతణ్ణి తెచ్చి విలి

యం కోటలో నిర్బంధించారు. అతడితోపాటు అతడివజీరు సఖాఖానుని కూడా నిర్బంధించారు.

చట్టగ్రామంలో వొకపటాల ముండేది. హటాత్తుగా అది తిరగ బడింది. ఇంగ్లీషువాళ్ళందరూ మారువేషాలువేసుకొని అడవుల్లోకి పారి పోయారు. సిపాయిలు ఖజానా దోచుకున్నారు. జైలు పగలగొట్టారు. ఖైదీలని విడిసించారు. అడ్డూ ఆపూ లేకండా మిలిటరీ బారకాసు తగల బెట్టారు. ఆయుధాగారం కొల్లగొట్టారు. ఆకుపచ్చజెండా పట్టుకుని త్రిపురా బయలుదేరారు.

త్రిపురామహారాజు ఇంగ్లీషువాళ్ళపక్షం పోరాడాడు. చట్టగ్రామం సిపాయిలనెదిరించాడు. శ్రీహట్ట సైనికులుకూడా సిపాయిలమీద విరు చుకు పడ్డారు. ఇంకో ఉపాయం లేకపోయింది సిపాయిలకి. మణిపురం అడవుల్లోకి పారిపోయారు. శ్రీహట్ట సైనికులవల్ల ఎంతోమంది మర ణించారు.

ఢాకాలో అధికార్లు సిపాయిల ఆయుధాలు లాక్కున్నారు. సామానుల గిడ్డంగి, ట్రెజరీ కాస్తూవున్న సిపాయిల తుపాకులున్నూ తీసుకున్నారు. ఇంగ్లీషువాళ్ళు వెళ్లి లాలుబాగుకోటలో దూరారు. లాలుబాగు సిపాయిలు తిరగబడ్డారు. ఉభయులికీ యుద్ధంజరిగింది. ఇంగ్లీషువాళ్ల కంట్లోకారంచల్లి అక్కడి సిపాయిలు ఢాకా వొదిలిపెట్టే శారు. జలపాయిగుడి వెళ్లిపోయారు. అయితే దార్లో తిస్తానది వొడ్డున తెల్లఫౌజుతో వుయిలుగోర వాళ్లు నెదిరించాడు. కాని అడ్డుకో లేక పోయాడు. తిస్తానది మీదుగా నేపాలురాజ్యంలోపడి ఆసిపాయిలు అయోధ్య వచ్చేశారు.

బీ హా రు

"మీరు నన్ను వురితియ్యవచ్చు. నాలాగే ఎంతోమందిని వురి తీసెయ్యవచ్చు. కాని మాభావాలుమాత్రం వురితియ్యలేరు. నేను మర

ణిస్తే నారక్తంలోంచి వేనవేలు వీరులు పుట్టుకు వస్తారు. మీ సామ్రాజ్యం నాశనం చేస్తారు.” – పురికంబ మెక్కుతూ పాట్నా విప్లవనాయకుడు పీరుఆలీ అన్నమాట లివి.

పీరుఆలీ లక్నోనించి పాట్నావచ్చాడు. పుస్తకాలదుకాణం పెట్టుకున్నాడు. విప్లవసంఘంలో బ్రహ్మాండమైన పలుకుబడి వుండే దతడికి.

బీహారంతటికీ పాట్నా విప్లవకేంద్రంగా వుండేది. ఆగ్రా, గయా, ముజఫరుపురమూ, మోతీహారీ, చాప్రా-రాష్ట్రమంతటా రహస్యకేంద్రాలుండేవి. జమీందార్లూ, ధనవంతులూ, సాహుకార్లూ రహస్యసంఘంలో వుండేవాళ్ళు. ధనానికి లోపం వుండేదికాదు.

మీరటు విప్లవం విన్నాక, ఇక్కడ కమీషనరు టెయిలరు రెండు వందల సిక్కుసిపాయిలు పాట్నా తెప్పించాడు. రాటరీ నాయకత్వం కింద సిక్కులు పాట్నావచ్చారు. వాళ్లని దేశద్రోహులంటూ పాట్నా ప్రజలు నిందించారు.

ఈ సిక్కుసిపాయిలని వేసుకుని అనుసూనించిన ప్రతీవాణ్ణీ పట్టుకుని వురితియ్యడం మొదలు పెట్టాడు టెయిలరు. పటాలం మైదానం వధ్యస్థానంగా తయారయింది.

తిరుహూరు జిల్లాలో వొక పోలీసుజమాదారు వుండేవాడు. వారిసు ఆలీ అతడిపేరు. విప్లవరహస్యసంఘంలో వుండేవా డతడు. అతణ్ణి పట్టేసి వురి తీసేశారు. అతణ్ణి అరస్టు చేస్తున్నప్పుడు తన దగ్గిర వొక ఉత్తరం దొరికింది. అది అప్పుడే గయలోని అలీకరీముకి రాస్తున్నా డతడు. అలీకరీము గయలోని విప్లవనాయకుడు. వారీసుఆలీ వురికొయ్య దగ్గిరికి వెళుతూ అరిచాడు – “నిజమైన స్వరాజ్యభక్తు లెవరైనా వుంటే నన్ను విడిపించండి” అని. అతడి మాట పూర్తికాలేదు. ఉరి తీసేశారు.

ఇటు వారీసుఆలీని వురితీసేసి అటు ఆలీకరీముకోసం తెల్లఫౌజు వెళ్లింది. ఫౌజు వచ్చేసరికి ఆలీకరీము వొక ఏనుగుమీద వుడాయించాడు. ఇంగ్లీషువాళ్ళు వెంటాడారు. ఆలీకరీము వొకతట్టువెళితే ఇంకోతట్టు వెళ్లాడంటూ గ్రామస్తులు ఇంగ్లీషుసిపాయీలని తప్పుదారిని పెట్టారు. పరిగెత్తి పరిగెత్తి అలిసిపోయారు ఇంగ్లీషుసిపాయిలు. తెల్ల మొహాలతో తిరిగి వచ్చేశారు. ఆలీకరీము అయిపులేకండా అయిపోయాడు.

పాట్నాలో ముగ్గురు ముల్లాలుండేవాళ్ళు. రహస్య సంఘంలో ప్రముఖపాత్ర వహించారు. వాళ్ళమీద కెయిలసు కన్ను వేశాడు. బహిరంగంగా వాళ్ళని పట్టెయ్యడానికి సాహసంచాలలే పతడికి. ఊళ్లో పెద్దలతో వొకనాడు వాళ్ళని తన బంగళాకి ఆహ్వానించాడు. అతిథులుగా వచ్చిన వాళ్ళు ముగ్గురికీ అరదండాలు తగిలించాడు.

పాట్నాలో వహాబీముసల్మానులు అధికంగా వుండేవాళ్లు. ఈఅరస్టులూ, వురులూ చూసి వాళ్ళు సహించలేకపోయారు. ఒకనాడు పీరుఆలీ ఇంట్లో రహస్యంగా సమావేశమయారు. విప్లవం నిశ్చయించారు. జూలై మూడున ఆకుపచ్చజెండా ఎగరవేశారు. తిన్నగావెళ్లి ఇంగ్లీషుగుడి ముట్టడించారు. లాయలు దొరని పీరుఆలీ పిస్తోలుతోకాల్చేశాడు. ఇంతలో రాటకీ సిక్కుసిపాయిలతో పరిగెత్తుకువచ్చాడు. పీరుఆలీనీ, అతడి అనుచరుల్నీ పట్టేశాడు. మిగిలిన విప్లవకారుల పేర్లు చెప్పమని, పీరుఆలీని యమయాతన పెట్టారు. తుదకి వురితీసేశారు. ఉరికంబమెక్కుతూ పీరుఆలీ అన్నమాటలు దేశభక్తులకి దివ్యమంత్రాలయాయి.

పీరుఆలీ వురి బీహారంతటినీ కుతకుతలాడించింది. జూలై ఇరవై అయిదున దానాపురం నేటివుపటాలం తిరగబడింది.

దానాపురం పాట్నాకి దగ్గిరసావుంది. అక్కడ ఏడూ, ఎనిమిదీ, పదాన్నలుగూ నేటివు పదాతికదళాలూ, వొక తెల్లపటాలమూ వొక తెల్ల ఫిరంగిదళమూ వుండేవి. ఇదంతా మేజరు జనరలు లాయడు అధికారంకింద వుండేది. ఇక్కడకూడా నేటివుసిపాయిల ఆయుధాలు లాక్కోవాలని నిశ్చయించారు. అయితే లాయడుసేనాని కొత్తమార్గం కనిపెట్టాడు. తుపాకులేమో సిపాయిలదగ్గిరే వుంచాడు. కేపులు మాత్రం తీసుకున్నాడు. కేపులేని తుపాకి వేలదు. ఏమయితేనేం, తిరుగుబాటు చేసిన సిపాయిలు దానాపురంనించి జగదీశపురం వెళ్లిపోయారు. ముసిలిసేనాధిపతి లాయడు వాళ్ళనివెంటాడడం మానేశాడు.

జగదీశపురం శాహాబాదుజిల్లాలో వొక చిన్న సంస్థానం. పురాతనకాలంనించి వొక రాజపుత్రవంశ మిక్కడ రాచరికంచేస్తూవుండేది. శాహజహానుదర్బారులో వీళ్లకి రాజబిరుదులభించింది. మన చరిత్ర నాటికి జగదీశపురంరాజు కుమారసింహుడికి ఎనభై ఏళ్ళవయస్సు. ఎనభై ఏళ్లయినా కుమారసింహుడు కుమారసింహం. డల్హౌసీఅపహరణ నీతిలో కుమారసింహుడి సంస్థానంకూడా కుంపినీ అపహరించింది.

1857 స్వాతంత్ర్యయుద్ధంలో కుమారసింహు డొక, సుప్రసిద్ధ నాయకుడు. మహావీరుడు. ఉద్యమారంభంనించీ అతడు నానా సాహెబుతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూవుండేవాడు. శాహాబాదుజిల్లాలో అతడి పలుకుబడి అద్వితీయ మయింది. కుమారసింహుడికి కుమార్తెలులేరు; చచ్చిపోయారు. తమ్ముల్లుమాత్ర మున్నారు. పాట్నాకమిషనరు కెయిలరు కుమారసింహుడిమీదకూడా కన్ను వేశాడు. పాట్నాముల్లాల నాహ్వానించినట్లే ఇతణ్ణికూడా ఆహ్వానించాడు. "మీరు వయోవృద్ధులు. మీ ఆరోగ్యం సరిగాలేనందుకు విచారిస్తున్నాను. పాట్నా దయచేయండి. నా ఆతిథ్యం కొన్నాళ్ళు స్వీకరించండి" అంటూ ఉత్తరం రాశాడు. కుమారసింహుడు

కరవాలసింహుడు



గ్వాలియరు దుర్గం – మంత్రి దివాకరరావు

ఈ నక్క-జిత్తులు కనిపెట్టేశాడు. "నిజమే నా ఆరోగ్యం బాగాలేదు. పాట్నా ఇప్పుడు రాలేను. కోలుకోగానే వస్తాను" అంటూ జవాబు రాశాడు.

దానాపురం సిపాయిలకి కుమారసింహుడి సామర్థ్యం తెలుసు. విప్లవోద్యమంలో అతడికున్న ప్రమేయమున్నూ ఎరుగుదురు. అందుకని ఎక్కాఎక్కిని వాళ్ళు జగదీశపురం వచ్చేశారు. వాళ్ళు రావడమే తడువు, కుమారసింహుడు జూలుదులిపిన సింహంలా లేచాడు. నాయకత్వం వహించాడు. తన ఆయుధాలు పైకితీశాడు. రణరంగానికి దుమికాడు. స్వతంత్రసేన నడిపించుకుంటూ ఆరామీదికి దండయాత్ర బయలుదేరాడు. అతడి కడసారితమ్ముడు అమరసింహుడున్నూ అతడితో బయలుదేరాడు. షాహాబాదుజిల్లాలో ఆరా ముఖ్య నగరం. అక్కడి ఇంగ్లీషువాళ్ళు ముందే జాగ్రత్తపడ్డారు. అక్కడి కోటలో ఆయుధాలూ, ఆహారాలూ అవీ భద్రపరుచుకున్నారు. కుమారసింహుడు రావడంతోనే కోటలోకి పారిపోయారు.

కుమారసింహుడు ఇరవై ఏడున ఆరా ముట్టడించాడు. ఖజానాకొల్లగొట్టాడు. జైలు పగలగొట్టాడు. ఖైదీలని విడిపించాడు. కచేరీలు పడగొట్టాడు. బ్రిటిషుజెండా కాళ్లతో తొక్కేశాడు. ఇదంతా అయాక కోట ఖిరాయించాడు. కోటలో పాతికమంది ఇంగ్లీషువాళ్లూ యాభైమంది సిక్కు-సిపాయిలూ వున్నారు. కోటచుట్టూ ఇసకగట్టు వేశారు. ఇరవైనాలుగు గంటల్లో కోట అప్పగించేసి, లొంగిపొండన్నాడు కుమారసింహుడు. సిక్కు-సిపాయిలని స్వాతంత్ర్య యుద్ధంలో చేతులుకలపమన్నాడు. దేశంకంటె కుంపినీయే నచ్చింది సిక్కులకి. కోట అప్పగించడానికి ఇంగ్లీషువాళ్లు నిరాకరించారు. కోటముట్టడి సాగింది. ఇసకగట్టు కోటని కొండలా కాపాడింది. మూడుదినాలు ముట్టడి జరిగింది. కోటలో నీళ్లు కరువయాయి. సిక్కులు యాభై

మందీ ఒక్కరోజులో కొత్తనుయ్యి తవ్వేశారు. పాతికమంది దొరలకీ ప్రాణదానంచేశారు.

ఆర్రాకోట ముట్టడివార్త దానాపురం చేరింది. మూడువందలమంది తెల్లఫౌజూ, వందమంది సిక్కుసిపాయిలూ వేసుకుని, కెప్టెను డన్‌బారు బయలుదేరాడు. కొంతదూరం ఓడమీదా, కొంతదూరం పడవల మీదా వచ్చి షోనాసదినించి పన్నెండు మైళ్లు కాలినడకని ఆర్రావెళ్లాలి. సైన్యంనడిపించుకుంటూ బయలు దేరాడు డన్‌బారు.

రాత్రిపడింది. చీకటి దట్టంగావుంది. ఒక నేటీవు దారిచూపుతూ ముందునడుస్తున్నాడు. డన్‌బారుపటాలం వెనకనడుస్తూ వుంది. ఆర్రా దగ్గిరపడింది. పటాలం ఒక మామిడితోపులో చేరింది. రాత్రి నిశ్శబ్దంగా వుంది. చీకటి దట్టంగావుంది. చుట్టూ ఘనీభవించిన నిశ్శబ్దం.

డన్‌బారుపటాలం తోపులోంచి వెళుతూవుంది. హటాత్తుగా గుభీ గుభీ తుపాకులు పేలాయి. దనాదన్ గుళ్ళవర్షం. ఎక్కడినించి? ముందు నించా? కాదు. పక్కనించా? కాదు. వెనకనించా? అంతకంటే కాదు. మరి? చెట్ల మీంచి.

డన్‌బారుపటాలం వస్తూవుందని కుమారసింహుడికి వుప్పందింది. పటాలం మామిడితోపులోంచే రావాలి. అంచేత ముందే చెట్లమీద తనసిపాయిలతో అతడు కనిపెట్టుకు కూచున్నాడు. తోపు తోపంతా, ప్రతీచెట్టుమీదా, కొమ్మకొమ్మకీ సిపాయిలు తుపాకులతో కూచోపెట్టాడు. డన్‌బారుపటాలం తోపుచేరుకోగానే కాల్పులు ప్రారంభించేశాడు. దికూ తెన్నూ లేక; తెల్లసిపాయిలూ సిక్కుసిపాయిలూ మారణహోమ మయిపోయారు. మామిడితోపులో రక్తనదులు ప్రవహించాయి. నాలుగువందలమందిలోనూ ఏయాభై మందిమాత్రమో బతికిపోయి, దానాపురం దౌడుతీశారు. కెప్టెన్ డన్‌బారు తోపులోనే

కూలిపోయాడు. రాజపుత్రవీరుడు వృద్ధకుమారసింహుడు తనప్రతాప మలా మచ్చుచూపాడు.

ఆర్రా మామిడితోపువృత్తాంతం దానాపురం చేరింది. ఆంగ్లేయులు హాహాకారాలుచేశారు. దొరసానుల ఏడుపులు మిన్నుముట్టాయి. *

అదేసమయానికి మేజరు విన్సెంటుఏరే కొంతపటాలం తీసుకుని కలకత్తానించి అలహాబాదు వెళుతున్నాడు. ఆర్రా మామిడితోపు వృత్తాంతం విని అతడు ఆర్రా బయలుదేరాడు. కుమారసింహు డిది విన్నాడు. దారిలోనే ఏరేని ఎదిరించడానికి సిద్ధపడ్డాడు. ఉభయసేనలూ బీబీగంజి దగ్గిర తారసిల్లాయి. హోరాహోరి యుద్ధం జరిగింది. కుమారసింహుడిసైన్యం అద్భుతంగా పోరాడింది. అనుక్షణమూ ఆంగ్లేయులస్థితి సందిగ్ధంగా వుండేది. అయితే వాళ్ళకి ఫిరంగులబలం అధికంగావుండేది. అంచేత కుమారసింహుడిసేన తుదకి ఓడిపోయింది. ఎనిమిదిదినాల తరవాత ఆర్రాకోట ఆంగ్లేయులవశమయింది.

కుమారసింహుడు జగదీశపురం వచ్చేశాడు. ఇంగ్లీషువాళ్లు జగదీశపురం ముట్టడిస్తారని విన్నాడు. సైన్యం కూర్చుకుని, గొరిల్లాయుద్ధానికి సిద్ధపడ్డాడు.

పంజాబు

పంజాబులో ముఖ్యమైనపటాలం మియూమీరులో వుండేది. మూడు నేటివుపదాతిదళాలూ, ఒక గుర్రపుదళమూ, కొంత ఫిరంగి

* "An Englishman writes, 'He who had heard the heart-rending cries of those English women will not forget it to this day! Some began to beat their breasts, crying piteously, some shouted hoarsely, and some began to pull away their hair. If they had seen General Lloyed, the originator of this destructive plan, there is not the least doubt that they would have lynched him!"— Savarkar.

ఫౌజు వుండేది. ఇందులో ఇంగ్లీషువాళ్ళకంటే నేటివులు నాలుగింతల మంది.

మియామీరు లాహోరుకి ఆరుమైళ్ళదూరంలో వుంది. లాహోరు కోటలో వొక తెల్లపటాలమూ, వొక నేటీవుపటాలమూ వుండేవి. ఈసేన యావత్తూ రాబర్టు మాంటుగొమరీ అధికారంకింద వుండేది. పంజాబు చీఫ్‌కమిషనరు సర్ జాను లారెన్సు రావల్పిండిలో వుండే వాడు. మాంటుగొమరీ జ్యుడీషియలు చీఫ్‌కమిషనరుగా వుండేవాడు.

మీరటులో నిప్పురగులోక్కవడమే తడువుగా మాంటుగొమరీ జల్లు కున్నాడు. ఒకబ్రాహ్మణ్ణి గుప్తచరుడుగా నియమించాడు. తన పటాలం విప్లవానికి ప్రయత్నిస్తుందో లేదో కనిపెట్టాడు. గుప్తచరుడు గుట్టులాగాడు. మాంటుగొమరీచెవులో వూదాడు.

మియామీరు పహారాయిస్తూవున్న పటాలం డ్యూటీ పదిహేనుతో అయిపోతుంది. మరొకపటాలం డ్యూటీమీదికి వస్తుంది. అదే సమయంలో రెండుపటాలాలూ కలిసి ఇంగ్లీషువాళ్ళకి బుద్ధిచెప్పాలి. ఖజానా దోచుకోవాలి. మందుగుండు కొల్లగొట్టాలి. జైల్లోవున్న రెండు వేలమంది ఖైదీలనీ విడిపించేసి, తమలో కలుపుకోవాలి. లాహోరు కోట పట్టుకోవాలి. అప్పుడే వొక్కసారిగా అమృతసరమూ, పేషావరూ, ఫిలౌరూ, జలంధరుపటాలాలున్నూ తిరగబడాలి. - ఇదీ సిపాయిల నిర్ణయం. ఇందులో సిక్కుసిపాయిలకి మాత్రం సంబంధం లేదు.

పంజాబులోని అనేకపట్నాల్లో ప్రజలు హిందువులూ, మహమ్మదీయులూ స్వాతంత్ర్యయుద్ధానికి సహానుభూతిచూపుతూ వుండేవాళ్ళు. సిక్కులుమాత్రం సర్ జాను లారెన్సు మిత్రభేదంవల్ల వ్యతిరేకంగా వుండేవాళ్ళు.

1857 స్వాతంత్ర్యసమరం బహదూరుషా పేరుమీదుగా జరిగింది. ఇది ఆధారంగా తీసుకుని సిక్కులకీ మహమ్మదీయులకీ లోగడవున్న

కలతలు రేపి, సిక్కు-లు దూరంగా వుండేటట్లు పన్నాగం పన్నాడు లారెన్సు. బహదూరుషా వేర దొంగప్రకటన తయారుచేసి, గోడల మీద అంటించాడు. "స్వరాజ్యం రాగానే సిక్కు-ల్ని నాశనం చెయ్యడమే పాదుషావారి మొదటిపని" అని ఆప్రకటన. "పంజాబులో లారెన్సు ఈదొంగప్రకటనలు అంటిస్తూవున్నప్పుడే ముసిలిపాదుషా బహదూరుషా ఏనుగుమీద ఢిల్లీ వీధుల్లో తిరుగుతూ స్వయంగా చెపుతూవచ్చాడు – 'ఈ స్వాతంత్ర్యయుద్ధం యావత్తూ వొక్క ఫరంగి వాళ్ళతోనే. హిందూదేశంలో ఎవ్వరికీ ఎవ్విధమైన హానీ జరిగించడం కోసంకాదు' అని"

అంతేకాదు, ఇంగ్లీషువాళ్ళని తరిమేసి, స్వరాజ్యం తెచ్చుకున్నాక, తగిన నేటివురాజుల చేతిలో రాజ్యంపెట్టి తన సార్వభౌమత్వం వొదులుకుంటానని కూడా రాజులకి బహదూరుషా ఉత్తరాలు రాశాడు.*

లారెన్సు మరో ఉపాయమున్నూ చేశాడు. పంజాబుప్రజలదగ్గిర కుంపినీ తరఫున నూటికి ఆరుచూపాయల వడ్డీ చొప్పున ఎంతోధనం ఋణం పుచ్చుకున్నాడు. ఈ ఋణమిచ్చిన షాహుకార్లూ వాళ్లూ కుంపినీకి వ్యతిరేకించలేకపోయారు. ఇంగ్లీషువాళ్ల క్షేమమే వాళ్ళు కోరారు.

స్వాతంత్ర్యసమరంలో చేతులు కలపం డని సిక్కు-సర్దార్ల దగ్గిరికి బహదూరుషా రాయబార మంపాడు. అలా రాయబారిగా వెళ్లిన తాజుద్దీను పంజాబునించి పాదుషాకి ఇలా రాశాడు:

---

* "It is my ardent wish to see," wrote the Emperor to the Rajahs of Jaipur, Jodhpur, Bikaner, Alwar and others, "that the Feringhi is driven out of Hindusthan by all means and at any cost...the whole of Hindusthan should be free. If all of you native Rajas are ready to unsheathe your sword to drive away the enemy, that I am willing to resign my imperial powers and authority in the hands of any confederacy of native princes who are chosen to exercize it."— Dr. J. K. Benerji.

"పంజాబు సిక్కు-సర్దారులందరూ సోమరిపోతులు ; పిరికిపందలు. ఈ విప్లవంలో వాళ్ళు పాల్గొంటారన్న ఆశలేదు. వీళ్ళందరూ ఫరంగీల చేతి కీలుబొమ్మలయిపోయారు. వీళ్ళందరినీ నేను రహస్యంగా కలుసుకున్నాను. మాట్లాడాను. గుండెలు కరిగేటట్లు బోధించాను. ఫరంగీలతో కలిసి దేశస్వాతంత్ర్యానికి ద్రోహంచెయ్య వద్దన్నాను. స్వతంత్ర భారతంలో మీరు ఇప్పటికంటే హాయిగా వుంటారన్నాను. మీమంచి కోసమే పాదుషావారితో చేతులుకలపం డన్నాను. 'మేమంతా అందుకోసం ఎదురుచూస్తున్నామ'న్నారువాళ్ళు. 'పాదుషాహుకుం రావడమే తడవు, ఇంగ్లీషు కాఫర్లని కడతేరుస్తాం' అన్నారు. కాని వీళ్లమీద ఏమాత్రమూ ఆశపెట్టుకోకూడ దనే నా నమ్మకం."

తాజుద్దీను నమ్మకమే నిజమయింది. తరవాత పాదుషా ఉత్తరాలిచ్చి పంపిన గుర్రపుదౌతుల్ని ఈ సరదార్లు చంపేశారు.

సిపాయిల రహస్యం మాంటుగొమరీకి తెలిసిపోవడంతోనే అతడు వాళ్ల తుపాకులూ అవీ లాక్కోవాలని నిశ్చయించాడు. అదే సమయంలో అనార్కలీ దగ్గిర తనవాళ్లతో సంప్రదించి సర్ జాను లారెన్సు కూడా అదే నిశ్చయించాడు.

అవాళ మే పదమూడు. ఉన్నపళాన మియూమీరు నేటివు పటాలానికి హుకుము వచ్చింది. – "సిపాయిలందరూ కవాతుమైదానంలో హాజరుకావాలి."

రెండువేల అయిదువందలమంది సిపాయిలువచ్చి; కవాతుమైదానంలో నిలబడ్డారు. వాళ్లు వచ్చేసరికి మైదానం పద్మవ్యూహంలావుంది. ఫిరంగులూ, వురికొయ్యలూ, తెల్లఫౌజూ, సిక్కు-సిపాయిలూ, ఫిరంగిదళమూ మైదానంచుట్టూ ఫిరాయించి వుంది. ఇరవై అయిదువందల నేటీవు సిపాయీలనీ మధ్యపెట్టారు. ఒక్కసారి సైన్యాధిపతి ఆజ్ఞాపించాడు – "ఆయుధాలు కిందపెట్టండి." ఇరవై అయిదువందలమందీ

ఆయుధాలు కిందపేట్టేశారు. మళ్లీ ఆజ్ఞ – "బైటికి నడవండి." తల వొంచుకుని నెమ్మదిగా బైటికి వచ్చేశారు సిపాయిలు.

మర్నాడు తెల తెలవారుతూ వుండగా యూరోపియన్ వొకటో తెల్ల పటాలంతో కల్నలు స్మిత్తు లాహోరుకోటలో ప్రవేశించాడు. నేటీవుసిపాయిల ఆయుధాలూ అవీ లాక్కున్నాడు. బైటికి బసలకి పంపేశాడు.

అమృతసరం గోవిందగడం దుర్గంలో ఎంతోమంది నేటీవుసిపాయిలు వుండేవాళ్ళు. ఫెడ్రికు కూపరు ఇక్కడ డిప్యూటీకమీషనరుగా వుండే వాడు. ఇతడే "The crisis in the Punjab" గ్రంథం వ్రాశాడు. మియామీరు, లాహోరులపని ముగించి మాంటిగొమరీ కూపరుకి తెలియజేశాడు. కూపరు అమృతసరంలో జాగ్రత్తపడ్డాడు. సిపాయిల ఆయుధాలు లాక్కున్నాడు. కోట కాపలావేశాడు. తన కిందిఉద్యోగి మేకన్‌టన్నుని పంపి గ్రామాల్లో ప్రచారంచేయించాడు. లాహోరు, అమృతసరం దార్లలో పటాలాలు తిప్పాడు.

ఫిరోజపురం, ఫిలోరాలలో ఇంగ్లీషువాళ్ల మందుగుండూ, ఆయుధాలూ అవీ అధికంగా వుండేవి. ఫిరోజపురంలో ఆరడుగుల గోడలతో పెద్ద ఆయుధాగార ముండేది. మే పదకుండున మీరటునించి వొకసిపాయి వచ్చాడు. ఇక్కడి సిపాయిలలో అగ్నిహోత్రం రెచ్చగొట్టాడు. అదునుకోసం చూస్తూనే వుండేవాళ్లు సిపాయిలు. వాళ్లని పరిశీలించడానికని మే పదమూడున అధికార్లు కవాతుమైదానానికి పిలిచారు. సిపాయిలు బుద్ధిమంతుల్లా ప్రవర్తించారు. ఏమాత్రమూ సందేహం కలగలేదు దొరలకి. కొద్దిగంటలు గడిచాయో లేదో, "దీన్ దీన్" "హరహర మహాదేవ" అంటూ లేచారు సిపాయిలు. వాళ్లతో పట్నంప్రజలు కూడా కలిశారు. దొరల బంగళాలూ, ఇంగ్లీషుహోటేళ్లూ – లంకాదహనం చేసేశారు.

సిపాయిలు తిరగబడడంతోనే ఆయుధాగారంలో ఇంగ్లీషువాళ్లు నిప్పంటించేశారు. బ్రహ్మాండమైన శబ్దంతో భస్మమైపోయింది ఆయుధాగారం. సిపాయిలు ఢిల్లీవచ్చేశారు. తెల్లఫౌజు వాళ్ల వెంటపడింది. లాభంలేకపోయింది. తిరిగివచ్చేసింది.

ఫిలోరాలో అనుక్షణమూ భయపడుతూనే వుండేవాళ్లు ఇంగ్లీషు వాళ్లు. యావన్మందీ పిల్లాజెల్లా తీసుకుని కోటలో తలదాచుకున్నారు. జలంధరునించి వందాయాభైమంది తెల్లసిపాయిలని తెప్పించి కోట కాపలా వేయించారు.

జలంధరులో మరింత బితుకుగా వుండేది. అక్కడి నేటీవుసిపాయిలకి హోసియారపురం, కాంగడా, నూరుపురం సిపాయిలు సహాయం రావచ్చు. వాళ్లంతా ఏకమైతే పరిస్థితి విషమిస్తుంది. జలంధరు సిపాయిల ఆయుధాలు లాక్కుందికికూడా అధికార్లు సాహసించలేదు. అందుకని కప్తర్తలామహారాజు రణధీరసింహుడి సహాయం కోరారు దొరలు. అయిదువందలమంది సిక్కుసిపాయిలూ, రెండు పెద్ద ఫిరంగులూ రణధీరసింగు పంపాడు. రణధీరసింగురాజ్యం కుంపినీ కొంత కాజేసింది. అయినా ఆపదలో అతడు అడ్డుపడ్డాడు.

అన్నిటికంటే పంజాబులో పెషావరు విషయం భయంగా వుండేది. అక్కడ ప్రళయంపుట్టిందో ఇంగ్లీషురాజ్యం దుంపనాశన మవుతుంది. ఆఫ్గనులూ, ఆఫ్రిదీలూ, కాబూలీవాళ్లూ అధికంగా వున్న ప్రదేశమది. సరిహద్దు ఆఫ్గనులంటే పక్కబెదురుగా వుండేది లారెన్సుకి. పైగా లక్నో విప్లవనాయకులు కాబూలు అమీరుతో ఉత్తరప్రత్యుత్తరాలు నడుపుతూవున్న సంగతి అతడికి తెలుసు. రెండేళ్లకిందట దోస్తు మహమ్మదుకి విప్లవనాయకులు రాసిన ఉత్తరంకూడా ప్రభుత్వం చేతిలో పడింది. – "కుంపినీ అయోధ్య కబళించేసింది. ఎప్పుడో హైదరాబాదు పనికూడా అయిపోతుంది. మహమ్మదీయరాజ్యం అన్న మాటే

వినపడదిక. దీనికి ప్రతీకారం జరిగితీరాలి. లక్నోప్రజలు స్వరాజ్యం కోసం లేచినప్పుడు మీరేం సహాయం చేస్తారు?" అని వుంది ఆవుత్తరం.

ఈ అన్ని కారణాలవల్లా తన సర్వశక్తులూ వినియోగిస్తూ పనిచేశాడు సర్ జాను లారెన్సు. రాజభక్తిపరులయిన సిక్కులతోనూ, కొంతమంది ఆఫ్గనులతోనూ వొక అస్థాయిసైనికదళం స్థాపించాడు. పోలీసుల అధికారమున్నూ అధికంచేశాడు. ప్రతీ సివిలుఉద్యోగికూడా సందేహమున్న వాళ్లని వురితీసెయ్యవచ్చన్నాడు. దేశీయులెవరూ ఆయుధాలు వుంచుకోరాదన్నాడు.

పెషావరులో 24, 27, 51 నెంబర్ల కాల్బలమూ, వొక గుర్రపు దళమూ వుండేవి. 2,500 మంది తెల్లసిపాయిలూ, పదివేలమంది నేటీవుసిపాయిలూ వుండేవాళ్లు. వీళ్లంతా పెషావరులోనూ, చుట్టుపట్లా వుండేవాళ్లు. మే ఇరవై రెండున నేటీవుసిపాయిలు విప్లవంనిశ్చయించారు.

మియామీరు లాహోరు సమాచారాలు విని ఇక్కడకూడా సిపాయిల ఆయుధాలు లాక్కోవాలని ఆఫీసర్లు నిశ్చయించారు. మే ఇరవై రెండు ఉదయం కాటనూ, నికోల్సనూ తెల్లఫౌజుతో ఫిరంగులు వేసుకుని నేటీవుసిపాయిల ఆయుధాలు కిందపెట్టించారు. సిపాయిలు నెమ్మదిగా బసలకి వెళ్లిపోయారు. బసలనించి వాళ్లని కదలకూడదని ఆజ్ఞాపించారు.

ఆరాత్రి కొందరు సిపాయిలు వూళ్లోకి బయలుదేరారు. అధికార్లు వాళ్లని వెంటనే అరస్టుచేశారు. నుంచున్న పాశాన పదముగ్గురిని వురితీసేశారు. యూబై వొకటోపటాలం సుబేదారు మేజరుని కూడా వురితీసేశారు. "సంవత్సరంనించీ నేను విప్లవకారుణ్ణే" అన్నాడతడు – "ఇంగ్లీషుప్రభుత్వానికి ఇది అంతిమకాలం" అంటూ వురికంబమెక్కాడు. ఇతడి వొంటిమీద తొమ్మిదివందలరూపాయలు దొరికాయట! "అవి ఏంచేస్తారు?" అంటూ అత డడిగాడు. "నీ వురికోసం

అయిన ఎనభై నాలుగురూపాయలు మినహాయించి, తక్కినవి సర్కారు తీసుకుంటారు" అన్నారు అధికార్లు. తరవాత మరికొంతమందినీ వురి తీశారు. కొందరిని ఫిరంగుల మూతులకి కట్టేసి పేల్చేశారు. ఆదినాళ్లో సిపాయీలని ఫిరంగుల మూతులకి కట్టేసి కాల్చి, ఎగరగొట్టెయ్యడం సాధారణకృత్యంగా వుండేది.

పెషావరుకి దగ్గిరగా హుతీమర్దానులో యాభై అయిదో పటాల ముండేది. స్నాటిసువుడ్డు దీనికి కల్నలుగా వుండేవాడు. తన సిపాయిల ఆయుధాలు లాక్కోడానికి అతడు అంగీకరించలేదు. అధికార్లు వొప్పుకోలేదు. స్నాటిసువుడ్డు తనగదిలోకివెళ్లి ఆత్మహత్యచేసుకున్నాడు.

అతడేమో ఆత్మహత్య చేసుకున్నాడు. అధికార్లుమాత్రం తమ సంకల్పం వొదులుకోలేదు. పెషావరునించి తెల్లఫౌజు రవానా చేశారు. ఈవార్త యాభై అయిదోపటాలం సిపాయిలకి తెలిసింది. తెల్లఫౌజు వచ్చేలోగా మర్దానుకోటవొదిలి పారిపోవడానికి వాళ్లు నిశ్చయించారు. కాని లాభంలేకపోయింది. అధికంగా తెల్లఫౌజు వచ్చిపడింది. ఫిరంగులతో సిపాయిలని ఫిరాయించింది. వందా యాభైమంది నేటీవు సిపాయిలని నుంచున్నపాళాన కాల్చిపారేసింది. ఎలాగో కొందరు తప్పించుకు పారిపోయారు. మిగిలినవాళ్లు దొరికిపోయారు. వాళ్లని అరస్టుచేసి. యమయాతనలు పెట్టారు. ముప్ఫయిమందికి వొకసిపాయి చొప్పున ఫిరంగులమూతికి కట్టడానికి ఎంచారు.

అవాళ పరేడుదృశ్యం చిత్రంగా వుండేది. కవాతుమైదానం మీద తొమ్మిదివందలమంది సిపాయిలుండేవాళ్ళు. విశాలమైన మైదానంమీద మూడుదిక్కులాఫౌజు నిలబెట్టారు. నాలుగోతట్టు ఫిరంగులుపెట్టారు. మొదట పదిమందిఖైదీలని ఫిరంగులమూతులకి కట్టేశారు. ఫిరంగిదళంఆఫీసరు తనకత్తి వూపాడు. ఫిరంగులు గర్జిం

చాయి. పొగలో సిపాయిల కాళ్లూచేతులూ, తలకాయలూ ముక్కలుముక్కలు ఎగిరిపోతూ అవుపించాయి. ఇలా నాలుగుసార్లు జరిగింది. ప్రతీసారీ పటాలమంతటా గుండెలుచీల్చుకుని మూలుగులు వినిపించాయి. ఆదృశ్యం బీభత్సంగావుండేది. అవాళనించీ ప్రతీ ఆదివారమూ ఇలా సిపాయీలని ఫిరంగులమూతులకి కట్టి కాల్చెయ్యడం జరుగుతూనే వుండేది. రానురాను అది సర్వసాధారణంలా అలవాటయిపోయింది.

హోతీమర్దానునించి పారిపోయిన సిపాయిలని తెల్లసిపాయిలు వెంటాడి, వెంటాడి ఎంతోమందిని పట్టుకున్నారు. నికోల్సను ఇరవై నాలుగుగంటలూ గుర్రందిగకండా, జంతువులువేటాడినట్లు సిపాయీలని వేటాడాడు. వందలువందలు సిపాయిలు చచ్చిపోయారు. ఎంతోమంది దొరికిపోయారు. సరిహద్దుదాటి, ఎంతోమంది పారిపోయారు. అలా పారిపోయినవాళ్ళు తిండితిప్పలూ లేకండా నానాఅవస్థలూ పడుతూ కాశ్మీరుచేరుకున్నారు. కాశ్మీరుమహారాజు గులాబుసింగు ఆశ్రయమిస్తాడని ఆశించారు. కాని ఎక్కడికివెళ్ళినా మృత్యువే! మృత్యువేవాళ్లని ఆదరించింది. అలా యాభై అయిదోపటాలం సిపాయిలు మొత్తం వెయ్యిమంది ఇంగ్లీషువాళ్లకి బలిఅయిపోయారు. ఈ సిపాయిల్లో వొక్కడూ వొక్క ఇంగ్లీషువాణ్ణి చంపినపాపాన పోలేదు. ఒక్క ఇంగ్లీషుర క్తంచుక్క కళ్లచూడలేదు. అది లారెన్సే అంగీకరించాడు. అయినా రావణాహింసలుపెట్టి, వాళ్ళని చిత్రవధ చేశారు. ఆ ఘోరాలు ప్రపంచానికి తెలియకపోవడమే మంచి దన్నాడు సర్ జాన్ విలియం కే*

* "Though I have plenty of letters with me describing the terrible and cruel tortures committed by our officers, I do not write a word about it. So that this subject should be no longer before the world!" – Kaye – Sepoy war.

పదో గుర్రపుపటాలందగ్గిరా ఆయుధాలూ అవీ తీసుకున్నారు. వాళ్లగుర్రాలూ, వాళ్ళ సొంతసొమ్ము ఎనిమిదివేలరూపాయలూ లాక్కున్నారు. గుర్రాలుఅమ్మేసి, అదీ, ఈనగదూ సర్కారు జమ కట్టుకున్నారు. ఈగుర్రాలు ప్రభుత్వానివికావు. సిపాయిలు సొంతంగా కొనుక్కొన్నవి. ఇలా అన్నీలాక్కుని, సిపాయిలని బలవంతంగా పడవలమీదపెట్టి, సింధునది ప్రవాహంలో వొదిలిపెట్టేశారు. వాళ్లఅవస్థ ఏమయిందీ అప్పటికీ ఇప్పటికీ అంతు దొరకలేదు.

మే నెలంతా జలంధరూ, ఫిలోరా, లూధియానాల్లో శాంతంగా గడిచిపోయింది. జూను మొదటివారమూ చడీ చప్పుడూ లేదు. కాని జూను తొమ్మిదిని ఉన్నట్టుండి ప్రళయంపుట్టింది. అద్దరాత్రి సిపాయిలు కేకలువేశారు – "ఢిల్లీచలో!" "ఢిల్లీచలో!!"

ఫిలోరాసిపాయిలకి కబురందించడానికి, వొకబేగీరావు గుర్రంమీద పరిగెత్తాడు. ఫిలోరాసిపాయిలు ఆకుపచ్చజెండాతో తయారయారు. ఇంతలో జలంధరుసిపాయిలు వచ్చి కలిశారు. వాళ్లూ వీళ్లూ ఏకమయారు. నినాదాలుచేశారు – "ఢిల్లీచలో!" "ఢిల్లీచలో!!"

ఫిలోరాకీ లూధియానాకీ మధ్య సట్లజు (శతద్రు) నది వుంది. అదే సమయానికి లూధియానా కమిషనరు థర్నటను సిపాయిల జీతాలివ్వడంకోసం లూధియానా వచ్చాడు. జలంధరు సిపాయిలు లూధియానా వస్తున్నారని విన్నాడు. వెంటనేవచ్చి సట్లజుమీద వంతెన పడగొట్టేశాడు. కొంతమంది ఇంగ్లీషు సిపాయిలనీ, సిక్కుసిపాయిలనీ తీసుకుని నదివొడ్డున కాశాడు. నాభామహారాజు రెండుఫిరంగులూ, కొంతసేనా పంపించాడు.

జలంధరు విప్లవసేనకి ఉప్పందిపోయింది. నదికి నాలుగుమైళ్ళు పైకివెళ్లి రాత్రిపూట అక్కడ నదిదాటడానికి నిశ్చయించారు. రాత్రి పదిగంటలయింది. అనుకున్న చోట నది దాటుతున్నారు సిపాయిలు.

కొందరు అవతలవొడ్డు చేరుకున్నారు. ఇంకా వాళ్ళ ఫిరంగులూ అవీ దాటలేదు. ఇంతలో ఇంగ్లీషుసేన వాళ్ళని ఆక్రమించింది. ధనాధన్ తుపాకులు పేలుతున్నాయి. గుళ్ళవర్షం కురుస్తోంది. చంద్రోదయం కావడానికి ఇంకా రెండుగంటలు వ్యవధి. ఎటునించి గుళ్ళువస్తున్నాయో అర్థంకాలేదు. అయినా జలంధరు సిపాయిలు అధైర్యపడ లేదు. హోరాహోరి రెండుగంటలు యుద్ధంచేశారు. ఇంగ్లీషు కమాండరు విలియమ్సు గుండెలుమీద కాల్చుకు దూసుకుపోయింది. దెబ్బతో అతడు దేహంచాలించాడు. ఆకాశంమీద చంద్రోదయమయింది. తెల్లవారేవరకూ యుద్ధంజరిగింది. తెల్లఫౌజూ, సిక్కుసిపాయిలూ, నాభాపటాలమూ వీగిపోయింది. స్వతంత్రసైనికులు జయ జయధ్వానాలతో సట్లజునది దాటారు. మిట్టమధ్యాహ్న మయేసరికి లూధియానా ప్రవేశించారు.

పంజాబులో లూధియానా వొక విప్లవకేంద్రంగా వుండేది. పట్నంలోనూ, చుట్టుపట్ల పల్లెలలోనూ విజయోత్సాహం చెలరేగింది. ఆదినమంతా విప్లవకారుల్తో లూధియానాపట్నం విరగబడిపోయింది. తమ సోదరులు రావడమే తడువు, లూధియానా సిపాయిలున్నూ, వాళ్ళతో కలిసిపోయారు. చెట్టాపట్టాలు పట్టారు. జైలు విరగ్గొట్టారు. ఖైదీలని విడిపించారు. ఇంగ్లీషువాళ్ళ బంగళాలు తగలబెట్టారు. ఖజానా కొల్లగొట్టారు. విజయగీతాలతో వూరేగారు. ఆకుపచ్చజెండాతో సాయంకాలం ఢిల్లీదారిపట్టారు. అటు స్వతంత్రసైన్యం సాగిపోతూ వుంది. ఇటు లూధియానాలో ఎంతోసేపుదాకా వినిపిస్తూనేవుంది –

"ఢిల్లీ చలో!" "ఢిల్లీ చలో!!" "ఢిల్లీ చలో!!!"

నీలుదొరఘోరాలు

గవర్నరుజనరలు రావించిన తెల్లపటాలాలు మద్రాసు, బొంబాయి మొదలైనచోట్లనించి కలకత్తా వచ్చాయి. మద్రాసుఫౌజు పట్టుకుని

నీలుసేనాని వచ్చాడు. ఈ నీలువిగ్రహమే వీధిలోంచి తీసెయ్యమని మద్రాసులో ఆమధ్య సత్యాగ్రహం జరిగింది. అదే నీలుసత్యాగ్రహం.

నీలు ఎంత దుర్మార్గుడో అంత దుస్సాహసి. ఎంతనిష్ఠురుడో అంత రాకాసి. మే ఇరవైమూడున అతడు కలకత్తానించి కాశీ బయలు దేరాడు. అవాళ హౌరాస్టేషనులో ఓక విశేషం జరిగింది. రైలు వేళయిపోయింది. సిపాయి లింకా కొందరు స్టేషను చేరుకోలేదు. వాళ్లంతా వచ్చేవరకూ రైలు ఆపమన్నాడు నీలుసేనాని. స్టేషను మాష్టరు ఒప్పుకోలేదు. నీలు చూశాడు. రైలుకి అడ్డంగా సిపాయిలని పట్టీలమీద నుంచోబెట్టేశాడు. మిగిలినసిపాయిలు వచ్చేవరకూ రైలు కదలనివ్వలేదు. ఆదినాల్లో రాణిగంజివరకే రైలుండేది. అక్కడినించి నీలుసేన బళ్లమీదా, బగ్గీలమీదా కాశీ చేరింది. ఇటు నీలుసేనాని దిగేసరికి అటు దానాఫురంనించి కొందరు తెల్లసిపాయిలున్నూ కాశీచేరారు.

కాశీలో కాలుపెట్టడమే తడువు, నీలుదొర తన ఘోరాలు ప్రారంభించేశాడు. పట్నంలో ప్రముఖులకి అరదండాలువేశాడు. చుట్టుపట్ల గ్రామాలకి గుంపులుగుంపులు సిక్కు-సిపాయిలనీ, తెల్లసిపాయిలనీ పంపాడు. కనీవినీ ఎరగని దారుణాలు చేయించాడు. దారిపోయే వాళ్లనల్లా చంపించాడు. తుపాకులతో కాల్పించాడు. కత్తులతో నరికించాడు. ఉరికంబాలకి వేలాడదీయించాడు. నిలువునా తగలబెట్టించాడు. గ్రామాలకి గ్రామాలు కొల్లగొట్టించాడు. నిప్పంటించి భస్మం చేయించాడు. దారిపొడుగునా వురికంబాలు పాతించాడు. ఇరవై నాలుగుగంటలూ వురులుతీయించాడు. చివరికి ఈ వురికంబాలు చాలలేదు. చెట్లకొమ్మలే వురికంబాలుచేశాడు. ఉరితియ్యవలసినవాణ్ణి ఏనుగుమీద చెట్టుకిందకి తెచ్చేవాళ్ళు. వీకకి వురితాడు తగిలించే వాళ్ళు. ఏనుగు తప్పించేసేవాళ్ళు. వేలాడుతూన్న శవాలు అలాగేవొది

లేసి వెళ్లిపోయేవాళ్ళు. అలా వేలాడుతూవున్న కొన్ని శవాలని కాళ్లూ, చేతులూ విరిచి ఎనిమి దంకెలాగా తొమ్మి దంకెలాగా తయారు చేసేవాళ్ళు.*

ఈ ఘోరాల్లో స్వయంగా పాల్గొన్న వొక ఇంగ్లీషుయువకుడు అనాటి లండను "టైమ్సు" లో ఇలా రాశాడు: "ఇరవై ఏడు సాయంకాలం మాజట్టు రెండువందలమంది సైనికులమూ, వందా యాభై మంది సిక్కుసిపాయిలూ, ఇరవై మంది గుర్రపురౌతులూ కాశీ నించి బైలుదేరాం. రౌతులు గుర్రాలమీదా, మేము ఎడ్లబళ్ల మీదా బయలుదేరాం. మర్నాడు మూడుగంటలకి విప్లవకారులున్న గ్రామాలు చేరుకున్నాం. మాజట్టు వొకగ్రామం ప్రవేశించాం. ప్రజలు పారిపోయారు. మేం గ్రామానికి అగ్గిముట్టించాం. గ్రామం భస్మ మైంది. రెండుమైళ్లలో ఇంకోగ్రామం వెళ్ళాం. మమ్మల్ని చూడగానే జనం పరుగుచ్చుకున్నారు. మేం తుపాకులుకాల్చాం. దెబ్బతో ఎన మండుగురు చచ్చారు. ఇంతలో వొకగ్రామస్థుడు మాదగ్గిరికి వచ్చాడు. మాఆఫీసరుకి సలాంచేశాడు. వాణ్ణి అరస్టుచేశాం. అలా ఇరవై మందిని అరస్టుచేశాం. వాళ్ళని పట్టుకుని మాబళ్లదగ్గిరికి వచ్చాం. ఒక ముసలాడు మేంకాల్చేసినవ్యాళ్లకి నష్టపరిహారం ఇచ్చు కోవాలన్నాడు. మాజట్టులో నొక మేస్ట్రీటు వుండేవాడు. ముసిలాడి మీద ఆయన విప్లవకారుల్ని దాచిన నేరంమోపాడు. ఉరిశిక్ష చెప్పాడు. ఒక చెట్టుకొమ్మకి వాణ్ణి వురితీసేశాం. వాడితోపాటు, అరస్టుచేసి

* "Volunteer hanging parties went into the districts and amateur executioners were not wanting to the occasion. One gentleman boasted of the numbers he had finished off quite 'in an artistic manner,' with mango trees as gibbets and elephants for drops, the victim of this wild justice being strung up, as though for pastime, in the form of Figures of eight." – Keye and Malleson's History of the Indian Mutiny.

తెచ్చినవాళ్ళనీ ఆ చెట్టుకే వురి తీసేశాం. రాత్రి అక్కడే గడిపాం. రాత్రంతా మా కళ్ళముందే చెట్టున ఆశవాలు వేలాడుతూ వుండేవి.

"తెల్లవారాక అక్కడినించి బైలుదేరాం. కొంతదూరంవెళ్ళాక పెద్దవర్షం కురిసింది. అక్కడ ఆగిపోయాం. తరవాత వెళ్లి, మరో గ్రామం నిప్పంటించాం. మాజట్టు ఉత్సాహంతో పనిచేస్తూవుండేది. ఆవాళ ఎనభైమందిని అరస్టుచేశాం. వెంటనే ఆరుగురిని వురితీసేశాం. తక్కినవాళ్ళని బెత్తాల్తో బాదాం. విప్లవనాయకుణ్ణి పట్టియిస్తే రెండు వేల రూపాయిలు ఇస్తామని మేస్ట్రీటు ప్రకటించాడు. ఆరాత్రి అక్కడే నిద్రపోయాం. ఉరితీసిన శవాలు మాఎదట వేలాడుతూ వుండేవి.

"మూడోనాడు ఉదయాన్నే మళ్ళీ బయలుదేరాం. వర్షం జోరుగా కురుస్తూవుండేది. తడుస్తూనే ముందుకి నడిచాం. రాత్రయేసరికి మరో వూరు చేరాం. ఊళ్లో అగ్గిముట్టించేశాం.

"మర్నాడు తెల్లవారింది. మాబట్టలూ అవీ ఆరవేసుకుని బయలుదేరాం. కొంతసేపయేసరికి చెమటపోసింది. దుస్తులు తడిసిపోయాయి. ఈసారి వొక పెద్దవూరు చేరాం. ఆ వూళ్ళో రెండువందల మందిని అరస్టుచేశాం. అనంతరం వూళ్ళో నిప్పుపెట్టేశాం.

"నేను ఊళ్ళో ప్రవేశించాను. ఊరంతా మంటలతోనూ, పొగలతోనూ నిండిపోయింది. ఒక దగ్గిర వొక శతవృద్ధు బైటికి రావాలని పక్కమీద తంటాలు పడుతున్నాడు; లేవలేక పోతున్నాడు. మంచంతో కూడా అతణ్ణి బైటికి లాక్కువచ్చాను. తరవాత మరో సందులోకి వెళ్ళాను. మంటలూ, పొగలూ తప్ప మరేమీ అవుపించలేదు. ఇటూ అటూ చూశాను. మంటల్లో వొకగోడ కూలిపోయింది. నాలుగేళ్ళ కుర్రాడొకడు ద్వారం దగ్గిరికి రాబోతున్నాడు. చూసి నిచ్చెర పోయాను. ఆఇంటిదిక్కు పరిగెత్తాను. ద్వారంకేసి మంటలు నాలికలు చాస్తున్నాయి. చప్పున ఇంట్లోకి వెళ్ళాను. లోపల చిన్నమండువా.

మండువా నాలుగుదిక్కులా ఇల్లు తగలబడుతూవుంది. ద్వారం తట్టు వచ్చిన కుర్రాడేకాదు, ఇంట్లో మరి ఆరుగురు పిల్లలున్నారు. ఒక ముసిలామే, ముసిలాడూ, లేవలేని స్థితిలో వున్నారు. అప్పుడే అయిదారు గంటలయి పుట్టిన వొక పసిపాపని గుండెల కద్దుకుని ఇరవయ్యేళ్ళ బాలెంతరాలు వొకతె ఏడుస్తూవుంది. పసిపాపని అందుకోబోయాను. ఆమె సమ్మతించలేదు.

" వాళ్ళందరినీ ఎలాగో అతికష్టంమీద బయటికి లాక్కువచ్చాను. మరో దగ్గిర వొక ముసీలిపండు డేకురుకుంటూ వెళ్లబోతూవుంది; కాని శక్తిలేదు. బైటికి రమ్మన్నాను. ఆమె వొప్పుకోలేదు. తుపాకి చూపించి భయపెట్టాను. ఇంతలో లోపల ఇరవయ్యేళ్ళ యువతి అవుపించింది. ఆమె చావుబతుకుల్లోవున్న వొకరోగి దగ్గిర కూచుంది. అతడి చుట్టూ మరినలుగురు స్త్రీలున్నారు. వాళ్లెవళ్లూ నామాటలు వినిపించుకోలేదు. మంటలు ప్రబలంగా వున్నాయి. ఒక్క వూపుని వాళ్ళ దగ్గిరికి వెళ్ళాను. రోగినీ, వాళ్ళనీ బైటికి తెచ్చేశాను.

" మంటలు ఆకాశాన్నంటుతున్న ట్టున్నాయి. నేను మరోదిక్కు వెళ్ళాను. ఒకదగ్గిర వందా సలభై మంది స్త్రీలూ, సుమారు అరవై మంది పిల్లలూ గోలుగోలుమంటున్నారు. వాదగ్గిరవున్న బిస్కత్తులు వాళ్ళకివ్వబోయాను. వా ళ్ళవి ముట్టలేదు. జాతిపోతుందని భయం!

" ఇంతలో బిగులు మోగింది. మాజట్టు వొక్కదగ్గిర చేరుకోడానికి అది సంకేతం. నేను వచ్చేశాను.

" ఇక్కడ పదిమందిని వురితీశాం. అరవై మందిని బెత్తాలతో మోదాం. మేం వురితీసినవాళ్ళలో వొకడు సంతోషంగా వురితాడులో తలదూర్చాడు. వాణ్ణి చూస్తే మాకు ఆశ్చర్యంవేసింది. ఉరితీసినప్పుడు ఎవడైనా వొకడు వురితాడు తెగిపోయికానీ, అజాగ్రత్తవల్లకానీ కింద పడిపోయేవాడు. అతడు వెంటనేలేచి, తనగుడ్డలు దులుపుకునేవాడు.

నాలుగుదిక్కులా చూసేవాడు. అంతలోనే వాణ్ణిమళ్ళీ వురితీశేసేవాళ్ళం. ఇలా వురితీసేవాళ్ళని వురితీసేవాళ్ళం. మిగిలినవాళ్ళకి ఆదృశ్యం చూపించేవాళ్ళం.

"ఆరాతి మరోగ్రామం తగలబెట్టేశాం. ఒకవూళ్ళో విప్లవకారులున్నట్టు విన్నాం. మేం వందాఎనభై మందిమి ఆవూరు ముట్టడించాం. చుట్టూ కాపలావేశాం. ఊరు అగ్గిముట్టించేశాం. అగ్గితప్పించుకుని బైటికి వచ్చేవాళ్ళని రాకండా తుపాకులతో కాల్చేశాం. (గ్రామస్థులతోసహా గ్రామం దగ్ధమైపోయింది.) పద్ధెనమండుగురిని అరస్టుచేశాం. అందరినీ అక్కడే కాల్చిపారేశాం. అలా మాజట్టువాళ్ళం అయిదు వందలమందిని చంపేశాం." *

కాశీనించి జూను పదకుండున నీలుసేనాని అలహాబాదులో అడుగు పెట్టాడు. దారిలో వొక్కవూరూ తగలబెట్టకండా వొదలలేదు. కంటపడ్డ వొకణ్ణీ చంపకండా వొదలలేదు. అతడు వచ్చేసరికి అలహాబాదుకోటమీద ఇంగ్లీషుజెండా ఎగురుతూనేవుంది. అరిచేతిలో స్వర్గం పడ్డట్టయింది అతడికి. అయితే కోటలోపలమాత్రం నానాహంగామాగానూ వుంది. ఇంగ్లీషుసిపాయిలూ, సిక్కుసిపాయిలూ కోటలోని సామానులు కొల్లగొట్టారు. సారాపీపాలు పగలగొట్టారు. తప్పతాగి తందనాలాడుతున్నారు.

నీలు వస్తూనే సిక్కుసిపాయిలని బైటికి తెచ్చేశాడు. కోటకి ఇంగ్లీషు ఫౌజు కాపలావేశాడు. కోటలోని దొరసానుల్నీ వాళ్ళనీ వోడలమీద కలకత్తా పంపేశాడు. బైటికివచ్చిన సిక్కులు పట్నంలో దోపుళ్ళు ప్రారంభించారు. కొంపలు నిప్పంటించారు.

అలహాబాదులో నీలుదొర ఘోరాలు కాశీని మించిపోయాయి. అవన్నీ వర్ణించడానికి ఇంగ్లీషుచరిత్రకారులే సిగ్గుపడ్డారు. ఒక వోడ

* सिपाही - युद्धेर इतिहास — (बंगाली) रजनीकांत गुप्त।

మీద ఫిరంగులుపెట్టి గంగా, యమునా నదులమీద నడిపించాడు. రెండుపక్కలా ఊళ్ళమీదా, జనంమీదా గుళ్ళవర్షం కురిపించాడు. చుట్టూ ఫిరంగులుపెట్టి అలహాబాదుపట్నం కాల్చేస్తాడని రూమరు పుట్టింది. జనం పట్నంవొదిలి కకావికలై పారిపోయారు. పడవలెక్కి యమునమీద పారిపోతూవున్న ప్రజల్ని కోటపక్క తుపాకులుపెట్టి కాల్చేశారు. ఈవైనమంతా సుబేదారు మూల్వీ లియాకతాలీ, పాదుషా బహదూరుషాకి ఢిల్లీ రాసి పంపాడు.

జూను పదిహేడున నీలుసేనాని ఖుస్రూబాగ్‌మీద దాడిచేశాడు. పగలంతా ఉభయసేనలకీ యుద్ధమయింది. విప్లవకారులు వీరత్వంతో పోరాడారు. చివరికి లియాకతాలీ ఆలోచించాడు. ఖుస్రూబాగు లాంటి బహిరంగప్రదేశంలో వుండి, అంతపెద్ద ఇంగ్లీషుసేనతో పోరాడడం అవివేక మవుతుంది. ఇంగ్లీషువాళ్లకి కోట పెన్నిధిలా వుంది. అంతేకాక, అప్పటికి లియాకతాలీదగ్గిర మూడులక్షల రూపాయలు నగదున్నా వుంది. అది శత్రువులచేత చిక్కడం అతడికి నచ్చలేదు. అందుకని అవాళరాత్రి అతడు తన అనుచరులతో కాన్పూరుతట్టు వెళ్లిపోయాడు. కాన్పూరు పడిపోయాక, దక్షిణాదికి వెళ్లాడు. అక్కడ ఇంగ్లీషువాళ్లు అణ్ణి పట్టేశారు; అండమానులు పంపేశారు. అక్కడే అతడు కాలంచేశాడు. అలహాబాదుకి పదిహేనుమైళ్ల దూరంలో లియాకతాలీ జన్మస్థానమైన మహగాంలో అంతవరకూ అతడి కుటుంబమాత్ర ముండేది.

మూల్వీ లియాకతాలీ వెళ్లిపోయాడు. ఆమర్నాటినించీ నీలుదొర అలహాబాదుమీద విరుచుకుపడ్డాడు. అవి హత్యలు కావు. అవి వురులు కావు. అవి కాలుపులుకావు – "నీలు ముసిలాళ్లని కాల్చాడు; నీలు సగంవయస్సువాళ్లని కాల్చాడు; నీలు యవ్వనవంతుల్ని కాల్చాడు; నీలు కుర్రాళ్ళనికాల్చాడు; నీలు పిల్లల్ని కాల్చాడు; నీలు

వుయ్యాలల్లోని పాపల్ని కాల్చాడు; నీలు తల్లుల రొమ్ములమీది శిశువుల్ని కాల్చాడు!" *

ఒకదగ్గిర పదిపన్నెండేళ్ల కుర్రాళ్లు ఆకుపచ్చ జెండాతో ఆడుకుంటున్నారు. అంతే ఆపసికూనలు చేసిన పాపం! వాళ్లని పట్టుకుని వురితీసేశాడు నీలు! ఒకసందులో డజనుమంది గ్రామస్థులు బ్రిటిషుపటాలం వెళుతూవుంటే, మొహం పక్కకి తిప్పుకున్నారు. అంతే వాళ్ల అపరాధం. వాళ్ల ప్రాణాలు ఫుచ్చుకున్నాడు నీలు! ఒక వ్యక్తిదగ్గిర చిన్న డబ్బులుమూట అవుపించింది. అదే అతడి నేరం! అతణ్ణి వురితీసేశాడు నీలు! ఒక్క అలహాబాదులోనే అర్నవై వేలమందిని చంపేశాడు నీలుదొర! †

అలహాబాదులో వొక ఇంగ్లీషు నర్తకుడు వుండేవాడు. నేటీవు నర్తకులకి ఎంతోమందికి అతడు బొకీపడి వుండేవాడు. విప్లవకారుల్ని పట్టుకుంది కతణ్ణి స్పెషలుకమీషనరుగా నియమించారు. అతడు పట్టుకుని వురితీసిన విప్లవకారు లెవరో తెలుసా? తన వర్తకానికి మద్దు పిచ్చిన రుణదాతలు! ఈవిధంగా అతడు రుణవిముక్తు డయిపోయాడు.

అలహాబాదు చౌకులో ఏడు వేపచెట్లుండేవి. అందులో వొకటో రెండో ఇప్పటికీ బతికేవున్నాయి. ఈచెట్లకొమ్మలకి కొద్ది దినాల్లో ఎనిమిది వందలమంది నిరపరాధుల్ని వురితీశారు. దారుణమైన ఈ వురులు పండిత బాలకృష్ణభట్టు వర్ణించాడు. 1857 నాటికి బాలకృష్ణభట్టు వయసు పదిహేను సంవత్సరాలు. ఈ వురులవైనం విని, ఆవేపచెట్లు చూడడంకోసం అహియాపురంనించి వొకవ్యక్తి చౌకులోకి

---

* Neil burnt old men; Neil burnt middle-aged men; Neil burnt young men; Neil burnt children; Neil burnt infants; Neil burnt babies in cradles; and Neil has burnt babies suckling at the breasts of their mothers!" – Savarkar.

† Asoka Mehata – 1857 the great Rebellion. P. 56.

వచ్చాడు. అదే అతడి తప్పు! అతణ్ణి కూడా వొక వేపచెట్టు కొమ్మకి వురితీసేశారు.* ఇలా పట్నంలోనూ, పల్లెలలోనూ ఏ పాపమూ ఎరగని వేలు వేలు ప్రజల్ని చెట్లకి ఉరితీసేశారు.

అలహాబాదులోని వొక్కనాటి ఘోరం వొక ఇంగ్లీషు ఆఫీసరు ఇలా వర్ణించాడు.

"ఒకనాటి దాడిలో నాకు పట్టలేసంత సంతోషం కలిగింది. మేమొక ఫిరంగి వేసుకుని స్టీమరుమీద బయలుదేరాం. సిక్కులూ, తెల్లసిపాయిలూ పట్నంలోకి వెళ్ళారు. మాస్టీమరు ముందుకి నడుస్తూ వుండేది. మేము గుళ్ళు కురిపిస్తూ వుండేవాళ్ళం. నాచేతిలోని జోడుగుళ్ళ తుపాకి ఎంతోమంది నల్లవాళ్లని నంజుకుంది. కసితీర్చుకుందికి నా కెంతో సరదాగా వుండేది. వలపటా, దాపటా వూళ్లకి నిప్పుపెట్టేసేవాణ్ణి. మంటలు ఆకాశమంటుతూ వుండేవి. గాలి మరింత అనుకూలంగా వుండేది. మనకి దగాచేసిన వెధవలమీద పగ తీర్చుకుందికి సరయిన అదును వచ్చినట్టుండేది. ఇలా ప్రతీరోజూ విప్లవకారులమీద కసితీర్చుకుందికి బయలుదేరేవాళ్లం. ఊళ్ళకివూళ్ళు భస్మం చేశేసేవాళ్లం.

"ప్రజల ప్రాణాలు మాచేతుల్లో వుండేవి. మేం వొక్కణ్ణీ వొదిలిపెట్టడం లేదంటే నమ్మండి. నేరస్థుల్ని వొక బండిమీద కూచోపెట్టేవాళ్లం. ఒక చెట్టుకిందికి బండి పోనిచ్చేవాళ్లం. పీకలికి వురితాళ్ళు తగిలించి బండి తప్పించేసేవాళ్లం. శవాలు చెట్లకి వేలాడేవి."

ఎవళ్లని పడితే వాళ్లని వురితియ్యడానికని ఎక్కడపడితే అక్కడ 'న్యాయస్థానాలు' తయారయాయి. అదంతా వొక నాటకంగా

* सन १५७ का विप्लव।

వుండేది. అవి న్యాయస్థానాలుకావు, వధ్యస్థానాలు. విచారణచేసో, చెయ్యకండానో స్త్రీ లనీ, పురుషు లనీ భేదంలేకండా వురితీసేవాళ్ళు.*

భారతదేశమంతటా విప్లవకారులు చంపిన ఇంగ్లీషువాళ్లకంటే వొక్క అలహాబాదులోనే నీలు చంపిన నేటీవులసంఖ్య అధికమయింది. ఇదంతా తనదేశంకోసం చేశానన్నాడు నీలు! బావుంది. మరి భారత దేశం ఎవడిది?

నీలు చేసిన ఘోరాలవల్ల అలహాబాదుమండలం యావత్తూ ఇంగ్లీషువాళ్లతో సహాయనిరాకరణం చేశారు. ఒక కూలీ, వొకబండీ కూడా ఇంగ్లీషువాళ్ళకి దొరకడం కష్టమయింది. ఆహారపదార్థాలు కాని, ఇన్ని మంచినీళ్లుకాని ఇచ్చేవాళ్లు లేకపోయారు. నీలు వందలూ వేలూ బహుమానాలు ప్రకటించాడు. ఒక్కడూ ఆశించలేదు. జబ్బు పడ్డ తెల్లసిపాయిలకి డోలీలు మోసేవాళ్లు లేకపోయారు. మందూ మాకూ ఇచ్చేవాళ్లు కరువయ్యారు. కాయిలాపడి, బాధపడుతూవున్న ఇంగ్లీషుసిపాయిల మూలుగులు వినివొక దొరసాని గుండెపగిలి చచ్చిపోయిందట!

ఎవరయినా ఎక్కడయినా ఇంగ్లీషువాళ్లకి వొకరొట్టిముక్క అమ్మారో, వాళ్ల ముక్కుకోసేసేవాళ్లు జనం. చేతులు నరికేసేవాళ్లు అంత తీవ్రంగా వుండేది సహాయనిరాకరణం. చివరికి ఇంగ్లీషుపటాలంలో

---

* "In my own city and district of Allahabad, and in the neighbourhood General Neil held his 'Bloody Assizes.' "Soldiers and civilians alike were holding Bloody Assizes, or slaying natives without any assize at all, regardless of age or sex. It is on the records of our British Parliament, in papers sent home by the Governor – General in Council, that 'the aged, women, and children are sacrificed as well as those guilty of rebellion.' They were not deliberately hanged, but burnt to death in villages – perhaps now and then accidentally shot." – Jawaharlal Nehru – The Discovery of India.

గొట్టాలమ్మ వ్యాపించింది. రోజుకి ఇరవయ్యేసిమంది కళ్లుమూసే వాళ్లు. ఆస్పత్రులలో స్థలమే ఉండేదికాదు. ఏమైతేనేం నీలుదొర క్రోధం అంతంలేంది.

కా న్పూ రు ర క్తా భి షే క ం

1857 లో కాన్పూరు వహించిన ప్రముఖపాత్ర ఘనమైంది. సుప్ర సిద్ధులయిన ముఖ్యనాయకులు నానాసాహెబూ, అతడి సోదరులు బాలాసాహెబూ, బాబాసాహెబూ, అతడి అన్నకొడుకు రావు సాహెబూ, అజీముల్లాఖానూ, తాంతియా టోపే ఇక్కడే వున్నారు. అందుకనే అద్భుతమైన విషయాలు జరిగా యిక్కడ. కాన్పూరులో ఒకటీ, యాభైమూడూ, యాభై ఆరుసంఖ్యల కాల్బలాలూ, రెండో గుర్రపుసేనా వుండేవి. వీటిలో మొత్తు మూడువేలమంది నేటీవుసిపా యిలూ, అరవై ఏడుగురు ఇంగ్లీషుఆఫీసర్లూ వుండేవాళ్లు. కల్నలు సర్ హ్యూ వీలరు సేనాపతిగా వుండేవాడు. వీలరు అనుభవం కల సేనాని.

మేసూసం ప్రారంభంలో కాన్పూరు ప్రశాంతంగావుంది. గడువు కోసం యావన్మంది గమ్మునివుండేవాళ్ళు. కాని ఢిల్లీవార్త వచ్చాక ఎక్కడలేని అలజడీ ఆరంభమయింది. ఢిల్లీ స్వాధీనమయిపోయిందన్న వార్త పద్దెనిమిదిని వీలరుకి అందింది. కాని మూడురోజులు ముందే పదిహేనునే నానాసాహెబుకి చేరింది. తంతులూ, వైభ్భా లేకపోవడం తోనేఇంగ్లీషువాళ్ళకి వార్తలందడం బ్రహ్మండంగా వుండేది. విస్లవ సంఘం బేగీరావులుమాత్రం సరయిన తాజావార్త లందించడంలో అప్రమత్తులై వుండేవాళ్లు.

మీరటు ఢిల్లీలవార్తలు రావడంతోనే కాన్పూరు గుబగుబలాడి పోయింది. సభలూ, ఉత్సవాలూ తరుచయాయి. పటాలంలో రహస్య సమావేశాలు అధికమయాయి. వీధుల్లోనూ, బజార్లలోనూ, దుకా

ణాలలోనూ, స్కూళ్ళలోనూ రకరకాల ఫుకార్లుపుట్టాయి. ఏమయినా సరే, గడువువరకూ చడీచప్పుడులేకుండా వుండాలని నిశ్చయించాడు నానాసాహెబు. ప్రజల అలజడీ అదీ చూసి, ఇంగ్లీషువాళ్ళకి భయంగా వుండేది. చీమ చిటుకుమంటే తుళ్ళిపడేవాళ్లు. మీరటు షిల్లీలదృశ్యాలు వాళ్ళ కళ్ళఎదట నాట్యంచేసేవి. ముందే తగిన జాగ్రత్తపడడం మంచి దనుకున్నాడు వ్హీలరు. రక్షణకోసం ఎొక కొత్తకోట తయారుచేశాడు. పటాలం బారక్కుకి కొంచెందూరంలో, గంగానది దక్షిణపొడ్డుని ఇంగ్లీషుఫౌజుకోసం రెండు ఆస్పత్రులుండేవి. వాటిచుట్టూ నాలుగడుగుల మట్టిగోడ వేయించాడతడు. గోడమీద ఫిరంగులు పెట్టించాడు. అజీముల్లాఖాను ఆ కోటకి 'దిక్కుమాలినకోట' అని పేరుపెట్టాడు. ఇంగ్లీషువాళ్ళుమాత్రం దానిని విజయదుర్గమన్నారు. లక్నోనించి ఎన్నబై నలుగురు తెల్లసిపాయిలూ, రెండుఫిరంగులూ తెప్పించాడు వ్హీలరు.

అంతలో వూరుకోలేదు. నానాసాహెబు సహాయంకూడా కోరాడతడు. నానాసాహెబు అంతవరకూ బిఠూరు దుర్గంలోనే వుండేవాడు. బిఠూరుదుర్గమే విప్లవానికి మూలపీఠంగా వుండేది. అయితే ముఖ్యనాయకులకి తప్ప హరిబ్రహ్మాదులకి ఆ రహస్యం వెల్లడికాలేదు. చివరివరకూ నానామీద ఇంగ్లీషువాళ్ళకి అనుమానంకూడా కలగలేదు. కాన్పూరు కలెక్టరుకీ నానాసాహేబుకీ దోస్తీగా వుండేది. ఎంతో మంది దొరలూ దొరసానులూ నానాసాహెబు కోటకి వచ్చేవాళ్లు. విందులు కుడిచీ, వేడుకలు చేసుకునీ వెళ్లేవాళ్లు. విప్లవానికి నాయకత్వంమాట అటుండనివ్వండి, విప్లవాన్ని అభిమానించినట్టు కూడా నానా కనిపించలేదు వాళ్లకి. అంచేత వ్హీలరుసేనాని నానాసాహెబు సహాయం కోరాడు. తన తమ్ముల్లతోనూ, అజీముల్లా, తాంతియాటోపేలతోనూ నానా సంప్రదించాడు. శివాజీనేర్పిన మహారాష్ట్రనీతి ప్రదర్శించడానికి ఇంతకిమించిన అవకాశం దొరకదన్నారు వాళ్లు.

వ్హీలరుకోరిక నానా మన్నించాడు. మే ఇరవై రెండున కాన్పూరు వచ్చేశాడు. తనతో రెండు ఫిరంగులూ, రెండువందలమంది సిపాయి లున్నూ పట్టుకువచ్చాడు. ఇంగ్లీషువాళ్ళ ఆనందం చెప్పతరంకాదు.

ట్రెజరీ, మందుగుండుకొట్టూ కాపాడేభారం నానా చేతిలోపెట్టాడు వ్హీలరు. ఖజానాకొట్టూ, మందుగుండుకొట్టూ, జైలూ నవాబు గంజిలో వున్నాయి. మందుగుండుకొట్టు పెద్దపెద్దగోడలతో గంగ వొడ్డుని, పటాలం మైదానానికి ఆరుమైళ్ళదూరంలో వుంది. ట్రెజరీకీ, ఆయుధాగారానికీ తనసిపాయిలు కాపలావేసి నానాసాహెబు నవాబు గంజిలో మకాం పెట్టాడు.

కాన్పూరులో నానకుచందు అని వొక వకీలుండేవాడు. నానా సాహెబుని నమ్మవద్దంటూ అతను కలెక్టరుదగ్గిర చాడీలు చెప్పేవాడు. అయినా కలెక్టరు అతడిమాట నమ్మలేదు. నానకుచందు డైరీ ఆనాటి సంగతులు కొన్ని వెల్లడిస్తుంది.

సుబేదారు టీకాసింగూ, సుబేదారు శమ్సుద్దీనుఖానూ నేటివు సిపాయిల నాయకులుగా వుండేవాళ్లు. వీళ్ళ ఇళ్లల్లో రహస్యసమా వేశాలు జరిగేవి. బిఠూరుకోటలో జ్వాలాప్రసాదూ, మహమ్మదాలీ అని నానా నమ్మిన అనుచరు లిద్దరుండేవాళ్లు. మహమ్మదాలీ గుర్రాల వర్తకుడు. నానా పక్షాన వీళ్లిద్దరూ రహస్యసమావేశాలకి హాజరయ్యేవాళ్ళు. పటాలంలో టీకాసింగు ఎంతంటే అంతగా వుండేది. హిందువులూ, మహమ్మదీయులూ సమరాగ్నిలో పురకడానికి సిద్ధంగా వున్నారని నానాకి టీకాసింగు మాటయిచ్చాడు.

కాన్పూరంలో ఘడియకో పితూరీ పుట్టేది. అదిగో పులి అంటే ఇదిగో తోక! ఇంగ్లీషువాళ్ళ భయం ఇంతా అంతా కాదు. మాటి మాటికీ వాళ్ళు 'దిక్కు-మాలిన కోట' కి పారిపోయేవాళ్ళు. ఆడా మగా, పిల్లా జెల్లా దాగుండేవాళ్ళు. మే ఇరవై నాలుగున ముసల్మానుల

ఈద్. ఆవాళే విక్టోరియారాణి పుట్టినరోజు. అవాళ అరిచేతిలో ప్రాణాలు పట్టుకు కూచున్నారు ఇంగ్లీషువాళ్ళు. అవాళ తప్పక ఏదో అవుతుందని వాళ్ళ భయం! ఫ్రీలరు సేనాని లారెన్సుకి కబురునూ పంపాడు – "ఇవాళ ప్రమాదం తప్పదు" అని. ప్రతీఏడూ రాణీ పుట్టుకదినం ఫిరంగులు పేల్చేవాళ్లు. అవాళ భయంవల్ల అదిన్నీ మానేశారు. అయితే ఆదినం శాంతంగానే గడిచిపోయింది. ఎక్కడా పిసరంత అలికిడి కాలేదు. మరి ఫరవాలే దనుకున్నాడు ఫ్రీలరు సేనాని. మే మాస మంతా అలాగే గడిచిపోయింది.

అవాళ జూను మొదటితేదీ. సాయంకాలం కావస్తోంది. నానా సాహేబు చల్లగాలికి గంగవొడ్డుకి వెళ్ళాడు. తమ్ముడు బాలాసాహేబు, మంత్రి అజీముల్లాఖానూ వెంటనడిచారు. గంగవొడ్డుని టీకాసింగూ, శమ్సుద్దీనుఖానూ కలిశారు. అందరూకలిసి గంగానదిమీద బోటుమైరు వెళ్లారు. గంగాభవాని గర్భంలో ఈవిప్లవనాయకులు ఏం రహస్య వ్యూహాలు పన్నారో సముద్రుడికయినా వెల్లడించలేదు గంగమ్మ. అమర్నాడు మాత్రం శమ్సుద్దీనుఖాను తన ప్రియురాలు అజీజానుతో చెప్పాడు – "రెండు దినాల్లో ఫరంగీలపని అయిపోతుంది. భారత దేశానికి స్వరాజ్యం వచ్చేస్తుంది."

అజీజాను కాన్పురంలో అందరూ అంటారు. వేరెక్కిన వేశ్య. స్వాతంత్ర్య సమరంలో చేతులు కలిపిన వీరాంగన.

మరి మూడు దినాలు గడిచిపోయాయి. నాలుగోతేదీ పగలునూ గడిచిపోయింది. అవాళ అద్దరాత్రి. పటాలంలో మూడు తుపాకులు పేలాయి. విప్లవం ఆరంభానికి అదే సంకేతం.

సుబేదారు టీకాసింగు గుర్రమ్మీద ముందికి వురికాడు. వందల కొద్దీ గుర్రపురౌతులూ, వేలకొద్దీ పదాతికులూ అతడివెంట బయలు దేరారు. దొరలబంగళాలు నిప్పంటించారు. ఇంగ్లీషుజెండాలు పీకే

శారు. ఆకుపచ్చ జెండాలు ఎగరవేశారు. ఖజానాకొట్టూ, మందుగుండు కొట్టూ వశపరుచుకున్నారు. నానాసాహేబు సిపాయిలు వాళ్ళతో కలిసిపోయారు. జైలు ఇనప తలుపులు పగలగొట్టారు. ఖైదీలని విడిపించేశారు. పటాలం ఇంగ్లీషు జెండాలు ఇవ్వడానికి వెనకాడిన సుబేదారు మేజరు భవానీసింగుతల పగలగొట్టారు.

మర్నాడు తెల్లవారే సరికి కాన్పురమంతటా ఆకుపచ్చ జెండాలే ఎగురుతున్నాయి. ఇంగ్లీషువాళ్ళ కొంపలు బూడిదకుప్పలై మూలుగుతున్నాయి. ఇంగ్లీషుజనం పిల్లా జెల్లా, ఆడామగా మొత్తం సుమారు వెయ్యిమంది – నాలుగువందల అరవై అయిదుగురు దొరలూ, రెండు వందల ఎనభై మంది దొరసానులూ, రెండువందలయాభై మందికి పైగా పిల్లలూ దిక్కుమాలి 'దిక్కుమాలినకోట' లో తలదాచుకున్నారు.

అవాళ ఉదయం మూడువేలమంది సిపాయిలూ సమావేశమయారు. నానాసాహేబుని రాజుగా ఎంచుకున్నారు. రాజలాంఛనాలతో సైనిక వందనం చేశారు. తరవాత స్వతంత్ర్యసేనా నాయకుల ఎన్నిక జరిగింది. సుబేదారు టీకాసింగుని గుర్రపుదళానికి జనరలుగా ఎంచుకున్నారు. జమాదారు దళగంజనసింగు యాభై మూడో పటాలం కల్నలుగానూ, సుబేదారు గంగాదీను యాభై ఆరో పటాలం కల్నలుగానూ నియమితులయారు. తరవాత ఆకుపచ్చ జెండా ఏనుగుమీద పెట్టి పెద్ద ఉత్సవం తీశారు. గొప్ప సమరోత్సాహంతో బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది.

సిపాయిలూ నానాసాహేబూ ఢిల్లీ వెళ్ళడానికి సిద్ధపడ్డారు. బయల్దేరి కల్యాణపురం వరకూ రానూ వచ్చేశారు. కాని అజీముల్లాఖాను ఉపదేశంవల్ల ఢిల్లీ ప్రయాణం మానేశారు. కాన్పురంలోనే వుండి సమరం సాగించడానికి నిశ్చయించారు.

ఆరోతేదీ ఉదయం నానాసాహెబు వీరోచితంగా ఫ్లీలరుదొరకి వొక హెచ్చరిక పంపాడు – "మీ కొత్తకోట ముట్టడిస్తున్నాం. అందుకని మీకు తెలియజేస్తున్నాం" అని.

జనరలు టీకాసింగు ముట్టడికి చెయ్యవలిసిన ఏర్పాట్లస్నీచేశాడు. ఆయుధాగారంనించి ఫిరంగులు తెచ్చి, కీలకస్థానాల్లో అమర్చిపెట్టాడు. ప్రజల్నీ, సిపాయీలనీ ఉద్రేకపరుస్తూ కరపత్రాలు పంచిపెట్టాడు. అటు గంగానదితట్టూ, ఇటు మైదానం దిక్కూ దాడికి ఏర్పాటు చేశాడు. కోట ఉత్తరందిక్కు క్రీడాగృహం దగ్గిర ఫిరంగులు పెట్టాడు. ఇక్కడినేనకి నవ్వేనవాబు అధ్యక్షతవహించాడు. ఇక్కడే తరుచు అజీజాను ప్రత్యక్షమవుతూ వుండేది. దక్షిణాన అయోధ్య తాలూకాదార్లు ఫిరంగులుకాలుస్తూ వుండేవాళ్లు. డల్హాసీ ఫకీర్లనిచేసిన తాలూకాదార్లు వీళ్లు. తూర్పుతట్టు బాకర్‌అలీ వుండేవాడు. దక్షిణపశ్చిమ కోణంలో 'సబేదాభవనం' దగ్గిర నానాసాహెబువుండేవాడు. అక్కడే సుబేదారు టీకాసింగూ, తాంతియాటోపే వుండేవాళ్లు.

ఇక్కడ కోటముట్టడికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అటుపట్నంలో జనం చిన్నాపెద్దా కత్తులూ కటార్లూ పట్టుకుని పొలో అంటే పొలో అని బైల్దేరిపోయారు. కచేరీలూ, కార్యాలయాలూ నిప్పంటించారు. కుంపిసీరికార్డులూ, కాగితాలూ కాల్చేశారు. కోటలోకి వెళ్లకండా మిగిలివున్న ఇంగ్లీషువాళ్లని చంపేశారు. ఎంతోమందిక్రైస్తవులు మహమ్మదీయులవేషం వేసుకుని బతికిపోయారు.

మధ్యాహ్నం వొంటిగంట అయేసరికి సిపాయిలు కోట ఘిరాయించేశారు. ఉభయపక్షాలకీ ఫిరంగులున్నాయి; తుపాకులున్నాయి; మందుగుండూ వుంది. నానాసాహెబు ఫిరంగులు ప్రళయగర్జన చేశాయి. ఇంగ్లీషువాళ్ల కోటమీద గుళ్లవర్షం కురిసింది. ఎన్నడూ ఎరగని దొర

సానులు గోలుగోలుమన్నారు. ఏడుపులూ, మొర్రలూ కోటకోటంతా నిండిపోయాయి.

ఫ్లీలరుసేనాని ఎంతజాగ్రత్తతీసుకోవాలో అంతా తీసుకున్నాడు. లోపలవున్న ప్రతీఇంగ్లీషువాణ్ణీ, చేతసయినాసరే, కాకపోయినాసరే, తుపాకిచేతికిచ్చి నిలబెట్టాడు. కోటలో దాచిపెట్టిన ఫిరంగులూ అవీ పైకితీశాడు. దొరసానుల్నీ, పిల్లల్నీ ఆస్పత్రిభవనంలో భద్రపరిచి యుద్ధానికి సిద్ధపడ్డాడు.

జూనుమాసం ఎండలు నిప్పులుచెరుగుతూ వుండేవి. కోట మట్టి గోడదగ్గిర పైన కప్పూగిప్పూలేక దొరలకి యమయాతనగా వుండేది. సిపాయిల తుపాకిగుళ్లూ, ఫిరంగిగుళ్లూ పిసుగులుకురుస్తూ వుండేవి. దొరలప్రాణాలు కబళిస్తూ వుండేవి. చచ్చినవాళ్లసి సమాధిచెయ్యడం మరీకష్టంగా వుండేది. లోపల పాడునూతిలో పారేసేవాళ్లు శవాలు.

లోపల ఆహారం తగ్గుతూవచ్చింది. బైటినించిరావడం కష్టంగా వుండేది. ఒకనాడు కోట గోడపక్కనించి వొక ఆబోతువెళ్తూ సిపాయిల గుండుతగిలి చచ్చిపోయింది. అది లాక్కుపోయి ఇంగ్లీషువాళ్లు తినేశారు. మరొకనాడు వొక ముసిలిగుర్రం. ఇంకోనాడు వొక కుక్క. అంత కరువుగావుండేది వాళ్ల కాహారం!

అలా ఈ కోటముట్టడి వొక్కరోజూ రెండురోజులూ కాదు, ఇరవై వొక్కరోజులు సాగింది. ప్రతీక్షణమూ పైనించి సహాయంవస్తుందని ముసిలి ఇంగ్లీషుసేనాని ఫ్లీలరు ఆశిస్తూ వుండేవాడు. పంజాబునించి సర్ జాన్‌లారెన్సో, లక్నోనించి సర్ హెన్రీలారెన్సో, అలహాబాదునించి సీలో వచ్చి, రక్షిస్తాడని అతడి ఆశ. కోటలోంచి రహస్యంగా ఎంతోమంది దూతల్ని లక్నో పంపాడతడు. అయితే వెయ్యికళ్లతో కనిపెడుతున్నారు సిపాయిలు. వాళ్ళ కళ్ళుకప్పడం సాధ్యపడలేదు. అయినా, నమ్మకంకల కుంపినీ నేటీవునొక రొకడు పిట్టరెక్కలోపెట్టి

వొకచీటీ పద్నాలుగోతేదీ సాయంకాలం లక్నోజడ్జీ గోబీసుదొరకి అందించాడు. అందులో వ్రాలు కొంత ఇంగ్లీషులోనూ, కొంత లాటిను లోనూ, కొంత ఫ్రెంచిలోనూ రాశాడు. అన్ని భాషలలోనూ రాసింది వొక్కటే – "సహాయం! సహాయం!! మాకు సహాయం పంపండి. మేం చచ్చిపోతున్నాం. మాకు సహాయంవస్తే, మేం బతికడమేకాదు, వచ్చి, లక్నోకూడా బతికిస్తాం."

ఇంగ్లీషువాళ్ళ అవస్థ అలావుండేది. ఇటు నానాసాహెబుకి నాలుగు దిక్కులనించీ సహాయంవచ్చిపడుతూవుండేది. అతడి సైన్యం నాలుగు వేలవరకూ పెరిగింది. కాన్పురం స్త్రీలూ, పురుషులూవచ్చి చెయ్యవలిసిన సహాయమంతా చేస్తూవుండేవాళ్లు. అలహాబాదునించి లియాకతాలీ కూడా తన అనుచరులతోవచ్చి కలిశాడు. చుట్టుపట్లజమీందార్లు ధనమూ, జనమూ కూడా పంపారు.

కాన్పురం సాని అజీజాను కట్టిపట్టుకుని గుర్రంమీద పురవీధుల్లోనూ, సిపాయిలమధ్యా మెరుపులా తిరుగుతూవుండేది. అలిసిన సిపాయిలకీ, దెబ్బలుతగిలినవాళ్ళకీ పాలూ, మిఠాయీ పంచిపెట్టేది. ఈమె నవ్వుమొహం చూసీ, ఉత్సాహవాక్యాలువినీ సిపాయిలు రెట్టింపుఉత్సాహంతో పోట్లాడేవాళ్లు.*

ఇటు కోటముట్టడి సాగిస్తూనే నానాసాహెబు అటు పట్నంలో శాంతిరక్షణకోసం చెయ్యవలిసిందంతా చేస్తూవుండేవాడు. పురప్రముఖులతో వొక సమావేశం జరిపాడు. హులాససింగు అని వొకాయనని చీఫ్‌మాజస్ట్రేటుగా నియమించాడు. సిపాయిల భోజనసామగ్రికోసం ముల్లాఅని వొకాయనని మోదీగా ఏర్పరిచాడు. సివిలూక్రిమినలు విచారణలకోసం వొక కోర్టు స్థాపించాడు. జ్వాలాప్రసాదూ, అజీముల్లాఖానూ, బాలాసాహెబులు జడ్జీలుగా నియమితులయారు. ఈ ముగ్గు

* Nanak Chand's Diary.

రిలో బాలాసాహెబు అధ్యక్షుడయాడు. నేరస్థుల్ని వీళ్లుగట్టిగా శిక్షించేవాళ్లు. పెద్ద దొంగతనంచేసిన వొక దొంగని చేతులు తెగ గొట్టారు. గోహత్యచేసిన నేరానికి వొక కసాయివాణ్ణికూడా అలాగే చేశారు. చిన్న చిన్న దొంగతనాలుచేసినవాళ్ళని గాడిదలమీద వూరేగించేవాళ్లు. ఇంగ్లీషుకాందీశీకుల్ని పట్టిఇచ్చేవాళ్ళకి బహుమతు లిచ్చేవాళ్లు.

రోజురోజుకీ కోటముట్టడి భయంకరమవుతూ వుండేది. ఇంగ్లీషువా ళ్ళకి క్షణక్షణగండంగా వుండేది. అయినా పోరాడగలిగినంత ధైర్యంగా పోరాడుతూనేవుండేవాళ్లు వాళ్లు. సిపాయిలతోనూ చనిపోతూనేవుండే వాళ్లు. అయితే ప్రతీదినమూ కొత్తసిపాయిలు కాశీ, అలహాబాదూ, అజాముగడమూ, లక్నో మొదలైనచోట్లనించి వచ్చిపడుతూ వుండే వాళ్లు. సంఖ్యపెరుగుతూ వుండేది. కోటలో చావులు దారుణంగా వుండేవి. కోటలోవుండి పోరాడిన కెప్టెను థామసు చెప్పిన చిన్నవివరం చూడండి.

"ఆర్మ్‌స్ట్రాంగు దెబ్బతిని పడిపోయాడు. లెఫ్టినెంటు ప్రోలు అతణ్ణి చూసిందికి వచ్చాడు. అతడు వచ్చి వోదారుస్తూ రెండుమాటలన్నాడో లేదో, సిపాయిల గుండువచ్చి అతడితొడమీద తగిలింది. అతడున్నా పడిపోయాడు. సార్జంటుదగ్గిరికి తీసుకువెళ్ళడానికి నే నతణ్ణి ఎత్తాను. నాబుజంమీద అతడి చెయ్యివుంది. నాచెయ్యి అతడి నడుంమీదవుంది. రెండడుగులు వేశానో లేదో, రివ్వుమని వొకగుండు వచ్చింది. నా బుజందూసుకుపోయింది. నేనూ, ప్రోలూ ఇద్దరమూ కింద పడిపోయాం. గిల్బర్టు అది చూశాడు. మాదగ్గిరికి పరిగెత్తుకువచ్చాడు. శత్రువుల గుండువచ్చింది. అతణ్ణి దూసుకుపోయింది. వెంటనే అతడు ప్రాణం వొదిలిపెట్టేశాడు." కలెక్టరు హిల్లర్సుడెను వరండాలో భార్యతో నుంచున్నాడు. సిపాయిల ఇరవై పౌనుల ఫిరంగిగుండు వచ్చింది. హిల్ల

ర్సుడెను తలకాయ పచ్చడిచేసేసింది. రెండుదినాలయాక అతడిభార్య కూడా చచ్చిపోయింది. కందకందగ్గిర ఏడుగురు దొరసానులు నుంచున్నారు. వొక ఫిరంగిగుండు వచ్చింది. ఏడుగురినీ ఎగరేసుకుపోయింది. ప్వీలరునేనాని కొడుకు దెబ్బతిన్నాడు. అతడి ఇద్దరు చెల్లెళ్ళూ, తల్లీ వొకగదిలో అతడికి మందుపెడుతున్నారు. అతడు మందు పుచ్చుకునే లోపున వొక ఫిరంగిగుండు వచ్చింది. అతడి తలకాయ వూడ్చేసింది. అదిగో అలా సాగింది ముట్టడి.

కోటలో వొక్కటే మంచినీళ్ళబావి వుండేది. అదీ పాతాళమంత లోతు. అది ఎక్కడవున్నదీ సిపాయిలకి ముందే తెలుసు. నీళ్ళకి వచ్చే వాళ్ళు స్పష్టంగా అవుపించేవాళ్ళు. అంచేత ఆప్రదేశం గురిపెట్టి వొదలకండా గుళ్ళు కుమ్మరించేవాళ్లు సిపాయిలు. పగలు నీళ్ళకివచ్చినవాళ్లు బతికివెళ్ళడం కష్టంగా వుండేది. అంచేత లోపలివాళ్ళకి నీళ్ళకరువు పట్టుకుంది. దాహంతో ప్రాణాలు పోతూవుండేవి. చిన్నపిల్లలు పాలులేక మరణించారు. దానికితోడు జిగటవిరేచనాలూ, కలరా వ్యాపించాయి. ఎంతోమంది మరణించారు.

జూను పద్దెనిమిదిని భయంకరమైన యుద్ధం జరిగింది. సిపాయిలు చెప్పశక్యంకాని సాహసం చూపించారు. ఇరవైవొకటిని అయోధ్యనించి ఎంతోమంది సిపాయిలు వచ్చారు.

ఇరవైమూడుని ప్లాసీయుద్ధానికి నూరేళ్ళూ నిండుతాయి. సరిగ్గా వందఏళ్ళకిందట క్లయివు బ్రిటిషుసామ్రాజ్యవృక్షం భారతభూమిలో ఐదువేళ్ళతోనూ వుడిచాడు. భారతీయుల బానిసత్వానికి శ్రీకారం చుట్టాడు. దానికి తగిన ప్రతీకారం అవాళ జరగాలి. అవాళ సిపాయిలు దారుణమైన దాడిచేశారు. అవాళటి యుద్ధంతోనే కోటలోని ఇంగ్లీషువాళ్ళ ఆశలన్నీ అడియాసలయిపోయాయి.

ఈ మూడువారాల్లోనూ సుమారు రెండువందలయాభై మంది ఇంగ్లీషువాళ్ళు చచ్చిపోయారు. ఇన్నిశవాలూ కోటలోని పాడునూతిలోనే పడేశారు. చివరికి ప్లీలరుసేనాని లొంగిపోయాడు. ఇరవై అయిదున కోటమీద తెల్లజెండా ఎత్తేశాడు. తెల్లజెండా చూడడంతోనే నానాసాహేబు యుద్ధమాపేశాడు. వెంటనే అజీముల్లాఖానుచేత ఒక వుత్తరంరాయించాడు – "విక్టోరియారాణీ ప్రజలకి, డల్హౌసీ నీతితో ప్రమేయంలేకండా, ఆయుధాలు కిందపడేసి, ఆత్మసమర్పణచేసేవాళ్ళని భద్రంగా అలహాబాదు పంపేస్తాము." అని. ఆ ఉత్తరం తనదగ్గిర బందీగావున్న ఒక దొరసానిచేత ప్లీలరుకి పంపించాడు. ప్లీలరు అంగీకరించాడు.

మర్నాడు జూను ఇరవై ఆరున ఉదయం ఉభయపక్షాల ప్రతినిధులూ కలుసుకున్నారు. ఇంగ్లీషువాళ్లతరఫున మూరూ, ప్లీటింగూ, రోచీ, నానాసాహెబుతరఫున అజీముల్లాఖానూ, జ్వాలాప్రసాదూ కోటదగ్గిర సంధిచర్చలు సాగించారు. మొదట ఇంగ్లీషులోనే చర్చలు ఆరంభమయాయి. కాని హిందూస్థానీలోనే చర్చలు జరగాలని అజీముల్లా పట్టుపట్టాడు. విధిగా హిందుస్థానీలోనే చర్చలు జరిగాయి. సంధికుదిరింది. సంధిలో మూడుషరతులు ఇవి :

(1) ఇంగ్లీషువాళ్లు యావన్మందీ కాన్పూరువొదిలి వెళ్లిపోవాలి.

(2 ఇంగ్లీషువాళ్ల ఫిరంగులూ, వాళ్ల దగ్గిరవున్న రూపాయలూ నానాసాహెబుకి సమర్పించాలి. చిన్నచిన్న ఆయుధాలుమాత్రం దగ్గిర పెట్టుకోవచ్చు.

(3) ఇంగ్లీషువాళ్లు వెళ్లిపోవడంకోసం పడవలూఅవీ నానాసాహెబు కుదిర్చిపెట్టాలి. అలహాబాదు చేరేవరకూ వాళ్ల భోజనసామగ్రులున్నూ ఏర్పాటుచెయ్యాలి.

సంధిపత్రం రాశాక, అజీముల్లాఖానూ వాళ్లూ నానాసాహెబు సంతకంకోసం వచ్చారు. అయితే ఇంగ్లీషువాళ్లు ఆరాత్రే వెళ్లిపోవాలన్నారు నానా పక్షంవాళ్ళు. మర్నాడుకాని వెళ్ళలే మన్నారు దొరలు. కొంతచర్చజరిగాక, నానా అంగీకరించాడు. ఆరాత్రి నానాసాహెబు ఇంగ్లీషువాళ్లని కాపాడడానికీ, మర్నాడుఉదయమే వాళ్ళు వెళ్ళిపోవడానికీ రాజీకుదిరింది. ప్లీలరుసేనాని సంతకంచేసిన సంధిపత్రం పట్టుకుని, టాట్‌దొర నానాసాహెబుదగ్గిరికి వచ్చాడు. నానాసాహెబు బిఠూరుకోటలో టాట్ లోగడ ఇంగ్లీషురీడరుగా వుండేవాడు. నానా అతడి క్షేమం విచారించాడు. ఎంతోఅంత గౌరవాదరాలు చూపించాడు.

ఆసాయంకాలం ఇంగ్లీషువాళ్లు, తమ ఖజానా, ఫిరంగులూ, ఆయుధాలూ అవీ నానాసాహెబుకి అప్పగించేశారు. జ్వాలాప్రసాదు తమ సహచరులతో వెళ్ళి, కోటలో మకాంవేశాడు. ఆరాత్రికి రాత్రి హుటాహుటిసింగూ, తాంతియాటోపేలు నలభైపడవలు సిద్ధంచేయించారు. కోటనించి గంగానది మైలున్నర దూర ముంది. అందుకని, కోటనించి ఏనుగులూ, బళ్లూ, పల్లకీలూ అవీ నానాసాహెబు ఏర్పాటుచేయించాడు.

మర్నాడు ఉదయం నానాసాహెబు ఏనుగు ప్లీలరుసేనానికోసం వచ్చి, కోటద్వారం ఎదట నుంచుంది. అయితే ప్లీలరుమాత్రం ఏనుగెక్కలేదు; పల్లకీ ఎక్కాడు. అతడికూతుళ్లూ వాళ్లూ మాత్రం ఏనుగెక్కారు. ఎంతోమంది దొరసానులు పల్లకీలమీద బయలుదేరారు. కోటమీద ఇంగ్లీషుజెండా యూనియను జాకు దిగిపోయింది. చంద్రవంకతో ఆకుపచ్చజెండా ఎగిరింది.

గంగానదివొడ్డు వొడ్డంతా ఇసకవేస్తే రాలనట్టున్నారు జనం. సీలుదొరఘోరాలకి జజ్జరిల్లిపోయి కాశీ, అలహాబాదులనించి పారిపోయివచ్చిన జనంవందలకొద్దీ, వేలకొద్దీ వున్నారు. ఇళ్ళు తగలబడి

పోయినవాళ్లూ, పెళ్లాంపిల్లలు కాలిపోయిన వాళ్ళూ, తమ్ముల్లూ, తండ్రులూ వురితాళ్ళకి వేలాడినవాళ్ళూ, భార్యలమానం, కూతుళ్ళ మానం కోల్పోయినవాళ్ళూ – ఉక్రోషంతో, కడుపుమంటతో, కన్నీళ్ళతోవచ్చి ఆజనంమధ్య గుమికూడారు. వాళ్ళుడదంతం విన్న వాళ్ళకి అమాంతంగా ఇంగ్లీషువాళ్ళని నింగేద్దామనిపిస్తూవుండేది.

గంగవొడ్డున సతీచౌరాశేవులో శివకోవిలదగ్గిర డాబామీద అజీముల్లాఖానూ, బాలాసాహెబూ, తాంతియాటోపే మొదలయిన వాళ్లు నుంచున్నారు. సోజనసామగ్రులతోనూ, వాటితోనూ గంగలో పడవలు సిద్ధంగా వున్నాయి. ఎండతగలకండా పడవలమీద చొప్ప కప్పులు తయారై వున్నాయి. ఇంగ్లీషువాళ్ల బళ్లూ, పల్లకీలూ అవీ గంగదగ్గిర చేరుకుంటున్నాయి.

కల్నలు ఎవార్డు వెనకబడిపోయాడు. కాయిలావల్ల అతడు పల్లకీలో బయలుదేరాడు. భార్య పక్కనేవుంది. ఇంతలో కొందరు సిపాయిలువచ్చి, అతణ్ణి చుట్టుముట్టారు. వెంటనే బోయీలు పల్లకీ కింద దించేశారు. "ఏమిటిసంగతి భాయీ?" అంటూ దీనంగా అడిగాడు ఎవార్డు. "ఎలావుందీ కవాతు?" అంటూ ఎకసెక్కమాడారు సిపాయిలు. అంతలోనే వొకసిపాయి కత్తిదూశాడు. ఎవార్డునీ, అతడి భార్యనీ అక్కడే పొడిచి చంపేశాడు.

ఇంగ్లీషువాళ్లు యావన్మందీ గంగలో దిగారు. తొడలోతు నీళ్లలో వెళ్లి పడవలమీద కూచున్నారు. భారతీయుడన్నవా డొక్కడూ వాళ్లకి చేయూతఇచ్చినపాపానపోలేదు. అందరూ పడవలెక్కారు. పదిగంటలయింది. పడవలు బైలుదేరడానికి సిద్ధంగా వున్నాయి.

తాంతియాటోపే చెయ్యివిసిరాడు. ఎక్కడినించో బిగులు మోగింది. పడవలకి నిప్పుముట్టించేసి, వొడ్డుకి వొచ్చేశారు. సిపాయిలు తుపాకులు గురిపెట్టారు. చిత్రవధ ఆరంభించారు.

పడవలమీద మంటలు. కింద నదీప్రవాహం. బైట తుపాకిగుళ్లు. మొదటిదెబ్బకే చచ్చిపోయాడు సేనాని ప్లీలరు. కాలిపోయీ, చిత్రవధ అయిపోయీ, నీటిలో మునిగిపోయీ ఎందరో హతమయిపోయారు.

ఇంతలో బసలోవున్న నానాసాహెబుకి వార్త అందింది. "ఆడంగులినీ, చిన్నపిల్లలనీ చంపవద్దు" అంటూ అతడు ఆజ్ఞాపంపాడు. నానాసాహెబు ఆజ్ఞ అందిందో లేదో, సంహారక్రీడ ఆపేశారు సిపాయిలు. వందా పాతికమంది దొరసానుల్నీ, పిల్లలనీ భద్రంగా పడవలమీంచి పైకి తీసుకువచ్చేశారు. చావగా మిగిలిన దొరల్ని పట్టుకున్నారు. వరాసగా నిలబెట్టి, తలకాయలు నరికేశారు.

ఒక్కపెద్ద పడవమాత్రం ఎలాగో తప్పించుకుని, కొట్టుకుపోయింది. దానికి అగ్గిముట్టుకోలేదు. పిల్లా పిచ్చికా ఎనభైమంది అందులో వున్నారు. కెప్టెను, థామ్సనూ, మూరూ మొదలైనవాళ్లు ఈ పడవలోనే వున్నారు. పడవ తప్పించుకున్నా, థామ్సనుమాత్రం తప్పించుకోలేకపోయాడు. సిపాయిల గుండుతగిలి అతడు పడవలోనే చచ్చిపడిపోయాడు. అతడితో మరికొందరున్నా చచ్చిపోయారు. కొందరికి దెబ్బలు తగిలాయి.

పడవ నడిపేవాళ్లు బిగులు మోగడంతోనే పడవ వొదిలేసిపోయారు. పడవలో తెడ్లుకానీ, తెరచాపకానీ లేవు. గంగాప్రవాహం ఎలా లాక్కుపోతే అలాకొట్టుకుపోతోంది పడవ. పడవలోతిండిలేదు. గంగాజలమొక్కటే గతి.

ఇష్టం వచ్చినట్టు పడవ కొట్టుకుపోతోంది. ఒడ్డుచేరే ఉపాయం లేదు. ఒడ్డంబడే వేటాడుతున్నారు సిపాయిలు. పగలంతా గడిచిపోయింది. మర్నాడూ అలా పగలు వెళ్లిపోయింది. పడవ కొట్టుకుపోతూనేవుంది. అవాళ రాత్రి హఠాత్తుగా డెప్పికి తగిలింది. ఆ అవకాశం చూసుకుని పడవలోంచి పదాన్లుగురు దొరలు గెంతేశారు.

వాళ్లు గెంతిన వూపుతో పడవ ముందికి లోతుసీళ్ళలోకి తోసుకు పోయింది.

పడవని వేటాడుతూవున్న జనం ఈపద్నాలుగురూ పారిపోవడం కనిపెట్టేశారు. తుపాకులతో వాళ్లవెంట పడ్డారు.

తిండీ తిప్పలూ లేకండా ఈపద్నాలుగురు ఇంగ్లీషువాళ్ళూ అసలే అలిసిపోయివున్నారు. అయినా శాయశక్తులా పరిగెత్తారు. రేచుల్లాగ సిపాయిలు వెంటబడ్డారు. అలా మూడుమైళ్లు పరిగెత్తారు. అక్కడ వొక చిన్న కోవిల అవుపించింది. పద్నాలుగురు ఇంగ్లీషువాళ్ళూ అందులో చొరబడ్డారు. తలుపులు బిగించుకున్నారు. లోపల చన్నీళ్లు మాత్ర మున్నాయి. తలా వుడిసెడు నీళ్లు తాగి నేదదీర్చుకున్నారు.

వెంటబడి సిపాయిలు గుడిదగ్గిరికి వచ్చేశారు. లోపల దూరే ఉపాయంలేదు. ఏమిటి సాధనం? తుపాకులతో నలుగురు తలుపుల దగ్గిర కాశారు. తక్కినవాళ్ళు వెళ్ళి కర్రాకంపా పట్టుకువచ్చారు. కోవిలమీద కుప్పపోశారు. అగ్గిముట్టించేశారు.

లోపల వుడికి చావడంకంటె మరో దిక్కులేదు దొరలకి. దబాలున తలుపులు తెరిచేశారు. ఒక్కవూపున వచ్చిన దిక్కే వుడాయించారు. సిపాయిలు వెంటపడ్డారు. తుపాకులు కాల్చారు. గంగవొడ్డుకి వచ్చేసరికి ఏడుగురుఇంగ్లీషువాళ్ళు కూలిపోయారు. గంగ చేరీచేరడంలో మరిముగ్గురు కాలుమనిపోయారు. మిగిలిన నలుగురూ గంగలో వురికేశారు. వాళ్ళ వొంటిమీద బట్టలులేవు. దిసమొలతో గంగా ప్రవాహం ఎలా కొట్టుకుపోతే అలా కొట్టుకుపోయారు. అంతలోనే వొక పడవ ఎదురయింది. చావుబతుకుల్లోవున్న నలుగురు ఇంగ్లీషువాళ్ళనీ పడవలోని వాళ్ళు పైకితీశారు; బతికించారు. ఆనలుగురినీ పడవవాళ్లు తీసుకుపోయి, మేరారమా గ్రామంలో జమీందారు రాజా దిగ్విజయ సింగు దగ్గిర అప్పగించారు. దిగ్విజయసింగు జాలిపడ్డాడు. నలుగురు

దొరల్నీ నెలవరకూ తనఇంట్లో అట్టేపెట్టాడు. బాగా కోలుకున్నాక, అలహాబాదు పంపేశాడు.

గంగలో కొట్టుకుపోయిన పడవ కొంతదూరంలో సిపాయిలు పట్టుకున్నారు. అందులోని దొరల్ని నరికేశారు. దొరసానుల్నీ, పిల్లల్నీ కాన్పూరు తెచ్చేశారు.

గంగలోంచి పైకి తెచ్చిన దొరసానుల్ని సబేదాకోఠీలో నిర్భంధంలో వుంచారు. వాళ్లమీద ఈగనన్నా వాలకుండా నానాసాహేబు జాగ్రత్త తీసుకున్నాడు. మొదటి కోలాహలంలో కొంతమంది దొరసానుల్ని సిపాయిలు తీసుకుపోయారు. నానాసాహేబు వాళ్లని వెంటనే నిర్బంధించాడు. దొరసానుల్ని విడిపించి, సబేదాకోఠీలో చేర్చాడు. అలా సబేదాకోఠీలో వుంచిన దొరసానులకి చపాతీలూ, అప్పుడప్పుడు మాంసమూ ఇప్పించాడు. చిన్నపిల్లలకి పాలు పంపించే వాడు. బేగము అని వొక స్త్రీని దొరసానులకి వార్డెనుగా నియమించాడు. వాళ్లకి మంచి బట్టలూ అవీ ఏర్పాటుచేశాడు.

ఇదంతా అయాక ఇరవై ఎనిమిది సాయంకాలం నానాసాహేబు గొప్ప దర్బారు చేశాడు. పటాలం యావత్తూ రెండు గుర్రపుదళాలూ ఆరు పదాతికదళాలు సైనిక విన్యాసం జరిపాయి. విప్లవకారులందరూ తమ తమ పతాకాలతో హాజరయారు. ఫిరంగిదళం ప్రముఖస్థానంలో నిలబడింది. ప్రారంభంలో వందావొక్క ఫిరంగులతో నందనం చేసింది. నానాసాహేబు రాగానే ఇరవైవొక్క ఫిరంగులుపేల్చి వందనంచేసింది ఇరవైవొక్కరోజులు జరిగినయుద్ధానికి అది చిహ్నమన్నారు కొందరు.

నానాసాహేబు జవాబు చెపుతూ ఈవిజయం మన అందరిదీ అన్నాడు. ఒక లక్షరూపాయలు సిపాయిలకి బహుమతులు పంచాడు. నానాసాహేబు సైన్యం సందర్శించినప్పుడు మరో ఇరవైవొక్క ఫిరంగులు పేల్చారు. నానాసాహేబు తమ్ముల గౌరవార్థం తలా పదిహేడు

ఫిరంగులు పేల్చారు. జ్వాలాప్రసాదు, తాంతియాటోపేల గౌరవార్థం తలా పదకుండు ఫిరంగులు పేల్చారు.

ఈదర్బారయాక నానాసాహేబు బిఠూరు వచ్చాడు. బిఠూరులో జూలై మొకటిని ఆయన పట్టాభిషేకం జరిగింది. రాజతిలకంతో నానాసాహేబు పీష్వాసింహాసన మలంకరించాడు. జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

హైదరాబాదు

ఆదినాళ్లో హైదరాబాదు పరిపాలనాచక్రం ప్రధానమంత్రి సాలారుజంగుచేతిలో వుండేది. 1857 మేమాసంలో కొత్తసవాబు అఫజలు ఉద్దాలా గద్దెమీదికి వచ్చాడు. హైదరాబాదునవాబు స్వాతంత్ర్య సమరంలో చేతులుకలిపివుంటే, కనీసం తటస్థుడుగా అయినా వూరుకునివుంటే దక్షిణాదియావత్తూ ఇంగ్లీషువాళ్ళని తరిమికొట్టేది. నీలూ, హావలక్-వంటి సేనానులు దక్షిణదేశంలోనే సమాధులు కట్టుకునే వాళ్ళు. అయితే హైదరాబాదులో విప్లవం తలఎత్తకపోలేదు. అది విజృంభించకండాచేసిన కీర్తిమాత్రం దివాను సాలారుజంగుకే దక్కింది. హైదరాబాదురాజ్యంలో ఏమూలా విప్లవం రేగకండా కట్టుదిట్టంచేశాడాయన. విప్లవనాయకుడు ఎవడైనా హైదరాబాదులో అడుగుపెడితే చాలు, బంధించి ఇంగ్లీషువాళ్ళకి అప్పగించేసేవాడు.

1857 జూను పన్నెండున హైదరాబాదునగరం గుబగుబలాడడ మారంభించింది. విప్లవప్రకటనలు గోడలమీద ప్రత్యక్షమయాయి. విప్లవకాయలు వందలూ వేలూ కరపత్రాలు పంచిపెట్టారు. మశీదుల్లో మహమ్మదీయులు సభలుచేశారు. ఫరంగీలని పారదోలాలని ఉపన్యాసాలుచేశారు.

జూను, జూలైమాసాలు ముమ్మరమయిన ప్రచారంసాగింది. జూలై పదిహేడున హైదరాబాదుప్రజలు ఆకుపచ్చజెండా ఎగరవేశారు.

నైజాం పటాలం రోహిలాసిపాయిలు వాళ్ళతో కలిశారు. దీనంతటకీ తోరాబాజుఖానూ, మౌల్వీ అల్లావుద్దీనూ నాయకత్వం వహించారు. జైలు ముట్టడించారు. ఖైదీలని విడిపించారు. దీన్‌దీన్ నినాదాలతో వెళ్ళి రెసిడెన్సీ మీద దాడిచేశారు. అనేకసంస్థానాలమల్లేనే హైదరాబాదు సంస్థానంకూడా తటస్థంగా వూరుకుంటుందనే విప్లవకారులు భావించారు. కాని అలా జరగలేదు. సాలారుజంగు బ్రిటిషువాళ్ళతో కలిసి హైదరాబాదు విప్లవకారులమీద విరుచుకుపడ్డాడు. హోరాహోరీ పోరాటం జరిగింది. ఈపోరాటంలో తోరాబాజుఖాను మరణించాడు. మౌల్వీ అల్లావుద్దీను పట్టుబడిపోయాడు. అతణ్ణి అండమానులు పంపేశారు.

హైదరాబాదుదగ్గిరే మరో చిన్నసంస్థానం జోరాపురముంది. జోరాపురంరాజు యువకుడు. నానాసాహెబు రాయబారులువచ్చి అతడికి స్వాతంత్ర్యసందేశ మందించారు. దాంతో స్వాతంత్ర్యసమరంలో తన సర్వస్వమూధారపోయడానికి దీక్షపూనాడతడు. అందుకని అరబ్బులూ, రోహిలాలూ, పఠానులూచేర్చి వొకపటాలం సిద్ధంచేశాడు. 1858 ఫిబ్రవరిలో అతడు హైదరాబాదు వచ్చాడు. సాలారుజంగు వొకకంటితో అతణ్ణి కనిపెడుతూనేవున్నాడు. బజారులోంచి వెళ్తుతూవుండగా అరస్టుచేసి ఇంగ్లీషువాళ్ళకి అప్పగించేశాడు.

అప్పుడు మిడోసు కెయిలరు అని వొకదొర వుండేవాడు. బాల్యంనించీ జోరాపురంరాజు అతణ్ణి గౌరవాదరాలతో చూసేవాడు. అతణ్ణి "అప్పా" అని పిలిచేవాడు. అది అవకాశంగాతీసుకుని విప్లవరహస్యాలు అతణ్ణించి కూపీలాగాలని ఇంగ్లీషువాళ్లు కెయిలరుని జైల్లోకి రాజుదగ్గిరికి పంపారు. కెయిలరునిచూసి ఎంతోఅంత గౌరవించాడు రాజు. కుశలప్రశ్నలయాక కెయిలరు విప్లవరహస్యాలు ప్రసంగించాడు. రాజు నెమ్మదిగా జవాబు చెప్పాడు – "అప్పా, ఎన్నటికీ నే నది వెల్ల

డించను. మీరు నన్ను రెసిడెంటుని చూడమంటున్నారు, కాని అది కూడా నేను చెయ్యను. బహుశా నేను ప్రాణభిక్ష వేడుకుంటానని అతడు భావిస్తున్నా డేమో! కాని అప్పా, నేను పిరికిపందలా ఇతరుల దయాభిక్షమీద జీవించాలని ఎన్నటికీ కోరను. అంతేకాదు, నా దేశీయుల రహస్యం నేను ఎన్నడూ వెల్లడించను."

కెయిలరుదొర అప్పటికి వచ్చేశాడు. మళ్ళీవొకసారి వెళ్ళి రాజుకి నచ్చజెప్పబోయాడు. - "ఇదిగో, నువ్వు విప్లవకారుల పేర్లు చెప్పేస్తే చాలు, నిన్ను ప్రభుత్వం క్షమించి వొదిలిపెట్టేస్తుంది" అన్నాడు. స్వాతంత్ర్యదీక్షతోవున్న రాజుని కెయిలరుమంత్రాంగం కదిలించలేక పోయింది. అతడు స్పష్టంగా చెప్పేశాడు – "అప్పా, ఏమన్నమాటది! నేను మృత్యుముఖంలో ప్రవేశించడానికి సిద్ధంగావున్నాను. ఈస్థితిలో నమ్మకద్రోహినయి నా దేశీయులపేర్లు వెల్లడించనా? అది ఎన్నటికీ జరగదు. ఫిరంగినోరూ, వురికంబమూ, అండమానులూ - ఇవేవీ నమ్మకద్రోహంకంటే ఘోరమైనవి కావు." అన్నాడు.

"అయితే నీకు చావు తప్పదు" అన్నాడు కెయిలరు.

"కాని అప్పా! నా దొక్క– ప్రార్థన - నన్ను వురితియ్యకండి. ఏమంటే, నేను దొంగనికాను. నన్ను ఫిరంగిముందుపెట్టి కాల్చెయ్యండి. మీరే చూస్తుకాని, ఎంతప్రశాంతంగా ఫిరంగిముందు నుంచుంటానో నేను" అన్నాడు రాజు.

కెయిలరుదొర సిఫారసుమీద రాజుకి మృత్యుదండనకిబదులు ద్వీపాంతరవాసం విధించారు. ఈతీర్పువిని "అండమానులకంటే మరణమే భాగ్యమని భావిస్తాను నేను" అన్నాడు రాజు – "నిర్బంధం, పైగా అండమానుల్లో! నాప్రజల్లో కొండవాడుకూడా జైల్లో వుండడమంటే ఇష్టపడడు. పైగా వాళ్ళ రాజుని నేను!"

అన్నట్టుగానే అతడు అండమానులుకంటే మరణమే వరించాడు. తనని పహారాఇస్తూన్న ఇంగ్లీషుసోల్జరుదగ్గిర ఎలాగో పిస్తోలు లాక్కుని తటాలున ఆత్మహత్య చేసుకున్నాడు.

నర్గుండరాజు భాస్కరరావు బాబాసాహెబుకూడా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడు. బాబాసాహెబుకి సంతానం లేదు. దత్తత చేసుకుందికి కుంపినీప్రభుత్వం అంగీకరించలేదు. అతడి రాణి బ్రిటిషువాళ్ళంటే మండిపడేది. స్వాతంత్ర్యసమరంలో వుడికి ఇంగ్లీషువాళ్ళని హతవార్చుమని భర్తని పదేపదే ప్రోత్సహించింది. భాస్కరరావు బాబాసాహెబు విద్యావంతుడు. ఎన్నో గ్రంథాలు సమకూర్చి దుర్గంలో మొగమంచి గ్రంథాలయమేర్పరిచాడు. ఎంతోకాలం నిరీక్షించాక భార్య ప్రోత్సాహంమీద వెంకటేశ్వరాలయంలో ప్రమాణం చేశాడాయన – "దేశంకోసం, ధర్మంకోసం స్వాతంత్ర్యయుద్ధం సాగిస్తాను."

1858 మే ఇరవై అయిదున భాస్కరరావు బాబాసాహెబు ఇంగ్లీషువాళ్ళమీద యుద్ధం ప్రకటించాడు. దాంతో జనరలు మాన్సను కొంత సేనతో నర్గుండ బైలుదేరాడు. మాన్సనుసేన సురేబాను దగ్గిర అడివిలో మకాం వేసింది. అద్దరాత్రి బాబాసాహెబు సేనతో వచ్చి మాన్సనుమీద పడ్డాడు. చీకటియుద్ధం జరిగింది. ఎంతోమంది ఇంగ్లీషు సిపాయిలు కూలిపోయారు. జనరలు మాన్సను హతవై పోయాడు. చావగామిగిలిన ఇంగ్లీషుపటాలం కాళ్ళకి బుద్ధిచెప్పి కకావికలయి పోయింది. మాన్సను తలకాయ బాబాసాహెబు నరికేశాడు. మొండెం అడివిలో పారేశాడు. మర్నాడు మాన్సను తలకాయ నర్గుండ కోట గోడకి చేలాడదీశాడు. బాబాసాహెబుకీర్తి దేశమంతటా వ్యాపించింది.

బాబాసాహెబు సవతితమ్ముడొకడుండేవాడు. అతడు వెళ్ళి ఇంగ్లీషువాళ్ళతో కలిశాడు. నర్గుండ రహస్యాలు వెల్లడించి శత్రువుని నర్గుండమీదికి పట్టుకువచ్చాడు. ఈయుద్ధంలో నర్గుండసేన వీగిపోయింది.

బాబాసాహెబు పారిపోయాడు. కాని మాపువేషంలో పట్టుబడిపోయాడు. అతణ్ణి జూను పన్నెండున వురితీసేశారు. నర్గుండరాణీ, రాజమాతా మాలప్రభ నదిలో వురికి ప్రాణాలు ఎొదిలిపెట్టేశారు.

ఢిల్లీ కురుక్షేత్ర ం

" భారతభూమిలోని హిందూ మహమ్మదీయులారా ! లేవండి ! సోదరులారా, లేవండి !! భగవంతుడు ప్రాణులకి ప్రసాదించిన సౌభాగ్యాలన్నిటిలోకి విలువయింది స్వాతంత్ర్యం. దుర్మార్గులయిన నీచులు దగాచేసి మనసౌభాగ్యం అపహరించారు. శాశ్వతంగా ఈ దౌర్భాగ్యం మనం అనుభవించవలిసిందేనా ? భగవంతుడి సంకల్పానికి విరుద్ధంగా ఈ దురంతం చిరకాలం వుండగలుగుతుందా ? ఉండదు. ఎంత మాత్రం వుండదు. ఫరంగీలుచేసిన దుర్మార్గానికి అంతులేదు. వాళ్ల పాపం పండింది. వాళ్లు ఎంతకి తెగించారో తెలుసా ? పవిత్రమైన మన మతం నాశనం చెయ్యడానికి కూడా వాళ్లకి దుర్బుద్ధిపుట్టింది. చెప్పండి, ఇంకా మీరు ముక్కుమూసుకుని కూచునే వుంటారా ? మీరలా వూరికేవుండడం భగవంతుడి సంకల్పం కాదు. అందుకనే హిందూ మహమ్మదీయుల హృదయాల్లో ఇంగ్లీషువాళ్లని బహిష్కరించాలన్న సంకల్పం పుట్టించాడు. భగవంతుడి దయవల్ల మీ శౌర్యప్రతాపాలు విజృంభిస్తాయి. మన దేశంలో ఫరంగీల మచ్చకూడా వుండకుండా అయిపోతుంది. మనసేనలో చిన్నా పెద్దా భేదంలేదు. అందరూ సమానమే. ఈ పవిత్రయుద్ధంలో కత్తిపట్టిన యావన్మందీ రానున్నకీర్తిలో భాగస్థులే. అందరూ అన్నదమ్ములే. చిన్నా పెద్దా భేదంలేదు. అంచేత నేను మరోసారి యావన్మంది హిందూసోదరుల్నీ కోరుతున్నాను, లేవండి. భగవంతుడాదేశించిన ఈ పరమకర్తవ్యం నిర్వహించండి. రణరంగానికి దుముకండి ! "

ఢిల్లీ స్వాధీనమయ్యాక పాదుషా బహదూరుషా దేశీయుల నాహ్వానిస్తూ చేసిన ప్రకటన ఇది.

మే ముప్ఫయిని ఢిల్లీస్వతంత్రసేన మీరటునించి వస్తూవున్న ఇంగ్లీషు ఫౌజు నెదిరించి వెనకకి వచ్చేసింది. మర్నాడు బరేలీవార్త వచ్చింది. అవాళ తిరిగీ స్వతంత్రసేన వెళ్ళి ఇంగ్లీషువాళ్ళ నెదిరించింది. హోరా హోరి పోరాటం జరిగింది. ఇంగ్లీషుసేనలో ఎంతోమంది కూలిపోయారు. సాయంకాలంవరకూ యుద్ధంచేసి స్వతంత్రసేన ఢిల్లీవచ్చేసింది.

మర్నాడు మేజరు రీడు నాయకత్వంకింద వొక ఘూర్ఖాపటాలం వచ్చి మీరటు తెల్లపటాలంతో కలిసింది. అంబాలానించి బర్నార్డు నడుపుకు వచ్చిన తెల్లఫౌజూ, సిక్కురాణువాకూడా ఏడో తేదీని వచ్చి కలుసుకుంది. ఇంతలో నాభామహారాజు పంపినసహాయమూ వచ్చి చేరింది. ఈరాణువ యావత్తూ ఎకాఎకిని బైలుదేరి ఢిల్లీ చేరువగా ఆలీపురంలో డేరావేసింది. జూను ఎనిమిది ఉదయం ఢిల్లీ స్వతంత్రసేన పెద్దఎత్తున వెళ్ళి ఇంగ్లీషుసేనమీద పడింది. పాదుషా కుమారుడు మీర్జా ముగలు సేనాధిపత్యం వహించాడు. బుందేలుషరాయి దగ్గిర ఉదయంనించీ సాయంకాలంవరకూ యుద్ధం జరిగింది. తుదకి స్వతంత్రసేన వెనకకి వచ్చేసింది. అవాళయుద్ధంలో స్వతంత్రసేన ఫిరంగులు కొన్ని శత్రువులకి దొరికిపోయాయి. ఇంగ్లీషుసేన పట్నం ప్రాకారంవరకూ వచ్చేసింది. అయితే నలుగురు ఇంగ్లీషు ఆఫీసర్లు హతవైపోయారు. నలభై ఏడుగురు సైనికులు కూలిపోయారు. వందా ముప్ఫయిమంది గాయాలుపడ్డారు.

పాదుషా ప్రతీరోజూ ఎర్రకోటలో దర్బారుచేసేవాడు. పట్నంలోని పెద్దపెద్ద అమీరులూ, ముగలుప్రముఖులూ హాజరయేవాళ్లు. ముగలు ప్రముఖులు ఈయుద్ధం జిహాదుగా ప్రకటించమన్నారు. జూను పదిని, ఊళ్లో దుకాణాలు తెరవండంటూ పాదుషా దండోరా వేయిం

చాడు. అవాళే సిపాయిలు వందమందిఇంగ్లీషువాళ్ల తలకాయలు తెచ్చి వూరేగించారు. మరో యాభై మంది సిపాయిలు పాటియాలా రాజు అజితసింగుని పట్టుకువచ్చి పాదుషా ఎదట పెట్టారు. అజితసింగు పాదుషాపాదాలమీదపడి ప్రాణభిక్ష వేడుకున్నాడు.

అవాళ కులీఖాను అని వొకఫిరంగిసిపాయి విడుపూవిరామం లేకండా ఇంగ్లీషువాళ్లమీద ఫిరంగులు కాల్చాడు. అందుకని వంద మణుగుల మందుగుండు తయారుచేయండని పాదుషా ఆజ్ఞాపించాడు.

బుండేలు సరాయి యుద్ధం తరవాత ఇంగ్లీషు పటాలం ఢిల్లీగుట్ట మీది ఫ్లాగుస్టాఫ్‌టవరు (పతాక మందిరం) ఆక్రమించుకుంది. అక్కడే యాభై అరవై అడుగుల ఎత్తు గుట్టనానుకుని శ్రీజీరావు తాలూకు పెద్ద భవన ముండేది. శ్రీజీరావు కుంపినీ పెన్షనుదారు. అతడి భవనాన్ని హిందూరావు భవనం అనేవాళ్ళు. పతాకమందిరం మీదా హిందూరావు భవనంమీదా, జయసింగు నక్షత్రశాల (జంతర్ మంతర్, మీదా ఇంగ్లీషువాళ్లు ఫిరంగు లమర్చారు.

ఢిల్లీపట్నం యావత్తూ వొక రణమర్దంగా తయారయింది. యావన్మంది ప్రజలూ యుద్ధకార్యాల్లో మగ్నులయారు. మందుగుండు కార్ఖానాలూ, ఫిరంగులూ తుపాకులూ తయారుచేసే కర్మాగారాలూ ఎన్నో బయలుదేరాయి. ఒక్క గాజులవీధి కార్ఖానాలోనే రోజూ ఏడు వందల మణుగులు మందుగుండు తయారయేది. కొంతమంది క్రైంచి వాళ్ళూ ఈకార్ఖానాలోనే పనిచేసేవాళ్ళు.

దూరదూరాలనించి సిపాయిలూ, ధనమూ, వచ్చి పడుతూ వుండేది. పాదుషా బహదూరుషా ఏనుగుమీద బయలుదేరి పట్నంలో ప్రబోధించేవాడు. సిపాయిలని ఉత్సాహపరిచేవాడు. పట్నంలోనూ చుట్టుపట్లా గోవాత్య నిషేధించాడు. గోవుని చంపినవాళ్ళ చేతులు నరికేస్తామని ప్రకటించాడు. ఇంగ్లీషువాళ్ళకి ఏవిధమయిన సహా

యమూ చెయ్యరాదని ఆదేశించాడు. జూను ఎనిమిదిని ప్రముఖ వర్తకుడు పియామలేమలసూరీ ఇంగ్లీషువాళ్లకి సామాను లమ్మాడని ఫిర్యాదు వచ్చింది. మలసూరే కుమారుణ్ణి బంధించి సిపాయిలు పాదుషాఎదట పెట్టారు. అలాగే వర్తకుడు పారీలాలు ఇంగ్లీవాళ్ళకి గంధకం విక్రయించాడని పట్టుకున్నారు. పాదుషా వార్థక్యంవల్ల ఎన్నో పనులు బేగంజిన్నతుమహాలే నిర్వహించేది.

బుందేలు సరాయియుద్ధంలో లభించిన విజయంతో ఇంగ్లీషువాళ్ళు పట్నంలో ప్రవేశించడానికి పదేపదే ప్రయత్నించారు. కాని సాధ్యం కాలేదు. జూను పన్నెండున స్వతంత్రసేన మళ్లీ ఇంగ్లీషుశిబిరం ముట్టడించింది. హిందూరావుభవనంమీదకూడా దాడిచేసింది. అవాళ కుంపినీ సేనలోంచి కొంతమంది నేటీవుకాతులు విప్లవసేనలో కలిసిపోయారు. ఇదయాక పట్నంలో ప్రవేశించాలన్న సంకల్పం ఇంగ్లీషువాళ్లు వొదులుకున్నారు. మర్నాడుకూడ విప్లవసేన హిందూరావుభవనం మీద దాడిచేసింది. అలా ప్రతీదినమూ ఇంగ్లీషుశిబిరంమీద విరుచుకు పడుతూనేవుండేది. సాయంకాలమయేసరికి పట్నంలోకి తిరిగి వచ్చేసేది.

వివిధస్థలాల్లో విప్లవంచేసినపటాలాలు ఢిల్లీవచ్చిపడుతూవుండేవి. అలా ఇవాళవచ్చినపటాలం మర్నాడు ఉదయం ఇంగ్లీషుశిబిరంమీద దాడిచేసేది. సాయంకాలం తిరిగి వచ్చేసేది.

జూను పదాన్నాలుగున ఇంగ్లీషుపటాలంలోంచి వొకఏనుగ పట్టుకు వచ్చి వొకమహంతు పాదుషాదగ్గిరికివచ్చాడు. ఏనుగు పాదుషాఉప యోగానికి వుంచేశారు. అలాగే మరోనాడు ఇంగ్లీషువాళ్ల ఏనుగు మరొకటి సిపాయిలు పట్టుకువచ్చేశారు. పద్దెనిమిదిని నాసిరాబాదు సిపాయిలు ఢిల్లీవచ్చారు. ఇరవైని ఇంగ్లీషుశిబిరంమీద దాడిచేశారు. అవాళటి యుద్ధంలో ఇంగ్లీవాళ్లు మూడు చెరువులనీళ్లు తాగారు.

ఇరవై మంది చచ్చిపోయారు. తొంభై తొమ్మండుగురు బాగా గాయ పడ్డారు. అద్దరాత్రివరకూ ముట్టడి సాగుతూనే వుంది.

ఇరవై రెండున పంజాబునించి ఎనిమిదివందలయాభై మంది సైని కులూ, అయిదుఫిరంగులూ ఇంగ్లీషువాళ్ల సహాయంకోసం వచ్చాయి. జూను ఇరవై మూడు ప్లాసీయుద్ధానికి నూరేళ్లూ నిండినరోజు. ప్లాసీపగ అవాళ తీర్చుకోవాలి. భళ్ళున తెల్లవారేసరికి లాహోరుదర్వాజా లోంచి స్వతంత్రసేన బైలు దేరింది. ఇంగ్లీషుశిబిరంమీదవిరుచుకుపడింది. పాదుషాఫిరంగులు గర్జించాయి. గుళ్లవర్షం కురిపించాయి. ఘోరమైన యుద్ధం జరిగింది. ఉభయసేనలూ అలిసిపోయాయి. సాయంకాలం స్వతంత్రసేన పట్నంలోకి వచ్చేసింది.

ఇలా జూనునెలంతా గడిచిపోయింది. అవాళ జూలై వొకటి. ఢిల్లీ పట్నం కోలాహలంగావుంది. రోహిలాఖండంనించి మహమ్మదు బఖ్తు ఖాను యమున పడవవంతెన దాటి, కలకత్తాదర్వాజాలోంచి ఢిల్లీప్రవే శించాడు. ఈ రోహిలాదండుకోసం యమునవంతెన ప్రత్యేకం మర మ్మత్తు చేసిపెట్టారు. పాటలతోనూ పచ్చజెండాలు ఎగరవేస్తూ, పద్నాలుగువేలకాల్బలమూ, మూడుగుర్రపుదాళాలూ పట్టుకుని బఖ్తు ఖానువచ్చాడు. పాదుషా బహదూరుషా ఎర్రకోటమించి దుర్బినీ యంత్రంతో రోహిలాసేనని చూస్తూనుంచున్నాడు. ఢిల్లీప్రజలు హృదయాపూర్వకమైన స్వాగతమిచ్చారు. అహమదుకులీఖాను మొద లయినప్రముఖులు ఎదురువెళ్లి తోడితెచ్చారు.

మర్నాడు పెద్దదర్బారు జరిగింది. హాకీము అషనుల్లాఖాను, సనదు ఖాను, ఇబ్రహీము అలీఖానూ,గులాం కులీఖానూ మొదలయిన నాయ కులఎదట పాదుషా బఖ్తుఖానుణ్ణి సర్వసేనాధిపతిగా నియమించాడు. ఢిల్లీగవర్నరుపదవికూడా అతడికే సమర్పించాడు. బఖ్తుఖాను లోగడ వొకఫిరంగిదళానికి సుబేదారుగా వుండేవాడు. మొదటి ఆఫ్గను

యుద్ధంలో పోరాడాడు. సమర్థుడైన సేనానాయకుడతడు. తన రోహిలాఖండం సిపాయిలకు ముందే అతడు ఆరుమాసాలజీతాలిచ్చేసి పట్టుకువచ్చాడు. తనవెంటకూడా నలభైలక్షలరూపాయలు పట్టుకు వచ్చాడు.

పాదుషా బఖ్తఖానుకి సర్వాధికారమూ సమర్పిస్తూ పట్నంలో శాంతీ, పటాలంలో క్రమశిక్షణా స్థాపించమనికోరాడు. "ఇవాళనించీ రాజకుమార్లయినా సరే, హద్దుమీరిప్రవర్తించారో ముక్కూ చెవులూ కోసేస్తాను" అని ప్రకటించాడు బఖ్తఖాను.

జూలై మూడున సిపాయిల కవాతుజరిగింది. సుమారు ఇరవైవేల సిపాయిలు కవాతులో పాల్గొన్నారు. అటుఇంగ్లీషుసేనాపతి జనరలు బర్నార్డు పంజాబునించి ఆరితేరిన ఆఫీసర్లనీ, అనుభవంకల సేనానులనీ, సైనికులనీ తెప్పించి సైన్యం గట్టిపరిచాడు. అయినా ఢిల్లీమీదికి ఎత్తి రావడానికి అతడికి ధైర్యంచాలకుండావుండేది.

జూలై నాలుగున మహమ్మదు బఖ్తఖాను తనసేనతో ఇంగ్లీషు శిబిరంమీద దెబ్బతీశాడు. దాంతో బర్నార్డుసేనానికి గెలుపు స్వప్నమైపోయింది. మర్నాడు కలరానచ్చి అతడు కళ్ళుమూసేశాడు. జనరలు రీడుసర్వసేనాని అయాడు.

ఎనిమిదిని దివానీఆమ్‌లో పాదుషాదర్బారుచేశాడు. మర్నాడు మహబూబు ఆలీఖాను సరాయిలో దాగున్న ఇంగ్లీషువాళ్ళని సిపాయిలు సరికేశారు. వాళ్ళతలకాయలు పాదుషాఎదట పెట్టారు. పాదుషా వాళ్ళకి వందరూపాయలు బహూకరించాడు. అవాళే బఖ్తఖాను భారీఎత్తున ఇంగ్లీషువాళ్ళమీద దాడిచేశాడు. ఇంగ్లీషుసేన తట్టుకోలేకపోయింది. వాళ్ళ గుర్రపుదండు వెనకకి దాడుతీసింది. ఇంగ్లీషుశిబిరంగులు కిక్కిరుసినకండా వూరుకున్నాయి. ఎంతోమంది

ఆఫీసర్లూ, సోల్జర్లూ మరణించారు. మిగిలినవాళ్ళు పలాయనం చిత్త గించారు. అవమానంతో వాళ్ళు శిబిరానికివెళ్ళి, కడుపుడుకుపట్టలేక, శిబిరంలో తమ హిందూస్థానీనౌకర్లని చంపేశారు. ఆలిమీాదకోపం రోలుమీాద!

పద్నాలుగున మరోపెద్దదాడిచేశారు సిపాయిలు. తొమ్మిదిని మించిన దెబ్బతినేశారు ఇంగ్లీషువాళ్ళు. జనరలు చాంబర్లేనుకి గుండు దెబ్బతగిలింది. ఆబితుకుతో సర్వసేనాని రీడుకూడా కాయిలా పడి పోయాడు. పదిహేడున రాజీనామాఇచ్చేసి కొండలమీాదికి వెళ్ళిపో యాడు. జనరలువిల్సను సర్వసేనానాయకు డయాడు. విప్లవ మారంభ మయాక విల్సను నాలుగో సర్వసేనాని.

ఢిల్లీ స్వాధీనమయి ఆరుమాసాలయింది. శత్రువు పట్నం ప్రవే సించకండా స్వతంత్రసైనికులు సాధిస్తూనేవున్నారు. ప్రతీదినమూ స్వతంత్రసేన పట్నంలోంచి బైటికివెళ్ళేది; ఇంగ్లీషుశిబిరంమీాద దాడి చేసేది. ఇంగ్లీషువాళ్లు తపుముకువస్తే పారిపోయినట్టువచ్చి పట్నంలో దూరిపోయేది. ఇంగ్లీషువాళ్లు ప్రాకారం దగ్గిరికిరాగానే పైసించి గుళ్ళవర్షం కురిపించేది. ఇంగ్లీషుసేన మిడతల్లామాడిపోయేది. చివరికి విల్సనుసేనాని విసిగిపోయాడు. స్వతంత్రసేనని వెంటాడవద్దని తనసేనకి ఆజ్ఞాపించాడు. పడమటితట్టుమాత్రం ఇంగ్లీషుశిబిరముండేది. తక్కిన మూడుదిక్కులా సిపాయిలు రాకపోకలు జరుస్తూనేవుండేవాళ్లు. విప్లవం విజృంభించినప్రదేశా లన్నిటినించీ బహదూరుషాకి సూ ర్తలూ, నజరానాలూ చేరుతునేవుండేవి. ఒకటిరెండుదినాల్లో ఢిల్లీపట్టుకుంటా మని కలలుకన్న కానింగు కంగారుపడడం మొదలుపెట్టాడు.

అక్బరుషామల్లేనే బహదూరుషాకూడా కవి. ఎన్నోవిప్లవగీతాలు రాశా డతడు. ఆగస్టు రెండున జరిగిన దర్బారులో ఈ కిందిపద్యం చదివాడు:

"ఇవాళ ధర్మద్రోహులు నశించాలి
శత్రువుల్ని ఖడ్గాలతో చెండాడండి
ఫరంగీలు సమూలంగా నాశనంకావాలి
చిత్రవధచెయ్యండి, ఎవరినీవొదలకండి
చిత్రవధతో ఈద్ పండుగజరపండి."

కాన్పూరు ముట్టడి

అలహాబాదు ఇంగ్లీషువాళ్ల హస్తగతమయింది. గవర్నరుజనరలు కానింగు తనమకాం కొంతకాలం కలకత్తానించి అలహాబాదు మార్చాడు. కాన్పూరు కొత్తకోటముట్టడి అలహాబాదు చేరింది. నీలు సేనాని అలహాబాదులో కొంతసేన అట్టేపెట్టుకుని, నాలుగువందలు ఇంగ్లీషుసోల్జర్లూ, మూడువందలు సిక్కుసిపాయిలూ, వంద గుర్రపు రౌతులూ ఇచ్చి మేజరు రీనాడుని కాన్పూరుపంపాడు. నీలుదొరనే వొరవడిపెట్టుకున్నాడు రీనాడు. దారికడ్డూకూ గ్రామాలు తగలేస్తూ, రక్తనదులుపారిస్తూ కాన్పూరు బైలుదేరాడు. ఇంతలో పెద్ద ఇంగ్లీషు ఫౌజువేసుకుని హావలకుసేనాని జూనునెలాఖరున అలహాబాదువచ్చాడు. హావలకు సమర్థుడయిన సేనాని. యుద్ధవిద్యలో అందెవేసినచెయ్యి. అతడు వచ్చేసరికి కాన్పురం సతీచౌరా ఇంగ్లీషువాళ్ల చిత్రవధవార్త అలహాబాదు చేరింది. హావలకు అగ్నిహోత్రుడయిపోయాడు. కాన్పూరు దురంతానికి కసితీర్చుకోవాలంటూ కారాలూ మిరియాలూ నూరాడు. వెయ్యినుంది మెరికల్లాంటి ఇంగ్లీషుపదాతికులూ, వందాయాభై మంది సిక్కుసిపాయిలూ, వొకటోరకం గుర్రపుదళమూ, అరు ఫిరంగులూ వేసుకుని జూలై ఏడున ఎకాఎకిని కాన్పూరుబయలుదేరాడు. పదకుండున దారిలో మేజరురీనాడునికలుసుకున్నాడు. ఉభయసేనలూ పన్నెండునఫతేపురానికి నాలుగుమైళ్లదూరంలో బేలిందా దగ్గిర డేరా

వేశాయి; భోజనాదికాల ఏర్పాటు చేసుకుని తిండికి సిద్ధంగా కూచున్నాయి.

రీనాడుసేన గ్రామాలుకాలుస్తూ, కనపడ్డవాళ్లనల్లా కడతేరుస్తూ కాన్పూరువస్తూవున్నవార్త నానాసాహెబు విన్నాడు. జ్వాలాప్రసాదు, టీకాసింగుల నాయకత్వంకింద కొంతసేన పంపాడు. రీనాడుతో హావలకు కలిశాడన్నసంగతి జ్వాలాప్రసాదు, టీకాసింగులకి తెలియదు. రీనాడుసేన ఓడించవచ్చు అనుకున్నారు వాళ్లు. ఆధీమాతో తిన్నగా ఇంగ్లీషు సేనమీదికి బైలుదేరారు.

ఇంగ్లీషుసేన భోజనానికి సిద్ధంగావుంది. విప్లవసేన వచ్చిపడుతున్నదని వేగులవాళ్లు వార్తతెచ్చారు. వార్త ఇలా అందిందోలేదో విప్లవకారుల ఫిరంగులన్నీ ధనాధన్ గుళ్లవర్షం కురిపించాయి. వడ్డించిన వడ్డనలు అట్టేపెట్టి తుపాకులు పట్టండని ఆజ్ఞాపించాడు హావలకు. ఉభయపక్షాలా కాల్పులు ఆరంభమయాయి. విప్లవసైన్యం ఉత్సాహంతోనూ వీరత్వంతోనూ పోరాడుతూ ముందుకి ఉరికింది. ఐతే ఇంగ్లీషువాళ్లదగ్గిర మూడువందలగజాల దూరంవెళ్లే రయిఫిలుతుపాకులూ, ఫిరంగులూ వున్నాయి. విప్లవకారులుకి ఫిరంగు లేమో వున్నాయి. కాని వందగజాలకిమించివెళ్లే తుపాకులుమాత్రం లేవు. ఇంగ్లీషుసేన సముద్రంలా వుంది. దాంతోపోలిస్తే విప్లవసేన ఎంతో తక్కువ. ఈ కారణాలవల్ల ఇంగ్లీషురాణుసముందు విప్లవసైన్యం నిలవడం కష్టమయింది యుద్ధం ఆరంభమైన కొద్దిసేపట్లోనే విప్లవసేనలో రెండువందల యాభైమంది వీరస్వర్గం చూరగొన్నారు. దాంతో నానాసాహెబుపటాలం ఫిరంగులూ అవీ వొదిలేసి వెనకకి వచ్చేసింది. ఇంగ్లీషుసేన వెంటాడడం మానేసి బేలిందానించి తిన్నగా ఫతేపురం ప్రవేశించింది.

ఫతేపురంలో కొద్దిదినాలకిందటే హుకీమతుల్లా నాయకత్వంకింద విప్లవంజరిగింది. జూను తొమ్మిదిని అలహాబాదునించీ, కాన్పూరునించీ సిపాయిలువచ్చారు. ప్రజలూవాళ్లూకలిసి జైలు పగలగొట్టారు. ఖైదీలని విడిపించేశారు. ట్రెజరీ దోచుకున్నారు. కచేరీలు తగలబెట్టారు. విప్లవంలేచిందనగానే ఇంగ్లీషువాళ్లు అలహాబాదు పారిపోయారు. రావడ్డు టుకరు అని ఒక ఆఫీసరుమాత్రం కొంతఫౌజువేసుకుని విప్లవకారుల మీదికి తిరగబడ్డాడు. సిపాయిలతన్ని చంపేశారు. అయిదువారాల వరకూ ఫతేపురంలో దోపుల్లూ అవీ జరిగాయి. దుకాణాలు మూసేశారు. పట్నం దీందీం అనిపోయింది. పారిపోయిన ఇంగ్లీషువాళ్లలో ఫతేపురం మేజస్ట్రీటు పేరరు ఒకడు. అతడు తిరిగీ ఇప్పుడు జనరలు హావలకుతో ఫతేపురంవచ్చాడు. ఇతడిలాగే మరికొందరున్నా వచ్చారు. వీళ్లంతా కొత్తగావచ్చి హావలకుసేనకి పథప్రదర్శకులుగా పనిచేశారు. హావలకుసేన దారికడ్డాకూచేసిన దారుణాలు పేరరు ఇలా వర్ణించాడు. "మాదారిలో ఎదురయిన ప్రతీగ్రామమూ ధ్వంసంచేశాం. నిప్పు పెట్టేశాం. ఏప్రాణ్లోనూ పిట్టమనిషి అవుపించలేదు. ఇళ్లన్నీ, పాకలకీ బదులు బూడిదకుప్పలు మాత్రం కనపడుతూవుండేవి. గాలి వీచిసప్పుడల్లా చెట్లమీద వేలాడుతూవున్న శవాలదుర్గంధం దుర్భరంగా వుండేది. భయానకమైన ఈ విధ్వంశం ఈ మానవసంహారం చూసినవాడు బతికి ఉన్నంతకాలం మరిచిపోడు."

కనపడ్డ ఒక్కమనిషినీ వొదిలిపెట్టలేదు వాళ్లు. ఎంతమందిని వురితీసిందీ, ఎంతమందిని కాల్చేసిందీ లెక్కపెట్టినవాడు లేడు.

ఫతేపురం ప్రవేశించగానే హావలకు తనసైనికుల్ని పట్నం దోచుకోమన్నాడు. ఎక్కడా ఏమీ మిగలకండా పట్నం కొల్లగొట్టారు సోల్జర్లు. దోపుడు ముగిశాక, అగ్గిముట్టించారు. ఈదహనక్రియ సిక్కులు

చేశారు. పట్నం యావత్తూ బూడిదకుప్పగా కూలిపోయింది. ప్రజలు నిండుప్రాణాలతో కాలిపోయారు.

ఘతేగడవిధ్వంసం కాన్పూరుచేరింది. నానాసాహెబు తనతమ్ముడు బాలాసాహెబు నాయకత్వంకింద కొంతసేన పంపాడు. అతడు బయలుదేరి కాన్పూరుకి ఇరవైమైళ్ళదూరంలో బొంగుదగ్గర డేరావేశాడు. ఈవార్త వినడమేతడువు హావలకు బాలాసాహెబుమీదికి సైన్యం నడుపుకుంటూ వచ్చాడు. జూలై పదిహేను ఉదయం తొమ్మిదిగంటలకి ఉభయసేనలూ ఢీకొన్నాయి. భయంకరమైన పోరు జరిగింది.

పాండునదిదగ్గర బాలాసాహెబు ఫిరంగులు సిద్ధంగానే వుండేవి. అయితే అవి ఇంగ్లీషువాళ్ళమీద గుళ్లుకురిపించేసమయానికి చెడిపోయాయి. దాంతో హావలకుసేన ముందుకిసాగడానికి అవకాశ మేర్పడింది. ఈయుద్ధంలో మేజరురీనాడు గాయపడ్డాడు. దాంతోనే అతడు మరణించాడు. బాలాసాహెబు బుజంమీద గట్టి గుండు దెబ్బతగిలింది. అతడు రణరంగంనించి వచ్చెయ్యవలసివచ్చింది. సిపాయిలు అమీతుమీ అంటూ వీరత్వంతో పోరాడారు. బాలాసాహెబు గాయపడి వచ్చెయ్యడంతోనే చెల్లాచెదురయి, వెనకికి వచ్చేశారు.

ఈసారి నానాసాహెబు స్వయంగా బయలుదేరడానికి సిద్ధపడ్డాడు. ఇంతలో కాన్పురం నిర్బంధంలోవున్న దొరసానులు అలహాబాదు ఇంగ్లీషువాళ్ళతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూవున్న రహస్యం బైటపడింది. కొంతమంది దేశద్రోహులు పట్టుబడ్డారు.

దొరసానులు నిర్బంధంలోవున్న భవనాన్ని "బీబీగడం" అనేవాళ్లు. పేరు బీబీగడంఅయినా అందులో కొద్దిగా ఇంగ్లీషు మగపిల్లలుకూడా వుండేవాళ్లు. వాళ్ళుకూడా ఈకుట్రలో వున్నట్లు తేలింది.

జూలై పదిహేను ఉదయం ఇంగ్లీషుమగపిల్లలనీ, ఉత్తరాలు నడిపినవాళ్ళనీ బైటికితెచ్చారు; నానాసాహెబు ఎదట నుంచోపెట్టారు.

ఉత్తరాలు నడిపినవాళ్ళని నరికేశారు. ఇంగ్లీషువాళ్ళని తుపాకులతో కాల్చేశారు. నానాసాహెబు వెళ్ళిపోయాక ప్రజలు శవాలదగ్గిర గుమికూడారు. ఒక్కొక్కశవాన్ని వేలెత్తిచూపుతూ "వీడు మద్రాసు గవర్నరురా", "వీడు బొంబాయి గవర్నరు", "వీడు బెంగాలు గవర్నరు" అంటూ ఎకసెక్కా లాడారు.

ఇదయాక బీబీగడం చీఫ్‌వార్డర్సిసు బీగము కసాయివాళ్ళకి కబురం పింది. సాయంకాలం కత్తులూ కటార్లూ పట్టుకుని వాళ్లు బీబీగడం ప్రవేశించారు. "సంజసంజ పడుతూవుందసగా వాళ్ళు లోపలికి వెళ్ళారు. చీకటిపడిందో లేదో బైటికి వచ్చేశారు. ఈతక్కువసమయంలోనే జైల్లో రక్తప్రవాహం ప్రవహించింది. వాళ్ళు లోపలికి వెళ్ళడమే తడువు, పొడిచేసి వండాయాభైమంది దొరసానుల్నీ చంపేశారు. రక్తం మడుగులు కట్టింది. నరమాంసం ముక్కలు ముక్కలు తేలి ఆడింది. కసాయివాళ్ళు లోపలికి వెళ్ళినప్పుడు నేలమీద నడిచివెళ్లారు. బైటికి వచ్చినప్పుడు రక్తంలో కాళ్ళీడ్చుకుంటూవచ్చారు. మర్నాడు తెల్లవారాక బీబీగడం శవాలు దగ్గిరసావున్న నూతిలో పారేశారు. అంతవరకూ ఆనూతినీళ్ళు మానవులు తాగారు. ఇప్పుడు ఆనూయి మానవరక్తం తాగింది." *

బీబీగడం దొరసానుల హత్యావిషయంలో చరిత్రకారులు అనేకమంది అనేకవిధాల రాశారు. చంపేముందు వాళ్ళని మానభంగం చేశారనీ, వొక్కొక్క అంగమూ ఖండించి చిత్రవధ చేశారనీ వర్ణించారు. అయితే, తరవాత జరిగిన విచారణలో ఈహత్య అసలే జరగలేదనీ, అంతా అభూతకల్పనఅనీ సర్ జాన్ కే, లేయార్డూ, సర్ విలియం రస్సెలూ రాశారు. ఈహత్యలతో నానాసాహెబుకి సంబంధం

* సావర్కరు.

లేదనీ, వొక వేశ్యప్రోత్సాహంవల్ల అదంతా జరిగిపోయిందనీ సర్ జార్జి ఫారెస్టు రాశాడు. సర్ జార్జి కాంఫుబెలు ఇలారాశాడు:

"ఈ ఘోరం గురించి ఇదమిత్థమని చెప్పడం కష్టం. ఒకవేళ ఈ హత్యలు నిజమేఅనికట్టండి, అయితే, ఇలాంటి ఘోరాలకి ఎవరు ముందు దారితీశారు? హావలకు గ్రామాలకి గ్రామాలు, నిండుప్రాణాలతో కూడా కాల్చేసుకువస్తూవుంటే, క్రోధంతో మండిపడ్డజనం ఇలా తెగించారంటే ఆశ్చర్యమేముంది! విచారణ జరిపేక, హత్యచేయండని ఎవరినీ ఎవరూ ఆజ్ఞాపించలేదనే మాకు తెలిసింది."

కలకత్తా చీకటికొట్టుకథలాగేవుంది కాన్పురం బీబీగడం సంహారకథ!

నానాసాహెబు యుద్ధానికి బైలుదేరాడు. అవాళ జూలై పదహారు. ఫిరంగిదళమూ, గుర్రపుసేనా, కాల్బలమూ -- మొత్తం అయిదువేల సైన్యంతో బయలుదేరా డతడు. కాన్పూరికి నాలుగుమైళ్ల దూరంలో అహరవా దగ్గిర నానాసాహేబుసైన్యం విడిసింది.

అహరవా అన్నివిధాలా అనువయిన ప్రదేశం. అక్కడినుంచి వొక దారి కాన్పూరం సేనాశిబిరం తట్టూ రెండోది ఢిల్లీకి వెళుతుంది. ఒక పక్కవూరూ, రెండోదిక్కు మామిడి తోటా వున్నాయి. మామిడి తోటలో నానాసాహెబుశిరంగులు స్థాపించాడు. రెండుదార్ల మొగనీ కాల్బలం నిలబెట్టాడు. కాల్బలం వెనక గుర్రపుసేనా, రక్షణపంక్తి నుంచో బెట్టాడు.

ఈవార్త అందడంతోనే హావలకు సేనాని సైన్యంనడిపించుకు బయలు దేరాడు. పదాతులుగు మైళ్లు అతి జాగ్రత్తగా పగలూ రాత్రీ నడిపించుకు వచ్చాడు. దూరం నించీ విప్లవసేన వస్తూండడం అనుకున్న దానికంటె, అధికంగా వుం దది. అందుకని అత డొక వ్యూహం పన్నాడు. తనసేన చిన్న చిన్న జట్లుకింద మార్చాడు. అన్నిజట్లూ వొక్కసారే అన్ని దిక్కులనించీ ఆక్రమణ మొదలు

పెట్టమన్నాడు. దూరంనుంచి హావలకు సేనానికి నానాసాహేబు స్పష్టంగా కనిపిస్తూ వుండేవాడు. తెల్ల గుర్రంమీద నానాసాహేబు సేనావార మంతటా నిర్విరామంగా పరిగెడుతూ సైనికుల్ని ప్రోత్సాహపరుస్తూ వుండేవాడు. అతడి ఫిరంగులు అగ్నిగోళాలు వర్షిస్తూవుండేవి.

హావలకు "స్లోమార్చ్" ప్రారంభించాడు. నానాసాహేబు మందుగుండు తగ్గిపోవాలనీ, తన సేన అలసిపోకండా వుండాలనీ అతడి ఎత్తు. అలా వెళ్లవలసినంత ముందుకి వెళ్లి చప్పున హుటాహుటిని ముందుకి పురికించాడు సైన్యం. అలా ఆకస్మికాక్రమణతో విప్లవసేన మీద పడ్డాడతడు. ముందు పంక్తి అలిసిపోయేసరికి దాన్ని వెనకకి తెచ్చేసి వెనక పంక్తి ముందు పెట్టేవాడు. నానాసాహెబుసేన ప్రాణాలమీద ఆశవొదిలేసి పోరాడింది. అయితే ఇంగ్లీషుసేనలాగ ఎత్తులువేయడమూ ముందు పంక్తి అలిసిపోయాక వాళ్లకి సహాయం పంపడమూ – ఇలాంటివేవీ చేసేవాళ్ళు లేకపోయారు. అంచేత వాళ్లకి తిండీ తిప్పలున్నూ లేకపోయాయి. మొదటి పంక్తిపడిపోవడంతోనే వెనకవాళ్ళు జంకేశారు. "విప్లవ సైన్యం సరిగ్గా నడిపించే నాథుడేవుంటే, ఇంగ్లీషు వాళ్ళు ఇండియా కన్నెత్తి చూడలేకపోయేవాళ్ళు." విప్లవ సైనికులు వీరత్వంతో యుద్ధంచేశారు. నానాసాహేబు శాయశక్తులా వాళ్ళని పోత్సాహపరిచాడు. అయితే ఇంగ్లీషువాళ్లని తమ వైపిల్ను రక్షించాయి. విప్లవసేన వోడిపోయింది. నానాసాహేబు గుర్రంమీద గంగ తట్టు వెళ్లి పోయాడు.

హావలకుసేన కాన్పురంమీదికి నడిచింది. బీబీగడంకథ దార్లోనే వాళ్ళకందింది. మరికొంతదూరంవెళ్ళేసరికి కాన్పురంలో పొగలూ, మంటలూ అవుపించాయి. బ్రహ్మాండమైన శబ్దం వినిపించింది, భూకంపంలా నేలంతా గజగజలాడిపోయింది. హావలకు గ్రహించేశాడు – కాన్పురం ఆయుధాగారం విప్లవకారులు అగ్గిముట్టించేశారు.

జూలై పదిహేడున హావలకుసేన కాన్పురం ప్రవేశించింది. అతడు పట్నంలో అడుగుపెట్టేసరికి విప్లవకారుల్లో వొక్కడూ అక్కడలేడు. ప్రజలుమాత్రం భయపడుతూ మిగిలిపోయారు. అయినా హావలకు వూరుకోలేదు. కసితీర్చుకోడానికే కంకణంకట్టుకున్నాడు. పట్నం ప్రవేశించగానే దోపుడుకి ఆజ్ఞ వేశాడు. సోల్జర్లూ ఆఫీసరులూ, సిక్కులూ వొక్కసారి చచ్చినగొడ్డుమీదపడ్డ రాంబందుల్లాగ కాన్పురంమీదపడ్డారు; పట్నం కొల్లగొట్టారు; కంటపడ్డ ప్రతీవ్యక్తినీ విప్లవకారుడేఅని పట్టుకున్నారు; నరికేశారు; కాల్చేశారు; వురి తీసేశారు. ఇరవై నాలుగుగంటలు విడుపూవిరామంలేకండా నరసంహారం సాగించారు. సైనికులూ, ఆఫీసర్లూ, సేనాని హావలకూ మత్తుగా సారాపట్టేసి వొళ్లుకానకండా ఘోరాలుచేశారు. ఇరవైనాలుగు గంటల్లో ఆడామగా, పిల్లాజెల్లా మూడువేలమందిని సంహరించారు. గుంపులుగుంపులు ప్రజలు పట్నంవొదిలి పారిపోయారు.

బీబీగడంలో రక్తంమరకలు కనిపించాయి. అవి దొరసానుల్ని కసాయివాళ్ళు చంపిన రక్తంమరకలని నిశ్చయించారు. పట్నంలోంచి బ్రాహ్మల్ని పట్టుకువచ్చారు. వాళ్ళని చావమోది, ఆ రక్తంమరకలు నాలికలతో నాకించారు. చీపుళ్ళతో తుడిపించారు. అదంతాఅయాక వురితీసేశారు. ఒక ఆఫీసరు ఇలారాశాడు:

"నాకు తెలుసు, ఫరంగీలరక్తం ముడితే, పాకీవాళ్ళచీపురుపడితే అగ్రజాతిహిందువులు జాతిపోయి పతితులవుతారు. అంచేతే వాళ్ళ చేత నేను అలాచేయించాను. మనం వాళ్ళని వురితీసేముందు వాళ్ళ జాతీ మతమూ కాళ్ళతో తొక్కేసే వరకూ మనం పూర్తిగా కసితీర్చుకున్నట్టుకాదు. తాము హిందువులుగా మరణించినట్టు వాళ్ళకి తృప్తి వుండకూడదు, ఇదీ నా సంకల్పము."

ఎక్కడా వినని రాక్షసత్వమిది. సతీచౌరదగ్గిర ఇంగ్లీషువాళ్ళని చంపేముందు వాళ్ళ బైబిలు వాళ్ళని చదువుకోనిచ్చారు సిపాయిలు. మతవిరోధమే పెట్టుకోలేదు వాళ్ళు.

"జనరలు హావలకు సర్ హ్యూ వ్హీలరుహత్యకి ఘోరంగా బదులు తీర్చుకున్నాడు. గుంపులు గుంపులు భారతీయుల్ని వురికంబాలెక్కించాడు. విప్లవకారులు ఎంతోమంది చలించకండా వురికొయ్యలు దగ్గిరికి నడిచారు. నానాసాహెబు మేజస్టీటుగా నియమించిన మహమ్మదీయు డొకాయన తనని విచారణచేసినప్పుడు, అదంతా తనకికాదన్నట్టు నిర్లక్ష్యంగా నుంచున్నాడు. ఉరిచెప్పాకకూడా పిసరంత చలించలేదు. ఉరిదగ్గిరకి ధీమాగా నడుచుకువెళ్ళాడు. తలారులు వురితాళ్లు తీస్తువుంటే శమాపాగాచూస్తూ నుంచున్నాడు. ఒకయోగి సమాధిలోకి ఎలావెళతాడు, అదిగో అలాగ వురితాడులో తల దూర్చాడు."*

ఈహత్యాతాండవం జరిగినంతజరిగాక జూలై పద్దెనిమిదిని మేరు కాన్పూరుమేస్టీటుగా ఏర్పడ్డాడు. కాన్పురం కుంపినీఅమలులోకి వచ్చిందని ప్రకటిస్తూ టమటమూ వేయించాడు. ఇదయాక, నానాసాహెబు బిఠూరుచేరాడని హావలకు విన్నాడు. వెంటనే కొంతసేన బిఠూరుమీదికి పంపాడు. ఈసేనవచ్చేసరికి నానాసాహెబు బిఠూరు వొదిలేశాడు. పదహారున అహవరాయుద్ధంలో పరాజయం కలగడంతోనే అతడు బిఠూరు వచ్చేశాడు. ఆరాత్రిమాత్రం బిఠూరులో గడిపాడు. ఆరాత్రే ముందుచెయ్యవలసిన కార్యక్రమం నిశ్చయించుకున్నాడు. తెలతెలవారేసరికి గంగానదిలో పడవలు సిద్ధంగా వున్నాయి. బాలాసాహెబూ, రావుసాహెబూ, తాంతియాతోపే, రాణివాసం స్త్రీజనమూ, కొంత ధనమూ అదీ పట్టుకుని నానాసాహెబు లక్నోజిల్లా ఫతేపురం వచ్చే

* Charles Ball.

శాడు. ఫతేపురంలో నానాస్నేహితుడు చౌధరీ భోపాలసింగు అతణ్ణి సాదరంగా తనఇంటికి ఆహ్వానించాడు.

హావలకుస్సైనికులు బిఠూరు ముట్టడించారు. వేమ్వాల ప్రాచీనదుర్గం దోచుకున్నారు. బాలాసాహెబు తాలూకు నజరూ, ముత్యాలూ, తాపిన మూడులక్షలరూపాయల చంద్రహాసఖడ్గం సిక్కుసిపాయిల చేతిలోపడింది. ఎంతోఅంత మెడిసాహూనూ అదీ కొల్లగొట్టారు.

జూలై ఇరవైని అలహాబాదునించి నీలుసేనానికూడా కాన్పూరు దిగాడు. కాన్పూరు విధ్వంసం ఏమయినా హానులకు లొదిలేసివుంటే, అది అతగాడు పూర్తిచేశాడు. కాన్పూరుభారం నీలుమీద లొదిలేసి ఇరవై అయిదున హావలకు లక్నో పయనమయ్యాడు. నీలు కాన్పూరులో రాక్షసకృత్యాలు ప్రారంభించాడు. చంపినవాళ్ళనల్లా తెచ్చి, బీబీగడందొరసానుల్ని పడేశారన్నమాతిలో వేసి కప్పించాడు. వాళిమీద లొకసమాధి కట్టించాడు. తాను చేసిన ఘనకార్యాలు తానే చెప్పుకున్నాడు నీలు: "విప్లవంచేసినవాళ్ళని ఘోరంగా, నిష్ఠురంగా శిక్షించడమే నాసంకల్పం. వాళ్ళని జుట్టరిల్లగొట్టేసి మళ్ళీ లేవకండా చేసెయ్యడమే నాపని. మొగట లొక బాపన సుబేదారుణ్ణి పట్టుకున్నాను. బీబీగడ శుభ్రపరచమన్నాను. వాడు తటపటాయించాడు. బెత్తాలతో అదేబాదడం బాదించాడు. ఆవెనక వెంటనే చెప్పింది చేస్తానంటూ నొప్పుకున్నాడు. వాడిచేత ఆపనిచేయించాడు, వుపతీయించాడు. వాడిశవం ఎదురుగుండా దొడ్డు సక్కా ప్రజలఎదట పడేయించాడు. కాన్పూరులో ఈశిక్షలుమూస్తే, ఈపిశాచంవెనకలతో కలవడానికి ప్రజలు ఎవ్వరూ సాహసించరు."

అజనాలా చీకటికొట్టు

హోలవెలు సృష్టించిన కలకత్తాచీకటికొట్టు అబద్ధమేఅయినా వంద ఏళ్లతరవాత అజనాలోమాత్రం నిజమయిన చీకటికొట్టు అవతరించింది.

అజనాలా పంజాబులోది. అమృతసరంనించి పదహారుమైళ్లదూరంలో వుంది.

మే మాసంలో పంజాబు నేటీవుసిపాయిల ఆయుధాలు లాక్కున్న విషయం వెనకపుటల్లో తెలుసుకున్నాం. నిరాయుధులయిన వాళ్లు యావన్మందీ సిక్కుసిపాయిలకాపలాలోనూ, తెల్లసోల్జర్లనిఘాలోనూ వుండేవాళ్ళు. జూను మాసమంతా అలాగే నడిచిపోయింది. జూలై కూడా వెళ్లిపోయింది. జూలై ముప్ఫయిరాత్రి లాహోరు ఇరువై మూడో పటాలం సిపాయిలు అయిదువందలమంది పటాలంనించి పారిపోయారు. వీళ్లదగ్గర ఆయుధాలు లేవు. ఎవ్వరినీ హానికూడా చెయ్యలేదు వీళ్ళు. నిర్బంధంనించి వెళ్లిపోవడమే వాళ్లసంకల్పం. రావీనది ఎడమగట్టంబడే పడి వాళ్ళు అమృతసరం బయలుదేరారు.

సిపాయిలు అజనాలాకి ఆరుమైళ్లదూరంలో వున్నారు. అజనాలా తహసీలుదారు ప్రాణనాథుడు కొంతమంది సైనికులతోవచ్చి వాళ్ల మీదపడ్డాడు. సిపాయిలు నిరాయుధులు. తిండీ తిప్పలూ లేకండా నలభైమైళ్లునడిచి బాగా అలిసిపోయివున్నారు. హటాత్తుగావచ్చిన ఈ ఆక్రమణ తట్టుకోలేకపోయారు. వందాయాభైమంది సిపాయీలని చంపేసి సిక్కులు నదిలో తోసేశారు. అసలే రావీనది వరదల్లోవుంది. సిపాయిలరక్తంతో మరింత ఎరుపెక్కి పరిగెత్తింది. మిగిలినసిపాయిలు నదిలో వురికేశారు. ఈదుకుంటూపోయి మైలుదూరంలో ఎొక లంక చేరుకున్నారు. కొందరు కకావికలై పారిపోయారు. సిక్కులు వాళ్ల వెంటపడ్డారు.

మధ్యాహ్నమయేసరికి అమృతసరం డిప్యూటీకమీషనరు ఫెడ్రికు కూపరుకి వార్త అందింది. సాయంకాలం నాలుగుగంటలకి ఎన్భైమంది గుర్రపురౌతులు వేసుకుని అతడు పరిగెత్తుకువచ్చాడు. లంకలోవున్న సిపాయిలు అతడికి అడివిబాతుల్లా అవుపించారట!

ముప్ఫయిమంది రాతులు గుర్రాలుదిగారు. రెండు పడవలమీద లంకలోకి బయలుదేరారు. పడవలమీద అరవై తుపాకులు సిపాయిల మీదికి గురిపెట్టారు. ఇరవై నిమిషాల్లో పడవలు లంక చేరాయి. రెల్లు తోనూ, వరదతోనూ లంకంతా నానా ఇదిగా వుంది. సిపాయిలు తడి బట్టలతో చలికి వడికిపోతూ కూచున్నారు. పడవలూ, తుపాకులూ చూసి వాళ్ళు చేతులుజోడించారు. ప్రాణభిక్ష వేడుకుంటూ దీనంగా నుంచున్నారు. వాళ్ళలో నొకనలభై మంది. భయపడి నదిలోకి దూకేశారు. రావీప్రవాహం వాళ్ళని పొట్టలోపెట్టుకు పరిగెత్తింది.

లంకలోని సిపాయిలందరికీ రాతులు బేడీలు తగిలించారు. అంత మందీ కిక్కురుమనకండా లొంగిపోయారు. దఫ దఫాలుగా వాళ్ళని వొడ్డుకి తెచ్చారు. అందరినీకలిపి తాళ్ళతో బంధించారు. అంతమందీ ఈ అరవై మంది రాతులమీదా తిరగబడివుంటే ఎంతో రభస జరిగేది. భయభ్రాంతులయిన సిపాయిలు ఏమాత్రమూ ఎదిరించలేదు. ఒడ్డుకి రాగానే వాళ్ళమెళ్ళోవున్న పూసలూ అవీ రాతులు తెంచిపారేశారు. అందరినీ జట్లు జట్లుగా అజనాలాస్టేషనుకి నడిపించుకుపోయారు. వర్షం జల్లుజల్లుగా కురుస్తూవుంది. దారికడాకూ మోకాలిలోతు నీరూ, బురదా – బాడిబాడిగా వుంది. సిపాయిలు తమ భార్యాబిడ్డల్ని తలుచుకుంటూ, ప్రాణభిక్ష పెట్టమని కూపరుని బతిమాలుకుంటూ నడిచారు. కూపరు పళ్ళుబిగిస్తూవుండేవాడు.

అంతమందినీ అజనాలా చేర్చేసరికి అర్ధరాత్రయింది. అంతకిముందే అక్కడ వురితాళ్ళూ అవీ సిద్ధంచేశారు. అయితే కొద్దిమందినే వురితియ్యడానికి అవి సరిపోతాయి. సిపాయిలు మొత్తం రెండువందల ఎనభై ఇద్దరున్నారు. అందుకని వాళ్లని కాల్చి చంపెయ్యడానికి నిశ్చయించారు. కాల్చడానికి యాభై మంది సిక్కుసిపాయిలని సిద్ధంచేశారు. అయితే అప్పటికే అర్ధరాత్రి దాటింది. వర్షం పడుతూవుంది. అంచేత

ఈహత్యాకాండ మర్నాటికి వాయిదావేశారు. అంతవరకూ సిపాయిలని స్టేషనులో అట్టేపెట్టారు. స్టేషనులో రెండువందల పన్నెండు మందికే స్థలం సరిపోయింది. తక్కిన అర్ధరాత్రి ఆరుగురునీ చిన్న గుమ్మటంలాంటి కొట్టులో కూరారు. అదే అజనాలా చీకటి కొట్టు. ఫెడ్రికు కూపరు కీర్తి.

మర్నాడు ఆగస్టు ఎనిమిది. ముస్లిముల బక్రీదు పండుగ. తెల్లవారింది. స్టేషనుపక్క కూపరు ఆసీనుడయ్యాడు. అతగాడి ఆజ్ఞలు నెరవేర్చడానికి సిబ్బంది చేతులుకట్టుకు నుంచుంది. పదిమంది సిక్కు-సిపాయిలు తుపాకులతో సిద్ధమయ్యారు. వాళ్ళసహాయంకోసం మరి నలభై మంది పక్కనుంచున్నారు. పదేసిమంది నేటివుసిపాయీలని తాళ్లతో కట్టి బైటికి తెచ్చేవాళ్లు. కాల్చిపారేసేవాళ్లు. ఇలా ఎనిమిది వందలమంది నలభై మందిని కాల్చేసరికి ఆ ఘోరం తట్టుకోలేక తుపాకికాలుస్తూనన్న ఎనిమిది సిక్కు సిపాయి మూర్ఛపోయాడు. కొంచెం విశ్రాంతి ఇచ్చి మళ్ళీ కాల్పులు ఆరంభించారు.

ఇలాగెత్తం రెండువందల ముప్ఫయిఏడుగురిని కాల్చిచంపేశారు. ఇంకా నలభై అయిదుగురు రావాలి.

"చిన్నకొట్టులోంచి ఇరవైనాలుగ్గురే బైటికివచ్చారు. తక్కినవాళ్ళు రాకండా వున్నారు" అంటూ కూపరుకి నివేదిక వచ్చింది. కూపరు మండిపడ్డాడు. సిక్కు-సిపాయిలని వెంటపెట్టుకుని ఆకొట్టు దగ్గిరికి వెళ్ళాడు. ద్వారందగ్గిర సిక్కులు తుపాకులు గురిపెట్టారు. కొందరు లోపలకి వెళ్ళారు. లోపల ఏముంది? ఘోరం!

రాత్రి అరవై ఆరుగురినీ ఈచిన్నగదిలో ఎనిమిదివందల ఎనిమిదిని కూరి, తలుపులూ కిటికీలూ బిగించేశారు. గాలిలేదు. ఉక్కా, దాహం. లోపలినించి సిపాయిలు దాహమంటూ అరిచారు. వినేవాళ్లు లేరు. ఉక్కిరి బిక్కిరయి సలభై అయిదుగురూ చచ్చిపోయారు. శవాలు పడి

వున్నాయి. "కలకత్తా చీకటి కొట్టుకి బదిలీ" అంటూ అట్టహాసం చేశాడు కూపరు. అయిపోయింది, రెండువందల ఎనభై ఇద్దరు సిపాయిల ప్రాణాలు పుచ్చుకున్నాడు కూపరు! ఇక శవాల నేంచెయ్యడం అన్న ప్రశ్నవచ్చింది. అజనాలాస్టేషనుకి దగ్గిరిసా యొక లోతయిన నుయ్యివుంది. దాంట్లో ఈశవాలు పడేశారు.

"కాన్పూరులో యొక నుయ్యివుంటే అజనాలో యొకనుయ్యి వుంది" అంటూ సగర్వంగా చెప్పుకున్నాడు కూపరు.

ఇవాళకూడా అజనాలా చీకటికొట్టూ, ఈసహీము శవాలనుయ్యా వున్నాయి. చీకటికొట్టుని "కాల్యాదా బుజ్జు" అంటారు. నుయ్యిని "కాల్యాదా ఖూహా" అంటారు. తాను చేసిన ఘనకార్యం ఫెడ్రికు కూపరు తన The Crisis in the Punjab లో వర్ణించుకున్నాడు. అధికారు లతడికి బహుమతులంపి గౌరవించారు.

అజనాలా హత్యల నుద్దేశించి జాన్ మాక్కిము లాడ్లో ఇలా రాశాడు:

"సుమారు అయిదువందలమంది సాటిమానవులని కసాయివాడిలా వధించాడు కూపరు. ఊపిరాడనివ్వకుండా చంపేశాడు. అయినా అతడు సిగ్గుపడలేదు. పైగా దేవకార్యం చేసినట్లు గొప్పలు చెప్పుకున్నాడు. ఈసరపిశాచిని ద్రోహిని తలుచుకున్నట్లు చేయవలసిన బాధ్యత మానవమాత్రు లందరిమీదా వుంది."*

హా వ ల కు తి రో గ మ న ం

జూలై ఇరవై అయిదున జనరలు హావలకు కాన్పురంనించి బయలు దేరాడు. ఎక్కాఎకిని లక్నో వెళ్ళి రెసిడెన్సీలోని ఇంగ్లీసువాళ్ళని రక్షించాలి. అతడివెంట పదిహేనువందలమంది మెరికల్లాంటి సైనికు

* Thoughts on Policy of the Crown towards India.

లున్నారు. పదమూడు ఫిరంగులున్నాయి. కాన్పూరునించి నల్భై అయిదుమైళ్లు. ఎంతమందంగావెళ్ళినా నాలుగైదుదినాల్లో చేరుకోవచ్చు. ఆధీమాతో బయలుదేరాడు హావలకు. గంగానదిదాటి అయోధ్యరాజ్యంలో అడుగుపెట్టాడు. కథ అడ్డంగా తిరిగింది

అయోధ్యరాజ్యం యావత్తూ విప్లవకారుల చేతిలోవుంది. బేగం హజరతుమహలు రాజ్యమేలుతూవుంది. రాజ్యంలో ప్రతీపల్లెమీదా ఆకుపచ్చజెండా ఎగురుతూవుంది. హావలకు వస్తున్నాడన్న వార్త అంచీలమీద అయోధ్యవిప్లవకారుల కందింది. అయోధ్యలో ఆబాల గోపాలమూ, జమీందారునించి కూలీవరకూ అందరూ విప్లవకారులే. అందరూ స్వతంత్ర్యసైనికులే. ప్రతీఅడుగునేలా విప్లవపరిపూతమే. ఈ అగ్నిగుండం ఈదుకుంటూ వెళ్ళడమంటే హావలకునేనానికి జీవన మరణసమస్య అయింది. వార్త వినడమేతడువు, అయోధ్యలోని జమీందారులు వందలువందలు మందిని వేసుకువచ్చి హావలకు నెదిరించడం మొదలుపెట్టారు.

గంగానదిదాటి హావలకు ఉన్నవ వరకూ తోసుకువచ్చాడు. అక్కడే విప్లవకారులు అన్నిదిక్కులనించీవచ్చి కాశారు. హాసనగంజి, రఫీపురం విప్లవకారులు కొందరు బిఠూరునించి లక్నోవెళ్ళేరోడ్డుమీద కీలకస్థానంలో కాశారు.

ఉన్నవలో సమావేశమయిన విప్లవకారులు ఒకనిర్ణయం చేసుకున్నారు. "ఇంగ్లీషువాళ్ళని ముందు ఎవళ్ళువోడిస్తారో వాళ్ళే మచ్చలేని ఉన్నతవంశంలో పుట్టినవాళ్ళు. పిరికిమందు పుచ్చుకున్నవాళ్లు నీచవంశంలో పుట్టినవాళ్ళన్నమాట." ఈ నిర్ణయంప్రకారం ప్రతీవాళ్ళూ ముందికి పురకడానికి సంసిద్ధులయారు. విప్లవకారుల్లో కన్యాకుబ్జబ్రాహ్మలూ, వైసకాకూరులూ అధికంగా వుండేవాళ్లు. వైసకా

కూరులు క్షత్రియులు. రణశూరులు. వీళ్లుండేప్రదేశం అయోధ్యలో వైసవాడ అంటారు.

అవాళ జూలై ఇరవైతొమ్మిది. హూవలకుసేన ఉన్నవచేరడంతోనే విప్లవకారులు విరుచుకుపడ్డారు. ఘోరమయిన యుద్ధంజరిగింది. ఉభయసేనలూ వెనకకితగ్గేశాయి. భోజనాలకిమాత్రం అవకాశమిచ్చి, మళ్ళీముందుకి బయలుదేరాడు హూవలకు. అలా బశీరతుగంజివరకూ వెళ్ళాడోలేదో, మళ్ళీవిప్లవకారులు విరుచుకుపడ్డారు. మళ్ళీ హోరా హోరి యుద్ధంజరిగింది.

బశీరతుగంజిలో దానాపురం సిపాయిలువచ్చి విప్లవకారులతో కలిశారు. ఉన్నవలోనూ, బశీరతుగంజిలోనూ జరిగిన ఈరెండు యుద్ధాలలో హూవలకుసేన ఆరోవంతు నాశనమయిపోయింది. మర్నాడు బశీరతుగంజినించి హూవలకు వెనకకివచ్చేసి మగడవారలో మకాంవేశాడు. జూలై ముప్ఫయినించి ఆగస్టు నాలుగుదాకా మగడవారలోనే వుండిపోయాడతడు. ఒక్క అడుగయినా ముందుకి వెయ్యలేకపోయాడు.

ఆగస్టు నాలుగున హూవలకు మళ్ళీముందుకి బయలుదేరాడు. బశీరతుగంజిలో మళ్ళీ విప్లవకారు లతణ్ణి చుట్టుముట్టారు. ఉభయసేనలూ దారుణంగా యుద్ధంచేశాయి. హూవలకుసైనికులు మూడువందలమంది వీరగతిపొందారు. వెయ్యీ అయిదువందలతో బయలుదేరిన అతడి రాణువ ఇప్పుడు ఎనిమిదివందలయాభైమాత్రం మిగిలింది. ముందుకి అడుగువెయ్యడానికి మరి హూవలకు సాహసించలేకపోయాడు. మళ్ళీ వెనకకి గంగవొడ్డుకి మగడవార వచ్చేశాడు. విప్లవవీరులు బశీరతుగంజిలో డేరా వేశారు.

ఆగస్టు పదకుండున హూవలకుసేనాని మళ్ళీ మొండికెత్తాడు; బశీరుగంజి బయలుదేరాడు. ఏమయినాసరే, ముందుకి, చీల్చుకుపోవాలనే అతడి దృఢసంకల్పం. అలా అతడు బశీరతుగంజిలో అడుగుపెట్టాడో

లేదో, విప్లవసేన అతడిమీద పురికింది. చిన్నకుర్రాళ్ళుకూడా మారో ఫరంగీకో అంటే మారోఫరంగీకోఅంటూ కేకలువేశారు. ప్రతీవిప్లవకారుడూ నరసింహావతారమెత్తాడు. భయంకరమయిన పోరాటం జరిగింది. రక్తం మడుగులు కట్టింది. ప్రాణాలు అరిచేతిలోపెట్టుకుని హావలకుసేనాని మళ్ళీ వెనకకి వచ్చేశాడు; మగడవారలో మకాం వేశాడు. విప్లవకారులు బశీరతుగంజిలో డేరావేశారు.

హావలకు లక్నో బయలుదేరాడన్న వార్త ఫతేగడంలో నానా సాహెబు విన్నాడు. ఈ అవకాశంతీసుకుని కాన్పురం ముట్టడించడాని కతడు సన్నాహాలుచేశాడు. అటు హావలకు గంగదాటివెళ్ళాడు. ఇటు నానాసాహెబు గంగదాటివచ్చాడు. గ్వాలియరూ, సాగరూ మొదలయినచోట్లనించి ఎంతోసైన్య మతడిదగ్గిరికి వచ్చింది. బిఠూరు వచ్చి, అతడు కాన్పురంముట్టడికి బయలుదేరాడు.

జనరలు నీలు కాన్పురంలో వున్నాడు. నానాసాహెబుని తట్టుకోగలిగినసేన అతడిదగ్గిరలే దిప్పుడు. నానాసాహెబు వస్తున్నాడనగానే అడలుపుట్టిం దతడికి. అందుకని హావలకుదగ్గిరికి మగడవార మనుషులు పరిగెత్తించా డతడు. అప్పటికే ముందుకివెళ్ళడమూ, వెనకకి వచ్చెయ్యడమూ అని తటపటాయిస్తున్నాడు హావలకు. నీలుసేనాని కబురు వినడమే తడువు. ఆగస్టుపన్నెండున గంగానదిదాటి కాన్పూరు వచ్చేశాడు.

హావలకుతిరోగమనంతో అయోధ్యవిప్లవకారులు జయ జయధ్వానాలుచేశారు. ఉన్నవచుట్టుపట్ల హడహా, అచలగంజి, బేథరు, పడరీ, సతాన, సికందరపూరు, కొట్టావాగధం, ఖకౌలీ, బైదరా, వరబూగధవా, దరియాబాదు, ఆలీపురం, డౌండియాఖేరా మొదలయిన గ్రామాల్లో విజయోత్సవాలు చేశారు.

"అయోధ్యనించి ఇంగ్లీషుసేన వెనకకివచ్చెయ్యడంవల్ల కలిగిన పరిణామం హావలకు ఊహించనైనా ఊహించివుండడు. 'ఇంగ్లీషువాళ్ళు

అయోధ్య వొదిలేసుకున్నారు' అంటూ అయోధ్య తాలూకాదార్లు అర్థంచేసుకున్నారు." *

బహదూరుషాని బంధించారు

ఆగస్టుమాసంలో ఢిల్లీపరిస్థితి అటూఇటూ అని తునకాలుముల్లులా వుంది. వివిధప్రాంతాలనించి వచ్చిన సిపాయిలు యమ్భై వేలవరకూ పెరిగారు. వీళ్ళంతా ప్రాణాలమీద ఆశవొదిలిపెట్టి దేశంకోసం పోరాడడానికే వచ్చారు. అయితే, ఇన్నిప్రాంతాలనించీ వచ్చిన ఇంతమందినీ వొక్కతాటిమీద నడిపించగల మహానాయకుడుమాత్రం ఢిల్లీలో లేకపోయాడు. పాదుషా బహదూరుషా వయస్సు మళ్ళినవాడు. యుద్ధాలూ అవీ నడిపించగల అనుభవంలేనివాడు. అందుకనే సర్వాధికారాలూ బఖ్తఖానుచేతిలోపెట్టాడు. బఖ్తఖాను మంచినేనానే, సందేహంలేదు. అయినా ఇన్నిరకాల ఇంతసైన్యం అదుపులోపెట్టలేకపోతూ డతడు. దీని చివరి పరిణామం పాదుషాకి స్పష్టంగా గోచరిస్తూనే వుండేది. పురప్రముఖులు ముగ్గురినీ, సిపాయిల నాయకులు ముగ్గురినీకలిపి, ఆరుగురితో వొక సమరసంఘం స్థాపించాడతడు. దానివల్లా ప్రయోజనం లేకపోయింది. "వచ్చి నాయకత్వం వహించండి. మీలో అందరూ ఎవరిని ఎంచుకుంటే వాళ్ళకి అప్పగించి నాసార్వభౌమాధికారం నేను వొదులుకుంటాను. దేశంనించి విదేశీయులు వొదిలిపోతేచాలు" అంటూ స్వయంగా జయపురమూ, జోధపురమూ, ఆల్వారూ, బికనీరూ మొదలయినరాజులకి ఉత్తరాలు రాశాడు. లాభంలేకపోయింది.

సిపాయిలలో అవిధేయత పెరిగింది. ద్రోహుల కుట్రలకి అవకాశం చిక్కింది. బఖ్తఖానుమీద అపవాదులు బయలుదేరాయి. జిన్నతు మహలుమీదకూడా అభాండాలు లేచాయి. ఆగస్టు పదహేనున వొక

* Inni's—The Sepoy Revolt.

జట్టు మూడువందలమంది సిపాయిలు ఆయుధాలుపడేసి కలకత్తా దర్వాజాలోంచి పట్నంవొదిలి వెళ్ళిపోయారు. ఇదీ అప్పటి పరిస్థితి. అయితే ఇంగ్లీషువాళ్ళమీద దాడిచెయ్యడానికిమాత్రం యాభై వేల రాణువా వొకేదీక్షతో వుండేవాళ్ళు. రోజూ పాదుషా దర్బారు జరిగేది. నాయకులు సమావేశ మయేవాళ్ళు. పురప్రముఖులు పాల్గొనే వాళ్ళు. రోజూ ఇంగ్లీషువాళ్ళ శిబిరంమీద దాడిచేసేవాళ్ళు. వెనకకి తగ్గుతూ వుండేవాళ్ళు.

పట్నంలో సిపాయిలవిషయం ఇలావుండేది. పట్నంబయట ఇంగ్లీషు వాళ్ళస్థితి దినదినగండంగా వుండేది. రోజూ విన్లవనేనమీద పడుతూ వుంటే తట్టుకోడంతోనే వాళ్ళపని సరిపోతూ వుండేది. ప్రాకారం గోడదాటి లోపల ప్రవేశించే శక్తికాని, సాహసంకాని వాళ్ళకి లేకండా పోయింది. సహాయం, సహాయం – పైనించి సహాయంకోసం చాతకాల్లా చూస్తూవుండేవాళ్ళు వాళ్ళు. రైళ్ళు లేవు. తపాలు లేవు. కొలిగ్రాంలు లేవు కలకత్తానించి కబురూకాకరకాయా లేదు. ఎక్కడ ఏం జరుగుతూవుందో తెలియదు. అలహాబాదు, కాన్పూరు, లక్నో, కాశీ – ఎక్కడఎలావుందో వార్తలులేవు. కాన్పూరులో ప్లీలరు హత మైపోయిన నెలనాళ్ళకికూడా అతడు తమసహాయానికి వస్తాడనే అనుకుంటూవుండేవాళ్ళు వాళ్ళు.

అనేకసార్లు ఢిల్లీముట్టడి వొదులుకోవాలనుకున్నాడు విల్సను. కాని ఇంతలో పంజాబునించి సర్ జాను లారెన్సు జనరలు నికల్సను నాయకత్వంకింద రెండువేలఫౌజు సహాయం పంపాడు. ఈ ఫౌజులో ఇంగ్లీషువాళ్ళూ, సిక్కులూ, ఘూర్ఖాలూ, పంజాబీలూ వున్నారు. నికల్సను వచ్చాడనగానే ఢిల్లీ ఇంగ్లీషుశిబిరంలో కొత్తఉత్సాహమూ, కొత్తఆశా మొలకలెత్తాయి.

ఈసారి ఇంగ్లీషు సైన్యంసంఖ్య పదకుండువేలకి పెరిగింది. ఇందులో మూడువేల అయిదువందలమంది మాత్రం ఇంగ్లీషు సోల్జర్లు అయిదువేలమంది సిక్కులూ, పంజాబీలూ మొదలైనవాళ్ళు. రెండు వేల అయిదువందలమంది కాశ్మీరీలు. వీళ్ళుకాక ఝిందుమహారాజు కూడా స్వయంగా కొన్నివందల సైన్యంతో వుండేవాడు.

తనసేనలోని దుష్టశక్తులు బఖ్తఖాను పరికించాడు. యావన్మందినీ సమావేశపరిచాడు. యుద్ధమా పలాయనమా? ఏదో ఒకటి నిర్ణయించండంటూ గర్జించాడు. "యుద్ధం – యుద్ధం – యుద్ధ" మంటూ వేనవేలు కంఠాలు ఒక్కసారి పురిమాయి.

అవాళ ఆగస్టు ఇరవై అయిదు పెద్దసైన్యంతో బఖ్తఖాను పట్నం నుంచి బయలుదేరాడు. ఇంగ్లీషు శిబిరం ముట్టడించాడు. ఈసైన్యంలో బరేలీ, నీమచి పటాలాలు ముఖ్యమైనవి. అయితే ఈరెంటికీ పరస్పరం పడేదికాదు. అందుకని అంతవరకూ కలిసి వెళ్లిన ఈపటాలాలు బైట నజఫ్‌గడం చేరడంతోనే నీమచి పటాలం వేరయిపోయింది. బఖ్తఖాను మాట వినకండా విడిగా మరోచోట దండువిడిసింది. దాంతో తక్కిన పటాలాలనుంచి అది ఒంటరి అయిపోయింది. జనరలు నికల్సను ఇది కనిపెట్టాడు. చప్పునవచ్చి నీమచి సిపాయిలమీద పడ్డాడు. ఉభయ సేనలకీ హోరాహోరి పోరాటం జరిగింది. నీమచి సిపాయిలు సాటి లేని పరాక్రమంతో పోరాడారు. తమ చివరిరక్తబిందువుకూడా దేశం కోసం సమర్పించారు. చివరికి ఒక్కడూ మిగలకండా వీరశయనం పొందారు. వాళ్ళ వీరత్వానికి శత్రువులే ముక్కుమీద వేలుపెట్టుకున్నారు. ఇంగ్లీషువాళ్లు గెలిచారు. ఇన్నాళ్ళకి ఢిల్లీ ముట్టడిలో ఇదే వాళ్ళ తొలిగెలుపు. మిగిలినసేన తీసుకుని బఖ్తఖాను వెనకకి వచ్చేశాడు. భారతీయుల అనైకమత్యమే ఇంగ్లీషు వాళ్లకి ఇక్కడ వండేళ్లు

క్రితం రాజ్యం కుదిర్చిపెట్టింది. ఇవాళ ఢిల్లీ యుద్ధంలో ఈ అనైక మత్యమే వాళ్ళకి విజయంచేకూర్చింది.

అవాళటి గెలుపుతో ఇంగ్లీషు వాళ్లలో అంతవరకూలేని ధైర్యో త్సాహాలు మిన్ను ముట్టాయి. పట్నంలో ప్రవేశించే ప్రయత్నాలు మొదలుపెట్టారు వాళ్ళు. సామ, దాన, భేద, దండోపాయాలు నాలుగూ ప్రయోగించారు. వేగులశాఖ ఆఫీసరు మేజరు హడ్సను పట్నంలో అనేకమంది దేశద్రోహుల్ని తయారుచేశాడు. అందులో బహదూరుషా వియ్యంకుడు మీర్జా ఇలాహిబక్సు ముఖ్యుడు. ఇతడు బహదూరుషాని సీడలా అంటిపెట్టుకు వుండేవాడు. లోగుట్టులన్నీ ఎలాగో వొకలాగ హడ్సనుకి చేరవేసేవాడు.

ఆగస్టునెల గడిచి పోయింది. ప్రతీ దినమూ దివానీ ఆమ్‌లో దర్బారు జరుగుతూవుండేది. ఇక్కడ జరిగిన చర్చలు యావత్తూ ఇంగ్లీషు వాళ్ళకి అందుతూ వుండేవి. సెప్టెంబరు రెండోవారమంతా ఇంగ్లీషు వాళ్ళు పట్నంలో ప్రవేశించడానికి ప్రయత్నంచేశారు. రోజూ దాడి చేసేవాళ్ళు. ఎంతోమంది సైనికులు హతులై పోయేవాళ్ళు. తిరిగి వెన కకి వెళ్లిపోయేవాళ్లు. అయితే ఈలోగా వాళ్ళ స్థిరంగులవల్ల పట్నం ప్రాకారంగోడ బాగా దెబ్బ తినేసింది.

పద్నాలుగు ఉదయం సర్వసేనాని విల్సను తనసైన్యం అయిదు భాగాలకింద విభాగించాడు. ఈఅయిదింటికీ సరసగా జనరలు నికల్సను, కర్నలు కాంబెలు, బ్రిగేడియరు జేమ్సు, మేజరు రీడు, బ్రిగేడియరు లాంగు షీల్డులు అధిపత్యం వహించారు. మొదటి మూడుభాగాలసేనా నడిపించుకుని జనరలు నికల్సను కాశ్మీరుదర్వాజాదిక్కు నడిచాడు. నాలుగోభాగం తీసుకుని మేజరురీడు కాబూలు దర్వాజామీదికి బయలుదేరాడు.

సూర్యోదయమవుతూ వుండగా నికల్సను కాశ్మీరుదర్వాజామీద దాడి ప్రారంభించాడు. లోపలినించి సిపాయిల ఫిరంగులు గర్జించాయి. అగ్నివర్ష ం కురిపించాయి. దర్వాజాఎదట సిక్కులూ, ఇంగ్లీషువాళ్లూ ముందువరస కూలిపోయారు. నికల్సను ఆగలేదు. శవాలమీంచి, తొక్కుకుంటూ ప్రాకారందగ్గిరికి పటాలంతో వచ్చేశాడు. అప్పటికే ప్రాకారం దెబ్బతినివుంది. సరిగ్గా అక్కడే నికల్సను నిచ్చెన తగిలించాడు. శత్రువులగుళ్లమధ్య నిచ్చెనమీంచి మీది కెక్కేశాడు. విజయతూర్యం ప్రమోగించాడు. అలాగే ముందుకూలిపోతూవున్న వాళ్లని తొక్కేసుకుంటూ రెండోభాగం పటాలం మరోపక్కనించి పట్నం లోకి దూసుకుపోయింది. మూడోభాగం సరాసరిగా కాశ్మీరుదర్వాజా మీదికి నడిచింది. దర్వాజాఎదట ఎత్తుడు వంతెన విరిగిపోయింది. ఒక్కపలకమాత్రం మిగిలింది. దర్వాజాలోంచి విడుపూ విరామం లేకండా గుళ్లమీదగుళ్లుకురుస్తున్నాయి. ముందుకి అడుగువేసిన ఇంగ్లీషు సైనికుడల్లా కూలిపోతున్నాడు. ఆ మారణహోమంలోంచి ఎలాగో వెళ్లి దర్వాజాకింద మందుగుండు పెట్టేశారు ఇంగ్లీషువాళ్లు. వచ్చేప్రాణం పోయేప్రాణంతో వంతెనపలకమీంచి పరిగెత్తాడు కెప్టెను బర్లేసు. మందుగుండుకి నిప్పంటించేశాడు. ఒక్కసారి భయంకరమైన శబ్దమయింది. కాశ్మీరుదర్వాజా వొకభాగం కూలిపోయింది. "లోపలికి నడవండి" – కాంబెలు తన పటాలానికి ఆజ్ఞవేశాడు. గుళ్లవర్షంలో చొచ్చుకుని అతడిసేన ముందుకినడిచింది. కాశ్మీరు దర్వాజాలోంచి పట్నంలో ప్రవేశించింది.

అటు కాబూలుదర్వాజామీదికి బయలుదేరిన మేజరురీడు సబ్జీ మండీ చేరేసరికి విప్లవకారులు ఎదిరించారు. తుములమయిన సంకుల సమరం జరిగింది. మేజరురీడు గాయపడ్డాడు; పడిపోయాడు. అతడి పటాలం వెనకంజవేసింది. ఇంతలో హోప్‌గ్రాంటు గుర్రపుదళంతో

ముందుకివురికాడు. వెనకంజవేసిన రీడుపటాలం దిగజారినగుండె దిటవు చేసుకుంది; ముందుకిసాగింది. మళ్లీ ఘోరమయినయుద్ధం జరిగింది. రక్తనదులు ప్రవహించాయి. ఇంగ్లీషుపటాలంఓడిపోయింది. చావగా మిగిలినసేన వెనకకి దౌడుతీసింది.

నికల్సను, కాంబెలు, జోన్సులు కాశ్మీరుదర్వాజాలోంచి లోపల ప్రవేశించారు; పట్నంమీద దాడిప్రారంభించారు. విప్లవకారులు భయంకరంగా ఎదిరించారు. ప్రతీ అంగుళంనేలకోసమూ పోట్లాడారు. ఒకొక్క అడుగూ గెల్చుకుంటూ ఇంగ్లీషువాళ్లు ముందుకి పాకారు. వాళ్ళు గెలుపుసాధించిన ప్రతీ ఇంటిమీదా, ప్రతీభవనంమీదా యూనియనుజాకు ప్రతిష్ఠించారు. యూనియనుజాకు ఎగరవేసిన ప్రతీఇంటి ముందూ గుండెలుజలదరించిన యుద్ధంజరిగింది. రక్తం వరదలుకట్టింది. శవాలు కుప్పలుపడ్డాయి. ఇలా పోరాడుతూ పోరాడుతూ ఇంగ్లీషుసేన కాబూలుదర్వాజాదిక్కు సాగింది. బక్కబురుజు దగ్గిరికి వచ్చేసరికి, అక్కడ వొకగల్లీలోకి మళ్ళవలిసి వచ్చింది. గల్లీ రెండు గజాలువందల మాత్ర ముంది.

గల్లీలో ఇంగ్లీషుసేన అడుగుపెట్టిందో లేదో, విప్లవకారులు భయంకరంగా అడ్డగించారు. గల్లీ రెండువరసలా ఇళ్ళల్లోంచి, ఇంటికప్పుల మీంచి, కిటికీలలోంచి, అరుగులమీంచి జడివానలా గుళ్ళవర్షం కురిపించారు. గల్లీగల్లీయావత్తూ రక్తప్రవాహం నదిలాప్రవహించింది. ఆరక్తనదిలో శవాలు తేలియాడాయి. బీభత్సం తాండవించింది. ఇంత ఇంగ్లీషుసేనా వెనకకితగ్గవలిసేవచ్చింది. ముందడుగువెయ్యలేకపోయింది. ఇంతలో ఇంగ్లీషువీరుడు నికల్సను ఘోరమయిన సాహసంచేశాడు; ముందుకి పరిగెత్తాడు; కాని నిభాయించుకోలేకపోయాడు; వెనకకి వచ్చేశాడు. అతడు వెనకకి వచ్చెయ్యడంతోనే మేజరు జాకబు ముందుకి వురికాడు. ఉరికాడో లేదో, దెబ్బతినేశాడు; పడిపోయాడు.

జాకబుపడిపోవడంచూసి నికల్సను మళ్ళీ ముందుకి పరిగెత్తాడు; దెబ్బ తినేశాడు; కింద దొర్లిపోయాడు. మరిఇంగ్లీషుసేన ముందుకి వొక్క-అంగుళమయినా వెళ్ళలేకపోయింది. గల్లీలోనూ నిలవలేకపోయింది. వెనకంజవేసి, కాశ్మీరుదర్వాజాదగ్గిరికి వచ్చేసింది. నికల్సను ఆస్పత్రిలో ఇరవైమూడున ప్రాణంవొదిలేశాడు.

నికల్సను బర్నబురుజుతట్టు మళ్ళినప్పుడే కర్నలుకాంబెలు కొంత పటాలంతో జూమేమశీదుకేసి నడిచాడు. ఇంగ్లీషువాళ్లు డైనమోపెట్టి జూమేమశీదుధ్వంసంచేసేస్తారని తెలిసి అప్పటికే మశీదులో కొన్ని వేల మంది మహమ్మదీయులు సమావేశమైవున్నారు. ఏమయినాసరే, మశీదు రక్షించడమే వాళ్ళసంకల్పం. అయితే వాళ్ళదగ్గిర తుపాకులూ, ఫిరంగులూ లేవు. ప్రతీవాళ్ళచేతిలోనూ కత్తులుమాత్రం తళతళలాడుతున్నాయి. కాంబెలుసైన్యం దగ్గిరపడగానే వాళ్ళుయావన్మందీ కత్తులు దూసి బైటికివచ్చేశారు. వొరలుతీసి పారేశారు. వాళ్ళనిచూడగానే ఇంగ్లీషువాళ్ళు తుపాకులుకాల్చారు. రెండువందలమంది మహమ్మదీయులశవాలు మశీదుమెట్లమీంచి కిందికి దొర్లిపోయాయి. తక్కినవాళ్లు మెరుపులా ముందుకి వురికారు. తుపాకులు మళ్ళీ సర్దుకునేలోపునే ఇంగ్లీషువాళ్ళమీద పడ్డారు. తుపాకులుపడేసి వాళ్ళున్నూ కత్తులు దూశారు. ఖణేలుమంటే ఖణేలుమన్నాయి కత్తులు. దారుణమయిన సంకులసమరంజరిగింది. రక్తం మడుగులుకట్టింది. కాంబెలు గాయపడ్డాడు. ఇంగ్లీషుసేన తట్టుకోలేకపోయింది. పలాయనం చిత్తగించింది. కాశ్మీరుదర్వాజాదగ్గిరికి వచ్చేసింది. "నిజంగా నాదగ్గిర డైనమోట్లేవుంటే జూమేమశీదు తప్పకండా ఎగరగొట్టేద్దును" – ఆస్పత్రిచేరుకుంటూ అన్నాడు కాంబెలు.

ఇంగ్లీషువాళ్లు ఢిల్లీపట్నంప్రవేశించిన మొదటిరోజుయుద్ధం పద్నాలుగున అలా అంతమయింది. విప్లవకారులు ఢిల్లీ ఆక్రమించిననాటి

నించీ ఈనాలుగుమాసాలలోనూ ఇంతఘోరమయినయుద్ధం జరగలేదు. ఇరుపక్షాలానష్టం హెచ్చుగానే జరిగింది. ఇంగ్లీషుసేనలో అరవై ఆరుగురు ఆఫీసరులూ, పదకుండువందల నలుగురు సైనికులూ చచ్చి పోయారు. ముగ్గురుసేనానాయకులు గాయపడ్డారు. విప్లవకారుల్లో సుమారు పదిహేనువందలమంది వీరగతి పొందారు.

అవాళనించీ పద్దెనిమిదివరకూ ప్రతీదినం ఇంగ్లీషువాళ్ళు పట్నం మీద దాడిచెయ్యడం ప్రారంభించారు. మెల్లిమెల్లిగా గెలుపు సాధిస్తూవుండేవాళ్ళు: విప్లవకారులు వీరత్వంతో పోరాడుతూ వుండే వాళ్లు. అయితే నీమచిపటాలం ఓడిపోయిన దినంనించీ అపజయం మీద అపజయమేవాళ్ళని వరించింది. ఈ పదిదినాల యుద్ధంలోనూ ఇంగ్లీషుసేనలో నాలుగువేలమంది మరణించారు. అయినా పట్నం మూడువంతులు వారి వశమయిపోయింది. ఢిల్లీ రక్షించుకోగలమన్న ఆశ విప్లవకారులకి దూరమయింది. కొంతమంది సిపాయిలు పట్నం నూదిలి వెళ్ళిపోయారు. హెచ్చుమందిమాత్రం చివరివరకూ పోరాడి కాని శత్రువుకి లొంగకూడదని శపథంపట్టారు.

సెప్టెంబరు పందొమ్మిదిరాత్రి మహమ్మదు బఖ్తఖాను బాదుషా బహదూరుషాతో అన్నాడు "జహాఁపనాహ్ ! ఢిల్లీ మనచేతిలోంచి పోయినా పెద్ద పుట్టిమునిగిందేమీలేదు. దేశమంతటా అగ్గి మండుతూ వుంది. అంచేత మీరు లొంగిపోవద్దు. అపజయం అంగీకరించవద్దు. నాతో వచ్చెయ్యండి. సైనికదృష్టితోచూస్తే ఢిల్లీకంటే ముఖ్యమయిన ప్రదేశాలు దేశంలో వున్నాయి. మనకి నచ్చినచోట కేంద్రంపెట్టుకుని మనం యుద్ధంసాగించవచ్చు. చివరికి మనకే విజయం లభిస్తుంది. ఈనమ్మకం నాకుంది."

బఖ్తఖాను చెప్పిందానికి చాలావరకూ బహదూరుషా తల వూపాడు. అయితే ఇలాహిబక్సుమాత్రం అది జరగనివ్వలేదు. బఖ్త

ఖాను వెళ్ళిపోయాక పాదుషాని మెడలువిరిచాడు - "ఈవిప్లవంలో గెలుపురావడం మేషాండభ్రమ. బఖ్తఖానుతో వెళ్ళావంటే కష్టాలు కొని తెచ్చుకోవడమన్నమాట. ఇక్కడే వుండిపో. నేను ప్రమాణంచేసి చెపుతున్నాను. ఇంగ్లీషువాళ్ళతోమాట్లాడి నీకు ప్రాణభయంరాకండా చేస్తాను. నీమీదా నీకుటుంబంమీదా ఈగవాలిందంటే నాదీపూచీ" అన్నాడు.

వియ్యంకుడిమాట బహదూరుషా నమ్మాడు. మర్నాడుఉదయం ఎర్రకోటనించి వెళ్ళిపోయి పట్నంపడమట కొద్దిదూరంలో హుమాయూనుసమాధిమందిరంలో దాగున్నాడు. అవాళే ఇంగ్లీషువాళ్లు కోట మీద దాడిచేశారు. లాహోరుదర్వాజా పడగొట్టారు. నాలుగో పంజాబీపటాలం కోటలోఫలిత్తోరణం కూలదోసింది. దారిలో ఎవాకే ఎక్కడసిపాయి కాపలాకాస్తూ నుంచున్నాడు. అతడు లెఫ్టినెంటు మక్కీనుమీద తుపాకిపేల్చాడు. గుండు తలవెంట్రుకవాసి గురితప్పింది; మక్కీను హెల్మెటు ఎగరేసుకుపోయింది. అటు సలీంగడంతట్టు లెఫ్టినెంటు ఏక్మను కోటలోకి చొచ్చుకువచ్చాడు. అతడికీ దారిలో ఎవాకే ఒక్కసిపాయి కాపలాకాస్తూ ఎదురయాడు. మహలులో కొద్దిమంది విప్లవకారులూ, గాయాలుపడ్డ సిపాయిలూతప్ప ఎవరూ లేరు. వాళ్ళందరినీ అరవయ్యో ఇంగ్లీషురైఫిలుసేనా, కుమావ్రూపటాలమూ కాల్చేసి, కోటలో మకాంవేసింది.

నమ్మకమయిన ఎవాక అనుచరుణ్ణిపంపి పాదుషా హుమాయూను సమాధికి బఖ్తఖానుని పంపించాడు. బఖ్తఖాను మళ్ళీ పాదుషాకి బోధించాడు. సరాసరి తనతో తీసుకుపోడానికే ప్రయత్నించాడు. పాదుషాకూడా బయలు దేరడానికి సిద్ధపడ్డాడు. మించివచ్చిందను కున్నాడు ఇలాహిబక్సు. ఇంగ్లీషువాళ్ళతో లాలోచీ అయి అస్మటికీ సిద్ధంగావున్నా డతడు. పాదుషా ఢిల్లీ ఎవదలకండాచేస్తే నిన్ను

అందల మెక్కిస్తామని అతడికి ఏవేవో ఆశలు పెట్టారు దొరలు. నిజంగా ఇంగ్లీషుప్రభుత్వం ఇండియాలో వున్నంతకాలం ఇలా హీబక్కు వంశంవాళ్లకి సాలీనా పన్నెండువందల రూపాయలు ఇస్తూనే వచ్చారు.

పాదుషా బఖ్తఖానుతో వెళ్ళకండా ఇలాహీబక్కు చివరికి వొక కొత్తఎత్తు ఎత్తాడు–"ఇదిగో, ఈబఖ్తఖాను పఠాను. మనమొగలులకి పఠానులకీ వున్న పూర్వవైరం పురస్కరించుకుని కసితీర్చుకోవాలను కుంటున్నాడితడు. అందుకనే బుట్టలోవేసి పట్టుకోవాలని చూస్తున్నాడు" అంటూ అడ్డుతగిలాడు. బఖ్తఖాను భరించలేకపోయాడు. చర్రున వొరలోంచి కత్తిదూశాడు; ఇలా హీబక్కుమీదికి దూకాడు. ఉత్తరక్షణంలో ఇలా హీబక్కుతల కిందపడుతుంది. కాని చప్పున పాదుషా మధ్యపడి అడ్డుకున్నాడు.

"బఖ్తఖాన్, నువ్వు వీరుడివి. నీమీద నాకు నమ్మక ముంది. అయితే నా శరీరావస్థ చూస్తూనే వున్నావు. నా అదృష్టానికి నన్ను వొదిలెయ్యి. వెళ్ళు. ఏం చెయ్యాలో అదిచేసి చూపించు. నా గురించి విచారించకు. నీకర్తవ్యం నువ్వు పాలించు" అన్నాడు.* మహమ్మదు బఖ్తఖాను మరి మాటాడలేదు. తలవొంచుకుని తూర్పుతట్టుద్వారం నించి బైటికి వెళ్లిపోయాడు. ఆతర్వాత యమున ఇసకతిన్నెలమీద బఖ్తఖాను పటాలముంది. పటాలంతోకూడా అతడు యమున దాటి ఢిల్లీ వొదిలి పెట్టేశాడు. అంతే. మరి అతడి అంతుచిక్కలేదు. విప్లవం తరవాత కూడ అతడి కోసం ఇంగ్లీషువాళ్ళు ఎంతో గాలించారు. కాని అతడు పట్టుపడలేదు. అతడిసేనకూడా దొరకలేదు.

ఢిల్లీ స్వతంత్రసేన సర్వసేనాని మహమ్మదు బఖ్తఖాను వెళ్లిపోవడంతోనే ఢిల్లీ శిరస్సు పడిపోయింది. ఉన్నభయం కాస్తా వూడిపోవడం

* ख्वाजा हसन निजामी — देहली की जाँकनी।

ภาพที่ ๑ ตราประทับรูปสัตว์ ๒ ตัว



పాదుషా బహదూరుషాని బంధించిన హుమాయూన్ సమాధి

తోనే మిర్జా ఇలాహిబక్సు హుమాయూను సమాధి పడమటి ద్వారంనుంచి బైటికి నడిచాడు. ఇంగ్లీషువాళ్ళకి కబురందించాడు – "పాదుషా సకుటుంబంగా హుమయూను సమాధిలో వున్నాడు. ఇదే సమయం పట్టెయ్యండి." కబురందడమే తడువు, యాభై మంది సైనికులతో కెప్టెను హడ్సను హుమాయూను సమాధిలో ప్రవేశించాడు. బహదూరుషాని బంధించాడు. హడ్సను బంధిస్తూవుంటే పాదుషా ఇలా హిబక్సు కేసి జాలిగా చూస్తూ అన్నాడు – "నువ్వే నన్ను వెళ్లిపోకండా అడ్డుతగిలావు!" – ఇలా హిబక్సు పల్లెత్తిమాటాడలేదు. మిడుతూ మిడుతూ చూస్తూ వూరుకున్నాడు.

బహదూరుషానీ, బేగం జిన్నతుమహాలునీ, శాహజాదాజవాబఖ్తునీ బంధించి పట్టుకువచ్చారు; ఎర్రకోటలో ఖైదుచేశారు. అసలు వున్న పాళాన బహదూరుషాని కాల్చిపారెయ్యాలనే హడ్సను భావించాడు. జనరలు విల్సనుకూడా అదే అభిప్రాయపడ్డాడు. కాని ఇతర ఆఫీసర్లు అంగీకరించలేదు. విచారణ జరపడంకోసం నిర్బంధంలో అట్టేపెట్టారు.

"బహదూరుషాని బంధించి పట్టుకుపోయాక, హుమాయూను సమాధిభవనంలో పాదుషాకుమార్ళిద్దరు, మిర్జా అఖిజరూ, సుల్తానూ, వొక మనవడు అబూబకరూ ఎలాగో వుండిపోయారు. అది కనిపెట్టి మిర్జా ఇలాహిబక్సూ, మున్షీ రజాబుఆలీ పరిగెత్తుకు వచ్చారు. పాదుషాకుమార్ళు ఇంకా సమాధిమందిరంలో వుండిపోయారు." అంటూ హడ్సనుచెవిలో వూదారు. హడ్సను వెనకకి పరిగెత్తాడు. ఇలాహిబక్సు శాహజాదాల గుర్తుపట్టిచ్చాడు. మిత్రప్రాణాలకేమీ భయంలేదంటూ దిలాసాఇచ్చాడు. ముగ్గురినీ హడ్సను నిర్బంధించాడు. ఒక బండిమీద ఎక్కించి పట్నంలోకి నడిపించుకు

వెళ్ళాడు. వెంట ఇలాహిబక్సూ, అతడి అనుచరులిద్దరూ కూడా బయలుదేరారు. బండీ పట్నంచేరిందోలేదో, హడ్సను బండిదగ్గిరి కురికాడు – "దొరసానుల్ని చంపినవాళ్ళకి చావే తగినశిక్ష" అంటూ వురిమాడు. అంటూనే శాహజాదాలని కిందికిఈడ్చేశాడు. వాళ్ళ వొంటిమీదనగలూ అవీ లాక్కున్నాడు. వాళ్ళ దుస్తులునూ వీకేశాడు. పక్కసిపాయిచేతిలోని తుపాకిలాక్కుని ముగ్గురినీ గుండెల మీద కాల్చి చంపేశాడు.

చచ్చి పడివున్న శాహజాదాల ముగ్గురితలకాయలూ హడ్సను తెగగొట్టాడు. బహదూరుషాదగ్గిరికి పట్టుకువచ్చాడు. "కుంపినీ ఇంత వరకూ మీకు ఇవ్వకుండా అట్టేపెట్టిన నజరానా ఇదిగో" అంటూ ఎదటపెట్టాడు. పాపం ముసిలిపాదుషా మొహంతిప్పేసుకుంటూ అన్నాడు – "భగవంతుడికి ధన్యవాదాలు! తైమూరుసంతానం ఉజ్వలమయిన మొహాలతో తండ్రిదగ్గిరికి ఇలాగే వచ్చేవాళ్ళు,"*

తరవాత శాహజాదాల శిరస్సులు ఖూనీదర్వాజాదగ్గిర వేలాడ దీశారు. మొండాలు పోలీసుస్టేషనుదగ్గిర వేలాడగట్టారు. గెద్దలూ, రాంబందులూ వీక్కుతిన్నాక మర్నాడు యమునలో పారేశారు.

శాహజాదాల తలకాయలు పాదుషాదగ్గిరికి తీసుకువెళ్ళేముందు హడ్సను వాళ్ళరక్తంతాగికాని శాంతించలేదట! తలకాయలు నిప్పుకి చూపించి వేడివేడిరక్తంతాగాడట! "వీళ్ళరక్తం తాగకపోతే నేను, పిచ్చెత్తిపోతాను," అంటూ అతడు అరిచాడట!†

---

* "अलहम्दो लिल्लाह! तैमूर की औलाद ऐसे ही सुर्खरू होकर बाप के सामने आया करती थी।" — रब्बाजा हसन निजामी।

† सन '५७ का विप्लव पृ. २१०

ఢిల్లీలో రాక్షసరాజ్యం

ज़हर सहरा होगया — ग़ालीब

"ముట్టడి ముగియగానే మనరాణువచేసిన ఘోరాలు వింటే నిజంగా గుండెలు పగిలిపోతాయి. శత్రువులూ మిత్రులూఅన్న భేదం లేకండా యావన్మందిమీదా తుడుపుపెట్టి పగతీర్చుకున్నారు. దోపిడిలో మనం నాదిర్షాని మించిపోయాం" – ఎలిఫిన్‌స్టను సర్ జాను లారెన్సుకి రాసినమాట లివి.

వందా ముప్పయినాలుగుదినాల పోరాటంతరవాత ఢిల్లీ ఇంగ్లీషువాళ్ళకి చిక్కింది. చిక్కడమేతడువు, అవి దోపుళ్ళుకావు. అవి హత్యలు కావు. అవికాల్పులు కావు – రాక్షసరాజ్యం తాండవమాడింది. అవి తలుచుకుంటేనే గుండెలు జలదరిస్తాయి. ఢిల్లీ ఎన్నోదండయాత్రలు చూసింది. ఎన్నో దారుణాలు, ఎన్నో దోపుళ్ళు ఎన్నో చిత్రవధలు అనుభవించింది. ఆంగ్లేయుల అసురకృత్యాలు అన్నిటినీ మించిపోయాయి. కలకలలాడుతూవున్న ఢిల్లీపట్నం శ్మశానంగా మారిపోయింది.

"ఉదయం మేము లాహోరుదర్వాజాలోంచి చాందినీచౌకువెళ్లాం. నిజంగా మాకళ్ళకి శవాలపట్నమే కనుపించింది. మూగుర్రాల డెక్కలచప్పుడు మినహాయిస్తే మాకుమరోశబ్దం వినపడలేదు. అన్ని దిక్కులా శవాలు కుప్పలుకుప్పలు పడివున్నాయి. అందులో కొన్ని సగంప్రాణంతోవున్నాయి; కొన్నిమూలుగుతున్నాయి. మేము మెల్లి మెల్లిగా మాట్లాడుకుంటూవెళ్ళాము; ఏమో శవాలు తుళ్ళిపడతాయేమోనని మాభయం! ఒకపక్క కొన్నిశవాలు కుక్కలు పీక్కుతింటున్నాయి. మరోపక్క శవాలచుట్టూ రాంబందులు మూగుతున్నాయి; శవాలు చీల్చుకుంటూ మాంసాలు నంజుకుంటున్నాయి. మూగుర్రాల

డెక్కల చప్పుళ్ళకి కొంచెందూరం తొలిగిపోతున్నాయి; మళ్ళీవాలుతున్నాయి. ఆ శవాలని వివరంగా వర్ణించడంమాత్రం కష్టం. కుప్పలు కుప్పలు మానవశవాలు చూస్తూవుంటే మాకు భయంవేసింది. మా గుర్రాలున్నూ భయపడుతూ సకిలించాయి. శవాలు పడి కుళ్ళిపోతున్నాయి. ఢిల్లీపట్నంయావత్తూ దుర్వాసన దుర్భరంగావుంది." – ఒక్కనాటిదృశ్యం వర్ణిస్తూ రాబర్ట్సు రాసినమాట లివి. "సిక్కులూ, తెల్లసిపాయిలూ కలిసి దెబ్బతినిపడిపోయినవొకమనిషిమొహంమీద బై నెట్లతో చెడామడా ఎన్నోపోట్లు పొడిచారు. బతికివుండగానే అతణ్ణి మంటల్లోవేశారు. చూస్తూవుండగానే అతడిమాంసం నల్లగా మాడిపోయింది. మంటల్లో తగలబడి దుర్వాసనకొట్టింది" – లెఫ్టి నెంటు మాజెండీ స్వయంగాచూసి రాసిన వాక్యా లివి. కాలినమనిషి ఎముకలు మైదానంమీద పడివుండడం ఎన్నోదినాలతరవాతకూడా కైమ్సు విలేఖరి రస్సెలు చూశాడు. పట్నం స్వాధీనమయాక, మూడుదినాల వరకూ వేలకిమించిన ఇంగ్లీషుదండు ఫూరుమీదపడి దోచుకుంది. ప్రజల ధనమూ, మానమూ, ప్రాణమూ కొల్లగొట్టింది. చిత్రవధ చేసింది. ఉరికంబా లెక్కించింది. పారిపోగలిగినంతమంది పట్నం వొదిలి పారిపోయారు. వీధివీధి, గల్లీగల్లీ, కొంపకొంపా సోల్జర్లు చొరబడ్డారు. దోచుకోగా మిగిలినవస్తువులు ముక్కలుముక్కలుచేసి, గుండ పిండిచేసి వొదిలిపెట్టారు. పుస్తకాలూ, గిన్నెలూ, ముంతలూ - తుదకి తలుపులూ, ద్వారబంధాలూ మోసుకుపోయి వేలాంవేశారు.

"ఢిల్లీమహమ్మదీయుల్ని బట్టలువిప్పించేసి, దిసమొలలతో కట్టేసి, పాదాలనించి తలదాకా ఎర్రగాకాలుతూవున్న రాగికడ్డీలతో కాల్చేశారు." హెన్రీకాటనుతో టామ్సను చెప్పినమాట లివి.

"మహమ్మదీయుల్ని చంపేముందు పందిచర్మంలోవేసి వాళ్ళని కుట్టేసేవాళ్ళు. వాళ్ళమీద పందికొవ్వు పులిమి ఆగ్గిలో పడేసేవాళ్ళు.

హిందువుల్ని ఇలాగే చంపేముందుధర్మభ్రష్టుల్నిచేసి చంపేవాళ్ళు.''
– రస్సెలు రాసిన వాక్యా లివి.

''మహమ్మదీయుల్ని హిందువులదేవాలయాల్లో తోసేవాళ్ళు. హిందువుల్ని మశీదుల్లో తోసేవాళ్లు. అవన్నీ అపవిత్రంచేసి వొదిలి పెట్టేవాళ్ళు. జూమేమశీదులో సిక్కులు మకాంపెట్టారు. పాయి ఖానా, ఉచ్చులగదీ అందులోనేపెట్టారు. మినార్లకింద వంటలు పెట్టారు. పందిమాంసం వండారు. ఇంగ్లీషువాళ్ళవెంట కుక్కలు కూడా లోపల తిరిగేవి. మరోమసీదు తెల్లవాళ్ళు వాడుకున్నారు. ప్రసిద్ధమైన నవాబు హమీదాలీఖాను మశీదులో గాడిదలు కట్టారు. కోటకిందవుండే అందమైన వొకమశీదు పడగొట్టి నేలమట్టంచేసేశారు. ఇలా చిన్నా పెద్దామశీదులు ఎన్నో నాశనంచేశారు.''

''కర్నలు బర్నుని ఢిల్లీ మిలిటరీగవర్నరుగా నియమించారు. ఎక్కడయినా అలుకుడయితే చాలు, ఆడామగా, చిన్నా పెద్దా అని విచక్షణలేకండా నిర్బంధించి, వాళ్ళసామానులు వాళ్ళనెత్తినిపెట్టి పట్టుకురండి అంటూ జట్లుజట్లుగా సైనికుల్ని నియమించా డతడు. సామానులు నెత్తినిపెట్టుకుని ముందు మగవాళ్ళునడిచేవాళ్ళు. నెత్తి నోరుకొట్టుకుంటూ వాళ్ళవెనక ఆడంగులూ, పిల్లలూ వచ్చేవాళ్ళు. ఇలా నడిపించుకుని సైనికులు వాళ్ళని బర్నుదగ్గిరికి తోలుకువచ్చే వాళ్ళు. ఎన్నడూ నడవడమంటే ఎరగని ఘరానాకుటుంబంస్త్రీలూ, పురుషులూ నడవలేక మోకరిల్లిపడేవాళ్ళు. చంటిపిల్లలు చంకనించి జారిపోయేవాళ్ళు. నడవండంటూ సైనికులు గదమాయించేవాళ్ళు; గెంటుకుపోయేవాళ్ళు.

''అలా వాళ్ళని బర్నుదగ్గిరపెట్టగానే వాళ్ళసామానులలో విలు వయినవి ఎంచి జప్తుచేసేవాడు. పనికిమాలినవిమాత్రం వాళ్ళనెత్తిని పెట్టేవాడు. సిపాయిలనిఘాకింద వాళ్ళని లాహోరుదర్వాజాలోంచి

పట్నంబైటికి నెట్టేసేవాడు. కట్టగుడ్డా తినతిండీలేకండా పట్నంబైట వేలకొద్దీజనం అల్లాడారు. వందలువందలు చంటిపిల్లలు పాలులేకా, తిండిలేకా తల్లులవొడిలో చచ్చిపోయారు. వేలాదితల్లులు పిల్లల దుఃఖం, దురవస్థాచూడలేక నూతుల్లో గెంతేశారు.

"కుంపినీసైనికులు వస్తున్నారని వినడంతోనే పట్నంలో స్త్రీలు మానసంరక్షణకోసం నూతుల్లో గెంతేశారు. ఒక్కొక్కనూతిలోనూ ఎందరేసిగెంతేశారంటే, వాళ్ళు ముసిగిచవ్వడానికి నూతుల్లో నీళ్ళు చాలకండా అయిపోయాయి."*

"మేం వందలకొద్దీస్త్రీలని నూతుల్లోంచి బైటికితీశాం. శవాలతో నూతులు నిండివుండడంవల్ల వీళ్ళు మునగడానికి నీళ్ళులేక పైనపడి వుండేవాళ్ళు. మేము వాళ్ళని బైటికితీస్తూవుంటే వాళ్ళు మొర్రోమని ఏడ్చేవాళ్ళు. 'మీపుణ్య ముంటుంది. మమ్మల్ని ముట్టుకోకండి. తుపాకులతో చంపెయ్యండీ. మేం మర్యాదస్తులఇంటి ఆడుబిడ్డలం. మమ్మల్ని మానభంగంచెయ్యకండి,' అంటూ మొత్తుకునేవాళ్ళు." ఇంగ్లీషుపటాలంలోని ఒక ఉద్యోగి రాసినమాట లివి.

"ఒకనూతిలోంచి ఇద్దరు స్త్రీలని బైటికి తీశారు. ఒకామె యవ్వన వతి, కాని గుడ్డిది. రెండో ఆమె ముసిలిది. ముసిలామె చెప్పింది– 'నాకు ఒక్కడే కొడుకు. కుంపినీ సిపాయిలు ఇంట్లోదూరి వాణ్ణి నరి కేశారు. అటు అబ్బాయిని కొందరు చంపేస్తూవుంటే ఇటు వాడి చెల్లెలు అంధురాలిని కొందరు మానభంగం చెయ్యబోయారు. గుడ్డి దయినా దానికి పెరట్లో నూయి తెలుసు. అంచేత పరిగెత్తుకువెళ్లి నూతిలో గెంతేసింది. నేనూ దానివెంట వెళ్ళి నూతిలో గెంతేశాను. మేమిద్దరమూ నూతిలో మునుగుతూ తేలుతూ వున్నాం. ఇంతలో ఎవరోవచ్చి మమ్మల్ని బైటికితీశారు' ఢిల్లీ పట్టణమంతటా ఇలాంటి

* ख्वाजा हसन निजामी — देहली की जांकनी



పాదుషా బహదూరుషా

(బర్మాలో చివరి దినాలు)

బేగము షాన్నతు మహలు
(బర్మాలో చివరి దినాలు)

సంఘటనలు ఎన్నో జరిగాయి. మానంకోసం ప్రాణం వొదిలి పెట్టిన యువతులసంఖ్య వేలకి మించింది."

ఎర్రకోటలో మొగలు రాజబంధువులు ఎంతోమంది నివసిస్తూ వుండేవాళ్ళు. వాళ్ళలో ఎంతోమందికి విప్లవంతో సంబంధమే వుండేది కాదు. అయినా వాళ్ళందరినీ ఇంగ్లీషు వాళ్ళుపట్టుకున్నారు. రాజబంధువులయి వుండడమే వాళ్ళ నేరం! విచారణా గిచారణా లేకండా వాళ్లని వురితీసిపారేశారు. పాదుషా ఆలంపాకుమారుడు వొకాయన వుండేవాడు; శతవృద్ధుడు. అతడిపేరు మిర్జాకేసరు. ఈవిప్లవంతో లవలేశమూ ప్రమేయంలేదతడికి. అయితేనేం, ఆ మూడుకాళ్ళ ముసలి శాహజాదాని వురికొయ్యకి వేలాడదీశారు. అలాగే శాహజాదా మిర్జా మహమ్మదుషాని కూడా వురితీసేశారు. పాపం బతికి వున్నంతకాలం వాతరోగంతో కదలలేని స్థితిలో పడి వుండేవాడతడు. నవంబరు పద్దెనిమిది ఉదయం ఇరవైనలుగురు షహజాదాలని ఉరితీశారు.

కొంతమంది రాజకుమార్ళని జైల్లోవేశారు. కఠినాతికఠిన మయిన పనులు వాళ్ళచేత చేయించారు. పనిచేయలేనప్పుడల్లా వాళ్లని కొరడాలతో బాదారు. ఆ యమయాతనలు భరించలేక వాళ్ళు జైళ్లలోనే కడతేరిపోయారు. బహదూరుషా మరోకుమారుడు మిర్జాకోయసు ఒకనాడు ఢిల్లీ పరిసరాల్లో కనిపించాడు. అతడి తలమీద టోపీకూడా లేదప్పుడు. హడ్సను అతడికోసం గాలిస్తూ వుండేవాడు. కాని అవాళనించే మిర్జాకోయసు ఏమయాడో ఎవరికీ తెలియదు.

అలా ఎందరో మొగలురాజకుమార్ళు, రాజపుత్రికలూ దిక్కూమొక్కూలేకండా అయిపోయారు. పాదుషా బహదూరుషాకుమార్తె రావేబాబేగము తిండిలేక మాడిమాడి చివరికి వొక వంటవాణ్ణి పెళ్ళి చేసుకుంది. మరోకూతురు ఫాతిమాసుల్తాను వొకమిమనుసూక్లల్లో నౌకరీకి కుదురుకుంది.

పాపం, ముసిలిపాదుషా బహదూరుషాకి తనకోటే తన బందిఖానా అయింది. 1858 జనవరిలో దివానీఖాసులో అతణ్ణి విచారణచేశారు. నల్భై దినాలువిచారణజరిగింది. బతికివున్నంతకాలం ప్రవాసశిక్షవిధించారు. రంగం పట్టుకుపోయారు. 1862 నవంబరు ఏడున అక్కడే అతడు స్వర్గస్థుడయాడు.*

లక్నోరణరంగం

అయోధ్యయావత్తూ విప్లవకారుల వశమయిపోయింది. ఒక్క లక్నోలోమాత్రం ఇంగ్లీషువాళ్ళ నిశానీ మిగిలింది. కాన్పూరు 'దిక్కుమాలినకోట' విప్లవకారులు ముట్టడించినదినా లవి. ఏమవుతుందో అని ఇటులక్నోలో ఇంగ్లీషువాళ్ళూ, విప్లవకారులూ ఎదురుచూస్తున్నారు. ఇంతలో సతీచౌరా ఇంగ్లీషువాళ్ళ చిత్రవధ జూను ఇరవై ఎనిమిదిని లక్నోకి తెలియవచ్చింది. సర్ హెన్రీ లారెన్సుకి తేళ్ళూ జెర్రులూ పాకాయి. మచ్ఛీభవనంలోనూ, రాజభవనం (రెసిడెన్సీ) లోనూ తన బలగమంతా కేంద్రీకరించాడు. లక్నోలోని దొరలూ, దొరసానులూ పిల్లాజెల్లాతీసుకొని ముందేచేసుకున్న ఏర్పాటుప్రకారం రెసిడెన్సీలో తలదాచుకున్నారు.

కాన్పురం విజయవార్తవినగానే లక్నోకి ఎనిమిదిమైళ్ళదూరంలో చిన్హాటుదగ్గిర విప్లవకారులు దండువిడిశారు. అది తెలిసి హెన్రీ చిన్హాటుమీదికి దాడిబయలుదేరాడు. జూను ఇరవై తొమ్మిదిని ఇనపవంతెన దగ్గిర ఇంగ్లీషుసేన సమావేశమయింది. నాలుగువందలు తెల్లపౌజూ,

---

* బహదూరుషాసమాధి బర్మాలోనేవుంది. ఆమధ్య నేతాజీసుబాసుచంద్రబోసుగారి 'స్వతంత్రభారతప్రభుత్వం' (आजाद हिंद हुकूमत) దానిని మరమ్మత్తు చేసింది. బహదూరుషాఅస్థులు బర్మానించి ఎర్రకోటకి పట్టుకువచ్చి, తగినస్మృతిచిహ్నం ఏర్పరచాలన్న కొందరిప్రయత్నం నేటికీ అలాగేవుంది.

నాలుగువందలు సిక్కు-సేనా, పదిఫిరంగులూపట్టుకుని లాహెన్సు స్వయంగా చిన్హాటు బయలుదేరాడు. విప్లవకారులు ఎదురవడమే తడువు, గుళ్ళ వర్షం కురిసించాడు. ఇస్మాయిలుగంజి వశపరచుకొన్నాడు. అవాళ యుద్ధం ఇంగ్లీషువాళ్ళే గెలిచారు. ఇంతలోనే విప్లవకారులు విజృంభించారు. హోరాహోరి ఘోరమయినపోరాటం జరిగింది. ఇంగ్లీషువాళ్ళువోడిపోయారు. నాలుగువందలమంది తెల్లసోల్జర్లలో నందాయాభైమంది హతమైపోయారు. రెండుఫిరంగులూ, వొకచిన్నఫిరంగీ (Howelzer) వొదిలేసి ఇంగ్లీషువాళ్లు పారిపోయారు. విప్లవకారులు వెంటదరిమారు. ఆతరమడం తరమడం లక్నోవరకూ వెంటదరిమారు. హెన్రీలారెన్సు రెసిడెన్సీలో దూరిపోయాడు. విప్లవకారులు మచ్ఛీభవనమూ, రెసిడెన్సీ ముట్టడించారు. మచ్ఛీభవనం ఆయుధాగారంలో ముప్ఫయిఫిరంగులూ, ఎంతోమందుగుండూ అదీ వుండేది. దానికి నిప్పంటించేసి, ఇంగ్లీషువాళ్ళు రెసిడెన్సీకి పారిపోయారు. మచ్ఛీభవనం విప్లవకారులు వశపరుచుకున్నారు.

రెసిడెన్సీని విప్లవకారులు ఘిరాయించడంతోనే అందులోవున్న వెయ్యిమంది ఇంగ్లీషువాళ్ళూ, ఎనిమిదివందలమంది నేటీవులూ బందీ అయిపోయారు. అయితే వాళ్ళకి కావలసినతినుబండారాలూ, ఆయుధాలూ, మందుగుండూ యావత్తుపరికరాలూ రెసిడెన్సీలోవుండేవి.

చిన్హాటుయుద్ధంలో విజయంకలిగాక అయోధ్యప్రజలు తమ నవాబుని తిరిగీ విధియుక్తంగా గద్దెమీదకూచోబెట్టారు. నవాబు వజీదాలీషా కలకత్తాలో ఇంగ్లీషువాళ్ళ బందీగావున్నాడు. అందుకని అతడికుమారుడు బరజిసుకద్ర నవాబుగా సింహాసనమెక్కాడు. కద్ర మైనారిటీ తీరలేదు. అంచేత అతడితల్లి బేగము హజరతుమహలు రాజ్యభారం వహించింది. లక్నోరాజభవనంకై జరీబాగుమీద ఆకుపచ్చజెండా ప్రతిష్ఠించి, ఆమె పరిపాలన మారంభించింది. రాజా బాలకృష్ణ

సింహాసనాధిష్ఠాన మంత్రిగా నియమించింది. మహాబూబుఖానుమీద సమ్మకమయిన కార్యాలు నియోగించింది. రాజ్యంలో శాంతిరక్షణకి అవసరమయిన అన్ని ఏర్పాట్లూ చేసింది. అయోధ్య స్వాధీనమయిన వైనం నివేదిస్తూ పాదుషా బహదూరుషాకి నజరానాలుపంపింది. రాజ్యంలోని జమీందార్లకీ, తాలూకాదార్లకీ లక్నో ఆహ్వానించింది. సాయుధులయిన అనుచరులతో వచ్చి స్వాతంత్ర్యసమరంలో పాల్గొనండని ఉత్తరాలు రాసింది. ప్రతీదినమూ దర్బారుజరిపి, రాజ్యవ్యవహారాలువిచారించడం మొదలుపెట్టింది.

హజరతుమహలు సంఘటనశక్తి అద్భుతమైంది. ఆమె సామర్థ్యం వివరిస్తూ రస్సెలు ఇలా రాశాడు – "బేగము పరాక్రమవంతురాలు; యోగ్యురాలు. ఆమె మనమీద యుద్ధం ప్రకటించింది. ఈ రాణులూ, బేగములూ చూపే పరాక్రమం పరికిస్తే, వీళ్ళు రాణివాసాల్లో వుండే ఇంతటి మానసికశక్తి సంపాదించగలరని అర్థమవుతుంది."

జూలై ఇరవైని విప్లవకారులు రెసిడెన్సీమీద పెద్ద దాడి చేశారు. ఉదయం ఎనిమిదిగంట లయేసరికి రెసిడెన్సీగోడలదగ్గిర మందుగుండు కూరి నిప్పుముట్టించేశారు. గోడ కొంతభాగం కూలిపోయింది. లోపలి నించి ఇంగ్లీషువాళ్ళు గుళ్ళు కుమ్మరించారు. "చలోబహదూర్, చలో" అంటూ విప్లవకారులు వొకర్నిమించి వొకరు ముందుకి వురికారు. ఉభయపక్షాలా ఫిరంగులూ, తుపాకులూ విరామంలేకండా అవాళనించీ సమరం జరుగుతూనేవచ్చింది. ముప్ఫయిఏడుసార్లు విప్లవకారులు రెసిడెన్సీగోడలు మందుగుండుతోపేల్చారు. కింద మందుగుండు పేలుడు, మీద అగ్నిగోళాలవర్షం – క్షణక్షణగండంగా వుండేది రెసిడెన్సీలోని ఇంగ్లీషువాళ్ళకి. అయినా వాళ్ళు చివరివరకూ పోరాడడానికే నిశ్చయించుకున్నారు.

ఎన్నో సార్లు రెసిడెన్సీభవనంమీది యూనియనుజాకు విప్లవకారులు గురిపెట్టి గుళ్ళతో కొట్టిపారేశారు. ఎన్నిసార్లుపడగొడితే అన్నిసార్లూ తిరిగీ మర్నాటికి కొత్తజెండా నిలబెడుతూవచ్చారు ఇంగ్లీషువాళ్ళు. లోపలి సిక్కు-సిపాయీలని తమతట్టుతిప్పుకుందికి ఎంతోప్రయత్నించారు విప్లవకారులు. అన్నిసార్లూ సిక్కులు మొండిచేతులే చూపెట్టారు. చావోరేవో ఇంగ్లీషువాళ్ళతోనే ముడిపెట్టికున్నారు వాళ్ళు.

ఒకనాడు హోరాహోరి పోరాటం జరుగుతూవుంది. రెసిడెన్సీ మీద అగ్నిగోళాలు ఎడతెరిపిలేకండా పడుతూవున్నాయి. ఒకగుండు రంయ్యినివచ్చింది, చీఫ్‌కమీషనరు సర్ హెన్రీ లారెన్సుని దూసుకు వెళ్ళిపోయింది. అతడు హతమైపోయాడు. అతడిపదవి మేజరు బాంక్సు స్వీకరించాడు.

మరోనాడు మేజరు బాంక్సుకూడా దెబ్బతినేశాడు; కూలి పోయాడు. బ్రిగేడియరు ఇంగ్లీషు కమీషనరయాడు.

విప్లవకారులలో ఆఫ్రికాదేశీయుడైన వొక కొజ్జా వుండేవాడు. నవాబుకొలువులో పనిచేసేవాడతడు. అతడంటే రెసిడెన్సీలోని ఇంగ్లీషువాళ్ళకి సింహస్వప్నంలా వుండేది. అతడి ప్రతీగుండూ రెసిడెన్సీలో పడి బ్రహ్మాస్త్రమంతపని చేసేది. అతణ్ణి ఇంగ్లీషువాళ్ళు 'ఒథెల్లో' అని మారుపేరుపెట్టారు.

ప్రాణాలు అరిచేతిలోపెట్టుకుని ఇంగ్లీషువాళ్ళు పోరాడుతూనే వుండేవాళ్ళు. పైనించి సహాయంకోసం వేగులవాళ్ళని కాన్పూరు పంపుతూవుండేవాళ్ళు. అయితే వేగులవాళ్ళు వెళ్ళడమేకాని తిరిగి వచ్చినపాపానపోలేదు. ఎంతరంగుపూసుకున్నా తెల్లవాళ్ళుదొరికిపోయే వాళ్ళు. వాళ్ళ పిల్లికళ్ళే వాళ్ళని పట్టిఇచ్చేవి. అంచేత నేటీవులనే ఈపనికి నియోగించారు. అందులో అంగదుడని వొకడుమాత్రం

ఎలాగో కాన్పూరువెళ్ళి తిరిగివచ్చాడు. అయితే ఉత్తరాలూ, చీటీలూ ఏవీ పట్టుకురాలేదతడు. ఒక శుభవార్తమాత్రం తెచ్చాడు – "హావలకు లక్నోవస్తున్నాడు."

ఇంగ్లీషువాళ్ళబాండెలో కొత్తజీవంపోసినట్టయింది. అంగదుణ్ణిమళ్ళీ కాన్పూరు పంపారు. హావలకుదగ్గిరనించి లిఖితపూర్వకంగా నిదర్శనం పట్టుకురమ్మన్నారు. అంగదుడు ఇరవై రెండుస కాన్పూరువెళ్ళాడు. ఇరవై అయిదురాత్రి తిరిగివచ్చాడు. హావలకుఉత్తరం పట్టుకువచ్చాడు – "తగినంతపటాలంతో అయిదారుగోజులలో లక్నో చేరుతున్నాను." అమ్మయ్యా, అది ఉత్తరంకాదు సంజీవి!

ఈసారి యుద్ధానికి అవసరమయిన మానచిత్రాలూ అవీ ఇచ్చి మళ్ళీ ఇంగ్లీషువాళ్ళు అంగదుణ్ణి హావలకుదగ్గిరికి పంపారు. అంగదుడు వెళ్ళాడు. లక్నో మ్యాపులూ అవీ హావలకు చేతిలో పెట్టాడు.

ఈలోగా రెసిడెన్సీమీద మళ్ళీ పెద్దదాడి జరిగింది. రెసిడెన్సీ గోడలు బాగా కూలిపోయాయి. లోపలికి చొచ్చుకుపోవడానికి విప్లవకారులు ఎన్నోసార్లు ప్రయత్నించారు. ఇంగ్లీషువాళ్ళు ప్రాణాలమీద ఆశవొదులుకు పోరాటం సాగించారు. అయితే కలబడియుద్ధం చెయ్యడమూ, తుదకి పట్నంలోకి వెళ్లిపోవడమూ – ఇదే చేసేవాళ్లు విప్లవకారులు. దుర్భరస్థితికి వచ్చి ఇంగ్లీషువాళ్లు తమంతటతామే ఆత్మసమర్పణచేస్తారని వాళ్ల ఊహ.

జూలై పద్దెనిమిదిని విప్లవకారులు మరొక పెద్దదాడి జరిపారు. పడిపోయిన గోడలలోంచి లోపలికి వురకడానికి వీరత్వంతో ప్రయత్నించారు. "సాహసవంతుడయిన వొక సిపాయినాయకుడు విరిగిన గోడమీది కెక్కాడు. కత్తిర్రుళిపిస్తూ తోడివాళ్లని తనవెంట రమ్మని కేకలు వేశాడు. ఇంతలో వొక గుండుతగిలి అతడు కూలిపోయాడు.

అతడిస్థానే మరొకడు ప్రత్యక్షమయాడు. అతడున్నూ కూలిపోయాడు. అతడి తరవాత మరొకడు. తరవాత ఇంకొకడు—"*

ఈ ప్రత్యేకదాడులు కాక రోజూ ముట్టడి సాగుతూనే వుండేది. స్వాతివానకి ముత్తెపు చిప్పల్లాగ రోజూ హావలకుకోసం చూసి చూసి దొరలకళ్ళు కాయలుకాసి పోయాయి. ఏడీ హావలకు? అయిదారు రోజులన్నాడు! అయి దయిదులు కాఁచ్చింది! రాడేం?

ఇంతలో అంగదుడు తిరిగివచ్చాడు. హావలకు ఉత్తరం ఇంగ్లీషు చేతిలో పెట్టాడు. ఏమిటది? హావలకు వచ్చేశాడా? — ఉత్తరంలో ఇలావుంది — "నేను పాతికదినాల ఈమధ్య లక్నో రాలేను."

రెసిడెన్సీలోని ఇంగ్లీషుజనమంతా దిగాలుమనిపోయారు. అందరి మీదా ఒక్కసారి మృత్యువు రెక్కలాడించినట్టయింది. తినుబండారాలున్నా తరిగిపోవచ్చాయి. మరికొద్దిలో మందుగుండున్నూ అయిపోవచ్చు. విప్లవకారుల ముట్టడి యమయాతనగా వుంది. ఏందారి? అవాళనించీ రెసిడెన్సీలోని వాళ్లకి సగంభోజనమే నిశ్చయించారు. అర్ధాకలితో వాళ్ళు పోరాటం సాగించారు.

హావలకు నిజంగా అయిదారురోజుల్లో లక్నో వచ్చెయ్యాలనే బయలు దేరాడు. ఐతే అయోధ్యప్రజానీక మతణ్ణి ముందుకి సాగనివ్వలేదు; వెనకకి తరిమికొట్టారు. అతడు లక్నో వెళ్లడం మానేసి కాన్పూరు వచ్చేశాడు. వచ్చీరావడంతోనే అతడు విన్నాడు — "నానాసాహెబు బిఠూరుఆక్రమించుకున్నాడు." వినడమేతడువు, ఎక్కా ఎకినివెళ్లి బిఠూరు ముట్టడించాడు. నానాసాహెబుసేన సిద్ధంగానేవుంది. రెండు సేనలూ డీకొన్నాయి. నువ్వా నేనా అంటూ పోట్లాడాయి. నానాసేనాలోవున్న నలభై రెండో విప్లవసైన్యం బై నెట్లతో హావలకు దండు

* Malleson's Indian Mutiny.

మొదపడింది. భయంకరమయిన సంకులసమరం జరిగింది. విప్లవకారుల గుర్రపు దళమొకటి వెనకనించి ఇంగ్లీషుసేనమీద పడింది. వాళ్ళ భోజనసామగ్రులూ అవీ దోచుకుంది. ఇలా ముందు వెనకా ఆక్రమణతో ఇంగ్లీషుసేన ఇరుక్కుపోయింది. పోరాడి ఉభయసేనలూ వెనకకి వెళ్లిపోయాయి.

ఇలా ఇక్కడ పరాజయంపొంది హావలకుసేనాని ఆగష్టు పదిహేడున కాన్పూరువచ్చేశాడు. ఈయుద్ధంలో అతడు వొక ముఖ్య విషయం గ్రహించాడు. 'నానాసాహెబుసేన బిహారులో మాత్రమే లేదు, యమున వొడ్డుని కాలపీలోకూడా బ్రహ్మాండమైన సేనవుంది.' అటు అయోధ్యలో, ఇటు బిహారులో, కాలపీలో – అన్నిదిక్కులా విప్లవసేన – హావలకుసేనానికీ వ్యాపిరాడనట్టయింది. ప్రమాదం కళ్ళ ముందు తాండవమాడింది. "మేం చిక్కులోవున్నాం. సహాయం రాక పోయిందో, లక్నోని దానిఖర్మానికివొదిలేసి మేం అలహాబాదుదారి పట్టవలిసివస్తుంది" అంటూ కలకత్తారాశాడు. సహాయంకోసం ఎదురు చూస్తూ కూచున్నాడు. అతడి అసమర్థత రుజువయింది; అతడికి అర్జరువచ్చింది – లక్నోకోసం పంపే పటాలానికి సర్ జేమ్సు ఔట్రాము సేనాపతిగా నియమితు డయాడు.

సర్ జేమ్సు ఔట్రాము సెప్టెంబరు పదిహేనున కాన్పూరులో దిగాడు. అయితే అతడు సేనానిపదవి హావలకుచేతిలోనే పెట్టాడు. "నువ్వే లక్నోముట్టడి ఆరంభించావు. కనకదానిని గెలిచిసగౌరవమున్నా నీకే దక్కాలి. అందుకని నాఅధికారంయావత్తూ నీకే అర్పిస్తున్నాను. నేను సైనికుడుగానే ఈయుద్ధంలో పాల్గొంటాను" అన్నాడు.

హావలకు నాయకత్వంకింద ఉద్దండమైనరాణువ లక్నో బయలు దేరింది. లోగడ హావలకు వొక్కడే దండునడుపుకుంటూ వెళ్ళాడు.

ఇప్పుడో ! ఇప్పుడు అతడితో నీలూ, బౌట్రూమూ, కూపరూ, ఏశే — హేమూహేమీలయిన సేనానాయకులున్నారు. రెండువేల అయిదు వందలమంది తెల్లసోల్జరులున్నారు. మూడువేల రెండువందలయాభై మంది సిక్కుసిపాయిలున్నారు. దిట్టమైన గుర్రపుదళమూ, వొకటో రకం ఫిరంగిదళమూ వుంది. ఇంతభారీఎత్తుని హావలకు బైలుదేరాడు. అయోధ్యసరిహద్దులోని విప్లవకారులుమాత్రం ఆసమయానికి లక్నో లోవున్నారు. రెండునెలలక్రితం హావలకు తిరోగమనంతో, కుంపినీ అయోధ్యవొదులుకుందనే వాళ్ళు భావించారు. మిగిలిన ప్రజలూ, జమీందారులూమాత్రం హావలకుసేనకి అడ్డుతగిలారు. తమదగ్గిర తగిన ఆయుధాలున్నా లేవు. అయినా అడుగడుగునా పోరునాగిస్తూనే వచ్చారు. దారికడ్డూ శవాలు కుప్పలుపడ్డాయి. ఎదురయిన నదులన్నీ రక్తనదులై ప్రవహించాయి. ఆకుపచ్చజెండా ఎగిరిన ప్రతీ పూరాకాలి బుగ్గయిపోయింది. ఇలా చంపుతూ, చస్తూ తుదకి సెప్టెంబరు ఇరవైమూడున ఇంగ్లీషుసేన లక్నోదగ్గర ఆలంబాగు చేరుకుంది.

ఆలంబాగులో విప్లవసేన దండువిడిసివుంది. ఉభయసేనలూ, వొక దానిమీదవొకటి విరుచుకుపడ్డాయి. ఇరవైనాలుగు రోజంతా భీషణమయిన సమరం సాగింది. రాత్రి ఉభయసైన్యాలూ అక్కడేగడపాలని నిశ్చయించుకున్నాయి. రాత్రి భోజనాలయాయి. చిన్న వాసజల్లు పడుతూవుంది. ఇంగ్లీషుసేన మేనువాల్చింది. హఠాత్తుగా విప్లవసేన దాడి ప్రారంభించింది.

అదేసమయంలో ఢిల్లీ పడిపోయిందన్న వార్త ఇంగ్లీషువాళ్ళ కందింది. వెయ్యేనుగులబలం వచ్చింది వాళ్ళకి. రెట్టించినఉత్సాహంతో ఆరాత్రి యుద్ధంచేశారు వాళ్ళు. మర్నాడు తెల్లవారింది. ఆలంబాగు విప్లవకారుల్ని గెలవడంఅంత మీదమీదలేదని హావలకుకి అర్థమయింది. దాంతో కొంత వెనకకితగ్గేసి, అడ్డుదారిని రెసిడెన్సీకేసి

దండు నడిపించా డతడు. విప్లవకారు లది కనిపెట్టారు. అడ్డంగా పరి గెత్తారు; అడ్డుకున్నారు. అయినా ఇంగ్లీషువాళ్ళు వాళ్ళని చీల్చు కుంటూ చార్‌బాగు వంతెనవరకూ తరుముకువచ్చారు. వంతెన అవతల లక్నోనగరం. వంతెనమీద విప్లవకారుల ఫిరంగులు అగ్ని గోళాలు కుమ్మరిస్తున్నాయి. ఇవతల ఇంగ్లీషుసేన, అవతలస్వతంత్ర సేన. వంతెనదాటితేనేకాని లక్నోలో అడుగుపెట్టడానికి వీలులేదు.

కెప్టెను హూడ్ వంతెనమీద దారుణమయిన దాడిచేశాడు. అర గంటకాలం అగ్నివర్షంకురిపించాడు. ఆవంతలాభంలేకపోయింది. వం తెనమీదిఫిరంగులు గర్జిస్తూనేవున్నాయి. గుళ్ళమీదగుళ్ళు వెలిగక్కు తూనేవున్నాయి. ఇంగ్లీషువాళ్ళని హతవారుస్తూనేవున్నాయి. రెప్ప పాటులో ఇరవైమందిదొరలు తారుమనిపోయారు. అలావుంది విప్లవ సేన విజృంభణ!

హావలకుకుమారుడు మూడ్‌తోకలిసి పోరాడుతున్నాడు. నీలు సేనానిదగ్గిరి కతడు పరిగెత్తుకువెళ్ళాడు. "ఫిరంగులతో విప్లవకారుల్ని తరమడం కష్టం. గుర్రపుదళానికి ఆర్డరివ్వండి. చొచ్చుకుపోయి వంతెన పట్టుకుందాం" అన్నాడు.

"సర్వసేనాని హావలకుఅనుజ్ఞ లేనిదే నేను అనుమతించలేను" అన్నాడు నీలుసేనాని. తండ్రిదగ్గిరికి గుర్రంపరిగెత్తించాడు హావలకు కొడుకు. అతడితో సంప్రతించినట్టునటించాడు. తిరిగీ నీలుదగ్గిరికి వచ్చాడు. హావలకు అనుమతించా డని బొంకాడు. నీలు సమ్మాడు; గుర్రపుదళాన్ని ఆజ్ఞాపించాడు — "వంతెనమీదికి నడవండి."

పాతికమందిరౌతులతో హావలకు కుమారుడు. ముందుకి వురికాడు. పాతికమందినీ విప్లవకారులగుళ్ళు నంజుకున్నాయి. ఒక్కడూ మిగల లేదు. హావలకు కుమారుడు అరంగుళంవార బతికిపోయాడు. వంతెన

మిగిలిపోయిన అతడికేసి తుపాకి గురిపెట్టాడు. గుండు అరగుళంవాసి తప్పిపోయింది. తలమీది ఇనపకుళ్ళాయి ఎగరేసుకుపోయింది.

రెప్పపాటులో ఇంగ్లీషుసేన ముందుకివచ్చేసింది. వంతెనమీదిసిపాయిలు వెనకతగ్గడం తప్పనిసరి అయిపోయింది. వంతెన ఇంగ్లీషువాళ్లు వశమయిపోయింది. హావలకుసేన వంతెనదాటి వచ్చేసింది. మళ్ళీ విప్లవకారు లెదిరించారు. తుపాకితో తుపాకి, కత్తితో కత్తి – దారుణమైన దొమ్మీయుద్ధం జరిగింది. రక్తం మడుగులుకట్టింది. వరదలయిపారింది. శవాలమీదశవాలు కుప్పలుపడ్డాయి. ఇంగ్లీషుసేన వొకొక్క అడుగూ ముందుకిసాగింది. సాయంకాలమయింది. యుద్ధమాపేసి విశ్రాంతి తీసుకుందామన్నాడు సేనాని బ్రూస్. విశ్రాంతి? విశ్రాంతికి తావెక్కడ? ఆగకండా ముందుకి సాగాలన్నాడు హావలకు.

ఇంగ్లీషుసేన అలాగే యుద్ధంచేస్తూ ముందుకి వెళ్ళింది. వెళ్ళివెళ్ళి వొకదగ్గిర దారిశప్పింది. నీలుసేనాని ముందుకి-మరీముందుకి విప్లవకారుల సమ్మర్దంలోకి చొచ్చుకుపోతున్నాడు. అలా అతడు ఖానుబజారు తోరణందిగ్గిరికి వచ్చాడు. ఫిరంగిదళం వెనకపడింది. గుర్రంమించి నీలుసేనాని వెనకకిచూశాడు. అదే అతడి చివరిచూపు. తోరణంమించి వొకసిపాయి తుపాకి గురిపెట్టాడు. గుండు గుభీమంది. నీలుసేనాని మెడ ముక్కలుచేసుకుంటూ రయ్యిని వెళ్ళిపోయింది. నీలు దొరగుర్రంమించి కూలిపోయాడు. ఖానుబజారు నడివీధిని ప్రాణం వొదిలేశాడు.

నీలుసేనాని రాలిపోయాడు. ఇంగ్లీషుఫౌజు ఆగలేదు! ఎలాగో చివరికి రెసిడెన్సి చేరుకుంది. ఓ! రెసిడెన్సీలో ఇంగ్లీషువాళ్ళకి పునర్జన్మ! ఎనభై ఏడుదినాల నిర్బంధంతరవాత వాళ్ళకి సహాయం లభించింది. గాయాలుపడి మంచంపట్టినవాళ్ళుకూడా సంతోషంతో లేచివచ్చారు. ఈఎనభై ఏడుదినాల్లోనూ రెసిడెన్సీలో ఏడువందలమంది మరణిం

చారు. అంతేనా? కాన్పురంనించి లక్నో వచ్చేలోపున హావలకుసేనలో ఏడువందల ఇరవై ఇద్దరు హతవై పోయారు.

హావలకుసైన్యమేమో రెసిడెన్సీలో ప్రవేశించింది. రెసిడెన్సీలోని వాళ్ళకి సహాయంమాత్రం లభించింది. అంతే. ముక్తి లభించలేదు. లక్నో విప్లవకారులువచ్చి యథాప్రకారం రెసిడెన్సీ ఘిరాయించారు. హావలకుసేనకూడా రెసిడెన్సీలో బందీఅయిపోయింది. అయోధ్య రాజ్యం ఎప్పటిలాగే విప్లవకారులచేతిలో వుండిపోయింది. ఇంతప్రయత్నంచేసినా హావలకు పూర్తివిజయంమాత్రం సాధించలేకపోయాడు.

ఆగస్టు పదమూడున కొత్తసర్వసేనాని సర్ కాలిను కాంబెలు కలకత్తా నచ్చాడు. చైనా, సిలోనూ, మద్రాసూ, బొంబాయిల నించి కొత్తకొత్త ఇంగ్లీషుపటాలాలు దిగాయి. కాశింబజారుకార్ఖానానించి కొత్తరకం ఫిరంగులు వచ్చాయి. రెండుమాసాలకాలం ఈతయారీ యావత్తూచేసుకుని సర్వసేనాని కాలిను కాంబెలు అక్టోబరు ఇరవై ఏడున హావలకూ, ఔట్రాముల్ని విడిపించడానికి స్వయంగా లక్నో పయనం కట్టాడు. అంతేకాదు, కల్నలు పావెలూ, కెప్టెను విలియం పాలూ – ఈఇద్దరినాయకత్వంకింద ఎంక నావికాదళం కూడా గంగానదిమీద కలకత్తానించి అలహాబాదు పంపించాడు. దారికడ్డూ విప్లవకారుల తుకిడీలు ఇంగ్లీషుపటాలాన్ని ఎదిరిస్తూనేవచ్చాయి. ఈతుకిడీలు కుమార సింహుడిపద్ధతిప్రకారం హటాత్తుగావచ్చి ఇంగ్లీషుసేనమీద పడేవి. చిందరవందరచేసేసి మాయమయిపోయేవి. విప్లవకారుల ఈగొరిల్లా ఎత్తులవల్ల యమబాధగా వుండేది ఇంగ్లీషువాళ్ళకి. ఈపోరాటాల్లోనే నవంబరుమాసున నావికాదళంనాయకుడు కల్నలు పావెలు హతవైపోయాడు.

పావెలుని విప్లవకారులుచంపేసిననాడే కాలినుకాంబెలుఅలహాబాదు నించి కాన్పూరుచేరాడు. దారిలో అతడు విప్లవకారులచేతిలో ఖైదీగా

పట్టువడవలిసింది. అదృష్టవశాత్తూ తప్పిపోయింది. ఇంగ్లీషువాళ్ళ ప్రయాణంకోసం బళ్ళూ అవీ దొరకడం కష్టంగావుండేది. కాంబెలు ఎొక సామాన్యమయిన బండిమీద ఎొంటరిగా అలహాబాదునించి కాన్పూరువెళ్తుతున్నాడు. బండి శేర్ ఘాటీచేరువకివచ్చింది. మరోపక్క రోడ్డుమీంచి వెళ్తూ విప్లవకారు లతడికి కనిపించారు. పదిపన్నెండు ఏనుగులమీద వెళ్తుతున్నారు వాళ్లు. పాతికమంది గుర్రపురౌతులున్నా వెంటవున్నారు. ఏదోసామాన్యమయినబండి అనుకుని హావలకుబండిని ఉపేక్షించారు వాళ్ళు. వాళ్ళని చూడడంతోనే దారిమళ్ళించేసి అదే వచ్చెయ్యడం వచ్చేశాడు కాలినుకాంబెలు.

కాంబెలు వచ్చేసరికి బ్రిగేడియరు గ్రాంటునాయకత్వంకింద పెద్ద పటాలం కాన్పూరులో సిద్ధంగావుంది. కలకత్తానించి బయలుదేరిన నౌకాదళంకూడా అలహాబాదుగుండావచ్చి కాన్పూరుచేరింది.

కాంబెలు ముందు పెద్దసేనతో జనరలు గ్రాంటుని లక్నో ఆలం బాగు పంపాడు. జనరలు వింధము నాయకత్వం కింద కొంత ఇంగ్లీషు సేనా, కొంత సిక్కు-పటాలమూ రక్షణకోసం కాన్పూరులో అట్టే పెట్టాడు. తాను స్వయంగా గ్రాంటువెనక నవంబరు తొమ్మిదిని ఆలంబాగు చేరుకున్నాడు.

కాంబెలు వచ్చి లక్నో పరిస్థితులు పరికించాడు. హేమా హేమీలు — గ్రేట్ హెడ్, హాడ్సను, హూప్ గ్రాంటు, ఏరే — వీళ్లంతా తనసేనలో వున్నారు. రెసిడెన్సీలో, హావలకూ, ఔట్రాము లున్నారు. మెరికల్లాంటి సిక్కులూ, పంజాబీలూ వున్నారు. అటు లోపలినించి హావలకూ, ఔట్రాములూ, ఇటు ఆలంబాగునించి తానూ ఎొక్కసారి విప్లవకారులతో పోరాడాలని నిశ్చయించాడు కాంబెలు. నవంబరు పదాన్నలుగు పోరాటానికి స్థిరపరిచాడు. అయితే ఈపథకం రెసిడెన్సీవాళ్లకి అందడమెలాగ? చుట్టూ విప్లవకారులు

ఘీంకారాయించి వున్నారు. లోపలినుంచి బైటకీ, బైటినించి లోపలకీ పిట్ట మనిషి వెళ్ళడానికి వీలులేకండా వుంది. కావెనా అని ఎొక దురుస యిన ఇంగ్లీషు వాణ్ణి ఎంచాడు కాంబెలు. సరిగ్గా భారతీయుడిమల్లే అతడికి నల్లరంగు పట్టించాడు. దుస్తులూ అవీ తొడిగాడు. నిశిరాత్రి ఎలాగో రెసిడెన్సీలోకి పంపాడు. ప్రాణాలమీద ఆశవొదులుకుని కావెనా రెసిడెన్సీలో ప్రవేశించాడు. పద్నాలుగున జరగవలసిన యుద్ధంగురించి కాంబెలు పథకం బోట్రాము కందించాడు. అంతా నిశ్చయమయింది.

నవంబరు పద్నాలుగు తెల్లవారింది. ఆలంబాగునించి సర్ కాలిను కాంబెలు విప్లవకారులమీద దాడి ప్రారంభించాడు. అటు రెసిడెన్సీనించి హావలకు, బోట్రాములున్నూ యుద్ధమారంభించారు. హోరాహోరి పోరాటం మొదలయింది. ఇంగ్లీషుసేన సముద్రంలావుంది. కొత్తకొత్త ఆయుధాలున్నూ వాళ్ళదగ్గిర వున్నాయి. అయినా అయోధ్య విప్లవ సేనని గెలవడమంటే అంత మీదమీదలేదని కాంబెలుకి అర్థ మయింది. ఇంగ్లీషుసేనలోమల్లే అనుభవంకల పెద్ద పెద్ద సేనానాయ కులు విప్లవసేనలోలేరు. నిజమే. ఇంగ్లీషువాళ్ళకున్న కొత్తకొత్త ఆయు ధాలున్నూ వాళ్ళకి లేవు. అదీనిజమే. అయితే వీరత్వంలోకానీ సాహసంలోకానీ ఏఇంగ్లీషువాడూ వాళ్లని మించిపోలేదు. పైగా, దేశంకోసం, ధర్మంకోసం ఊరణయజ్ఞంలో ఆహుతికావడానికేవాళ్ళు, శపథం పట్టారు.

పగలంతా ఘోరమయిన యుద్ధం జరిగింది. సాయంకాలమయే సరికి కాంబెలుసేన దిల్‌ఖుల్ బాగు చేరింది. ఆరాత్రి అక్కడే మకాం వేయాలని నిశ్చయించాడు కాంబెలు. విప్లవకారులు దాడిచేశారు. ఇంగ్లీషుసేన లక్ష్యపెట్టలేదు. రాత్రి దిల్‌ఖుష్ బాగులోనే గడిపారు. మర్నాడంతా వ్యూహాలు పన్నడంతో సరిపోయింది. పదహారు ఉద

యం ఇంగ్లీషుసేన ఉప్పెనలా లేచింది; సిక్కందరుబాగుదిక్కు నడిచింది. ఎవర్డు నాయకత్వంకింద ఘూర్ఖాలూ, హావెలు నాయకత్వంకింద సిక్కులూ సిక్కందరుబాగుమీద విరుచుకుపడ్డారు. సిక్కందరుబాగులోని విప్లవకారులు భయంకరంగా ఎదిరించారు. భీషణమయిన సమరం జరిగింది. సిక్కందరుబాగు గోడలు పగిలిపోయాయి. సిక్కుసర్దారు గులాబు సింగు కత్తి ఝళిపిస్తూ ముందుకి వురికాడు. సిపాయిల గుండు వచ్చి అతడి గుండెలు చీల్చుకుపోయింది. నిలువునా అతడు కూలిపోయాడు. గులాబుసింగు శవం కిందపడిందో లేదో, కూపరూ, కూపరు వెంట ఎవాన్సూ, ఎవాన్సు వెంట కెప్టెను జాన్ లమ్స్డెనూ, సిక్కులూ, ఘూర్ఖాలూ — ఇంగ్లీషుసేన వరదలాగ లోపల చొచ్చుకుపోయింది. లోపల సిపాయిలు తెగించి సంకుల సమరానికి విరుచుకుపడ్డారు. కత్తులూ కత్తులూ ఖణేలుమంటే ఖణేలు మన్నాయి. కూపరు తెగిపోయాడు. తరవాత? లమ్స్డెను తెగికింద దొర్లిపోయాడు.

ఈలోగా ఇంగ్లీషుసేన మరోపక్క బాగుగోడలు పడగొట్టింది. గట్టు తెగినప్రవాహంలా సైన్యంలోపలికి తోసుకువచ్చింది. విప్లవకారులు వెనుదియ్యలేదు. తమబొందెలో ప్రాణమున్నంతవరకూ అపజయమన్నమాట విసదలుచుకోలేదు వాళ్ళు. అనుకోనంత ఇదిగా దొమ్మీయుద్ధంజరిగింది. బాగుబాగంతా శవాలతో నిండిపోయింది. రక్తంవరదలై పారింది. సిక్కందరుబాగు సంకులసమరం వీరభారతచరిత్రలో స్వర్ణాక్షరాలలో రాయదగింది.

" సిక్కందరుబాగు ఆక్రమించుకోడానికిజరిగిన యుద్ధంలో చెప్పలేనంత రక్తపాతం జరిగింది. ఒకరికీ ప్రాణాలమీద ఆశలేకండాపోయింది. విప్లవకారులు అద్భుతమయిన సాహసపరాక్రమాలతో తెగించి పోరాడారు. ఇంగ్లీషుసేన దారిచీల్చుకుంటూ లోపలప్రవేశించింది. అయినా యుద్ధమాగలేదు. ప్రతీ గదికోసమూ, ప్రతీ మెట్టుకోసమూ

ప్రతీ మైనారుతాలూకు వొక్కొక్క మూలకోసమూ యుద్ధం జరిగింది. ఎవరూఎవరినీ దయతలచలేదు. ఎవరూ ఎవరినీ దయతలచమనలేదు. చివరికి ఇంగ్లీషువాళ్ళు సికందరుబాగు ఆక్రమించుకున్నాక చూస్తే, రెండువేలమందికి మించిన విప్లవకారుల మృతదేహాలు బాగులో పడివున్నాయి. వాళ్ళలో నలుగురుమాత్రం మినహాయిస్తే వొక్కడూ వెనకంజవెయ్యలేదు. యావన్మందీ చివరివరకూ పోరాడారు. వెనకంజవేసి, వెళిపోయారన్న ఆనలుగురుమాటా సందేహమే, నిజానికి."*

సికందరుబాగుయుద్ధంతరవాత మరో ఇరవైనాలుగుగంటలకాలం దిల్‌ఖుష్‌బాగు, శాహాన్‌జఫ్, ఆలంబాగులలో దారుణమయిన సంకుల సమరం జరిగింది. అలావొకరోజూ రెండురోజులూ కాదు, తొమ్మిది దినాలు విడుపూవిరామంలేకండా యుద్ధంజరిగాక, నవంబరు ఇరవైమూడుని కాంబెలుసేనా, హావలకుసేనా కలుసుకోగలిగాయి. అన్నాళ్ళూ రెసిడెన్సీలో నిర్బంధంలో వున్న ఇంగ్లీషువాళ్ళకి అవాళ విముక్తికలిగింది. ఇంతా అయింది. అయితేనేం, లక్నోమాత్రం ఇంగ్లీవాళ్ళకి స్వాధీనం కాలేదు. పట్నంలో రక్తనదులు పారుతూనే వున్నాయి. రణదుందుభులు మోగుతునేవున్నాయి. కాంబెలు సాధించినవిజయానికి విప్లవకారులు లవలేశమూ లక్ష్యపెట్టలేదు. పలాయనం, పరాజయంవాళ్ళు భావించనేలేదు.

కాంబెలు అద్దరాత్రి రెసిడెన్సీ ఖాలీచేసేశాడు. నాలుగువేల ఫౌజూ వొక పాతిక ఫిరంగులూ ఆలంబాగులో బ్రూమునాయకత్వంకింద అట్టేపెట్టి, లక్నోముట్టడికోసం కొత్తపథకంవెయ్యడం ప్రారంభించాడు, ఆదినాల్లోనే నవంబరు ఇరవైనాలుగున జనరలుహావలకు అతిసారం

* Malleson's Indian Mutiny,

పట్టుకుని మరణించాడు. నీలూ, హావలకులు చెయ్యవలసినన్ని దారు ణాలుచేసి తుదకి లక్నో నగరంలో హతవై పోయారు!

లక్నో దాడికి కాంబెలు సిద్ధపడుతున్నాడు. ఇంతలో కాన్పూరు విప్లవసేనాని దగ్గిరనించి దారుణమయినవా ర్త! ఏమిటది? మరాఠా పెద్దపులి తాంతియటోపే!

బ్రూమును ఆలంబాగులో వొదిలేసి సర్వసేనాని కాలిను కాం బెలు హుటాహుటిని కాన్పూరు బైలుదేరాడు.

గ్రేట్ హెడ్

ఢిల్లీ స్మశానమయిపోయింది. అక్కడినించి వొక్కక్క ఇంగ్లీషు సేనానీ చుట్టుపట్ల ప్రదేశాలు తుడిచి పెడుతూ, సర్వసేనాని కాంబె లుని కలుసుకుందికి బహుముఖాలుగా బయలుదేరారు. సెప్టెంబరు ఇరవైనాలుగున కర్నలు గ్రేట్ హెడ్ కొన్నివందల లొటిపిటాల తోనూ, అయిదువేల పటాలంతోనూ ఢిల్లీనించి బయలుదేరాడు. సరాసరి వెళ్ళి అతడు బులాందుపట్నంమీద పడ్డాడు. అక్కడ విప్లవ కారులతణ్ణి ఎదిరించారు. ఎంతోసేపు యుద్ధం జరిగింది. మూడువందల మంది విప్లవకారులు వీరస్వర్గం చూరగొన్నారు. ఇంగ్లీషుసేనలో నలభై తొమ్మండుగురు వీరగతి పొందారు. చివరికి గ్రేట్ హెడ్ గెలిచాడు.

అక్కడినించి అతడు ఆలీగడం వెళ్ళాడు. దారి ఇరుపక్కలా గ్రామాలు తగలబెట్టాడు; బూడిదకుప్పలు చేశాడు. కంటపడ్డ భారతీ యుణ్ణల్లా చంపాడు; వీనుగుపెంటలు చేశాడు. అమాయకజనంమీద విరుచుకుపడ్డాడు; కుక్కల్ని చంపినట్టు చంపాడు. నిరపరాధుల్ని వెంబ డించాడు; జంతువుల్ని వేటాడినట్టు వేటాడాడు. వృద్ధుల్నికూడా పట్టుకున్నాడు; నిష్ఠురంగా వురితీశాడు. గ్రేట్ హెడ్ పేరు వింటేచాలు వూళ్ళల్లో జనం అడవులు పట్టిపోయారు. చెట్లమీదా తుప్పల్లోనూ,

దాగున్నారు. అయినా గ్రేట్ హెడ్ వాళ్ళని వొదిలి పెట్టలేదు. వెంటాడాడు; వేటాడాడు; హతవార్చాడు. నీలుదొరకంటే ఏడాకులు హెచ్చుచదివా డతడు.

ఆలీగడంలో వేగులవాళ్ళతడికి కబురందించారు — "ఆగ్రాలో విప్లవకారులు మకాం పెట్టారు." కబురందడమే తడువు, గ్రేట్ హెడ్ ఆగ్రా పయనం కట్టాడు. ఆగ్రాకోట ఎదట అతడికైన్యం విడిసింది; విశ్రాంతి తీసుకుంటూ వుంది. ఇంతలో విప్లవకారులు తుపాకులు పేల్చారు; ఫిరంగులు కాల్చారు. గ్రేట్ హెడ్‌సేన దుస్తులు వేసుకుంది కయినా అవకాశం లేకపోయింది. యుద్ధమారంభమైపోయింది. గుళ్లు విరజిమ్ముతూ ఇంగ్లీషుసేన ముందుకి చొచ్చుకపోయింది. విప్లవకారులు ఓడిపోయారు. వాళ్ళ పదమూడు ఫిరంగులు ఇంగ్లీషువాళ్ళకి దొరికిపోయాయి.

గ్రేట్ హెడ్ ఢిల్లీనించి బయలుదేరాక ఢిల్లీలో మళ్ళీ విప్లవంతల యెత్తే సూచనలవుపించాయి. కొన్నాళ్ళయాక, బహదూరుషాని విడిపించడానికి నానాసాహెబు పెద్దసేనతో ఢిల్లీవస్తున్నాడని వదంతులు లేచాయి. ఢిల్లీమీద నానాసాహెబుఆక్రమణజరిపితే, వెంటనే బహదూరుషాని కాల్చి చంపెయ్యమని ఇంగ్లీషుఅధికారులు రహస్యంగా ఉత్తరువులు జారీచేశారు.

ఆగ్రానించి గ్రేట్ హెడ్ కాన్పూరు బయలుదేరాడు. దారికడ్డంకూ మానవసంహారం, గ్రామదహనం సాగించాడు. అక్కడక్కడ విప్లవకారులూ, ప్రజలూ ఎదిరించారు. స్త్రీలుకూడావిప్లవకారులతోకలిసి కొన్నిచోట్ల వీరకృత్యాలుచేశారు. ఒకనాటిమాట - ఇంగ్లీషుసేన నడిచిపోతూవుంది. దారిపక్క పెద్దచెట్టొకటి ఆకుపచ్చకొమ్మలతో జీబుగావుంది. పటాలం చెట్టుకిందికి వచ్చేసరికి హఠాత్తుగా తుపాకి ఢాం మంది.

నలుగురుసైనికులు కూలిపోయారు. పటాలం మీదికి చూసింది. చెట్టు మీద వొకేవొక వ్యక్తి తుపాకి గురిపెట్టడం కనిపించింది. ఒక్కసారి సైనికులు తుపాకులు కాల్చారు. చెట్టుమీద మనిషిని కొట్టేశారు. కిందపడ్డాక తీరాచూస్తే అవ్యక్తి వొక స్త్రీ. ఇలాంటివి అనేకచోట్ల ఎన్నో జరిగాయి. అలా వెళ్ళి గ్రేట్ హెడ్ కానూపూరులో కాంబెలుని కలుసుకున్నాడు; అయోధ్యపోరాటంలో పాల్గొన్నాడు.

తాంతియా టోపే

నానాసాహెబు పతేపురంవచ్చాక తాంతియా టోపేని శివరాజపురం పంపాడు. తాంతియా టోపే నానాసాహెబు బాల్యసహచరుడు. బిఠూరుదర్బారులో గుమాస్తాగా వుండేవాడు. దేశంకోసం అవసరం రాగానే అతడు కలం పారేసి కత్తిపట్టాడు; నానాసేనకి సేనానాయకుడయాడు. ఝాన్సీవుకూడా కలం పారేసి కత్తిపట్టినవాడే. అయితే తాంతియావీరత్వంతో అతడికి పోలికమాత్రం లేదు. మోసమూ, నమ్మకద్రోహమూ, ఘోర్జరీ — వీటివల్లే ఝాన్సీవు ఘనుడనిపించుకున్నాడు. తాంతియా టోపే స్వచ్ఛమైనమహారాష్ట్రవీరపురుషుడు. అసలయిన రణవిద్యాపారగుడు. జంఝూమారుతంలా బ్రిటిషుమహావృక్షం కుదిపి వొదిలిపెట్టిన ఉద్దండుడు.

తాంతియా టోపే 1814లో నాశికుజిల్లా ఇవోలాలో జన్మించాడు.* తండ్రిపేరు పాండురంగభట్టు. పాండురంగభట్టు పేష్వాబాజీరావు బిఠూరుదర్బారులో ఉద్యోగిగా వుండేవాడు. ఇతడి ఎనమండుగురు కుమార్తెలలో తాంతియా రెండోవాడు.

"తాంతియా టోపే మహారాష్ట్రబ్రాహ్మడు. అతడి వయస్సు సుమారు నలభైసంవత్సరాలు. శరీరం మలచినట్లు అందంగావుంటుంది.

---

* అక్కడి ప్రజలిప్పుడతడికి కాంచువిగ్రహం స్థాపించబోతున్నారు.

అతడు సాహసి; కార్యదక్షుడు; ధీరుడు; గంభీరుడు; యోధుడు. అతడెప్పుడూ సామాన్యమయిన దుస్తులే ధరించేవాడు; సాధారణమైన భోజనమే చేసేవాడు. అంత చదువుకున్న వాడుకాడు; అయినా బుద్ధిశాలి. తన సహచరులంటే అతడు ప్రాణంపెట్టేవాడు. అంచేతే వేలకి వేలు యోధులు అతడంటే పడిచచ్చేవాళ్లు. అతడెన్నడూ వొంటరిగా తిరిగేవాడుకాడు. ఇరవైమంది, పాతికమంది అంగరక్షకులు ఎప్పుడూ అతడివెంటవుండేవాళ్లు. అతడిమాటల్లో ఏదో మహేంద్రజాలముండేది. ఎవళ్ళనయినాసరే, ఇట్టే స్వాధీనంచేసుకునేవాడు. నిరుపేదలకి గుప్తదానం చెయ్యడమూ, ధనవంతుల్ని కొల్లగొట్టడమూ అతడికి సరదా. పగలూరాత్రీ గుర్రంమీదేగడిపినా అతడికి అలసటఅన్నది వుండేదికాదు. ఎకాఎకిని వందా, వందాయాభై మైళ్లు గుర్రంమీదపరిగెత్తడమంటే అతడికి సాధారణవిషయంగా వుండేది. తాను నానాసాహెబు ప్రతినిధినని చెప్పుకునేవాడతడు" — అనాటి లండను 'డెయిలీన్యూసు' మాటలివి.

తాంతియాటోపే శివరాజఘరం వెళ్ళాడు. అక్కడ కుంపినీవాళ్ళ నలభై రెండోపటాల ముంది. అంతవరకూ విప్లవకారులతో కలియడం లేదది. తాంతియా మంత్రం పారింది. ఆపటాలంపటాలం తనవెంట నచ్చేసింది. వెనకప్రకరణంలో బిఠూరుదగ్గిర హావలకుతోడి పోరాడిందే నలభై రెండోపటాలం, అదిగో ఇదే ఆపటాలం.

ఆగస్టు పదహారున వెనకకి వచ్చేశాక తాంతియా మిగిలినసైన్యంతో యమునదాటి నానాసాహెబుదగ్గిరికి ఫతేపురం వచ్చేశాడు; తన జయాపజయాలు నివేదించాడు. మళ్ళీ పటాలం కూర్చుకోవడంకోసం పథకం వేశాడు. ఈసారి మారువేషంలో అతడు గ్వాలియరువెళ్ళాడు. గ్వాలియరు మురారుకంటోన్మెంటులో పటాలం అదునుకోసం చూస్తూనే వుంది. తాంతియాటోపేని చూడడమేతడువు, అతడిమంత్రం వినడమే తడువు — అతడివెంట వచ్చేసింది.

గ్వాలియరునేన కాల్బలమూ, గుర్రపుదళమూ, ఫిరంగిదళమూ — యావత్తూ వెంటవేసుకొని తాంతియానేనాని కాలపీ వచ్చాడు. వ్యూహక దృష్ట్యా కాలపీ అన్నివిధాలా అనుకూలమైన కేంద్రం. అందుకనే తాంతియా కాలపీదుర్గం వశపరుచుకున్నాడు. కాలపీ యమున పడమటి వొడ్డునవున్న చరిత్రాత్మకమయిన నగరం. నదివొడ్డునే దుర్విజయమైన దుర్గముంది. మూడుదిక్కులా మంచి రాతిప్రాకారం, నాలుగోతట్టు యమున. దుర్గం ఎదటే పెద్ద మైదానంమీద కాలపీనగరం. పురాతన కాలంలో ఇక్కడ పెద్దపెద్ద యుద్ధాలు జరిగాయి. ఆయుద్ధాల్లో మరణించిన వీరయోధుల సమాధులు చుట్టుపట్ల నిండివున్నాయి. ఈసమాధులలో పెద్దపెద్ద గుమ్మటాలు ఎనభైనాలుగున్నాయి. అందుకని ఆ మైదానం పేరు "చౌరాసీగుంబజ" అయింది. కాలపీనించి కాన్పురం సలభై ఆరుమైళ్లు.

నానాసాహెబు కాలపీని కేంద్రంగా స్థిరపరిచాడు. కాలపీదుర్గానికి బాలాసాహెబునిపంపాడు. అవాళనించీ బాలాసాహెబు అక్కడివేమ్వా గానూ, తాంతియా టోపే సేనానాయకుడుగానూ ఏర్పడ్డారు.

తాంతియాటోపే కాలపీనించి కాన్పూరుముట్టడికి బయలుదేరాడు. యమునదాటి తన యుద్ధసంభారాలన్నీ జాలనాలో భద్రపరిచాడు. ముందు అతడు కాన్పురం పరిసరగ్రామాలుఆక్రమించుకున్నాడు. సరాసరి కాన్పురం ముట్టడించలే దతడు. అటు సర్వసేనాని కాంబెలు లక్నో యుద్ధంలో మగ్గుడయేనరకూ పొంచి కూచున్నాడు. అవాళ్ల అంటడమే తడువు. ఇటు వింఢముసేనానిమీదికి ఉరకాలని అనడిప్రూహ. విండ్‌ముకూడా మెళుకువలెరిగిన సేనాని. అనడి జీవితమంతాయుద్ధాల్లోనే గడిచింది. తాంతియాటోపే రాకడ గమనిస్తూనేవున్నాడతడు. కలకత్తానించి లక్నోకోసం కాన్పూరుమీదుగా వస్తూవున్న పటాలాలు

కాన్పూరులో ఆపేస్తూ, తాంతియావస్తే తగినజవాబుచెప్పాలని అతడు సిద్ధపడ్డాడు.

అటు లక్నోనించి వార్త అందింది. తాంతియాటోపేముందుకి సాగాడు. శివరాజపురం చేరాడు. దారిలో కీలకస్థానాలన్నీ ఆక్రమించుకున్నాడు. పైనించి కాన్పూరుకి సప్లయిలు అందకండా కట్టుబాట్లు చేశాడు. నవంబరు ఇరవై అయిదున శ్రీఖండినించి బయలుదేరి పాండునది చేరాడు. అక్కడికి కాన్పురం ఆరుమైళ్లు.

తాంతియా ముందుకి సాగడంతోనే వింధము పటాలంతో బయలుదేరాడు. ఉభయసేనలూ ఇరవై ఆరున పాండునదిదగ్గిర ముఖాముఖి తారసిల్లాయి. వింధముసేనాని సరాసరిముందుకి దూసుకువెళ్లాడు. తాంతియావొక అడవిలో పొంచి కూచున్నాడు. ఇంగ్లీషుదండు రావడంతోనే దనాధన్ తుపాకులూ, ఫిరంగులూ తగిలించాడు. ఇరుపక్షాలా ముమ్మరమయినయుద్ధం జరిగింది. తొలివ్యూహంలో తాంతియా ఫిరంగులు మూడు ఇంగ్లీషువాళ్ళ వశమయిపోయాయి. దాంతో తమదేజయమనుకున్నారు వాళ్లు. కాని "విప్లవకారులసేనాని దద్దమ్మకాడు. వింధము కొట్టిన దెబ్బతో తాను భయపడడానికిబదులు, ఇంగ్లీషుసేనాని దౌర్బల్యం ఇట్టే గ్రహించేశా డతడు ..... ఒక తెరిచినపుస్తకంలోనివిషయం చదువుకుని ఎలా తెలుసుకుంటామో, అలాగ వింధముపరిస్థితీ అతడి లోపాలూ తాంతియా ఇట్టే అవగాహన చేసేసుకున్నాడు. తాంతియాలో వొక సిసలయిన సేనానాయకుడిగుణా లున్నాయి. వింధములోని దౌర్బల్య మతడు దివ్యంగా వినియోగించుకున్నాడు." *

మర్నాడు తాంతియాటోపే తనసేనతో నెలవంకవ్యూహం పన్నాడు. ఉదయం పదకుండుగంట లయింది. ఇంగ్లీషుసేన భోజనప్రయ

* Malleson's Indian Mutiny.

క్రాంతియోధుడు

ಕೃಷ್ಣ ಮತ್ತು ಗೋ-

త్నంలో వుంది. తాంతియాసేన కుడి ఎడమలనించి ఆక్రమించుకు వచ్చింది. ఇంగ్లీషుసేన ఇరుకులోపడిపోయింది. ఎలాగో తట్టుకుంటూ పోరాడింది. సాయంకాల మయేసరికి సర్వశక్తులూ సన్నగిల్లిపోయాయి. దాంతో ఎక్కడివస్తువులక్కడ పారేసి పలాయనమంత్రం ఫుచ్చుకుంది; కకావికలయిపోయింది. వేలువేలు డేరాలూ, ఎద్దులూ, ఎంతో అంత భోజనసామగ్రీ, ఎన్నో అన్ని దుస్తులూ విప్లవకారులచేతికి చిక్కాయి. ఈ దెబ్బతో సగంకాన్పూరు తాంతియా స్వాధీనమయింది.

మర్నాడు ఉదయాన్నే తిరిగి యుద్ధమారంభ మయింది. కుడిఎడమల సించి తాంతియా ఫిరంగులు అగ్నిగోళాలు కుమ్మరించాయి. ఇంగ్లీషు సేన మట్టిగోడ వెనకనుంచుని పోరాడింది. సూర్యుడు నడినెత్తికి వచ్చే దాకా దారుణమైన యుద్ధంజరిగింది. బ్రిగేడియరు విల్సను కూలి పోయాడు. కెప్టెను ఎమ్‌క్రియా ఎగిరిపోయాడు. మార్ఫీ, మేజరు స్టర్లింగు, లెఫ్టినెంటు గిబ్బన్సు — ఒక్కడూ మెరికల్లాంటివాళ్ళు రాలిపోయారు. సాయంకాలమయేసరికి ఇంగ్లీషుసేన సర్వనాశనమయిపోయింది. చావగా మిగిలినవాళ్ళు ఫుంజాలు తెంపుకు పారిపోయారు. విజయలక్ష్మి తాంతి యాటోపేని వరించింది. కాన్పుర మతడి హస్తగతమయిపోయింది.

"ఇవాళయుద్ధం విని మీరు సిచ్చెరపోతారు. ఇంగ్లీషుసేన తన విజయధ్వజాలూ, బిగురుపలుకులూ, వీరత్వాలూ ఎల్లా మంటగలిపేసి పలాయనం స్వీకరించిందో దీనివల్ల మీకు అర్థమవుతుంది. మనం తక్కువవాళ్ళని భావించి, పీడించే ఆభారతీయసైనికులే ఇంగ్లీషువాళ్ల స్థావరంలాక్కున్నారు; వెంటదరిమారు; సర్వస్వమూ పట్టుకుపోయారు. శరంగీలని చిదకగొట్టామని చెప్పుకునే అవకాశం వాళ్ళకి లభించిం దిప్పుడు. చిత్తుగా దెబ్బతినేసి ఇంగ్లీషు సైనికులు పారిపోయారు. ఒంటెలూ, ఏనుగులూ, గుర్రాలూ, సేనకులూ — అన్నీ వొదిలేసి

పారిపోవచ్చారు. వాళ్లపరికరాలూ, తినుబండారాలూ విప్లవకారులు లాక్కున్నారు. ఇదంతా ఎంత సిగ్గుచేటు!"*

తాంతియా కాన్పూరు మీద పడుతున్నాడన్న వార్త లక్నోలో కాంబెలుకందింది. అతడు హుటాహుటిని లక్నో నించి బయలుదేరడం గతప్రకరణంలో తెలుసుకున్నాం.

ఏడువేల ఫౌజుతోనూ, సుమారు రెండువేలమంది దొరసానులూ, పిల్లలూ వాళ్ళతోనూ సర్వసేనాని సర్ కాలిను కాంబెలు లక్నోనించి బయలుదేరాడు. ఈదొరసానులూ వాళ్ళూ లక్నో రెసిడెన్సీలో బందీలుగా వుండేవాళ్లు. వాళ్ళలో చాలామంది రోగులు. కొంతమంది గాయపడ్డవాళ్ళు.

కాంబెలురాకవిని తాంతియా టోపే దారిలో అయోధ్యనగ్గిర గంగానదిమీద వంతెన విరగొట్టేశాడు. అక్కడ ఫిరంగులుకూడా నిలబెట్టాడు. కాంబెలు అది కనిపెట్టి ఇంకోదగ్గిర గంగదాటి వచ్చేశాడు. నవంబరు ముప్ఫయిని విండ్‌హము వోడిపోయినరాత్రే అతడు కాన్పూరు చేరుకున్నాడు.

మర్నాడు కాంబెలు సేనని తాంతియా ఖిరాయించాడు. అవాళా ఆమర్నాడూ కూడా కాంబెలుడేరామీద ఫిరంగులు కాల్పించాడు.

తాంతియాటోపే రాణువ అప్పుడు పదివేలదాకా వుంది. నానా సాహెబూ, కుమారసింహుడూ కూడా వచ్చి ఈయుద్ధంలో పాల్గొన్నారు.

డిసెంబరు ఆరు ఉదయం కాంబెలు తాంతియామీద దారుణమయిన దాడి ప్రారంభించాడు. సిక్కులు 'డబులుమార్చి' మొదలు పెట్టారు. వాళ్ళ వెనక తెల్లసోల్జర్లతో పీలు తరుముకువచ్చాడు.

* Charles Ball's Indian Mutiny.

హోరాహోరి పోరాటం సాగింది. విప్లవసేన వీగిపోయింది. అంతతో కాంబెలు వూరుకోలేదు. మూన్సుఫీల్డు నాయకత్వంకింద కొంతసేన బిహారుకేసి పంపాడు. విప్లవకారులు మూన్సుఫీల్డు నెదిరించారు. నానా సాహెబుస్వయంగా పోరాటం నడిపించాడు. తాంతియాని పట్టుకోవాలని కాంబెలు పెద్దవ్యూహం పన్నాడు. కాని ఫలించలేదు. తొమ్మిదిని తాంతియా తనసేనతో గంగానది దాటుతున్నాడు. హోఫుగ్రాంటు అతణ్ణి వెంబడించాడు. కాని తాంతియా వీరసింహం పట్టుపడలేదు. తెల్ల ఫౌజు తెల్లమొహం వేసింది. అయితే విప్లవకారుల ముప్ఫయిరెండు ఫిరంగులు ఇంగ్లీషువాళ్ళు పట్టుకున్నారు. విప్లవసేన కొంత కాలపీ తట్టూ, కొంత అయోధ్యతట్టూ పారిపోయింది. కాన్పూరులో మళ్లీ ఇంగ్లీషుజెండా ఎగిరింది.

ఈవిజయం సాధించాక కాంబెలు సరాసరి వెళ్లి బిహారుమీద విరుచుకుపడ్డాడు. పేష్వాల బిహారుదుర్గం కొల్లగొట్టాడు. అంతతో అతడి కోపాగ్ని చల్లారలేదు. బిహారుదుర్గం ధ్వంసంచేశాడు. అక్కడి దేవాలయాలూ అవీ పడగొట్టేసి బుగ్గిలో కలిపేశాడు.

ఫ లే గ డ ం

కాన్పూరు మళ్ళీ ఇంగ్లీషువాళ్ళ వశమయింది. లక్నో చేరుకొనే ముందు అయోధ్యపడమటిభాగాలూ, ఢిల్లీతూర్పుభాగాలూ వశపరచుకోవాలని పథకంవేశాడు కాంబెలు. జనరలు వాలుపోలుని కొంత పటాలమిచ్చి కాలపీరోడ్డుగుండా కాన్పూరుఉత్తరంగా పంపాడు. ఆలీగడం దిగువగుండా కొంతసేనతో సీటనుసేనానిని పంపాడు. ఈ ఉభయులూ విజయాలుసాధిస్తూ వచ్చి మినుఘుడిదగ్గిర కలుసుకోవాలని నిర్ణయంచేసుకున్నారు. ఇలా ఇది పూర్తయేసరికి ఈయావత్తుప్రదేశంలోని విప్లవకారులుఫతేగడం చేరుకుంటారు. అప్పుడు తనసేనతో

కాంబెలుస్వయంగా ఇటు కాన్పురంనించి బయలుదేరతాడు. సీటనూ, వాలుపోలులూ రెండుదిక్కులనించీ వస్తారు. ఇలామూడుదిక్కులా ఫతేగడం ఆక్రమించాలని కాంబెలుపథకం.

డిసెంబరు పద్దెనిమిదిని వాలుపోలు కాన్పురంనించి కాలపీరోడ్డు మీదుగా దండయాత్ర ప్రారంభించాడు. దారి కిరుపక్కలా విధ్వంస క్రీడసాగిస్తూ ఇంగ్లీషుసేన నడిచింది. అక్కడక్కడ విప్లవకారు లెదిరించారు. చిన్నచిన్న పోరాటాలు జరిగాయి. అలా వెళ్ళివెళ్ళి వాలుపోలు ఇటావా చేరేసరికి పెద్ద అవాంతరం వచ్చింది. సరిగ్గా సైన్యం వెళ్తుతూన్న దారికి అడ్డంగా ఎత్తయిన చిన్న భవనముంది. భవనం కప్పు మీదా, గోడలకీ రంధ్రాలున్నాయి. రంధ్రాలలో తుపాకులు గురిపెట్టి వున్నాయి. లోపల విప్లవకారులున్నారు. ఎంతమంది? షట్టుమని పాతికమంది. ఇంత ఇంగ్లీషుసేననీ ఆపాతికమందీ అడ్డగించి నిలబెట్టే శారు. యుద్ధంచేసికాని ఎత్తయిన అడుగయినా ముందుకి వెళ్ళలేక పోయాడు వాలుపోలు. ఫిరంగులు పేల్చి విప్లవకారుల్ని బెదరగొట్టాలని చూశాడు. లాభంలేకపోయింది. విప్లవకారులు ధనంతా వెనకాడ లేదు. అంతఇంగ్లీషుసేనని గెలవలేమని వాళ్ళకి తెలుసు. అయితేనేం, మాతృదేశంకోసం, స్వధర్మంకోసం బొందెలో ప్రాణమున్నంతవరకూ శత్రువుని ముందుకి సాగనివ్వమనే వాళ్ళ శపథం.

"ఎంతోమందిలేరు వాళ్ళు. వాళ్ళదగ్గిర సామాన్యమైనతుపాకులు మాత్రమే వున్నాయి. వాళ్ళలో ఎక్కువ ఉత్సాహంమాత్రముంది. సర్వమూ తెగించినవాళ్ళ ఉత్సాహంకంటేనూ కూడా భయంకరమయిన ఉత్సాహ మది. పవిత్రమయిన తమ ఆదర్శంకోసం ప్రాణాలు బలి పెట్టాలని నిశ్చయించుకున్న మహోత్సాహ మది. అభవనం వాలు పోలు పరికించాడు. ఒక పటాలాన్ని ఉపడాసికిఅది విసరంతా పనికి రాదు. ఇట్టే దాన్ని వూదేసి సాధ్యమవుతుంది.....ముందు చేతి

బాంబులు భవనంలోపలికి విసిరారు. లోపల ఉక్కిరిబిక్కిరయి పైకి వచ్చేటట్లు గడ్డిగాదా మంటబెట్టి పొగబెట్టారు. కాని ఈప్రయత్నాలేవీ ఫలించలేదు. రంధ్రాలలోంచి విప్లవకారులు విరామంలేకుండా తుపాకులు పేలుస్తూనేవున్నారు. ఇలా వాలుపోలుసేనని అపాతికమంది వీరులూమూడుగంటలకాలం నిదలనివ్వకుండా అడ్డుకొన్నారు. తుదకి భవనం ఎగరగొట్టయ్యడానికే నిశ్చయించాడు వాలుపోలు. మిలిటరీ ఇంజనీర్లు భవనంకింద మందుగుండుతూటాలు కూరారు; సిద్ధంచేశారు. భవనం కూలిపోయింది. సహీదులు తాము కోరుకున్న గౌరవం తమకి లభించింది. వాళ్ళు పాతికమందీ ఆ శిథిలాల్లో సమాధైపోయారు."*

వాలుపోలు ఇటూవా వచ్చేసరికి సీటను ఆలీగడం, కాశీగంజి మీదుగా మినుఘరి చేరుకున్నాడు. దారిలో ఇతడునూ సంహారక్రీడ సాగించాడు. విప్లవకారులతోపోరాటాలు జరిపాడు. వాలుపోలూ, సీటనులు ఉభయులూ 1858 జనవరి ఎనిమిదిని మినుఘరిలో కలుసుకున్నారు. అనుకున్నపథకంప్రకారం సర్వసేనానికాంబెలు ఘర్రూఖాబాదురాజధాని ఘతేగడం బయలుదేరాడు. దారిలో కాలీనదిదగ్గిర విప్లవకారులు ఫిరంగులతో ఎదిరించారు. ఇంగ్లీషుపటాలంలో కొంత మంది రాలిపోయారు. అయితే బ్రిటిషుఫిరంగులముందు విప్లవకారుల ఫిరంగులు పనికిరాలేదు. నందలునందలు విప్లవకారులు వీరగతిపొందారు. మిగిలినవాళ్ళు పారిపోయారు. మరో నాలుగుమైళ్ళుకాంబెలు వెళ్ళాడోలేదో, మళ్ళీ విప్లవకారు లెదిరించారు; మళ్ళీ ఓడిపోయారు.

కాంబెలు ఘతేగడం చేరేసరికి వాలుపోలూ, సీటనూ కూడా చేరుకున్నారు. మూడుసేనలూ ఘతేగడం ముట్టడించాయి. కొన్నాళ్ళ దాకా ఘోరమయిన యుద్ధంజరిగింది. విప్లవకారులు ఘతేగడం దుర్గంలో

---

* Malleson.

పదిలక్షలరూపాయల సామానులూ అవీ వొదిలేసి రోహిలాఖండం వెళ్లిపోయారు. జనవరి పద్నాలుగున ఫతేగడం ఇంగ్లీషువాళ్ళు వశపరుచుకున్నారు. ఫర్రూఖాబాదు నవాబు తఫజులు హుసేనుని అరస్టుచేశారు, ఉరితీసేశారు. ఉరితీసేముందు అతడివొంటిసిండా పందికొవ్వు పులిమారు.

ఈ యుద్ధంలో నానాసాహెబు సేనానాయకులలో వొకాయన నాదిరఖానుకూడా పట్టుబడిపోయాడు. అతన్నికూడా వురితీసేశారు. ఉరికంబమెక్కుతూ నాదిరఖాను వొట్టువేసి, భారతీయులకి సందేశమిచ్చాడు—"కత్తులుదూయండి. ఇంగ్లీషువాళ్ళని తరమండి. స్వరాజ్యం స్థాపించండి."

ఫతేగడంలో కాంబెలు వొక పక్షం దినాలు మకాంవేశాడు. చుట్టుపట్ల ఇంగ్లీషుసేన నానాబీభత్సంచేసి వొదిలిపెట్టింది. పాలందగ్గిర వొక పెద్ద మర్రిచెట్టు వుండేది. కనిపిస్తేవాణ్ణల్లా పట్టుకువచ్చి అమర్రి చెట్టుకొమ్మలకి వురితీసేశారు. చెట్టుసిండా శవాలు వేలాడాయి. కొమ్మలన్నీ నిండిపోయాయి. తుదకి సిపరంతస్థలమూ లేకండా అయిపోయింది.

లక్నో పతనమైపోయింది

జెనరల్ నాయకత్వంకింద కాంబెలు అక్టోబరులో పట్టిన నాలుగువేల సేనా ఆలంబాగులో వుంది. లక్నో పట్టణంమాత్రం విప్లవకారుల చేతిలోనేవుంది. ఖైజరుబాగులో హజరతు మహలు ఆకుపచ్చజెండా ఎగరవేస్తూ రాజ్యమేలుతూనే వుంది. అన్నిదండయాత్రలు చేసినా లక్నో ఇంగ్లీషువాళ్ళ వశంకాకండా వుండడానికి అక్కడ మౌల్వీ అహమదుషా నాయకత్వమే ముఖ్యకారణం. అయోధ్యలోని విప్లవనాయకులలో అహమదుషా శిరోమణి.

మళ్లీ కాంబెలు లక్నోనచ్చేలోపున ఆలంబాగు జెనరల్‌నేసని హతవారచ్చెయ్యాలని అహమదుషా సంకల్పం. అయితే ఢిల్లీలో

బఖ్ఖాను మచ్చరించుకున్నట్టే అహామదుషాని కొంతమంది విప్లవ నాయకులు మచ్చరించుకున్నారు. లేనిపోని కుట్రలున్నూ పన్నారు. బేగం హజరతు మహలుచేత తుదకు కణ్ణణ్ణి అరస్టుచేయించారు. అంచేత అహామదుషా సంకల్పం నెరవేరలేదు.

అహామదుషా అంటే అయోధ్య ప్రజలకి ప్రాణం. అణ్ణణ్ణి హజరతు మహలు నిర్బంధించడంతోనే వాళ్ళలో అసంతృప్తి పెరిగింది. హజరతు మహలుమీద ఎంతోఅంత వొత్తిడి తెచ్చారు. చాంతో హజరతు మహలు తనపొరపాటు తాను తెలుసుకుంది. అహామదుషాని వొదిలి పెట్టేసింది. తిరిగీ అతడు నాయకత్వం వహించాడు. తనని నిర్బంధించినా హజరతుమహలుమీద అతడు పగపట్టలేదు. అతడి పగంతా ఇంగ్లీషువాళ్ళమీద మాత్రమే.

అలంభాగు ఇంగ్లీషునేలమీద విప్లవకారులు ఎన్నోసార్లు దాడి చేశారు. అన్నిసార్లూ ఏమగుమీదో, గుప్రంమీదో అహామదుషా ముందేవుండి ఇంగ్లీషువాళ్ళతో పోరాడాడు. అతడు ముందువుంటే చాలు, విప్లవసేన రెట్టించిన ఉత్సాహంతో యుద్ధంచేసేది.

ఆనవరి పదిహేనున విప్లవకారులకి వార్త అందింది — "ఇంగ్లీషు వాళ్ళ భోజనసామగ్రులు కాన్పూరునించి లక్నోకి వస్తున్నాయి." అవి పట్టుకుందికి మౌల్వీ అహామదుషా తన అనుచరులతో బయలుదేరాడు. వేగులవాళ్ళవల్ల ఇది బ్రిటిష్‌వాళ్ళకి తెలిసిపోయింది. అడ్డంగావెళ్ళి అహామదుషాని ఎదిరించాడతడు. ఉభయులకీ పోరాటం జరిగింది. చేతిమీద గుండుదెబ్బ తగిలి అహామదుషా పడిపోయాడు. అణ్ణణ్ణి పట్టుకోవాలని అహామదుషా ఎంతయినా ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. అహామదుషా అనుచరులు కణ్ణణ్ణి డోలీమీద వేసుకుని తప్పించుకు వచ్చేశారు.

జనవరి పదిహేనున వైదేహీహనుమాను నాయకత్వంవహించి పోరాటం సాగించాడు. ఉదయం పదినించి సాయంకాలం ఆరుగంటల దాకా యుద్ధంజరిగింది. తుదకి హనుమానుసేనాని గాయపడి దొరికి పోయాడు. సిపాయిలు చెల్లాచెదురయిపోయారు. బేగం హజరతు మహలు వాళ్ళందరినీ కూడగట్టుకు వచ్చింది. ఆదినాళ్లోనే ప్రధాన మంత్రి రాజా బాలకృష్ణసింగు కాలం చేశాడు.

నెలదినాళ్లో అహమదుషా కోలుకున్నాడు. ఫిబ్రవరి పదిహేనున మళ్ళీ రంగంలో ప్రత్యక్షమయాడు. కాంబెలు వచ్చేలోపున ఔట్రాము పని పట్టించెయ్యాలని అత డెంతయినా ప్రయత్నించాడు. ఒకనాడు బేగం హజరతుమహలు స్వయంగా కత్తిపట్టి గుర్రమ్మీద రణరంగంలో ప్రత్యక్షమయింది. ఎంతజరిగినా కొందరి నాయకులలో పరస్పరస్పర్ధ కారణంగా విప్లవకారులకి విజయంమాత్రం దుర్లభమయింది.

ఫతేగడం జయించాక మరింత కొత్తబలగంచేర్చుకున్నాడు. సర్వ సేనానికాంబెలు. ఇరవైఏడువేల కాల్బలమూ, అయిదువందల గుర్రపు దళమూ, వందా ముప్ఫయినాలుగు ఫిరంగులూ — ఇంత బ్రహ్మాండమైన రాణువత్తో అతడు ఫిబ్రవరి ఇరవైమూడున గంగదాటి లక్నో మీదికి నడిచాడు. అయోధ్యమైదానాలమీద ఇంతమహాసైన్యం ఎన్నడూ అవుపించలేదు. ఈ దండు దారికడ్డూకూ చేసిన విధ్వంసం వర్ణించరాంది. మిడతలదండుపడితే పంటచేలూ, చెట్టుచేమలూసర్వనాశనమయినట్లు కాన్పూరునించి లక్నోదాకా దేశంసర్వనాశమంబాలా అయిపోయింది. గ్రామాలు భస్మరాసులయాయి.

ఒకదగ్గిర వొక భవనంలో కొంతమంది సిపాయిలు తారసిల్లారు. ఒకదళం ఇంగ్లీషుసేన వాళ్ళ నాక్రమించింది. సిపాయిలు వీరత్వంతో పోరాడారు. ఇంగ్లీషుసేన వెనకకివచ్చేసింది. తరవాత ఫిరంగులతో సిపాయిలభవనం ముట్టడించింది. భవనంలోని సిపాయిలందరూ

హతవై పోయారు. ఒక్కడుమాత్రం సగంప్రాణాలతో మిగిలాడు. ఇంగ్లీషుసోల్జరులూ, సిక్కు-సిపాయిలూ అతడిమీద పడ్డారు. చెరో కాలూపట్టుకుని, జరాసంధుణ్ణి భీముడుచీల్చేసినట్లు చీల్చేయడానికి ప్రయత్నించారు. సాధ్యంకాలేదు. తుదకి మంటల్లోపడేసి కాల్చేశారు. అదిగో అలాగకసిదీర్చుకుంటూ నడిచింది కాంబెలుసేన.

లక్నో పడమటినించి ఈఇంగ్లీషుదండు బయలుదేరింది. అటు పెద్ద ఘూర్ఖాసేనతో నేపాలునించి ప్రధానమంత్రి జంగుబహదూరు ఇంగ్లీషు వాళ్ళ సహాయంకోసంబయలుదేరాడు. విప్లవమారంభమయిన మొదటి రోజులలోనే లక్నోనించి సర్ హెన్రీ లారెన్సు నేపాళప్రభుత్వాన్ని సహాయం కోరాడు. గత ఆగస్టుమాసంలో మూడువేలమంది ఘూర్ఖా సైనికులు నేపాళం కట్మండూనించి అయోధ్యతూర్పున అజంగడం, గైసపురం మీదికి దిగారు. గోరఖపురం విప్లవనాయకుడు మహమ్మదు హుసేను వాళ్ళ నెదిరించాడు. ఇంగ్లీషువాళ్ళు యమున పార్శ్వప్రదేశాల్లో పోరాడుతూవుంటే మహమ్మదుహుసేనూ, వేణీమాధవుడూ, రాజా నాదిరఖానూ కాశీచుట్టుపట్లా, అయోధ్యతూర్పుభాగాలూ పూర్తిగా ఆక్రమించుకున్నారు. తరవాత జంగుబహదూరుతో ఇంగ్లీషు వాళ్ళు వొక వొడంబడికచేసుకున్నారు. అందుకనేతిరిగీ డిసెంబరు ఇరవైమూడున తొమ్మిదివేల ఘూర్ఖాసేనతో జంగుబహదూరు ఇంగ్లీషు వాళ్ళ సహాయంకోసం అయోధ్యమీదికి దండెత్తి వచ్చాడు. అంతే కాదు. మరి రెండుసేనలుకూడా — వొకటి జనరలు ఫ్రాంక్సు నాయకత్వంకిందా, రెండోది జనరలు రోక్రాఫ్టు నాయకత్వంకిందా తూర్పునించి అయోధ్య బయలుదేరాయి. ఈ మూడుసేనలూ 1858 ఫిబ్రవరి ఇరవైఅయిదున మాఘురానది దాటి అంబరపురం ప్రవేశించాయి.

అంబరపురంలో వొక చిన్న కోటవుండేది. కోటమీద ఆకుపచ్చజెండా ఎగురుతూ వుండేది. అందులో ముష్ఠయిసలుగురు

సిపాయిలుమాత్రం వుండేవాళ్ళు. ఈ కోటమీద జంగుబహదూరు సేనావాహిని విరుచుకుపడింది. ముష్ఠయినలుగురు సిపాయిలతో తొమ్మిదివేలమంది ఘూర్ఖాలు! అధర్మయుద్ధమంటారా? గొంగళీలో తింటూ వెంట్రుకలుపరడం దేనికి? ముష్ఠయినలుగురు సిపాయిలూ స్వరాజ్యంకోసం పోరాడారు. పోరాడుతూ పోరాడుతూ వీరస్వర్గం చూరగొన్నారు. నేపాళసైన్యంలో ఏడుగురు మరణించారు. నలభై ముగ్గురు గాయపడ్డారు.

తూరుపుతట్టు ఇంగ్లీషుసేనలు వస్తున్నాయన్న వార్త లక్నోదర్బారులో తెలిసింది. గఫూరుబేగు నాయకత్వంకింద కొంతసేన హజరతు మహలు పంపింది. నవాబు వజీదాలీఫిరంగిదళానికి గఫూరుబేగు నాయకుడుగా వుండేవాడు. సుల్తానుపురందగ్గిర జనరలు ఫ్రాంక్సుసేనని గఫూరుబేగు ఎదిరించాడు. హోరాహోరీ పోరాటం జరిగింది. గఫూరుబేగు ఓడిపోయాడు.

సుల్తానుపురంనించి జనరలు ఫ్రాంక్సు దారారుదిక్కు మళ్ళాడు. దారారుకోట స్వాధీనంచేసుకున్నాక, లక్నో వెళ్ళాలని అతడి వ్యూహం. కాని విప్లవకారు లిక్కడ అతడిఆట సాగనివ్వలేదు. తుదకతడు దారారులో వీగిపోయాడు. ఈ చేతకానితనాని కతణ్ణి జనరల్సుజాబితానించి కాంబెలుతీసిపారేశాడు.

ఇలా ఇటు పడమటినించి బ్రహ్మాండమైన కాంబెలురాణువా, అటు తూరుపునించి జంగుబహదూరుదండూ, ఫ్రాంక్సు రోక్రాఫ్టుల సైన్యాలూ 1858 మార్చి పదకుండున లక్నోదగ్గిర చేరుకున్నాయి. ఆలంబాగులో ఔట్రామ్‌పటాలం వుండనేవుంది. అలా మొత్తం నలభైవేలసైన్యం కాలిను కాంబెలునాయకత్వంకింద లక్నోమీద దాడికి సిద్ధమయింది. ఒకమహాయుద్ధంలో ప్రయోగించినంతసేన కుంపినీ

వాళ్ళు లక్నోని మీద ప్రయోగించారంటే, స్వాతంత్ర్యసమరంలో లక్నో ప్రాముఖ్యత ఎలాంటిదో అర్థమవుతుంది.

పట్నంబైట ఆలంబాగులో ఇంగ్లీసేనలు డేరావేశాయి. పట్నంలో ఆకుపచ్చజెండా లెగురుతున్నాయి. అయోధ్యరాజ్యంలోని యావ న్మంది విప్లవకారులూ — ముప్ఫయివేలమంది సిపాయిలూ, యాభై వేలమంది స్వయంసేవకులూ లక్నోపట్నం చేరుకున్నారు. వీధివీధీ కాపలాలువేశారు. గల్లీగల్లీ యుద్ధంకోసం సిద్ధంచేశారు. ప్రతీఇంటి గోడలూ తుపాకులకోసం రంధ్రాలుచేశారు. ప్రతీవాకిలీ, ప్రతీగడపా తుపాకులతో నింపారు. ప్రతీమలుపులోనూ, క్వైజరుబాగు సలు పక్కలా ఫిరంగులుపెట్టారు. పట్నం ఉత్తరందిక్కు గోమతినది ప్రవ హిస్తూవుంది. అంతవరకూ జరిగిన దాడులలో గోమతికేసి ఇంగ్లీషు వాళ్ళు నొక్కసారీ రాలేదు. అందుకని విప్లవకారులు ఆమట్టుమాత్రం ఉపేక్షించారు. తక్కినమూడుదిక్కులా మూడేసివరసలుగా రక్షణ లేర్పరిచారు. ఉత్తరందిక్కు రక్షణలేకపోవడం ఇంగ్లీషుసేనాని కని పెట్టారు. మార్చి అయిన ఆతర్వాత బొట్రాము దాడిప్రారంభించాడు. కాంబెలు తనసైన్యం విభాగించి అటు ఉత్తరందిక్కూ, ఇటు తూర్పు దిక్కూ — రెండుదిక్కులా ముట్టడిప్రారంభించాడు. ఉత్తరందిక్కు ఆక్రమణజరగడంతోనే విప్లవకారుల ఏర్పాట్లన్నీ తారుమారయి పోయాయి. అయితేనేం పగలూ రాత్రీ వాళ్ళు భీషణంగా పోట్లా డారు. లక్నోవీధులు రక్తంనదులై ప్రవహించాయి. మార్చి ఆరు నించీ పదిహేనువరకూ విరామంలేనియుద్ధం జరిగింది. దిల్‌ఖుష్‌బాగు, కదంరసూలు, షానజీఫ్, బేగంకోఠీ — వొక్కక్కటీ జయిస్తూ ఇంగ్లీషు సేనలు తోసుకువెళ్ళాయి. ముఖ్యంగా సిక్కుదళాలూ, ఘూర్కా సేనలూ తెగించి పోరాడాయి. వేలకొద్దీ విప్లవకారులు బొందెలో ప్రాణమున్నంతవరకూ శత్రువునిముందుకి సాగనివ్వలేదు. ఈయు

ద్ధంలో మార్చి పదిని, లోగడ ఢిల్లీలో శాహజాదాల ఉడుకునెత్తురు తాగిన హడ్సను హతవైపోయాడు. పద్నాలుగున ఇంగ్లీషుసేన రాజ భవనం కైజరుబాగులో ప్రవేశించింది.

ఈలోగా బాలనవాబు బిర్జిసు కద్రతో బేగంహజరతుమహలూ, మూల్వీ అహమదుషా రహస్యమార్గంలోంచి లక్నోనొదిలి వెళ్లిపోయారు. హజరతుమహలునీ, బాలనవాబునీ భద్రంగా బైటచేర్చేసి, చుట్టూ తిరిగి కొద్దిమంది అనుచరులతో అహమదుషా మళ్లీ లక్నోలో ప్రవేశించాడు. అయోధ్య పడిపోనేంగాక, దానిపేరుమాత్రం పడిపోకూడదు. అదీ అహమదుషా దీక్ష. విజయగర్వంతో వున్న ఇంగ్లీషు సేనమీద తనకొద్దిమంది అనుచరులతోనే విరుచుకుపడ్డా డతడు. "మూల్వీ అహమదుషా అవాళ కనీవినీ ఎరగనంత వీరత్వంతో యుద్ధం చేశాడు. శత్రువుల కెంతోనష్టం కలిగించాడు. అయితే సముద్ర మంత ఇంగ్లీషుసేనని గెలవడం అసాధ్యమని గ్రహించి చివరికి లక్నో నించి వెళ్లిపోయాడు."

ఇంగ్లీషుసేన అతణ్ణి ఆరుమైళ్ళదాకా వెంటాడింది. ఫ్చ్! ఆవీరాధి వీరుడు అందకండా వెళ్ళిపోయాడు.

లక్నో పడిపోయింది.

శవాలమీద పడ్డ రాంబందుల్లాగ ఇంగ్లీషువాళ్ళు పట్నంమీద విరుచుకు పడ్డారు. కసితీర్చుకున్నారు. అవి హత్యలుకావు, అవి దోపుళ్లు కావు, అవి హింసలుకావు — ఆరాత్రుసకృత్యాలు తలుచుకుంటే శరీరం గగుర్పొడుస్తుంది. హృదయం బద్దలవుతుంది. ఆడామగా విచక్షణలేకండా, పిల్లాపిచ్చికాఅనకండా కళ్లుమూసుకుని సరికిపారేశారు. శవాలనికూడా అవమాన పరిచారు.

"కొంతమంది సిపాయిలు ఇంకా బతికేవుంటే, వాళ్లని 'దయ తలచి' చంపేశారు. కాని అందులో ఒకణ్ణి ఇసుకమైదానంలోకి

ಚಿತ್ರ ೪೫ – ಕೆಂಪು ಕಾಗೆ

మియా-మీరు కవాతు మైదానం (సిపాయిల ఆయుధాలు లాక్కు-న్నప్పటి దృశ్యం)



1. ఉరికంబాలు 2. కాల్చివ్యాడంకోసం [illegible] బిగింపులు 3. ఇంగ్లీషు సోల్జర్లు
4. గుఱ్ఱపుకళ్ళం 5. బిగింపేసు 6. సిపాయిలు 7. 78, 29, 27, 51, 64, 5, 97 పటాలాలు 8. సిక్కు-పటాలాలు

ఈడ్చుకవచ్చారు. అతడి కాలుపట్టుకుని గొరగొరా వొక అనువయిన చోటికి లాక్కువచ్చారు. కొంతమంది ఇంగ్లీషుసోల్జర్లు బైనెట్లతో అతడి మొహంమీదా, వొంటిమీదా పొడిచి వేలాడదీశారు. తక్కిన వాళ్ళు ఫుల్లా ఫుల్లాఏరి చిన్నచితి తయారుచేశారు; నిప్పంటించారు. నిప్పురాజుకోగానే బతికేవున్న అతణ్ణి కాల్చడం ప్రారంభించారు. ఇది ఇలా జరుగుతూవుంటే ఎదురుగుండా కొంతమంది ఆఫీసర్లు తమషా చూస్తూ నుంచున్నారు. ఈరాక్షసక్రం అంతతో ఆగలేదు. ఆదారాబ్గ్యుడు సగంకాలుతూ చావుబతుకుల్లో తప్పించుకు పోబోయాడు. చప్పున చితిమీంచి లేచాడు. కాలినమాంసం ఎముకల్లోంచి వేలాడుతూనేవుంది. చితిమీంచి, గెంతేసి పరిగెత్తాడు. రెండడుగులు వెళ్ళాడో లేదో, తిరిగీఅతణ్ణి పట్టుకున్నారు. చితిమీదికి తీసుకువచ్చారు. బైనెట్లతో దబాయించి పడుకోబెట్టారు. నిండు ప్రాణాలతో కాలిపోయే దాకా అలాగేవుంచారు."*

"కైజరుబాగులో జనసంహారం జరుగుతూవుంది. భయభ్రాంతుడయిన వొకబాలుడూ, వొకముసిలాడూ ఇంగ్లీషు ఆఫీసరు దగ్గిరికి వచ్చారు; ప్రాణభిక్షవేడారు. ఇంగ్లీషు ఆఫీసరు తన పిస్తోలు గురిపెట్టాడు. గుండు ముసిలాడి నుదురు బద్దలుచేస్తూ వెళ్ళిపోయింది. రెండోసారి బాలుడిమీద గురిపెట్టాడు ఆఫీసరు. గుండుపేలింది; తప్పిపోయింది. మళ్ళీ గురిపెట్టాడతడు. మళ్ళీతప్పిపోయింది. ఇంకోసారి గురిపెట్టాడు. అదీ తప్పిపోయింది. నాలుగోసారి మళ్ళీ గురిపెట్టాడు. ఈసారిగుండు బాలుణ్ణి దూసుకుంటూ వెళ్ళిపోయింది. ఆ అమాయకుడి లేతరక్తం ఆఫీసరుకాళ్ళముందు ఎర్రగా ప్రవహించింది! ఇలాంటి దారుణాలు ఎన్నని! ఎన్నని!!"

Russells' Diary.

నాగరికులమని చాటుకునే ఇంగ్లీషువాళ్ళు వందేళ్ళక్రితం ఈ భారత భూమిలో చేసిన నాగరికచర్య లివి! మరి అనాడే, అక్కడే భారతీయులు చూపిన ఔదార్యం పరికించండి!

విప్లవకారుల విజృంభణం అధికంగావుంది. లక్నో జైల్లోదొరలూ, దొరసానులూ మూడుమాసాలు నిర్బంధంలోవున్నారు. పిసరంతవాళ్ళకి ప్రాణాపాయం జరగలేదు. తరవాత ఇంగ్లీషుసేనలు వచ్చి విచక్షణ లేకండా సంహారక్రీడ సాగించినప్పుడు, వొళ్ళుమండిన విప్లవకారులు హజరతుమహలు దగ్గిరికివెళ్ళి జైల్లోని ఇంగ్లీషువాళ్ళని అప్పగించమని పట్టుబట్టారు. ఏడెనమండుగురు దొరల్ని ఆమె విప్లవకారులపరంచేయక తీరిందికాదు. వాళ్ళని వెంటనే విప్లవకారులు తుపాకులతో కాల్చేశారు. అంతతో వూరుకోలేదు వాళ్లు. దొరసానుల్నికూడా అప్పగించమన్నారు. "హజరతుమహలు అంగీకరించలేదు. వాళ్ళని వెంటనే తన జనానాలోకి తీసుకుపోయింది ఆమె. ఆమెపర్యవేక్షణకింద వాళ్ళని భద్రంగా కాపాడింది. బేగంచేసిన ఈపని స్త్రీజాతిగౌరవం ఇనుమడించింది."*

పట్నంలో జరిపిన ఘోరాలతో ఇంగ్లీషువాళ్ళు శాంతించలేదు. రాజమహలు క్రైజరుబాగులో కూడా మహత్యాకాండ సాగించారు. అంతఃపురంలో చొరబడ్డారు. అన్నెమూపున్నెమూ ఎరగని ఎంతో మంది ఆడవాళ్ళని చిత్రవధచేశారు. ఎండకన్నెరగని బేగములని ఎంతో మందిని ఖైదులోపెట్టారు. ఒకినాడు జైలుకాపలావాళ్ళు ఈ బేగముల సడిగారు — "సమరం ముగిసిందని మీరు ఇంకానమ్మకుండంలేదా?"

బేగము లేమన్నారో తెలుసా? "ఎంతమాత్రమూ జరగదది. చివరికి మీరే దెబ్బతినిపోతారు. ఈ నమ్మకం మాకు పూర్తిగావుంది."

* Charles Ball's Indian Mutiny.

కుమారసింహుడు

ఆరాకోట విన్సెంటు ఏరే వశపరుచుకున్నాడు. కుమారసింహుడు జగదీశపురం వచ్చేశాడు. ఇంగ్లీషువాళ్ళు జగదీశపురం ముట్టడిస్తారని విని అతడు సైన్యం కూర్చుకోడం మొదలుపెట్టాడు. ఇదంతా 'విప్లవం విజృంభించింది' శీర్షికలో తెలుసుకున్నాం.

అనుకున్నట్టుగానే ఏరే ఆరానించివచ్చి జగదీశపురంముట్టడించాడు. కుమారసింహుడు ఎనిమిదిరోజులు యుద్ధాలు చేశాడు. కోటలోనుండి ఇంగ్లీషుసేనని ఎదిరించడం అసాధ్యమని తుదకి గ్రహించాడు. గొరిల్లా యుద్ధమే తగిన మార్గమని ఊహించాడు. జగదీశపురం ఎలాగో పట్టేశాడు.

ఆగస్టు పదాన్నాలుగున విన్సెంటు ఏరే జగదీశపురంకోట స్వాధీనం చేసుకున్నాడు. కోటమీది అరుపచ్చజెండా పీకేశాడు. యూనియను జాకు ఎగరవేశాడు. జగదీశపురంలోని దేవాలయాలూ అవీ పడగొట్టేశాడు.

అంతఃపురస్త్రీలని వెంటవేసుకుని కుమారసింహుడు అడవులలో మకాంపెట్టాడు. తన తమ్ముడు అమరసింహుడూ, మరి ఇద్దరు రాజ ప్రతినాయకులూ కూడా తమ భార్యలతో కుమారసింహుడి వెంట అడవులకి పడిచారు. అసూర్యంపస్యలయిన అంతఃపురస్త్రీలు తమ భర్తలతోపాటు స్వాతంత్ర్యసమరంలో పడుములు బిగించారు. కుమారసింహుడితో అప్పుడు పన్నెండువందలమంది సైనికులుమాత్రమున్నారు. ఇంతమందితోనూ బీహారు పడమటి అడవుల్లో పోనుపది తీరాన ఆవీరసింహం సమయంకోసం కనిపెట్టుకు తిరుగుతోంది.

ఇంతలో కుమారసింహుడికి వార్త అందింది. — "నేపాళం ఘూర్ఖా సేనా, ఇంగ్లీషుసేనా అజంగడంనించి లక్నోమీదికి వెళుతూవుంది."

ఈ వార్తవినగానే కుమారసింహుడు అజంగడందిక్కు నడిచాడు. జీవా మొదలయినచోట్ల విప్లవకారులుకూడా అతడితో కలిశారు. 1858 మార్చి పద్దెనిమిదిని కుమారసింహుడు అజంగడానికి పాతికమైళ్ళదూరంలో అతరౌలియాలో డేరావేశాడు.

ఇంగ్లీషువాళ్ళవాకి ఈ వార్త అందడమే తడవు. మూడువందలకాల్బలమూ, కొంత గుర్రపుసేనా, రెండుఫిరంగులూ వేసుకుని మిల్‌మాను అతరౌలియా వచ్చిపడ్డాడు. ఇరవై రెండున కుమారసింహుడిసేన మిల్‌మానుకంట పడింది. ఉత్తరక్షణంలో కాల్పులు అరంభమయాయి. కుమారసింహుడు నెనకకితగ్గి మెరుపులా మాయమయాడు. ఇంగ్లీషు సేన విజయగర్వంతో కోలాహలంచేసింది. తుపాకులు మామిడితోపులో నిలబెట్టి, భోజనాదికాలు ప్రారంభించింది. ఇట్లాభోజనాలారంభమయాయో లేదో పిడుగులా వచ్చిపడ్డాడు కుమారసింహుడు. గుభీగుభీ గుళ్ళమీదగుళ్ళు కురిపించాడు. మిల్‌మాను విజయగర్వమల్లా మంటగలిసింది. ఎంతోమంది ఇంగ్లీషుసైనికులు హతవాడిపోయారు. చావగా మిగిలినవాళ్ళతో మిల్‌మాను పలాయనం చిత్తగించాడు. అతరౌలియానించి పారిపోయి అతడు కోశిలాలో తలదాచుకున్నాడు. కుమారసింహుడు వెంటాడాడు. మిల్‌మానుసేనతోవచ్చిన భారతీయసేవకులు యావన్మందీ కకావికలై పారిపోయారు. బళ్ళవాళ్ళు బళ్ళువొదిలేసివుడాయించారు. ఎడ్లూ అవీ దారితెన్నూలేకండా ఎటుపడితే అటు పరిగెత్తిపోయాయి. మిగిలినసామానులూ, ఫిరంగులూ కుమారసింహుడి వశమైపోయాయి. కుమారుసింహుడు వెంటపడగానే మిల్‌మాను కోశిలా వొదిలేసి అజంగడం పారిపోయాడు.

మిల్‌మాను వోడిపోయినవార్త తెలిసి, కాశీనించీ, మీర్జాపురం నించీ మరో మూడువందల యాభైమందిఫౌజు పట్టుకుని కల్నలు డేమ్సు అజంగడం వచ్చాడు. మిగిలిన మిల్‌మానుసైన్యమూ, ఈసేనా —

దీనంతటికీ కల్నలు డేమ్సు నాయకత్వం వహించాడు; కుమార సింహుడిమీదికి బయలుదేరాడు.

మార్చి ఇరవై ఎనిమిదిన ఉభయసేనలూ అజంగడ్డానికి కొంత దూరంలో తారసిల్లాయి; కలియబడ్డాయి. ఈసారి కూడా కుమార సింహుడే జయించాడు. కల్నలు డేమ్సు మిల్‌మానులాగే ఫుంజాలు తెంపుకు పారిపోయాడు; అజంగడందుర్గంలో తలదాచుకున్నాడు. కుమారసింహుడు వొదిలిపెట్టలేదు; డేమ్సుని వెంటాడాడు; అజంగడం ప్రవేశించాడు. అజంగడం నశపరచుకున్నాడు. కోటముట్టడికి కొంతసేన అట్టిపెట్టి, తాను కాశీదిక్కు బయలుదేరాడు. కాశీఉత్తరంగా, జగదీశ పురానికి పైన వందమైళ్ళదూరంగా వచ్చేశాడు. లక్నోనించి వచ్చేసిన విప్లవకారులున్నూ వచ్చి అతడిసేనలో చేరారు.

అదినాళ్లలో గవర్నరు జనరలు కానింగు అలహాబాదులోనే వున్నాడు. కుమారసింహుడు కాశీకేసి వస్తున్నాడనగానే భయపడ్డాడు. మార్కు-కర్రుసి కొంతసేనఇచ్చి కుమారసింహుడి మీదికి పంపాడు. మార్కు-కర్రుసేనా కుమారసింహుడిసేనా 1858 ఏప్రిలు అఖరున పరస్పరం కలియబడ్డాయి. ఎన్నభై వొక్క సంవత్సరాల వృద్ధుడు కుమారసింహుడు అయుద్ధంలో పాతికేళ్ళయువకుడిలా పోరాడాడు. తన తెల్లగుర్రంమీద మెరుపులా ఈమూలనించి ఆమూలకి అతడు పరిగెడుతూవుంటే శత్రువులు సిచ్చిరపోయారు. ఈయుద్ధంలోకూడా కుమారసింహుడే గెలిచాడు. మార్కు-కర్రు వోడిపోయాడు. పలాయనం చిత్తగించాడు. కుమారసింహుడు వెంటపడలేదుమాడు. మార్కు-కర్రు అజంగడం దుర్గంలో ప్రాణాలు దక్కించుకున్నాడు.

కుమారసింహుడు మార్కు-కర్రు వెంటపడకండా కాశీమీదికే వెళ్ళివుంటే కథమరోలావుండేది. కాని దగ్గిర శత్రువుపని ముందు పట్టించడమే మంచిదనుకున్నాడతడు. ఆజంగడంపట్నం విప్లవకారులచేతిలో

వుంది. ఆజంగడం కోటలో ఇంగ్లీషుసేన నిర్బంధించి, ముట్టడిసాగించడానికి సిద్ధపడ్డాడు. కుమారసింహుడు ఇంతలో మార్కుకర్రుని విడిపించడంకోసం పడమటినించి జనరలు లగర్డు ఆజంగడం బయలుదేరాడు. కుమారసింహుడికి ఉప్పందింది. తాను నదిమీద వంతెనదాటి లగర్డు ఆజంగడం రావాలి. అందుకని కుమారసింహుడు కొంతసేన తానూ వంతెనమీదికి పంపాడు. తానేమో కొంతసేనతో ఆజంగడంనించి గాజీపురం బయలుదేరాడు. గాజీపురంవెళ్ళి అక్కడినించి గంగానదిదాటి, జగదీశపురం వచ్చి తనరాజధాని వశపరుచుకోవాలని అతడి సంకల్పం.

తానూ వంతెన దగ్గిర విప్లవసేన లగర్డుసైజుని ఎదిరించింది. ఇక్కడిలా పోరాటం జరుగుతూవుండగా గాజీపురం తోట్లు బయలుదేరిన కుమార సింహుడిసేన నిరాఘాటంగా అటు సాగిపోయింది. అలా తగినంత దూరం కుమారసింహుడు వెళిపోయేదాకా తానూ వంతెనమీద విప్లవ సేన అద్భుతంగా పోరాడుతూనేవుంది. తరవాత మెల్లిమెల్లిగా వెనకకి తగ్గి కుమారసింహుడితో కలుసుకుంది. కుమారసింహుడి ఈఎత్తు లగర్డుసేనానికి రవంతా అర్థంకాలేదు. పన్నెండుమైళ్ళదాకా అతడు విప్లవసేనని వెంటాడాడు. కాని ఫలితంమాత్రం శూన్యమయింది.

ఇంతలో మెరుపులా మళ్ళీ కుమారసింహుడు తిరిగివచ్చాడు; లగర్డు సేనమీద విరుచుకుపడ్డాడు. ఇంగ్లీషుసేనలో కొందరు ఆఫీసరులూ, ఎంతోమంది సైనికులూ హతవారిపోయారు. తుదకి ఈయుద్ధంలో కూడా ఇంగ్లీషువాళ్ళే ఓడిపోయారు; వెనకకి తగ్గేశారు. కుమార సింహుడు గంగకేసి ముందుకిసాగాడు. లగర్డుకూడా ఓడిపోయా డన్నసంగతి విని, మరోఇంగ్లీషుసేనాని డగ్లసు పెద్దసేనతో పరిగెత్తుకు వచ్చాడు. నవయీగ్రామందగ్గిర ఉభయసేనలూ డీకొన్నాయి. ఘోర మయిన యుద్ధం జరిగింది. కుమారసింహుడు తనసేన మూడుభాగా లుగా విభజించాడు. ఒకటి డగ్లసుసేనని ఎదిరించి పోరాడింది. మిగిలిన

రెండుసేనలూ అడ్డంగాతిరిగి ముందికి సాగిపోయాయి. డగ్లసుసేన ముందు కుమారసింహుడి మొదటిభాగంసేన తక్కువేఅయినా సాటి లేని వీరత్వంతో పోట్లాడింది. యుద్ధంచేస్తూ విప్లవసేనని రెండుకోసులు వెనకకి నెట్టుకుంటూవచ్చాడు డగ్లసు. అంతలో పక్కదారులనించి వెళుతూన్న కుమారసింహుడి మిగిలిన రెండుసేనలూ అడ్డంగావచ్చి, అప్పటికే అలిసిపోయిన డగ్లసుసేనమీదపడ్డాయి. ఇంగ్లీషుసేన ఓడి పోయింది. డగ్లసుసేనాని వెనకకి మళ్ళాడు.

కుమారసింహుడు గంగదిక్కు ముందికిసాగాడు. అలిసి ఓడి పోయిన ఇంగ్లీషుసేన అవాళ ఏప్రెలు పదిహేడురాత్రి అతిసీగ్రామం దగ్గిర అలసటతీర్చుకుంది. మర్నాటిఉదయం మళ్ళీ కుమారసింహుడి వెంట పడింది. కాని అన్నణ్ణి కలుసుకోలేకపోయింది. వృద్ధకుమార సింహుడు వాయువేగంతో ముందికి సాగిపోయాడు. అవాళకూడా ఇంగ్లీషుసేన అలసటతీర్చుకుంది. కుమారసింహుడిసైన్యాలు ఇంగ్లీషు సేనవిషయాలన్నీ ఎప్పటికప్పుడు అతడికి అందిస్తూనే వుండేవాళ్ళు.

కుమారసింహుడు హుటాహుటినివెళ్ళి సైన్యంతోకూడా సికందర పురంచేరాడు. అక్కడ ఘాసురానదిదాటి మనోహరపురంచేరాడు. విశ్రాంతికోసమక్కడ ఆగిపోయాడు. డగ్లసుసేనాని మనోహరపురంలో కూడా కుమారసింహుడిమీద దాడిచేశాడు. భయంకరమయిన యుద్ధం జరిగింది. ఈయుద్ధంలో కుమారసింహుడి కొన్ని ఏనుగులూ, కొంత మందుగుండూ, కొద్దిపాటి భోజనసామగ్రులూ డగ్లసుపట్టుకున్నాడు. కుమారసింహుడు మళ్ళీ తనసేన చిన్నచిన్నతుకిడీలకింద భాగించి వివిధ మార్గాలలో నడిపించాడు. ఈతుకిడీలు అన్నింటివెంటాపడడం డగ్లసుకి సాధ్యపడలేదు. ఈతుకిడీలు వేరువేరుదార్లంబడి ముందుకువెళ్ళి ఓక నిర్దిష్టమయినచోట అన్నీ కలుసుకున్నాయి; మళ్ళీగంగానదిదిక్కు సాగిపోయాయి.

ఈలోగా కుమారసింహుడు ఎొక పుకారుపుట్టించాడు — "బలి యాదగిర కుమారసింహుడిసేన ఏనుగులమీద గంగానది దాటు తుంది." డగ్లసు ఈమాట విన్నాడు. తిన్నగాబలియాదగ్గిరికి దండు నడిపించాడు. కుమారసింహుడు గంగ దాటకండా కట్టుబొట్లన్నీ చేసుకు కూచున్నాడు. అయితే కుమారసింహుడు బలియాదగ్గిరికి వెళ్ళనేలేదు. ఇటు పడుమ్మెళ్ళకింద శివపురంఘాటుదగ్గిర అద్ధరాత్రి పడనలమీద గంగ దాటడం పారంభించాడు. చివరికి ఈవార్త ఇంగ్లీషువాళ్ళకి అంది పోయింది. అందడమేతడువు, ఇంగ్లీషుసేన హుటాహుటిని పరగెత్తుకు వచ్చింది. అప్పటికి కుమారసింహుడిసేన యాపత్తూ గంగదాటేసింది. ఒక్కపడవమాత్రం నట్టేటిలో వుంది. ఆపడవలోనే కుమారసింహుడు కూచునివున్నాడు. ఇంగ్లీషుసైనికులు పడనమీంద తుపాకులుకాల్చారు. ఒకగుండు రయిని వచ్చింది. కుమారసింహుడి కుడిచేతినిక్షణమాత్రంలో తగిలింది. మనికట్టు చిదిగిపోయింది. ఎడమచెయ్యిక్కూడా సంవత్సరాల పర్యంతము కుమారసింహుడు. సిపాయంతా లక్ష్యంపెట్టలే దతడు. వెంటనే ఎడమ చేత్తోనే కత్తితీశాడు. గుండుతగిలిన మోచేయికుతికదగ్గిరికి సరికేశాడు. తెగినచెయ్యి గంగాభవానికి కర్పించాడు. వీరక్షత్రంతో తిలకందిద్దుకుంది గంగమ్మతల్లి.

కుమారసింహుడు గంగదాటి వెళ్ళిపోయాడు. ఇంగ్లీషుసేన వెంటాడి డానికి సాహసించలేదు. వెనకకి మళ్ళిపోయింది.

గంగదాటి తనరాజ్యంలో పవేశించాడు కుమారసింహుడు. గంగ అవతల కొంతదూరంలోవుంది జగదీశపురం. అన్నగారు గంగదాటక ముందే దేశభక్తులయిన పురజనుల్ని, చుట్టుపక్కల వూళ్ళల్లోవాళ్ళనీ సమావేశపరిచి రహస్యంగా కొంతసేన సమకూర్చిపెట్టాడు అమరసింహుడు. కుమారసింహుడు రాగానే ఈసేన అతడికి సహాయపడింది. అనాయాసంగా ఏడాదిలు ఇరవైరెండున కుమారసింహుడు జగదీశపురం

వశపరుచుకున్నాడు. తిరిగీ తన తాతముత్తాతల దుర్గంలో ప్రవేశించాడు. ఎనిమిదిమాసాలయి పరాధీనంగావున్న రాజమహలు తిరిగీ కళకళలాడింది.

హటాత్తుగావచ్చి కుమారసింహుడు జగదీశపురం వశపరుచుకుని, మళ్ళీ రాజరికం ప్రారంభించాడనగానే ఆరాలోని ఇంగ్లీషువాళ్ళు తుళ్ళిపడ్డారు. ఇరవైనాలుగుగంటలయినా కాలేదు, మరొక్కడు ఇరవై మూడుమంది జనంలు లీగ్రాండు దండయాత్రకి బయలుదేరాడు. నాలుగు వందలమంది సైనికులూ, రెండు ఫిరంగులూ వేసుకుని ఎకాఎకిని జగదీశపురంమీద విరుచుకుపడ్డాడు. కుమారసింహుడిసేన యుద్ధాలమీద యుద్ధాలుచేసి అలిసిపోయివుంది. పట్టుమని నెయ్యిమంది సిపాయిలయినా అతడిదగ్గిర లేరిప్పుడు. నిన్ననే చెయ్యతెగి మంచంమీద పడివున్నాడు వృద్ధకుమారసింహుడు. ఈస్థితిలో వచ్చిపడ్డాడు లీగ్రాండు. కుమారసింహుడిదగ్గిర అప్పుడు ఫిరంగులుకూడా లేవు. అయితేనేం సింహం సింహమే. అది దెబ్బతింటేనేంగాక! ఏనుగుమండని చూస్తే అది తోకముడవదు.

జగదీశపురానికి మైలున్నరలోవుంది లీగ్రాండుపటాలం. కుమారసింహుడి వీరసైన్యంవెళ్ళి ఎదిరించింది. లీగ్రాండుసేనలో ఇంగ్లీషు సోల్జర్లూ, సిక్కుసిపాయిలూ కూడా వున్నారు. భయంకరమయిన సమరం సాగింది. కుమారసింహుడిపటాలం అద్భుతంగా పోరాడింది. శత్రువుని చావుదెబ్బ కొట్టి వోదిలిపెట్టింది. ఇంగ్లీషుసేన పచ్చడిపచ్చడి అయిపోయింది. లీగ్రాండు హతవైపోయాడు. చావగామిగిలిన ఇంగ్లీషుఫౌజు అరిచేతిలో ప్రాణాలుపెట్టుకుని, చెట్టోపిట్టయి పారిపోయింది. ఫిరంగులూఅవీ ఎక్కడివక్కడపారేసిపోయింది. అవాళటి పరాజయం వివరిస్తూ, స్వయంగా వొక ఇంగ్లీషుఆఫీసరు ఇలా రాశాడు:

"జరిగినసంగతి రాయడానికి నిజంగా సిగ్గుపడుతున్నాను. యుద్ధ రంగం వొదిలేసి మేం అడవుల్లోంచి పరుగుచ్చుకున్నాం. వెనకనించి శత్రువులు పడబాదుతూ వెంటాడారు. దాహంతో మాప్రైసికుల ప్రాణాలు పోతూవుండేవి. ఒకదగ్గిరచిన్న కుళ్ళుచెరువు కనపడింది. కక్కుర్తిపడి ఇంతమందీ ఆపాడుగుమ్మికి పరిగెత్తారు. ఇంతలోనే కుమార సింహుడి కౌతులు వచ్చి మామీదపడ్డారు. ఆతరవాత మాఅవమానం అంతులేకపోయింది. ఘోరమయిన సంకటస్థితిలో పడిపోయాం. మాలో వొక్కడికీ సిగ్గూ సెరమూ లేకండాపోయింది. ఎపళ్ళకితోచినతట్టు నాళ్ళం పరిగెత్తాం. ఆఫీసర్ల ఆజ్ఞలు వొక్కడూ లక్ష్యపెట్టలేదు. క్రమశిక్షణా, ఆజ్ఞా పరిపాలనా మంటలో కలిసిపోయాయి. ఎటుచూస్తే అటు హాహాకారాలూ, ఏడుపులూ, మొర్రలూశోప్ప సురేమీ వినపడలేదు. చూసి కడాకూ జట్లుజట్లు ఇంగ్లీషువాళ్ళు పడదెబ్బకి పడిపోయారు; చచ్చిపోయారు. మా ఆస్పత్రి ముందే కుమారసింహుడు ఆక్రమించుకున్నాడు. అంచేతఎవరికీ మందూమాకూ లభించలేదు. ఎంతోమంది అలాపడిపడి చచ్చిపోయారు. మిగిలినవాళ్ళని శత్రువులు సరికిపారేశారు. మూడొలీల వాళ్ళు డోలీలుపారేసి పారిపోయాము. మాలో యాభయ్మంది జబ్బర్దస్తుల్ది పోయారు; అడలెత్తిపోయాము. పదహారు ఏనుగులమీద మాలో దెబ్బలు తిన్నవాళ్ళనిమాత్రం పడేశారు. జనగలు లీగ్రగాండుకి గుండెలుమీద గుండు దుసెల్లిపోయింది. పాదుకదలకండా కాయమసిపోయా డతడు. మాప్రైసికులు ఫుంజాలు తెంపుకుని అయిదుమైళ్ళు పరిగెత్తి పారిపోయారు. తమతుపాకులు మొయ్యడానికే వాళ్ళకిశక్తిలేకండాపోయింది. సిక్కులేమో అక్కడిఎండకి అలవాటుపడినవాళ్ళే. అయితే మాదగ్గిరనించి ఏనుగులులాక్కున్నారు వాళ్ళు. వాటిమీద మాకంటె ముందే రంగంమించి వాళ్ళు వుడాయించారు. తెల్లవాళ్ళని ఎవ్వరూ ఆపుకోలేదు. వందాతొంభై తొమ్మండుగురు తెల్లవాళ్లలో ఎన్భైమంది

మాత్రం బతికి బైటపడ్డారు. కసాయికొట్టుకి వెళ్లిన పశువుల్లాగ వూరికే చవ్వడంకోసమే మేమక్కడికి వెళ్లాం."

ఈ యుద్ధంలో సిక్కులు కేవలం తొమ్మండుగురుమాత్రం మరణించారు. శత్రుపక్షంలో వుండినాసరే, భారతీయుల్ని మాత్రం వీలయినంత వరకూ చంపవద్దని కుమారసింహుడు ఆజ్ఞాపించడమే దీనికి కారణం. విప్లవారంభంలో కుంపినీపక్షంలోవున్న ఎంతోమంది బెంగాలీబాబుల్ని విప్లవకారులు పట్టుకున్నారు. వాళ్ళకి ప్రాణాపాయంరాకండా ఏనుగుల మీద కుమారసింహుడు పంపించేశాడు. కుంపినీకాగితాలూ అవీ కూడా కాల్చకుండా కట్టుబాట్లుచేశాడు. స్వరాజ్యంవచ్చాక పరిపాలనా సౌలభ్యంకోసం అవన్నీ అవసరమే అని అతడి అభిప్రాయం.

అలా రాణా కుమారసింహుడు చివరియుద్ధంలోకూడా సంపూర్ణ విజయం సాధించాడు. అకుపచ్చ స్వతంత్రపతాకం ఎగరవేస్తూ జగదీశపురం ప్రవేశించాడు. అయితే అతడు ఎంతోకాలం జీవించలేకపోయాడు. చేతిగాయం బాగుకాలేదు. చాంతాసే 1858 ఏప్రిలు ఇరవైరెండున జగదీశపురం దుర్గంలో అవీరసింహుడు స్వర్గస్థుడయాడు. వీర కుమారసింహుడు స్వర్గస్థుడయాడు, నిజమే, కాని పరాధీనుడయి ప్రాణాలువొదిలిపెట్టలేదు. శత్రువుగుండెలు గడగడలాడించి, తన జగదీశపురం తాను స్వాధీనంచేసుకుని, దుర్గంమీద స్వతంత్రపతాకం అంబరచుంబితమై ఎగురుతూవుండగా ఆవీరశిరోమణి వీరగతిపొందాడు.

రాజా కుమారసింహుడు మహావీరుడు. మచ్చలేని మనుగడ అతడిది. దురభ్యాసమంటే అతడికి పడేదికాదు. అతడు చూసిపోతాడేమో అన్న భయంతో వీధుల్లో పొగతాగడానికే భయపడేవారు ప్రజలు. బీహారు ప్రతాపభాస్కరుడస్తమించాడు. కాని అతడి ప్రచండతేజస్సు మాత్రం అస్తమించలేదు.

అమరసింహుడు

అన్నగారి నిర్యాణానంతరం అమరసింహుడు జగదీశపురం గద్దె ఎక్కాడు. పట్టుమని నాలుగుదినాలయినా విశ్రాంతితీసుకోలే దతడు. సైన్యంకూర్చుకుని అన్నగారు వొదిలిపోయిన స్వాతంత్ర్యసమరం సాగించాడు. అమరసింహుడు స్వాతంత్ర్యపతాకం చేతపుచ్చుకుని బయలుదేరగానే కుమారసింహుడు జీవించివున్నట్టుగానే భావించారు జనం. అమరసింహుడు ఆరామీద దాడిప్రారంభించాడు. లీగ్రాండునేన వోడిపోయి పారిపోయాక, జనరలు డగ్లసూ, జనరలు లగార్డూ గంగా నదిదాటి ఆరా ఇంగ్లీషువాళ్ల సహాయంకోసం వచ్చిపడ్డారు. ఈనేన లతో అమరసింహుడి నేన మే మూడున మొదటియుద్ధం చేసింది. తరవాత లిహియా, హసంపురమూ, దలీలపురమూ మొదల్తె నచోట్ల కూడా హోరాహోరి యుద్ధాలు జరిగాయి. యుద్ధవిద్యలో సరిగ్గా అన్నగారిని మరిపించాడు అమరసింహుడు. ఇంగ్లీషునేనని ముప్పు తిప్పలూ పెట్టాడు. మూడుచెరువులనీళ్లూ తాగించాడు. తుదకి జనరలు లగర్డు విసిగిపోయి తనసేనానాయకపదవికి రాజీనామాఇచ్చేసి ఇంగ్లాండు వెళ్లిపోయాడు. డగ్లసుమాత్రం సర్వభారం నెత్తినివేసుకుని పోరాటం సాగించాడు.

మే, జూను, జూలై, ఆగష్టు, సెప్టెంబరు—మాసాలమీద మాసాలు గడిచిపోతున్నాయి. అమరసింహుడు స్వాతంత్ర్యపతాకం ఎగరవేస్తూనే వున్నాడు. రణదుందుభులు మోగిస్తూనేవున్నాడు. ఇంగ్లీషునేన నానా తిప్పలూ పడుతూనేవుంది. అమరసింహున్ని గెలవలేకపోతోంది. జగదీశపురం చేరలేకపోతోంది. అమరసింహుడు ఆరా ముట్టడించాడు. ఇంగ్లీషునేన అనేకసార్లు వోడిపోయింది. తుదకి జనరలు డగ్లసు ప్రక

టించాడు — "అమరసింహుడి శిరస్సు పట్టుకువచ్చినవాళ్ళకి గొప్ప బహుమానం మిస్తాము." అని.

ఎంతసాహసం! అమరసింహుడి శిరస్సు! కాలయముడికంటం నరకడం సాధ్యమేమో! కుమారసింహుడి తమ్ముడు అమరసింహుడి శిరస్సు తేవడం! డగ్లసుసేనానీ, ఏమిటీ నీభ్రమ? ఎవడయినా దేశద్రోహి మిజ్జాఫరు, ఇలాహిబక్సు వుండకపోతాడా అనా? జగదీశపురం వీరమట్టిమీదా? నీతుచ్చమయిన బహుమానం ఆశించా? నెర్రి! స్వార్థప్రయత్నం! తన ఊపాచికకూడా స్వర్ణంకావడంతోనే డగ్లసు పెద్దఎత్తుమీద జగదీశపురం ముట్టడించడానికి నిశ్చయించాడు. జగదీశపురం అడవులు కొట్టించి చాపలు ఏర్పాటుచేశాడు. తనవద్దగల వున్న ఏడువేలసేనా ఏడుభాగాలుచేశాడు. ఏడుదార్లనించి ఏడు సేనలూవచ్చి వొక్క-సారి జగదీశపురం ముట్టడించాలని పథకంవేశాడు. ఆప్రకారం అక్టోబరు పదిహేడున ఏడుదార్లనించీ బయలుదేరి ఇంగ్లీషు సేన జగదీశపురం ముట్టడించింది. "ఇక ఎలాతప్పించుకుపోతాడు అమరసింహుడు? అతడిపని అయిపోయింది" అనుకుంటూ డగ్లసు బయలుదేరాడు. అనుకున్నప్రకారం బన్నెండు సేనలూ ఒకటికా వచ్చేస్తున్నాయి. ఒక్క-సేనమాత్రం అయిదుగంటలు ఆలస్యమయిపోయింది. అదిగో ఆ అవకాశం వినియోగించుకున్నాడు అమరసింహుడు. తన తగుపాటిసైన్యంతో ఆదారిని దాటేశాడు. ఇంగ్లీషువాళ్ళు ఇంకాప్రయత్నమూ సీళ్ళుకారిపోయింది. జగదీశపురమేమో వాళ్ళకి పట్టుబడింది. అమరసింహుడుమాత్రం అందకుండాపోయాడు. సింహమేనెక్కి దాటిపోయింది. ఉత్తిగుహతో ఏముంది?

ఆలస్యంగావస్తూవున్న ఆంగ్లసేనని చీల్చుకుంటూనే అమరసింహుడు అవతలకి దాటేశాడు. అంగ్లసేన అమరసింహుణ్ణి వెంటాడింది. అక్టోబరు పందొమ్మిదిని నౌషదీగ్రామంవద్దర అతణ్ణి చుట్టుముట్టింది. అమర

సింహుడితో నాలుగువందలమంది సిపాయిలుమాత్ర మున్నారు. ఈనాలుగువందలమందిలో మూడువందలమంది రణస్థలంలో వీర శయనంపొందారు. తక్కినవందమందీ ఇంగ్లీషునేసని చెండాడుతూ ముందుకి వెళ్ళిపోయారు. ఇంతలో మరికొంతసేనవచ్చి, ఇంగ్లీషు వాళ్ళతో కలిసింది. అమరసింహుడి వందసిపాయిలనీ ముట్టడించింది. అమరసింహుడి వీరసైనికులు మడమతిప్పకండా పోరాడారు. వంద మందిలో ముగ్గురుమాత్రం మిగిలిపోయారు. తక్కిన డబ్బయిఏడు గురూ రణరంగంలో వీరగతిపొందారు. మిగిలిన ముగ్గురిలోనూ ఎొకడు అమరసింహుడు. ఇంగ్లీషుసేనలో అంతకంటే అధికంగానే మరణించారు. ఎంతోమంది గాయపడ్డారు.

అమరసింహుడు తన ఇద్దరిసహచరులతోనూ ఏనుగుమీద మెరుపులా తప్పించుకుపోయాడు. ఇంగ్లీషు సవారులు వెంటపడ్డారు. చివరికి అమరసింహుడి ఏనుగునిపట్టుకున్నారు. ఏనుగేమో దొరికిపోయింది. అమరసింహుడు ఏనుగుమీంచి సింహంలా గెంతేశాడు. కైమూరు పర్వతాల్లో మాయమయాడు. ఇంగ్లీషువాళ్ళు కైమూరుపర్వతాల్లోనూ ప్రవేశించారు. కొండకొండా వెదికారు. శిఖరంశిఖరం గాలించారు. అమరసింహుడు దొరకలేదు. కైమూరుపర్వతాల్లో ప్రవేశించాక అతడు ఏమయిందీ ఇవాళకీ అంతుచిక్కలేదు. ఆస్వాతంత్ర్య వీరుడు అడవుల్లోఅయితేనేం, కొండల్లోఅయితేనేం స్వాతంత్ర్యంగానే జీవించాడు. పరాధీనుడుకాలేదు.

జగదీశపురం దుర్గంలో వందా యాభైమంది అంతఃపురస్త్రీలు వుండే వాళ్లు. ఆవీరాంగన లొక్కరూ శత్రువుచేత చిక్కలేదు. ఫిరంగుల ముందు నుంచుని తమచేతులతో తామే నిప్పంటించుకున్నారు. వందా యాభైమందీ అలా ఫిరంగులకి బలయిపోయారు.

అయిపోయింది. బీహారు జగదీశపురం వీరగాథ ఇంతటితో అంత మయిపోయింది. కుమారసింహ, అమరసింహుల అమరగాథ తరతరాల భారతజాతికి ఆదర్శజ్యోతి చూపుతూనే వుంటుంది.

అ హ మ ద ు ష ా

మౌల్వీ అహమదుషా ఇంగ్లీషువాళ్లకి అందకుండా వెళ్లి లక్నోకి ఇరవై తొమ్మిదిమైళ్లదూరాన బాకీగ్రామంలో మకాంవేశాడు. బేగం హజరతుమహలు తన కుమారుడితోవెళ్లి బిటూవలీ చేరింది. ఆమెదగ్గిర ఆరువేలసైజు తయినాతీవుంది. లక్నో, సంహారక్రీడ ముగించాక, ఇంగ్లీషుసేన మొత్తంకూడా సేనాపతికింద బయలుదేరి అయోధ్యారాజ్య మంతా దళులుపరుచుకోడం మొదలుపెట్టింది.

అసలు ఇండియాలో విప్లవస్వరూపం విని ఇంగ్లాండులో దొరలకి బెంగపట్టుకుంది. అందుకని పటాలంమీద పటాలం ఇండియాలో దించడ మారంభించారు వాళ్ళు. 1858 ఏప్రిలు నాటికి ఇక్కడ తొంభయి ఆరు వేలమంది తెల్లసోల్జర్లు సిద్ధమయారు. వీళ్ళుకాక స్వదేశ సంస్థానాల్లోని పటాలమూ, సిక్కులూ, ఘూర్ఖాలూ, పఠానులూ, పరియాలూ వుండనేవున్నారు. ఢిల్లీ, కాన్పూరూ, లక్నోలవంటి కేంద్రాలు విప్లవ కారులచేతిలోంచి పోయాక యుద్ధవిధానం మారిపోయింది. అయోధ్యా, రోహిలాఖండం నాయకులు పరిస్థితులు విచారించి, దేశమంతటా చెదిరి వున్న విప్లవకారుల్ని గొరిల్లాయుద్ధపద్ధతు లనుసరించమంటూ ఒక ప్రకటనచేశారు.

"మన మతవిరోధుల అజ్ఞలమీదనడిచే సేనతో మీరు బహిరం గంగా యుద్ధానికి దిగకండి. వాళ్లదగ్గిర మనకంటే పెద్దపెద్ద ఫిరంగు లున్నాయి. క్రమశిక్షణలోకూడా మీకంటే వాళ్ళది పైచెయ్యి. అయితే వాళ్ళకదలికలుమాత్రం మీరు కనిపెడుతూవుండండి. నదుల

రేవులన్నీ కాపలాకాయండి. వాళ్ళ ఉత్తరప్రత్యుత్తరాలు సాగనివ్వకండి. వాళ్ళ సంభాషణలు కొల్లగొట్టండి. వాళ్ళ తపాలూ అవీ దోచుకోండి. వాళ్ళు ఎక్కడ డేరావేస్తే అక్కడ అంటిపెట్టుకునివుండండి. ఫరంగీలని పిసరంతా నిద్రపోనివ్వకండి." *

ఈ ఆదేశం అహామదుషా అక్షరాలా అమలుచేశాడు. లక్నో ఇంగ్లీషుపటాలంమీద మనుషులు నిఘూవేశాడు.

అహామదుషా బారీలోవున్న విషయం ఇంగ్లీషువాళ్లు పసికట్టారు. సర్ హూఫ్రాంట్ మూపువేల సంఖ్యా, దిట్టమయిన ఫిరంగులూ పట్టుకుని బారీమీదికి దండయాత్రకి బైలుదేరాడు. శత్రువు బలాబలాలూ అంతుకనుక్కుందికి మువ్వాడు అహామదుషా తనవాళ్ళను పంపాడు. చాలామంది అహామదుషా మనుషులు ధీరుడాగా ఇంగ్లీషుదిబిరంలోకి నడిచారు. "ఎవరా వెళ్లేది?" — తిబిరంకాపలావాళ్ళు ప్రశ్నించారు. "పన్నెండోపటాలంవాళ్ళం" — అహామదుషా మనుషులు టపీ మని జవాబు చెప్పారు. "ఆల్ రైట్" — కాపలావాళ్ళు సమాధానమిచ్చారు. అహామదుషా మనుషులు అబద్ధమాడారా? లేదు. నిజంగా వాళ్ళు పన్నెండోపటాలంమనుషులే. అయితే గత జూలైలోనే వాళ్ళు ఫిరంగం చేసివచ్చేశారు. ఇవంతా పాపం కాపలావాళ్ళ కేం తెలుసు!

అహామదుషా మనుషులు లోపలికివెళ్ళారు. గుట్టుమట్టులన్నీ తెలుసుకున్నారు. బైటికి వచ్చేశారు. అన్నివివరాలూ అహామదుషా కందించారు. భోగట్టా అందగానే అహామదుషా ప్రత్యాహ్వానించాడు. బారీకి నాలుగుమైళ్ళదూరంలో సొంతగ్రామం పట్టుకునున్నాడు. అక్కడ పదాతి దళంతో తాను ఆగాడు. తన సుప్రభుపథం వేగేసొంతచోట దాచి పెట్టాడు. హూఫ్రాంటుమచ్చి తానుపట్టుకున్న గ్రామం ముట్టడిస్తాడు. ఇటు పదాతిదళంతో యుద్ధప్రారంభంకాగానే వెనకనించివచ్చి

* Russel's Diary.

గుర్రపుబళ్లం డీకొనాలి. అంతవరకూ గుర్రపుబళం చడీచప్పుడూలేకుండా పొంచివుండాలి. అదీ అతడివ్యూహం. అన్నట్లుగానే గుర్రపుబళం వొక తోపులో దాగుంది. కాని హూణుగ్రామంనుంచి కంటపడగానే అగలేక పోయింది; తుపాకులుకాల్చడం మొదలుపెట్టేసింది. హూణుగ్రామం జల్లుకున్నాడు. చాంతో అహమదుషావ్యూహం వ్యర్థమయిపోయింది. చేసేదిలేక మరోఅవకాశంకోసం ఎదురుచూస్తూ అతడు గ్రామం వొదిలేసి వెళ్లిపోవలసివచ్చింది.

హూణుగ్రామంమీద బారీ బయలుదేరినట్టే జనరలు వాలుపోలు ఏడ్రిలు తొమ్మిదిని పెద్దసేనతో లక్నోనించి బయలుదేరాడు. దారి కడాకూ విప్లవకారుల్ని వేటాడుతూ అతడు పదిహేనురోజుల్లో యూబైమెళ్ళదూరంలో వుంది. రుయియా లక్నోకి యూబైమెళ్ళదూరంలో వుంది. రుయియా జమీందారు సరపతిసింహుడు విప్లవనాయకులలో వొక ముఖ్యుడు. అయితే అతడిదగ్గిర రెండువందల యూబైమంది సిపాయీలకంటే అధికం లేరు. అంతపెద్ద ఇంగ్లీషుసేన చూసి అతడు పారిపోతాడనే అనుకున్నాడు వాలుపోలు. కాని అంతవరకూ తన నిర్బంధంలోవుంచిన వొక ఇంగ్లీషువాణ్ణి అవాళ ఉదయం సరపతిసింగు వొదిలిపెట్టాడు. అతడు తిన్నగా వచ్చి వాలుపోలుతో చెప్పాడు — "దెబ్బకిదెబ్బ తియ్యందే సరపతిసింగు వొదిలిపెట్టేది లేదంటున్నాడు" అని.

ఈ మాట వినగానే అరికాలిమంట నెత్తికెక్కింది వాలుపోలుకి. హుటాహుటినివెళ్లి కోట ముట్టడించాడు. కోటగోడల్లోంచి తుపాకి గుళ్ళు అతడికి స్వాగతంపలికాయి. సలబైఆరుగురు ఇంగ్లీషుసైనికులు వొక్కసారి కారుమన్నారు. మిగిలినవాళ్ళు వెనకకి తగ్గేశారు. దాంతో ఫిరంగులతో వాలుపోలు కోటకి రెండోపక్క వెళ్లాడు. అక్కడినించి ఫిరంగులుకాల్చడ మారంభించాడు. చిత్రం! ఫిరంగిగుళ్లు కోటలోపడ

లేదు. పైనించివచ్చి ఇనతలవున్న ఇంగ్లీషుసేనమీద పడడమారంభించాయి. ఈ అవకతవకచూసి జనరలు హూపు ముందుకురికాడు. ఇట్టే అతడు వురికాడోలేదో విప్లవకారులగుళ్లకి బలయిపోయాడు. జనరలు హూపు మరణించడంతోనే ఇంగ్లీషుసేన పిక్కబలమిచూపించింది. కకావికలయిపోయింది. వాలుపోలు సిగ్గుతో కుంగిపోయాడు. గోప్పాద మంత కోటలో అంత తక్కువమందితో వున్న నరపతిసింహుడు అంత పెద్దఇంగ్లీషుసేనని వోడించాడూ! అతడున్నంతా చేసితీరాడు. దెబ్బకి దెబ్బ తీశాడు. ఈ గెలుపుసాధించాక నరపతిసింహుడు కోట వొదిలేశాడు. తన సైనికులతో బైటికివచ్చేసి స్వాతంత్ర్యసమరం సాగించాడు.

నరపతిసింహుడి తండ్రి బసాసింగు నానాసాహెబు స్నేహితుడు. బిఠూరయుద్ధంలో నానాతోకలిసి పోరాడుతూ అతడు వీరగతి పొందాడు. నరపతిసింహుడు కొంతకాలం నానాసాహెబుకి తన మయియా కోటలో ఆతిథ్యమిచ్చాడు.

జనరలు హూపు సేనున్నదేనాని. అసెంబ్లీమణి ఇండియాలోని ఇంగ్లీషువాళ్లనేకాదు, ఇంగ్లాండులోని చాందల్నికూడా విచారంలో ముంచింది.

అహమదుషా బొరీలించి వచ్చేశాకి, నానాసాహెబుతో కలిసి షాహజహాంపురం వచ్చాడు. ఈనాయకు లిద్దరూ అక్కడవున్నారని వినడంతోనే బ్రిటీషు సర్వసేనాని సర్ కాలిను కాంబెలు షాహజహాంపురం ఘిరాయించాడు. తన మహాస్టస్థం నాలుగుభాగాలకింద విభాగించాడు. పట్నం నాలుగుదిక్కులా ముట్టడించాడు. గాని స్వయంగా కాంబెలు వున్నతట్టే, అనడి కళ్లల్లో కారంచల్లి అహమదుషా, నానాసాహెబులు ఇద్దరూ దాటిపోయారు. పట్నం వొదిలేసేముందు నానాసాహెబు ఇంగ్లీషువాళ్ళువచ్చి అక్కడ తలదాచుకోవడానికి వీలులేకుండా ప్రభుత్వభవనాలన్నీ పడగొట్టించేశాడు.

అహమదుషా నానాసాహెబులు తప్పించుకున్నాక, కాలిను కాంబెలు శాహజహాఁపురం వశపరుచుకున్నాడు.

అక్కడ కొద్దిపాటిసేన అక్బెపెట్టి రోహిలాఖండం బరేలీమీదికి దాడివెళ్లాడు. కాంబెలు ఇలా చేస్తాడని అహమదుషా మొదటే పసి కట్టాడు. కాంబెలు బరేలీ ముట్టడిస్తూవుంటే అడ్డంగా అతడు ఎకాఎకిని వచ్చి శాహజహాఁపురం ముట్టడించాడు. అయితే వచ్చివచ్చి శాహ జహాఁపురానికి నాలుగుమైళ్లదూరంలో కొద్దినేపు ఆగాడు. ఆ అవ కాశంలో ఇంగ్లీషువాళ్ళు పెట్టిన నేటివు వేగులవాడొకడు పడుతూ లేస్తూ వచ్చి శాహజహాఁపురం ఇంగ్లీషుకల్నలు హేలుకి కబురందించే శాడు. దాంతో అంతవరకూ భవనాలులేక ఆరుబయటవున్న ఇంగ్లీషు పటాలం జల్దుకుంది. తగిన రక్షకస్థానం చేరుకుంది.

అహమదుషా శాహజహాఁపురం ముట్టడించి వశపరుచుకున్నాడు. తరవాత ఇంగ్లీషుపటాలాన్ని ఫిరాయించాడు. ఇంగ్లీషుసేనపోరాడింది; ఓడిపోయింది. శాహజహాఁపురంలో ఆకుపచ్చజెండా ఎగిరింది.

రోహిలాఖండం రాజధాని బరేలీ ఇంతవరకూ ఖానుబహదూరు ఖాను నాయకత్వంకింద స్వతంత్రంగానేవుంది; ఆకుపచ్చజెండా నిరాఘా టంగా ఎగురుతూనేవుంది. ఢిల్లీశాహజాదా ఎొకాయన విజ్ఞాఫిరోజషా, బాలాసాహెబూ, బేగంహజరతు మహలూ, రాజా తేజసింగూ, ఇంకా ఎంతోమంది నాయకులూ బరేలీలోనే వున్నారు. సర్వసేనాని కాంబెలు రావడంచూసి విప్లవకారకులు బరేలీవొదిలేసి నాలుగుదిక్కులా చెదురుమదురుగా సర్దుకోవాలని నిశ్చయించారు. అలా ఎంతోమంది చెదిరిపోయారు. కొంతమందిమాత్రం శత్రువుని వొక పూపుపూపా లంటూ బరేలీలోనే వుండిపోయారు. ఈలోగా అలహాబాదునించి గవర్నరుజనరలు కానింగు వొక ప్రకటన చేశాడు.

"ఆయుధాలు కిందపెట్టేసి లొంగిపోయిన విప్లవకారుల్ని కుంపినీ ప్రభుత్వం క్షమిస్తుంది. ఇలా సర్కారువారికి తోడ్పడ్డవాళ్ల భూములూ, ఆస్తులూ ఎవరికి వాళ్లకి తిరిగీ ఇచ్చేస్తుంది. అలా కాకండా ఎదిరించిన వాళ్లని కఠినంగా దండిస్తుంది."

అయితే ఈ ప్రకటన విప్లవకారుల్లో గడ్డిపరకంత పనిచెయ్యలేక పోయింది.

మే అయిదున కాంబెలుసేన శాహజహాఁపురంనించివచ్చి బరేలీ ముట్టడించింది. ఇంగ్లీషు కొత్తఫిరంగులు దారుణంగా అగ్నిగోళాలు కుమ్మరించాయి. వాటిముందు ఖానుబహదూరుఖాను ఫిరంగులు పనికి రాలేదు. చివరికి విప్లవకారులు కత్తులుదూసి ఇంగ్లీషువాళ్ళమీదపడ్డారు. రోహిలాఖండం ఘాజీలు దీన్‌దీన్‌నినాదాలతో హోరాహోరి పోరాడారు. ఉభయపక్షాలా ఎంతోమంది మరణించారు. నెత్తురు నదులై ప్రవహించింది. తుదకి మే ఏడున ఖానుబహదూరుఖాను తక్కిన నాయకులతో కలిసి బరేలీ వొదిలేసి వెళ్ళిపోయాడు. బరేలీ ఇంగ్లీషు వాళ్ళ వశమయిపోయింది.

బరేలీ నశమయిందనేసరికి శాహజహాఁపురం అహమదుషా పట్టుకున్నాడన్న వార్తవచ్చింది. వార్తఅందడమేతడువు, ఆఘమేఘాల మీదవెళ్ళి శాహజహాఁపురం ముట్టడించాడు కాంబెలు. మూడు దినాలు, ఘోరాతిఘోరంగా యుద్ధంజరిగింది. అహమదుషా బైటికి తప్పుకోడానికి వీలులేకపోయింది. ఈసంకటసమయంలో అహమదుషాని రక్షించడమే తక్కిన విప్లవనాయకుల ప్రధానకర్తవ్యమయిపోయింది. చెల్లాచెదరయివున్న నాయకులు — నానాసాహెబూ, శాహజాదా ఫిరోజిషా, బేగం హజరతుమహలూ, మియ్యాఁసాహెబూ, మహ మూదీరాజూ — యావన్మందీ తమతమసేనలతో అహమదుషా సహాయంకోసం పదిహేనున శాహజహాఁపురం వచ్చేశారు. వీళ్ళందరిసహా

యంతో అహమదుషా చెక్కు-చెదరకండా కుంపినీసేనమధ్యనించి దాటే శాడు. కాలిను కాంబెలు తెల్లమొహంవేశాడు.

అలా శాహజహాంపురంనించి వచ్చేసి అహమదుషా తిరిగీ అయోధ్యలో ప్రవేశించాడు. కొత్తసేనకూర్చుకుని అయోధ్యనించి ఇంగ్లీషు వాళ్లని వెళ్లగొట్టడానికి అతడు పునఃప్రయత్నంచేశాడు. దారిలో పవస అని ఒక స్వతంత్రరాజ్యముంది. పవసరాజు జగన్నాథసింహుడికి బేగంహజరతుమహాలు రాజముద్రతో అహమదుషా ఒక జాబు రాసి, కొంత సైన్యసహాయం కోరాడు. పవస రాజు ఉత్తరమందుకున్నాడు; జవాబురాశాడు. అహమదుషాని స్వయంగా నచ్చి కలుసుకోమన్నాడు.

అవాళ జూను ఇరవైఅయిదు. జగన్నాథసింహుడి ఉత్తరంప్రకారం మౌల్వీ అహమదుషా పవస వెళ్లాడు. అహమదుషా ఏనుగు పవస చేరే సరికి పట్నంతలుపులు మూసేసివున్నాయి. సాయుధులయిన సైనికులు కాపలాకాస్తున్నారు. వాళ్ల మధ్య జగన్నాథసింహుడూ, అతడి తమ్ముడూ నుంచునివున్నారు. చూసీచూడడంతోనే అహమదుషాకి అర్థమయిపోయింది. అయినా అతడు నిర్భయంగా ముందుకిసాగాడు; సంభాషణకి ఉపక్రమించాడు. ఇంతలో జగన్నాథసింహుడి తమ్ముడు తుపాకితీసి అహమదుషాని కాల్చేశాడు. మౌల్వీ అహమదుషా స్వర్గస్థుడయి పోయాడు. ఉత్తరక్షణంలో జగన్నాథసింహుడు అహమదుషా తలకాయ నరికేసి, ఉత్తరీయంలో కట్టి దగ్గిరసా, శాహజహాంపురానికి పదమూడుమైళ్ల దూరంలోవున్న పోలీసుస్టేషనుకి పరిగెత్తాడు. అప్పుడే అక్కడ భోజనాలకి కూచున్న కుంపినీఆఫీసర్ల ఎదటపెట్టి నుంచున్నాడు.

మర్నాడు అహమదుషా శిరస్సు పెద్దపోలీసుస్టేషను దగ్గిర వేలాడ గట్టారు. సమ్మక్రద్రోహంచేసి, ఈ దారుణం సాధించిన పవసరాజు జగ

న్నాథసింహుడికి బ్రిటిషువాళ్ళు యాభై వేలురూపాయలు బహూక రించారు.

అయోధ్యమహావీరుడు మౌల్వీ అహమదుషా అలా శత్రువుచేత కాక ఎక్కడ దేశద్రోహి మోసానికి లోబడి తన దేశంకోసం, ధర్మం కోసం హతమై పోయాడు. ఉత్తరభారతంలోని విప్లవనాయకులలో మౌల్వీఅహమదుషా అద్భుతమైనవ్యక్తి. అతడికి అతడే సాటి. కండ రాలుతిరిగిన పొడవాటి సన్ననిశరీరం, తీక్ష్ణమైనచూపూ, కత్తిల్లాంటి ముక్కూ—అతడు జనం ముందు నుంచుంటేచాలు ఎంతమందినైనా ఇట్టే వశపరుచుకునేవాడు. "ఉన్నత భావాలుకల ఉత్తమ నాయకుడతడు. ఒక మహావిప్లవం నడిపించగలవాడు. ఒక మహాసైన్యానికి సేనానాయకుడు కాదగ్గవాడు."*

"మౌల్వీ అహమదుషా అసాధారణమయిన వ్యక్తి. సేనానాయకుడిగా అతడి యోగ్యత ఈ విప్లవంలో అనేకసార్లు రుజువయింది. అతడుతప్ప మరొక డెవడూ సర్ కాలిను కాంబెలుని రెండుసార్లు ఓడించానని తలఎత్తి చెప్పుకోగలవాడు లేడు.....పైజాబాదు మౌల్వీ అహమదుషా అలా మరణించాడు. తన జన్మభూమిస్వాతంత్ర్యం పరాయివాళ్ళు అపహరించినప్పుడు, తిరిగీ ఆ స్వాతంత్ర్యం సంపాదించడంకోసం ప్రయత్నించి యుద్ధంచేసినవాడు దేశభక్తుడయితే, నిజంగా మౌల్వీ అహమదుషా స్వచ్ఛమయిన దేశభక్తుడు; సందేహం లేదు. ఎవరినీ దొంగదెబ్బకొట్టి తనకత్తి కలంకితం చేసుకోలేదతడు. నిరపరాధుల్ని చంపడమంటే అతడెప్పుడూ ఒప్పుకోలేదు. వీరుడిలా అతడు పోరాడాడు. తనదేశం అపహరించిన ఫరంగీలమీద బహిరంగంగా అతడు కత్తికట్టాడు; పోరాడాడు. దేశదేశాలవీరులూ, నిజ

* Sepoy war By Holmes.

మయిన మానవులూ యావన్మందీ అహమదుషాపేరు కలకాలం స్మరిస్తారు." †

అ హ మ దు ష హ త్య త ర వా త

అహమదుషా భౌతికదేహమేమో అంతరించింది. కాని అతడి ఆత్మమాత్రం అనంతముఖాల వీరావేశంతో తాండవించింది. అతడి హత్య వినడంతోనే అయోధ్యఅంతటా ఒక్కసారి ప్రళయాగ్ని విజృంభించింది. నిజామాలీఖాను సరాసరివెళ్లి పీలీభీతుమీద విరుచుకు పడ్డాడు. పీలీభీతులోని కుంపినీసేన తట్టుకోడమే దుర్భరమయింది. ఖాను బహదూరుఖాను నాలుగువేలసేనతో రణడిండిమ మోగించాడు. నిజామాలీ, ఖానుబహదూరుఖానూ మళ్ళీ రణరంగానికి ఉరికారనగానే ఫర్రూఖాబాదునించి అయిదువేలమంది సిపాయిలు ఆకుపచ్చజెండాతో హాజరయారు; ఫరంగివాళ్ళని పారదోలుతామంటూ ప్రతిజ్ఞచేశారు. విలాయతుసింగు మూడువేలసేనతో వచ్చి రణతూర్యం దిక్కులు పిక్కటిల్లజేశాడు. నానాసాహెబూ, బాలాసాహెబూ, అలీఖానుమేవాటీ— ఇంతమందీ నేల గజగజలాడినట్టు బయలుదేరారు. ఇదంతా చూసి పవనరాజు జగన్నాథసింహుడు నిలువునా కంపించిపోయాడు. అతణ్ణి రక్షించడంకోసం కుంపినీసేనలు పవన పరిగెత్తాయి.

ఇక అటు ఘాఘురానది చౌకుఘాటు దగ్గిర బేగం హజరతుమహలూ, మామూఖానూ సైన్యాలతో డేరావేశారు. ఢిల్లీశాహజాదా ఫిరోజషా, రుయియా రాజు నరపతిసింహుడు, రాజా రామబక్ష్, బహునాథ సింహుడూ, చందాసింహుడూ, గులాబుసింహుడూ, భూపాల సింహుడూ, హనుమంతసింహుడూ మొదలయిన జమీందారులూ తమ తమ సేనలతో సిద్ధమయారు. ముసిలిరాజు వేణీమాధవుడుకూడా లక్నో ముట్టడికి బయలుదేరాడు. ఇంతమంది కొత్తఉత్సాహం, కొత్త ఉద్రేకం, వీరావేశం ఒకసారి పురివిప్పింది.

† Malleson's Indian Mutiny.

గెలుపుసాధించగలమన్న నిశ్చయంలేదు, నిజమే. అయినా సరే, దేశంకోసం ధర్మంకోసం పోరాడవలిసిందే. అహమదుషా హత్యకి కసి తీర్చుకోవలిసిందే. జయమూ, అపజయమూ అని మీనమేషాలు లెక్కించడం పిరికిపందల పని. విప్లవం ఆరంభమయి ఏటిసర్థం కావస్తోంది. ఆరుమాసాలయి అయోధ్యలో రక్తనదులు ప్రవహిస్తున్నాయి. అయితేనేం అయోధ్యతలవొంచలేదు; వొంచదు.

1858 జూను పదమూడున లక్నోసమీపంలో నవాబుగంజి దగ్గిర విప్లవకారులు సమావేశమై వున్నారు. హఠాత్తుగావచ్చి జనరలు హూపుగ్రాంటు వాళ్ళమీద దాడిప్రారంభించాడు. ఆనాటి యుద్ధం గురించి హూపుగ్రాంటే స్వయంగా ఇలా రాశాడు :—

"సఫలం కాకపోయినా వాళ్ళ దాడిమాత్రం భీషణమయింది. తట్టుకునేసరికి మా తలప్రాణం తోకకివచ్చింది. సాహసవంతులయిన చక్కని జమీందారులు రెండుఫిరంగులు పట్టుకు వచ్చారు; మానెనకనించి ఆక్రమించారు. ఇండియాలో నేను ఎన్నో యుద్ధరంగాలు చూశాను. గెలుపో చావో అని ప్రతినపట్టి పోరాడిన ఎంతోమంది వీరులన్నీ చూశాను. కాని ఈ జమీందారులంత దేదీప్యమయిన ప్రవర్తన మాత్రం ఎక్కడా చూడలేదు. మొదట వాళ్ళు హడ్సను గుర్రపు దళం ఎదిరించారు. అతడు నిభాయించుకో లేకపోయాడు. ఆగుర్రపు దళంతోవున్న మూఫిరంగులు రెండు చిక్కులోపడిపోయాయి. నేను ఏడోపటాలాన్ని ముందుకినడవమని ఆజ్ఞాపించాను. ఆ పటాలంలో మరి నాలుగు ఫిరంగులున్నాయి. శత్రువుకి అయిదువందలగజాల దూరంలో వాటినిపెట్టి, అగ్నిగోళాలు కురిపించడం మొదలుపెట్టాము. కత్తితో కొట్టేసిన ముళ్ళమొక్కలలాగ తెగిపోతూవచ్చారు వాళ్ళు. వాళ్ళ నాయకుడు వొక ఆజానుబాహువు. అతడి మెడమీద వొక గండమాల వుండేది. అతడురవంతా చలించలేదు. తన ఫిరంగులదగ్గిర

అతడు రెండు ఆకుపచ్చ జెండాలు పాతాడు. ఆ జెండాలకింద తన ఫౌజు సమావేశపరిచాడు. అయితే మా ఫిరంగులుమాత్రం ఘోరంగా గుళ్ళు కుమ్మరిస్తూవుండేవి. ఫిరంగులదగ్గిరికి వచ్చీరావడంతోనే వాళ్ళు కూలిపోతూవుండేవాళ్ళు. ఇంతలో మాసహాయంకోసం మరిరెండు కొత్త పటాలాలు వచ్చాయి. అయినా వాళ్ళు లొంగలేదు. కత్తులతోనూ, ఈటెలతోనూ మామీదికి కాలుదువ్వారు. సవాలు చేశారు. వాళ్ళ రెండు ఫిరంగులుసగ్గిరే మాకు వందా పాతిక శవాలు దొరికాయి. మూడుగంటలు దారుణంగా పోరాటం సాగినతరవాత తుదకి గెలుపు మాదేఅయింది.'' *

అయోధ్యఅంతటా ఇలాగే పోరాటం జరిగింది. జయాపజయాలతో సంబంధంలేకుండా విప్లవసేన వీరావేశంతోపోరాడింది. జూనుమాసం గడిచిపోయింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరుమాసాలుకూడా గడిచిపోయాయి. అయోధ్యలోస్వాతంత్ర్యసమరం సాగుతూనేవుంది. అక్టోబరులో కాలినుకాంబెలు మరిన్ని కొత్తసేనలు సమకూర్చాడు. అన్ని దిక్కులనించీఅయోధ్య ముట్టడించాడు. విప్లవసేన తాళుకోవడం కష్టమయింది. పోరాడుతూ, పోరాడుతూ విప్లవకారులు ఉత్తరాదికి తరిలిపోవడ మారంభించారు. కుంపినీసేన వాళ్ళని వెంటతరుముతూ బయలుదేరింది.

రాజా వేణీమాధవుడి శంకరపురం మూడుపటాలాలూ మూడు దిక్కులనించి ముట్టడించాయి. కుంపినీసేన సముద్రంలావుంది. దాని ముందు వేణీమాధవుడిసేన సముద్రంలో కాకిరెట్ట. అయినా అతడు చలించలేదు. యుద్ధానికే సిద్ధపడ్డాడు.

కుంపినీ సర్వసేనాని కాంబెలు అతడికి సందేశమంపాడు — "ఇదిగో మీరు గెలుస్తారన్న ఆశ వొట్టిది. వ్యర్థంగా రక్తపాతంకలిగించడం

* Incidents of the Sepoy War – Hope Grant.

దేనికి? లొంగిపోండి. మిమ్మల్ని క్షమిస్తాం. మీజమీందారీయావత్తూ తిరిగీమీకు ఇచ్చేస్తాం."

దీనికి వేణీమాధవుడిచ్చిన జవాబు – "నాకోట నేను రక్షించుకోలేను. నాకు తెలుసు. అంచేత కోట వొదిలేస్తున్నాను. అయితే నేనుమాత్రం తలవొంచడంకల్ల. ఏమంటారా? నాశరీరం నాదికాదు; నాపాదుషాది."

ఝాన్సీ రాణి లక్ష్మీబాయి

ఝాన్సీ స్వాధీనంకావడంతోనే వింధ్యఖండమంతటాకూడా విప్లవం విజృంభించింది. పెద్దపెద్దరాజ్యాలుతప్పించి చిన్నచిన్నరాజ్యాలన్నీ విప్లవంలో చేరిపోయాయి. వచ్చి స్వరాజ్యసమరంలో పాల్గొనమని వింధ్యఖండం రాజులందరికీ రాణీ లక్ష్మీబాయి ఉత్తరాలురాసింది. * బానపురంరాజు మర్దానసింహుడూ, శాహగడంరాజు బఖ్తబలీ మొదలయిన రాజులు తమతమసేనలతో విప్లవంలో పాల్గొన్నారు. రహటగడమూ, సాగరూ, గఢకోటా, నవాగాం, బందా, కర్కీ – అన్నిచోట్లా విప్లవం విజృంభించింది. 1857 జూనునించి 1858 జనవరివరకూ యమున దక్షిణ భాగంనించి వింధ్యాచలం ఉత్తరభాగంయావత్తూ విప్లవకారులకిందే వుంది. అయితే దీనంతటికీ కేంద్రం ఝాన్సీ; నాయకురాలు మహారాణి లక్ష్మీబాయి.

అసలు మొట్టమొదట ఝాన్సీసిపాయిలు ఇంగ్లీషువాళ్ళని హతవార్చి, ఢిల్లీ వెళ్ళిపోయాక, లక్ష్మీబాయి ఆఉదంతంయావత్తూ సాగరులోని ఇంగ్లీషువాళ్ళకి రాసిపంపింది. దానికి వాళ్లు "తగిన అధికారి వచ్చేవరకూ ఝాన్సీరాజ్యం మీరే పాలిస్తూవుండండి" అంటూ ప్రత్యుత్తరంరాశారు. జబ్బలపురం కర్నలు ఆర్నకికుకీ, ఆగ్రా చీపుకమీషనరు

---

* బానపురంరాజుకి లక్ష్మీబాయి రాసిన ఉత్తరం భానపురంలో నేటికీ భద్రంగావుంది.

కర్నలు ఫ్రేజరుకీ కూడా ఆమె ఉత్తరాలు రాసింది. అందుకనే కెప్టెను ఫింకు రాస్తూ "లక్ష్మీబాయి ఇంగ్లీషువాళ్ళతో సఖ్యంగా ఉండాలనే ప్రయత్నించింది" అన్నాడు. అయితే ఇంగ్లీషువాళ్లు మాత్రం ఆమె మీద అభాండాలే కల్పించారు.

మహారాణి లక్ష్మీబాయి ఝాన్సీ రాజదండం పుచ్చుకోగానే లక్ష్మణ రావుపాండేని ప్రధానమంత్రిగా నియమించింది. జవాహరసింగుని ప్రధాన సేనాపతిగా ఏర్పరిచింది. కాల్పీలానికి దివాను రఘునాథసింహుడూ మహమ్మదు జమాఖానూ, ఖుదాబక్షూ — ఈ ముగ్గురూ వరసగా సేనానాయకులయారు. గులాపుదళానికి స్వయంగా లక్ష్మీబాయి సేనా నాయకురా లయింది. తక్కినశాఖలమీద కూడా తగినవాళ్లని అధి కార్లుగా ఏర్పరిచింది. ఇదంతా అయాక ఆమె బలమైన పటాలం కూర్చడం ప్రారంభించింది. ఇంగ్లీషువాళ్లు, రాజ్యం వశపరుచుకొన్నాక ఝాన్సీలోని పాతఫిరంగులూ అవీ పాడుచేసి మూల పారేశారు. అందులో 1781 ఉదేసింహుడి నాడు జయరామనస్తాను తయారుచేసిన గొప్ప ఫిరంగి 'భవానీశంకర' కూడా వుండేది. భవానీశంకర, శత్రుసం హార, సల్లాపు, ఘనగర్జు — ఈ ఫిరంగులన్నీ, వెంటనే సిద్ధంచేయించిం దామె. కత్తులూ, తుపాకులూ, గుళ్లూ, ఫిరంగులూ తయారుచేయడా నికి కార్ఖానాకూడా ఏర్పరిచింది. గులాముగౌసుఖాను పాతఫిరంగులన్నీ మరమ్మతుచేసి సిద్ధపరిచాడు.

రాజ్యపాలన ప్రారంభించాక రాణి లక్ష్మీబాయి మొదట దేశీయ శత్రువులనే ఎదుర్కొనవలసివచ్చింది. ఝాన్సీ రాజబంధువొకడు సదా శివరావు తానే ఝాన్సీరాజునని బయలుదేరాడు. రాజప్రకరం థానేదా రయిన మహమ్మదు గులాము హుస్సేనుని చంపేశాడు. లక్ష్మీబాయి సదాశివరావుమీద దండెత్తింది; బంధించి జైల్లోవేసింది. ఇంతలో ఓర్ఛాచివాను నత్థేఖాను పెద్దసేనతో వచ్చి ఝాన్సీని ముట్టడించాడు.

అతణ్ణి కూడా లక్ష్మీబాయివోడించి పారదోలింది. అతడువెళ్ళి స్వాతంత్ర్యసమరానికి విరుద్ధంగా కుంపినీవాళ్ళతో చేరాడు.

పరిపాలన మొదలుపెట్టిన కొద్దిదినాలలోనే లక్ష్మీబాయి అద్భుతమయిన సామర్థ్యం ప్రదర్శించింది. యావన్మంది ప్రజలూ ఆమెని దేవతలాగ చూసుకున్నారు. రాజ్యంలోని ప్రతీ విషయమూ ఆమె స్వయంగా వెయ్యికళ్ళతో చూసేది. ఆమె బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచేది. స్నానాదికాలు ముగించుకుని పూజలో కూచునేది. అనంతరం సంకీర్తనం వినేది. ఇంతలో పౌరాణికులు వచ్చేవాళ్ళు; రామాయణం, మహాభారతం వినిపించేవాళ్లు. అదయాక రాజోద్యోగులు వచ్చేవాళ్ళు. వాళ్ళతో రాజవ్యవహారాలు విచారించి తగిన ఆదేశాలిచ్చే దామె. మధ్యాహ్నం రవంత విశ్రాంతి తీసుకునేది. మూడు గంటలయేసరికి దర్బారుకి వచ్చేది. దర్బారులో స్వయంగా ప్రజల కష్టసుఖాలు విచారించేది. దీనులంటే ఆమె ప్రాణం పెట్టేది. ప్రతీ మంగళవారమూ, శుక్రవారమూ ఆమె మహాలక్ష్మీ మందిరానికి వెళ్ళేది. అప్పుడప్పుడు తామ్జూనామీదా, అప్పుడప్పుడు గుర్రంమీదా వెళ్లేది. తామ్జూనామీద వెళ్లినప్పుడు మహారాష్ట్రరాణుల దుస్తులు వేసుకునేది. గుర్రంమీద వెళ్లినప్పుడు పురుషవేషంలో వుండేది. అంగీ పైజామా, జరీపటకా, పొడవాటికత్తి, పగిడీ — ఇలా పురుషవేషం వేసుకునేది. ముందు వాద్యాలూ, వెనక అయిదారు సందల సిపాయిలూ నడిచేవాళ్లు. ఇలా మహారాణి లక్ష్మీబాయి తొమ్మిది పదిమాసాలపాటు మహావైభవంగా ప్రజల కళ్లవేడుకగా ఝాన్సీరాజ్యం పరిపాలించింది.

ఇంగ్లాండునించి ఇండియాదిగిన సేనానాయకులలో సర్ హూ రోజు వొక సమర్థుడయిన సేనాని. అతడు 1857 సెప్టెంబరు పదహారున బొంబాయిలో దిగాడు. సర్వసేనాని రోజుని ఝాన్సీముట్టడికి నియో

గించాడు. కాంబెలు యమున ఉత్తరాన అయోధ్యా రోహిల్‌ఖండ్ లలో విప్లవకారులమీద దాడిచేసినప్పటి రోజు దక్షిణంగట్టు యమునా వింధ్యలు మధ్య దండయాత్ర సాగించాడు. కాంబెలుసేనలో సిక్కు-లూ ఘూర్ఖాలూ వున్నప్పటి రోజుసేనలో హైదరాబాదు, భోపాల సేనలూ, మద్రాసు బొంబాయి పటాలాలూ కలిశాయి.

డిశంబరు పదిహేడున రోజుసేనాని తన సేన రెండుభాగాలుచేశాడు. ఒకభాగంలో బొంబాయి మూడో సుప్రసిద్ధమూ, పదాతిలుగోలైటు డ్రాగను పటాలమూ, హైదరాబాదు కంటోజెంటులోని రెండు సుప్రసిద్ధ దళాలూ, ఇరవైఅయిదో పటాలమూ, మూడుఫిరంగిదళాలూ పెట్టాడు. రెండో భాగంలో బొంబాయి సుప్రసిద్ధుడు పెద్దభాగమూ, హైదరాబాదు కంటోజెంటు పూర్తిసుప్రసిద్ధమూ, వారి పదాతిదళమూ బొంబాయి యూరోపియను కొండమంటలూ, బొంబాయి ఇరవైనాలుగో నేటివు పదాతిదళమూ, భూపాల రాజ్యంలోని పెద్దఫిరంగి దళమూ, మద్రాసు పటాలమూ పెట్టాడు. ఒకభాగం బ్రిగేడియరు విక్టర్‌లాకు నాయకత్వం కింద జబ్బలపురంనించి బయలుదేరింది. రెండోది ప్రుచ్ఛ్వ కాని స్వయంగా రోజు 1858 జనవరి ఆరున ముప్పుగుంచి సాగిపోట్లు బయలుదేరాడు. దారిలోనే బేగం భూపాలు పంపిన ఎదిమినెనంగల ఫౌజు అతడిసేనతో కలిసింది.

అలా బయలుదేరే రోజుసేనాని రహతగఢం దగ్గిర దండు విడిశాడు. రహతగఢనుర్గం విప్లవనాయకుడైన వదాను స్వాధీనంలో వుండేది. నాలుగుదినాలు భీషణమయిన యుద్ధం జరిగింది. తుదకి స్వాధీను దుర్గం వొదిలి వెళ్లిపోయాడు.

రహతగఢం చేరుననే బానపురం సంస్థాన ముంది. బానపురం రాజు మర్దానసింహుడు రహతఫురంనించి పదిహేను మైళ్ళ దూరంలో బడో దియాగ్రామం దగ్గిర శిబిరంవేసుకున్నాడు. రోజు సేనాని రాణున

బరోదియావెళ్ళి మర్దానసింహుణ్ణి ఫిరాయించింది. రెండుసేనలూ డీకొన్నాయి. ఆయుద్ధంలో కెప్టెను నేవలు మరణించాడు. చివరికి మర్దానుసింగు బరోదియా వొదలి వెనకకి వెళ్లిపోయాడు.

ఫిబ్రవరి మూడున రోజు రహతగడంనించి పన్నెండుకోసుల దూరంలోవున్న సాగరు ముట్టడించాడు. అక్కడి విప్లవకారుల్ని పార దోలాడు. అక్కడనించివెళ్లి గఢకోటమీద దాడిచేశాడు. సాగరు నించి గఢకోట పాతికమైళ్ళదూరంలోవుంది. అక్కడ యూభైవొకటో, యూభై రెండూ బెంగాలుపదాతికదళంతాలూకు విప్లవకారులుండేవాళ్ళు. రోజు పటాలంతోవాళ్ళు దారుణంగా పోరాడారు. తుదకి గఢకోట దుర్గం వొదిలి వెళ్లిపోయారు.

ఇలా నర్మదానది ఉత్తరరంగం యావత్తూ సర్ హూ రోజు స్వాధీన పరుచుకున్నాడు. ఇక ఝూన్సీమీదికి ఉరకడమే తరవాయి. ఝూన్సీ వెళ్ళడమంటే మాటలమీద లేదు. దారి దారంతా విప్లవసేన చెదరి వుంది. మాలచూనూ, మదనపురమూ, నారహతా, ధీమోలీ మొదలయిన ఇరుకుఘాటీలన్నీ దాటాలి. ఇదంతా ఆలోచించి రోజు తనసేన కొన్ని తుకిడీలకింద భాగించి, వేరువేరు దారులలో ముందుకి నడిపించాడు. అందులో పెద్దభాగం తీసుకుని తాను నారహతఘాటీ దిక్కు నడిచాడు. కాని దారిలో బానపురంరాజు మర్దానసింహుడు పెద్ద సేనతో సిద్ధంగావున్నాడని విని అతడు శాహగడరాజ్యంలోని మదన పురంఘాటీదిక్కు తిరిగాడు. అయితే ఈదారిని శాహగడంరాజు బఖతు బలీసేన వుంది. దీనితో మర్దానసింహుడుకూడా వచ్చి కలియకండా రోజు కొంతపటాలం నారహతాఘాటీతట్టు పంపాడు. మర్దానసింహుడు ఈఎత్తుగహించలేకపోయాడు. అతడు నారహతఘాటీమార్గమేకాశాడు.

మదనపురం అక్కడికి ఆగ్నేయంగా ఇరవైమైళ్ళదూరంలో రెండు కొండలమధ్య పెద్ద సరోవరంపక్క వుంది. సరోవరం దగ్గిరే బఖతబలీ

సేన ఇంగ్లీషుసేన నెదిరించింది. దారుణమైన యుద్ధం జరిగింది. ఎంతో మంది ఇంగ్లీషుసైనికులు మరణించారు. రోజుసేనాని గాయపడ్డాడు. అతడిగుర్రం చచ్చిపోయింది. అయితే తుదకి బఖ్తబలీ ఓడిపోయాడు. అతడి సర్దారులు అనేకమంది పట్టుపడిపోయారు. వాళ్ళందరినీ అక్కడే చంపేశాడు రోజు.

బఖ్తబలీని ఓడించి మిగిలిన విప్లవకారుల్ని సరాయదుర్గంవరకూ రోజు వెంటదరిమాడు. సరాయదుర్గం వొకచిన్న కొండమీద వుంది. కొండచేరువగా బఖ్తబలీతాలూకు వొక ఉద్యానముంది. ఆ ఉద్యానం లోనే రోజుసేనాని డేరావేశాడు. మర్నాడు మోహువరాగ్రామం మీద దాడిచేసి, అక్కడి విప్లవకారుల్ని తరిమేశాడు. బుందేలుఖండం పొలిటికలుఏజంటు సర్ రాబర్టు హామిల్టనుకూడా రోజుతో వుండే వాడు. మదనపురం యుద్ధమయాక శాహగడరాజ్యం కుంపినీరాజ్యంలో కలిపేసుకున్నామంటూ అతడు ప్రకటించాడు. మదనపురం ఆస్థాన జ్యోతిష్కుణ్ణి కూడా పట్టుకున్నారు. ఇంగ్లీషువాళ్ళు ఓడిపోతారని జోశ్యంచెప్పాడన్న నేరంమోపి అతణ్ణి వురితీసేశారు.

బఖ్తబలీ ఓడిపోయాడని వినగానే మర్దానసింహుడు నారహతఘాటీ వొదిలేసి వెళిపోయాడు. మేనేజరు బయలోను బొనపురం ముట్టడించాడు. బొనపురం రాజమహలు మందుగుండుపేల్చి పడగొట్టేశాడు. చిత్ర పటాలూ వాటితోకూడా గ్రంథాలయం నిప్పుముట్టించేశాడు. బొన పురందుర్గంమీద యూనియను జాకు ఎగరవేశాడు.

మర్నాడు పన్నెండున రోజుసేనాని తాలచేహాటదుర్గం పట్టుకు న్నాడు. అక్కడి విప్లవకారుల్ని పారదోలాడు. అలా దారికడ్డాకూ విజయాలు సాధిస్తూ అతడు మార్చి పదిహేడునచారిత్రకప్రసిద్ధమైన చందేరీదుర్గం ముట్టడించాడు. అనాయాసంగా అది స్వాధీనపరుచు కున్నాడు. అక్కడినించి బయలుదేరి మార్చి పందొమ్మిదిని ఝాన్సీకి

పదాన్నాలుగువమ్మెళ్ళదూరంలో చంచసఫురంగ్రామంలో డేరావేశాడు. వివిధమార్గాలలో బైలుదేరిన సేనలన్నీ వచ్చి అక్కడ కలుసుకున్నాయి. అలాచేరినపటాలం మొత్తం అరవై వేలకి మించింది. ఇంత రాణువతోనూ ఝాన్సీమీద విరుచుకుపడడంకోసంసిద్ధపడ్డాడు రోజు.

ఫరంగిసేన రాజ్యంలో అడుగుపెట్టకముందే రాణీ లక్ష్మీబాయి ఝాన్సీ చుట్టుపట్ల ఎంతోదూరంవరకూ ఖాళీచేయించేసింది. శత్రువుకి భోజనసామగ్రికాని, గుర్రాలకీ వాటికే పచ్చగడ్డికాని దొరకకుండా ఎడారి చేసేసింది. నీడపట్టుని రవంతకూచుని సేదదీర్చుకుందికి ఎొకచెట్టయినా లేకుండా కొట్టించేసింది. అయితే ఫరంగిసేనకి ఏమాత్రమూ ఇబ్బందికల గకుండా, తుదకి పచ్చగడ్డికూడా కనువుతీకుండా సిధియామహారాజూ, రెహరీటీకామగడం రాజూ ఏడుకున్నారు.

ఝాన్సీపొలిమేరలో ఇంగ్లీషుసేన అడుగుపెట్టగానే, మహారాణీ లక్ష్మీబాయి విష్ణుసేనకి స్వయంగా నాయకత్వం సహించింది. ఝాన్సీ నగరంచుట్టూ నాలుగున్నరమైళ్ళు పద్దెనిమిది అడుగులనించీ ముప్ఫయి అడుగుల ఎత్తునరకూ ప్రహర్మండమ్మెన ప్రాకారముంది. నాలుగుదిక్కులా ఉన్నావుఫాటకు, భాండాదేఫాటకు, సుజేఖాఫాటకు, ఖండీరావుఫాటకు, దతియాఫాటకు, ఓర్చాయఫాటకు — ఇలా ఎనిమిద్వారాలున్నాయి. ప్రాకారంమీదా, పట్టణంఫాటకులమీదా, బురుజులమీదా మొత్తం యాభైరెండుఫిరంగులు అమిర్చిపెట్టారు. మహారాణీ స్వయంగా అన్ని ఏర్పాట్లూచేసి యుద్ధానికి సిద్ధపడింది.

ఇంతలో సర్ హూ రోజు మహారాణికి ఎొక ఉత్తరంరాసి పంపాడు — "మీమంత్రులతోకూడా నిరాయుధులయి మీరు మా శిబిరంలో హాజరుకావలిసింది" అని మహారాణీ వీరోచితంగా నిరాకరించింది ; యుద్ధానికే సిద్ధపడింది.

1858 మార్చి ఇరవై మూడు మంగళవారం తెల తెలవారుతూ వుం డగానే సర్ హూ రోజు రణతూర్యం మోగించాడు. ఝాన్సీలో రణ భేరీ మోగింది. యుద్ధ మారంభమైపోయింది. ఝాన్సీ బురుజులమించి ఫిరంగులు గర్జించాయి. ఓంప్రథమంగా 'ఘనగర్జన' కుంపినీపటాలం మీద అగ్నిగోళాలు విరజిమ్మింది. ఝాన్సీ ఫిరంగిదళాధిపతి గులాము గౌసుఖాను గురి అద్భుతంగా వుండేది. ఇంగ్లీషుపటాలంలో ఎంతోమంది హతవారిపోయారు. ఆరాత్రి ఇంగ్లీషువాళ్లు మూడువందల గజాలదూరం లో బారు పహాడ్ గుట్టలమీద వెనకనించివచ్చి ఫిరంగులు స్థాపించారు. మర్నాడు ఇరవైనాలుగున ఈఫిరంగులు పట్నంమీద అగ్గిగుళ్లు కుమ్మ రించాయి. ప్రజలు బైటికిరావడం కష్టమయింది. దుకాణాలూ బజా రులూ అన్నీ మూసేశారు. ఆమర్నాటియుద్ధం మరీ భయంకరంగా జరిగింది. ఇంగ్లీషు ఫిరంగులు పగలూ, రాత్రి ఎడతెరిపిలేకుండా పేలుతూ వుండేవి. ముప్పయ్యేసిశేర్ల గుళ్ళు యాభై య్యేసిశేర్ల గుళ్లు పట్నం మీద పడుతూ వుండేవి. అవి పడ్డచోటల్లా నానాభీభత్సం జరిగిపోతూ వుండేది. రాత్రివేళ అంతలేసి గుళ్ళూ ఎర్రటి బంతుల్లాగ అవుపించేవి.

ఝాన్సీఫిరంగులు కూడా దెబ్బకిదెబ్బ తీస్తూవుండేవి. ఇరవై అయి దున కుంపినీఫిరంగులు దక్షిణద్వారంమీద దారుణంగా వర్షించాయి. ఝాన్సీఫిరంగులు బంద్‌అయిపోయాయి. ఒక్కడూ అక్కడ నిలవలేక పోయాడు. అదిచూసి మహారాణి పడమటిబురుజుమీదిఫిరంగి 'కడక్ బిజిలీ' శత్రువులమీద గురిపెట్టించింది. ఒకటీ, రెండూ, మూడు — మూడోగుండు పేలేసరికి ఇంగ్లీషుఫిరంగిదళం నాయకుడు తారుమనిపో యాడు. ఇంగ్లీషుఫిరంగులుఆగిపోయాయి. మహారాణి సంతోషం పట్ట లేకపోయింది. బంగారుకడియంతీసి గులాము గౌసుఖానుకి బహూకరిం చింది. మర్నాడూ, ఆమర్నాడూకూడా ఇలాగే ఝాన్సీఫిరంగులు అద్భు తంగా పనిచేశాయి. ఇంగ్లీషుసేనలో ఎంతోమంది హతవైపోయారు.

ఇంగ్లీషుసేన ఎన్నో సార్లు పట్నంలో చొరబడాలని ప్రయత్నించింది. అన్ని సార్లూ ఝాన్సీ వీరసైనికులు వాళ్ళని ఘోరంగా ఎదిరించిపార దోలారు. ఈయుద్ధంలో ఝాన్సీస్త్రీలు ఎంతోమంది నడుంకట్టారు. రోజుసేనాని దుర్బిణీవేసి చూసినప్పుడల్లా ఫిరంగులదగ్గిరా అక్కడా స్త్రీలు కనపడుతూనే వుండేవాళ్ళు.

"మార్చి ఇరవై ఎనిమిదిని మేము కోటలోని ఫిరంగులు ఎన్నో సార్లు ఆగిపోయినట్లు చేసేశాం. కాని అంతలోనే అవి మళ్ళీ మరింతభయంకరంగా గుళ్ళు కురిపించేవి. ఈలోగా వొకసారి ఘోరమయిన శబ్దమయింది. ఆకాశమంటుతూ అగ్నిశిఖలవుపించాయి. అయినా యుద్ధం మాత్రం యథాప్రకారం హోరాహోరి సాగుతూనేవుంది. ఇరవై తొమ్మిదినిమధ్యాహ్నంవరకూ శత్రుపక్షంనించి గుళ్లురాలేదు. కాని మధ్యాహ్నంతరవాత మూడున్నరగంట లయేసరికి ప్రతీదిసంలాగే మామీద అగ్నివర్షం ఆరంభమయింది.

ఇంచుమించు ప్రతీదినం మూడున్నరనించి పొద్దుగూకేదాకా ఇదే తంతు జరిగేది. పాపం, మాసిపాయిలు ఈసమయమంతా అరిచేతిలో ప్రాణాలుపెట్టుకు గడిపేవాళ్ళు. బాగులోని ఫిరంగులూ, కోటద్వారం మీది ఫిరంగులూ మమ్మల్ని నానాపాట్లూ పెట్టేవి. అయితే బాగులో ఫిరంగులదగ్గిర చెట్లకింద ఇరవయ్యేసిమంది స్త్రీలూ, పురుషులూ నిర్భయంగా తిరుగుతూ వస్తూపోతూ వుండడం కనపడేది మాకు. అసలు యుద్ధమన్నది జరుగుతున్నట్టే లేదని వాళ్ళ కనిపించేది. మాపక్షంనించి కూడా వాళ్ళమీద సరాసరి గుళ్ళు కుమ్మరించేవాళ్ళం. కాని వాటి ప్రభావం వాళ్ళమీద ఏమాత్రమూ అవుపించేదికాదు. మార్చి ముప్ఫయీ, ముప్ఫయివొకటిల్లో గుళ్ళవాన దుర్గప్రాకారం గుండపిండి చెయ్యడం మొదలెట్టింది. శత్రువులుకూడా మామీద ఘోరంగా అగ్గి కురిపిస్తూవచ్చారు. మేం ప్రాకారమూ, దుర్గమూ పాడుచేస్తూవున్నా

నిత్యమూజరిగే యుద్ధంలోఏమాత్రమూ మార్పువుండేది కాదు. మేము ఎంత ఘోరంగా పోరాడుతూవుంటే వాళ్ళసాహసమంత అధికమవుతూ వున్నట్టు కనిపించేది." *

ఏడోనాడు సాయంకాలం కంపినీఫిరంగిగుళ్ళుపడి పట్నం ఎడమ పక్క-గోడ కొంతభాగం కూలిపోయింది. ఆ తెట్టువున్న ఝాన్సీఫిరంగు లున్నూ ఆగిపోయాయి. ఎవ్వరూ అక్కడ నుంచోలేకపోయారు. అయితే రాత్రి పడకండుగంటల తరవాత తాపీపనివాళ్ళు కంబళ్ళు కప్పుకునివచ్చి, పడిపోయిన ప్రాకారంగోడ తెల్లతెల్లవారేసరికి మర మ్మత్తు చేసేశారు. మర్నాడు ఎప్పటిలాగే అక్కడి ఫిరంగులు ప్రళయ గర్జన చేశాయి. ఎనిమిదోనాడు ఇంగ్లీషుదండు శంకరకిల్లాతట్టు నడిచింది. కిల్లాలో నీళ్ళుపర్వాటున్న చోటు గురిచూసి ఫిరంగిగుళ్ళు కుమ్మరించింది. నీళ్ళకివచ్చిన నలుగు రయిదుగురు మరణించారు. అవాళ నాలుగు గం టలవరకూ ఎవళ్ళకీ నీళ్ళచుక్కలు దొరకలేదు. కోటలో స్నానాలూ అపీ ఆగిపోయాయి. ఇంతలో పడమటిద్వారంమీద, దక్షిణద్వారం మీదా వున్న ఫిరంగులు ఇంగ్లీషువాళ్ళమీద చాలాగట్టిగా దాడి చేశాయి. శంకరకిల్లామీద గుళ్ళుకురిపిస్తూ వున్న ఇంగ్లీషుఫిరంగులు ఆగిపోయాయి. కోటలో నీళ్ళసరఫరా యథాప్రకారం సాగింది.

కోటలో వొక చింతచెట్టు వుండేది. దానికిందే వొక మందుగుండు కొట్టు వుండేది. కంపినీఫిరంగిగుండు వొకటివచ్చి చింతచెట్టుదగ్గిర పడింది. మందుగుండుకొట్టు సిప్పంటుకుంది; పెద్దశబ్దంతో భస్మమయి పోయింది. స్త్రీలూ, పురుషులూ ముప్పయి ఎనమండుగురు హతులై పోయారు. నలభైయాభై మంది గాయపడ్డారు. ఝాన్సీ ఫిరంగుల యుద్ధం ఇలా ప్రతిదినం ఘోరంగాసాగింది. మహారాణి లక్ష్మీబాయి రవంతా విశ్రాంతిలేకండా చుర్గమంతటా ఎక్కడుంటే అక్కడ

* Thomas Lowe—Central India.

ప్రత్యక్షమయేది. ఆమెమాట వినబడేసరికి సైనికులలో అద్భుతమైన శక్తి పుట్టుకువచ్చేది. ఆమె సాహసమూ, వీరత్వమూ నభూతో నభవిష్యతిగా వుండేవి.

ఇక్కడ ఝాన్సీలో సమరం ఆరంభమయేముందు యమున అవతల తాంతియాటోపే తనసేనతో సిద్ధమవుతున్నాడు. యమునదాటి అతడు చరఖారీరాజ్యంలో ప్రవేశించాడు. చరఖారీరాజుని స్వాతంత్ర్య సమరానికి సహాయంచేయమన్నాడు. చరఖారీరాజు ఇంగ్లీషువాళ్ళ స్నేహకోటిలోనివాడు. అంచేత అతడు సహాయం నిరాకరించాడు. దాంతో తాంతియా చరఖారీమీద దండెత్తాడు. సర్ హూ రోజు చంచనపురం ప్రవేశిస్తూ వుండగా అలహాబాదునించి గవర్నరు జనరలు ఉత్తరువు వచ్చింది — "ముందు చరఖారీరాజుకి తోడ్పడు" అని చంచనపురం నించి చరఖారీ ఎనభైమైళ్ళు, ఝాన్సీ పదాన్నాలుగుమైళ్లు. అయితే బుందేలుఖండం పొలిటికలుఏజంటు సలహామీదరోజు చరఖారీవెళ్ళడం మానేశాడు, ఝాన్సీమీదికే దాడివెళ్ళాడు.

తాంతియా టోపే చరఖారీరాజుని ఓడించాడు. అతడిదగ్గిర ఇరవైనాలుగు ఫిరంగులు లాక్కున్నాడు. యుద్ధంఖర్చులకింద మూడు లక్షలు వసూలుచేశాడు. తరవాత కాలపీ వచ్చేశాడు.

ఇంతలో ఝాన్సీనించి తనకి సహాయపడమని తాంతియాకి లక్ష్మీబాయి ఉత్తరం పంపింది. ఉత్తర మందడమే తడవు పెద్దసేనతో తాంతియా ఝాన్సీ బయలుదేరాడు. తాంతియా టోపే ఝాన్సీ చేరుకున్నాడో ఇంగ్లీషుసేన సర్వనాశన మవుతుంది. అంచేత దారిలోనే అతణ్ణి అడ్డుకోవాలని నిశ్చయించాడు రోజుసేనాని.

ఇంగ్లీషుసేనలు వెనకకివచ్చి హుటాహుట్తుగా తాంతియాసేనని ముట్టడించాయి. ఏప్రిలు ఎనిమిదిన బేతవానదిదగ్గిర దారుణమైన యుద్ధం జరిగింది. తాంతియాసేనలో పదిహేనువందలమంది సిపాయిలు మరణించారు.

మిగిలినవాళ్ళు నిభాయించుకో లేకపోయారు; పారిపోయారు. తాం తియా ఫిరంగులూ అవీ శత్రువులకి దొరికిపోయాయి.

ఈ విజయోత్సాహంతో వెళ్ళి రోజుసేనాని ఝాన్సీమీద విరుచుకు పడ్డాడు. ఏప్రిలు మూడున ఘోరమైన దాడిచేశారు. ఝాన్సీమీద ఇంగ్లీషువాళ్ళుచేసిన దాడిలో అదే ఆఖరుదాడి. అన్నిదిక్కులా వొక్క సారే దాడిప్రారంభమయింది.

తాంతియా పరాజయం విని లక్ష్మీబాయి విచారించింది. కాని రవంతయినా ధైర్యంమాత్రం వొదులుకోలేదు. అవాళకి పన్నెండు దినాలయి విశ్రాంతిలేకండా పోరాడుతూవుందామె. అయినా అవాళటి దాడికి ఫిసరంతయినా చలించలేదు. తన తెల్లగుర్రంమీద సవారీచేసి, మెరుపులా దుర్గమంతటా సంచారంచేస్తూ తనసేనని హెచ్చరిస్తూ వచ్చింది. అవాళటియుద్ధం మిక్కిలీ భయంకరంగా సాగింది. ఇంగ్లీషు ఫిరంగిగుళ్ళుపడి పట్నం మేడలూ మిద్దెలూ ఎన్నో ధ్వంసమయి పోయాయి. అద్దాలతో అందంగావున్న గణేశమందిరం 'ఆరసీమహలు' గుండుపిండయిపోయింది.

ఉత్తరందిక్కు మొదటఉప్పెనలా ఇంగ్లీషువాళ్ళు తోసుకువచ్చారు. పెద్దద్వారందిక్కు రోష్ణుమీద ఫిరంగిదండు కనపడిందో లేదో దిక్కులు పిక్కటిల్లిసట్లు దుర్గంలో రణతూర్యాలు గింగురుమన్నాయి. ఉత్తరక్షణంలో ప్రాకారంమించి, కోటబురుజుమించి అగ్నివర్షం కురిసింది. ఫిరంగిగుళ్ళూ, తుపాకిగుళ్ళూ, బాణాలూ, ఈటెలూ, పెద్ద పెద్దరాళ్ళూ, కర్రలూ ఇంగ్లీషుసేనమీద మృత్యుతాండవం చేశాయి. కోటలో హరహరమహాదేవ కేకలు. ఇంగ్లీషుసేనలో రోదనధ్వనులు, హాహాకారాలు. చస్తూ, శవాలమించి చావకుంటూ కొంతమంది ఇంగ్లీషుసైనికులు ఎలాగో ప్రాకారం మొదటికి చేరుకున్నారు. నిచ్చెనలున్నా తగిలించారు. అదిగో, డిక్కూ, మిచెల్బానూ గోడమీద

కెగబాకారు. మరుక్షణంలో ఝాన్సీ ఫిరంగిగుళ్ళు వాళ్ళ నెగరగొట్టే శాయి. అయితేనేం, అదిగో మళ్ళీ బోనసూ, ఘాకూన్ ఎగబాకారు. కాని వాళ్ళకీ అదేగతిపట్టింది. ఇంతలో నిచ్చెనలమీద గబగబా ఎందరో ఎగబాకారు. ఆ బరువుకి నిచ్చెనలన్నీ కూలి కిందపడిపోయాయి. ఇంతలో వెనకనించి బిగులు — "వెనకకి వచ్చెయ్యండి." కాలమేఘాల్లా ముంచుకు వస్తూన్న ఇంగ్లీషురాణువని ఝాన్సీఫిరంగులు జంఝామరుతంలా వెనకకి తరిమికొట్టాయి.

తమసేన కకావికలయిపోవడం చూసి మేజరు బ్రాకుహం వీరత్వంతో ఝాన్సీసేనమీద కురికాడు. రెండోతట్టు బ్రిగేడియరు స్టూఅర్టూ, కర్నలు లూథూ తమ ఇరవై అయిదోపటాలమూ, పదహారోపటాలమూ వేసుకుని ఓర్ఛాద్వారంమీద కెగబడ్డారు. ఝాన్సీసిపాయిలు సంఖ్యలో తక్కువే అయినా, వీరత్వంలో అధికులు; శత్రుసేనని చించి చెండాడ మారంభించారు. కాని సముద్రంకెరటాల్లా వున్న ఫరంగి దండుతో ఎంతసేపని పోరాడతారు?

ఇంతలో దులాజీ బుందేలా అని ఎొక ఝాన్సీసర్దారు ప్రాకారం మీద నిచ్చెనలువేసి గుప్తప్రదేశం ఇంగ్లీషువాళ్ళకి ఆచోకీ ఇచ్చేశాడు. దాంతో దక్షిణందిక్కు నిచ్చెనలు తగిలించి ఇంగ్లీషువాళ్లు పట్నంలోపలికి తోసుకు వచ్చేశారు. ఈ 'నిమ్మకు హరాము' కార్యానికి దులాజీ బుందేలాకి తరవాత రెండుగ్రామాలు ఇనాం దొరికాయి.

పట్నంలో ప్రవేశించాక ఇంగ్లీషుసేన అడుగడుగునా పోరాడుతూ, పట్నంపాడుచేస్తూ, కనపడ్డ నగరవాసులనల్లా చంపేస్తూ, కాల్చేస్తూ, రక్తనదులుపారిస్తూ రాజమహలుదిక్కు నడిచింది. కోటగోడలమీద నుంచుని మహారాణి లక్ష్మీబాయి తన ఝాన్సీదురవస్థ చూసింది. ఆమె కలవకళ్ళల్లోంచి చింతనిప్పులు రాలాయి. ఆ దేవీమూర్తి ఎొక్కసారి గర్జించింది. వెయ్యిమంది వీరసైనికులతోవచ్చి ఇంగ్లీషుసేనమీది

రాణీ లక్ష్మీ బాయి

భారీ సేనతో వీరుడు వాలి ఎదుట నిలిచి సూటిగా చూడలేని సుగ్రీవుడు

కురికింది. ఉభయసేనలూ కత్తులుకలిపాయి. దారుణమైన దొమ్మీ యుద్ధం జరిగింది. మహారాణి మహాకాళి అవతారమెత్తింది. ఇటూ అటూ ఇంగ్లీషుసైనికుల్ని ఎంతోమందిని నరికిపారేసింది. ఇరుపక్షాలా ఎంతోమందిసైనికులు వీరగతిపొందారు. ఝాన్సీవీధులు రక్తసిక్తమయాయి. తుదకి ఇంగ్లీషుసేన ఆగలేకపోయింది. వెనకకి తగ్గేసింది.

ఇంతలో ఉత్తరద్వారం రక్షిస్తూవున్న సర్దారు ఖుదాబఖ్ష్, ఝాన్సీ ఫిరంగిదళనాయకుడు సర్దారు గులాంగౌసూ మరణించారన్న వార్త మహారాణికి అందింది. ఉత్తరద్వారం శత్రువుల వశమయిపోయింది.

మహారాణి తిరిగివచ్చింది. రాజమహాలుమీదనుంచుని తన ఝాన్సీ తట్టు పరికించింది. పట్నంమీదపడి ఇంగ్లీషువాళ్ళు చేస్తున్న ఘోరాలు కళ్ళారా చూసింది. అయిదేళ్ళ పిల్లలుమొదలు ఎనభై ఏళ్ళ ముసలాళ్ళ వరకూ ఎవళ్ళనీ కనికరించలేదు వాళ్ళు — చిత్రవధచేస్తున్నారు. భవనాలు పడగొడుతున్నారు. కొంపలు తగలేస్తున్నారు. పట్నమంతటా మంటలు! వీధివీధులా శవాలు! రక్తంవరదలై ప్రవహిస్తోంది. చూడలేకపోయింది మహారాణి. ఆమె విశాలనేత్రాలనించి జలజలా కన్నీళ్లు కారాయి.

తన ప్రజలదుస్థితిచూసి ఝాన్సీ మహారాణి వలవలా ఏడ్చింది! వీరాంగన లక్ష్మీబాయి పద్మనేత్రాలనించి కన్నీళ్లు వరదలుకట్టాయి. రాజమహాలు నిప్పంటించేసి అగ్నిప్రవేశం చేయాలని బయలుదేరిందామె. ఈస్వాతంత్ర్యరణయజ్ఞంలో ఝాన్సీఅగ్ని వేదికలోఆహుతి అయిపోవాలని ఆమె సంకల్పం. ఝాన్సీమహారాణి లక్ష్మీబాయి అగ్నిప్రవేశానికి బయలుదేరింది!

కాని వృద్ధసర్దారులువారించాక ఆమె ఆప్రయత్నం విరమించుకుంది. ఝాన్సీవొదిలేసి, పైనేవుండి శత్రువుని సాధించాలని నిశ్చయించుకుందామె.

అవాళ రాత్రి అద్దరాత్రిదాటిపోయింది. మహారాణి లక్ష్మీబాయి వీరోచితమైన పురుషవేషం వేసుకుంది.

ఏడెనిమిదేళ్ల కుమారుడు దామోదరరావుని గట్టిదొకవస్త్రంతో భద్రంగా నడుముకి కట్టుకుంది. రాజమహలు గోడమీద నుంచుంది. అక్కడ బైట ఏనుగు సిద్ధంగావుంది. గోడమీంచి ఆమె ఏనుగుమీదికి గెంతేసింది. ఏనుగుదగ్గిరే తనప్రాణప్రదమయిన తెల్లగుర్రంసిద్ధంగావుంది. ఏనుగుదిగి ఆమె గుర్రంమీద కూచుంది. తగుపాటి పరిజనంతో పట్నం భాండారద్వారంలోంచి బైటికి వచ్చేసింది. ఆమె వచ్చేశాక భాండార ద్వారం మూతపడిపోయింది. ఆమూత పడడం డబ్బుయిఅయిదు సంవత్సరాలవరకూ అలాగే మూతపడి వుండిపోయింది. 1933 లో విడింది.

"ఇంకా సగం రాత్రివుంది. పట్నంలో నిశ్శబ్దంగావున్న ఎొకచోట దృఢమయిన ప్రాకారద్వారమొకటి మెల్లి మెల్లిగా విడింది. విచారంతోనూ, గుండెబరువుతోనూ ప్రయాణీకులజట్టు ఎొకటి అందులోంచి మౌనంగా బైటికి వచ్చేసింది. రాణీ, ఆమె సోదరీ (నెచ్చెలి) పురుష వేషాలతో వున్నారు. వాళ్ళతో కొద్దిమంది అనుచరులునూ వున్నారు. వాళ్ళందరూ చడీ చప్పుడూ లేకండా మెల్లిగా ఆద్వారం లోంచి బైటికివచ్చేశారు; నిశ్శబ్దమైన గాంఢాంధకారంలో కలిసి పోయారు. వాళ్లలో చిట్టచివరివీరుడు బైటికి వచ్చెయ్యగానే ఆద్వారం మళ్లీ అలాగే మెల్లి మెల్లిగా మూసుకుపోయింది.

ఆరాత్రి ఆ ప్రయాణం వాళ్ళందరికీ మృత్యువుతో చెరలాటంగా వుండేది. ఏమంటే పద్నాలుగో డ్రేగను ఇంగ్లీషు గుర్రపుదళమూ, హైదరాబాదు కంటోజెంటు సేనలోని గస్తీదార్లూ వెయ్యికళ్ళతో అంతటా పహారా ఇస్తున్నారు. ఏక్షణమయినా వీళ్లు తారసపడవచ్చు. దాంతో మృత్యువు తప్పిస్తే ఇంకోటి వుండదు. కాని ఆవీరులు ఇంతమంది కళ్ళలోనూ కారంచల్లి ఎలాగో ఓలాగ తప్పించుకునే

పోయాను. ఎలా తప్పించుకుపోయారో ఆరహస్యం మాత్రం నాటికీ నేటికీ రహస్యంగానే వుండిపోయింది. రాణీకి దారిచూపించి ఈకరిన కార్యం సాధించిన పథప్రదర్శకుడుమాత్రం ధురంధరుడనే చెప్పాలి; సందేహంలేదు. అంతేకాదు, రాణీకూడా గుర్రపుస్వారీలో అసాధ్యు రాలు. అంచేత మెరుపులా ఆమె మైదానంమీదికి దూసుకుపోయింది."

అలా ఝాన్సీ ఎరిలేసి మహారాణి లక్ష్మీబాయి తెలతెల వారే సరికి భాండారేగ్రామం చేరింది. అక్కడ కొద్ది సేపాగింది. గ్రామంలో పాలు తీసుకుని దామోదరరావుకి తాగించింది. తిరిగి అనుచరులతో కలిసి కాలపీ బయలుదేరింది.

"రాణీ ఝాన్సీనించి తప్పించుకుపోయింది" — ఈమాట వినగానే రోజుసేనాని నిశ్చాంతపోయాడు. అప్రయత్నంగా అతనినోట వెలువ డింది — "ఆమె వీరశిరోమణి." ఉత్తరక్షణంలో అతడు ఆజ్ఞాపించాడు — "ఆమెని వెంటాడండి."

లెఫ్టినెంటు బోకరు కొంతమంది రౌతులు వెంటవేసుకుని ఆమెని వెంటాడాడు. భాండారే గ్రామానికి కొద్దిదూరంలో బోకరు గుర్రం రాణీగుర్రం దగ్గిరికి వచ్చేసింది. రాణీ వొరలోంచి ఖడ్గం తీసింది. బోకరుమీద వొక టేటు వేసింది. గుర్రంతోకూడా బోకరు కింద దొర్లిపోయాడు. ఇంతలో బోకరురౌతులు రాణిరౌతులతో కలియ బడ్డారు. కత్తులూ కత్తులూ ఖణేలు మన్నాయి. బోకరురౌతులు వోడి పోయారు. ఇంగ్లీషు సైనికుల్ని చీల్చుకుంటూ రాణీ తోడివాళ్ళతో కూడా ముందుకి వెళ్ళిపోయింది. దెబ్బతిన్న లెఫ్టినెంటు బోకరూ అతడి అనుచరులూ వెనకకు వచ్చేశారు.

మహారాణి లక్ష్మీబాయి తెల్లగుర్రం గాలపుపరుగుతో గాలిలా మెరుపులా ఎగిరిపోతూవుంది. మధ్యాహ్నమయింది. పొద్దువాలింది. సాయంకాలమయింది. గుర్రమాగలేదు. రాణీ విశ్రాంతి తీసుకోలేదు.

పొద్దు గూకింది. చుక్కలు పొడిచాయి. రాత్రి మొదటిజాము గడిచింది. గుర్ర మాగలేదు. రాణీ విశ్రాంతి తీసుకోలేదు.

అద్దరాత్రయింది. రాణీ లక్ష్మీబాయి కాలపీ చేరుకుంది. వందా రెండుమైళ్ళు హుటాహుటిని పరిగెత్తి తన రాణీనీ, యువరాజునీ నిరపాయంగా కాలపీ చేర్చేశాక గుర్రం ప్రాణాలు వొదిలేసింది.

ఆరాత్రి రాణీ లక్ష్మీబాయి కాలపీలో విశ్రాంతి తీసుకుంది. తెల్లవారాక రావుసాహెబూ, తాంతే టోపేలతో కలుసుకుంది. ఝాన్సీ వైనం వివరించింది. ముగ్గురూ సమరపరిస్థితి సంప్రదించుకున్నారు.

రాణీ లక్ష్మీబాయితండ్రి మోరోపంతు వొక ఏనుగుమీదనగలూ అవీ వేసుకుని ఆమెవెంట ఝాన్సీనించి బయలుదేరాడు. దారిలో శత్రువుల్ని తప్పించుకునిఅతడు దతియారాజ్యంలో ప్రవేశించాడు. దతియా రాజు అతణ్ణి కుంపినీవాళ్ళకి పట్టిఇచ్చేశాడు. రోజునేనాని ఝాన్సీలో రాజమహలుఎదట మోరోపంతుని వురితీసేశాడు. ఏనుగుమీదినగలూ అవీ మాత్రం దతియారాజు ఏంచేసిందీ ఎవరికీతెలియలేదు.

ఇదిఇలావుండగా జబ్బలపురంనించి ఫిబ్రవరి పదిహేనుసఝాన్సీకి బయలుదేరిన జనరలు విట్లాకు దారిలో విజయాలుసాధిస్తూ వచ్చి బాందా ముట్టడించాడు. ఓర్చారాజుకూడానేనతోవచ్చి విట్లాకుతో కలిశాడు. బాందానవాబు ఆప్రాంతం విప్లవనాయకుల్లో ప్రముఖుడు. అయితే అనేకమంది ఇంగ్లీషువాళ్ళకి ప్రాణాపాయంలేకుండా తన కోటలో ఆశ్రయమిచ్చాడు. ఝాన్సీలో విప్లవశంఖం మోగగానే అతడు బాందాలో బ్రిటిషుపతాకం పీకేసి ఆకుపచ్చజెండా ఎగరవేశాడు.

"ఖాల్కా ఖుదా, ముల్కా బాద్షా, హుకుమె సిపాయి." * నండోరా వేయించాడు. విట్లాకు బాందా ముట్టడించగానేనవాబు

* Asoka Mehata—1857 The Great Rebellion.

హోరాహోరి పోరాటం సాగించాడు. చివరికి ఓడిపోయాడు. మిగిలిన సేనతో కాలసీ వచ్చేశాడు. ఏడ్రెలు పందొమ్మిదిని బాందా ఇంగ్లీషు వాళ్ళ స్వాధీనమయిపోయింది.

బాందానించి విట్లాకు కరవీ వెళ్ళాడు. కరవీరాజుమూధోరావు పదేళ్ళకుర్రాడు. అతడిసంస్థానం కుంపినీయే చూస్తూవుండేది. అయితే స్వాతంత్ర్యసందేశం రాగానే కరవీప్రజానీకంమాత్రం ఆకుపచ్చజెండా ఎగరవేశారు. పట్టుమని పదేళ్ళునిండని మూధోరావు — అందులోనూ కుంపినీచేతిలోనేవున్న కుర్రాడు — స్వాతంత్ర్యసమరంలో ఎలాపాల్గొంటాడు? అయినాసరే విట్లాకు మూధోరావుమీదికి దాడివెళ్ళాడు. ఇంగ్లీషుదండు బుందేలుఖండం ప్రవేశించగానే పాపం మూధోరావు కరవీకి ఆహ్వానించాడు. ఎదురువెళ్ళి స్వాగతంచెప్పాడు. ఆహ్వానమందుకుని బుద్ధిమంతుల్లా ఇంగ్లీషువాళ్లు కరవీప్రవేశించారు. ఎన్నడూవాళ్ళని పల్లెత్తి మాటాడలేదు. అయితేనేం ఇంట్లోప్రవేశించగానే ఇల్లుతగలబెట్టారు ఇంగ్లీషువాళ్లు. పట్నం దోచుకున్నారు. కోట ధ్వంసంచేశారు. ఊరువూరంతా మండబెట్టారు. కరవీసంస్థానం కుంపినీరాజ్యంలో కలిపేసుకున్నారు. కోటలోని ధనరాసులు మూటగట్టుకపోయారు. *

కరవీనించి విట్లాకు మహోబా వెళ్ళాడు. అక్కడనేను తుకిడీతుకిడీకింద విభాగించి చుట్టుపట్ల విప్లవకారుల్ని ముట్టడించడమారంభించాడు.

---

* "Not a shot had been fired against him, but he (Whitlock) resolved nevertheless to treat the young Rao as though he had actually opposed the British forces. The reason for this perversion of honest dealing lay in the fact that in the palace of Kirwi was stored the wherewithal to compensate soldiers for many a hard fight and many a broiling sun. In its vaults and strong rooms were specie, jewels, and diamonds of priceless value..... The wealth was coveted."—Kaye and Malleson's Indian Mutiny.

మహారాణి లక్ష్మీబాయి ఝాన్సీ వొదిలిపోయాక ఇంగ్లీషురాణువ నాలుగుద్వారాలలోంచీ పట్నంమీద విరుచుకుపడింది. వొదలకండా ఏడుదినాలు దోచుకుంది. పిల్లలనీ, వృద్ధులనీ విచక్షణలేకండా తుపాకులతో కాల్చింది. కత్తులతో నరికింది. కొంపలకి నిప్పంటించింది. పారిపోతూన్న అభాగ్యుల్ని వెంటతరిమి చంపింది. వీధివీధీ, గల్లీగల్లీ, ఇల్లిల్లూ ఇంగ్లీషుసైనికులు ప్రవేశించారు. మోయగలిగినన్ని, మోయలేనన్ని సామానులూ, ధనరాసులూ, లూటీచేశారు. నెత్తురునదులుపారించారు. మొదటి రెండురోజులూ పట్నం దోచుకున్నాక మూడోనాడు రాజమహలుమీదపడ్డారు. మహారాణీ తనతోపట్టుకువెళ్లగా మిగిలిన సగలూ, రత్నాలూ అవీ రెండుచేతులతోనూ కొల్లగొట్టారు. రాజమహలుమీద యూనియనుజాకు పాతారు. ఆభాగంమాత్రం తప్పించి తక్కిన రాజమహలు యావత్తూ నిప్పంటించేశారు. నాటకశాల, గ్రంథాలయమూ కాల్చిభస్మంచేసేశారు. అమూల్యమైన గ్రంథరాసులు పరశురామప్రీతి అయిపోయాయి. దేవాలయాలూ, మశీదులూకూడా కొల్లగొట్టారు. దేవాలయాలనించి అందమైన దేవవిగ్రహాలున్నూ పట్టుకుపోయారు. అప్పటికే ఛిన్నాభిన్నమయివున్న మహాలక్ష్మీదేవాలయంలో దూరి లక్షలు విలువయిన వెండి బంగారాలూ, పీతాంబరాలూ నొల్లుకున్నారు. మార్టిను తన 'బ్రిటిషిండియా' లో ఇలా రాశాడు — "శేషించిన దుర్గమూ, పట్నమూ ఏప్రిలు నాలుగున నా వశమయి పోయాయి. దాంతో మాసైనికులు కనీవినిఎరగని నరసంహారం సాగించారు. హతవారిపోయినజనం ఎంతలేదన్నా అయిదువేలువరకూ వుంటారు, ఇక దోపుడువల్ల లభించిన ధనం ఇంతా అంతా అని చెప్పలేం".

మహారాణి లక్ష్మీబాయి కాలపీవచ్చేశాక బాందానవాబూ, శాహగడంరాజూ, బానాపురంరాజూ తమ తమ సేనలతో కాలపీ

వచ్చేశారు. విశాలమైన సేన కాలపీలో సమావేశమయింది. అయితే యుద్ధపథకాలు వేయడంలో నాయకుల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. ఏమయితేనేం పేష్వారావుసాహెబు సేన కొంతపుచ్చుకొని రాణీ లక్ష్మీభాయి ఇంగ్లీషుసేనమీదికి బయలుదేరింది. కాలపీలో విప్లవకారుల సమావేశాలు విని రోజుసేనానికూడా ఝూన్సీనించి బయలుదేరాడు. ఉభయసేనలూ కాలపీకి నలభై రెండుమైళ్ల దూరంలో కంచగాం దగ్గిర డీకున్నాయి. అవాళయుద్ధంలో విప్లవకారు లొక కొత్తమార్గం తొక్కారు. పదిగంటలయి కరకరా ఎండ ఎక్కేదాకా యుద్ధమారంభించ లేదు. ఏమంటే, ఎండలో ఇంగ్లీషువాళ్లు టాకాలు గుణించేవాళ్లు. అవాళ ఎండకూడా మండిపోతూవుండేది. అయినా విప్లవకారులు వోడి పోయారు. అయితే ఈయుద్ధంలో లక్ష్మీభాయి సామర్థ్యం మాత్రం తక్కిన నాయకులకి తెలియవచ్చింది. అంచేత తిరోగమనంలో విప్లవ సేన కట్టుబాటుతోనడిచి కాలపీ చేరుకుంది. ఈలోగా తాంతియా టోపే తన తండ్రిని చూసిరావడంకోసం జాలవాడ్దగ్గిర ఛర్ఖీవెళ్లాడు.

కంచగాం తరవాత సర్ హ్యూ రోజు కాలపీమీద దాడిచేశాడు. విప్లవసేన భయంకరంగా ఎదిరించింది. రాణీ లక్ష్మీభాయి అద్భుత మైన పరాక్రమంతో పోరాడింది. సేనంతటికీ ముందే వుండే ధామె. ఆమెవీరభావం చూసి విప్లవసేన అసమానమైన సాహసంతో శత్రువుల మీది కురికింది. ఇంగ్లీషుసేన తట్టుకోలేకపోయింది. వెనకకి పారిపో యింది. ఆవూపున ఇంగ్లీషుఫిరంగులుకూడా విప్లవకారులు పట్టుకున్నారు. అవాళ అప్పుడే సర్వసేనాని కాంబెలుపంపిన వొంటెలూ కొంతసేనా రోజుసేనానికి సహాయంవచ్చింది. ఆవొంటెలసహాయంతోనే రోజు సేనాని అవాళ మే ఇరవయిరెండున విజయంసాధించాడు. మర్నాడు కూడా యుద్ధం జరిగింది. ఆమర్నాడు ఇరవైనాలుగున విప్లవసేన పూర్తిగా వోడిపోయింది. రాణీలక్ష్మీభాయీ, పేష్వా రావుసాహెబూ

మొదలైనవాళ్లు మిగిలినసేనతో కాలపీ వొదిలివెళ్లిపోయారు; గ్వాలియరుకి నలభైమూడుమైళ్లదూరంలో గోపాలపురం దగ్గిర మకాం వేశారు.

కాలపీ ఇంగ్లీషువాళ్ల వశమయిపోయింది. దుర్గంలో వొక్క మందుగుండే అరవై వేలపౌనులు వాళ్లకి దొరికింది. ఇక తక్కినసామగ్రులూ, ధనరాసులు లెక్కాజమాలేదు.

రోజు సేనాని స్నేహితుడు డా. సల్వీస్టరు ఇలా రాశాడు — "ఝాన్సీదుర్గంలో లాగే ఈ (కాలపీ) దుర్గంలోకూడా పెద్ద యుద్ధసామగ్రి ఇంగ్లీషువాళ్లకి దొరికింది. ఇక్కడ దొరికిన ఆయుధాలు చాలా వరకూ ధనుర్విద్యకి చెందినవి. చిన్నా పెద్దా పాతికఫిరంగులూ, వొక చేతిఫిరంగీ కూడా దొరికాయి. ఇంగ్లీషుతయారీ ఫిరంగిగుళ్లున్నూ ఎన్నో దొరికాయి. దుర్గంలో ఆయుధాల కార్ఖానాలు కూడా వుండేవి. అందులో చేతిఫిరంగులూ, తుపాకులూ, గుళ్లూ అవీ తయారుచేయడం, మరమ్మత్తుచేయడం జరిగేది. ఈ కార్ఖానాల్లో ఎన్నో అన్ని ఇంగ్లీషుపనిముట్లు వుండేవి. పనికిరాచ్చే తుపాకులున్నూ ఎన్నో అన్ని దొరికాయి. సగంసగం తయారైన ఇత్తడిగుళ్లూ ఇత్తడిముక్కలూ చాలా దొరికాయి. వాటినిబట్టిచూస్తే ఈ పనిలో వాళ్ల కింకా పూర్తిగాని పుణ్యం కుదరలేదనే బోధపడుతుంది. కానిప్రయత్నలోపంమాత్ర మున్నట్టు లేదు. మట్టిమూసలలో పోతపోసి, తరవాత ఆకురాళ్లతో అరగదీసి గుండ్రంగా చేసేవాళ్లు. ఏమయినా ఆయుధాలు తయారుచేసే విప్లవకారుల పెద్దకార్ఖానా కాలపీలోనే వుండేది. ఈ దుర్గం ఇలా సులువుగా స్వాధీనంకాకపోయివుంటే మనల్ని మూడుచెరువులనీళ్లూ తాగించి ఎంతకాల మెదిరించేవాళ్లో చెప్పడం కష్టం."

అలా సర్ హూ రోజూ, ఫ్లిట్లాకులు సర్మదనించి ఆరంభించి యమున దక్షిణతీరం వరకూ గల భూఖండం యావత్తూ స్వాధీనపరుచుకున్నారు. యమున ఉత్తరతీరంనించి హిమాలయాలవరకూ సర్

కాలిను ఆక్రమించుకున్నాడు. ఈవిజయగర్వంతో రోజు సేనాని తన సైనికుల సభినందిస్తూ వొక ప్రకటన చేశాడు – "సైనికులారా, వెయ్యి మైళ్ళు ప్రయాణించారు మీరు. నదులు ఈదారు, కొండలు దాటారు, అడవు లతిక్రమించారు, పెద్దపెద్దసేనలు వోడించారు. విశాలభూములు జయించారు, వంద ఫిరంగులు పట్టుకున్నారు. మీ దేశ గౌరవం పునరుద్ధరించారు. ధైర్యవంతులు మీరు. గీసినగీటు దాట కండా క్రమశిక్షణ పాటించారు. కష్టాలూ, బాధలూ, ఇబ్బందులూ సహించారు. మీనాయకుడి ఆజ్ఞలు నెరవేర్చారు. పిసరంతా అవిధే యత ప్రకటించకండా మసులుకున్నారు. మీక్రమ శిక్షణవల్లే నర్మద నించి యమునదాకా మీరు విజయదుందుభి మోగించారు."

ఈప్రకటన చేశాక, తన ఆరోగ్యం సరిగాలేక తన సేనానాయక పదవికి రాజీనామా ఇచ్చా డతడు.

కాలపీ పతనమయిపోయింది. కాని లక్ష్మీబాయి ధైర్యంమాత్రం సన్నగిల్లలేదు. తండ్రిని చూడడానికని వెళ్ళిన తాంతియా టోపే చడీ చప్పుడూ లేకండా తిన్నగా గ్వాలియరు వెళ్ళాడు. సింధియా సేనలో స్వాతంత్ర్యమంత్ర మూదాడు. కొంతసేన పట్టుకుని గోపాలపురం వచ్చాడు. రాణీ లక్ష్మీబాయీ, పేష్వా రావుసాహేబూ, బాందా నవాబూ మొదలైన నాయకుల్ని కలుసుకున్నాడు. మళ్ళీ విప్లవకా రులకి బలం చేకూరింది. నాయకులు కూడబలుకు కున్నారు. ఇంగ్లీషు సేనని ముట్టడించేముందు గ్వాలియరు స్వాధీనపరుచుకోడ మవసరమని మహారాణి సలహాచెప్పింది. కాలపీ పడిపోవడంతోనే విప్లవకారులకి వొక కేంద్రమంటూ లేకండాపోయింది. గ్వాలియరు దృఢమైన విప్లవకేంద్ర మవుతుంది. తక్కినానాయకులున్నూ మహారాణి సలహా అంగీకరించారు. మే ఇరవై ఎనిమిదిని విప్లవనాయకులు తమ తమ సేనలతో గ్వాలియరు దగ్గిరసా ఆమనగ్రామం (అమీన్ మహలు)

చేరుకున్నారు. అక్కడి మహలుకారులు వీళ్ళనెదిరించారు. "ఇదేమిటి? మీపేష్వానే మీరు ఎదిరిస్తా రేమిటి?" అన్నాడు రావుసాహెబు — "పైగా స్వరాజ్యంకోసం పోరాడుతున్నాం మేము." ఈమాటలు విని మహలుకారులు తమ ఆయుధాలు కిందపడేశారు; రావుసాహెబుకి స్వాగతం పలికారు. అక్కడనించి విప్లవకారులు ముష్ఠయిని ముందు శిబిరందగ్గిర 'బడగాం' చేరుకున్నారు.

ఈలోగా రావుసాహెబు తాంతియాటోపేలు జయాజీరావుసింధియాకి వొక ఉత్తరం రాశారు — "మాపేష్వాపరివారానికీ మీకూ వున్న సంబంధం పురస్కరించుకుని ఇప్పుడు మీసహాయ మపేక్షిస్తున్నాము. ఈసహాయం కేవలం మాకోసమేకాదు, మీకోసంకూడా అని గమనించండి. ఏమంటే దీనివల్ల మీరాజ్యంకూడా ఇంగ్లీషుదాస్య శృంఖలాలనించి విడివడుతుంది. మనమంతా కలిసి దక్షిణదేశాలుకూడా విడిపించగలం. కాదంటారా మాకుపట్టినగతే వొకనాడు మీకున్నా పడుతుంది. అంచేత తప్పక మాతో చేతులుకలపండి. మీనమేషాలు లెక్కపెట్టడాని కవకాశం లేదు."

సింధియా ఉత్తరమందుకున్నాడు. వెంటనే కుంపినీ అధికార్లకి తెలియజేశాడు; సహాయం కోరాడు. సకాలంలోకుంపినీనుంచి జవాబు రాలేదు. జయాజీరావు ఆగలేకపోయాడు. జూను వొకటిని ఎనిమిదివేల పదాతికదళమూ, పన్నెండువందల గుర్రపుసేనా, ఇరవై ఫిరంగులూ వేసుకుని విప్లవసేనమీదికి దండయాత్ర బయలుదేరాడు. ముందు శిబిరానికి రెండుమైళ్ళదూరాన బహదూరుపురం చేరాడు. తన ఫిరంగిదళంతో సమానమైన ఫిరంగిదళం దేశంలో మరొకటిలేదని జయాజీరావుకి ధీమాగావుండేది. ఏమంటే జాను ఫీరూ, జాను బేట్సనూ అని ఇద్దరు ఫ్రెంచివాళ్లు తనసేనలో ఫిరంగిదళాధిపతులుగా వుండేవాళ్ళు. వాళ్ళ సామర్థ్యం సాటిలేనిదిగా వుండేది.

బడగాంనించి విప్లవకారులమీద దాడి ప్రారంభించాడు సింధియా. ఫిరంగులశబ్దం విని తనకి స్వాగతం చెప్పడానికని సింధియా వస్తున్నాడని భ్రమపడ్డాడు రావుసాహెబు. సింధియాఫిరంగులు తన సైనికులని హతవార్చడం చూసి ఉత్తరక్షణంలో అతడి భ్రమ తొలిగిపోయింది. మహారాణి లక్ష్మీబాయి పరిస్థితి పరికించింది. వీరావేశంతో ముందు కురికింది. మూడువందల గుర్రపుదాతులతో మెరుపులా వెళ్లి సింధియా ఫిరంగిదళం పట్టుకుంది. ఆమెవెంట తాంతియా, తాంతియావెంట రావు సాహెబూ మిగిలిసైన్యమూ విరుచుకుపడింది. సింధియా సైన్యం హెచ్చుభాగం ముందే తాంతియాతో వచ్చేసింది. మిగిలినసేనకూడా వచ్చి విప్లవసేనతో కలిసిపోయింది. గ్వాలియరు మహారాజు జయాజీ రావు సింధియా, మంత్రి దినకరరావూ దౌలతఫురందిక్కు దాడు తీశారు; ఆగ్రా చారిపోయారు.

గ్వాలియరుప్రజలు ఉత్సాహంతో విప్లవకారులకి స్వాగతం చెప్పారు. నానాసాహెబుప్రతినిధి రావుసాహెబుని పీష్వాగా అంగీకరించారు. గ్వాలియరుసేన అతడి గౌరవార్థం ఫిరంగులుపేల్చి సైనికవందనంచేసింది. సింధియా ఆర్థికమంత్రి అమరచందు భటియా గ్వాలియరు ఖజానా యావత్తూ రావుసాహెబుకి సమర్పించాడు. కాలపీ దుర్గంకంటే దృఢమయిన గ్వాలియరుదుర్గం విప్లవకారుల కేంద్రమయింది. ఆ చారిత్రక దుర్గంమీద ఆకుపచ్చజెండా అంబరచుంబితంగా ఎగిరింది.

జూను మూడున పూలబాగులో పెద్దవిందూ, దర్బారూ జరిగింది. గ్వాలియరులోని యావత్సంది సామంతరాజులూ, సర్దారులూ, అమీరులూ వచ్చితమతమ స్థానాల్లో కూచున్నారు. అరబు, రోహిలా, రాజపుత్ర, మరాఠాపటాలాలు తమతమ సైనికదుస్తులతో హాజరయాయి. పేష్వాకిరీటం రావుసాహెబుశిరస్సుమీద పెట్టారు. దర్బారుయావత్తూ ఏకగ్రీవంగా అతణ్ణి పేష్వాగా స్వీకరించింది. రామారావు గోవిందం

ప్రధానమంత్రిగానూ, తాంతియాటోపే సర్వసేనానిగానూ నియమితులయారు. పేష్వారావుసాహెబు ఇరవైలక్షలరూపాయలు సైనికులకి పంచిపెట్టాడు. దర్బారుచివర కూడా ఫిరంగులుపేల్చి రావుసాహెబుకి సిపాయిలు సైనికవందనం చేశారు.

గ్వాలియరు విప్లవకారు లాక్రమించారనగానే ఇంగ్లీషువాళ్లు తుళ్ళిపడ్డారు. విప్లవకారు లక్కడ స్థిరపడ్డారో పేష్వారాజ్యస్థాపనపేర మహారాష్ట్రమంతటా కొత్తచైతన్యంలేచి విజృంభించవచ్చు. అందుకని ఏమాత్రమూ అవకాశమివ్వకండా వెంటనే గ్వాలియరు ముట్టడించాలని త్వరపడ్డారు వాళ్ళు. ఇంగ్లాండుపయనమవుతూన్న రోజు తన ప్రయాణమాపేసుకుని చప్పున వెనకకి మళ్లాడు. ఇలా చప్పునరోజునేనాని గ్వాలియరుదుర్గం ముట్టడించడంలో చూపినవివేకం మెచ్చుకుంటూ మాల్సను ఇలారాశాడు—

"గ్వాలియరుదుర్గం విప్లవకారులనించి లాక్కోవడంలో త్వరపడకపోయివుంటే పరిణామ మేమయేదో ఊహించడం కష్టం. ఏమంటే ఈదుర్గం సైనికంగానూ, రాజకీయంగానూ ఎంతటి మహత్తరమైందో తాంతియా టోపేకి బాగా తెలుసు. ఈదుర్గం చేతిలోవుంటే జనశక్తి, ధనశక్తి ఎంతసులువుగా లభిస్తుందోకూడా బాగా ఎరుగు నతడు. అంచేత వొక్క మహారాష్ట్రంలోనే కాదు, భారతదేశమంతటా మళ్ళీ విప్లవాగ్ని ప్రజ్వలింపజేయగల డతడు. ఒకవేళ అంతకాకపోయినా కనీసం మహారాష్ట్రంలో విప్లవపతాక మెగరవేసి, మనసి కొత్తఆపదలో ముంచెత్తగలిగేవాడు."

రాబోయే ఉపద్రవం ముందేకనిపెట్టింది మహారాణి లక్ష్మీబాయి. వేడుకలతో కాలహరణంచెయ్యకండా వెంటనే సైన్యాలు బలపరుచుకుని యుద్ధానికి సిద్ధపడాలంటూ హెచ్చరించిం దామె. కాని విజయో

త్సాహంవల్ల పేష్వా రావుసాహెబు ఆమె మాట లంతగా పాటించ లేదు. అయితే దాని ఫలితంమాత్రం వెంటనే అవుపించింది.

రోజునేనాని తనసేన ఎనిమిదిభాగాలుగా విభజించాడు. కొంత సేనతో అతడు జూను ఆరున మురారుశిబిరంతట్టు బయలుదేరాడు. పదహారున బహదూరుపురం చేరుకున్నాడు. గ్వాలియరుమీద దాడి ప్రారంభించాడు. సర్ హూ రోజు సింధియానికూడా వెంటవేసుకు వచ్చాడు. "సింధియాని తిరిగీ గ్వాలియరు గద్దెమీద నిలపడానికే ఈయుద్ధం" అంటూ ప్రకటించాడు. ఈవిధంగా గ్వాలియరులోని రాజభక్తిపరుల్ని తనదిక్కు తిప్పుకుందికిప్రయత్నించాడు.

కుంపినీసేనలు వచ్చిపడ్డా యనగానే విప్లవసేనాని తాంతియా టోపే చప్పున జల్లుకున్నాడు. కొద్దిదినాల వేడుకల్లో విప్లవసేన ఆదమరుపుగా వుంది. రెండుమూడుగంటల యుద్ధంలోనే ఇంగ్లీషువాళ్ళది పైచెయ్యిలా కనిపించింది. పేష్వా రావుసాహెబు తొంచకండా అయి పోయాడు.

దాంతో అగ్నిశిఖలాగ మహారాణి లక్ష్మీబాయి రణరంగంలో ప్రత్యక్షమయింది. ఆమెతో ఆమె నెచ్చెలులు ముందరా, కాశీకూడా శత్రువులమీద విరుచుకుపడ్డారు. ముగ్గురూ పురుషవేషాలే వేసుకున్నారు. ఇంగ్లీషుసేనాని జనరలుస్మిత్ లక్ష్మీబాయి నెదిరించడానికి వచ్చాడు. ఎన్నోసారు లతడు తూర్పుద్వారంతట్టు వురికాడు. అన్ని సారులూ అతడు తట్టుకో లేకపోయాడు. వెనకకి వచ్చేశాడు. ఎన్నో సారులు ద్వారంనించి బైటికివచ్చేసి లక్ష్మీబాయి శత్రుసేన చెండాడింది. ఆమెకి ఎదురైన శత్రువు బతికి బయటపడడం కష్టమయింది. ఉదయంనించీ సాయంకాలందాకా గుర్రమీద మెరుపులా ఆమె యుద్ధరంగంలో ఎక్కడబడితే అక్కడ ప్రత్యక్షమవుతూనే వుంది.

మర్నాడుకూడా అలాగే హోరాహోరి పోరాటం జరిగింది. సముద్రానికి చెలియలికట్టలా మహారాణి లక్ష్మీబాయి తూరుపుద్వారం కాపాడుతూవచ్చింది.

"కోట సరాయిలో ఇంగ్లీషు సేన హఠాత్తుగా మహారాణి లక్ష్మీబాయిని ఘిరాయించింది. అప్పుడు లక్ష్మీబాయి ముందరబాయితో షర్బతు తాగుతూవుంది. ముందరబాయికూడా మహారాణీలాగే అందంగావుంది. ఆమెకూడా పురుషవేషంలోనేవుంది. ఇంగ్లీషు సేన రాగానే ఇద్దరూ చర్రున లేచారు. గుర్రాలమీద సవారీఅయి హూరోజుసేన మీద విరుచుకుపడ్డారు. ఇంతలో రాణీసైనికులున్నూ వచ్చేశారు. మహారాణీ పదేపదే ఇంగ్లీషు సేనమీద ఆక్రమణజరిపింది. తనసైనికులు తరిగిపోతూవున్నా ఆమెధైర్యంలోమాత్రం తరుగులేదు; మార్పులేదు. సేనంతటికీ ముందేవుండి అద్భుతమైనపరాక్రమంతో పోరాడుతూవుండేదామె. ఆశ్చర్యకరమైనవేగంతో కత్తిఝుళిపిస్తూ శత్రువుల్ని తెగనరుకుతూవుండేది. లాటిపిటాలఫౌజు వేసుకుని రోజుసేనానివచ్చాడు. మహారాణీ చలించలేదు. యథాప్రకారం పోరాడుతూనేవుందామె." *

మహారాణీపరాక్రమం చూచి శత్రువులు ముక్కుమీద వేలుపెట్టుకున్నారు. ఎలాఅయినా సరే ఆమెని ప్రాణాలతో పట్టుకోవాలని నిశ్చయించుకున్నారు.

అవాళ జ్యేష్ఠశుక్లసప్తమి శుక్రవారం, జూను పద్దెనిమిది. తెలతెలవారేసరికి ఇంగ్లీషురణవాద్యాలు గ్వాలియరు నాలుగుదిక్కులా గింగురుమన్నాయి. జనరలు స్మిత్తూ సర్ హూరోజూ మహారాణి లక్ష్మీబాయివున్న ద్వారందిక్కే పెద్దసేనతో వచ్చిపడ్డారు. తక్కిన మూడుదిక్కులాకూడా ఎంతోసేన విరుచుకుపడింది.

---

* డి. ఎల్. చెన్లాకు.

మహారాణి లక్ష్మీబాయి ఉదయాన్నే నిత్యకృత్యాలు నిర్వర్తించుకుంది. తన చెలికత్తెలతో షర్బతు తాగుతూ వుంది. ఇంతలో కర్కశమైన ఇంగ్లీషు రణతూర్యం వినిపించింది. మహారాణి షర్బతుగ్లాసు గిరవాటేసి, చంగున ముందుకి వురికింది. ఎప్పటిమల్లే ఆమె పురుషవేషంలోనే వుంది. మెడలో ముత్యాలహారం తళతళా మెరుస్తోంది. తలమీద జరీ 'చంద్రీతలపాగ' వుంది. ఒంటిమీద గౌనూ, కాళ్ళకి పైజామా వున్నాయి. మొహంమీద రుద్రజ్యోతి తాండవమాడుతోంది. గుర్రంమీదికి లంఘించి ఆమె బాణంలాగ ఇంగ్లీషు సేనమీదికి పరిగెత్తింది. అవాళటియుద్ధం అన్నిదినాలకంటే భయంకరమయింది. మహారాణీతెట్టు ఇంగ్లీషుసేన ఎక్కడుగు ముందుకి సాగలేకపోయింది. కాని ఇంతలో తక్కిన దిక్కులసేన లోపలికి చొచ్చుకు వచ్చేసింది. వెనకతట్టుకూడా కొంతసేనవచ్చి మహారాణిమీద కలబడింది. ముందూ వెనకా శత్రువులు! అన్నిదిక్కులా ఆమెని శత్రువులు చుట్టుముట్టారు. మహారాణిదగ్గిర ఆమెచెలికత్తెలు ముందరబాయీ, కాశీబాయీ, మరి పదిహేను ఇరవై మంది సిపాయిలూ మాత్రమే వున్నారు. గుర్రం పరిగెత్తించిందామె. శత్రువుల్ని చీల్చుకుంటూపోయి అవతలవున్న విప్లవసేనతో కలవాలని ఆమె ప్రయత్నం. ఇంగ్లీషురౌతులు ఆమెని వెంటపడ్డారు. రాణీ లక్ష్మీబాయి ఖడ్గం కాలసర్పంలా శత్రువుల్ని హతవారుస్తోంది. కాలసంహారం చేస్తున్న మహాకాళిలా వుందామె.

ఇంతలో రయ్యిమని ఒక తుపాకిగుండు వచ్చింది. ముందర బాయిని దూసుకుపోయింది. "దేవీ, నేను మరణిస్తున్నాను" అంటూ ఆమె గుర్రంమించి కూలిపోయింది. మహారాణివెనకకి చూసింది. గుండువేల్చిన తెల్లసిపాయి కనిపించాడు. ఒక వేటుతో వాణ్ణి రెండు తునకలుచేసి పారేసిందామె.

మహారాణి ముందుకిసాగింది. ఎదట వొక కాలవ తారసిల్లింది. ఒక గెంతుతో మహారాణి అవతలకి వెళ్లిపోతుంది. ఇంగ్లీషు రౌతు లామెని అందుకోడం అసంభవమయిపోతుంది. కాని కాలగతి! గుర్రం ముందుకి వెళ్లడానికి సమ్మతించలేదు. నిన్నటివరకూ ఆమె స్వారీ చేసిన గుర్రం గాయపడింది. ఇవాళటిగుర్రం ఆమెని దగాచేసింది. లక్ష్మీ బాయి అశ్వశాస్త్రమెరిగిన వీరాంగన. అవాళమాత్రం గుర్రం పరిశీలించలేదేమో ఆమె!

పదేపదే ప్రయత్నించిందామె. గుర్రం కాలవదాటలేదు. ఇంగ్లీషు రౌతులు వచ్చేశారు. చుట్టుముట్టేశారు. ఆమె వొక్కతే అయిపోయింది. అయితేనేం ఆమెసాహస మద్భుతమైంది. అంతమందితోనూ ఆమె వొక్కతే రణచండిలా పోరాడింది. ఆమె కత్తికి అడ్డేముంది!

ఊ!— వెనకనించి వొక శత్రుసైనికుడు ఆమె శిరస్సుకే ఖడ్గం గురిపెట్టాడు. మహారాణి లక్ష్మీబాయి శిరస్సు కుడిచెంప తెగిపోయింది. కుడికన్ను తెగిపోయి తుళ్లిపోయింది. అయినా ఆ ఇరవై రెండేళ్ల వీరాంగన గుర్రంమీంచి కిందపడలేదు; పోరాడుతూనేవుంది. ఆమెఖడ్గం ప్రళయతాండవంచేస్తూనే వుంది. ఇంతలో ఆమెగుండెలమీద దెబ్బతగిలింది. శిరస్సులోంచి గుండెల్లోంచి రక్తం వరదలు కట్టింది. స్మృతి తప్పిపోతూనే ఎదటసిపాయిని రెండుముక్కలుచేసిపారేసిందామె. అదే ఆమె శత్రువునికొట్టిన తుది దెబ్బ.

మహారాణి లక్ష్మీబాయి కిందపడిపోయింది.

ఇంతలో రామచంద్రరావు దేశముఖు మహారాణీదగ్గిరికి వచ్చేశాడు. జీవనకాలమంతా నమ్మినబంటు అంత్యకాలంలోకూడా హాజరయాడు. అక్కడికి దగ్గిరలోనే బాబా గంగాదాసు ఫురిపాక వుంది. రామచంద్రరావు మహారాణిని గంగాదాసు పాకలోకి తీసుకుపోయాడు. కొద్ది

క్షణాల్లో మహారాణిలక్ష్మీబాయి వీరగతి పొందింది. భారతీయస్వాతంత్ర్యజ్యోతి ఆరిపోయింది.

ఆమె పవిత్రశరీరం శత్రువులచేత చిక్కకూడదు. అదే ఆమె చివరి కోర్కె. రామచంద్రరావు దేశముఖు అక్షరాలా ఆమెకోర్కె పాలించాడు. గడ్డీ అదీ కుప్పచేసి చితి తయారుచేశాడు. మహారాణి శరీరమూగడ్డిచితిమీద పెట్టాడు. అగ్నిసంస్కారంచేశాడు. క్షణాలమీద అగ్నిహోత్రుడామె మృదుదేహం తనలో లీనంచేసుకున్నాడు.

వీ ర భా ర త ం లో

ఇ ది

మ లి ప ర్వ ం

వీ ర భా ర తం

1857
భా ర తీ య స్వా తం త్ర్య స మ ర ం
తు ది ప ర్వ ం

దా మో ద ర రా వు

మహారాణి లక్ష్మీబాయినిర్యాణం ఇంగ్లీషు వాడెవడూ చూసిన పాపానపోలేదు. అందుకనే పాశ్చాత్య చరిత్రకారులు తలా ఒకలాగ రాశారు.

"మహారాణిని చుట్టుముట్టిన వాళ్ళలో కర్నలు స్మిత్ కూడా వున్నాడు. అతడే వెళిపోతూవున్న మహారాణిని వెంటాడమని ఆజ్ఞాపించాడు. మహారాణి ఒక సామాన్య పురుషసైనికుడి వేషంలోవుంది. అంచేత వెంటాడినకాతు:లామెని పోల్చలేక పొరపాటున చంపేశారు."[1]

"డ్రేగూను గుర్రపుకా తొక్కడు ఆమెని మహారాణే కాతుల్లో ఒకడనుకొని ఆమె మెడలోని ముత్యాలహారంకోస మూసపడి ఆమెని చంపేశాడు."[2]

"ఈభారత 'జోన్ ఆఫ్ ఆర్క్-' ఎర్రటి అంగీవేసుకుంది. తెల్లటి పగిడీ చుట్టుకుంది. గ్వాలియరు సింధియా కోశాగారంలోని విలువయిన ముత్యాలహారం మెడలోవేసుకుంది. గాయపడి ఆమె మరణశయ్యమీదవుండే చెప్పింది— "నాసగలు నాసైనికులకి పంచెయ్యండి" అని ఆమె నిర్యాణం విప్లవకారులందరినీ దు:ఖసముద్రంలో ముంచేసింది.[3]

---

1. History of the Indian Mutiny. 2. The Marquis of Dalhousie's Administration of British India. 3. An Englishwriter.

"మహారాణి గాయపడి పడిపోవడం ఇంగ్లీషు వాడెవడూ కళ్ళతో చూడలేదు....ఆమె పడిపోవడంతోనే ఆమె అంగరక్షకులూ, స్వామి భక్తపరాయణులూ పురుష వేషంలోవున్న ఆమెశవమూ, ఆమెసోదరి శవమూ, పట్టుకుపోయి దహనసంస్కారం జరిపేశారు. పురుష వేషంలో ఆఇద్దరూ వెళ్ళిపోతూవున్నప్పుడు బహుశా ఫిరంగిగుళ్ళో, లేదా వెంటాడుతూవున్న రౌతుల తుపాకిగుళ్ళో తగిలి చచ్చిపోయివుంటారు." [4]

"ఏపక్కనించోవచ్చిన ఫిరంగిగుండు తగిలి ఆమె పడిపోయింది. అయితే తన వంశానికీ, తన దేశానికీ సంభవించిన అవమానం తుడిచి పెట్టికాని ఆమె ప్రాణాలు పోదలచలేదు." [5]

"నిజానికి మహారాణి స్వర్గస్థురాలయినవార్త ఎన్నో దినాలదాకా మాకు తెలియలేదు. ఏమంటే ఆమెవొక సిపాయివేషంలోనే మరణించింది. మరణించినవార్త తెలిశాకకూడా సందేహంగానేవుండేది. పొలిటికలు ఏజంటు సర్ రాబర్టు హామిల్టనుకి తగిన నిదర్శనం దొరికిన దాకా నమ్మకం కుదరలేదు." [6]

ఏమయినా మహారాణి నిర్యాణం ఇంగ్లీషు వాడెవడూ చూడలేదన్నదిమాత్రం నిజం. ఆమె సమాధి నేడు దేశభక్తుల తీర్థక్షేత్రమై గ్వాలియరులో వుంది.

మహారాణి లక్ష్మీబాయి నిర్యాణానంతరం రావుసాహెబూ తాంతియా టోపే, బాందా నవాబూ మొదలైననాయకులు గ్వాలియరు దుర్గం వొదిలేసి వెళ్ళిపోయారు. ఇంగ్లీషువాళ్ళు విజయగర్వంతో దుర్గమాక్రమించారు. గ్వాలియరు విడిచిపోయిన విప్లకారులవెంట రోజు సేనాని సైనికుల్ని పరిగెత్తించాడు. జయాజీరావు సింధియాని తిరిగీ గద్దెమీద కూచోబెట్టారు. 1858 జూలై పదహారున పెద్ద దర్బారుచేసి జయాజీరావుకి 'రాజాధిరాజ' బిరుదమిచ్చారు.

---

4. Martin's British India. 5. Empire in Asia. 6. Sylvester'

"సింధియాకానే విప్లవకారులతో చేరిపోయివుంటే బహుశా నేను నాఉద్యోగం మానుకుని ఇండియా వొదిలేయవలసి వచ్చేది" అంటూ జనరలు కానింగు ఇంగ్లాండుకి రాశాడు.

మహారాణి భౌతికదేహం సంస్కారంచేశాక రామచంద్రరావు దేశముఖూ, కాశీబాయీ మహారాణిద త్తపుత్రుడు దామోదరరావుని తీసుకుని గ్వాలియరునించి రహస్యంగా వెళ్లిపోయారు. రెండున్నర సంవత్సరాలు — ఇవాళ కటోరా అంటే రేపు సిసరీ, ఎల్లుండి పాట్నా అంటే ఆవలెల్లుండి బరోడా — ఇలా రోజుకో వూరుగా తిరిగి తిరిగి ఇంగ్లీషువాళ్లకి అచూకీఅందకండా అతణ్ణి కాపాడారు. తుదకి ఆగ్రా వచ్చారు. ఆగ్రాలో అప్పుడు ప్లీకు అని వొకాయన వుండేవాడు. మహారాణి లక్ష్మీబాయిచరిత్రవిని అతడి కామెమీద భక్తిభావ మేర్ప డింది. అతడిసహాయంతో ఇందూరు పొలిటికలు ఏజంటు శేక్స్పియరు దామోదరరావునీ, రామచంద్రరరావు దేశముఖు ప్రభృతుల్నీ ప్రభుత్వం క్షమించేట్టుచేశాడు. దామోదరరావుకి పద్దెనిమిదివందల రూపాయిలు వార్షికమున్నూ ఏర్పరిచాడు.

దామోదరరావు ప్రయోజకుడాయాడు. హిందీ, మహారాష్ట్రమూ, ఉర్దూ, ఇంగ్లీషుభాషలలో పాండిత్యం సంపాదించాడు; ఇందూరులో వొక కన్యని వివాహం చేసుకున్నాడు. కాని 1872 లో ఆమె కాలం చేసింది. ఆమె తరవాత శివడే పరివారంలో, రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె గర్భంలో 1904 లో దామోదరరావు కొక కుమారుడు కలిగాడు. ఇతడి పేరు లక్ష్మణరావు. ఇత డిప్పుడు ఇందూరులో జీవించి వున్నాడు. ఈయన కిద్దరు కుమార్తెలూ ఆరుగురు మనమలూ వున్నారు. *

---

* ఈమధ్య భారతప్రభుత్వం లక్ష్మణరావుకీ, తాంతియాటోపే మేనల్లుడు నారాయణరావుకీ 1857 శతవార్షికసందర్భంలో సత్కారం జరిపింది.

కుంపినీయేలుబడి కూలిపోయింది.

"ప్లాసీయుద్ధానికి నూరేళ్ళు నిండడంతోనే కుంపినీపాలుబడి కూలిపోతుంది" — విప్లవారంభంలో వినిపించిన ఈజోష్యం ఎంతవిధంగానో నిజమేఅయింది. 1858 నవంబరుమొదటితేదీని ఇంగ్లాండుపార్లమెంటు ఈస్టిండియాకంపెనీఅధికారం తొలిగించి ఇండియాపాలుబడి తనచేతిలోకి పెట్టుకుంది. స్వాతంత్ర్యసమరం మొదట ఇదేదో చిల్లరమల్లర సిపాయి సితూరీ అనుకున్నారు సీమదొరలు. ఎవరో కొంతమందిరాజులు తమ స్వార్థంకోసం పన్నిన కుట్ర అని భావించారు. చాలామందిచరిత్రకారులున్నూ ఇదేభావం వెల్లడించారు. కానిభయంకరంగా పద్దెనిమిది మాసాలుపైగా జరిగిన ఈసమరం పరికించాక దీని మూలకారణాలు కొంతవరకయినా అవగతమయాయి వాళ్ళకి. అందుకని సీమరాణీచేత ఇండియామంత్రి స్టాన్లీ ఎంత ప్రకటనచేయించాడు. గవర్నరుజనరలు కానింగు అలహాబాదుకోటలో దర్బారుచేసి భారతీయులకది 'మగ్నాకార్టా' * అని వర్ణించాడు.

"కుంపినీరాజ్యం ఇవాళనించీ అంతమయింది. దానిస్థానేభారతపరిపాలన మేము స్వీకరించాం. మాఇంగ్లీషుప్రజనిహత్యచేసినవాళ్ళూ, హత్యలు ప్రోత్సహించినవాళ్ళూ కాక తమ ఆయుధాలు పారవేసిన యావన్మందినీ పూర్తిగా క్షమిస్తున్నాం. భారతీయులు దత్తతచేసుకునేహక్కు ఇకముందు సరయినదే అని అంగీకరిస్తున్నాము. దత్తపుత్రులు తమని దత్తతచేసుకున్న తండ్రులసంపద, సింహాసనాలకీ, ఉత్తరాధికారులని పొప్పుకుంటున్నాం. భారతదేశంలో ఎవరిమత విశ్వాసాలలోనూ, ఎవరిమతవిధానాలలోనూ ఎవ్విధమైనజోక్యమూ కలిగించుకోము. స్వదేశసంస్థానాధిపతులతోఇంతవరకూ కుంపినీవాళ్ళు

* Magna charta— 1215 ఇంగ్లాండు మహాజ్ఞాపత్రం

చేసుకున్న సంధులూ, వొడంబడికలూ భవిష్యత్తులో యథావిధిగా పాలిస్తాము; గౌరవిస్తాము. ఇకముందు ఏస్వదేశసంస్థానపతిరాజ్యంకానీ, అధికారంకానీ తీసుకోము. మాఇంగ్లీషుప్రజలతో ఎలావ్యవహరిస్తున్నామో అలాగే భారతప్రజలతోనూ వ్యవహరిస్తాము."— ఇదీ సీమరాణీప్రకటనలోని సారాంశం.

భారతదేశంలో ప్రజలమాటఎలావున్నా రాణీప్రకటన లాఫ్సుసిద్ధాంతంవల్ల బితుకూబితుకూమంటూన్న స్వదేశసంస్థానాధిపతులకిమాత్రం బ్రహ్మానందం కలిగించింది. జయాజీరావుసింధియా ఈప్రకటనవిని కొడుకుపుట్టినంతగొప్పగా సంతోషించాడట!

ఇతరసంస్థానాలు కలుపుకోమన్న రాణీప్రకటన ఇండియాలో ప్రకటించిన వైస్రాయి కాసింగే కొద్దిదినాల్లో థారుసంస్థానంమీద తన ఇనపచెయ్యి వేశాడు. మరికొన్నాళ్ళకి 1865 లో మైసూరురాజుచేసుకున్న దత్తతవొప్పుకోమని అప్పటి వైస్రాయి లారెన్సు వేచీపెట్టాడు. **మేజరు ఇవాన్సు** బెలు పూనుకోకపోయివుంటే మైసూరుదత్తత రద్దయేవుండేది.

సీమరాణీప్రకటన వెలువడడంతోనే దానిని ఖండిస్తూ బేగము హజరతుమహలు వొక ప్రకటనచేసింది.

"1858 నవంబరు వొకటిని సీమరాణీ ప్రకటించిన ప్రకటన పరిశీలించి మాప్రజలకోసం ఈక్రిందిప్రకటనచేస్తున్నాం.

'కుంపినీపరిపాలన రాణీ చేపట్టింది' అని ఆప్రకటనలోవుంది. ఇకముందు రాణీగారిశాసనం అమలుజరుగుతుందన్నమాట! మాప్రజలు దీనిమీద నిబ్బరపడవద్దని హెచ్చరిస్తున్నాం. ఏమంటే కుంపినీచేసిన శాసనాలూ, కుంపినీవాళ్ళ ఇంగ్లీషుఉద్యోగులూ, గవర్నరుజనరలూ,

కచేరీలూ అవీ ఎలాంటివలాగే వుంటాయి. అయినప్పుడుమనకి లాభం కలిగించేది ఇందులో ఏముందని!

"కుంపినీ చేసుకున్న సంధులూ, వాగ్దానాలూ రాణీగౌరవిస్తా నని ప్రకటించింది. ఈ షరతు ప్రజలు జాగ్రత్తగా గమనించాలి. కుంపినీ భారత దేశమంతటిమీదా దాని అధికారముద్రవేసింది. మరి ఈ షరతు వల్ల కొత్తమార్పు ఏంజరిగినట్లు? భరతపురంరాజుని కుంపినీ తన ముద్దుబిడ్డడని చెప్పింది, తరవాత అతడి రాజ్యం లాక్కుంది. లాహూరు రాజుని లండనుపట్టుకుపోయింది; తిరిగి ఇండియా రానివ్వలేదు. నవాబు శమ్సుద్దీనుఖానుని వొకచేత్తో పురికంబమెక్కించింది, వొకచేత్తో సలాము చేసింది. పేష్వానించి పూనారాజ్యమూ, సతారాసంస్థానమూ లాక్కుంది. బతికివున్నంతకాలమూ అన్నిటి బిగుతులో ఖైదుచేసింది. కాశీరాజుని అగ్రాలో ఖైదులోపెట్టింది. నీహారూ, ఒడిశా, నంగదేశం రాజుల్ని పేరువ్రాయా లేకుండాచేసింది. మాతో చేసుకున్న సంధి ఏడో షరతులో మానించి అధికమేమీ పుచ్చుకోమని శపథంచేసినా, మాతాతలనాటిరాజ్యం ఏదో సాకుపెట్టి చవాయించింది. అంచేత కుంపినీచేసిన ప్రతీదీ యథాతథంగా రాణీ అంగీకరిస్తే కుంపినీరాజ్యానికీ రాణీరాజ్యానికీ భేదమేముంది! ఎన్నాళ్ళదాకా ఎందుకూ, మొన్న మొన్న కుంపినీ తన వొడంబడికలు మంటకలిసి మానగ్గిరి అప్పుపుచ్చుకున్న కోట్లకొద్దీ మహాయలు, వూరికే మానడమనడి సరిగావేదని మిషపెట్టి అపహరించింది. మాదేశం నవాబు వజీదాలీషా పరిపాలన మాప్రజలకి సచ్చకపోయినమాట నిజమయితే ఈ స్వాతంత్ర్యసమరంలో మాతో ఇంత ఇదిగా ఎలా చాల్గొన్నారు? మాప్రజలు మాకోసం ధనమూ, ప్రాణమూ త్యాగంచేసి రాజభక్తి ప్రకటించినట్లు ఏప్రజా ఎక్కడా ఎప్పుడూ ప్రకటించివుండరు. ఇంతయాకకూడా మారాజ్యం మాకెందుకివ్వకూడదు?

"తమరాజ్యం వృద్ధిచేసుకోరన్న సంకల్పం లేదని ఈ ప్రకటనలో వుంది. ఇలా అంటూనే ఈదేశీయరాజ్యాలు తమరాజ్యంలో కలిపేసుకుంటున్నది ఈ ప్రకటన.

"రాణీప్రకటనలో కిరస్తానం సత్యమతమనీ, ఇతరమతాలతో అన్యాయంగా ప్రవర్తించమనీ, అన్నిమతస్థులనీ ఒకేవిధమయినశాసనంతో పరిపాలిస్తామనీ వుంది. శాసనాలకీ, ఒకమతం సత్యమయిందికావడానికీ సంబంధమేమిటి ? — పంది తినడమూ, సారాయి తాగడమూ, కొవ్వు తూటాలు పంటితో కొరకడమూ, రోట్లువేసే మిషమీద దేవాలయాలూ, మశీదులూ పడగొట్టడమూ, సందుల్లో గొందుల్లో కిరస్తానంగుళ్లు కట్టడమూ — వీటన్నిటివల్లా తమ మతంతో జోక్యంపెట్టుకోరని ప్రజలెలా నమ్ముతారు ?

"హత్యలుచేసినవాళ్లనీ, ప్రోత్సహించినవాళ్లనీ తప్ప తక్కినవాళ్లని క్షమిస్తామని ప్రకటనలో వుంది. దీనివల్ల తప్పుచేసినవాడూ, చెయ్యని వాడూ ఎవ్వడూ తప్పించుకోలేడని బుద్ధిలేనివాడు కూడా తెలుసుకుంటాడు.

" ..... ఇంతవరకూ ఇంగ్లీషువాళ్లు ఏ అపరాధినీ క్షమించిన పాపానపోలేదు. అంచేత మాప్రజ లెవ్వరూ సీమరాణీప్రకటన విని మోసపోవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. "

నిజానికి సీమరాణీప్రకటన "ఒక సాధారణమైన ప్రకటనే. ఇండియాలోని ఇంగ్లీషు పాలకులు దానికి కట్టువడడానికి అదేమీ ఒక ప్రతిజ్ఞాపత్రం కాదు. లా ప్రకారం ఆప్రకటనకి పిసరంతయినా విలువలేదు." *

రాణీచేసిన ప్రకటనప్రకారం పార్లమెంటు నడుచుకోవాలని ఇంగ్లాండు రాజ్యాంగచట్టంలో నిబంధనఏమీ లేదు. అందుకనే ఇండియాలోని ఇంగ్లీషుపరిపాలకులు ఆప్రకటనప్రకారం నడుచుకున్న పాపానపోలేదు.

---

* సర్ జేమ్స్. టీఫెను.

ఏమయితేనేం ఎలిజబెత్తురాణీ ఏలుబడిలో మొలకెత్తిన తూర్పిండియాకంపెనీ తుమ్మచెట్టు, విక్టోరియారాణీహయాంలో కూలిపోయింది. అయితే దానిస్థానే కల్పవృక్షం లేవలేదు. అదే తుమ్మచెట్టుమరింత వేళ్లుపాతుకుని చివురించింది ; కొమ్మలు చాచింది.

పార్లమెంటుకి లోబడే కుంపినీ ఇక్కడ వర్తకమూ, ఏలుబడీ సాగిస్తూవుండేది. ఇప్పుడు కుంపినీ అధికారం తొలిగిందంటే ఆద్వంద్వ ప్రభుత్వంమాత్రం అంతరించిందన్నమాట. అంతే. భారతదేశ బాని సత్వం మాత్రం తొలగలేదు. కుంపినీవి ఇనపసంకెళ్లయితే రాణీవేర వచ్చినది మెరుగుపెట్టిన ఉక్కుసంకెళ్లు.

అప్పటికే ఎంతోకాలంనించీ ఇంగ్లాండులో కొందరు ఇండియాలో కుంపినీఅధికారం రద్దుచేయాలని ఆందోళనచేస్తూవుండేవాళ్లు. వాళ్లంద రికీ 1857 ఇండియా స్వాతంత్ర్యసమరం మరింత అవకాశం కలిగిం చింది. దాని పర్యవసానం పార్లమెంటు ఇండియాలో కుంపినీఏలుబడికి తుదుపుపెట్టింది.

చిత్రం ! ఒకరాణీతో ఆరంభమయిన కుంపినీ మరోరాణీతో అంత మయింది. ఆరాణీతో ఏర్పడ్డ సార్వభౌమత్వం మరోరాణీవచ్చేముందు తుదుచుకుపోయింది !

సీమరాణి ప్రకటన అనంతరంకూడా అయోధ్య ప్రజలు స్వాతంత్ర్య సమరం సాగిస్తూనే వచ్చారు. శంకరపురం, డౌండియాఖేడా, రాయ బరేలీ, సీతాపురం మొదలైన చోట్ల హోరాహోరి పోరాటం జరి గింది. "రాష్ట్రమంతటా ప్రజలు విప్లవకారుల్ని అభిమానిస్తూనే వచ్చారు. అన్నిచోట్లా విప్లవకారులకి ప్రోత్సాహం లభిస్తూనే వుండేది. విప్లవకారులు ముందుగా ఏమీ ఏర్పాట్లు చేసుకోకపోయినా సరే, ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడికి సుళువుగా వెళ్ళగలిగేవాళ్ళు. వెంట భోజనసామగ్రులు పట్టుకుపోవలసిన అవసరమూ లేకపోయేది.

ప్రజలే అన్నిచోట్లా భోజనాదికాలు అమిర్చిపెట్టేవాళ్ళు. కాపలా అక్కరలేకుండానే తమ సామానులు వాళ్ళు ఎక్కడ పడితే అక్కడ పడేసేవాళ్ళు ప్రజలు వాటిని వేటినీ అపహరించేవాళ్ళుకారు. గంట గంటకీ జనం వాళ్ళకి కబుర్లందించేవాళ్లు. అంచేత ఇంగ్లీషువాళ్ళ వివరాలు ఎప్పటికప్పుడు తుచ తప్పకుండా వాళ్లకి తెలుస్తూనేవుండేవి. వాళ్ళకి తెలియకుండా ఏొక్కవిషయమూ మేం దాచలేకపోయేవాళ్లం మాప్రతీభోజనం బల్ల దగ్గిరా ప్రతీ ఇంగ్లీషుశిబిరంలోనూ విప్లవకారులు సభిమానించే రహస్యవ్యక్తులుండేవాళ్లు. అంచేత విప్లవకారులమీద హఠాత్తుగా దాడిచెయ్యడం మాకు అసాధ్యమయిపోయింది. ఇట్టే మేం కదిలితేచాలు మాగురాలకంటే ముందే అంచీలమీద విప్లవకారుల శిబిరాలకి కబురు వెళ్ళిపోయేది."*

దీనిని బట్టి వైతులుమీదా సామాన్యప్రజానీకంమీదా ఈస్వాతంత్ర్య సమరప్రభావం ఎంతగా పడిందీ మనమూహించుకోవచ్చు.

చివరికి 1859 ఏప్రెలులో ఇంగ్లీషుసేనలు బ్రహ్మాండమయిన ఎత్తుమీద అయోధ్యని అన్నిదిక్కులనించీ ఆక్రమించాయి. విప్లవకారులు నిభాయించుకోడం కష్టమయింది.

నానాసాహెబూ, బాలాసాహెబూ, బేగం హజరత్తుమహలూ, నవాబూ బిరజిసకద్రా — వీళ్లందరితోకలిసి అడామగా, చిన్నాపెద్దా సుమారు మొత్తం అరవై వేలమంది విప్లవకారులు ఇండియా సరిహద్దు దాటి నేపాళం అడవుల్లోకి వెళ్ళిపోయారు. "చివరికి సర్వసేనాని సర్ కాలిను కాంబెలు అయోధ్యలోని విప్లవకారులు యావత్మందినీ చిందర వందరచేసి నేపాళం అడవుల్లోకి తరిమాడు. శత్రువుముందు తలవొంచడంకంటే ఆకలితో అడవుల్లో మరణించడం నయమని భావించారు

* Charles Ball

వాళ్లు. రైతులూ, తాలూకాదార్లూ, జమీందార్లూ, వర్తకులూ ఎంతోకాలంవరకూ ఇంగ్లీషు ప్రభుత్వాన్ని అంగీకరించలేదు."*

అడవులు పట్టిపోయిన నానాసాహెబు నేపాళం మహారాజు సహాయం కోరాడు. "ఇంగ్లీషువాళ్ళమీద దండెత్తడానికి మాకు తోడ్పడండి. లేదా నిర్వాసులమయినమాకు మీనేపాళరాజ్యంలో ఆశ్రయమివ్వండి" అంటూ అర్థించాడు. ఈరెంటిలో దేనికీ నేపాళ మహారాజు అంగీకరించలేదు. పైగా "ఈవిప్లవకారుల్ని హతవార్చ" మంటూ ఆజ్ఞాపించాడు. దాంతో విప్లవకారులు నిరాశచేసుకున్నారు. ఎంతోమంది ఆయుధాలు పారేసి ఇండియా తిరిగివచ్చేశారు. ఎంతోమంది అడవులూ పట్టిపోయారు.

ఆసమయంలోనే నానాసాహెబు జనరలు హోప్‌గ్రాంటుకి వొక ఉత్తరం రాశాడు — "భారతదేశంమీదమీరు అధికారం చెలాయించడానికీ, నన్ను దోషిఅని ప్రకటించడానికీ మీకు అధికారమేముంది? భారతదేశ మేలుకోడానికి మీకు అధికార మెవరిచ్చారు? మీరు ఫరంగీలు మాదేశంలో సార్వభౌములా? మాదేశంలో మేము దొంగలమా?" ఈ ఉత్తరం తరవాత నానాసాహెబు వైనం మరి చరిత్రకందలేదు. నేపాళం అడవుల్లోనే అతడు సపరివారంగా చివరిదినాలు గడిపాడు. †

కొంతకాలమయాక బేగం హజరతుమహలుకీ, ఆమె కుమారుడు బిరజిసకద్రకీ నేపాళప్రభుత్వం ఆశ్రయం కల్పించింది.

---

* Malleson

† నానాసాహెబు బితూరు వొదలిపోయినప్పుడు తనపూర్వులు జాగ్రత్త చేసిపెట్టిపోయిన నగలూ, వెండిసామానులూ అవీ వీలయినన్ని వెంటతీసుకువెళ్లాడు. నానాసాహెబు రాణీ వాటిని కట్నండూకి చేరువగా కొండల్లో పాతిపెట్టిందని ప్రతీతి. ఈమధ్య నేపాళప్రభుత్వం వాటికోసం తవ్వకాలు సాగిస్తున్నది.

నానాసాహెబు మంత్రిగా వ్యవహరించిన అజీముల్లాఖాను, సతారా రాయబారి రంగోబాపూజీ ఏమయ్యారని మనకి ప్రశ్నకలగడం సహజం. కాన్పూరు పడిపోయాక అజీముల్లాఖాను ప్రమేయం రాలేదు. బహుశా అతడు చివరివరకూ నానాసాహెబుతోనే వుండి చివరిజీవితం నేపాళం లోనే గడిపివుండవచ్చు.

రంగోబాపూజీ సతారాలోవుండి స్వాతంత్ర్యసమరంకోసం చెయ్యవలిసిందంతా చేశాడు. సతారా, మహాబలేశ్వర మొదలయిన చోట్ల విప్లవాగ్ని రగులుకొలిపాడు. కుంపినీప్రభుత్వం అతణ్ణి పట్టుకుందికి ప్రయత్నించింది. అతడు సతారావొదిలేసి పరారీ అయిపోయాడు. అతణ్ణి పట్టియిచ్చినవాళ్ళకి అయిదువందలు బహుమాన మిస్తామని ప్రకటించారు. కాని లాభంలేకపోయింది. కొల్హాపురంలో అతడికుమారుణ్ణి మాత్రం పట్టుకుని సెప్టెంబరు ఎనిమిదిని వురితీసేశారు.

తాంతియా టోపే ఉరి

రావుసాహెబూ బాందా నవాబూ, కొద్దిపాటిసేనా — ఇంతమంది తోనూ కలిసి తాంతియా టోపే 1858 జూను ఇరవైని గ్వాలియరు వొదిలిపెట్టేసి నర్మదదిక్కు బయలుదేరాడు. నర్మదదాటివెళ్ళి దక్షిణాదిప్రజని లేవదీసి సమరం సాగించాలని అతడి సంకల్పం. అయితే ఇంగ్లీషుసేన అతణ్ణి వెంటాడుతూనేవుంది. ఇరవై రెండున బీరాఆలీపురంలో అతణ్ణి చుట్టుముట్టింది. కాని తాంతియా దొరకలేదు. అంతమందికళ్ళల్లోనూ కారంచల్లి తప్పించుకుపోయాడు. ఎలాఅయినా నర్మదదాటి వచ్చేయాలని అతడి ప్రయత్నం. అతణ్ణి నర్మదదాటకండా చెయ్యాలని ఇంగ్లీషువాళ్ళసంకల్పం. తాంతియా అది గుసికట్టాడు. చప్పున భరతపురంతట్టు బయలుదేరాడు. దాంతో పెద్ద ఇంగ్లీషుసేన భరతపురంతట్టు సాగింది. తాంతియా భరతపురందారి మార్చేసి జయ

పురంకేసి నడిచాడు. సరిగ్గా అటు ఇంగ్లీషువాళ్ళూ ఇటు తాంతియా టోపే – చదరంగంఎత్తులు వేసినట్లు ఎత్తుమీద ఎత్తు నడిపించారు. అయితే ఎన్నిమూలలనించి బలగంపట్టుకువచ్చినా తాంతియాగుర్రపు దాటులముందు ఇంగ్లీషువాళ్ళఎత్తులు పారేవికావు.

జయపురంప్రజలూ, అక్కడిపటాలమూ తాంతియాఅంటే ప్రాణం పెట్టడానికి సిద్ధపడ్డారు. ఇంగ్లీషువాళ్ళకి ఆచోకీ అందింది. నిమిషాల మీద నాసిరాబాదునించి పెద్ద ఇంగ్లీషుసేన జయపురం బయలుదేరింది. తాంతియాకి ఉప్పందడమే తడువు అతడుదక్షిణదిక్కు పుచ్చాడు. కర్నలు హోమ్సు కొంతసేనతోఅతడి వెంటపడ్డాడు. ఎత్తుమీద ఎత్తు వేసి కళ్ళల్లో కారంచల్లడంలో ఘటికుడు తాంతియా. వెంటవస్తూ వున్న ఇంగ్లీషువాళ్ళని ఎలాగో భ్రమలోపెట్టి డేగలాగవెళ్ళి టోంకు రాజ్యంలో వాలాడతడు. అది తెలియగానే టోంకునవాబు పట్నం ద్వారాలు మూసేశాడు. అంతేకాదు నాలుగు ఫిరంగులూ, కొంతసేనా పంపి తాంతియామీద దాడిప్రారంభించాడు. టోంకుపటాలం తాంతియామీదికి నడిచింది. కాని మహాశ్చర్యం! తాంతియాని చూడగానే ఇంత ఇదిగా బయలుదేరిన టోంకుపటాలమూ "తాంతియా మహారాజుకీ జయ్" అంటూ నినాదాలుచేసింది; తాంతియాసేనతో కలిసిపోయింది. టోంకునవాబు పంపిన యుద్ధసామగ్రీ, అతడిసేనా తాంతియా చేత చిక్కిపోయింది. ఈకొత్తసేనా, ఈకొత్తపరికరాలూ వేసుకుని అతడు ఇంద్రగడందిక్కు బయలుదేరాడు.

ఎదట చంబలనది. వర్షాకాలం. చంబలనది నరదలతో భయంకరంగా వుంది. వెనకకర్నలు హోమ్సుసేన వెంటాడుతూ వుంది. పక్కని రాజపుతానామీంచి జనరలు రాబర్ట్సు కొంతసేనతో బయలుదేరాడు. మూడుదిక్కులా ప్రమాదమే. అందుకని తాంతియా ఈశాన్యంగా బూందీకేసి బయలుదేరాడు.

అలా వెళ్ళివెళ్ళి తాంతియాటోపే నిమచీ, నాశిరాబాదుదగ్గిర భీలు వాడాగ్రామం చేరాడు. అది తెలియడమేతడువు ఆగస్టు ఏడున జనరలు రాబర్ట్సునేన సర్వాడగాంనించి వచ్చి తాంతియామీద విరుచుకుపడింది. ఉభయసేనలూ పగలంతా దారుణంగా పోరాడాయి. రాత్రి చడీ చప్పుడు లేకండా తాంతియా తన ఫిరంగులూ అవీ పట్టుకుని భీలువాడా వొదిలేసి హుటాహుటిని ఉదయపురంరాజ్యంలో కోటగ్రామం చేరి డేరావేశాడు. అక్కడకూడాపదాన్లలుగున ఇంగ్లీషునేన అతణ్ణి ఘిరా యించింది. మళ్ళీ హూరాహూరి పోరాటం జరిగింది. ఈయుద్ధంలో తాంతియా తన ఫిరంగులూ అవీ వొదిలేసి వెనకకి వెళ్ళిపోయాడు. అలా అతడు వెనకకి వెళ్ళిపోతున్నకొద్దీ ఇంగ్లీషుదండు అతణ్ణి వెంటా డుతూవచ్చింది. ఒడుపుచూసి అతడు మళ్ళీ చంబలనదిదాట్టి బయలు దేరాడు.

ఈసారి మరింత ఇరకాటంలో పడిపోయా డతడు. ఒక ఇంగ్లీషునేన వెనకనించి వెంటాడుతూవుంది. మరొకటి పక్కనించి వాయువేగంతో తరుముకుసస్తూవుంది. ఈరెండే అనుకుంటే ఎదురుగుండా చంబలనది వొడ్డునికూడా ఇంకో పెద్దనేన కాసుకు కూచుంది. అయితే తాం తియావీరుడు జంకలేదు. ఇన్ని ఇంగ్లీషునేనలూ తప్పించుకుని తిన్నగా వెళ్ళి ఇంగ్లీషునేన కాసుకుని కూచున్నచోటికి మీదుగా చంబలనది దాటేశాడు. ఇంగ్లీషునేనలన్నీ ఇవతలఒడ్డునే తెల్లమొహంవేసి వుండి పోయాయి.

చంబలనది దాటేసి తాంతియా టోపే అమితవేగంతో ఝాలర పట్నంవెళ్లాడు. ఝాలరపట్నంరాజు ఫిరంగులూ పెద్దసేనా వేసుకుని తాంతియామీదికి దండయాత్రబయలుదేరాడు. ఝాలరుపట్నంసేనలు పెద్దకోలాహలంతో నచ్చాయి. తాంతియాదగ్గిర ఏం మహేంద్రజాల ముందో, అతణ్ణి చూడడమే తడువు ఆసేనలు యావత్తూ తాంతియాతో

కలిసిపోయాయి. రాజుమీదికి ఎదురుతిరిగాయి. నిజాని కప్పుడు తాంతియాదగ్గిర వొక్క-ఫిరంగికూడా లేదు. భోజనసామగ్రులుకూడా లేవు. ఝూలరుసట్నంలో అతడికి ముష్ఠయిరెండు ఫిరంగులూ, గుర్రాలూ, బళ్ళూ, భోజనసామగ్రులూ పుష్క-లంగా దొరికాయి. యుద్ధవ్యయంకింద రాజుదగ్గిర రావుసాహెబు ఆజ్ఞానుసారం పదిహేను లక్షలరూపాయలు వసూలుచేశాడు. ఆ ధనంతో తన సైనికులకి జీత భత్యాలిచ్చాడు. ఝూలరుసట్నంలో అయిదుదినాలుండి విశ్రాంతితీసు కున్నాడు. అక్క-డినించి సైన్యసమేతంగా ఇందూరు బయలుదేరాడు.

రాబర్ట్సు, హూమ్సు, పాయ్క-, మిచెల్, హూప్సు, లోకుహార్టా — ఇలా అరుగురుసేనాధిపతులు అస్మదీయ-లనించీ వొక్క-సారి తాంతియా టోపేని వెంబడించారు. ఎన్నోసార్లు తాంతియాసేనా ఇంగ్లీషుసేనా ముఖాముఖి తారసిల్లేది. ఒకడాసిమీద వొకటి కలబడేది. హూరా హూరి పోరాటం జరిగేది. గారడీచేసినట్టు ఎలాగోమళ్ళీ అంతపటాలం తోనూ మాయమైపోయేవాడు. తెల్లపటాలం తెల్లమొహం వేసేది. ఇంగ్లీషుసేనానుల రణకౌశలం ఏమాత్రమూ అతడిదగ్గిర పనికిరాచ్చేది కాదు.

ఒకనాడు తాంతియాటోపే రాయగడంలో వున్నాడు. హఠాత్తుగా వచ్చి జనరలు మిచెలుసేన అతణ్ణి చుట్టుముట్టింది. భయంకరమైన యుద్ధం జరిగింది. ముష్ఠయిఫిరంగులు రణరంగంలో వొదిలేసి, మంత్రం వేసినట్టు సేనతోకూడా తాంతియా వుడాయించాడు. ఆ సమయంలో తాంతియాసేన అయిదువేలకి పైగావుండేది.

రాయగడంనించి తాంతియా బెతేవానదివొడ్డున సిరాంజిగ్రామం చేరాడు. అక్క-డ నాలుగుఫిరంగులు సంపాదించాడు. వర్షాలు అధికంగా పడుతున్నాయి. ఇంగ్లీషుసేన లతణ్ణి వెంటాడలేకపోయాయి. తాంతియా వారందినా లక్క-డ విశ్రాంతి తీసుకున్నాడు. తరవాత ఉత్తరంగా

బయలుదేరి ఈశగడం చేరాడు. ఈశగడం సింధియా రాజ్యంలోది. ఈశగడంమీద దాడిచేసి తాంతియా మరో ఎనిమిది ఫిరంగులు సంపాదించాడు.

"తాంతియా టోపే హైదరాలీ వంటివ్యక్తి. సర్మదదాటి నాగపురం మీదుగా అతడు ముద్దాసు వెళ్ళాలని ప్రయత్నించాడు. నిజంగా అతడు ముద్దాసే వెళ్లివుంటే హైదరాలీ సమయంలో పట్టిన గతే ఇంగ్లీషువాళ్లకి మళ్ళీ పట్టేది. నెపోలియను ఇంగ్లీషు ఛానలు దాటడంలా అయింది తాంతియా సర్మద దాటడం. ఎండాకాలం వెళ్ళిపోయింది. వర్షాకాలం వెళ్ళిపోయింది. చలికాలమూ వెళ్ళిపోయింది. మళ్ళీ ఎండాకాలం వెళ్ళిపోయింది – తాంతియా మాత్రం జంఝూ మారుతంలాగ వెళ్ళిపోతూనేవున్నాడు. ఇంగ్లీషుసేనలు వెంటాడుతూనే వున్నాయి. ఇంగ్లీషుసేనాధిపతుల కంటే తాంతియాటోపే పేరే ఇంగ్లాండు అంతటా ప్రతిధ్వనించింది."

కొండలూ, అడవులూ, నదీనదాలూ ఏవీ అతడికి అడ్డురాలేదు. రోజుకి అరవై మైళ్ల చొప్పున ఆగినచోట ఆగకండా అతడు వెళ్ళిపోతూవుండేవాడు. ఒకప్పుడతడి దగ్గిర రెండువేల సైన్యముంటే ఒకప్పుడు పదిహేనువేలుండేవి. గ్వాలియరు, ఝాన్సి, భరతపురం, నాశిరాబాదు అన్నిచోట్లా ఇంగ్లీషుసేనలు స్థావరాలేర్పరుచుకుని అతణ్ణి వెంటాడాయి. వందలు వందలు వేగులవాళ్ళు అతడి వెంటపడ్డారు. ఎంతయినా ఆమాయలమారితో తప్పించుకుంటూనే వచ్చాడు. మళ్ళీ ఒక్కడే కాదు, రావుసాహెబూ, బాందా నవాబూ వేలకొద్దీ సైన్యం అతడి ఈ అద్భుతశక్తి ఇండియాలోనేకాదు, ఇంగ్లాండంతటా ముక్కుమీద వేలుపెట్టుకున్నారు. తెల్లదొరలకి తాంతియా పేరంటే సింహస్వప్నమయిపోయింది.

డిసెంబరు నాలుగున క్లైమ్సు పత్రికలో రస్సెలు ఇలా రాశాడు :

" మన విచిత్రమిత్రుడు తాంతియాటోపే ఎంతచాకచక్యంగల వీరుడంటే, అతణ్ణి మెచ్చుకోకుండా వుండలేకపోతున్నాను. అతడు మన వెనక్కి పట్నాలు కొల్లగొట్టాడు. ఖజానాలు దోచుకున్నాడు. మందుగుండు గోదాంలు ఖాళీ చేసేశాడు. సేనలు పోగుచేశాడు; ధ్వంసం చేశాడు. రాజులదగ్గిర ఫిరంగులు లాక్కున్నాడు; పోగొట్టుకున్నాడు. అతడి ధృతగతి మెరుపుకంటే చంచలమైంది. వారాల తరబడి రోజుకి ముప్పయ్ మైళ్ళు సలభై మైళ్ళు ప్రయాణించేవాడతడు. మన సేన ఎదటవుంటూనే అతడు తటాలున వెనకకి వచ్చేసేవాడు. విమానాలతోకూడా ఆపని అంతవేగంగా సాధించడం కష్టం. కొండలమీదా నదీనదాల వరదల్లోనూ, పర్వతాల ఇరుకుదారుల్లోనూ, ఘాటీల మీదా — ఇక్కడా అక్కడా అనికాదు, కిందా మీదా ఎక్కడపడితే అక్కడ అతడికి అడ్డూ ఆపూ లేదు. కఠినాతికఠినమైన మలుపు దారుల్లో మెలికలు తిరిగి హఠాత్తుగా అతడు డేగలాగ వచ్చి మనబళ్ల మీదపడి దోచుకునేవాడు. మన బొంబాయిటపా ఎగరేసుకుపోయేవాడు. ఏదో ఒకగ్రామం దోచుకునేవాడు. ఇంతచేసినీ పట్టువడేవాడుకాడు."

తాంతియా టోపే తనసేన రెండుభాగాలు చేశాడు. ఒకభాగం రావుసాహెబుకిందా, రెండోభాగం తనకిందా వుంచుకున్నాడు. రెండు సేనలూ రెండుదిక్కులా ముందుకిసాగాయి. దారిలో తటస్థపడిన ఇంగ్లీషు సేనలతో పోరాడుతూ రెండుసేనలూ తిరిగి లలితపురందగ్గిర కలుసుకున్నాయి. అంతలో దక్షిణంతట్టు జనరలుమిచెలూ, తూరుపుని కర్నలు లిడెలూ, ఉత్తరందిక్కు కర్నలు మీడూ, పడమటికేసి కర్నలు పారూ, చంబలుదరియాతట్టు జనరలు రాబర్ట్సూ తమ తమ సేనలతో తాంతియామీదికి హుటాహుటిని బయలుదేరారు. వాళ్లని భ్రమలో

పెట్టడానికి తాంతియా దిక్షిణందిక్కుమానేసి ఉత్తరాదికి నడిచాడు. దాంతో అతడు దక్షిణయాత్ర విరమించుకున్నాడని భావించారు ఇంగ్లీషువాళ్లు. తాంతియా దక్షిణాదికి వెళ్లకండాచెయ్యడమే వాళ్ల ముఖ్యప్రయత్నం. అంచేత అతడు ఉత్తరాదికిసాగగానే వాళ్లు ధీమాపడ్డారు. అది అవకాశంగా తీసుకున్నాడు తాంతియా. ఉత్తరాదికి వెళుతూ వెళుతూ తటాలున ఆగిపోయాడు. వున్నట్టుండి చప్పున అడ్డంగాతిరిగివచ్చి బేతవానది దాటేశాడు.

బేతవానది దాటి తాంతియా టోపే ముందుకి సాగుతున్నాడు గానే ఇంగ్లీషుదండు పరిగెత్తుకువచ్చింది. కజూరిగ్రామందగ్గిర అతణ్ణి అడ్డగించింది. అమీతుమీ అన్నంత పోరాటం జరిగింది. ఏలాగో ఇంగ్లీషుసేనలు తప్పించుకుకుని తాంతియా రాయగడ వచ్చేశాడు. రాయగడరావడమూ, తిన్నగా బాణంకొట్టినట్టు దక్షిణందిక్కు సాగిపోయి నర్మదానది దాటెయ్యడమూ వ్యవధిలేకండా జరిగిపోయింది. పందెంలో బ్రిటిషుసేనానులు వీగిపోయారు.

అలా అంతమంది ఇంగ్లీషుసేనాధిపతుల్నీ నెరిమొహాలువేయించి తాంతియా టోపే తన అంతసేనతోనూ హోషంగా బాదుదగ్గిర నర్మద దాటేశాడు. రావుసాహెబూ, బాందా నవాబూ, తదితరసహచరులూ యావన్మందితో కలిసి 1858 అక్టోబరులో నాగపురందగ్గిరికి చేరుకున్నాడు. ఈవార్త అందగానే గవర్నరుజనరలు కానింగు తుల్లిపడ్డాడు. ఏంచెయ్యాలో అతడికి తోచలేదు. ఇంతవరకూ తాము సాధించినవిజయాలన్నీ తాంతియా భూమకేతువుతో తుడుచుకుపోతాయనే భయపడ్డాడతడు. భవిష్యత్తు ఏక్షణంలో ఏమవుతుందో పెద్దపెద్ద రాజనీతిజ్ఞులకే అర్థంకాకండాపోయింది.

"మహారాష్ట్రులు చివరిపేష్వాఅని భావించే నానాసాహెబు సోదరుడు రావుసాహెబు సేనలతోసహా మహారాష్ట్రం భూఖండంమొదికి

వచ్చేశాడు. ఇప్పుడు మహారాష్ట్రంయావత్తు కత్తికట్టిందో ఇక చేప్పే దేముంది! దక్షిణదేశం యావత్తూ హైదరాబాదురాజ్యంతోసహా తిరగబడేపరిస్థితి ఏర్పడింది. *

అయితే చరిత్ర ఇంకోలా జరగవలిసివుంది. ఉత్తరదేశమంతటా ఫూహూరా తాంతియాకి హారతులు పట్టారు. కాని ఇప్పుడు తన మహారాష్ట్రంలోనే సహాయం లభించలేదు. అయినా అతడు కొన్నాళ్లక్కడ ఆగాడు. అంతలో నాలుగుదిక్కులనించీ ఇంగ్లీషునేన లతడిమీదికి బైలు దేరాయి. దక్షిణదిక్కు బ్రహ్మాండమైన రాణువదండెత్తింది. ఉత్తరం తట్టు నర్మదదాటి పెద్ద దండు వాయువేగంతో ముంచుకువస్తోంది. ఇట్లు నాగపురంలో సహాయంలేకండాపోయింది. మేలుఘాటు అసిరగడం తట్టు దారిలేదు. గుజరాతూ, ఖాందేశమూ అలాగేవుంది.

తాంతియా టోపే చూశాడు. ఇంకో ఉపాయమతనికి కనిపించలేదు. సరాసరి తిరిగి అతడు బరోడాతట్టు బయలుదేరాడు. దారికడ్డుకూ బ్రిటిషునేపాలు కొల్లగొట్టాడు. తంతితీగెలు తెగగొట్టాడు. అలా నర్మద వొడ్డుకి వచ్చి చూసేసరికి అన్ని చేవులలోనూ రెండుదిక్కులా అపరిమితమయిన ఇంగ్లీషునేన డేరా వేసివుంది. అయితేనేం, భయంకరమైన సాహసి తాంతియా టోపే. నిర్భయంగా ముందుకే సాగా డతడు. నచ్చాడనగానే కార్లాసిదగ్గిర మేజరు సండర్లాండుతనసేనతోవురికాడు. ఉభయసేనలూ యుద్ధమారంభించాయి. కొంతసేపు భయంకరంగా యుద్ధంజరిగాక తాంతియా తనసేనలకి ఇసారాఇచ్చాడు. ఉత్తర క్షణంలోసిపాయిలు తమఫిరంగులు వొదిలేసి నర్మదలో వురికేశారు. క్షణాలమీద నర్మదదాటేశారు. సండర్లాండుసేన చేసేదిలేక నిశ్చేర పోయి నుంచుండిపోయింది.

---

* G. B. Malleson – Red Pamphlet.

"తాంతియాసేన ఎంతత్వరితంగా ప్రయాణించిందంటే అంత వేగంగాప్రపంచంలో ఏసేనా ఎక్కడా ఎన్నడూ ప్రయాణించలేదు."*

నర్మదదాటి సేనలతోసహా తాంతియా రాజపురావచ్చాడు. రాజ పురాసర్దారు దగ్గిర కొన్నిగుర్రాలూ, కొంతధనమూ పుచ్చుకున్నాడు. అక్కడినించి మర్నాడు ఛోటూఉదయపురం చేరాడు. ఛోటూఉదయ పురం బరోడాకి యాభై మైళ్ళదూరంలోవుంది.

ఇంతలో జనరలు పార్కు పెద్ద సేనతో ఛోటూఉదయపురం వచ్చి పడ్డాడు. దాంతో తాంతియా బరోడాప్రయాణం మానేసి, ఉత్తరా నికి బయలుదేరి వసావరా అడివిలో ప్రవేశించాడు. సరిగ్గా అదేసమ యంలో బాందా నవాబు సీమరాణీప్రకటనప్రకారం యుద్ధం విరమించు కున్నాడు. తాంతియానీ, రావుసాహెబునీ వొదిలేసి వెళ్ళిపోయాడు. బాందా అంతకిముందే ఇంగ్లీషువాళ్ళు కలిపేసుకున్నారు. నవాబుని క్షమించారు. కాని రాజ్యంమాత్రం ఇవ్వలేదు; నాలుగువేలు వార్షిక మేర్పరిచారు.

డిసెంబరు పదకుండుస తాంతియా టోపే వసావరా అడివిలోంచి బైటికి వచ్చాడు. తిన్నగా ఉదయపురందిక్కు బైలుదేరాడు. అంతలో ఇంగ్లీషుసేన అతణ్ణి ఫిరాయించింది. చేసేదిలేక మళ్లీ అడివిలోకి వెళ్లి పోయాడతడు. ఈసారి వసావరా అడివిలో ఇంగ్లీషుసేన కాసుకు కూచుంది. ఎటువెళితే అటు శత్రువు! తప్పించుకుందికి వీసరంత సందు లేదు. ఈమాటతో సింహం దొరికిపోతుందా?

రాత్రిపడింది. గాఢాంధకారం కమ్మింది. అర్ధరాత్రయింది. ఇంగ్లీషు వాళ్ళు వెయ్యికళ్లతో చూస్తున్నారు. వాళ్ళ ఎదట దూర దూరంగా ఏమిటానీడలు! నీడలు!! నీడలు!!! చూస్తూనే చూడలేకపోతున్నారు

* G. B. Malleson.

వాళ్ళు. తెల్లవారింది. ఏడీ తాంతియా టోపే? ఏవీ తాంతియా సేనలు? రాత్రికిరాత్రి సైన్యంతోసహా ఎలాగో ఎటో వుడాయించే శాడా మంత్రిగాడు.

అమర్నాడు సాయంకాలం నాలుగుగంటలయేసరికి తాంతియా టోపే రావుసాహెబుతోసహా ప్రతాపగడం చేరాడు. అక్కడ మేజరు రాకు సిద్ధంగావున్నాడు; అడ్డగించాడు. అతణ్ణి వోడించి తాంతియా ముందుకిసాగాడు. అలా వెళ్లి డిసెంబరు ఇరవై అయిదున అతడు బాంస వాడా అడివిలో ప్రవేశించాడు. అక్కడకూడా ఇంగ్లీషుసేనలు సిద్ధంగా వున్నాయి. వాటి అలుకుడు తెలియగానే తాంతియా ఆగిపోయాడు. రాత్రిపడింది. చీకట్లు కమ్మాయి. హటాత్తుగా తాంతియా ఇంగ్లీషు సేనమీద విరుచుకుపడ్డాడు. వీలయినంతమందిని చంపేసి, తక్కినవాళ్లని తరిమేసి నానా తీంతారుచేసి వొదిలిపెట్టాడు. ఇంతా అయింది. తెల్ల వారాకచూస్తే తాంతియాకానీ, అతడిసేనకానీ, అడివంతా గాలించినా అవుపించలేదు.

అయోధ్యపోరాటంలో పాల్గొన్న ఢిల్లీ శాహజాదా ఫిరోజషా తనసేనతోవచ్చి ఇంద్రగడంలో 1859 జనవరి పదమూడున తాంతియా టోపేతో కలిశాడు. అలాగే వొక సింధియాసర్దారు మానసింగు కూడావచ్చి వాళ్లతో కలిశాడు. ఇంతలో మళ్లీ ఇంగ్లీషుసేనలు తాంతి యాని అన్నిదిక్కులనించీ ముట్టడించాయి. నేపియరు ఉత్తరంనించీ, పావరు నైరుతినించీ, సోమరుసేటు తూర్పునించీ, స్మిత్తు ఆగ్నేయం నించీ, మిచెలూ, బేన్సగూలు దక్షిణంనించీ, బాంసరు వాయవ్యంనించీ హుటాహుటిని బయలుదేరారు. మొదటిదినాల్లో తాంతియాసేన వెళ్లగలిగినంతవేగంగా ఇంగ్లీషుసేన వెళ్లలేకపోయేది. దాని కలవాటు యిన వేగంతోనే అదినడిచేది. కాని కొంతకాలమయేసరికి ఇంగ్లీషుసేన కూడా శీఘ్రగతి అలవరుచుకుంది. ఇంగ్లీషుసేన ఉప్పినలా కమ్ముకు

వచ్చేస్తూవుంది. ఉప్పందడమే తడువు తాంతియా ఇంద్రగడంనించి దేవాస వచ్చేశాడు.

అవాళ జనవరి పదహారు. సూర్యోదయమై ఎంతోసేపుకాలేదు. దేవాసలో తాంతియా టోపే, రావుసాహెబూ, ఫిరోజిషా కూచుని మాట్లాడుతున్నారు. హటాత్తుగా వొకఇంగ్లీషుఆఫీసరువచ్చి తాంతియా భుజం పట్టేశాడు. ఇంకేముంది! గబగబా ఇంగ్లీషుసోల్జర్లు వచ్చేశారు. తాంతియా దొరికిపోయాడంటే తాంతియా దొరికిపోయాడని వొకటే గోల. ఒకటే అడావుడి.

కాని ఏడీ తాంతియా? తన సహచరులతోకూడామాయమయి పోయాడు. ఎలా? ఏమో! అంతమంది తెల్లవాళ్ళూ తెల్లమొహం వేశారు. రేచుల్లాగ అంతటా గాలించారు. తాంతియా, రావు సాహెబూ, ఫిరోజిషా వొక్కరూ అవుపించలేదు.

అయిదురోజులు గడిచాయి. జనవరి ఇరవై వొకటినిఉముగ్గురూ తిరిగి ఆల్వారుదగ్గిర శిఖరజీలోసేనలతో ప్రత్యక్షమయారు. అక్కడ జనరలు హోమ్సువాళ్ళని ముట్టడించాడు. హోరాహోరి పోరాటంజరిగింది. ఇంగ్లీషుసేన చిత్తుగా వోడిపోయింది, పలాయనం చిత్తగించింది. అయితే హోమ్సుసేనాని నిరుత్సాహపడలేదు. చెదరినసైనికుల్ని వొక్కదగ్గిర చేర్చుకుని మళ్ళీ తాంతియాసేనమీద పడ్డాడు. ఈ సారి విప్లవకారులు వీగిపోయారు. తాంతియాటోపే కుడిభుజం సామంత ఘోడపదుడు గాయపడ్డాడు. ఈసామంతుడు శివాజీవంశానికి చెందినవాడు.

ఈవోటమి తరవాత తాంతియా టోపే రావుసాహెబు అనుమతి తీసుకుని సర్దారు మానసింగుదగ్గిరికి బైలుదేరాడు. మానసింగు ఆదినాళ్లో పారో అడివిలో దాగునివున్నాడు. సైన్యం రావుసాహెబు పరంచేసి తాంతియా రెండుగుర్రాలూ, వొకకంచరగాడిదా, ఇద్దరు వంట బ్రాహ్మలూ, వొక నౌకరూ వొట్టుపెట్టుకుని మానసింగుదగ్గిరికివచ్చాడు.

మానసింగు అతణ్ణి ఆదరించాడు, కాని " నువ్వు సైన్యంమొదిలిరానడం బావుండలేదు " అన్నాడు. " బావుండనీ బావుండకపోనీ వరసపెట్టి తిరిగితిరిగి అలిసిపోయాను. అంచేత కొన్నాళ్ళు నీదగ్గిర వుండాలని వచ్చాను " అన్నాడు తాంతియా.

" తాంతియా గుప్తంగా మానసింగుదగ్గిర వున్నాడు "-వేగులవాళ్ళు ఇంగ్లీషువాళ్ళకి వార్త చేరవేశారు. దండయాత్రలలో అపజయాలతోవీగిపోయిన బ్రిటిషుప్రముఖులు కుటిలోపాయ మవలంబించారు. మానసింగుతో కలిసి కుట్రపన్నారు. అతడికి పెద్దపెద్ద ఆశలుపెట్టారు. " తాంతియాని పట్టియిస్తే నిన్ను క్షమించడమేకాక, సార్వారుఎస్టేటు బహూకరిస్తాం " అన్నారు. సర్దారు మానసింగు ఇంగ్లీషువాళ్ళ వలలో పడిపోయాడు. దేశద్రోహానికీ, జాతిద్రోహానికీ మిత్రద్రోహానికీ నెట్టుకున్నాడు. నమ్మి దగ్గిరికివచ్చిన స్నేహితుణ్ణీ, అతిథిని శత్రువుల కప్పగించేశాడు.

1859 ఏప్రిలు ఏడు, అర్ధరాత్రి, మానసింగు నిరపాయమని చెప్పిన చోట తాంతియా టోపే వొళ్ళుమరిచి నిద్రపోతున్నాడు. మానసింగు శత్రువుల్ని వెంటపెట్టుకువచ్చాడు; పట్టించేశాడు. కళ్ళువిప్పేసరికి తాంతియా టోపే ఇంగ్లీషువాళ్ళ బేడీలలో వున్నాడు. తాంతియాని పట్టుకుందికి తెల్లసిపాయిలు రాలేదు. మానసింగువెంట బొంబాయి నేటీవు రెజిమెంటుసిపాయిలనే పంపారు ఇంగ్లీషువాళ్ళు. మానసింగుని నమ్మి తెల్లసోల్జర్లు తనినివెంటపంపడానికి ధైర్యంచాలలేదు వాళ్ళకి. బొంబాయిసిపాయిలకి తాంతియాపేరు చెప్పలేదు. తాంతియాని పట్టడ మంటే ఎదురుతిరుగవచ్చునని వాళ్ళభయం. " ఇదిగో, ఈమానసింగు గారు ఎవరిని పట్టుకోమంటే వారిని పట్టుకుని తీసుకురండి " అని సూత్రమే వాళ్ళతో చెప్పారు. అదేవిధంగా తాము నిర్బంధిస్తున్న వ్యక్తి ఫలానాఅని తెలియకండానే తాంతియాని పట్టుకుని తీసుకు వచ్చారు బొంబాయి నేటీవు రెజిమెంటు సిపాయిలు.

మర్నాడు ఉదయం తాంతియా టోపేని సిప్రీకి జనరలు మీడే ఎదటికి పట్టుకువచ్చారు. కోర్టుమార్షలు జరిగింది. తాంతియా వాజ్ఞూలం రాసి ఇచ్చాడు — "నేను చేసిందంతా నాయజమాని ఆజ్ఞలప్రకారమే చేశాను. కాలపీ వచ్చేవరకూ నానాసాహేబు ఆజ్ఞప్రకారం నడుచుకున్నాను. తరవాత రావుసాహేబు ఆజ్ఞ లనుసరించాను. యుద్ధంలో తప్పిస్తే నేను కానీ, రావుసాహేబుకానీ ఒక్కఇంగ్లీషువాణ్ణి చంపలేదు; ఒక్కదొరసానినికానీ, ఒక్కతెల్లకుర్రవాణ్ణికానీ పురితీసినపాపాన పోలేదు. ఈవిచారణలో నేను పాల్గొనదలచలేదు."

తరవాత ఇంగ్లీషువాళ్ళ ప్రార్థనమీద ఆదినించీ చివరవరకూ యుద్ధంలో తన దినచర్య పూసగుచ్చినట్టు చెప్పాడు తాంతియా. అతడు చెపుతూవుంటే ఒకగుమాస్తా రాస్తూవచ్చాడు. తిరిగి అది చదివి వినిపించాక దానికింద ఇంగ్లీషులో సంతకంచేశాడు — Tatia Tope. అతణ్ణి అడిగిన ప్రశ్నలన్నిటికీ హిందీలోనే జవాబు చెప్పాడు.

ఏప్రిలు 18 ని విచారణ ముగిసింది. తాంతియా టోపేకి పురిశిక్ష చెప్పారు. అవాళ్టే సాయంకాలం నాలుగుగంటలకి అతణ్ణి పురికంబ మెక్కించారు.

చుట్టూ సైన్యమూ, వేలాదిప్రజలూ నుంచునివున్నారు. తాంతియా టోపే సింహంలా నడుచుకుంటూ వెళ్ళాడు; పురికంబ మెక్కాడు. తనంతటతానే పురితాటిలో శిరస్సు దూర్చాడు. ఉత్తరక్షణంలో తాంతియా టోపే మృతదేహం పురికంబానికి వేలాడింది. సాయంత్రం వరకూ అలా వేలాడుతూనేవుంది. సాయంకాలం కాపలాపటాలాలు వెళ్ళిపోయాయి. అంతవరకూ చూస్తూవున్న ఇంగ్లీషుజనం ఒక్కసారి తాంతియా టోపే మృతదేహంమీదపడ్డారు. అతడి శిరస్సునించిపుంజెడేసి వెంట్రుకలు పీకుకుపోయి స్మృతిచిహ్నంగా అట్టేపెట్టుకున్నారు.

సాయంకాలపు అరుణకిరణాలు తాంతియా టోపేమృతదేహానికి ఎర్రటి వీరగంధం పూశాయి. ఆకసంమీద పక్షులు చరమగీతాలు పాడాయి.

ఆశ్వాసాంతం

తాంతియా టోపే పురితో 1857 వీరభారతగాథ అశ్వాసాంతమవు తుంది. అనంతరం రావుసాహెబు మొకనెలదాకా పోరాటంసాగిం చాడు. తుదకి మారువేషంలో అడవుల్లో ప్రచ్ఛన్నజీవనం గడిపాడు. మూడేళ్లతరవాత బ్రిటిషువాళ్లతన్ని పట్టేశారు. బిఠూరు తీసుకువచ్చి 1862 ఆగష్టు ఇరవైని పురితీసేశారు. ఫిరోజషా తన సహచరులతో ఫకీరు వేషంవేసుకుని ఎలాగో తుదకి అరేబియా వెళ్లిపోయాడు. అక్కడ కెర్బేలాలో చివరిదినాలు గడిపాడు.

మంగళపాండేపురి మొదలు తాంతియా టోపేపురివరకూ చరిత్ర సింహావలోకనంచేస్తే విప్లవం సఫలంకాకపోవడంలో గల మూలకార ణాలు పాఠకులు అవగతంచేసుకోగలరు. విదేశీయులపరిపాలన పార దోలడంకోసం విప్లవకారులు బ్రహ్మాండమైన పథకాలువేశారు. కనీవినీ ఎరగని వీరత్వం ప్రదర్శించారు. హిందువులూ మహమ్మదీయులూ ఏకమై నిలిచారు. రైతులూ, రాజులూ చేతులుకలిపారు. అద్భుతమైన త్యాగాలుచేశారు. రక్తనదులుపారించారు. శత్రువుని త్రాహిత్రాహి మనిపించారు. నానాసాహెబూ, తాంతియా టోపే, కుమార సింహుడూ, అహమదుషా, లక్ష్మీబాయివంటిమహావీరులు ప్రపంచ చరిత్రలో ఎందరో లేరు. అయినా ఆ స్వాతంత్ర్యసమరం సఫలంకాలేదు.

అనుకున్నదానికంటే ముందే విప్లవమారంభం కావడమూ యావ ద్భారతదేశానికీ ఏకైకనాయకుడులేకపోవడమూ, ఢిల్లీవంటికేంద్రాల్లో నాయకులలో ఐక్యత కొరవడడమూ, అహమదుషా, బఖ్తఖానువంటి నాయకులమీద అభాండాలు రావడమూ, దక్షిణాది చాలావరకూ

తటస్థంగా వుండిపోవడమూ, సాలారుజంగూ, దినకరరావూ, జంగుబహద్దరు వంటి ప్రముఖులు విప్లవానికి విరోధించడమూ, పెద్దపెద్ద మహారాజులు కుంపినీకి సహాయము చేయడమూ, సిక్కులూ, ఘూర్ఖాలూ ఇంగ్లీషుసేనలకి అండగా నిలవడమూ, విప్లవకారుల ఆయుధాల కంటే ఇంగ్లీషు ఆయుధాలు దారుణమైనవి కావడమూ, విచక్షణలేకండా ప్రజలు యావన్మందినీ ఇంగ్లీషువాళ్ళు ఘోరంగా చిత్రవధ చెయ్యడమూ, ఇలాబకూన్సు, జగన్నాథసింహుడూ, మూససింగూ వంటి దేశద్రోహులు చేసినద్రోహమూ — ఇవన్నీ ఇంగ్లీషువాళ్ళ విజయానికీ, విప్లవకారుల అపజయానికీ కారణాలయాయి. అయితే ఇందులో ముఖ్యంగా దక్షిణాపథం తటస్థంగా వుండడమూ, సిక్కులూ ఘూర్ఖాలూ శత్రువుపక్షాన చేరడమూ, దేశీయులే దేశద్రోహానికి తలపడి శత్రువుకి సహాయపడడమూ ప్రధానకారణాలుగా కనిపిస్తాయి.

అయితే ఏదేశచరిత్రచూసినా స్వాతంత్ర్యసమరంలో కొంతమంది పాల్గొనడమూ, కొంతమంది రాజభక్తిపరులుగా వుండడమూ కనిపిస్తుంది. అలాగే భారతదేశంలోనూ జరిగింది. అమెరికాకి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అక్కడి రాజభక్తిపరులు కొందరు కెనడాకి వలసపోవాలనుకున్నారట! ఫ్రెంచివిప్లవంలో కూడా రాజభక్తిపరులు లేకపోలేదు. అమాటకివస్తే ఇవాళకూడా బ్రిటిషువాళ్ళు తిరిగీ ఇండియా పరిపాలిస్తే బావుంటుందనుకున్నవాళ్ళు ఇక్కడ లేకపోలేదు.

నిజానికి దేశీయుల సహాయమే లేకపోయివుంటే తెల్లవాళ్ళు 1947 వరకూ కాక 1857 లోనే మూటాముల్లే కట్టుకు పోయేవాళ్ళు.

ఈసందర్భంలో రస్సెలు రాసినమాటలు అక్షరాలా నిజమయినవి. —

"ఇంగ్లీషువాళ్ళు ఎంతపరాక్రమవంతులయితేనేం గాక, భారతీయులు యావన్మందీ సంపూర్ణంగా వొక్కటై మనకి ఎదురుతిరిగి వుంటే

మాత్రం ఇండియాలో ఇంగ్లీషువాళ్ళ పత్తాఫికరూ వుండేదికాదన్నది వొప్పుకుతీరాలి. మనశిబిరాల్లో ప్రాణాలుతెగించి సాగించినపోరాటం వీరోచితమయిందే, సందేహంలేదు. కాని ఈ వీరత్వంలో భారతీయుల శక్తికూడా కలిసివుంది. వాళ్ళు వుండబట్టే, వాళ్ళసహాయం లభించబట్టే మనస్థావరాలు మనం రక్షించుకోగలిగాం. పాటియాలా, ఝిందు రాజులు మనతో స్నేహంగా వుండకపోతే, పంజాబువాళ్ళు శాంతంగా వుండకపోతే ఢిల్లీముట్టడించడం మనకి కలలోవార్త అయిపోయేది. లక్నోలోనూ సిక్కులు మనకి ఎంతో తోడ్పడ్డారు. ప్రతీచోటా భారతీయులు మనసేనలో చేరి, పోరాటంలో మనశక్తి వృద్ధిచేసినట్టే ప్రతీ ముట్టడిలోనూ మనసేనకి భారతీయులే సహాయంచేస్తూ వచ్చారు. వాళ్ళే మనకి భోజన మందించేవాళ్ళు. వాళ్ళే మన పనిపాట్లు చేసిపెట్టేవాళ్ళు. ఈక్షణంకూడా చూడండి, శిబిరాల్లో మన అందరి పరిస్థితీ ఏమిటి? నేటివుపటాలాలే అందరికంటే ముందుండి మనల్ని రక్షిస్తున్నాయి. నేటీవులే మనగుర్రాలకి గడ్డి కోస్తున్నారు. వాళ్ళే మన సైనికులుగా వున్నారు. వాళ్ళే మన ఏనుగులకి దానాపెడుతున్నారు. వాళ్ళే మన పటాలాలకి భోజనాదికాలు అమర్చిపెడుతున్నారు. వాళ్ళే మన సోల్జర్ల కోసం వంటచేస్తున్నారు. వాళ్ళే మన శిబిరాలు శుభ్రపరుస్తున్నారు, డేరాలు పాతుతున్నారు, వాటిని ఎక్కడికిపడితే అక్కడికి మోసుకు పోతున్నారు. వాళ్ళే మన ఆఫీసర్లపనులన్నీ చేస్తున్నారు. వాళ్ళధనం రుణంకూడా ఇస్తున్నారు. నాదగ్గిర రాతకోతలు చేస్తున్న సోల్జరు చెపుతున్నాడు — 'నేటీవునౌకర్లూ, డోలీలు మోసేవాళ్లూ, ఆస్పత్రిలో వాళ్లూ లేకపోతే మాపటాలం వొకవారంకూడా బతికేదికాదు."

ఇంకోమాట – 1857 స్వాతంత్ర్యసమరం ఎవరోకొంతమందిసిపాయిలు చేసిన తిరుగుబాటనీ, రాజ్యాలుపోయిన రాజులు లేవదీసినఉద్యమమనీ కొందరు బ్రిటిషుచరిత్రకారులు రాశారు. వాళ్లకి ఈ స్వాతంత్ర్య

సమరస్వరూపం అర్థమైనా కాకపోయివుండాలి, లేదా బుద్ధిపూర్వకంగా వాళ్లు మసిపూసి మారేడుకాయ చెయ్యాలని ప్రయత్నించయినా వుండాలి. ఇంగ్లీషువాళ్లకంటేముందు భారతదేశం విదేశప్రభుత్వమంటూ ఎరగదు. అంతవరకూ ఎవరయినా పైనించి వచ్చి ప్రభుత్వంస్థాపించారంటే వాళ్లు ఈ దేశంలో స్థిరపడిపోయి ఈ దేశస్థులే అయిపోయారు. ఓం ప్రథమంగా విదేశప్రభుత్వం స్థాపించి భారతీయుల్ని బానిసలుగా చేసిన వాళ్లు బ్రిటిషువాళ్లే. అందుకనే ఈ ఫిరంగిపాలకుల్ని పారదోలడం కోసమే 1857 లో ప్రథమస్వాతంత్ర్యసమరం సాగింది.

1857 భారతీయస్వాతంత్ర్యసమరం తాత్కాలికంగా ఆనాడు విఫలమయింది, నిజమే. కాని స్వాతంత్ర్యవాంఛమాత్రం దేశంలో తీవ్రరూపం దాల్చింది. అది ప్రతీదేశభక్తుడి హృదయంలోనూ ఆరని అగ్నిలా రాజుతూనే వచ్చింది. ఆనాటి స్వాతంత్ర్యసమరమే రెండోతరంలో బ్రహ్మాండమైన జాతీయోద్యమంగా మారింది. ఆ స్వాతంత్ర్యసమరంలో ఆహుతి అయిపోయిన లక్షలాది భారతవీరుల త్యాగమే గాంధీవంటి మహానాయకుల్ని దేశంలో అవతరించడానికి కారణమయింది, మనం సాత్వికనిరోధం సాగించడానికి ప్రేరణ కలిగించింది. మన మీనాడు స్వరాజ్యంసంపాదించడానికిన్ని దోహదంకలిగించింది. ప్రపంచంలో మన భారతజాతి జీవించివున్నంతవరకూ 1857 స్వాతంత్ర్యసమరం సాగించిన వీరభారతసంతానం జీవించేవుంటుంది. ఆనాడు వాళ్లు వెలిగించిన స్వాతంత్ర్యజ్యోతి వెలుగుతూనేవుంటుంది. తరతరాలా మనమూ వీర భారతపుత్రుల వీరగాథ మననం చేసుకుంటూనే వుంటాం. వారికి శ్రద్ధాంజలి సమర్పించి ధన్యులమవుతూనే వుంటాం.

వీ ర భా ర తం

తు ది ప ర్వ ం

స ర్వ ం స ం పూ ర్ణ ం

కొన్ని తేదీలు

1757	జూను 23	ప్లాసీయుద్ధం.
1814	జూను	తాంతియాటోపే (రామచంద్ర పాండురంగ) జననం.
1824		నానాసాహెబు జననం.
1835	నవంబరు 13	రాణీ లక్ష్మీబాయి జననం.
1857	మార్చి	నానాసాహెబు తీర్థయాత్ర.
,,	,, 29	మంగలపాండే తిరుగుబాటు.
,,	ఏప్రెల్ 8	మంగలపాండే వురి.
,,	మే 10	మీరటు విప్లవం.
,,	,, 11	మీరటు విప్లవసేన డిల్లీ చేరింది.
,,	జూను	లక్నో విప్లవం.
,,	,,	అయోధ్యలో కుంపినీపాలన నశించింది.
,,	,,	రోహిలఖండం స్వతంత్రమయింది.
,,	,,	కాన్పురం విప్లవం.
,,	,, 27	సతీచౌరా చిత్రవధ.
,,	,, ,,	కుమారసింహుడు ఆరా ముట్టడించాడు.
,,	జూలై 17	హైదరాబాదు విప్లవం.
,,	,, ,,	హైదరాబాదు విప్లవనాయకుడుతో రాబాజు ఖాను వీరగతి.
,,	,, 31	అజనాలా హత్యలు.
,,	ఆగష్టు	హావలకు తిరోగమనం.
,,	సెప్టెం. 14-20	డిల్లీ పడిపోయింది.

1857	సెప్టెం. 21	బహదూరుషాని బంధించారు.
,,	,, 28	నీలు చావు.
,,	నవంబరు 24	హోవలకు చావు.
1858	మార్చి 8-20	లక్నో పడిపోయింది.
,,	ఏప్రెలు 3	ఝాన్సీ పడిపోయింది.
,,	,, 24	కుమారసింహుడి నిర్యాణం.
,,	మే 6	బరేలీ పడిపోయింది.
,,	,, 22-23	కాలపీ విప్లవసేన ఓడిపోయింది.
,,	జూను	మాల్వీ అహమదుషా హత్య.
,,	,, 18	రాణీ లక్ష్మీబాయి వీరగతి.
,,	నవంబరు 1	సీమరాణీ ప్రకటన.
,,	,, 2	కుంపినీరాజ్యం కూలిపోయింది.
1859	జనవరి	బహదూరుషా విచారణ.
,,	ఏప్రెలు	తాంతియాటోపేని మానసింగు మోసంచేసి పట్టించేశాడు.
,,	,,	తాంతియాటోపే విచారణ, వురి.
1862	నవంబరు 7	బర్మాలో బహదూరుషా మరణం.

విశ్వకథాపీఠి

[illegible]

[illegible]

[illegible] : పులిపిండా అప్పలస్వామి

[illegible]

మొదటి సంపుటంలో :

[illegible]

రెండో సంపుటంలో :

[illegible]

మూడో సంపుటంలో :

[illegible]

నాలుగో సంపుటంలో :

[illegible]

ఐదో సంపుటంలో :

[illegible]

TY OF HYDERABAD
Acc. No. 7408
Call No. 954.0317 A48V
Author
Title

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean